# శ్రీ ఆదిపరాశక్తి కాళీ

# అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక

## సకల జనులకు మానవజన్మ ధన్యం కావటానికి మంచి మహోన్నత మార్గమే సుదివ్య నిత్య పారాయణ గ్రంథం

తే॥ నవ్య అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర
పఠనమన్నికోర్కెలుదీర్చి ప్రతిభ పెంచి
భవ్యశక్తుల నిచ్చుచు దివ్యరీతి
శాశ్వతానంద మొసగుచు శాంతిగూర్చు

**భక్తితో చదవండి**
**బ్రహ్మానందాన్ని పొందండి**

**భక్తి శ్రద్ధలే బహుభాగ్యనిధులు**
**అమ్మసేవయే అక్షయానందము**

ఈ గ్రంథము
శ్రీమద్గురు వరకాళీమాత
పాదపద్మములకు అంకితము

*గ్రంథకర్త :*
**శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠాధీశులు (వేజెండ్ల)**
**భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్**

# శ్రీ ఆదిపరాశక్తి అమ్మ కాళీ
# అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక

శ్లోక, పద్య రచన : శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి పీఠాధీశులు
భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు

తాత్పర్యం, వ్యాఖ్య : వుడతా ప్రభాకరరావు
(భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారి పాదసేవకుడు)

శ్రీముఖనామ సంవత్సరము, ఆశ్వయుజమాసము, ది. 24-10-1993, విజయదశమి, ఆదివారం, పర్వదినమున ప్రారంభమైన నిత్యాగ్నిహోత్రం. పదునెనిమిది (18) సంవత్సరముల నిత్యాగ్ని హోత్రమునకు

ది. 6-10-2011 విజయదశమి పూర్ణాహుతి సందర్భముగ

ప్రథమ ముద్రణ : శ్రీ ఖర నామ సంవత్సర, ఆశ్వయుజమాసము
ది. 6-10-2011, విజయదశమి, గురువారము

ద్వితీయ ముద్రణ : శ్రీ జయ నామ సంవత్సర, శ్రావణ బహుళ అష్టమి
సోమవారం ది. 18-8-2014, శ్రీకృష్ణ జన్మాష్టమి

తృతీయ ముద్రణ : శ్రీ హేవలంబి నామ సంవత్సర, ఆశ్వయుజ శుక్ల దశమి
శనివారం ది. 30-09-2017
విజయదశమి శుభ సందర్భముగ ప్రత్యేక ముద్రణ

సర్వస్వామ్యములు : శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠము, వేజెండ్ల

ప్రచురణ, ప్రతులకు :
శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి పీఠము
శ్రీ గురు ఆనంద నిలయము
వేజెండ్ల పోస్టు, చేబ్రోలు మండలము
గుంటూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్ - 522 213.

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్
విజయవాడ - 520 003.
ఫోన్ : 0866-2574828

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శ్రీమద్గురు వరకాళీ ప్రార్ధన | 5 |
| 2. | నా శక్తి శక్తి | 6 |
| 3. | శ్రీవేజెండ్లపుర శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి పీఠం విశిష్టత | 7 |
| 4. | నిత్యనూతన సృష్టి శక్తిప్రదాయిని! శ్రీకాళి! | 22 |
| 5. | శ్రీ వేజెండ్లపుర శ్రీ వరకాళీ గాయత్రి లలితాంబికా భువనేశ్వరీ దివ్యమాతల స్తుతి | 23 |
| 6. | శ్రీవేజెండ్లపుర శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి వరకాళీ అష్టోత్తరశత బీజాక్షర మహామంత్రం | 24 |
| 7. | అమ్మ రాకతో అంతా శుభమే | 25 |
| 8. | శ్రేష్ఠమైనది మానవజన్మ | 26 |
| 9. | తపోభూమి శ్రీ వేజెండ్లపురము | 29 |
| 10. | పన్నెండు సంవత్సరాల వయసు పరిపూర్ణం పరాశక్తి శ్రీకాళీమాత దర్శన భాగ్యం | 32 |
| 11. | శ్రీ ఆదిపరాశక్తి కాళీ మాతావిర్భావ కాలమర్మం | 34 |
| 12. | శ్రీ ఆది పరాశక్తి మూలమంత్రములు | 37 |
| 13. | శ్రీవాణీబ్రహ్మ లక్ష్మీవిష్ణు పార్వతీ పరమేశ్వర దివ్య దంపతుల సృష్టి రహస్యం | 39 |
| 14. | శ్రీ దివ్య దంపతుల మూలమంత్రం | 41 |
| 15. | శ్రీవరకాళీ దివ్యామృత పద్య రత్నాలు - ద్విపదలు | 49 |
| 16. | నాశక్తి శక్తి (తాత్పర్యములతో) | 81 |
| 17. | శ్రీ షోడశి జప మంత్రములు | 86 |
| 18. | శ్రీ వేజెండ్లపురవాసిని శ్రీవరకాళీ సుప్రభాతమ్ | 87 |
| 19. | శ్రీ వేజెండ్ల పురవాసిని శ్రీగాయత్రిమాతృ సుప్రభాతమ్ | 91 |
| 20. | శ్రీ వేజెండ్ల పురవాసిని శ్రీలలితాంబికా సుప్రభాతమ్ | 95 |
| 21. | శ్రీ వేజెండ్ల పురవాసిని శ్రీ భువనేశ్వరీ మాతృ సుప్రభాతమ్ | 99 |
| 22. | శ్రీ వేజెండ్లపుర శ్రీచక్ర పీఠస్థ శ్రీవరకాళీ మహామంత్ర స్తోత్రమ్ | 103 |
| 23. | శ్రీవేజెండ్లపుర శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠస్థ శ్రీ గాయత్రీ లలితాంబికా శ్రీ భువనేశ్వరీమాతల స్తుతి | 106 |
| 24. | శ్రీవేజెండ్లపుర శ్రీచక్రపీఠస్థ శ్రీమాతలు | 108 |
| 25. | శ్రీవేజెండ్లపుర శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠస్థ మాతలకు ప్రణామాలు | 110 |
| 26. | శ్రీవేజెండ్ల పురవాసిని శ్రీవరకాళీమాత నీరాజనం | 111 |
| 27. | శ్రీవేజెండ్ల పురవాసిని శ్రీవరకాళీ మంగళహారతి | 113 |
| 28. | శ్రీవేజెండ్ల పురవాసిని కాళీ గాయత్రి | 114 |

29. శ్రీవేజెండ్లపుర శ్రీ భువనేశ్వరీ లలితా గాయత్రీమాతల నీరాజనం 115
30. శ్రీవేజెండ్లపుర శ్రీ భువనేశ్వరీ లలిత గాయత్రీమాతల మంగళ హారతి 116
31. శ్రీవేజెండ్లపుర శ్రీ గాయత్రీ లలితా భువనేశ్వరీ మాతల గాయత్రులు 118
32. శ్రీ వేజెండ్లపుర శ్రీసంతాన బాలవేంకటేశ్వర సుప్రభాతమ్ 120
33. శ్రీ వేజెండ్లపుర శ్రీసంతానబాల వేంకటేశ్వర మంత్రస్తోత్రమ్ 124
34. శ్రీ వేజెండ్లపుర శ్రీసంతాన బాల వేంకటేశ్వరస్వామి స్తోత్రమ్ 126
35. శ్రీ వేజెండ్ల పురవాసుడు
శ్రీసంతాన బాల వేంకటేశ్వరస్వామి నీరాజనం 127
36. శ్రీ వేజెండ్ల పురవాసుడు
శ్రీ సంతాన బాలవేంకటేశ్వరస్వామి మంగళహారతి 128
37. శ్రీ సంతాన బాలవేంకటేశ్వర గాయత్రి 129
38. శ్రీ వేజెండ్లపుర శ్రీవరకాళీ మాత స్తోత్రము 130
39. శ్రీవేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తికాళీ
అమృతాక్షరాద్భుతానంద స్తోత్రరత్నమాలిక – శ్లోకాలు 132
40. శ్రీ వేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తి కాళీ
అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక
ఫలశ్రుతి శ్లోకాలు 151
41. శ్రీవేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తికాళీ
అమృతాక్షరాద్భుతానంద స్తోత్రరత్నమాలిక
(తాత్పర్యములతో) 156
42. శ్రీ వేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తి కాళీ
అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక
ఫలశ్రుతి (తాత్పర్యముతో) 280
43. (18) పదునెనిమిది సంవత్సరాల నిత్యాగ్ని హోత్ర విశిష్టత
(తాత్పర్యములతో) 368
44. శ్రీ వేజెండ్లపురవాసిని శ్రీవరకాళీ అష్టకమ్ – (తాత్పర్యములతో) 382
45. ఆరాధనకు అదృష్టం – శ్రీవరకాళీమాత అనుగ్రహం 388
46. జన్మచరితార్థం 392
47. శ్రీవేజెండ్లపుర శ్రీ వరకాళీ గాయత్రీ లలితా
భువనేశ్వరీ మాతల స్తవమ్ 395
48. శ్రీవేజెండ్లపుర శ్రీచక్రపీఠస్థ శ్రీవిశ్వమాతల స్తుతి 396
49. పుష్కల ఫలం 398
50. శ్రీ దివ్య నామస్మరణలు 399
51. అమ్మ వరకాళీ సూక్తులు 400

# 1. శ్రీమద్గురు వరకాళీ ప్రార్థన

గురుః కాళీ గురుః కాళీ
కాళీదే వ్యేవ సద్గురుః
కాళ్యాః గురు ర్న చాన్యో ऽస్తి
తస్యై శ్రీగురవే నమః

ఓం హరిహరబ్రహ్మార్చితామ్
శ్రీవిశ్వమాతరం ప్రాణశక్తిమ్
శ్రీవరదాం యోగమాయామ్
మహాదేవీం మంగళప్రదామ్

వేజెండ్లపురవాసినీం కాళీమ్
వందే ప్రకృతిం పరాశక్తిమ్
మహామాయాం కాలరూపామ్
శ్రీ మద్గురు వరకాళీం నమా మీశ్వరీమ్

ఓం శ్రీసత్యలోక వైకుంఠ కైలాస నివాసాః
సృష్టి స్థితి లయ కార్యదీక్షా దేవేశ్వరాః
శ్రీ వేజెండ్లపురపీఠ సుస్థిర నివాసాః
బ్రం బ్రహ్మ విం విష్ణు మం మహేశ్వరాః మదగ్రజాః నమోస్తువః

## ౨. నా శక్తి శక్తి

1. సర్వేశ్వరీ జనని సద్గురు మహాదేవి కాళి
దివ్యగాయత్రి శ్రీలలిత భువనేశ్వరీ దేవి
వేంకటేశుని సాక్షిగా వేజెండ్లపురములోన
పరమాది మూర్తి శ్రీకాళి ప్రబోధించిన విద్య

2. నిష్ఠతో చేయుమా నివృత్తి కార్యమ్ములనుచు
ఆశీర్వదించె ఆదిపరాశక్తి అమరమూర్తి
నవ్యబోధలు చేయును నాగురువు వరకాళి
విమల విద్యలు నేర్పెడి విజ్ఞానమూర్తి కాళి

3. క్షణ క్షణావతారిణి అక్షయ మూర్తి శ్రీకాళి
అమ్మ కాళి నేర్పించును ఆత్మ ధ్యాన యోగముల్
నిత్య నిర్మలత్వము శాంతి నిండుగా నిచ్చి కాళి
అమ్మ పలికించి వ్రాయించు అమృతాక్షరముల్

4. వేంకట కాళీ కృష్ణుడనైన నాకు వేజెండ్ల లో
అగ్నిహోత్ర దీక్షలు ఆచరింపు మనుచు కాళి
సృష్టి మర్మముల్ దేవి స్పష్టముగ తెలిపెను
వేదాంత ఘనమూర్తి వేజెండ్లపుర వరకాళి

5. అన్నివేళల నన్ను ఆదరించి నడిపించును
సనాతన మౌ శక్తి శ్రీకాళి సద్భాషిత మూర్తి
కాళి మాత తెల్పును కారణముల నన్నిటిన్
ఆద్యంతరహిత మూర్తి అమ్మ కాళి నా గురువూ

6. సకల శుభముల నిచ్చు సర్వ రక్షణ శక్తి
అమ్మ వరకాళి చూపిన ఆ దివ్య మార్గమున
విహరించుచుండెడి విద్యార్థి నే నెపుడు
విశ్వ సుజనులార ఘనులార వినరే మీరూ

# 3.శ్రీవేజెండ్లపుర శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి పీఠం విశిష్టత

శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి అనుగ్రహం వలన మరియు నాకున్న కొద్దిపాటి ఆధ్యాత్మిక జ్ఞానంవలన, వేజెండ్లలోని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, స్వహస్తాలతో నిర్మాణం కావించి, మరియు తమ అమృత హస్తాలతో శ్రీకాళీమాత, శ్రీగాయత్రీమాత, శ్రీలలితాంబికా మాత మరియు శ్రీ భువనేశ్వరీమాత, శ్రీ సంతాన బాల వేంకటేశ్వరస్వామి వార్ల విగ్రహాలను, శ్రీ గురుదేవులే స్వయంగా ప్రతిష్ఠించిన ఆలయ విశిష్టతను మీ అందరూ తెలుసుకొని తరించాలని ఆశించి శ్రీకాళీమాత ఆలయ గొప్పతనాన్ని వ్రాయడానికి నాకు ఉత్సాహం ఉన్నా సంకోచిస్తున్నాను. ఎందుకంటే, ఎంతోమంది గొప్ప గొప్పవారు చదివే అవకాశం ఉన్న ఈ ఆలయ విశిష్టతా విషయాలను, ఏ మాత్రం విషయ రచనానుభవంలేని నేను వ్రాయటం, నా శక్తికి, జ్ఞానానికి మించిన సాహసం. కాని అమ్మవారి దయ మరియు శ్రీగురుదేవుల ఆశీస్సులు, నాలో ఈ ప్రేరణకు శ్రీకారం చుట్టాయి. అందువల్లనే నేను చూసిన, గమనించిన, అర్థం చేసుకున్న విషయాలను, వాటి విశిష్టత మరియు ఆధ్యాత్మికత ఏ మాత్రం తగ్గకుండా వ్రాయడానికి ప్రయత్నిస్తాను.

ఈ ఆలయంలోని దేవతామూర్తులైన శ్రీవరకాళీమాత, శ్రీగాయత్రీమాత, శ్రీలలితాంబికా మాత, శ్రీభువనేశ్వరీమాత మరియు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని భక్తితో దర్శించిన వారికి సమస్త సుఖసౌఖ్యాలు అలవోకగా చేకూరతాయన్నది ఇక్కడికి వచ్చే భక్తుల నమ్మకం మరియు నా స్వానుభవం. ఇంత గొప్పగా, మహిమాన్వితమై వెలుగొందుచున్న ఈ దేవాలయ విశిష్టతను వ్రాయటం నిస్సందేహంగా నా పూర్వజన్మ సుకృతం. ఇందులో ఉపయోగించిన భాష మరియు శైలి సరళమైనది, సామాన్యమైనది మాత్రమే. తెలియక దొర్లిన తప్పులను సహృదయంతో అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను. వేజెండ్లలోని శ్రీవరకాళీమాత ఆలయ విశిష్టత ఎంత చెప్పినా తక్కువగానే ఉంటుంది. అన్ని విషయాలనూ అర్థం చేసుకొని క్రోడీకరించి నా కోణంలో నేను చెప్పదలుచుకున్నది చెప్పడంలో సఫలీకృతుణ్ణి కావాలని ఆ జగన్మాతను మనసారా ప్రార్థిస్తున్నాను.

శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి అయిన శ్రీవరకాళీమాత ఆలయం, గుంటూరుజిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామంలో ఉన్నది. ఈ ఆలయ నిర్మాణం ఒక ప్రత్యేకమైన

దృష్టితో సాగింది. బాహ్యంగా దర్శించిన వారికి ఈ ఆలయం సాధారణంగా కన్పించినా, దీని నిర్మాణ శైలిని పరిశీలనగా చూసినప్పుడు, శిల్పవైభవం, యజ్ఞవేదిక నిర్మాణంలోని ఆంతర్యం, ఆలయ ప్రాంగణంలోని భూగర్భ సమాధి ప్రాశస్త్యం, కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మొదలైన అంశాలను వివరిస్తే వాటిలోని ఆంతర్యాలు అందరికీ అర్థం అవుతాయనే ఉద్దేశ్యంతో ఈ ఆలయ నిర్మాణ విశిష్టత ప్రత్యేకంగా వివరించబడినది.

శ్రీ ఆదిపరాశక్తి అయిన శ్రీవరకాళీమాత లీలా వైభవాలను, మహిమలను, అమ్మవారి శక్తిని, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు, అద్భుతమైన శ్లోకాలు పద్యాల రూపంలో రచించారు. అందువలన భక్తులు, శ్రీకాళీమాత స్వరూపాన్ని అవగతం చేసుకొని, నిత్యం, స్తోత్రపారాయణం గావించటానికి తద్వారా శ్రీకాళీమాత అనుగ్రహం పొందటానికి ఈ గ్రంథం ఉపకరిస్తుంది. ఆప్యాయతలను పంచే శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి శ్రీకాళీమాతను గూర్చి అణుమాత్రమైనా తెలుసుకోవడానికి, ఆ తల్లి స్తోత్రాలను, నామాన్ని, మంత్రాలను జపం చెయ్యడానికి ఈ పుస్తకం ఒక కరదీపిక అవుతుందని భావించవచ్చు.

కాలస్వరూపిణి శ్రీకాళీమాత. కాలాధికారిణి శ్రీకాళీమాత. సమస్త కాలాలపై ఆధిపత్యాన్ని ప్రకటించేది శ్రీకాళీమాత. ఆయా కాలాలకు అనుగుణంగా అవతరించేది శ్రీకాళీమాత. మంచి మనసు కలిగిన మానవులను దేవతలను, రాక్షసులను రక్షించడానికి, ఆయా సమయాలలో అనేక రూపాలతో అవతరించే ఆపద్బాంధవి శ్రీకాళీమాత. శ్రీకాళీస్వరూపాన్ని, తత్త్వాన్ని అర్థం చేసుకోవటం అంత సులువేమీ కాదు. కవీశ్వరులు, యోగీంద్రులు, శాస్త్రజ్ఞులు, సకల విద్యావేత్తలు, మునీశ్వరులు, ఋషీంద్రులు, దేవతలు మొదలైనవారు కూడా శ్రీకాళికాంబ స్వరూపాన్ని పూర్తిగా కనుగొనలేకపోయినారు. కరుణామృతాన్ని వెదజల్లే కాలాధిదేవత అయిన శ్రీకాళీ తత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించిన కారణ జన్ములకు ఆ తల్లి, కమనీయ వాక్కుల్ని ప్రసాదించింది. ఆ వాక్కులు అనే అమృతంచేత, ఆ మహానుభావులు అద్భుతమైన శ్లోకాలు, పద్యాలు ఆశువుగా పలికారు. సర్వకాలాలకూ నిలువగలిగే కావ్యాలు సృష్టించారు. శ్రీవిశ్వమాత ప్రసాద ప్రభావంచేత బ్రహ్మసమానులైన నిర్మల మేధాశక్తి సంపన్నులు కొందరు భూత, భవిష్యత్తులను వెల్లడించారు. అయితే, అనంతమైన ఈ చరాచర జగత్తులో అణుమాత్ర విజ్ఞానాన్నే ఆ మహానుభావులు

కూడా పొందగలిగారు. త్రిమూర్తులు సైతం సృష్టి, స్థితి, లయ కారకులుగా గుర్తించబడటానికి తగిన శక్తిని, అమరమూర్తి అయిన శ్రీ ఆదిపరాశక్తి అనుగ్రహం ద్వారానే సంపాదించగలిగారని తెలుస్తున్నది.

యోగులు, సిద్ధులు, అవధూతలు, అమరేంద్రులు, అమ్మ శ్రీకాళీమాత స్వరూపాన్ని అవగతం చేసుకోవడానికి ప్రయత్నించి, పరిశ్రమించి, పూర్తిగా కృతకృత్యులు కాలేకపోయారు. అయితే అమ్మను నమ్మి, అమ్మప్రసాద ప్రభావంచేత సాధనాశూరులైన కొంతమంది యోగులు కొంత సిద్ధిని మాత్రమే పొందగలిగారు. శ్రీకాళీమాత కరుణ ప్రాప్తించాలంటే, ఎన్నెన్నో జన్మల పుణ్యఫలం ఎంతో కావాలి.

సర్వకాలాలకూ అధిదేవత శ్రీకాళీమాత. ప్రస్తుతం జరుగుతున్న కలియుగంలోని కలుషాలను తొలగించే కరుణామూర్తి శ్రీకాళీమాత. కలియుగాంతంలో వచ్చే కల్క్యవతారుడైన శ్రీవిష్ణురూపునకు శక్తినిచ్చేది శ్రీకాళీమాతయే. కల్కి భగవానునికి అనుకూలంగా కాలాన్ని మలచి, కాపాడే కాలాధిదేవత శ్రీకాళీమాత. ఆయా యుగాలలో ఎన్నో దివ్యరూపాలను ధరించిన దేవతా మూర్తులకు శక్తులను ప్రసాదించింది శ్రీకాళీమాతయే. అనాది నుంచి ఆపదలను తొలగిస్తూ అవతారమూర్తులకు అద్భుతశక్తులను ప్రసాదించే అమరాద్భుతశక్తి శ్రీకాళీమాత. ఆపద సమయాలలో ఆర్తిని తొలగించటానికి అనువైన రూపాలను ధరించే కరుణామృత స్వరూపిణి శ్రీకాళీమాత. ఆదినుండి అంతంవరకూ అన్ని ప్రాణులకూ శక్తిని ప్రసాదించే అసమాన పరాక్రమ దయా సంపన్నురాలు శ్రీకాళీమాత.

శ్రీకాళీమాత వైపు కన్నెత్తి చూడటానికే కొందరు భయపడుతుంటారు. తప్పు చేసిన వారికే భయం ఉంటుంది. కాలాన్ని కొంచెమైనా సద్వినియోగం చేసుకోలేని అసమర్థులకు, అజ్ఞానులకే భయం కలుగుతుంది. మనసులో ఏ కల్మషములేని స్వచ్ఛ మనస్కులకు భయం ఉండదు. మన మనసుల్లో మంచి ఆలోచనలు ఉంటే మంచి ఫలితాలు వస్తాయి. అలాగే శ్రీకాళీమాతను గూర్చి మనం ఎలా తలిస్తే ఆ తల్లి అలాగే ప్రత్యక్షమవుతుంది. మన ఆలోచనలు సాత్వికంగా ఉంటే ఆ తల్లికూడా సాత్వికంగానే దర్శనమిస్తుంది. ఉగ్రరూపంగా భావిస్తే, ఉగ్రరూపంలోనే ప్రత్యక్షమౌతుంది. భక్తుల భావాలకు అనుగుణంగా సాక్షాత్కరించే శ్రీకాళీమాతను గూర్చి భయపడవలసిన అవసరం లేదు అంటారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు.

కాలం అనేది అందరికీ ఒక్కటే, స్త్రీ పురుష, పేద ధనిక బేధం లేకుండా ప్రతి ప్రాణికీ కాలం సమంగా ఉంటుంది. కొంతమందికి ధనం ఉండవచ్చు, మరి కొంతమందికి లేకపోవచ్చు. కొంతమందికి విద్యాగంధం ఉండవచ్చు. మరి కొంతమందికి విద్యాధనం లేకపోవచ్చు. కొంతమంది బలవంతులు కావచ్చు మరి కొంతమంది బలహీనులు కావచ్చు. కొంతమందికి పదవులు అధికారాలు ఉండవచ్చు. ఇంకా కొంతమందికి ఎలాంటి పదవులు, అధికారాలు లేకపోవచ్చు. కానీ ఎవరికైనా కాలం సమానంగానే ఉంటుంది. ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకోవటంలోనే ఆయా ప్రాణులశక్తి సామర్థ్యాలు కన్పిస్తాయి. కాలం విలువను గుర్తించి, ఆ కాలాన్ని తమకు అనుకూలంగా మలచుకొన్నవారే దేన్నయినా సాధించగలుగుతారు. ఉత్తమ ఫలితాలను పొందుతూ, ఉదాత్తమైన జీవితాన్ని గడుపుతారు. కాలస్వరూపిణియైన శ్రీకాళీమాత వివిధ రూపాలలో ఉంటుంది. ఆమె యజ్ఞప్రియ. యజ్ఞం అనేక విధాలుగా ఉంటుంది. తనను గూర్చి యజ్ఞం చేసిన వారి కోరికలను ఆ తల్లి సఫలం చేస్తుంది. సకల ప్రాణికోటికీ మాతృత్వాన్ని పంచిపెట్టే తల్లి శ్రీకాళీమాత. త్రిగుణాలకు అధిదేవత అయిన త్రినేత్ర స్వరూపిణి. త్రిశూలధారిణి అయిన శ్రీకాళీమాత త్రిమూర్తులకే శక్తిని ప్రసాదించింది. సమస్త ప్రాణికోటి, ప్రకృతి పరాశక్తి అయిన శ్రీకాళీమాతకు లోబడి ఉంటుంది. వరగర్వితులైన వారి మదమణిచే మహాశక్తి శ్రీకాళీమాత. శక్తి ఉపాసన అతిప్రాచీనకాలం నుంచీ జరుగుతున్నదనటానికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి.

తల్లి యశోదాదేవి బాలకృష్ణుని అల్లరి చేష్టలకు విసిగిపోయి, మన్ను తింటున్నాడని బలరాముడు వచ్చి ఫిర్యాదు చేయగా, యశోదాదేవి కోపగించి మన్ను తింటే దండించాలనే ఉద్దేశ్యంతో బాలకృష్ణుని నోరు తెరిచి చూపమని అడిగింది. ముందు ఎంత అడిగినా నోరు తెరవని బాలకృష్ణుని దండించాలని ప్రయత్నించగానే తన నోరు తెరచి చూపిస్తాడు. అలా తెరిచిన నోటిలో యశోదాదేవికి కన్పించిన దృశ్యాలు, ఆమెను నిశ్చేష్టురాలను చేశాయి. విశ్వమంతా ఆ నోటిలో దర్శనమిచ్చింది. మనిషి పుట్టుక, మరణం, దేవతలు, పాప పుణ్యాలు, స్వర్గం, నరకం అన్నీ దృగ్గోచరమైనాయి. పైకి సాధారణ బాలునిలా కన్పించే ఆ బాలకృష్ణుని లీలలు, ఎన్నో అద్భుతాలు మనకు తెలుసు.

అదే విధంగా వేజెండ్లలోని శ్రీకాళీమాత ఆలయం వెలుపల నుంచి చూసిన వారికి ఒక సాధారణమైన దేవాలయంలా కన్పిస్తుంది. కాని తరచి చూస్తే, చిన్నికృష్ణుని నోటిలో సర్వజగత్తూ కన్పించినట్లే, ఈ కాళీమాత ఆలయంలోకూడా అంతర్భాగంలో ఎన్నో అద్భుతమైన, విశేషమైన దృశ్యాలు కనిపిస్తాయి. సాక్షాత్తూ మానవుని జీవనయానం, వివిధ దశలు, కష్టనష్టాలు, చీకటి వెలుగులు, ఆ తరువాత పరమ పదానికి సోపాన మార్గాలు, చివరకు ఆ దైవంలో ఐక్యమయ్యే రీతులన్నీ భూగర్భ సమాధిలో కన్పిస్తాయి. సాధారణంగా శ్రీకాళీమాత ఆలయం ముందర నిల్చొని చూస్తే, మనకు మామూలుగా కన్పించే దేవాలయ ప్రహరీగోడలు, వాటికుండే ప్రవేశద్వారాలు (గేట్లు), గుడి, గుడి శిఖరాలు శిల్పాలు, యజ్ఞశాల కన్పిస్తాయి. కాని, జ్ఞానం వికసించిన నేత్రాలతో చూడగలిగే వారికి ఆ గోడలో త్రికోణ యంత్రాలు, గేట్లలో అమర్చిన శ్రీ ఆదిపరాశక్తి యంత్రాలు, గుడి శిఖరాలలో గ్రామశ్రేయస్సు, ప్రజల శ్రేయస్సు కొరకై ప్రతిష్ఠించిన శక్తి యంత్రాలు, శిల్పాలలో కనువిందు చేసే దేవతా స్వరూపాలు, ఒకటికాదు, అన్నీ ఎన్నో విశేషాలతో కూడి ఉన్నాయి. సామాన్యులు గేటు దాటి లోనికి రాగలిగే సత్తాలేదు. అలాగే వక్రబుద్ధితో విశ్లేషణ గావించేవారు, ఆ గుడిఛాయలకు కూడా రాలేరు. ఒకవేళ ఏదో కొంత ధైర్యం చేసి లోపలకు అడుగిడినా, అక్కడ ఎంతో సేపు నిలువలేరన్న సత్యం చాలాసార్లు ఋజువయింది. కాని గురుదేవుల అనుగ్రహం లభించి వారి మనసులో స్థానాన్ని పొందినవారే అదృష్టవంతులు. గుడిలో ప్రత్యేకమైన స్థానాలలో ప్రతిష్ఠాపన చేసిన యంత్రాల మహిమలు, సదా భక్తులపై అనుగ్రహం కురిపిస్తూనే ఉంటాయి. పూర్వజన్మ పుణ్యఫలంతోపాటు, నిష్కల్మషమైన మనసు, పరిపూర్ణమైన భక్తిభావం, ఆరాధనా తత్వం సమకూడి ఉన్నవారికి మాత్రమే శ్రీగురుదేవుల భూగర్భ సమాధి దర్శనభాగ్యం కలుగుతుంది. ఇన్ని సుగుణాలున్నా శ్రీగురుదేవుల సాన్నిహిత్యం పొందాలంటే ఎంతో దుర్లభం. ఎన్నెన్నో కఠోరమైన పరీక్షలను ఎదుర్కొనవలసి వస్తుంది. ఇవన్నీ జరగాలంటే కాలంతోపాటు నిలవాలి. ఆ కాలానికి నిలువగలిగే శక్తిని ప్రసాదించేది శ్రీ ఆదిపరాశక్తి, కాలస్వరూపిణి, శ్రీకాళీమాత మాత్రమే. అందువల్లే ఇన్ని విశేషాలున్న వేజెండ్ల శ్రీ కాళీమాత ఆలయాన్ని ప్రతిఒక్కరూ దర్శించవలసిందే. అలా దర్శించే అదృష్టం కొందరికి మాత్రమే లభిస్తుంది.

# యంత్రాల మహిమలు

ఇన్ని అద్భుతాలను తన గుండెల్లో దాచుకున్న శ్రీకాళీమాత ఆలయంలోని ప్రతిభాగం యొక్క గొప్పదనం తెల్సుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ముందుగా అమ్మవారి గర్భగుడి ముఖద్వారానికి ఎదురుగా ఉన్న గేటు విషయానికి వస్తే ఇందులో 'త్రికోణ' యంత్రం కూర్చబడింది. ఇది శ్రీ ఆదిపరాశక్తి యంత్రం, "త్రికోణ మధ్య నిలయా, షట్కోణపురవాసిని" అని శ్రీ ఆదిపరాశక్తిని స్తుతిస్తారు. ఈ యంత్రంలోని మూడు కోణాలు కూడా త్రిగుణాలకు, త్రికాలాలకు, త్రినేత్రాలకు మరియు త్రిమూర్తులకు త్రిగుణాలొసగిన మాతృమూర్తి అన్నట్లు, త్రిశూలానికి ప్రతీకలుగా చెప్పుకోవచ్చు. సత్త్వ, రజో, తమోగుణాలు సమపాళ్లలో ఉండటంవలన జీవనగమనం సుగమం అవుతుందని పెద్దలు చెప్తారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ఆర్త త్రాణ పరాయణత మొదలైనవన్నీ శ్రీ ఆదిపరాశక్తి యొక్క సహజ లక్షణాలు. త్రికోణయుతమైన యంత్రాన్ని పూజించేవారికి, ఆ జగన్మాత వెన్నంటి ఉండి సదా వారికి రక్షణ కల్పిస్తుంది, కాపాడుతుంది. జనాకర్షణ, ధనాకర్షణ, పాండిత్య ప్రకర్ష, మహారాజ భోగప్రాప్తి, సమస్త సుఖాలనూ, భోగాలను ఈ యంత్రం కలిగిస్తుంది. దుఃఖ, రోగ, శోక, ఋణ, దారిద్ర్య బాధలు తొలగిపోతాయి. సమస్త దోషాలూ నశిస్తాయి. సంపూర్ణమైన సుఖశాంతులూ, ఐశ్వర్యము, అనంతమైన కీర్తిప్రతిష్టలు లభిస్తాయి.

అదే విధంగా గుడికి ఈశాన్యం వైపు నున్న గేటుకు శ్రీమహావిష్ణు యంత్రం తాపడం చేయటం జరిగింది. ఈ యంత్రం ఎంతో అద్భుతమైన శక్తి కలిగినది, మరియు షట్కోణయుతమైనది. షట్కోణాలు అరిషడ్వర్గాలకు ప్రతీక. ఈ షట్కోణ యుతమైన యంత్రాన్ని పూజిస్తే సర్వదుష్టశక్తులూ తొలగిపోతాయి. రోగరాహిత్యం లభిస్తుంది మరియు ఆత్మజ్ఞానం సిద్ధిస్తుంది. గృహ, సంసార బాధలనుంచి విముక్తులవుతారు. అష్టైశ్వర్యాలు సమృద్ధిగా పొందుతారు. ఇష్టకార్యసిద్ధి మొదలైనవన్నీ ఈ యంత్రపూజ వలన ప్రాప్తిస్తాయి.

ఈ యంత్రమే మనకు ఆరు కోణాలతో, గీతామకరందంలో శ్రీకృష్ణ యంత్రంగా కనిపిస్తుంది. అర్జునునకు గీతోపదేశంతో జ్ఞానసిద్ధిని కలిగించి, భావితరాలకు సుస్థిరంగా నిలిచియున్న శ్రీకృష్ణపరమాత్మ, శ్రీమహావిష్ణు అవతారమే గదా ! అందుకే కాబోలు ఇక్కడికి వచ్చేవారు చాలావరకు, ఆర్తులు, భక్తులు, సేవకులు, ఆదివ్యాధులున్నవారు, అధిక ఋణబాధలున్నవారు, వివిధ రకాలైన బాధలతో

ఆత్మశాంతి లేనివారు వస్తుంటారు. పై యంత్రాన్ని పరిశీలిస్తే శ్రీమహావిష్ణువులాగ, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పవళించి ఉన్న శేషపాన్పుపై, అక్రూరుల వారికి నదిలో శ్రీకృష్ణభగవానుడు శేషపాన్పుపై కన్పించినట్లుగా, అలాగే యమునానదిలో ద్వారకా నగరాన్ని నిర్మించిన విధంగా, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు కూడా భూగర్భంలోని శేషపాన్పుపై పవళించి యున్నారు.

కోరికలను (అరిషడ్వర్గాలను) జయించటంవలన లేదా అదుపులో ఉంచు కోవటం వలన మానవులు మహాశక్తి సంపన్నులౌతారు. ఏ దుష్టశక్తీ వారి దరిచేర సాహసించదు. ఉత్తమమైన మార్గంలో వారి జీవితనావ సాగిపోతుంది. కాలస్థితిని గమనించి మసలుకోవలసిన బాధ్యత మానవులందరిపై ఉన్నది. కాలానికి అధిదేవత శ్రీకాళీమాతయే. సర్వకాల సర్వావస్థల యందునూ, అండగా నిలిచి, అభయాన్నిచ్చే అద్భుతమూర్తియే శ్రీకాళీమాత. అందువల్లనే కాబోలు కాలస్వరూపిణి, కాలాధిదేవత అయిన శ్రీకాళీమాత యంత్రాన్ని శ్రీగురుదేవులు, భక్తుల ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి కోసమని గుడిముందు గేటులోనే ఏర్పాటు చేశారు. ఆ యంత్రాన్ని చూసినా శుభమేనని పెద్దలంటారు.

## దేవి యజ్ఞశాల

వేజెండ్లలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవాలయం ప్రహరీగోడ గేటు దాటి లోపలకు ప్రవేశించగానే ముందుగా మనకు కన్పించేది. ఎడమవైపు ఆగ్నేయం మూల గుండ్రని వృత్తాకారంలో యజ్ఞశాల కన్పిస్తుంది. ఇది చూడటానికి ఋషుల కుటీరాన్ని పోలి ఉంటుంది. దీని శిఖరంపైన కలశం ఉండటంవలన శుభసూచకంగా పరిగణిస్తారు. శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు ఈ యజ్ఞశాలలో ఎన్నో వేల రోజులు యజ్ఞాలు చేస్తూ ఎంతో మందికి పలువిధాలైన శారీరక, మానసిక, రుగ్మతలను, గ్రహపీడలను నివారించి వారికి శాంతిని కల్గించినట్లుగా భక్తుల అనుభవాలు తెలియచేస్తున్నాయి. అదే విధంగా ఈ యజ్ఞశాలలో శ్రీగురుదేవులు, వారి శిష్యులు ఎంతోమంది, యజ్ఞసమయంలో ఎన్నో దివ్యానుభూతులు పొందినట్లుగా తెలుస్తున్నది. ఇంతటి మహిమాన్వితమైన యజ్ఞశాలను ప్రతిఒక్కరూ దర్శించుకోవలసిందేనని నేను భావిస్తున్నాను.

# పౌరాణిక శిల్పాలు

శ్రీకాళీమాత ఆలయంలో అన్నింటికన్న మిన్నగా, శోభాయమానంగా, భక్తులు, గుడి ప్రాంగణంలోనికి అడుగిడగానే దర్శనమిచ్చేది గుడి ముందర పై భాగంలో చక్కగా కన్పించే శిల్పాలు. రాక్షసుల పీడ ఎక్కువైన సమయంలో త్రిమూర్తులు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, శ్రీఆదిపరాశక్తిని, రాక్షస పీడలను తొలగించవలసినదిగా వేడుకొన్నారు. అప్పుడు శక్తిమాత శ్రీ ఆదిపరాశక్తి కరుణించి శ్రీకాళీమాత రూపాన్ని ధరించిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీకాళీమాత తన పది చేతులలోను, పదిరకాలైన ఆయుధాలను ధరించి, రాక్షసుల పీడను తొలగించే ఘట్టం ఎంతో బాగుంటుంది. ఆ తల్లికి ఎడమ ప్రక్కగా నిల్చొని సర్వభువనాలకూ అధిదేవతయైన శ్రీ భువనేశ్వరీ మాత అష్టభుజాలతో అద్భుతంగా కన్పిస్తుంది. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఈ ఇద్దరు మాతలకు నమస్కరిస్తూ ఉండటమే ఈ ఘట్టంలోని విశిష్టత. ఇదిఎంతో గొప్ప కలయిక. శ్రీకాళీమాత, శ్రీభువనేశ్వరీమాత లిద్దరూ సింహవాహనులే, వారు ఇరువురూ ప్రక్క ప్రక్కగా నిలుచొని కన్పిస్తున్న దృశ్యం, వేజెండ్ల. శ్రీకాళీమాత ఆలయంలోనే చూడగలుగుతాము. అలాగే శ్రీ వేంకటేశ్వర స్వామివారి ముఖమండపానికి ముందు పై భాగంలో శ్రీ శ్రీనివాస పద్మావతి అమ్మవార్ల వివాహ ఘట్టం మనకు గోచరిస్తుంది. వీరి వివాహానికి సరస్వతీ సమేతుడై బ్రహ్మ, మరియు పార్వతీ సమేతుడై పరమేశ్వరుడు వచ్చి నవ దంపతులైన శ్రీ శ్రీనివాస పద్మావతులను దీవిస్తున్నారు. వారి వివాహ సమయంలో యజ్ఞకార్యక్రమం కూడా నిర్వహించినట్లుగా కన్పిస్తున్నది. సృష్టి, స్థితి, లయకారులైన త్రిమూర్తులను ఒకేసారి ఇక్కడ దర్శనం చేసుకొని తరించవచ్చు. అత్యంత సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వివాహ కార్యక్రమానికి రక్షకులుగా నున్న హనుమంతుడు మరియు గరుత్మంతులను ఒకే వేదికపై మనం దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమైనది.

శ్రీకాళీమాత ఆలయ శిఖరాలు కూడా ఎంతో ప్రాశస్త్యం సంతరించుకున్నాయి. ఈ శిఖరాలు 'శ్రీశక్తి' యంత్ర యుతంగా నిర్మాణం కావించడం జరిగింది. ఈ యంత్రం మహాశక్తి మహిమలు కలిగినదని తెలుస్తున్నది. ఈ యంత్రం మొత్తం పది తంతెలుగా ఉంటుంది. మానవ శరీరంలో నవరంధ్రాలుండి ఒకటే ఆత్మ ఉన్నట్లుగా, ఈ యంత్రానికి మొదటి మెట్టు చతురస్రాకారంతో నాలుగు కోణాలు

2. వృత్తాకారంగా, 3. అష్టదళపద్మమా అన్నట్లుగా ఉంటుంది. 4. మళ్లీ వృత్తాకారంతో గుండ్రంగా ఉంటుంది. 5. త్రికోణాలతో ఐదు మెట్లుగా కన్పిస్తూ పైన 'ఆత్మ' అందరికీ ఒక్కటే అన్నట్లు చిన్నబిందువులాగా కన్పిస్తుంది.

శ్రీకాళీమాత ఆలయ గోపురం, శిఖరం వలెనూ, మరియు శ్రీ వేంకటేశ్వర స్వామి గుడి గోపురం విమానశిఖరం వలెనూ, నిర్మాణంలో మరియు వాస్తురీత్యా వైవిధ్యం చూపి నిర్మించడం జరిగింది. బాహ్యంగా ఇన్ని విశేషాలున్న శ్రీకాళీమాత ఆలయం ఒక ఆధ్యాత్మిక దృశ్యమాలిక అయితే, దేవాలయ అంతర్భాగం సాక్షాత్తూ శ్రీ వైకుంఠమే.

## దివ్యమంగళ స్వరూపిణులైన 'అమ్మవార్ల' దివ్యదర్శనము

వేజెండ్లలోని శ్రీకాళీమాత ఆలయానికి వచ్చిన ప్రతివారు ముందుగా అక్కడ వేంచేసి యున్న దివ్యమంగళ స్వరూపిణులు, మహిమాన్వితమూర్తులు, అయిన దేవతలు భక్తులకు ఎల్లవేళలా రక్షణ కల్పిస్తూ, సకల శుభాలనూ ప్రసాదిస్తున్న శ్రీవరకాళీమాత, శ్రీగాయత్రీమాత, శ్రీలలితామాత మరియు శ్రీభువనేశ్వరీ మాతల దివ్యదర్శనం చేసుకోవాలి. అత్యంత ప్రభావవంతమైన ఈ అమ్మవార్లను దర్శించుకునే భాగ్యం కలిగినపుడు, మానవజన్మ సార్ధకమవుతుంది. ఏ తల్లి ప్రేరణతో మానవజన్మ లభించిందో, ఆ తల్లిని ఒక్కసారైనా జీవితంలో దర్శించుకోగలిగితే అదే నిజమైన జన్మసార్ధకత. ఎందుకంటే శ్రీకాళీమాతను ప్రతిష్ఠించడానికి అవసరమైన పవిత్రజలాలను, 108 వేర్వేరు బావులనుంచి, 108 కొత్త కలశాలలో నీరు తెప్పించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తమ తపశ్శక్తిలో కొంత భాగాన్ని ధారపోసి శ్రీకాళీమాత అమ్మవారిని స్వయంగా ప్రతిష్ఠ కావించారు. ఆ రోజునుంచి పన్నెండు సంవత్సరాలపాటు నిత్యాగ్ని హోత్రం చేసి, ఎంతో పవిత్రము, మహిమాన్వితమైన 'శ్రీచక్రమేరువు'ను అమ్మవారు, శ్రీకాళీమాత ముందు ప్రతిష్ఠ చేశారు. అన్ని సంవత్సరాలపాటు, ఎన్నోవేల రోజులు యజ్ఞాలు చేసిన ఫలితం వలన అమ్మవారి గర్భాలయం మహిమలకు నిలయమైనది. అలాగే పదమూడు సంవత్సరాలు యజ్ఞాలు పూర్తయిన తరువాత శ్రీగాయత్రీమాత, శ్రీలలితాంబికామాత, శ్రీభువనేశ్వరీ మాతలను, శ్రీ గురుదేవులు స్వయంగా ప్రతిష్ఠ చేశారు. ఇంతటి

శక్తులున్న అమ్మవార్లను దర్శించుకోవటం ఎంతో అదృష్టం, పుణ్యప్రదం కనుకనే ఈ అమ్మవార్లను దర్శించుకోవటం వలన భక్తులు శుభఫలితాలను పొందుతున్నారు. మరొక విశేషం ఏమిటంటే ఇక్కడి అమ్మవార్లను దర్శించిన వారికి, ఈ విశ్వంలోని అన్ని పుణ్యక్షేత్రాలను మరియు పుణ్యతీర్థాలను దర్శించిన పుణ్యఫలం లభిస్తుంది అని అంటారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. అదే విధంగా ఎన్నో మహిమలకు నిలయమైన గర్భాలయంలో అమ్మవార్ల చుట్టూ ప్రదక్షిణ చేసే భాగ్యం ఎవరికి దక్కుతుందో వారే గొప్ప అదృష్టవంతులు. శ్రీ గురుదేవులకు శుశ్రూషలు చేసేవారైనా, వారు (శ్రీగురుదేవులు) అనుగ్రహిస్తేనే గర్భాలయంలో అమ్మవార్ల చుట్టూ ప్రదక్షిణలు చేసే భాగ్యం కలుగుతుంది. సర్వలోకాలనూ పాలించే తల్లి శ్రీకాళీమాత, వేజెండ్లలో కొలువై ఉండి, సర్వకాలాలలోనూ భక్తుల కోర్కెలను తీర్చడం అందరి అదృష్టంగా భావించాలి.

## భూగర్భ సమాధి విశిష్టత మరియు విశేషాలు

ఆలయంలోనికి ప్రవేశించిన ప్రతివారూ ముందుగా అమ్మవార్ల దర్శనం చేసుకున్న తరువాత, భూగర్భ సమాధిని దర్శించడానికి, ఎడమవైపుగా వెళితే భూగర్భ సమాధిలోనికి మార్గం వస్తుంది. 'దీపం' సహాయంతో మాత్రమే లోనికి వెళ్లే అవకాశం ఉంటుంది. మార్గమధ్యంలో రెండు మలుపులు ఉంటాయి. మొదటి మలుపు తర్వాత రెండు చిన్నమెట్లు, దిగి ముందుకు వెళితే, రెండోమలుపు వద్దనుంచి సరాసరి భూగర్భ సమాధిలోనికి మార్గం వస్తుంది. ఈ మార్గం మొత్తం 21 మెట్లతో కూడిన నిర్మాణం. ఈ మెట్లకు పై భాగంలో '9' (తొమ్మిది) అర్ధచంద్రాకారంతో నిర్మితమైన పై కప్పు కన్పిస్తుంది. ఈ 21 మెట్లు సంఖ్యాశాస్త్రపరంగా చూస్తే 2+1 = 3. అనగా త్రిమూర్తులకు ప్రతీక. త్రిగుణాలకు నిలయం. అలాగే పైనున్న ఈ తొమ్మిది (9), మనిషిలో ఉండే నవరంధ్రాలని చెప్పవచ్చు.

ఈ 21 మెట్లు జాగ్రత్తగా దిగి ఇంకా ముందుకు సాగితే, అక్కడ అఖండజ్యోతి నిశ్చలంగా వెలుగుతూ దర్శనమిస్తుంది. ఈ అఖండ జ్యోతి భూగర్భసమాధిలో వెలుగునిచ్చే ఒకే ఒక్క జ్యోతి. మరేవిధమైన వెలుగూ సమాధిలో కన్పించదు. దీని అర్థం కుల మతాలు ఎన్నైనా ఆత్మ ఒక్కటే అనే భావాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ అఖండ జ్యోతి దర్శనం మోక్షానికి మార్గాన్ని సులభం చేస్తుంది. ఇదే ఆత్మజ్యోతి. ఈ ఆత్మజ్యోతి వద్ద నిల్చొని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారిని దర్శించుకోవచ్చు. అఖండజ్యోతి వద్దనే గిరిధారి అయిన శ్రీకృష్ణుని విగ్రహం శ్రీగురు తపస్సమాధిపైన కనిపిస్తుంది. ఇంకా ముందుకు వెళితే అక్కడే శ్రీగురు కాళీకృష్ణులవారి దివ్య భూగర్భ సమాధి దర్శనమిస్తుంది. ఈ భూగర్భ సమాధిలో శ్రీ గురు కాళీకృష్ణులవారు చేసిన తపస్సు అనితర సాధ్యంగా కన్పిస్తోంది. సమాధి మధ్యభాగంలోని సప్తశిరస్సుల ఆదిశేషుని ఒడిలోని పీఠభాగంలో శ్రీగురుదేవులు "శ్రీచక్రాన్ని" ప్రతిష్ఠించారు. దీనిపై కూర్చొని వారు కొన్ని సంవత్సరాల పాటు రాత్రులందు తపస్సుచేసి అఖండమైన సిద్ధులను సాధించారని తెలుస్తున్నది. సప్తశిరస్సుల ఆదిశేషునికి కుడిప్రక్కగా పంచ శిరస్సుల ఆదిశేషుడున్నాడు. ఈ ఆదిశేషుని పీఠభాగంలో, శ్రీ గురుదేవులు 'మత్స్య' యంత్రాన్ని స్థాపించారు. దీనిపై శ్రీగురుదేవులు, వారి శిరస్సును ఉంచి పవళించినపుడు, పాదాలవద్ద నుండే ప్రదేశంలో 'కూర్మ' యంత్రాన్ని ప్రతిష్ఠించారు. భూగర్భ సమాధి నిర్మాణ సమయంలో సమాధిలోనికి ప్రవేశమార్గం గోడకున్న చిన్నకంత ద్వారా, ప్రాకుతూ మాత్రమే ఎవరైనా వెళ్లగలిగేవారు. ఇంతకు మించి మరి ఏ ఇతర మార్గం కూడా లేదు. చుట్టూ నాలుగు ప్రక్కలాగోడలు. ఇతరులు లోనికి వెళితే గాలి స్తంభించిపోయి ఒక్కక్షణం కూడా ఉండగలిగేవారు కాదు. ఎందుకంటే ఊపిరి సలపదు. ప్రాణవాయువు లభించదు. శ్రీగురుదేవులు భూగర్భ సమాధిలో సప్తశిరస్సుల శేషుని ఒడిలో కూర్చొని యోగమాచరించేటప్పుడు, వారి శిరస్సుపై భాగానికి వెనుక ప్రక్క గుడిలో పైన శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రతిష్ఠించారు. బయటి కంతగుండా చూస్తే శ్రీగురుదేవులు, ఆ మూడు యంత్రాలపై పవళించి ఉన్నప్పుడు, వారి నాభిస్థానం మాత్రమే కన్పిస్తుంది. శిరస్సు పాదాలు కన్పించవు. అనగా జనన మరణాలు మనకు తెలియవు. మధ్యలోనే పుడుతూ, మధ్యలోనే మరణిస్తూ ఉంటాము. నాభిదర్శనం ఈ విషయాన్నే విశదీకరిస్తుంది.

భూగర్భ సమాధి ఎదురుగా ఒక యజ్ఞకుండం నిర్మించి దానిలో లెక్కకు మిక్కిలిగా యజ్ఞాలు చేసి ఎన్నో మహా అద్భుతాలను లీలలను భక్తులకు చూపించారు శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు. అదే, శ్రీగురుదేవుల తపస్సమాధి స్థలం.

శ్రీగురుదేవుల తపస్సమాధినుంచి మెట్లు, సమాధి పైభాగంలో, భూగర్భంలో అంతరిక్షమా ? అనే విధంగా కన్పించే శేషపాన్పుకు దారితీస్తాయి. ఈ శేషపాన్పు పంచశిరస్సులతో కూడి యున్నది. ఈ శేషపాన్పుకు వెళ్లే మార్గం ఏడుమెట్లతో కూడి ఉన్నది. ఇందులో ఆరుమెట్లు అరిషడ్వర్గాలకు, ఏడవ మెట్టు మనసుకు ప్రతీకలు. ఈ ఏడు మెట్లే తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువుదీరి ఉన్న ఏడుకొండలకు ప్రతీకలా అన్నట్లు, శ్రీగురు వేంకట కాళీకృష్ణులవారు పవళించి యున్న శేషపాన్పు దరిచేరుటకు కూడా ఏడుమెట్లు ఎక్కవలసిందే.

అరిషడ్వర్గాలను జయించి మనసును అధీనంలో ఉంచుకున్న వారికి మాత్రమే ఈ మెట్లెక్కి శేషపాన్పుపై పవళించి యోగసమాధిలో ఉన్న శ్రీగురుదేవులను దర్శించుకోవటానికి అర్హత లభిస్తుంది. భూగర్భంలో అంతరిక్షంలా కన్పించే, ఈ శేషపాన్పుపై శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పవళించే తీరు, పాలసముద్రంలో శేషతల్పంపై శ్రీమహావిష్ణువులా గోచరిస్తున్నారు. అలాంటి అమరిక ఎలా జరిగిందో ఊహించటం కష్టం. ఆ వైభవం నిర్మాణ శైలిని తలపిస్తుంది. శేషపాన్పుపై ఉన్న శ్రీ గురుదేవులను, క్రింది భూగర్భ సమాధివద్ద నుండి పైకి చూస్తే ఒకప్రక్క శిరస్సు, మరోప్రక్క పాదాలు దర్శనమిస్తాయి. అనగా మనిషి జననం మరణం మనకు కన్పిస్తుంది. కాని మధ్యనున్న జీవితకాలం ఎంత అనే విషయం మనకు తెలియదు. ఇవి రెండూ నాకే తెలుసు, అన్నట్లు శ్రీగురుదేవులు వారి శిరస్సు, పాదాలు రెండూ చూపిస్తూ పవళించారు. శ్రీగురుదేవుల శేషపాన్పు ముందున్న ద్వారానికి ఇరువైపులా క్షేత్రానికి రక్షకులుగా ఉన్నట్లు ఒకప్రక్క శ్రీఆంజనేయస్వామి, మరోప్రక్క శ్రీగరుత్మంతుడు భక్తులకు స్వాగతం పలుకుతున్న భంగిమలో నమస్కరిస్తూ కన్పిస్తారు. ఈ విషయాలను చూస్తే చెప్పకుండానే మనం తెల్సుకోవచ్చు. శ్రీగురుదేవుల యోగసమాధి ఎంత వినయంతో కూడుకొని ఉన్నదో. అందుకే కాబోలు శ్రీగురుదేవులు ఇలా అంటూ ఉంటారు – 'వినయం, విశ్వాసం ఉన్నవారికి విజయం ప్రాప్తిస్తుంద'ని.

ఈ విధమైన ఎన్నో విశిష్టతలున్న విశేషాలను తన గర్భంలో ఇముడ్చుకున్న వేజెండ్లలోని శ్రీకాళీమాత ఆలయాన్ని తప్పక చూడవలసిందే. అదే విధంగా భూగర్భ సమాధి ప్రవేశద్వారం మొదలుకొని, వెలుపలికి వచ్చి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొనే వరకూ, మనం, ఒక జీవితపు ఆటుపోట్లుగా, అందలి దృశ్యాలను

మనిషి జీవిత గమనానికి అన్వయించుకోవడానికి చక్కని ఉదాహరణగా కన్పిస్తుంది. పుట్టుక నుంచి తప్పటడుగులతో ప్రారంభించే జీవనయానాన్ని వివిధ దశలుగా చూసుకుంటూ చివరకు పరమపదాన్ని, ఆపైన పరమాత్మలో జీవాత్మ ఐక్యమవడాన్ని మనం తెలుసుకోవచ్చు.

మానవశరీరం మొత్తం ఆరుచక్రాల సారధ్యంలో జీవనప్రక్రియ సాగుతుంది. ఇవి మూలాధార చక్రం నుంచీ సహస్రారం వరకూ ఉంటాయి. శ్వాస ప్రారంభ మైనప్పుడు మనం ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు జరుగుతాయి. అప్పుడు మూలాధారం నుంచి పైకి ప్రాణశక్తి భ్రూమధ్యం వరకూ వెళ్లి, మళ్లీ శ్వాస బయటకు వదలినప్పుడు భ్రూమధ్యం నుంచి మూలాధారం వరకూ క్రిందికి ప్రయాణం చేస్తుంది. అనగా ఒక శ్వాసలో ప్రాణం క్రింది నుంచి పైకి, పై నుంచి క్రిందకు ప్రయాణం చేస్తుంది. అనగా ఒక శ్వాస క్రింది నుంచి పై ఆరుచక్రాలూ, పై నుంచి క్రింది ఆరు చక్రాలూ కలిపి మొత్తం 12 చక్రాల నుంచి ప్రాణసంచారం చేస్తుంది. ఈ 12 చక్రాలలో జరిగే ప్రాణసంచారాన్ని 12 రాశులలో జరిగే జీవన సంచారంగా వేదాలలో ఉదహరించారు. ఇదే ఒక సంవత్సరకాలం అనగా 12 నెలలు. ఈ రాశులన్నింటినీ ఒక చక్రంగా, అనగా రాశిచక్రంగా భావిస్తే కాలస్వరూపం నిర్ధారితమవుతుంది. ఈ రాశిచక్రమే కాలస్వరూపం. ఆ కాల స్వరూపమే శ్రీకాళీ స్వరూపం. ఆమెయే కాలాధిదేవత శ్రీకాళీమాత. అదే విధంగా మూలాధారం నుండి పైకి ఏడు లోకములూ, మూలాధారం నుండి క్రిందకు ఏడు లోకములూ కలసి 14 లోకములు మానవ శరీరంలో ఉన్నవి. ఈ శరీరమే శ్రీ విశ్వజనని సృష్టి. ఈ మొత్తం మానవ శరీరంలో మట్టి చెట్టంతా తన విత్తనంలోనే ఉన్నట్లుగా, ఈ బ్రహ్మాండమంతా మానవుని శరీరంలోనే ఉన్నది. ఇదే నాలుగు వేదాలసారం.

మానవశరీరంలోనే బ్రహ్మాండమంతా ఉన్న విధంగా శ్రీగురుకాళీకృష్ణులవారి భూగర్భ సమాధిలో, మానవుని పుట్టుకనుంచీ గిట్టుట వరకూ గల వివిధ జీవనదశలు కన్పిస్తాయి.

ముందుగా శ్రీవిశ్వమాత, శ్రీకాళీమాతను దర్శించుకొని జీవనయానాన్ని ప్రారంభించాలి. ప్రారంభంలో వేసే తప్పటడుగులను ఆ తల్లి చేయి పట్టుకొని నడిపిస్తుంది. జీవిత గమనంలో ముందంతా చీకటే. అనగా తదుపరి క్షణం ఏమి జరుగుతుందో మనకు తెలియదు. కన్పించదు. కన్పించదు కనుక చీకటి అని

అర్థం. భవిష్యత్తు మనకు ఏమీ తెలియదు. ప్రాథమిక దశలో దీపం సహాయంతో మెల్లగా కొంచెం, కొంచెం ముందుకు కదలాలి. మార్గంలో (అనగా మన జీవిత గమనంలో) ఎన్నో మలుపులు, అడ్డంకులు (మెట్లు) వస్తుంటాయి. వాటన్నింటినీ ఎంతో జాగ్రత్తగా, ప్రతి అడుగూ లెక్క ప్రకారం వేసుకుంటూ వెళ్లాలి (సన్మార్గాన్ని ఎంచుకోవాలి) అప్పుడే మనం సక్రమమైన మార్గంలో వెళుతుంటాము. మనచేతిలో ఉన్న దీపం వెలుగు ఏ మాత్రం తగ్గినా ముందు దారి కన్పించదు. అంతా అగమ్య గోచరంగా మారుతుంది. దిక్కు తోచదు. అలా ముందుకు పోతూ ఉంటే కొంత వ్యవధి తర్వాత (కొంత కాలం తర్వాత) మనం పడిన కష్టానికి (చీకటిలో మెట్లు దిగడం, మలుపులు తిరగడం మొ॥) ఫలితంగా అడ్డంకులు లేని మార్గం (జ్ఞానమార్గం లేదా ఆధ్యాత్మిక మార్గం) కన్పిస్తుంది. ఆ దారి ఎంతో హాయిగా ఉంటుంది. ఎలాంటి అడ్డుగోడలు, ఎదురుదెబ్బలు ఉండవు. గమ్యస్థానాన్ని సజావుగా చేరగలమన్న ఆశ, అక్కడి నుండి మనస్సును స్థిరమైన ఆధ్యాత్మిక లోకానికి (భూగర్భ సమాధి) అర్పించాలనే కోరిక మొదలౌతుంది. ఒకసారి దైవ సన్నిధిలో ఆధ్యాత్మికమైన భావన లేదా రుచి తెలిసిన తరువాత ఇక మిగిలింది పరమపదాన్ని పొందటమే. పరమపదాన్ని పొందటం ఎంతో కష్టమైన విషయం. దీని సాధనకు ఎంతో ఓర్పు, పట్టుదల కావాలి. ముందుగా కోరికలనే అరిషడ్వర్గాలను అదుపు చేయాలి. అది అంత సులువైనది కాదు.

శ్రీ గురుదేవుల శేషపాన్పు దగ్గరకు వెళ్లే 7 మెట్లు ఎంతో చిన్నవిగా ఉంటాయి. కనుక అదుపు తప్పకుండా జాగ్రత్తగా అడుగులు వేస్తూ ఎక్కాలి. ఏడుమెట్లూ ఎక్కిన తరువాత (కోరికలను జయించిన తరువాత) దైవసాక్షాత్కారం ఎదురుగానే లభిస్తుంది. అనగా దైవసాక్షాత్కారానికి మానవునిలో జనించే కోరికలే అడ్డుగా నిలుస్తాయి. (అక్కడ శ్రీగురుదేవులు శేషపాన్పుపై కన్పిస్తారు). దైవసాక్షాత్కారం కలిగినా వారిని మామూలు నేత్రాలతో దర్శించటం సాధ్యంకాదు (చీకటి గనుక) మనోనేత్రాన్ని తెరిచి చూస్తే (దీపం వెలిగించి) ఆయన (శ్రీగురుదేవుల) దివ్యమంగళరూపం శేషపాన్పుపై కన్పిస్తుంది. అరిషడ్వర్గాలను జయించి (7 మెట్లెక్కి) దైవసాక్షాత్కారాన్ని పొందితే, ఆ పరమపదాన్ని చేరినట్లుగాని, జీవితం ధన్యమైనదనిగాని పొంగిపోకూడదు. అదుపులో ఉంచిన ఏ ఒక్క కోరికా మరలా విజృంభిస్తే పతనం మొదలౌతుంది. (శ్రీ గురుదేవుల శేషపాన్పు వద్దకు మెట్లెక్కి వెళ్లే సమయంలో పొరపాటున మళ్లీ

వెనుక మెట్లపైన కాలు వేస్తే జారిపడి వెళ్లి భూగర్భ యజ్ఞగుండంలో పడతారు) కాని ఎంతో కష్టపడి, జీవితమంతా దైవప్రార్థన కోసమే వెచ్చించిన మానవులను దైవం (శ్రీగురుదేవులు) మళ్లీ అథఃపాతాళానికి పడకుండా కాపాడుతారు. ఎందుకంటే తనను నమ్మి వచ్చిన వారికి ఉత్తమలోకాలు పొందే అదృష్టం కలిగిస్తారు. ఒకసారి దైవదర్శనం, దైవసాక్షాత్కారం (శ్రీగురుదేవుల దర్శనం) కలిగిన తరువాత, పరమపదానికి మార్గం దైవమే చూపిస్తాడు. దైవసాక్షాత్కారం తరువాత, మానవుడు తనకు లభించిన దైవ ఆదరణతో శిరస్సు వంచి (మనస్సు దైవానికి అర్పించి) పరమపదానికి మార్గాన్ని (ఇరుకుగా ఉండే మెట్ల మార్గం) చూసుకుంటూ వెళ్లాలి. ఈ దశలో ఏ మాత్రం అజాగ్రత్తగా తలపైకెత్తినా (నేను అనే అహం) దెబ్బ తగలక మానదు (అథోగతి) అనగా దైవం వద్ద అందరూ తలవంచవలసిందే. భక్తులు సమాధి నుంచి వెలుపలకు వస్తూ శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకొంటారు.

# 4. నిత్యనూతన సృష్టి శక్తిప్రదాయిని! శ్రీకాళి!

శ్లో॥ అక్షయామృతవృష్టి కారణ వాగ్భూషణ నూతన సంస్కృతాక్షర సృష్టియుక్తిప్రదే!
సద్భక్త జనకుసుమాంతర మధు సమానామృత వాక్యోద్భవకారిణి! వరకాళి!
సదానుభవాద్భుతామరజ్యోతిస్సమానాక్ష రానేకస్తోత్రసృష్టిశక్తిప్రదే! దేవి
అక్షయాశుకవితాద్భుతశక్తిప్రదే! దీర్ఘకాల స్థిరస్మృతియుక్తి ప్రదాత్రి! కాళి!

తా॥ ఎల్లప్పుడూ ఎలాంటి అవరోధం లేకుండా వర్షించే అమృతధారలవలె, ఆ దేవి, తన భక్తుల నోటి వెంట క్షణానికొక్క రీతిలో, పలువిధములైన దివ్యములైన కొత్త కొత్త వాక్కులను పలికిస్తూ, సనాతనమైన, నిత్యసత్యమైన దేవభాష అయిన సంస్కృత అక్షరాలను, నూతనమైన ఒరవడిలో సృష్టించే తెలివిని ప్రసాదిస్తుంది. అలాగే, మంచి భక్తులైన జనులకు, వారు పలికే పలుకులలో, మాట్లాడే మాటలలో సౌమ్యత లాలిత్యము కలగలిసి సుగంధ భరితమైన పుష్పాల గుండెలలో నిండి ఉండే తేనెతో సమానమైన, మృదుమధురమైన అమృత సమానమైన వాక్కులను వృద్ధి చేస్తూ, వారి మాటలలోని మాధుర్యము వలన అందరూ ఆకర్షితులై, వారి పలుకులను పదేపదే వినాలని కోరుకునే విధంగా చేస్తుంది శ్రీకాళీమాత. ప్రతిరోజూ అనుభవంలో ఎప్పటికీ నిరంతరాయంగా వెలుగుతూ ఉండే, అమరజ్యోతితో సమానమైన అద్భుతమైన అక్షరాలతో కూడిన అనేకానేక మధురమైన సంస్కృత శ్లోకాలను, సొంపైన స్తోత్రాలను సృష్టించే దివ్యమైన శక్తిని యుక్తిని, ఆ దేవి శ్రీఆదిపరాశక్తి, తన భక్తులకు ప్రసాదిస్తుంది ఆదేవి, నిరంతరము అప్రతిహతంగా దివ్యమైన వెలుగులను విరజిమ్ముతూ, అద్భుతంగా దినదిన ప్రవర్ధమానమై ముందు కాలములలో భావితరాలకు అనేక విధాలుగా ఉపయోగపడుతూ ప్రకాశించే, నిత్య సత్యమైన ఆశుకవితాశక్తిని, ఇంకా ఏ విషయాలనైనా తెలుసుకొని అప్పటికప్పుడే వ్రాస్తూ చెప్పగలిగే అద్భుత ప్రతిభను, అక్షయంగా అనగా నిరంతరం బాగుగా మాట్లాడే శక్తిని ప్రసాదిస్తూ, జ్ఞానశక్తిని, ఇంకా జ్ఞాపకశక్తిని, చిరకాలం స్థిరంగా, భద్రంగా నిలిచి ఉండే విజ్ఞానము, తత్సంబంధమైన శక్తియుక్తులను నిండుగా ప్రసాదించే నిర్మలమూర్తి శ్రీకాళీమాత.

# 5. శ్రీ వేజెండ్లపుర శ్రీ వరకాళీ గాయత్రి లలితాంబికా భువనేశ్వరీ దివ్యమాతల స్తుతి

శ్లో॥ ఓం శ్రీనిత్యమంగళప్రదాత్రి! సత్యాన్వేణాద్భుత సుఫలప్రదాయిని!
శ్రీవాణీ లక్ష్మీ పార్వతీ హరిహర విరించీంద్రాది దేవగణ సంసేవితే!
హే బ్రహ్మాండజనని! ఆదిశక్తే! నిర్మలానందజీవనప్రదాత్రి! కాళి!
శ్రీమన్మహాదేవి! భద్రమూర్తే ! శ్రీవరకాళి! భువనేశ్వరి ! నమోఽస్తుతే!1

శ్లో॥ ఓం శ్రీవరభద్రేశ్వరి ! ఏకవదన దశభుజే ! శివోపరిస్థిరమూర్తే !
మహాశక్తే ! ఖడ్గ గదా శ్శూల స నయనాసి చక్రాయుధ దక్షిణ హస్తే!
శంఖధనుర్బాణ ఛిన్నశిరోరుధిరఅక్షయపాత్రాసి త్రాణాయుధ హస్తే!
ఆపత్కాలోద్భవావతారమూర్తే! సర్వశత్రుసంహారిణి! కాళి! నమోఽస్తుతే!2

శ్లో॥ ఓం భూర్భువస్స్వః పంచవదన దశభుజే ! దేవి ! శ్రీవరదాభయమూర్తే!
శ్రీశంఖ చక్ర గదా పరశు కమల పుస్తక శ్శూలాక్షయ పాత్ర హస్తే !
అకాలమృత్యుహారిణి! దీర్ఘాయురారోగ్యప్రదాత్రి! అద్వైతామృతమూర్తే!
జగజ్జనని ! విజయప్రదాయిని ! ప్రకృతీశ్వరి ! గాయత్రి ! నమోఽస్తుతే!3

శ్లో॥ ఓం శ్రీజగదంబికే ! ఏకవదన చతుర్భుజే ! మహాలావణ్యాదిమూర్తే !
విశ్వమోహనకారణాత్యద్భుతేక్షుపాశాంకుశ పుష్పబాణాయుధహస్తే !
అశేషజనార్చితరూపిణి ! దివ్యామృతాక్షయాకర్షణదేహధారిణి !
నిత్యసుఖసంతోషానందజీవనప్రదాత్రి ! లలితాంబికే ! నమోఽస్తుతే!4

శ్లో॥ ఓం శ్రీవిరాడ్రూపిణి ! ఏకవదన దశభుజే ! శ్రీవరదాభయమూర్తే!
శంఖ చక్ర గదా శ్శూల కశ ఘంటా పరశు ధనుర్బాణాయుధ శ్రీహస్తే!
సృష్టి స్థితి లయకారిణి ! సర్వలోకవిరాజితే ! దేవి ! ముక్తిప్రదాత్రి !
మణిద్వీపవాసిని ! బ్రహ్మవిష్ణుశివార్చితే ! భువనేశ్వరి ! నమోఽస్తుతే!5

# ౬. శ్రీవేజెండ్లపుర శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి వరకాళీ
# అష్టోత్తరశత బీజాక్షర మహామంత్రం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ఓం | అం | ఆం | ఈం | ఊం | ౠం | ఏం | ఐం | ఔం |
| క్లాం | క్లీం | క్లూం | క్లేం | క్లైం | క్లౌం | గ్రాం | గ్రీం | గ్రూం |
| గ్రేం | గ్రైం | గ్రౌం | జాం | జీం | జూం | జేం | జైం | జౌం |
| ఠ్రాం | ఠ్రీం | ఠ్రూం | ఠ్రేం | ఠ్రోం | ఠ్రౌం | ఢ్రాం | ఢ్రీం | ఢ్రూం |
| ఢ్రేం | ఢ్రోం | ఢ్రౌం | ణాం | ణీం | ణూం | ణేం | ణోం | ణౌం |
| త్రాం | త్రీం | త్రోం | త్రైం | త్రౌం | ద్రాం | ద్రీం | ద్రూం | ద్రైం |
| ద్రౌం | ప్రాం | ప్రీం | ప్రూం | ఫ్రేం | ఫ్రోం | ఫ్రౌం | భ్రాం | భ్రీం |
| భ్రూం | భ్రేం | భ్రోం | భ్రౌం | మ్రాం | మ్రీం | మ్రౌం | యాం | యూం |
| యౌం | రాం | రీం | రౌం | శ్రాం | శ్రీం | శ్రూం | శ్రేం | శ్రైం |
| సాం | సీం | సూం | సేం | సౌం | స్త్రీం | స్వోం | హం | హ్రోం |
| హ్రీం | హ్రూం | హ్రేం | హ్రైం | హ్రౌం | హ్ల్రీం | ళం | క్షం | క్షాం |
| క్షీం | క్షూం | క్షేం | క్షౌం | క్రీం | కాళ్యై | నమః | | |

# 7. అమ్మ రాకతో అంతా శుభమే

నేనండీ ! భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారి పాదసేవకుడను. మూల్పూరు వీరారెడ్డిని. నా వయసు 83 సం॥పైనే. నాకు తెలిసి ఈ వేజెండ్ల గ్రామంలో చాలా కాలం నుంచి పూరిళ్ళు గడ్డివాములు తగలపెట్టుకోవడం, ఎప్పుడూ గొడవలు జరగటం, పోలీసు కేసులు పెట్టుకోవటం, కోర్టుల చుట్టూ తిరుగు తూండటం జరుగుతూ ఉండేవి. కానీ ఆశ్చర్యం ! అమ్మ శ్రీవరకాళీ మాతను ప్రతిష్ఠించిన తర్వాత వేజెండ్ల గ్రామంలో గొడవలు అదృశ్యమై పోయాయి. శ్రీగురుదేవులు 1995వ సం॥రం ఉగాది రోజున వేజెండ్ల గ్రామంలో మహా అన్నసంతర్పణ చేశారు. అప్పటి నుండి ప్రతి ఉగాది, గురుపూర్ణిమ, శ్రీకృష్ణజన్మాష్టమి, విజయదశమి పర్వదినాలలో కొన్నివేలమందికి ఇప్పటికి అన్నప్రసాద వితరణ చేస్తూనే ఉన్నారు శ్రీగురుదేవులు. ప్రారంభించిన ముహూర్త బలమో వారి సంకల్పమో గాని అప్పటి నుండి అన్ని కులాలవారు అనేక పర్వదినాలను పురస్కరించుకొని అన్నదానాలను అధికంగా చేస్తూ కులమత విభేదాలు పాటించకుండా అందరూ ఐకమత్యంతో ఉంటున్నారు. శ్రీగురుదేవులు 18 సంవత్సరములు నిత్యాగ్ని హోత్రాన్ని నిర్వర్తిస్తూ విశ్వంలోని జనులందరూ విద్యావంతులు కావాలని ఆశిస్తారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతూ సుజను లందరూ సుఖశాంతులతో జీవించాలని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు ప్రతిరోజు సంకల్పిస్తుంటారు.

**మూల్పూరు వీరారెడ్డి**
**వేజెండ్ల**

# 8. శ్రేష్ఠమైనది మానవజన్మ

అన్ని జన్మలకన్నా అతిశ్రేష్ఠమైనది మానవజన్మ యని పెద్దలంటారు. విజ్ఞానవంతమైనది మానవజన్మ ఎన్నెన్నో సుఖాలు, భోగాలు, భాగ్యాలు అనుభవించడానికి ఎంతైనా అవకాశం కలిగినది, కనుకనే దేవుళ్లు, దేవతలు సైతం మానవులుగా జన్మించి, అందలి సుఖ, దుఃఖాలను అనుభవించటానికి, మానవ రూపంలో అవతరించటానికి కుతూహల పడుతుంటారని, అనుభవజ్ఞులైన ఋషీశ్వరులు అన్నట్లు తెలుస్తున్నది. లోకంలో నివశించే సకల జీవులలోకి సర్వశ్రేష్ఠమైన జీవులు మానవులే. ఆలోచనాశక్తి విచక్షణా జ్ఞానం కలిగి ఉన్నటువంటి ఈ మానవజన్మలో పుట్టిన తరువాత, మరి ఏ ఇతర రూపాలలోనూ పుట్టకూడదని, అనగా ఇతర ప్రాణుల రూపంలో జన్మించకూడదని మానవులు ఆలోచించాలి. ఎందుకంటే పక్షులు, జంతువులు, క్రిమికీటకాదులు, మొదలైన వాటి బ్రతుకులు ఎలా ఉంటాయో మనందరికీ తెలిసినదే. ఈ విషయం మనం అందరం గమనిస్తూనే ఉన్నాం. ఇలాంటి జన్మలు రావటానికి కారణం, అవి వాటి పూర్వజన్మలలో చేసిన ఘోర తప్పిదాలే. కనుక, మానవులు వారి ఆలోచనలు ప్రవర్తనలు, మంచి మార్గంలో లేకపోవటం వలన, అనేక రకాల జీవుల రూపంలో పుట్టవలసి వస్తుంది, అంటున్నారు మన పూర్వులు. అయితే మానవజన్మలో చేసిన అనేక తప్పులవలన ఇతర జంతువులు, పక్షుల రూపంలో జన్మించినా, ఆ మొదటి జన్మలో పుణ్యక్షేత్రాలవద్ద నిద్రిస్తూ పుణ్యతీర్థాల వద్దా జీవిస్తూ, కారణజన్ములు నివశించే పవిత్ర స్థలాలలో సంచరిస్తూ, ఆ మహాత్ములు చెప్పే అమృతతుల్యమైన వాక్కులను వింటూ ఆ ఆదిపరాశక్తినిగాని లేదా ఆ దేవి అనేక రూపాలలో ఏదో ఒక రూపాన్ని వేడుకున్నా పూజించి అర్చించినా, వెనువెంటనే ఆ జన్మనుంచి మరలా మానవజన్మకు మార్గం సుగమం చేస్తూ, మానవజన్మను పొందే అవకాశాన్ని ఆ దేవి ప్రసాదిస్తుందని, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు అంటున్నారు.

అతిశ్రేష్ఠమైన మానవజన్మ వచ్చిన తరువాత, అనగా మానవునిగా పుట్టిన తరువాత, తదుపరి జన్మలో, మరి ఏ ఇతర ప్రాణుల రూపంలో జన్మించకుండా ఉండేటట్లు, నడుచుకోవలసిన చూసుకోవలసిన బాధ్యత ఎవరికి వారిదే. ఎందుకంటే మంచి శక్తియుక్తులతో జ్ఞానము పొందే అవకాశం, అదృష్టం ఒక్క మానవజన్మకు

మాత్రమే ఉన్నది. ఏలననగా మంచి చెడు, ధర్మము, అధర్మము, న్యాయము-అన్యాయము మొదలగునవి తెలుసుకొని మసలుకోగలిగే విచక్షణాశక్తి ఒక్క మానవజన్మకే ఉన్న వరం. మరి ఏ ఇతర ప్రాణులకు ఇవన్నీ తెలియవు. వాటికి అలాంటి జ్ఞానశక్తి లేదని తెలుస్తుంది. కేవలం మానవజన్మకు మాత్రమే అన్నీ తెలుసుకునే శక్తియుక్తులు ఉంటాయి. మానవులు జ్ఞానవిజ్ఞానులై పరమపదాన్ని పొందే అవకాశం కేవలం మానవజన్మకు మాత్రమే ఉన్నదని పెద్దలు, విజ్ఞానులు అయినవారు అనుభవ పూర్వకంగా తెలియచేశారు. ఒక్కసారి మానవజన్మ నుంచి, ఇతర జన్మలలోకి, వేరే జంతువులు లేదా జీవుల రూపంలోనికి వెళితే, తదుపరి మరి కొన్ని జన్మలవరకూ మానవజన్మ లభ్యం కాదని తెలుస్తుంది. ఆ జన్మలూ అనేక విధాలుగా వేర్వేరు పక్షులు, జంతువులు, క్రిమికీటకాలు మొదలుగా గల ఎన్నో రూపాలలోనూ పుట్టవలసి వస్తుంది. కనుక ఈ మానవజన్మకుండే పవిత్రతను, గొప్పదనాన్ని, మానవజన్మలను ప్రసాదించే శ్రీ ఆదిపరాశక్తి యొక్క మహిమలను, ఈ క్రింది శ్లోకంలో శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తూ, ఆ ఆదిపరాశక్తి యొక్క అనుగ్రహాన్ని పొందినవారే అదృష్టవంతులు మరియు భాగ్యవంతులు అంటున్నారు శ్రీ గురుదేవులు.

**శ్లో॥ అనేకానేక జన్మానంతర సుశ్రేష్ఠ నరజన్మ ప్రదాత్రి దేవి ! ఆదిశక్తే !**
**సప్తజన్మానేక పుణ్యకార్యాచరణ సుభక్తానుగ్రహమూర్తే ! సకలేశ్వరి !**
**దశకోటి జనైక ద్విభక్త ప్రసాదిత చరణ సంసేవనాదృష్ట సంపదే !**
**త్వద్రూపారాధనాదృష్ట భావసుజన సంపోషిణి ! సదాపాలికే! సంరక్షిణి!**

పై శ్లోకంలో శ్రీగురుదేవులు ఇలా తెలియచేస్తున్నారు. ఒకవేళ వారి కర్మలను బట్టి కొన్ని జన్మలు ఇతర జీవుల రూపంలో జన్మించి, అవి పూర్తి అయిన తరువాత మరలా తిరిగి మానవజన్మను ప్రసాదించవలసినది, ప్రసాదించేది కూడా ఆ తల్లి శ్రీ ఆదిపరాశక్తే నంటూ, మానవజన్మ వచ్చినప్పుడే, ఆ తల్లి ప్రసాదించిన మానవదేహాన్ని బుద్ధిని జ్ఞానాన్ని వినియోగించి, శ్రీ ఆదిపరాశక్తిని, ఆ తల్లి స్వరూపాలను పూజించి, ఆరాధించి, ఆ తల్లిలోనే ఐక్యం కావటానికి ఎల్లవేళలా ప్రయత్నాన్ని కొనసాగించమని అలాంటి మహాభాగ్యాన్ని పొందటానికి అర్హులు ఎవరో తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

మానవులుగా పుట్టి వరుసగా ఏడు జన్మలలో మంచి పరోపకారమైన పుణ్యకార్యాలను చేస్తున్న మంచి భక్తులను తప్పక అనుగ్రహిస్తుంది, దేవి శ్రీ ఆదిపరాశక్తి. అంతటికీ మూలమైన ఆ తల్లి, పదికోట్లమంది జనులలో, ఏ ఒకరికో, ఇద్దరికో, ఆ దేవి పాదపద్మాలను పూజించి సేవించే భాగ్యాన్ని, మంచి సంపదగా వారికి ప్రసాదిస్తుంది. అనేక రూపాలతో అవతరించే శ్రీ ఆదిపరాశక్తిని ఆమె రూపాలలో ఏ రూపాన్ని నమ్మి ఆరాధించినా ఆ తల్లి భక్తుల కోరికలను, అభీష్టాలను తీర్చుతుంది. ఎందుకంటే అన్ని రూపాలూ ఆ తల్లివే కనుక, ఏ రూపంలో ఆరాధించినా మానవులు మంచి మార్గంలో నడుస్తూ ధన్యులు కావాలని అమ్మవారు సంకల్పిస్తూ ఉంటారు. అయితే మానవులు, ఆ తల్లిని ఆరాధించటమే మహాభాగ్యమని భావించిన సజ్జనులను, ఆ తల్లి, జగన్మాత సదా పోషిస్తూ, మంచి భక్తులను, అన్నివేళలా పాలిస్తూ, వారిని సర్వకాల సర్వావస్థల యందూ రక్షిస్తుంది ఆ జగన్మాత. ఆత్మస్వరూపిణియైన అద్వైతామృతమూర్తి శ్రీ ఆదిపరాశక్తియే నని, ఆ తల్లినే శరణువేడి మానవ జీవితాలను సార్ధకం చేసుకోవాలని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, అందరికీ తెలియచేస్తూ, అమ్మను ఆరాధించేటప్పుడు, కుటుంబ సమేతంగా అందరూ కలసిగాని లేదా భార్యాభర్తలు ఇద్దరూ, భక్తిశ్రద్ధలతో ఆరాధించటం వలన వారు అమోఘమైన, అక్షయ, శుభఫలితాలను పొందవచ్చు అంటున్నారు శ్రీ గురుదేవులు. అలాగే త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులను, దంపతులుగా అంటే బ్రహ్మ సరస్వతి, విష్ణు లక్ష్మి, శివపార్వతులు, వీరిని విడదీయకుండ దంపతులుగా ఆరాధిస్తే అమోఘమైన శుభఫలితాలు పొందవచ్చు అని అంటున్నారు శ్రీ గురుదేవులు.

# 9. తపోభూమి శ్రీ వేజెండ్లపురము

సీ॥ నా జన్మభూమియౌ నవ్యవేజెండ్లకు
దివ్యాత్మ విభులును ధీరమతులు
గురుయోగి మునులార్యులరుదైన ఘనులెల్ల
కదలివచ్చుచు నుంద్రు కలియుగాన
ఆధ్యాత్మికాంబుధి ఆనంద నిలయమ్ము
వహ్ని యజ్ఞములెన్నొ వరలజేయ
అన్నసంతర్పణల్ అమితమ్ముగాజేయు
అమరులు విహరించు ఆర్యభూమి

తే॥ పరశురామ అగస్త్యాది పరమఋషులు
పూర్ణతపములు చేసిన పుణ్యభూమి
నేడు ఆనంద నిలయమై వేడుకగుచు
విదిత వేజెండ్ల పురమున వెలుగుచుండె

తా॥ శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారి కంఠం నుండి, ఎప్పుడు, ఎటువంటి కనకామృత వాక్కులు వెలువడుతాయో ఎవరూ ఊహించలేరు. వారు పై పద్యంలో ఏమంటున్నారో మీరే చూడండి. శ్రీగురుదేవులు జన్మించిన పుణ్యభూమియైన శ్రీ వేజెండ్ల గ్రామానికి, ఆత్మజ్ఞానులైన ఆధ్యాత్మిక ప్రభువులు, ధైర్యవంతులు, జగద్గురువులు, యోగులు అనగా ఆత్మతత్త్వాలను అనుభవంతో తెలుసుకున్నవారు, మునులు అంటే మౌన యోగాలను ఆచరిస్తూ మునులుగా పిలువబడేవారు, పెద్దలైనవారు, ఋషులలో ఘనులైనటువంటి పుణ్యాత్ములు, సాక్షాత్ దైవసమానులైన పీఠాధిపతులు, స్వామీజీలు ఎందరో ఈ వేజెండ్ల గ్రామానికి, కలియుగం ఉన్నంతవరకూ కదలి వస్తూనే ఉంటారని చెబుతూ, ఈ వేజెండ్ల గ్రామంలో ఉన్న శ్రీవరకాళీమాత ఆలయం, శ్రీ గురు ఆనంద నిలయాలు, ఆధ్యాత్మిక సాగరాలని అంటే ఆధ్యాత్మిక విషయాలకు సముద్రాలని తెలియచేస్తున్నారు.

సముద్రంలో అంతులేని నీరు ఉన్నట్లే ఇక్కడ, సముద్రాన్ని తలపించే ఆధ్యాత్మికత ఉన్నదని తెలియచేశారు. మరియు, ఇక్కడ అగ్ని సంబంధమైన, పలువిధాలైన యజ్ఞాలు ఎన్నో అభివృద్ధి చెందుతాయని, దానికి తోడు అనేకమైన అన్నదాన కార్యక్రమాలు అద్భుతమైన రీతిలో జరుగుతాయని తెలియచేస్తున్నారు. ఇంతవరకూ ఇలాంటివి ఎన్నో కార్యక్రమాలు జరిగినవి. ఇక ముందు కూడా ఏ విధమైన ఆటంకాలు లేకుండా ఇవి జరుగుతాయని శ్రీగురుదేవులు తెలియ చేస్తున్నారు. అంతేకాక శ్రీ గురు ఆనంద నిలయానికి ఎందరో దివ్యపురుషులు, పూజ్యులు, దేవతలు కూడా వచ్చి వెళుతూ ఉంటారని, కొందరి భక్తుల అనుభవాల ద్వారా తెలుస్తున్నది.

ఈనాడు వేజెండ్ల పురంలో శ్రీశ్రీశ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి పీఠంలో శ్రీవరకాళీ మాత ఆలయానికి ఎదురుగా వెలుగొందుతున్న ఆనంద నిలయం ఎంతో ప్రశస్తమైంది. ఈ పుణ్యభూమి మహర్షులకు నిలయమై తపోనిలయంగా ప్రసిద్ధి పొందింది. ఈ నేలమీద విశిష్టమైన వట వృక్షం కింద సాక్షాత్తు విష్ణుమూర్తి అవతారమైన పరశురాముడు, సప్తర్షులలో అగ్రగణ్యుడైన అగస్త్యుడు తపసు చేసినట్లు తెలుస్తున్నది. కాలపరిణామంలో ఈ ప్రాంతం సాధారణ ప్రదేశంగా ఉండి ప్రస్తుతం వేదవిహిత కార్యకలాపాలకు ఆలవాలమై అలరారుతోంది. నిరంతర యజ్ఞకార్య నిర్వహణలతో అన్న సంతర్పణలతో ఈ ప్రదేశం పావనమవుతున్నది. సకల శుభాలను ప్రసాదించే స్వర్ణసీమగా నుతులనందుకొంటున్నది. అందుకే ఈ ప్రదేశం వేజెండ్ల పురంలో ఈనాడు శ్రీగురు ఆనంద నిలయమని అందరిచేత ప్రశంసించబడుతున్నది.

**సీ॥ తాపమ్ము తొలగించి తనియించు శ్రీగురు**
**ఆనంద నిలయమ్ము అద్భుతముగ**
**మాధుర్య భావాలు మదిగూర్చు శ్రీగురు**
**ఆనంద నిలయమ్ము అద్భుతముగ**
**సమచిత్తములతోడ సాగించు శ్రీగురు**
**ఆనంద నిలయమ్ము అద్భుతముగ**
**విజ్ఞాన దీపముల్ వెలిగించు శ్రీగురు**
**ఆనంద నిలయమ్ము అద్భుతముగ**

**తే. సకల సంతోష కారణసారభూమి**
**కాలగమనమ్ము మరపించు క్రమభూమి**
**వేల సిరులిచ్చి వేజెండ్ల వెలుగుచున్న**
**స్థలము శ్రీగురు ఆనంద నిలయమిదియె.**

తా॥ శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠములో నెలకొన్న శ్రీగురు ఆనంద నిలయం సకల తాపాలను తొలగించి సంతోషాన్ని చేకూర్చుతుంది. మనసులో మధురమైన భావాలు కలిగించే మహత్తర తపోవాటిక శ్రీగురు ఆనంద నిలయం. సమస్త ప్రజానీకానికి సమత్వబుద్ధిని ప్రసాదిస్తుంది. విజ్ఞానమనే దీపాల్ని వెలిగించి అజ్ఞానపు చీకట్లను పారదోలుతుంది. అన్ని విధములైన సంతోష నిధులకు నిలయమై ప్రకాశించే పుణ్యభూమి శ్రీగురు ఆనంద నిలయం. ఈ పురాణ పుణ్యభూమి కాలగమనాన్ని మరపిస్తుంది. మురిపిస్తుంది. అసంఖ్యాకమైన అద్భుతమైన సంపదలను ప్రసాదిస్తూ వేలకాంతులతో వేజెండ్లపురంలో వెలుగొందుతున్న విఖ్యాత స్థలం శ్రీగురు ఆనంద నిలయం. ఆనందాన్ని మించిన సంపద లేదు. ఎన్ని భౌతిక సంపదలున్నా ఆనందం లేకపోతే ఆ సంపదల వల్ల సాధించే ప్రయోజనం శూన్యం. ఆనంద రహితులైన అత్యంత ధనవంతుల కంటే ఆనంద నిలయులైన నిరుపేదలే బహుభాగ్యవంతులు. ఆనందం మనోమాలిన్యాన్ని ప్రక్షాళనం చేస్తుంది. దుఃఖాన్ని, శోకాన్ని తొలగించి సుఖ సంతోషాలతో కూడిన బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తుంది.

# 10. పన్నెండు సంవత్సరాల వయసు పరిపూర్ణం పరాశక్తి శ్రీకాళీమాత దర్శన భాగ్యం

అన్నీ తెలిసినా ఆత్మజ్ఞానులు ఏమీ తెలియనట్లే ఉంటారు, మహాత్ములు. అలాంటివారే దివ్యపురుషులు. అలాంటి కారణజన్ములు, వారికి తెలిసిన దేవ రహస్యాలను తొందరపడి అందరికీ చెప్పరు. చెప్పవలసిన సమయం ఆసన్నమైనప్పుడు, వారికి లభించిన దివ్యదర్శన విశేషాలను మరియు వారు పొందిన దివ్యానుభూతులను, వారు తెలుసుకొన్న కాలచక్రమర్మాలను, అర్హులైన భక్తులకు మరియు శిష్యులకు మాత్రమే తెలియచేస్తుంటారు. అలాంటి మహనీయులు, కారణ జన్ములు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు. వారి జీవితానుభవాలను, కాలచక్రమర్మాలను, వారు, కొన్నింటిని నాకు తెలియచేశారు. వారు చెప్పిన రహస్యాలలో ఇది ఒక నిగూఢమైన మహాగొప్ప మర్మం. శ్రీగురుదేవులకు పన్నెండు (12) సంవత్సరాల వయసు నిండిన రోజున అనగా, ది. 25-8-1978వ సంవత్సరంలో లభించిన శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి శ్రీవరకాళీ మాత దర్శనభాగ్య మర్మాలను, అంటే 34- ముప్పై నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన రహస్యాన్ని తెలియచేస్తూ, శ్రీగురుదేవులకు శ్రీవరకాళీమాత ఏ సంవత్సరంలో, ఏ మాసంలో, ఏ రోజున, ఏ తిథిలో, ఏ నక్షత్రంలో, ఏ లగ్నంలో రాత్రివేళ శ్రీకాళీమాత కనిపించారో, ఆ దైవ రహస్యాన్ని శ్రీగురుదేవులు ఈ విధంగా తెలియచేస్తున్నారు.

శ్రీవరకాళీమాత శ్రీగురుదేవులకు ప్రస్తుతానికి జరుగుతున్న ఈ జన్మలో, రాబోయే జీవిత కాలంలో, జరుగబోవు అనేక మర్మాలను శ్రీకాళీమాత తెలియచేసినట్లు, మంచి శుభ సంవత్సరంలో శ్రీకాళీమాత వారిని అనుగ్రహించిన దంటూ, అంటే శ్రీకాలయుక్తి నామ సంవత్సరంలో, శ్రావణ మాసంలో, బహుళ అష్టమి (శ్రీకృష్ణ జన్మాష్టమి) శుక్రవారము, రోహిణీ నక్షత్రము మిథునలగ్నములో, రాత్రి సమయంలో ప్రత్యక్షంగా వారిని ఆశీర్వదించి, వారికి మంచి దర్శన భాగాన్ని ప్రసాదించిన తల్లి శ్రీకాళీమాత అన్నారు.

కాలయుక్తి - కాల అనగా సమయము, యుక్తి అనగా తెలుసుకోవటము. అంటే కాలచక్రంలో జరిగిపోయినవి, జరుగుతున్నవి, అలాగే జరుగబోయే వాటిని

తెలుసుకోవటం అని అర్ధమవుతుంది. అందుకేనేమో శ్రీవరకాళీమాత ఆ సంవత్సరంలో అనగా, ది. 25-8-1978వ సంవత్సరం, శ్రీకాలయుక్తినామ సంవత్సరంలో శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారికి, పన్నెండు-12 సంవత్సరాల వయసు పరిపూర్తి అయిన శుభదినమున, శ్రీ గురుదేవులు పుట్టిన రోహిణీ నక్షత్రంలో, శ్రీగురుదేవులు పుట్టిన మిధునలగ్నంలోనే, శ్రీవరకాళీ అమ్మవారు దర్శనభాగ్యం ఇచ్చినట్లుగా, శ్రీగురుదేవులు ఈ క్రింది శ్లోకంలో తెలియచేస్తున్నారు, చదవండి.

**శ్లో॥ మమ ద్వాదశవత్సర పరిపూర్ణ శుభదినానుగ్రహమూర్తే ! శ్రీకాళి !**
**శ్రీకాలయుక్తినామ సంవత్సర శ్రావణ బహుళాష్టమీ భృగువాసరే**
**రోహిణీనక్షత్ర మిధునలగ్న నిశీధికాల ప్రత్యక్షానందదాయిని !**
**మమ వర్తమానజన్మభావి జీవనకాల మర్మప్రబోధిని ! శ్రీకాళి !**

... అంటూ పై శ్లోకంలో ఎంతో కాలంగా వారి మనసులోనే గోప్యంగా ఉన్న మంచి మర్మాన్ని నాకు తెలియచేశారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు.

# 11. శ్రీ ఆదిపరాశక్తి
# కాళీ మాతావిర్భావ కాలమర్మం

శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు కారణ జన్ములు. సాధకోన్నతోన్నత, మహోత్తమోత్తమోన్నత దివ్యపురుషులు శ్రీ గురుదేవులు. వారు రాత్రి చివరిజాములో నిద్ర మేల్కొన్నది మొదలు, మళ్లీ రాత్రి పడుకునే వరకూ, ఉదయకాల, జప ధ్యాన, పూజలు, పూర్తి చేసుకొని తరువాత, శ్రీవరకాళీమాత, శ్రీ గాయత్రీ మాత, శ్రీ లలితామాత, శ్రీ భువనేశ్వరీ మాత, శ్రీచక్ర మేరువు ప్రతిష్ఠించి యున్న శ్రీకాళీమాత గర్భాలయంలో గాని, శ్రీ సంతానబాల వేంకటేశ్వరస్వామి వారి గర్భాలయంలో గాని, భూగర్భ సమాధిలో ఉన్న శ్రీచక్రంపై గాని, లో సమాధిలో అనగా, భూగర్భంలో ఉన్న యోగసమాధిలో గాని, శ్రీ గురు ఆనంద నిలయంలో ఉన్న కదంబవృక్షం, వటవృక్షం, అశ్వత్థ ప్లక్ష, ఉదుంబర వృక్షాల క్రింద గాని, కూర్చొని, మంత్రజప, ధ్యాన యోగాలనాచరిస్తూ ఉంటారు. ఆ సమయంలో శ్రీగురుదేవులకు, అద్భుతమైన అనుభూతులు కలిగి, వారు, అనేక పద్యాలను ఇంకా మహోన్నత శ్లోకాలను, కాలచక్రమర్మాలను కూడా వ్రాస్తూ ఉంటారని తెలుస్తున్నది. ఆక్రమంలోనే శ్రీ వేజెండ్ల పురములో ఉన్న భూగర్భ సమాధిలో శ్రీగురుదేవులు యోగమాచరిస్తున్న కాలంలో, వారు ఎన్నో ఆశ్చర్యకరమైన అనుభూతులు పొందుతూ, అనేకానేక దేవతా స్వరూపాలను ఇంకా ఎన్నో దృశ్యాలను చూస్తూ ఉంటారని తెలుస్తున్నది. అలాంటి అనుభూతులు, అనుభవాలలో ఇది ఒక ఆశ్చర్యకరమైన అనుభూతి అంటున్నారు, శ్రీగురుదేవులు. శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి శ్రీకాళీమాత, పదిచేతులలో ఆయుధాలు కలిగిన రూపంతో, మొట్టమొదటిసారిగా ఎన్నివేల కోట్ల సంవత్సరాల క్రితం ఆవిర్భవించినది, ఏ సంవత్సరంలో, ఏ మాసంలో, ఏ తిథిలో, ఏ రోజున, ఏ నక్షత్రంలో, ఏ లగ్నంలో, పదిచేతులతో, సకల లోకాలూ ఆశ్చర్యపోయే రూపంతో అవతరించిందో తెలియచేస్తూ శ్రీ ఆదిపరాశక్తి అన్ని లోకాలకు మేలు చేకూర్చటానికి, అసుర సంహారం కోసం అవతరించిన శ్రీ ఆదిపరాశక్తి అమ్మవారు, సర్వమానవ, దేవగణాలకూ, అభయమిచ్చి, ఆనందాన్ని

ప్రసాదించిన శ్రీకాళీమాతను గురించి, ఆ తల్లి, ఆవిర్భావ కాలమర్మాన్ని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, అత్యంత నిగూఢమైన రహస్యాన్ని ఈ క్రింది శ్లోకంలో ఏ విధంగా తెలియచేస్తున్నారో మీరే చూడండి.

**శ్లో॥ శ్రీవేజెండ్లపురపీఠ భూగర్భసమాధియోగ కాలాద్భుతానుభూతి ప్రదాత్రి! కాళి!**
**(5184) చతురశీత్యుత్తర శతోత్తర పంచ సహస్రకోటివత్సర మర్మ సందర్శనకారిణి !**
**శ్రీవిజయనామ సంవత్సర చైత్ర శుక్ల ప్రతిపత్ యుగాది ప్రాతఃకాల జయవాసరే!**
**రోహిణీ నక్షత్ర కుంభలగ్నకాల దశభుజావతారోద్భవమూర్తే! శ్రీమద్గురుకాళి! 1**

... అంటూ పై శ్లోకంలో, పవిత్రమైన పరమాద్భుత రహస్యాన్ని, ఇప్పటివరకు, ఎవ్వరూ తెలియచెప్పని, మహాగొప్ప మర్మాలను, ఈ కలియుగంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, శ్రీవరకాళీమాత అనుగ్రహంతో, అద్భుతమైన, ఎన్నెన్నో మర్మాలను మనకు తెలియచేస్తున్నారు. అలాగే శ్రీ గురుదేవులు వేజెండ్ల పురంలో ఉన్న భూగర్భ సమాధిలో, యోగమాచరిస్తున్న సమయంలో, వారికి ఎంతో ఆశ్చర్యకరమైన దివ్యానుభూతిని శ్రీకాళీమాత ప్రసాదించినది, అంటూ 5184 ఐదువేల నూట ఎనభై నాలుగు కోట్ల సంవత్సరాల క్రితం, శ్రీకాళీమాత ఆవిర్భవించిన మర్మాన్ని తెలుసుకోవటానికి, ప్రధాన కారణం, శ్రీకాళీమాత అనుగ్రహమే నంటూ, ఆ తల్లి శ్రీకాళీమాత, 5184 కోట్ల సంవత్సరాల క్రితం, శ్రీ విజయనామ సంవత్సరంలో, చైత్రమాసంలో, శుక్లపక్షంలో, పాడ్యమి, ఉగాది రోజున ఉదయ కాలంలో శుభకరమైన మంగళవారం రోజున, రోహిణీ నక్షత్రంలో, కుంభలగ్నంలో పదిచేతులతో, వరాలనిచ్చే తల్లి, శ్రీవరకాళీమాతగా ఆవిర్భవించినదంటూ తెలియ చేస్తున్నారు, శ్రీగురుదేవులు. అలాగే మన పూర్వఋషులు కూడా మనకు కొంతవరకు కాలచక్ర మర్మాలను, వాటి స్థితిగతులను తెలియచేసినట్లు కనిపిస్తుంది. అయితే శ్రీకాళీమాతను గురించి, ఏ ఒక్క కవి, గురు, ఋషి, యోగి మునులు కూడా పరిపూర్ణంగా తెలుసుకొని, మన భావితరాలకు తెలియజేసినట్లు కనిపించుటలేదు. శ్రీగురుదేవులు ఏమంటున్నారంటే, అసలు కవులు ఎంతోమంది ఉండవచ్చు, ఎన్నెన్నో మంచి కవితలు వ్రాయవచ్చు. కాని, కాలచక్రమర్మాలను తెలుసుకొని కవిత్వాలను

వ్రాయటం అనేది, ఎంతో సాహసంతో కూడుకొని యున్న బహు గొప్ప సాధన. అది ఒక మహోన్నతమైన విద్య. అది ఒక దివ్యవరం, అంటూ అసలు కవి అంటే క్రాంతి దర్శి అన్నారు శ్రీగురుదేవులు. అంటే, గతించిపోయిన కాలాన్ని సైతం, తెలుసుకొని, ఆ కాలంలో జరిగిపోయిన వాటిని, రాబోవు కాలంలో జరుగబోయే వాటిని, చూసి తెలుసుకోవటం ఎంతో మహాగొప్ప అదృష్టం, అంటూ, పూర్వకాలాన్ని, భావికాలాన్ని, తెలుసుకోవటం వలన, వర్తమాన కాలంలో, అంటే ఇప్పుడు జరుగుతున్న కాలంలో, ఈ జన్మలో అన్ని జాగ్రత్తలూ తీసుకుంటూ, మంచి దివ్యమైన మార్గాలను నిర్దేశించుకొని, మానవజన్మను ధన్యం చేసుకోవచ్చునని, మహత్తర మర్మాన్ని తెలియ చేస్తున్నారు, శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు.

# 12. శ్రీ ఆది పరాశక్తి మూలమంత్రములు

**1) ఓం ఆం శ్రీం హ్రీం క్లీం శ్రీ ఆదిపరాశక్త్యై నమః**

**2) ఓం ఆం ఈం ఊం ఋూం ఔం ఙ్లూం హ్రైం హ్రీం క్లీం శ్రీం ఆద్యంత శక్త్యై నమః**

శ్రీ వేజెండ్లపురవాసులు, శ్రీచక్ర స్థిరనివాసులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, పైన తెలిపిన రెండు మహామంత్రాలను, నూతనంగా సృష్టి కావించినారు. మొదటిది చతుర్దశ బీజాక్షర మహామంత్రము, రెండోది అష్టాదశ బీజాక్షర మహామంత్రము. ఈ రెండు మహామంత్రాలకూ అధిదేవత శ్రీ ఆదిపరాశక్తి. ఈ మహామంత్రాలను శ్రీ గురుదేవులు స్వయంగా, మరియు వారి శిష్యులతో కలసి సాధన చేసి ఎన్నో మహత్తర ఫలితాలను సాధించారు. ఈ మహామంత్రాల సాధన వలన లభించే ఫలితాలను శ్రీగురుదేవులు ఈ క్రింది విధంగా తెలియచేస్తున్నారు. ఈ మహామంత్రాల జప సాధకులకు, వారు చేసే జప తపాదులను సిద్ధింప చేస్తూ వారికి ప్రకృతివలన ఆవహించే సమస్త మాయామోహాలనూ తొలగించి సాధకులను సంరక్షిస్తుంది. అలాగే శరీరాంతర్గతమై యున్న ఇంద్రియాలపై విజయాలను ప్రసాదిస్తూ సాధకులకు జగన్మోహనత్వాన్ని ఇస్తూ, సాధకుల నోటివెంట సత్యవాక్యాలను మాత్రమే పలికిస్తూ మంచివారితో మైత్రిని చేయిస్తూ, మంచిగా ఆలోచిస్తూ, మంచి మార్గంలో నడిచేటట్లు చేస్తూ ఉంటుంది. అదే విధంగా దుర్మార్గులను, దుష్టశక్తులను, విషసర్పాలను, ఇంకా సాధకులకు హాని కలిగించే అనేక జంతుజలాలను సాధకుల దరి చేరకుండా దూరంగా వెళ్లగొట్టి సాధకులకు సదా మేలు చేస్తుంది. అంతేకాక విధివశముచే కలిగే అనేక ఆపదలను, అవమానములను తొలగించి, ఆశ్చర్యకరమైన అభివృద్ధిని సాధించే శక్తిని సాధకులకు ప్రసాదిస్తుంది. అదే విధంగా శీఘ్రమే సాధకులకు ఎన్నెన్నో శుభ ఫలితాలను ప్రసాదిస్తూ, వారి శారీరక, మానసిక వ్యాధులను, దుఃఖాలను, శోకాలను, వార్ధక్యంలో వచ్చే బాధలను పోగొట్టి, వారికి సుఖశాంత జీవనాన్ని ప్రసాదిస్తుంది. ఇంకా సర్వకార్య సిద్ధిని ప్రాప్తింపచేస్తూ, సాధకులకున్న అన్ని మంచి కోరికలను నెరవేర్చుతూ, వారికి వాక్కు పటుత్వ శక్తిని ప్రసాదించి, సాధకులు, అన్నివేళలా అందరికీ మేలు చేయాలనే మంచి బుద్ధిని

పెంపొందిస్తుంది. అలాగే సాధకుల నోటివెంట అద్భుతమైన దివ్య వాక్యాలను ఉద్భవింపచేస్తూ, వారిని అఖండ విద్యాసంపన్నులను చేస్తుంది. సాధకులను స్త్రీ పురుష బేధం లేకుండా ఎవరినైనా సరే, సరస్వతీ బ్రహ్మ సమానులను చేస్తూ, అధికశక్తిమంతులను చేసి, వారిని సర్వ సమర్థులుగా చేస్తుంది. సాధకులను సర్వకాల సర్వావస్థలయందూ సంరక్షిస్తూ, సకల సంపదలను, సమస్త సౌభాగ్యాలను ప్రసాదిస్తూ, ధీమంతులను చేస్తూ వారికి దీర్ఘాయువును మరియు తదుపరి జన్మరాహిత్యాన్ని ఇస్తుంది. శ్రీ ఆది పరాశక్తి సృష్ఠికి పూర్వం నుంచీ ఉన్నది, ఈ సృష్టి అంతమై పోయిన తరువాత కూడా ఉండే ఏకైక శక్తి, ఆద్యంత మూర్తి. శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి సకల జగాలకూ సర్వేశ్వరి అనగా తల్లి, సకల జీవులకూ ప్రాణాధారమైన పరమాద్భుతమూర్తి, శ్రీశక్తి స్వరూపిణి, శ్రీమద్గురుమాత అంటూ శ్రీ ఆదిపరాశక్తి ఎన్నో అద్భుత విషయాలను, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు సృష్టించిన మహామంత్రాల యొక్క మహత్తర శక్తులను గురించి వివరించారు.

# 13. శ్రీవాణీబ్రహ్మ లక్ష్మీవిష్ణు పార్వతీ పరమేశ్వర దివ్య దంపతుల సృష్టి రహస్యం

**శ్లో॥ ఆదిపరాశక్తేః అద్భుతసునయన పద్మప్రభవాః త్రిమూర్తయః పత్నీసమన్వితాః**
**వామనేత్రోద్భవే వాణీ చ లక్ష్మీః దక్షిణాక్షిభవౌ ధాతా విష్ణు శ్చ సృష్టిస్థితికరౌ!**
**ఫాలనేత్రోద్భవౌ పార్వతీశ్వరౌ దేవతా ఏతా దదతు భక్తేభ్య శ్శుభపరంపరాః!**
**వేంకట కాళీకృష్ణేన మయా స్పష్ట మవలోకితం ధ్యానసమాధా వేతద్రహస్యకమ్!**

త్రిమూర్తయః = బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు అను దేవతలు ముగ్గురు, పత్నీసమన్వితాః = వాణి, లక్ష్మి, పార్వతి అను తమ భార్యలతో సహా, ఆదిపరాశక్తేః = సమస్తమైన సృష్టికి ముందు అనగా ఏదీ లేని సమయములో అన్నింటి కంటే మొట్టమొదట, సర్వోత్కృష్టమయిన, శక్తిస్వరూపిణి యొక్క, అద్భుత = ఆశ్చర్యము కలిగించు, సునయనపద్మ = తామరపూవు వలే విశాలమై, మనోహరమైన కనుల నుండి, ప్రభవాః = జన్మించిరి. వాణీ = సరస్వతీదేవి, లక్ష్మీః చ = లక్ష్మీదేవియును, వామనేత్ర ఉద్భవే = ఆదిపరాశక్తి యొక్క ఎడమకంటి నుండి పుట్టిరి. సృష్టి స్థితి కరౌ = లోకములను సృష్టించుట, దానిని రక్షించుట అను కర్మలను చేయునట్టి, ధాతా = బ్రహ్మ, విష్ణుః చ = నారాయణుడును, దక్షిణ అక్షి భవౌ = ఆదిపరాశక్తి యొక్క కుడికంటి నుండి జన్మించిరి. పార్వతీశ్వరౌ = పార్వతియును పరమేశ్వరుడును, ఫాలనేత్ర ఉద్భవౌ = నుదుట నున్న మూడవకంటి నుండి పుట్టిరి. ఏతాః = ఈ, దేవతాః = దేవతలు, భక్తేభ్యః = భక్తులకు, శుభపరంపరాః = శుభములను నిరంతరముగా, దదతు = ఇత్తురు గాక. వేంకట కాళీ కృష్ణేన = వేంకట కాళీ కృష్ణుడు అను, మయా = నా చేత, ఏతద్ రహస్యకం = గూఢమైన ఈ అంశము, ధ్యానసమాధౌ = భగవతిని ధ్యానించుటలో ఏర్పడిన సమాధి స్థితియందు, స్పష్టం = స్పష్టముగా, అవలోకితమ్ = కనుగొనబడినది.

ఈ విశ్వంలో ఎందరో మహర్షులు వారివారి అమోఘమైన తపశ్శక్తి ద్వారా పూర్వకాలంలో జరిగిపోయినవి. అనగా పూర్వయుగాలలో జరిగిన వాటిని, ఈ యుగంలో జరిగే వాటిని, అలాగే రాబోయే యుగాలలో జరుగబోయే వాటిని, అన్నిటినీ వారి యోగశక్తితో దివ్యదృష్టి ద్వారా తెలుసుకొని, వాటిని మానవజాతికి అందించిన అతివిలువైన అమర సంపదలు, అనేక విధాలైన అమృతాక్షరములతో కూడియున్న అక్షయ నిధులు, ఆధ్యాత్మిక గ్రంథాలు. ఎన్నో వందల వేల, లక్షల,

కోట్ల సంవత్సరాల క్రితం జరిగిన వాటిని తెలుసుకొని, చూసి చెప్పగలిగే గొప్పశక్తి, యుక్తి సంపద, శ్రేష్ఠులైన మానవులకు మాత్రమే ఉన్నది. మానవజన్మలో దైవాన్ని ఆరాధిస్తే మానవులు మహనీయులై మహర్షులై ఈ మహాకాల చక్రంలో జరిగిపోయిన వాటిని, ఇప్పుడు జరుగుతున్న వాటిని, ఇక ముందు జరుగబోయే వాటిని మనకు తెలియచేస్తూ మన అభివృద్ధికి కారణమౌతారు. మానవులందరిలో దివ్యశక్తి (ఆత్మ) ప్రాణరూపంలో ఉంటుంది. అందులో కొందరు మాత్రమే వారి భక్తిశ్రద్ధలను పెంచుకొని, ఆరాధనా భావాన్ని మంచి ఆలోచనను అభివృద్ధి చేసుకుంటూ, నిరంతర కృషి పట్టుదలతో శ్రీ ఆదిపరాశక్తి కృపకు పాత్రులవుతారు. అలాంటి వారికే సృష్టి, స్థితి, లయ మర్మాలు తెలుస్తాయి. అలాంటి మాన్యులైన మహనీయులు, తపశ్శక్తి సంపన్నులు అయిన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్‌గారు, భూగర్భ సమాధిలో ఎన్నో సంవత్సరాల నుంచి ఒక్కొక్క పర్యాయం సమయం తెలియని విధంగా తపస్సు చేస్తూ, శ్రీచక్రంపై కూర్చొని మంత్రజప ధ్యానాలు చేస్తూ, శేషపాన్పుపై యోగాన్ని ఆచరిస్తూ 18 (పదునెనిమిది) సంవత్సరాల కాలంపాటు నిత్యాగ్ని హోత్రాన్ని, పరమానందంగా, పట్టుదలతో నిర్వహించిన నిగర్వి, నిరాడంబరులు శ్రీగురుదేవులు. శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠాధీశులు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు సృష్టి, స్థితి, లయ కార్యాలను నిర్వహించే, సత్త్వరజస్తమోగుణాలు కలిగిన దివ్యదంపతులయిన బ్రహ్మ సరస్వతి, విష్ణు లక్ష్మి శివపార్వతుల పుట్టుక గురించి, అంటే వారి జన్మరహస్యం గురించి తెలియచేస్తూ, శ్రీ ఆదిపరాశక్తి మూలమంత్రములను అలాగే త్రిమూర్తులయిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, త్రిశక్తులైన సరస్వతి, లక్ష్మి, పార్వతీ మాతల మహామంత్రాన్ని, వారు తమ తపశ్శక్తిని వినియోగించి, అనుభవం ద్వారా కొన్ని అక్షరాలను మిళితం చేసి, ఆ మంత్రాల శక్తి మహిమలను, వారి జన్మ రహస్యాలను ఈ క్రింది విధంగా తెలియచేస్తున్నారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు.

**ఆదిపరాశక్తి అద్భుతనయన**<br>
**పద్మాలనుండియే ప్రభవించినారు**<br>
**వామనేత్రోద్భవల్ వాణియు లక్ష్మి**<br>
**దక్షిణాక్షిభవులు ధాత విష్ణువులు**<br>
**ఫాలనేత్రోద్భవుల్ పార్వతీశ్వరులు**<br>
**ఈదివ్య దంపతులిత్తు శుభములు.**

# 14. శ్రీ దివ్య దంపతుల మూలమంత్రం

**ఓం సం సరస్వతీ లం లక్ష్మీ ప్రాం పార్వతి**

**బ్రం బ్రహ్మ విం విష్ణు మం మహేశ్వరేభ్యో నమః**

.... అంటూ తెలియచేశారు. శ్రీ గురుదేవులు ఏమంటున్నారో మీరే చూడండి. ఈ విశ్వసృష్టి, స్థితి, లయలకు అంతటికీ మూలకారణమైన శక్తి, దేవి, శ్రేష్ఠమైన తల్లి శ్రీ ఆదిపరాశక్తి యొక్క కన్నులు ఎంతో ఆశ్చర్యకరంగా ఉంటాయి. ఆ దేవిని తెలుసుకొని, చూసిన వారికి మాత్రమే ఆ దివ్యనేత్రాల గొప్పదనం తెలుస్తుంది. అలాంటి నేత్రాల నుండి పుట్టినవారే ఈ దివ్య దంపతులు, శ్రీ బ్రహ్మ సరస్వతీదేవి, శ్రీ విష్ణు లక్ష్మీదేవి, శ్రీ శివ పార్వతులు. వీరి జననం ఎలా జరిగిందో, ఆ మర్మాన్ని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు, వారు యోగసమాధిలో ఉన్నప్పుడు దర్శించిన ఎన్నో అద్భుత, మహత్తర దృశ్యాలలో, ఈ దివ్య దంపతుల గురించి, వారి జన్మరహస్యాలను గురించి ఈ విధంగా తెలియచేస్తున్నారు.

'వామనేత్రోద్భవుల్ వాణియు లక్ష్మి' అంటే ఆ దేవియొక్క ఎడమకంటి నుంచి పుట్టినవారు శ్రీ సరస్వతీదేవి మరియు శ్రీ లక్ష్మీమాతలు. అలాగే 'దక్షిణాక్షి భవులు ధాత విష్ణువులు' అన్నారు. అనగా బ్రహ్మవిష్ణువులు శ్రీ ఆదిపరాశక్తి కుడివైపు కన్ను నుంచి జన్మించినారని, శ్రీ గురుదేవులు తెలియచేస్తూ, 'ఫాలనేత్రోద్భవుల్ పార్వతీశ్వరులు' అన్నారు. అనగా శ్రీ ఆదిపరాశక్తి ఫాలభాగంలో నున్న మూడవనేత్రం నుంచి పుట్టినవారు శివపార్వతులు అని అన్నారు. అందుకేనేమో స్త్రీలకు, పురుషులు కుడివైపున, పురుషులకు స్త్రీలను ఎడమవైపున ఉంచి వివాహాలలో, శుభకార్యాలు జరిపించేటప్పుడు ఈ ఆచారాన్ని, సాంప్రదాయంగా చేస్తూ వస్తున్నారు. కంకణధారణ కూడా పురుషులకు కుడిచేయి, స్త్రీలకు ఎడమచేయిని ఎంచుకొని చేస్తారు. మూడవనేత్రం, అదే అగ్నినేత్రం, అదే అమృతనేత్రం. ఈ నేత్రం నుంచి పుట్టినవారు శివపార్వతులు. వీరిద్దరూ మహాశక్తిమంతులు. వీరిద్దరూ ఒకే నేత్రం నుంచి పుట్టుటవలన వీరికి ఆశ్చర్యకరమైన శక్తులు పుట్టుకతోనే వచ్చాయి. వీరిద్దరికీ సగం స్త్రీ రూపం, సగం పురుష రూపంతో కనుపించే వరాలు కూడా అనగా అర్ధనారీశ్వర రూపంతో దర్శనమిస్తూ, దేవలోకాలను కూడా ఆశ్చర్యపరిచే అద్భుత మహిమలు

పుట్టుకనుంచే పొందారు. అని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తూ, ఇంకా ఏమంటున్నారంటే, ఈ విధంగా నేత్రాల నుంచి పుట్టిన శ్రేష్ఠదంపతులు – మంచి భక్తులకు, ఆర్తులకు, అనేక విధాలుగా మంచిశక్తిని, మంచి మనసును, మంచి బుద్ధిని, మంచి గుణాలను, మంచి విద్యలను, ఇంకా ఎన్నెన్నో అనేక విధాలైన శుభసంపదలను, వారిని ఆరాధించి, వారి అనుగ్రహం పొందిన వారికి ప్రసాదిస్తారు, అంటూ అలాగే కులమత భేదాలు చూడకుండా అనుగ్రహిస్తూ, దేవలోకంలోనూ, మానవలోకంలోను ఇలవేల్పులై ఆరాధించబడే అమృత స్వరూపులు ఈ దివ్య దంపతులు అంటున్నారు శ్రీగురుదేవులు. భక్తుల అర్హతలను బట్టి అన్నీ ఇచ్చే శ్రేష్ఠమైన దంపతులు వీరేనంటూ తెలియచేస్తూ, వీరికి అనేక శక్తులను, వరాలను ఇచ్చిన తల్లి శ్రీ ఆదిపరాశక్తి. అమ్మవారు అద్భుతామృత నేత్రాలతోనే అన్నీ చేయగల అమేయశక్తి సంపదలుగల మహిమాన్వితురాలు అన్నారు శ్రీ గురుదేవులు. అప్పుడు నాకు ఒక సందేహం వచ్చి శ్రీగురుదేవులను ఈ విధంగా అడిగాను. అయ్యా ... బ్రహ్మ విష్ణు మహేశ్వరులు మరియు సరస్వతి, లక్ష్మి, పార్వతులు ఎలా పెరిగి పెద్దవారైనారు, వారిని ఎవరు పెంచి పెద్దవారిని చేశారు, వారి బాల్యవిశేషాలు ఎలాంటివి, అనే విషయాలను తెలియచేయమని ప్రార్థించాను. అప్పుడు శ్రీగురుదేవులు ఈ విధంగా తెలియచేశారు. శ్రీ ఆదిపరాశక్తి నేత్రాలనుంచి అమృతం వర్షించి, అప్పుడే పుట్టిన వారిని, చూస్తుండగానే, అప్పటికప్పుడే, క్షణాలలో వారిని పెద్దవారిని చేసి, వారికి కావలసిన మహిమాన్విత శక్తులనిచ్చి, వారిని సర్వ సమర్థులుగా చేసి, వారి వారి కర్తవ్యాలను బోధించి, వారిని ఆనందపరచి, అన్ని యుగాలలో అందరిచేతా ఆరాధించబడుతూ ఉండమని ఆశీర్వదించిన తల్లి శ్రీ ఆదిపరాశక్తి. ఆ తల్లి ప్రసాదించిన శక్తుల ఫలితంగానే శ్రీ సరస్వతీదేవి అందరికీ చదువులనూ ఇంక అనేక విద్యలనూ ఇస్తుంది. బ్రహ్మ–సరస్వతీదేవి ఇచ్చిన విద్యలను అభివృద్ధి చేస్తూ విజ్ఞానాన్ని కల్గిస్తూ సృష్టిని సాగిస్తుంటాడు. శ్రీలక్ష్మీదేవి అన్ని విధములైన సంపదలనూ భోగభాగ్యాలనూ ఇస్తే, వాటిని అనుభవించటానికి అనుకూలతను ఇస్తూ వాటిని అభివృద్ధి చేస్తూ, పోషణకర్తగా అందరికీ ఆరాధ్యదైవమై శ్రీమహావిష్ణు భగవానుడు ఉంటాడు. తన భక్తులకు సంతృప్తిని ప్రసాదించి, వైరాగ్యా భావాలను వృద్ధి చేస్తాడు. పార్వతీదేవి జీవులకు ప్రాణాధారశక్తిగా నిలిచి వారి మనుగడకు అవసరమైన సకల శుభాలనూ, సౌభాగ్యాలను సమకూర్చుతుంది.

భక్తులకు కావలసిన అన్ని శక్తియుక్తులను అన్నివేళలా ప్రసాదించే తల్లి శ్రీ పార్వతీమాత శివుడు వీటన్నింటినీ తనలో ఐక్యం చేసుకునే పరమశక్తిగా లయకారకుడుగా ఉంటాడు. మానవులలో అధములైన వారు ఈ విషయాలను తెలుసుకోలేరు. ఈ ముగ్గురు మూర్తులకున్న మహిమాన్విత శక్తుల వలన, అన్ని యుగాలలో, అనేక రూపాలతో, అనేక పేర్లతో భక్తులచేత ఆరాధించబడుతూ ఇలవేల్పులుగా ఉన్నారు. అమ్మవారు శ్రీ ఆదిపరాశక్తి అనుగ్రహించి వారికిచ్చిన వరాలు ఎన్నో ఉన్నాయి, అంటూ శ్రీ గురుదేవులు తెలియచేస్తూ, ఈ మర్మాలన్నీ తెలియాలంటే, తెలుసుకోవాలంటే ఎంతో తపశ్శక్తి కావాలి, అని అన్నారు. ఈ లోకంలో ఎవరికైనా ఎప్పుడైనా, ఏవైనా కష్టాలు వచ్చినపుడు, పెద్దవారి వద్దకు వెళ్లి వినయంగా చెప్పుకోవటం అనాదిగా వస్తున్న ఆచారం. ఇప్పుడు కూడా మనం చూస్తూనే ఉన్నాం. అయితే మనందరి కష్టాలు తొలగించి మన కోర్కెలు తీర్చే దేవతలకే కష్టాలు వస్తే వారు వెళ్లి పెద్దవారైన బ్రహ్మతోను, విష్ణువుతోను, మహేశ్వరునితోను చెప్పుకొని వారి బాధలను తీర్చుమని, వారు వేడుకొంటారు. అయితే కొన్ని కొన్ని సమయాలలో సృష్టి, స్థితి, లయకారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు కూడా కష్టాలు వస్తాయి. అలా వచ్చినపుడు వారు కూడా శ్రీ ఆదిపరాశక్తిని వినయంతో ప్రార్థిస్తారు. వారి ప్రార్థనలకు దేవి కరుణించి అనేక రూపాలతో ఎన్నోమార్లు అవతరిస్తూ ఉంటుంది. అన్ని అవతారాలలోకెల్లా అతిగొప్ప అవతారం శ్రీకాళీమాత అవతారమే. ఈ అవతార విశేషాలను అందరూ తెలుసుకోలేరు. దుష్టులైన రాక్షసులను హతమార్చి, సకల లోకాలకూ మేలు చేకూర్చే అద్భుతమైన, పరిపూర్ణమైన అవతారం శ్రీకాళీమాత అవతారమే. దేవగణాలను రక్షించి, వారికి విజయాలను ప్రసాదించిన పరమాద్భుత శక్తి స్వరూపిణి శ్రీకాళీమాత. బ్రహ్మ విష్ణు శివులు, ఇంకా ఇతర దేవతల ప్రార్థనలకు అమ్మ కరుణించి శిష్టులను రక్షించి కాపాడటానికే శ్రీ ఆదిపరాశక్తి, శ్రీకాళీమాత రూపాన్ని ధరించింది. ఆ అద్భుత రూపాన్ని చూసే భాగ్యం బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు, ఇంకా కొంతమంది దేవతలకు మాత్రమే కలిగింది. ఆ తల్లి శ్రీకాళీమాతను చూసి తరించే అదృష్టం కొంతమంది రాక్షసులకు కూడా కలిగింది. ఎలాగంటే కొంతమంది రాక్షసులు తపస్సంపన్నులైనా, వారు చేసిన దుష్టకార్యాలకు అమ్మవారి చేతిలో మరణించే ముందు, ఆ తల్లిని చూసిన భాగ్యం వలన రాక్షసులు కూడా అదృష్టవంతులైనారు. అయితే మానవులలో శ్రేష్ఠులైన స్త్రీ పురుషులలో, శ్రీ ఆదిపరాశక్తి శ్రీ కాళీమాతను పూజించి, సేవించే భాగ్యం ఎన్నో కోట్లమంది

మానవులలో ఏ ఒకరిద్దరికో, లేదా కొంతమంది పుణ్యాత్ములైన దంపతులకు మాత్రమే ఆ అమ్మను పూజించి సేవించే భాగ్యం లభిస్తుందని శ్రీగురుదేవులు తెలియచేస్తున్నారు. అలా లభించిన వారే ఈ పుడమిపై అదృష్టవంతులు, మహాభాగ్యవంతులు. అలాంటి అదృష్టం లభించిన వారినే కారణజన్ములు అంటారు. శ్రీకాళీమాత భక్తులు ఎంతో అదృష్టవంతులు. ఎందుకంటే ఆ దేవి బ్రహ్మ సరస్వతి, విష్ణు లక్ష్మి, శివపార్వతులచేత, ఇంకా ఇతర దేవతల చేత ఆరాధించబడే తల్లి శ్రీ ఆదిపరాశక్తి అని అంటుండగానే నేను కల్పించుకొని, గురుదేవా! పార్వతీదేవి హిమవంతుని పుత్రిక అని అంటారు కదా ! మరి మీరు అమ్మవారి ఫాలనేత్రం నుంచి పార్వతీదేవి పుట్టింది అన్నారేమిటి అన్నాను. దానికి శ్రీగురుదేవులు నవ్వుతూ మనం మన ఇలవేల్పుల పేర్లు, మన పూర్వీకుల పేర్లు, మన పిల్లలకు పెట్టుకున్నట్లుగానే, హిమవంతుడు కూడా వారి ఇలవేల్పు పార్వతీదేవి కావటం వలన ఆమెకు పార్వతి అని పేరు పెట్టుకున్నార్లే' ... అంటూ సమాధానమిచ్చారు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. వారు తెలియచేసే ఎన్నో గోప్యమైన రహస్యాలను తెలుసుకోవాలంటే వారి దర్శన భాగ్యం లభించినా వారి అనుగ్రహం కలగనిదే, ఎవరైనా పదేపదేవారి దగ్గరకు వెళ్ళలేరన్నది సత్యం. వారు ప్రబోధించే ప్రవచనాలను వినాలంటే శ్రీకాళీమాత కృప కలగాలి. శ్రీకాళీమాత జ్ఞానపుత్రులైన శ్రీగురుదేవుల అనుగ్రహం లభిస్తేనే ఎవరైన శ్రీకాళీమాతను, శ్రీగురుదేవులను, మళ్ళీ మళ్ళీ దరించుకునే భాగ్యాన్ని పొందగలుగుతారు, ఇది నా స్వానుభవము.

## అందరిచేత ఆరాధించబడే అమర దంపతులు

అన్ని యుగాలలో అన్ని కాలాలలో, అందరిచేతా పూజలందుకుంటూ కీర్తింపబడుతున్న అమర దంపతులు. శ్రీ సరస్వతీబ్రహ్మ, శ్రీలక్ష్మి విష్ణువు మరియు పార్వతీ పరమేశ్వరులు. వీరు సాక్షాత్తూ అమ్మవారి ఆజ్ఞానుసారం సృష్టి, స్థితి, లయలకు సాక్షులుగా ఉన్నారు. అందుచేత వీరి పేర్లలోని మొదటి అక్షరాన్ని మంత్ర బీజాక్షరంగా మలచి, వాటి విశిష్టమైన మహిమలను తెలియచేస్తున్నారు, శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. ఈ మంత్ర బీజాక్షరాల మహిమలు ఎలా ఉంటాయో, వాటి జప ఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయో, అందరికీ వీటిని అందుబాటులోనికి తీసుకొని రావాలనే శుభసంకల్పంతో, అమ్మ శ్రీకాళీమాత ఆదేశానుసారం శ్రీ గురుదేవులు ఈ క్రింది విధంగా పొందుపరిచారు.

**మూలమంత్రము :**

**ఓం సం సరస్వతీ లం లక్ష్మీ ప్రాం పార్వతీ**
**బ్రం బ్రహ్మ విం విష్ణు మం మహేశ్వరేభ్యో నమః**

## ఓంకారము

ఓంకారము అనే మంత్ర బీజాక్షరము సాక్షాత్తూ జ్యోతి స్వరూపమని అంటారు. అనగా సాధకులకు, వారి జీవితాలను వెలుగుల మయం చేస్తుంది. సాధారణంగా మానవులలో ఉండే చంచలమైన స్వభావాలను, అనగా దేనికైనా స్థిరమైన నిర్ణయాలను తీసుకోలేరు. అలాంటి పరిస్థితులను అధిగమించే స్థిరమైన మనస్సును ప్రసాదిస్తుంది. అలాగే మనశ్శాంతిని ప్రసాదిస్తూ దేవతానుగ్రహం పొందటానికి చాలా తోడ్పడుతుందని, మహాశక్తిమంతమైనదని కూడా అంటారు. ఎందరో అనుభవజ్ఞులు ఈ 'ఓం'కారం మోక్షాన్ని ప్రసాదిస్తుందని, శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తమ అమృతవాక్కుల ద్వారా తెలియచేస్తున్నారు.

## సం-సరస్వతీనామ బీజాక్షరము

సం–కారము సరస్వతీ బీజాక్షరము. ఇది సమ్మోహనశక్తి కలిగిన అద్భుత మంత్రాక్షరము. ఈ మంత్రాక్షర జపంవలన సాధకులు, ఇతరులను తమ వాక్ చాతుర్యము, విద్య, వినయముల వలన లభించిన జ్ఞానశక్తిని, సభాముఖంగాగాని లేదా పలుసందర్భాలలో ఇతరుల ముందుకు గాని తీసుకెళ్లినపుడు, సాధకులకున్న అద్భుతశక్తికి, వారు అచ్చెరు వొందుతారు. ఒకవిధమైన ఆకర్షణశక్తికి లోనవుతారు. మంచి ఆకర్షణను, ఆకర్షణీయమైన చక్కని రూపాన్ని, ఉన్నతమైన విద్యలను, మహోన్నతమైన భాషలను, వాటిపై అద్భుతమైన పట్టును, పాండిత్య ప్రకర్షను, జ్ఞాన విజ్ఞానములతో కూడిన ఘనమైన కీర్తిసంపదలను, అన్నికాలాలకు అనుగుణంగా నిలిచి ఉండే అక్షర సంపదలను ప్రసాదిస్తుంది. అంతేకాక ఇతరులతో పలువిషయాలు మాట్లాడుతూ చర్చించే సమయంలో, విషయాలు ప్రక్కదారి పట్టకుండా, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తూ సంభాషణలు చేసే శక్తిని ప్రసాదిస్తుంది. అదే విధంగా కవిత్వానికి శక్తిని నింపే అమృతాక్షర నిధులను వృద్ధిచేస్తూ, సాధకులకు అనర్గళంగా ప్రవాహంవలె సాగిపోయే ఆశుకవితాశక్తిని మరియు అద్భుతమైన సకల విద్యలను ఈ 'సం'కార బీజాక్షర మంత్రం ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

## లం-లక్ష్మీనామ బీజాక్షరము

ఈ 'లం'కార బీజాక్షర మంత్రాన్ని భూబీజమని, లక్ష్మీబీజాక్షరమని చెప్పవచ్చు. ఇది స్తంభనశక్తి కలిగిన మంత్రాక్షరము. ఈ బీజాక్షర మంత్రం, సాధకులలో ఉండే దుష్టభావాలను, దుర్గుణాలను, చెడు ఆలోచనలను, దుఃఖాలను, శోకాలను, పూర్వజన్మ కర్మల ఫలితంగా పుట్టుకనుంచే వచ్చే దారిద్ర్యమును సాధకులు లేదా తన పూర్వీకులు చేసిన అనేక పాపకర్మలవలన వచ్చే అనేక చెడుఫలితాలను, సాధకులదరి చేరకుండా స్తంభింపచేస్తూ, వాటిని పోగొట్టి, అందుకు బదులుగా వారికి ఎన్నో శుభకరమైన మంచి ఫలితాలను సాధకులకు ప్రసాదిస్తుంది. వీటితోపాటు అనేకమైన శాశ్వత భోగాలను, ఐశ్వర్యాలను ఇస్తూ వాటిని ఇంకా అభివృద్ధి చేస్తూ, వారి యొక్క అన్ని మంచి కోరికలనూ తీర్చే అక్షయ కల్పవృక్షము వంటిది, ఈ 'లం'కార బీజాక్షర మంత్రం. అంటారు శ్రీ గురుదేవులు.

## ప్రాం - పార్వతీనామ బీజాక్షరము

'ప్రాం'–కారము, ఇది పార్వతీమాత బీజాక్షర మంత్రము. ఈ ఏకాక్షర మంత్రం ఎంతో శక్తిమంతమైనది మరియు మహిమాన్వితమైనది. సాధకులకు వారి ప్రారబ్ధం వలన సంక్రమించే అన్ని విధాలైన పాపాలను దోషాలను అనేక ఇబ్బందులను అనేక ఆటంకాలను తొలగిస్తుంది. ప్రకృతిలో కలిమాయ వలన వచ్చే అనేక వికృతమైన, అసహజమైన, నీతి బాహ్యమైన, ధర్మబద్ధంగా లేని చెడు భావాలను పోగొడుతూ, సాధకులకు, వారి దుఃఖాలకు కారణమైన బాధలను వారే స్వయంగా తెలుసుకొని, వాటిని వారే పోగొట్టుకొనే శక్తియుక్తులను ప్రసాదిస్తూ సమస్యలనుంచి తప్పుకోగలిగిన నేర్పును, తెలివితేటలను సాధకులకు ప్రసాదిస్తుంది. అదే విధంగా ఈ 'ప్రాం'కార బీజాక్షరం సాధకులకు మంచి జ్ఞాన విజ్ఞాన శక్తిని, కలకాలం నిలిచి ఉండే అనేక ఆశ్చర్యకరమైన శక్తులను ఏ సమయానికి ఎటువంటి శక్తి అవసరమో ఆ శక్తిని అర్హులైన భక్తులకు ప్రసాదిస్తూ వారికి దీర్ఘకాలం ఉండే జ్ఞాపకశక్తిని, విమలకీర్తిని, ఉన్నతమైన యోగభోగాలను ప్రసాదించగలిగే మహిమాన్వితశక్తి కలిగినది ఈ 'ప్రాం'కార బీజాక్షర మంత్రము. అంటారు శ్రీగురుదేవులు.

## ‘బ్రం’ - బ్రహ్మనామ బీజాక్షరము

ఈ ‘బ్రం’కార మంత్రాక్షరానికి, త్రిమూర్తులు అనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అధిపతులు. ఈ ‘బ్రం’కార మంత్రాక్షరము సాధకులకు శారీరకమైన మరియు మానసికమైన సర్వరోగాలనూ పోగొడుతుంది. మరియు సాధకులకు ఏకాగ్రతను పెంచుతూ వారు చేసే సాధనలను మరింత అభివృద్ధి చేస్తూ, వారి తపస్సులను సిద్ధింపచేస్తుంది. అలాగే మోక్షాన్ని సాధించాలనే కాంక్షను, పట్టుదలను వృద్ధి చేస్తూ, సత్యమార్గంలో నడిచే విధంగా నిర్దేశిస్తూ, వారికి బ్రహ్మజ్ఞానాన్ని ప్రసాదించి వారిని బ్రహ్మర్షులుగా, బ్రహ్మ సమానులుగా చేస్తూ, సాధకులకు గొప్ప సహనశక్తిని ప్రసాదించి, వారు బ్రహ్మానందమయ జీవితాన్ని గడిపే బహుశక్తి, యుక్తి, బలములను ప్రసాదిస్తుంది, ఈ ‘బ్రం’కార బీజాక్షర మంత్రం. అంటారు శ్రీ గురుదేవులు.

## ‘విం’ విష్ణునామ బీజాక్షరము

ఈ ‘విం’కారం, చాల గొప్ప మహిమాన్వితశక్తి కలిగిన బీజాక్షరము. ఈ ‘విం’కార బీజాక్షరానికి అధిపతి శ్రీ విష్ణు భగవానుడు. ఈ ‘విం’కార మంత్ర సాధన వలన సాధకులకు వినయము, విధేయత, ఓర్పు సహనం, సమకూరుతాయి. ఈ మంత్రాక్షరం సాధకులను అన్ని విధాలుగా పోషిస్తూ వారిలో సౌమ్యమైన సుగుణాలను పెంపొందిస్తూ, వారికి శ్రేష్ఠమైన మనసు, పరులను ఆదరించే మరియు గౌరవించే మంచి బుద్ధిని, మహోన్నతమైన భావాలను, ఎలాంటి పరిస్థితులలోనైనా నిగ్రహంతో ఉండే శక్తిని ప్రసాదిస్తుంది. అదే విధంగా నిరంతరము మరియు ఎల్లకాలము నిలిచి వుండే నిజమైన శక్తియుక్తులను ప్రసాదిస్తూ ఆ సాధకులకు జీవితాంతంవరకు సువిశాల హృదయాన్ని, సుశీలతను, అనగా పరువు ప్రతిష్ఠలను సదా సంవృద్ధి చేస్తుంది. మరియు ప్రశాంతమైన జీవితాన్నిచ్చి అధికమైన తృప్తిని వైరాగ్యాన్ని ప్రసాదిస్తుంది, ఈ ‘విం’కార బీజాక్షర మంత్రం. అంటారు శ్రీగురుదేవులు.

## ‘మం’ మహేశ్వరనామ బీజాక్షరము

ఈ ‘మం’కార బీజాక్షరానికి అధిపతి మహేశ్వరుడు. ఈ ‘మం’కార మంత్రాక్షరం సాధకులకు అకాల మృత్యువును తొలగించి, లెక్కించటానికి వీలు కానన్ని క్లేశాలను, అనగా అనేక కష్టాలను పోగొడుతూ, సాధకుల యొక్క ఆలోచనా విధానాలను మార్చి వారికి దీర్ఘాయువును ప్రసాదిస్తుంది. అలాగే ఈ ‘మం’కార

బీజాక్షర మంత్రం సాధకులను ధీమంతులుగా చేసి వారికి అవసరమైన అనేక సంపదలను ఇస్తూ అన్ని అధికారాలను ఇచ్చి, ప్రజ్ఞావంతులుగా చేసి, వారికి పరిపాలనా శక్తిని ప్రసాదిస్తుంది. మానవ జన్మలను సార్ధకం చేసుకునే మంచి మార్గాలను దర్శించే దివ్యదృష్టిని ప్రసాదించి, సాధకులచేత మంచి పనులను చేయిస్తూ, వారికి మహాశాంతిని ప్రసాదిస్తుంది. మానవులకు మరణకాలం సమీపించినపుడు, ఆ సాధకుల ప్రాణశక్తిని, అనగా ఆత్మను తనలో ఐక్యం చేసుకొనే అద్భుతశక్తి కలిగినది, ఈ 'మం'కార మంత్రాక్షరం. అంటే సాధకులను, పరమాత్మ తనలో ఐక్యం చేసుకుంటాడన్న మాట. అదే మోక్షం. దానిని అందుకోవాలని ఎందరో, తమ శక్తి కొలది సాధనలద్వారా ప్రయత్నిస్తుంటారు. కాని, ఏ కొందరికో ఆ కైవల్య భాగ్యాన్ని అందుకునే అవకాశం కలుగుతుంది. ఇంత మహిమ కలిగినది ఈ 'మం'కార మంత్ర బీజాక్షరం. అందుకే ప్రతిఒక్కరూ ప్రకృతిలో జీవిస్తున్న మానవులు అందరూ పఠించగలిగినది ఈ మహామంత్రం. అంటారు శ్రీగురుదేవులు.

**ఓం సం సరస్వతీ లం లక్ష్మీ ప్రాం పార్వతీ**

**బ్రం బ్రహ్మ విం విష్ణు మం మహేశ్వరేభ్యో నమః**

# 15. శ్రీవరకాళీ దివ్యామృత పద్య రత్నాలు

## ద్విపదలు

1. వరకాళి గాయత్రి వరదహస్తాల
భువనేశ్వరి మాత పూజ్య శ్రీలలిత

వేంచేసి యున్నట్టి వేజెండ్లలోన
నే చదివినవిద్య నిజముగా తెలుప

ఐదు తరగతుల అభ్యాసమయ్యె
శ్రేష్ఠమౌయజ్ఞాల శ్రీశక్తి మహిమ

నాద్వార చూపించె నవ్యలీలలను
వేజెండ్లపురమందు వేలఆటలను

ఆడించె గురుకాళి అద్భుతరీతి
రమ్యమౌరచనముల్ వ్రాయింపజేసె

మధురమౌమంత్రముల్ మననమ్ము జేసి
మాత కాళి వరముల్ మరి ఎన్నొ పొంది

భూగర్భమందున భూరియోగములు
ఆచరించినయట్టి ఆత్మవిభుడను

నేను నిమిత్తుడన్ నేర్పు కాళికది
అక్షయశుభమిచ్చు అమ్మ దీవెనలు

ఆనందజీవన మనునిత్యమంది
ప్రవచనల్ గావించు పరమఘనుండ

కరుణ దయలు పెంచు కాళికృష్ణుడను
వేదనల్ తొలగించు వేజెండ్ల గురుడ

2.సీ॥ వివిధవిద్యలయందు విజ్ఞానఘనులార
భవ్యమై వెలుగు దివ్యాత్ములార
పరమశ్రేష్ఠులయిన పండితోత్తములార
తప్పులెన్నని సుతత్త్వజ్ఞులార
వాదభేదము లేని వాత్సల్యమతులార
పరమార్థమున్ గను ప్రథితులార
సుగుణబుద్ధులు గల్గు సురవరసములార
పరులమేలును కోరు ప్రాజ్ఞులార
స్త్రీపురుషులయిన సిద్ధాత్మజనులార
మహితాత్ములైనట్టి మనుజులార

తే॥ సతము అధ్యాత్మమార్గాన సాగుచున్న
ధర గృహస్థుడనై వెల్గు వరగురుండ
ఇంద్రియాలను గెల్చినఈశ్వరుండ
దివ్యతపసులు చేసిన ధీరగురుడ
బ్రహ్మదర్శనప్రాప్తిని బడసినట్టి
సిద్ధపురుషుడనైన సుసిద్ధగురుడ
యాగకార్యమ్ము లొనరించుయతిని నేను
అమ్మ వరకాళి దీక్షతో నలరుచున్న
విదితయశమున్న వేజెండ్లవిభుడ నేను
తృష్ణ దీర్చు వేంకటకాళికృష్ణ నేను

3.సీ॥ విశ్వమంతయు శాంతి విస్తరించుటకును
మాతృప్రేమను పెంచి మహిళలెల్ల
వారిలోపల గల్గు వాస్తవశక్తులన్
గ్రహియించి వర్తించు కాంతలెల్ల
కలియుగమ్మున వారు ఘనముగా వెల్గుచు
సర్వకార్యమ్ములన్ సలపగలరు
అవని నెపుడు స్త్రీలు అధికులై యుండంగ
విశ్వమంతట శుభముల్ వెలయుచుండు
అక్షయాహారముల్ అవలీలగా వచ్చి
సర్వుల క్షుద్బాధ చల్లబడును

ఆ॥ పూర్వపుణ్యముననుఁ భూరిశక్తులు గల్గ
దివ్యమహిమ లమర భవ్యముగను
ప్రవచనములు చేయు పరమాత్మలమ్మలు
కాళికృష్ణ వాక్కు కనకసమము

తా॥ ఈ ప్రపంచమంతా శాంతిమయం చేయటానికి స్త్రీలందరూ మాతృప్రేమలను వృద్ధి చేయటం శుభపరిణామం. మాతృప్రేమలో స్వార్థం ఉండదు. నిజాయితీనే కన్పిస్తుంది. అందుచేత స్త్రీలు తమలో దాగి ఉన్న నిజమైన శక్తియుక్తులను తెలుసుకొని తద్వారా వారు ఎన్నెన్నో ఘనకార్యాలను సాధించగలరని లోకానికి తెలియ చేయగలరు. స్త్రీ శక్తి స్వరూపిణి, సర్వశక్తులకూ మూలమైనది అంటారు. వారిలో శక్తికి కొదవ ఉండదు. చేయవలసిందల్లా వారిలో అంతర్గతంగా దాగి ఉన్న శక్తిని వెలికి తీయగల ప్రజ్ఞాపాటవాలను సంతరించుకోగల నేర్పు వారి సొంతం కావాలి. ఈ కలియుగంలో వారు గొప్పగా ప్రవర్తిస్తూ ప్రపంచంలో వారు ఏదయినా సాధించగలరు అనే భావనలో ఉండాలి. ఈ భువిలో ఎల్లప్పుడు స్త్రీలు అన్ని రంగాలలో అధికులుగా వున్నప్పుడే విశ్వమంతట శుభము వర్ధిల్లుతూ వుంటుంది. ఫలితంగా అందరి ఆకలి బాధలు తప్పక తీరి వారి బాధలు ఉపశమిస్తాయి. ప్రపంచంలో

ఎవరు ఏమి చేసినా ఏమి సాధించినా చివరకు క్షుద్బాధ తీర్చుకోవలసిందే. అలాగే పూర్వజన్మలలోని పుణ్యకర్మల వలన, ప్రస్తుత జన్మలో అవి, అద్భుతమైన దివ్య శక్తులు పొందటానికి, అద్భుతమైన మహిమలను ప్రదర్శించగలిగే శక్తులను సాధించటానికి దోహదపడతాయి. అలాంటి పుణ్యఫలితాలవలన ఈరోజులలో స్త్రీలు అద్భుతంగా ప్రవచనాలు చేస్తున్నారు. దివ్యశక్తులను సాధించి అద్భుతమైన తపస్సంపన్నులుగా అలరారుతున్నారు అంటూ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు పై పద్యంలో తెలియచేస్తూ తమ వాక్కు బంగారు వాక్కు అంటూ సెలవిస్తున్నారు.

**4.సీ॥ అమ్మ అనెడి పల్కు ఆదిగా జన్మలో**
**పలికించె ఆశక్తి ప్రాభవముగ**
**కాళిమాతను నేను కలియుగాన నెపుడు**
**దర్శించుచుందును ధరణిలోన**
**అన్నికాలములందు నక్షయమౌరీతి**
**అర్చించు నాశక్తి నంతరాన**
**ప్రాణమున్న వరకు ప్రార్థింతు మనసులో**
**కాళి ఆజ్ఞవలన కదలుచుందు**

**ఆ॥ అనుభవాలనెన్నొ అధ్యాత్మవిద్యలో**
**అద్భుతముగ చూపు అమ్మకాళి**
**నన్ను కదలజేయు నవ్యపరాశక్తి**
**లాలనమ్ము చేసి లలిత కాళి !**

తా॥ వేజెండ్ల పీఠాధీశులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు, తమ బాల్యం నుంచి, శ్రీకాళీమాత అమ్మవారు ఏ విధంగా ఆదరించిందీ ఈ సీసపద్యంలో తెలియ జేస్తున్నారు. బాల్యం అంటే ఊహ తెలియని స్థితి. జ్ఞానం లేని వయసు. తప్పటడుగులు వేస్తూ వచ్చీ రాని మాటలతో ఏదో చెప్పాలనే ప్రయత్నం చేస్తుంటారు. లే లేత మొక్కలాంటి శరీరం. ఆ ప్రాయం నుంచే, పిల్లలు ఏది

చెప్పినా వెంటనే నేర్చుకునే శక్తి కలిగి ఉంటారు. తగిన మంచి బుద్ధులు, నడవడిక ఈ స్థాయి నుంచే నేర్పించటం వలన వారికి మనోవికాసం కలుగుతుంది. తమకు మొట్టమొదటసారిగా బాల్యంలో 'అమ్మ' అని పలికించిన తల్లి శ్రీకాళీమాత అమ్మవారేనని, 'అమ్మ' పలుకు పలకడానికి అవసరమైన శక్తినిచ్చింది కూడా ఆ తల్లేనని, అమ్మా అనే నామాన్ని అత్యంత వైభవోపేతంగా ఉండేటట్లు తమకు మదిలో ఉద్భోధించింది కూడా శ్రీకాళీమాత అమ్మవారేనని తెలియచేస్తూ, ఈ భూమి మీద తాము ఉన్నంత కాలం ఆ తల్లిని ఎల్లప్పుడూ దర్శించుకుంటూనే ఉంటారట. ఇందుకు రాత్రి పగలు అనే సమయం గాని, వారం వర్జ్యం అనే నియమాలు, మంచి చెడు కాలాలు అనేవి ఏమీ ఉండవు. ఎప్పుడు కావాలంటే అప్పుడు శ్రీకాళీమాతను దర్శించుకుంటూ ఎల్లకాలం నిరంతరం ఈ దీక్ష అక్షయంగా ఉంటుంది. అంటూ శ్రీ గురుదేవుల దేహంలో శక్తి ఉన్నంతవరకూ అమ్మవారి గర్భగుడిలోనికి వచ్చి ఆ తల్లి పాదపద్మాల వద్దే కూర్చొని ఆ తల్లిని సేవించుకుంటాను అంటున్నారు. శరీరంలో శక్తి తగ్గిపోయి అంతరాలయంలోనికి వచ్చి ఆ తల్లిని ప్రార్థించలేని పరిస్థితి వచ్చినప్పటికీ, వారి మనసు మాత్రం ఎప్పటికీ శక్తి విహీనం కాదు కనుక, వారి దేహంలో ప్రాణం ఉన్నంత వరకూ ఆ కాళీ మాతను మనసులోనే ప్రార్థించుకుంటాను అంటూ అంతేకాక వారు ఏ పనిని మొదలుపెట్టినా ఆ తల్లికి చెప్పి ప్రారంభిస్తారట. ఆతల్లి పూజకోసం తప్ప మిగిలిన ఏ పనైనా, చిన్నది గాని, పెద్దది గాని చేయ తల పెట్టినప్పుడు ముందుగా ఆ అమ్మవారికి చెప్పకుండా ప్రారంభించరట. అందువలన వారు చేసే పనికి ఎలాంటి ఆటంకం కలుగకుండా ఆ తల్లే చూసుకుంటుందనేది భావన.

శ్రీగురుదేవులు నేర్చుకున్న, సాధన చేసిన ఆధ్యాత్మిక విద్యలో ఎన్నెన్నో అద్భుతమైన అనుభవాలు ఉన్నట్లు తెలియ చేస్తున్నారు. ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలను శ్రీగురుదేవులు చవిచూశారు. శ్రీకాళీమాత అమ్మవారిని తమకు గురువుగా చేసుకొని ఎంతో విజ్ఞానాన్ని శాస్త్ర జ్ఞానాన్ని, వేదవేదాంగాలసారాన్ని, ఎన్నో దేవ రహస్యాలను ఆ తల్లి ద్వారా తెలుసుకున్నారు. అందువలన ప్రతి విషయంలోనూ వారికి అపరిమితమైన జ్ఞానసంపద లభించింది. వారిని, ఎల్లప్పుడూ నూతన ఉత్తేజంతో, ప్రతి విషయంలోనూ విజయవంతంగా ముందుకు తీసుకొని వెళ్తున్న శ్రీకాళీమాత అమ్మవారు, తమను ఎల్లప్పుడూ లాలిస్తూ, బుజ్జగిస్తూ, ఆ పని అలా చెయ్యాలీ

నాయనా, ఈ పని ఇలా చెయ్యాలి నాయనా అంటూ ఎంతో సౌమ్యంగా, అత్యంత ప్రేమానురాగాలతో తమను ఆదరిస్తుందని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తున్నారు.

**5.సీ॥ ప్రజ్ఞానదాత్రియౌ వరగురుకాళికి**
**వినిపింతు నాకైత విశ్వసించి**
**పలుమార్పులన్ గోరి ప్రార్థింతు నమ్మను**
**అక్షయదీక్ష నే నమృతభక్తి**
**అచ్చుల హల్లుల ఆద్యంత మర్మముల్**
**వివరించి చెప్పుచు విశ్వమాత**
**సాధనకాలాన సరసన జేరుచు**
**కరుణించు ధీశక్తి కాళి గురువు**

**తే॥ గర్భగుడిలోన వెలిగెడు కాళిమాత**
**సరసమైనట్టి రచనకు సంతసించి**
**క్రొత్త మార్పులు చేయించి కూర్మితోడ**
**అమృత కృతులకు కారణ మమ్మకాళి**

తా॥ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, తాము గురువుగా స్వీకరించిన శ్రీవరకాళీమాత అమ్మవారు ప్రజ్ఞతో కూడిన జ్ఞానాన్ని తమకు వరంగా ప్రసాదించిందని తెలియజేస్తున్నారు. జ్ఞానం ఉన్నంత మాత్రాన దాన్ని ఏ విధంగా వినియోగించాలో తెలియకపోతే ఉపయోగం లేదు. సందర్భానుసారంగా తమ జ్ఞానాన్ని ఇతరులకు పంచగలిగే ప్రజ్ఞా విశేషాలు కావాలి. అప్పుడే జ్ఞానానికి తగిన గుర్తింపు వస్తుంది. అలాంటి ప్రజ్ఞానాన్ని ఆ తల్లి తమకు ప్రసాదించిందని తెలియజేస్తున్నారు శ్రీగురుదేవులు. ఆ తల్లి దయవలన శ్రీగురుదేవులు ఎన్నో కవితలు, పద్యాలు, శ్లోకాలు, పాటలు మొదలైనవి వ్రాశారు. వారు వ్రాసిన ప్రతి అక్షరాన్ని, కవితనీ ఆ తల్లి ముందు నిల్చొని చదివి విన్పిస్తారు. ఎందుకంటే ఆ తల్లిపై పూర్తి విశ్వాసం ఉంచి, వ్రాసిన వాటిని చదివి వినిపించి అందులో ఇంకేమయినా మంచి

మార్పులు, ఇంకా మంచి అర్థవంతమైన భావం రావటానికి అవకాశం ఉంటుందేమోనని, ఆ తల్లికి విన్పించి తెలియజేయమని ప్రార్థిస్తారు. ఆ విధంగా కొన్ని కవితలను, పాటలను, ఆ తల్లి చేసిన మార్పుల కనుగుణంగా, శ్రీగురుదేవులు మార్పు చేసి వ్రాసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎందువల్ల నంటే అలా వ్రాసిన వాటిలో భవిష్యత్తులో ఎంతో మంది చదివి తెలుసుకోవలసిన విశేషాలు ఎన్నో ఉంటాయి. వారికి సరైన రీతిలోని భావాలను అందించటానికి అలాంటి మార్పులు దోహద పడతాయి. తెలిసిన వాళ్లు అనుకోవచ్చు, ఏమనంటే ఈయనేమిటి ఒకసారి వ్రాసి మళ్లీ మళ్లీ మారుస్తాడు అని, కాని దాని వెనుక అంతరార్థం ఇదేనని గ్రహించగలగాలి. శ్రీకాళీమాత అమ్మవారిపై తమకున్న భక్తి అమృతమయమైనదని, అది ఎన్నటికీ క్షయము కాని దీక్షలాంటిదని తెలియజేస్తూ, తమకు ఆ తల్లి అక్షరమాలలోని వర్ణాలనన్నింటినీ, వాటిలోని మర్మాలను వివరించి తెలియ చేశారని శ్రీగురుదేవులు చెపుతున్నారు. ఒక అక్షరాన్ని లేదా మాటను పలురకాలుగా పలికించినపుడు, ఆ అక్షరాన్ని గాని మాటను గాని ఏ భావంతో పలికారో, ఆ భావం వెనుక దాగి ఉన్న మర్మమేమిటో అనుభవజ్ఞులైన వారు తెలుసుకోవచ్చు. 'అమ్మ' అనే పదంలో పలికేవిధానాన్ని బట్టి నవరసాలను పొంగించవచ్చు. శ్రీవిశ్వమాత అయిన శ్రీకాళీమాత అమ్మవారు, శ్రీగురుదేవులు సాధన చేయుచున్న సమయాలలో వారి ప్రక్కన కూర్చొని, ఇలాంటి మర్మాల నెన్నింటినో తెలియజేస్తూ తమను కరుణించిన మహిమాన్విత శక్తి. తమ గురువైన శ్రీకాళీమాత అమ్మవారు అంటూ పై పద్యంలో తెలియచేస్తున్నారు.

తమ తేటగీతి పద్యంలో శ్రీకాళీమాత అమ్మవారిని గురించి శ్రీగురుదేవులు ఇంకా ఇలా తెలియజేస్తున్నారు. వేజెండ్ల గ్రామంలోని శ్రీకాళీమాత అమ్మవారి దేవాలయంలో, జగన్మాతయైన శ్రీకాళీమాత అమ్మవారు అద్భుతమైన రీతిలో తమ వెలుగులను లోకానికి ప్రసరింపజేస్తూ గర్భగుడిలో స్థిరంగా ఆసీనులై ఉన్నారు. ఆ తల్లి, శ్రీగురుదేవులు వ్రాసిన రచనలకు ఎంతో సంతోషిస్తూ, వాటిని వింటూ అవసరమైన చోట తగిన మార్పులను చేర్పులను సూచిస్తూ తమకు ఎంతో ఆప్తురాలిగా వాత్సల్యాన్ని కురిపిస్తూ తాము వ్రాసిన, వ్రాస్తున్న రచనలకు అమృతత్త్వం అనే సొగసులను అద్దుతూ, అవి అమృతమయం కావటానికి మూలకారణం అయింది

శ్రీకాళీమాత అమ్మవారు అంటూ శ్రీగురుదేవులు పై పద్యంతో, తమ కవితలకు అమృతతత్త్వం కలగటానికి గల కారణం ఆ తల్లేనని తెలియజేస్తున్నారు. మరి నిజమే కదా ! ఆ తల్లి అమృతహస్తం తాకిన ప్రతిదీ అమృతప్రాయంగా మారుతుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు కదా!

**6.సీ॥ సద్గురువరకాళి సారథి నీవౌచు**
**అండనే నీవుండి ఆదుకొనుచు**
**సురభాషణమ్ములన్ విరివిగా కల్పించి**
**మనుజులచెలిమిని మాపుజేసి**
**ప్రవచనకాంక్షలన్ పరిపరి సడలించి**
**పరిపూర్ణవైరాగ్యప్రాప్తినిచ్చి**
**నీరూపు క్షణమైన నేమరువనియట్టి**
**మనసు బుద్ధిని నిమ్ము మహిని నాకు**

**ఆ॥ యాత్ర చేయు కాంక్షలెప్పటెప్పటికైన**
**పుట్టకుండజేసి పుడమిలోన**
**సత్త్వజీవనమ్ము సంతృప్తిగా నిచ్చి**
**కాలచక్రమందు కావుమమ్మ**

తా॥ వేజెండ్ల శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. శ్రీకాళీమాత అమ్మవారిని తమ గురువుగా చేసుకొని, తద్వారా ఎన్నో మహావిద్యలను, దైవశక్తులను పొందగలిగారు. ఆ తల్లి వారికి ప్రసాదించినవి సాధారణమైన శక్తులు కాదు. అద్భుతమైన దివ్యశక్తులు. మదిని తలచిన మరుక్షణమే. సుదూర ప్రాంతాలలోని లక్ష్యాలను కూడా ప్రభావితం చేసి వాటిని తమ అధీనంలోనికి తెచ్చుకొని, లోక కల్యాణార్థం జరిపించవలసిన కార్యాలను చేయించ సమర్థత గలిగితన మహాశక్తులు. వినడానికి విడ్డూరంగానే అన్పించవచ్చు. కాని అవి అనుభవం లోనికి వచ్చిన వారికి మాత్రమే తెలుస్తాయి. కాలచక్రంలోని ఎన్నో మర్మాలను, భక్తుల అవసరంమేరకు విడమరచి చెప్పిన గొప్ప మహిమాన్విత మూర్తి శ్రీగురుదేవులు.

ఎంతో మందికి యజ్ఞం చేసి ఆ యజ్ఞశక్తిని ధారపోసి వారి వారి పూర్వ దుష్కర్మలను చేత్తో తుడిచి వేసిన ధీమంతులు శ్రీగురుదేవులు. వైద్యులు కూడా, ఇక పిల్లలు పుట్టరు అని నిర్ధారణ చేసిన తరువాత అలాంటి వారికి, హోమాలు చేయటం ద్వారా సంతానం కలిగించవచ్చు అని చేసి చూపించి యజ్ఞాలకు, హోమాలకు ఎంతటి శక్తి ఉన్నదో శాస్త్రీయంగా నిరూపించిన అపర యజ్ఞబ్రహ్మ శ్రీగురుదేవులు. దేశ, విదేశాలలో, ఎంతో దూరంలో ఉన్న తమ శిష్యులకు ఏ విధమైన ఇబ్బంది కలిగినా, ఆపదలు వాటిల్లినా, ఎలాంటి విషమ సమస్యలలో ఇరుక్కున్నా, వారు స్వయంగా తమ యోగం ద్వారా తెలుసుకొని, ఫోను ద్వారా వారిని పిలిచి సమస్య నివారణోపాయాలను సమగ్రంగా తెలియజేస్తూ, వారు ఫోనులో మాట్లాడినంత సమయంలోనే ఆ సమస్యలను నివారించిన అపర శ్రీకృష్ణులు శ్రీగురుదేవులు. ఇలాంటి అనుభవాలు ప్రతి భక్తునికీ, వారి శిష్యులకూ సుపరిచితమే. శ్రీగురుదేవుల గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, వారు 'అగాధమైన జలనిధి' అంతే. అంతటి అద్భుతమైన తపస్సంపన్నులు, దైవాంశ సంభూతులు, కారణజన్ములు సాక్షాత్తూ శ్రీకాళీమాత రూపంగా భక్తులు పూజించే శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, తమకు సద్గురువులైన శ్రీకాళీమాత అమ్మవారు తమ గమ్యానికి సారథిగా ఉండాలని కోరుకుంటున్నారు. సారథి అంటే కేవలం రథం నడిపే వాడనే కాదు. కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడు అర్జునునకు రథసారథిగా నిలిచాడంటే, గుర్రాలను తోలుతూ రథాన్ని ముందుకు నడిపించడానికి కాదు. అది ఒక సంక్లిష్టమైన బాధ్యత, ఎంతో ప్రజ్ఞ, నిశిత దృష్టి, సమయానుకూల నిర్ణయాలను అప్పటికప్పుడే తీసుకొని, రథాన్ని క్షేమంగా నలుదిక్కులా పరుగులు తీయించగల చాకచక్యం, రాబోయే సమస్యలను, ఎదురు కాబోయే చిక్కులను ముందుగానే ఊహించుకుంటూ, గుర్రాలకు ఎలాంటి అలసట కలుగకుండా రథంలో కూర్చున్న అర్జునునికి అనుకూలమైన రీతిలో రథం యొక్క వేగాన్ని నియంత్రించటం లాంటి ఎన్నో అంతుపట్టని శాస్త్రీయ, సాంకేతిక, నీతి నియమాలను ఏకకాలంలోనే అమలు చేయగలిగే నేర్పు ఓర్పు అన్నీ కలగలిపితే ఒక రథసారథి శ్రీకృష్ణుడు అయ్యాడు. అలాగే తమ జీవితానికి కూడా సారథి కావాలని ఆ తల్లిని ప్రార్థిస్తున్నారు శ్రీగురుదేవులు. అలాగే అన్ని విషయాలలోనూ, ప్రతి చిన్న విషయంలో కూడా ఆ తల్లి తమకు అండగా ఉండి ఆదుకొంటూ ఉండాలని, ఎల్లప్పుడూ ప్రతిక్షణం దేవతలతో మాట్లాడుతూ వారితో

స్నేహ భాగ్యాన్ని పెంపొందించుకొనే మనసుని కల్పించాలని, ఎందుకంటే దేవతలు పుణ్యమూర్తులు, వారు ఎల్లప్పుడూ సత్యభాషణమునే చేస్తూ ఉంటారు. పుణ్యప్రదమైన వారు, వారికి ఎలాంటి స్వార్థం ఉండదు, కోపాలుండవు, ఎల్లప్పుడు సంతోషంగానే ఉంటారు, వారికి ఈతిబాధలు, విచారాలు ఏమి ఉండవు, కనుక వారితో సంభాషణలను ఎక్కువగా చేసేటట్లు తమను అనుగ్రహించవలసిందిగా శ్రీగురుదేవులు ఆ తల్లిని కోరుతున్నారు. అదే విధంగా మానవులతో ఉండే ఏ విధమైన స్నేహాలనూ, అనుబంధాలనూ తమకు లేకుండా చేయమని శ్రీగురుదేవుల ప్రార్థన. అంతేకాక ప్రవచనాలను చెప్పాలనే కోరికలు వచ్చినప్పుడల్లా వాటిని తుంచి వేయమని, లేకపోతే వాటి ద్వారా ప్రాప్తించే అన్ని భోగాలకూ, భాగ్యాలకూ, కోరికలకూ వశుడనై పోయే అవకాశం ఉన్నదని, ఇక ముందు తమకు దేనియందూ కాంక్ష లేకుండా చేయమని, ఇంద్రియముల వలన కలిగే అన్ని కోరికలనూ సంపూర్తిగా నశింపజేసి, తమ మనసు నిండా వైరాగ్యాన్ని నింపుమని, భార్య, పిల్లలు, శిష్యులు, భక్తులు, వారు, వీరు అంటూ ఎవరూ తమ మదిలోనికి ఆలోచనగా కూడా రాకుండా అను క్షణం, ఆ తల్లి రూపాన్ని మనసు నిండా నింపుకొనే, మనసును బుద్ధిని ప్రసాదించమని ఆ తల్లిని శ్రీగురుదేవులు వేడుకొంటున్నారు.

తమ ఆటవెలదిపద్యంలో శ్రీగురుదేవులు ఆతల్లిని ఈవిధంగా కోరుకుంటున్నారు. తాము ఇప్పటివరకూ చరిత్రలో నమోదు కాని ఎన్నో పుణ్యప్రదేశాలను తమ తపశ్శక్తి ద్వారా వీక్షించి, అలాంటి వాటిని కూడా దర్శించి తరించారు. ఇంక ఆ విధంగా యాత్రలను చేయాలని, ప్రదేశాలను చూడాలనే కోరికలను తమకు రానీయవద్దని, అలా వచ్చిన ప్రతిసారీ ఆ కోరికలను త్రుంచి వేయమని ప్రార్థిస్తున్నారు శ్రీగురుదేవులు. ఎందుకంటే తినాలి, చేయాలి, చూడాలి అనేవన్నీ కోరికలే నని శ్రీగురుదేవుల భావం కావచ్చు. కోరికలకు అంతు ఉండదు. వాటిని ఎక్కడో ఒక చోట ఆపివేయాలి. ఆ తరువాత కొనసాగించకూడదు. కోరిక లనేఉచ్చు చాల పెద్దది, బలమైనది కనుక అసలు అలాంటి కోరికలు వచ్చినపుడల్లా వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చివేయుమని శ్రీగురుదేవులు శ్రీకాళీమాత అమ్మవారిని వేడుకొంటున్నారు. అంతేకాక మనసులో, మాట్లాడే తీరులో, ఆచరణలో పూర్తిగా తమను సాధుమయంగా, గడిపేటట్లు అది తమకు పూర్తిగా సంతృప్తి కలిగించేటట్లు అనుగ్రహిస్తూ ప్రతిక్షణం తమను కంటికి రెప్పలాగా కాలచక్రంలో తాము

కదులుతున్నంత వరకూ కాపాడుతూ ఉండమని ఆ తల్లిని వేడుకొంటున్నారు శ్రీగురుదేవులు. అనగా శ్రీకాళీమాత అమ్మవారికి, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి మధ్య ఇంక ఎలాంటి 'లోకం' అడ్డుగా ఉండకూడదనే ఆకాంక్ష శ్రీగురుదేవులు వ్రాసిన పై రెండు పద్యాలలో కన్పిస్తున్నది.

**7.సీ॥ శ్రీకాళి నాకెప్డు శిష్టశక్తుల నిచ్చి**
**సత్యభాషణవృద్ధి సరిగ నొసగి**
**భక్తులసంశయాల్ బహురీతి తీర్పించు**
**ఆదేవి కాళి నాకాదిగురువు**
**సత్యధ్యానపుయోగసంపూర్ణవిద్యలన్**
**అధికమ్ముగా నిచ్చె ఆదిశక్తి**
**వలదింక నాకొక్క సులభాక్షరమైన**
**కవిత వ్రాసెడు నట్టి కాంక్ష వద్దు**

**తే॥ ఏమి చేయని మనసిమ్ము ఇంపుగాను**
**నిన్ను అనుకరించెడి శక్తి నిమ్ము నాకు**
**వరమొసంగు నాముదమెల్ల వర్ధిలంగ**
**హాయినిచ్చుచు నాకెంతొ అండ యగుము**

తా॥ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు ఎన్నో విద్యలను నేర్చిన మహాపురుషులు. తెలియని వారికి ఆయన ఒక సామాన్య వ్యక్తి, తెలిసిన వారికి ఒక అసామాన్య శక్తి. ఆధ్యాత్మిక విద్యలలో ఆయనకు ఆయనే సాటి, సరిరారు ఆయన దరిదాపులలోకి ఎవరూ పోటి. శ్రీగురుదేవుల అనుభవసారమంతా వారు వ్రాసే పాటలు, పద్యాలు, కవితలు, సంస్కృత శ్లోకాలలో కనిపిస్తుంది. ఏదయినా స్వయంగా చేసి చూసిన తరువాతే నమ్ముతారు. అందుచేతనే శ్రీకాళీమాత అమ్మవారు, శ్రీగురుదేవులకు అద్భుతమైన మంత్ర సిద్ధులను ప్రసాదించారు. ఆ విషయాలనే పై పద్యంలో విశదీకరిస్తున్నారు శ్రీగురుదేవులు. 'శ్రీకాళి' అని సంబోధించటం వెనుక అంతరార్థం ఏమిటంటే, ఆతల్లి సిరులనిచ్చే తల్లి, సిరులంటే డబ్బే కాదు, తమకు సిరులు, సంపదలు, జ్ఞాన సంపద, యజ్ఞ

సంపద, ఆరోగ్య సంపద, ఆనంద సంపద ఇలా అన్ని సంపదలనూ ఆతల్లి శ్రీగురుదేవులకు ప్రసాదించినట్లు తెలియజేస్తూ ఆ సంపదలతో పాటు వారికి విశిష్టమైన, అద్భుతమైన, ఇదివరకు ఎవరూ సంపాదించ లేని కొన్ని అరుదైన దివ్యశక్తులను ఆతల్లి ప్రసాదించినట్లు తెలియజేస్తున్నారు. మరియు ఎల్లప్పుడూ సత్యమునే తనచేత పలికించే మనోనిబ్బరాన్ని సరైన రీతిలో ప్రసాదించి, తన దగ్గరకు వచ్చే భక్తులకు ఏర్పడే ఆధ్యాత్మికపరమైన లేదా లౌకిక పరమైన సంశయాలను అతిసమర్ధవంతంగా తీర్చగలిగే నేర్పును, ఓర్పును ప్రసాదించిన ఆతల్లి తమకు ఆదిగురువని తెలియచేస్తున్నారు. నిజమైన ధ్యానము, యోగముల గురించిన సంపూర్ణమైన విద్యలను ఆతల్లి తమకు సంపూర్ణంగా అధికముగా అద్భుతమైన రీతిలో ప్రసాదించినదని, అందువలన ఇంక తమకు కవిత్వము వ్రాయాలనే ఎలాంటి వాంఛ లేదని, అందుచేత వారికి ఒక్క సులభమైన అక్షరంతో కూడా కవిత వ్రాయాలనే కోరికను కలిగించవద్దని ఆతల్లిని వేడుకొంటున్నారు శ్రీగురుదేవులు.

అదే విధంగా తేటగీతి పద్యంలో తామింకా ఏమీ చేయకుండా, హాయిగా, సంతోషంగా ఉండే మనసును ప్రసాదించమని ఆతల్లిని ప్రార్థిస్తున్నారు శ్రీగురుదేవులు. మరియూ ఆతల్లియైన శ్రీకాళీమాతను అనుకరించెడి శక్తిని తమకు ప్రసాదించమని ఆతల్లిని అడుగుతున్నారు. ఆతల్లిని అనుకరించే శక్తి అంటే ఏమిటో శ్రీగురుదేవుల అంతరంగానికే తెలియాలి. అలాంటి వరాలను ప్రసాదించి, వారి నిర్మలత్వాన్ని వర్ధిల్ల చేస్తూ, వారికి సుఖ సంతోషాలను ప్రసాదించి వారికి అండగా ఉండుమని శ్రీకాళీమాత అమ్మవారిని శ్రీగురుదేవులు కోరుతున్నారు.

**8. సీ॥ సకలజనాళికిన్ సద్గురు వగుమాత**
**అమ్మ మించుగురువు లవని లేరు**
**బాల్యమం దద్భుతభాష లెన్నియొనేర్పి**
**జ్ఞానమిచ్చెదు తల్లి ఘనగురువగు**
**వాత్సల్యమును చూపి వర్ధిల్లజేయుచు**
**సంతువృద్ధిని కోరు సత్యమూర్తి**
**మొదటిగురువు తల్లి మోదమ్ము పెంచెడి**
**మాతృమూర్తిసములు మహిని లేరు**

తే॥ తల్లియే జగద్గురువౌను ధాత్రిలోన
అవని బిడ్డలు గావింప అమ్మసేవ
జన్మపర్యంత మభివృద్ధి జనని యిచ్చు
కాళి కృష్ణుని వాక్కులు కనక నిధులు

తా॥ సకల జీవరాశుల సృష్టికి మూలం తల్లియే. ప్రతిజీవి ఉద్భవించటానికి కారణం తల్లే. మూగజీవులైనా, మానవులైనా జన్మించిన ప్రాథమిక దశలో వాటి ఆలనా పాలనా చూసేది, చూడగలిగేది తల్లి మాత్రమే. పశుపక్ష్యాదులైతే కొంచెం నడువగలిగి, ఎగురగలిగే వరకూ వాటిని, తల్లి ఎంతో గోప్యంగా దాచిపెడుతూ, వాటికి ఏ ఇతర జీవులు హాని తలపెట్టకుండా ఉండటం కోసం కంటికి రెప్పలా కాపాడుతూ ఉంటాయి. అవసరమైన విద్యలన్నీ నేర్పుతాయి. అలాగే మానవులు కూడా జన్మించింది మొదలు వారు పెరిగి జ్ఞానసముపార్జన చేసేవరకూ తల్లే అన్ని సపర్యలు చేస్తుంది. సమయానికి అవసరమైన పోషణను అందిస్తుంది. వారిని పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచటానికి ప్రతిక్షణం శ్రమిస్తుంది. ఏడుస్తుంటే, అందుకు కారణాలను అన్వేషించి తగిన అవసరాలను తీరుస్తుంది. బిడ్డలు పసిగుడ్డుగా ఉన్నప్పుడు అత్యంత కఠినమైన జాగ్రత్తలు వహిస్తూ వారిని క్షేమకరమైన వాతావరణంలో ఉంచటానికి ప్రయత్నిస్తుంది. ఒక గురువు శిష్యునికి ఏ విధమైన బోధనలు చేయాలో అలా చేస్తుంటారు. అలాగే తల్లి కూడా తమ బిడ్డలను తగురీతిలో పాలన చేస్తుంది. ఏ దేశంలో అయినా, ఏ లోకంలో అయినా ఏ భాషలో అయినా, ఏ మతంలో అయినా తల్లే ప్రథమ గురువు కాదు, అని అనగల సత్తా శక్తి ఎవరికీ లేదు. అలాగే ఈ లోకంలోని జనులందరికీ కూడా గురువు ఆ జగన్మాతయే. తల్లిని మించిన గురువు సృష్టిలో మరెవ్వరూ లేరు. బాల్యదశలో పిల్లలకు ఎన్నో భాషలు నేర్పుతుంది తల్లి. పరిసరాల జ్ఞానాన్ని కల్గిస్తుంది. దేహాన్ని గురించిన పలు విషయాలను చక్కగా విడమరచి ఇది ముక్కు, ఇది నోరు, ఇవి చేతులు, కాళ్లు అంటూ చెపుతూ వాళ్లతో కూడా పలికిస్తుంది. ఆ విధంగా ప్రతి చిన్నవిషయాన్ని పెద్ద విషయాన్ని కూడా తాను చెపుతూ, వారితో పలికిస్తూ ప్రకృతిని పరిచయం చేసేది తల్లి మాత్రమే. ఇంతటి జ్ఞానాన్ని అతిసులువుగా తమ బిడ్డలకు నేర్పించే తల్లి నిజమైన, సత్యమైన గొప్ప గురువే కదా మరి. బిడ్డను ముద్దులాడుతూ, వారు ఎన్నిసార్లు మలమూత్ర విసర్జనలు చేసినా ఎంతో ప్రేమగా, అనురాగంతో ఆ బిడ్డలను

మరల మరలా శుభ్రపరుస్తూ వారు చేస్తున్న చిలిపి చేష్టలకు, కేరింతలకు తన్మయత్వం చెందుతూ, అపురూపమైన ప్రేమ వాత్సల్యాలను చూపిస్తూ వారి అభివృద్ధిని నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉంటుంది గదా తల్లి. తనకు ఎంతమంది బిడ్డలు జన్మించినా ఆ బిడ్డలందరి శ్రేయస్సునూ సమంగా కోరుకుంటుంది మాతృమూర్తి. లోకంలో ప్రతివారికీ మొట్టమొదటి గురువైన తల్లి బిడ్డలఆనందాన్ని వృద్ధి చేయటానికే పాటు పడుతుంది. అలాంటి మాతృమూర్తితో సమానమైన వారు ఈ భూమి మీద మరెవ్వరూ లేరని చెప్పటం ఏ మాత్రం అతిశయోక్తి కాదు.

బిడ్డకు తల్లి ఎలాంటి గురువో అలాగే ఆ జగన్మాత సృష్టిలోని జనులందరకూ ఆదిగురువు జగద్గురువు. ఈ లోకంలోని వారందరూ ఆ జగన్మాత బిడ్డలే. అందరూ ఆ జగన్మాత, ప్రకృతి మాత గర్భం నుంచి ఉద్భవించిన వారే. అలాంటి మానవులు ఆ తల్లియైన శ్రీకాళీమాతను మనసారా సేవిస్తూ ఉండటంవలన వారి జన్మ చివరి క్షణం వరకూ వారి అభివృద్ధిని కాంక్షిస్తూ ఆదరిస్తుంది ఆ తల్లి శ్రీకాళీమాత. ఇవి సామాన్యులు చెప్పిన వాక్కులు కావు. సాక్షాత్తూ శ్రీకాళీమాత స్వరూపులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై పద్యంలో ఎంతో సవివరంగా తెలియజేశారు. ఇవి వారు చెప్పే బంగారపు నిధులు లాంటి వాక్కులని తెలుసుకోండి.

**9 సీ॥ అధికశక్తి నొసగు అధ్యాత్మసాధనల్**
**దేహబలము పెంచు దివ్యవిద్య**
**మనసు ధైర్యము నిచ్చు మంత్రదీక్ష లెపుడు**
**బుద్ధిబలము పెంచు భూరివిద్య**
**ఆత్మస్థైర్యము నిచ్చు అమరమౌ శ్రీవిద్య**
**దైవశక్తిని పెంచు ధర్మవిద్య**
**సకలవిద్యలమేటి సర్వమ్ము నిచ్చెడి**
**అతిగొప్పదైన అధ్యాత్మవిద్య**
**మంచికీర్తుల నిచ్చి మధురవాక్కు లొసగి**
**సర్వజ్ఞులన్ జేయు సత్య విద్య**

తే॥ శోధనంబగు మేధ నాశువుగా నిచ్చి
సాధకోత్తముల కెపుడు సహకరించి
మానవోత్తములను జేయు మాత కాళి
కాళికృష్ణుని వాక్కులు కనకనిధులు

తా॥ ఆధ్యాత్మిక సాధన ఏ రూపంలో ఉన్నా అది వారికి మహోన్నతమైన శక్తిని యుక్తిని ప్రసాదిస్తుంది. భౌతిక సాధనలుగా కన్పించే పూజలు, హోమాలు, భజనలు, సత్సంగాలు మొదలైనవి కావచ్చు. అలాగే ఒకేచోట స్థిరంగా కూర్చొని మనసును తమ ఇష్టదైవం మీద లగ్నంచేస్తూ నిశ్చలమైన తపోదీక్షతో దైవంమీద తమ ఆలోచనలను కేంద్రీకృతం చేస్తూ చేసే ప్రతిపని వలన ఎంతో శక్తి లభిస్తుంది. ఆధ్యాత్మిక విద్యలన్నీ దైవసంబంధమైనవే కనుక, వాటి సాధనలో ఎక్కువ కాలం గడిపేవారికి మానసిక శక్తులు వృద్ధి చెందటమే కాక, వారి శరీరం యొక్క దార్ఢ్యం, బలం కూడా పెరుగుతుంది. ఎందువల్లనంటే ఎవరైనా ఎప్పుడయితే వారి ఆలోచనలన్నీ లౌకిక ప్రపంచం వైపు మళ్లిస్తారో, వారికి ప్రతిక్షణం, ప్రతిదీ పెద్ద సమస్యవలె కన్పిస్తుంది. ఆ సమస్యలను తీర్చుకోవటానికి అనేక విధాల ఆలోచనలు, ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ ప్రయత్నాలు ఫలించకపోతే ఆవేదనతో మనశ్శాంతిని కోల్పోవటం జరుగుతుంది. మనసు ఎప్పుడు కలత చెందుతుందో, ఆ క్షణం నుంచీ దాని ఫలితం దేహంమీద ఉంటుంది. మానసిక శక్తులూ, శారీరక శక్తులూ అన్నీ బలహీనపడతాయి. ఈ విషయాలు ప్రతి ఒక్కరికీ తెలుసు. ఇవి తెలియటానికి శాస్త్రాలు చదువనక్కర లేదు. అన్ని శక్తులకూ కేంద్ర నిలయమైన మనసును ఆధ్యాత్మిక సాధనవైపు మళ్లిస్తే అలాంటి వారి శారీరక మానసిక శక్తులు ఇనుమడిస్తాయి. ఈ విషయాలు ఆధ్యాత్మిక సాధనలు చేయువారికి మాత్రమే అనుభవంలోనికి వస్తాయి. ఇందుకు సద్గురువు యొక్క శుభాశీస్సులు కూడా ముఖ్యావసరమే అలాగే మంత్ర దీక్షలను ఆచరించే వారు ఎల్లప్పుడూ ఎంతో నిబ్బరంగా వారి మనసు ఎంతో ధైర్యంగా ఉంటుంది. ఎందుకంటే, ఎవరో ఒక దేవతను నిత్యం ఆరాధిస్తూ మంత్రోపాసన చేస్తుంటారు కనుక ఆ దేవత యొక్క అనుగ్రహం వారికి అనుక్షణం ఉంటుంది. అందుచే వారు ఎలాంటి కార్యాలనైనా అలవోకగా చెయ్యగలుగుతారు. ఇది నేను చెయ్యగలను అనే విశ్వాసం వారికి ఎల్లప్పుడూ నిండుగా ఉంటుంది. అంతేకాక, వారి బుద్ధి కూడా వికసించిన పువ్వులాగా ఉంటుంది. వికసించిన

పుష్పాన్ని చూస్తే దాని దగ్గరకు వెళ్లాలనిపిస్తుంది. దగ్గరకు వెళ్లిన తరువాత దాని పరిమళం, అందం అన్నీ మైమరపింప చేస్తుంది. అదే విధంగా బుద్ధి వికసించిన వారి వద్దకు వెళ్లినా అంతటి ఆనందం కలుగుతుంది, బుద్ధిబలం పెంచేవి కూడా ఆధ్యాత్మిక విద్యలే. బుద్ధిబలం వృద్ధి చెందటం వలన సమస్యల వలయాలలో చిక్కుకోరు. ఆధ్యాత్మిక విద్యకు అంతులేదు. అంతం లేదు. ఇది సిరిగల విద్య. అమరమైనది. సిరులకు, భోగభాగ్యాలకూ లోటు లేకుండా చేయగల శక్తి ఆధ్యాత్మిక విద్యలకు ఉన్నది. ఆధ్యాత్మిక తత్త్వంలో ఉన్న వారికి ధర్మమార్గంలో నడిచే శక్తి లభిస్తుంది. అందువలన అలాంటి వారికి దైవీకమైన శక్తులు లభిస్తాయి. ఆధ్యాత్మిక విద్య సత్యమైనది, ఈ మార్గంలో నడిచే వారికి మంచి కీర్తి లభిస్తుంది. సంఘంలో వారికి గొప్ప పేరు ప్రతిష్ఠలు కలుగుతాయి, మధురమైన, మంచి వాక్కులు ఈ విద్యల సాధన ఫలంగా లభిస్తాయి. అందువలన వీరు సర్వజ్ఞత కలిగి, తమ వాక్ప్రవాహం చేత అందరినీ ప్రభావితం చేయగలుగుతారు. లోకకల్యాణమే వీరి పరమావధిగా ఉంటుందనటంలో సందేహం లేదు. ఆధ్యాత్మిక విద్యలను సాధన చేసేవారికి, ఏ విషయాన్నయినా, ఎంతటి క్లిష్టమైన పనినైనా శోధించి, శుభ ఫలితాలను సాధించగల తెలివితేటలను, మేధను, సాధనలలో ఉత్తములైన వారికి ఎల్లప్పుడూ ప్రసాదిస్తూ, తన సహాయాన్ని వారికిస్తూ, అలాంటి వారిని మానవులలోనే సర్వశ్రేష్ఠులుగా తీర్చిదిద్దుతుంది శ్రీకాళీమాత అంటూ తెలియ చేస్తున్నారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు అలాగే వారు పైన చెప్పిన పద్యంలోని వాక్కులన్నీ బంగారపు నిధులంటూ వాటి విలువను కూడా లోకానికి తెలియచేస్తున్నారు.

**10 సీ॥ ధరణి జనులకు గల్గు ధర్మసందేహముల్**
**తీర్చునట్టి ఘనులె తిరుగురువులు**
**గ్రంథ పఠనమునన్ గలుగనిజ్ఞానముల్**
**గురుమేధయందుండు గొప్పగాను**
**ఊహలకందని ఉరుతర వాక్కులన్**
**వెదజల్లుచుందురు వేదగురులు**
**వసుధపైనున్నట్టి వరణీయగుణులకు**
**నింగి నివాసమ్ము నిచ్చుదేవి**

ఆ॥ అమ్మకాళి స్మరణ మనునిత్యమొనరింప
సాధకులకు యుక్తి సాగివచ్చు
వాక్పతులను జేయు వరకాళి గురువులన్
కాళికృష్ణ వాక్కు కనకసమము

తా॥ ఈ లోకంలోని జనులకు ప్రతినిత్యం ఎన్నెన్నో సందేహాలు కలుగుతూ ఉంటాయి. వాటిలో లోకం పోకడను గురించిన సందేహాలు, శాస్త్రాలను గురించి, పురాణాలను గురించి, వాటిలోని ధర్మసూక్ష్మాలను గురించి ఇలా అనేక విధాలైన సందేహాలు వస్తుంటాయి. అలాంటి ధర్మసందేహాలను వివరించి, విడమరచి, వివరణాత్మకంగా చెప్పగలిగి వారి సందేహ నివృత్తి చేయగలిగిన వారే నిజమైన, గొప్ప మహోన్నతమైన సద్గురువులు. వారు దైవాంశ సంభూతులై ఉండి ఎలాంటి సందేహాన్నయినా తీర్చగలిగే సమర్ధత కలిగి ఉంటారు. లోకంలో ఇప్పటివరకూ ఎన్నెన్నో పురాతన, అతిపురాతన గ్రంథాలు, తాళపత్రాలపై లిఖించబడి నిక్షిప్తం చేయబడిన అత్యంత విలువైన, అరుదైన విషయాలు ఉండి ఉండవచ్చు. వాటినన్నింటినీ చదివి ఆకళింపు చేసుకోగలిగే ప్రజ్ఞానులు కొందరైనా ఉండే అవకాశం ఉన్నది. సముద్రంలోని నీరు ఎన్ని బిందెలతో తెచ్చి ఒడ్డున పెట్టినా ఇంకా సముద్రంలో నీరు మిగిలి ఉన్నట్లుగానే, లోకంలో లభించే గ్రంథాలన్నింటిలోని సారం గ్రహించ గలిగినా, ఇంకా గ్రంథాలలో లేని సారాంశం ఎంతో ఉండి ఉంటుంది. అది లభ్యం కానిది, ఎలా పొందాలో కూడా తెలియనిది. అలాంటి గ్రంథాలను పఠించటం వలన లభించని విజ్ఞానం, సద్గురువులైన వారి మేధలో ఘనముగా నిక్షిప్తమై ఉంటుంది. రెప్పపాటు కాలంలో అలాంటి సుజ్ఞానాన్ని ఆశువుగా ప్రవచింప చేయగల ధారణ శక్తిని సద్గురువులు కలిగి ఉంటారు. ఒక్కొక్క పర్యాయము ఎవరి ఊహలకూ అందని విధంగా అద్భుతమైన ఆశ్చర్యాన్ని కలిగించే వాక్కులను గంభీరంగా అందరికీ తెలిసే విధంగా, అర్థమయ్యే రీతిలో అందిస్తుంటారు సద్గురువులు. వేదాలలోని సారాంశాన్ని బయటకు తీసి వాటి ఫలితాలను వాక్కుల రూపంలో అందరికీ అందేలా శ్రమిస్తారు కనుక వీరు వేదగురువులే. ఇలాంటివారు భూమిపైన నడయాడే వరపుత్రులైన గురువులకు ఆ తల్లి శ్రీకాళీమాత, స్వర్గలోకంలో నివాస భాగ్యాన్ని కల్పిస్తుంది. అనగా భూమిమీద వారికి ఏ లోటూ లేకుండా, సకల సుఖసౌఖ్యాలనూ అమర్చి,

ఎలాంటి ఈతిబాధలూ దరిచేరనీయకుండా ఎప్పుడో తరువాత లభించే స్వర్గ సుఖాలను ఈ లోకంలో ఇక్కడే లభింపచేస్తూ ఆ తల్లివారిని సర్వోన్నతులుగా, ఆకాశమే హద్దుగా వారి జీవితం ఆనందమయం చేస్తుందని అంటారు శ్రీగురుదేవులు.

శ్రీకాళీమాత అమ్మవారి నామస్మరణ అను నిత్యం చేస్తూ సాధన చేయు వారికి తెలివితేటలు అధికమౌతాయి. అందువలన అలాంటి వారు యుక్తితో అన్నింటినీ తమకు అనుకూలంగా మలచుకోగలుగుతారు. సద్గురువులైన వారిని ఆ తల్లి వాక్కులతో అగ్రగణ్యులుగా చేస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదంటూ, పై పద్యంలో సద్గురువులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియజేస్తూ తాము చెప్పే వాక్కులన్నీ బంగారంతో సమానమైనవని అంటున్నారు. అనగా బంగారాన్ని అందరూ దాచుకుంటారు. అలాగే శ్రీగురుదేవులు చెప్పే మాటలను కూడా వింటూ వాటిని జీవితాలలో అవసరమైన చోట అన్వయించుకో గలిగితే జీవితం అంతా సుఖశాంతులతో ఆనందంగా సాగిపోతుంది.

**11.** సీ॥ అమ్మఒడిని నున్న అధ్యాత్మవిభులకు
అద్భుతమగు పల్కులధికమౌను
ధర్మమార్గులకును ధరణిలో నెపుడు
సత్యభాషణవృద్ధి సాగుచుండు
మహిని జనులకెల్ల మార్గదర్శకులయి
దీవించుచుందురు ధీర గురులు
బ్రహ్మవిష్ణుశివులై బాహ్యమ్ముగా వెల్గి
గౌరవమ్ములనందు ఘనులు గురులు

తే॥ యతుల స్వాములన్ జేసి యథార్థములను
వసుధ ప్రవచింపజేసెడు వరము కాళి
మాన్యతన్ గూర్చు పరమసామాన్యులకును
కాళి కృష్ణుని వాక్కులు కనకనిధులు

తా॥ ఆ తల్లి శ్రీవరకాళీమాత అమ్మవారు ఈ సర్వస్వంలోని ప్రతి అణువులోనూ నిండి ఉన్నారు. కన్పించే లోకాలు, కన్పించని లోకాలన్నీ కూడా ఆతల్లి యొక్క చల్లని, వెచ్చని ఒడిలాంటి ప్రదేశమే. ఆ తల్లిని నిరంతరం సేవించి ఆరాధించే వారికి, ఆ తల్లి ఒడి యొక్క దివ్యానుభూతులు పొందగలిగే భాగ్యం కలుగుతుంది. తల్లి గర్భంలో ఉన్నప్పుడు బిడ్డయొక్క అవయవాలు, అవసరాలు ఎంత ఒద్దికగా కుదురుకుంటాయో, అదే విధంగా ఆధ్యాత్మికత అనే అమ్మఒడిని చేరిన వారికి వారి పలుకులలో, మాటలలో ఎంతో పొందిక నిపుణత, సరళత, సౌమ్యత అన్నీ కలగలిపిన అమృతత్త్వం కన్పిస్తుంది. కావాలని ఎలాగైనా పరుషంగా మాట్లాడాలని ప్రయత్నించినా అలా ఎన్నటికీ చెయ్యలేరు అలాంటి ఆశ్చర్యకరమైన పలుకులు దినదినాభివృద్ధి చెందుతాయి. ఆ ప్రభావం చేత వారికి ధర్మతత్పరత ఏర్పడుతుంది. ధర్మం కోసమే ఏదయినా చేస్తుంటారు. ఏ పనిని చేయాలన్నా, అందుకోసం ధర్మమార్గాలనే ఆశ్రయిస్తారు. ఈ ప్రయత్నంలో వారికి ఎన్ని ఇబ్బందులెదురైనా, వారి గమ్యం మాత్రం ధర్మం వైపే ఉండేటట్లు వారిని వారు నియంత్రించుకునే ప్రయత్నం చేస్తుంటారు. అందుకోసం వారు నోటి వెంట సత్యమైన భాషణములనే పలుకుతూ ఉంటారు. అవి వారిలో నిరంతరం వృద్ధి పొందుతూ వుంటే సుగమ్యం వైపు సాగిపోతూ ఉంటారు. ఇలాంటివారే లోకంలో గురువులై సద్గురువులై తమ సుసంభాషణములతో ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దే క్రమంలో వారికి మార్గనిర్దేశకులౌతారు. ఇలాంటి సద్గురువులు, తమకు లౌకిక పరంగా, సామాజికపరంగా ఎన్ని అడ్డంకులు ఎదురయినా, ధర్మస్వరూపులై, సత్యభాషణవ్రతులై, విజ్ఞానజ్యోతివలె వెలుగొందుతూ, ఆ వెలుగులోనే, ఆశ్రితులకు దారిని చూపిస్తూ ధైర్యంగా ముందుకు సాగిపోతుంటారు. ఇది వారి జీవితంలో నిరంతరం కొనసాగే ప్రక్రియ. వీరు కళ్లకు కన్పించే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల వలె, తమ వెలుగులనే జ్ఞానాన్ని అందరికీ పంచే క్రమంలో ఎన్నెన్నో అద్భుతమైన ఆశ్చర్యాన్ని కలిగించే గొప్ప గొప్ప గౌరవాలను, సన్మానాలను, అందరి అభిమానాన్ని పూజలను పొందగలిగే మహా గొప్ప గురువులు, దైవసమానులు.

జగన్మాతయైన శ్రీకాళీమాత అమ్మవారు, లోకంలో కొంతమంది అర్హులైన వారిని ఎంచుకొని (గతజన్మల పుణ్యఫలాన్ని అనుసరించి) వారిలో కొందరిని, యతులుగాను, స్వామిజీలుగాను, సద్గురువులవలె, ప్రవచన పటిమగలవారిగా,

సిద్ధులుగా అనుగ్రహించి, సకల జ్ఞాన సంపదలనూ వారికి 'కరతలామలకం' గావించి, పరిపూర్ణమైన, మానవత్వమున్న వారిగా తీర్చిదిద్దుతారు. ఇందుకోసం ఎవరికి వారే స్వీయ సాధనలను చేసుకోగలిగే ప్రేరేపణలను కల్గిస్తారు ఆ తల్లి శ్రీవరకాళీమాత అమ్మవారు. సాధనల ద్వారా వారు సాధించిన జ్ఞానాన్ని యథార్థ రూపంలో ప్రజలకు అందే విధంగా, వారితోనే ప్రవచనాల రూపకల్పన చేయిస్తారు. అంటే ప్రతివిషయాన్నీ ఆ తల్లే రచన చేయిస్తుంది. అందుకు అవసరమైన వారిని, అవసరమైన విధంగా, అవసరమైన సమయంలో ఆ ఘనతను మాత్రం మనకే సంప్రాప్తింప జేస్తుంది. ఈ విషయాలను పై పద్యంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గరుమహరాజ్ గారు తెలియజేస్తూ, అతిసామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా తమ వాక్కులు బంగారు మూటలంటున్నారు శ్రీగురుదేవులు.

**12.సీ॥ దీక్షవలన పూజ దివ్యమ్ముగా జేయ**
**దేహమనములందు తేజమెసగు**
**సత్యదీక్షను బూన సాగివచ్చు శుభము**
**అన్నివేళలయందు నక్షయముగ**
**అమితకాంతులతోడ నలరారుచున్నది**
**అమరమూర్తి యయిన ఆదిశక్తి**
**భక్తజనులరక్ష భవ్యమౌ దీక్షగా**
**నిలిచియుండెను దేవి నిష్ఠతోడ**

**ఆ॥ మాత కరుణ దృష్టి మదిపైన ప్రసరింప**
**కష్టపర్వతములు కరిగిపోవు**
**అమ్మమహిమ జెప్ప అజునితరము గాదు**
**విష్ణుశివులకైన వీలుగాదు**

తా॥ అత్యంత శ్రేష్ఠమైన దీక్షతో మనసును లగ్నం చేస్తూ, ఆ మనసును, పూజలతో లయం చేసినపుడు, అలాంటి భక్తులకు, వారి దేహాలలో అద్భుతమైన మార్పులు చోటు చేసుకుంటాయి. శరీరానికి మంచి తేజస్సు, ఓజస్సు కలుగుతాయి. మనసుకు ఎంతో కాంతి, శాంతి, సౌఖ్యాలు లభిస్తాయి. అలా నిజమైన, నిశ్చలమైన

నిష్ఠతో కూడిన దీక్షను చేసే భక్తులకు నిరంతరమూ, శుభములు వారిని వెన్నంటే వస్తాయి. అత్యద్భుతమైన దివ్యకాంతులతో ప్రకాశిస్తూ, తన కరుణామృత దృష్టి వెలుగులను నిరంతరమూ భక్తజనులపైన నిలిపి ఉంచుతూ, ఆ కర్తవ్యాన్నే ఒక దీక్షగా అనుసరిస్తూ, భక్తజనులను సంరక్షిస్తూ ఉంటుంది శ్రీకాళీమాత. అందువలన ఆ జగన్మాత యొక్క కరుణా కటాక్ష వీక్షణాలు ఎవరి మదిపైన ప్రసరిస్తాయో, అలాంటి వారికి, వారి కష్టములు పర్వతముతో సమానమైనవి అయినా సరే – తీక్షణంగా ప్రకాశిస్తున్న సూర్యుని వేడిమి, మంచు పర్వతాల మీద పడిన క్షణాలలోనే, ఆ మంచు అంతా కరిగి నీరుగా, ఆవిరిగా మారి ఆ ప్రదేశం నుంచి తొలగిపోతుంది. అప్పటివరకూ ఆ కొండపై మంచుతో కప్పబడి ఉన్న సుందర ప్రదేశాలు ఎలా కన్పిస్తాయో, అదే విధంగా, ఆ తల్లి కరుణామృత దృష్టి ప్రసరించిన మరుక్షణం నుంచి భక్తుల మనసుల్లోని కల్మషాలు, దుష్టభావాలు, సమూలంగా తొలగిపోయి, వారి మనసులు ఎంతో ప్రశాంతతతో నిండిపోతాయి. శ్రీ ఆదిపరాశక్తి శ్రీకాళీమాత యొక్క మహిమలను వర్ణించడానికి, వివరించి చెప్పడానికి అజుని తరము, అనగా సృష్టికర్త బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదు, అంటూ అలాగే స్థితికారకుడైన శ్రీమహావిష్ణువు మరియు లయకారకుడైన సదాశివునికైన అంటే సాంబశివునికైనా అలవి కాదు. త్రిమూర్తులైన వీరు, అమ్మ శ్రీకాళీమాత మహిమలను గూర్చి పరిపూర్ణంగా తెలియ చెయ్యాలని ప్రయత్నం చేసినా, వారికి కూడా ఎన్నటికీ వీలుకాదని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు ప్రబోధిస్తూ ఉంటారు.

**13. సీ॥ అమ్మ దీవెనములు అందుచున్న యపుడు**

**అక్షయామృత వాక్కులధిక మౌను**

**విమల విజ్ఞానమ్ము వెదజల్లు రచనముల్**

**భావితరములకు భాగ్యమగును**

**దానమ్ము గావించు దయగల ఘనులెల్ల**

**కీర్తికాయులగుచు స్ఫూర్తినిచ్చు**

**అన్ని బాధలు మాన్పు ఔషధముల వోలె**

**శాస్త్రగ్రంథములెల్ల సాక్ష్యమౌను**

తే॥ అందరికిని శుభములిచ్చు నక్షరములు
అమృతభాండమ్ములై యుండ నవనిలోన
విజయ సంపదలిచ్చును విశ్వమందు
కాళికృష్ణుని వాక్కులు కనక నిధులు

తా॥ అమ్మ అనే పదం విశ్వం అంతా నిండి ఉన్నది. ఆ పదంలోనే అమరత్వం దాగి ఉన్నది. అమరత్వం అనగా ఎప్పటికీ నిలిచి ఉండేది, అంతం కానిది, శాశ్వతమైనది అని చెప్పుకోవచ్చు. అలాగే అమ్మ అంటే అమృతత్వంతో నిండిన సాక్షాత్ పరదేవతా స్వరూపం. పరదేవతయైన శ్రీ ఆదిపరాశక్తిలోని, దివ్యత్వమైన ప్రేమ, జాలి, కరుణ, దయ, క్షమ మొదలైనవన్నీ అమ్మలో ఉంటాయి. శ్రీ ఆదిపరాశక్తి శ్రీకాళీమాత పైన చెప్పబడిన తన విశేష గుణాలచేత, లోకంలో తనను ఆశ్రయించిన వారిని, వారికున్న అన్నిరకాల శారీరక, మానసిక రుగ్మతలను, అనేక దోషాలను, సంపూర్ణంగా తొలగిస్తుంది. అలాగే లోకంలోని తల్లులు, తమ సంతానాన్ని కూడా అదే విధంగా పోషించి, పాలిస్తుంటారు. అలాంటి తల్లి దీవెనలు లభించిన వారికి, అద్భుతమైన వాక్కులు, ఇంకా ఆశు కవితలు నిరంతరమూ అధికమవుతూనే ఉంటాయి. అదేవిధంగా అమితమైన విజ్ఞానాన్ని వికసింపచేసే అనేక శ్రేష్ఠమైన రచనలు చేయగల శక్తి లభిస్తుంది. అలాంటి రచనలే రాబోయే ముందు తరాల వారికి భూదానము, సువర్ణదానము, కన్యాదానము, విద్యాదానము, ఇంకా అనేక రకాలైన దానాలను దయగల హృదయంతో చేసే ఉన్నతమైన, ఉత్తమమైన బుద్ధి, మనసు కలిగినవారు, ఈ లోకం నుంచి నిష్క్రమించినా, అనగా గతించి పోయినా, మరణించినా, అలాంటి వారు ఈ భూమి ఉన్నంతవరకూ, మనుష్యజాతి ఈ భువిపై మనుగడ సాగించినంత కాలం కీర్తింపబడుతూ, అందరికీ ఆదర్శప్రాయులై శాశ్వత కీర్తిని పొందుతూ నిలిచి ఉంటారు. ఈ కలియుగంలో మానవులకు అనేక బాధలు ఒక దాని తర్వాత మరొకటి వస్తూనే ఉంటాయి. అయితే, ఆ బాధలనన్నింటినీ పోగొట్టే ఔషధాలు, అంటే, శారీరక బాధలు, మానసిక బాధలు పోగొట్టటానికి అనేక రకాల మందులు – వైద్యశాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం, న్యాయశాస్త్రం, ధర్మశాస్త్రం, ఆధ్యాత్మిక శాస్త్రాలు, ఇంకా అనేక గ్రంథాలు మనకు సాక్ష్యాలుగా కనిపిస్తాయి. ఒక వ్యక్తికి వచ్చిన శారీరకమైన జ్వరమో, శూల సంబంధిత రోగమో, వైద్యశాస్త్రానుసారంగా మందులవలన తగ్గుతుంది. అలాగే వేరొక వ్యక్తికి, సమాజపరంగా గాని,

మరేవిధంగానైనా జరిగిన అన్యాయానికి న్యాయశాస్త్రపరమైన వాదనల ద్వారా న్యాయం జరిగితే, అప్పటి వరకూ పడిన అతని బాధ తొలగిపోతుంది. కొంతమంది తమ జాతకాలను చెప్పించుకుంటూ, జ్యోతిషశాస్త్ర నిపుణులు చెప్పే నివారణ మార్గాలు తెలుసుకొని, వాటికి తగిన పరిహారాలు చేస్తూ తృప్తి చెందుతూ ఉంటారు. అదే విధంగా ధర్మశాస్త్రాలు, ఆధ్యాత్మిక గ్రంథాలు వినడం ద్వారా, చదవటం ద్వారా, ఆ మార్గాలను తెలుసుకొని అనుసరించటం ద్వారా మనశ్శాంతిని పొందుతుంటారు. అందువల్లనే కాబోలు, శ్రీగురుదేవులు, పైన చెప్పిన శాస్త్రాలు, మానవునియొక్క శారీరక, మానసిక రుగ్మతలు, అనేక బాధలు, దోషాలు తొలగటానికి, సాక్ష్యాలుగా నిలుస్తాయని తెలియచేస్తున్నారు.

ఏది ఏమయినా సర్వమానవాళికి, ఇంకా పశుపక్ష్యాదులకు అనేక శుభాలను ఇచ్చే అక్షర సంపదలే, ఈ భువిలో ఎప్పటికైనా నిలిచి ఉండే అమృతభాండములు. అనగా అమృతముతో నిండుగా యున్న భాండములు. ఈ అక్షర సంపదలే ఈ విశ్వమందు సర్వమానవులకు, అనేక ప్రాణులకు శుభాలను, విజయపరంపరలను, విజయ సంపదలను ఇచ్చే గొప్ప సంపదలు అంటూ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తున్నారు. అవును, వారు చెప్పే అమృతవాక్కులే సువర్ణభాండాగారాలు, బంగారునిధులు, అవే అమ్మ శ్రీకాళీమాత పలికించే పలువిధ రత్న రాశులు.

**14.సీ॥ అష్టాదశాబ్దమ్ము లగ్నిహోత్రములెన్నొ**
**భక్తితోడను చేయు భద్రభూమి**
**వేంకటనాథుడు వెలసిన వేజెండ్ల**
**విమలభక్తులకెల్ల విజయమిచ్చు**
**ఆదిపరాశక్తి అవతరించినచోటు**
**అవధూతలరుదెంచు అమరభూమి**
**అందరికి శుభమిచ్చు అమృతమూర్తులు గల**
**అధ్యాత్మ నిధులకు ఆదిభూమి**

తే॥ అబ్బసొత్తు గాదాయె అధ్యాత్మవిద్య
పూర్వపుణ్యఫలమ్మునన్ పుట్టి పెరుగు
సత్యనిష్ఠ సాధకులకున్ సంక్రమించు
సుగుణ జనులకు విద్యలు సొంతమగును

తా॥ శ్రీగురుదేవులు పైనున్న సీసపద్యంలో, శ్రీఆదిపరాశక్తి శ్రీకాళీమాత వేంచేసి ఉన్న శ్రీవేజెండ్ల గ్రామం యొక్క విశిష్టతను, వైభవాన్ని తమ అమృతవాక్కుల ద్వారా ఏ విధంగా తెలియచేస్తున్నారో మీరు కూడా చూడండి. పదునెనిమిది అనగా, 18 సంవత్సరాల పాటు నిత్యాగ్ని హోత్రాన్ని భక్తితో ఆరాధనతో చేసిన భూమి, అనగా క్షేమాన్ని ఇచ్చే భూమి, అంటేఅందరికీ సంతోషాలను, ఆనందాన్నిచ్చే సత్యభూమి, వేజెండ్ల అదే విధంగా శ్రీగురుదేవులు ఎందరికో యజ్ఞశక్తి ద్వారా ప్రాణభిక్షను ప్రసాదించిన పరమ పావన స్థలము, మరియు అనేకమందికి, శ్రీగురుదేవులు అకాల మృత్యుదోషాలను తొలగింప చేసిన అమరభూమి ఈ వేజెండ్ల గ్రామం. శ్రీవేంకటేశ్వర స్వామివారు వెలసి ఉన్నందువలన ఈ గ్రామం మంచి భక్తులకు ఎల్లప్పుడూ విజయాలను ప్రసాదిస్తూనే ఉంటుంది. శ్రీ ఆదిపరాశక్తి అమ్మవారు అవతరించిన స్థలము గనుక, శ్రీ వేజెండ్ల గ్రామానికి ఎందరో అవధూతలు, అనగా సమబుద్ధి, సమభావం కలిగి ఉండి విధి నిషేధం లేనివారు, సాక్షాత్తూ దైవ స్వరూపులెందరో వచ్చి పోయే స్థలం కనుక ఇది దేవభూమిగా వర్ణించారు శ్రీ గురుదేవులు. ఎందుకంటే మహాత్ములైన వారు ఏ ప్రాంతంలో కాలు మోపితే, ఆ ప్రాంతం పునీతం, పవిత్రం అవుతుంది. అలాంటి ప్రదేశాలలో దేవతలు తిరుగుతూ ఉంటారని శ్రీగురుదేవులు తెలియచేశారు. అదే విధంగా మంచి మానవులందరికీ నిరంతరము, అన్ని వేళలయందు, ఎల్లప్పుడూ అనేక శుభాలను పరంపరగా ఇచ్చే అమృతమూర్తులు, అనగా ఎప్పటికీ ఉండేవారైన శ్రీకాళీమాత, శ్రీగాయత్రీమాత, శ్రీలలితాంబికా మాత, శ్రీ భువనేశ్వరీ మాతలు కొలువు దీరిన పుణ్యస్థలము మరియు ఆధ్యాత్మిక విద్యలకు, విజ్ఞాన విద్యలకు నిధి, అదే శ్రీ వేజెండ్ల గ్రామము, అంటూ శ్రీగురుదేవులు వివరించారు.

భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు ఈ విధంగా కూడా తెలియచేస్తున్నారు. ఆధ్యాత్మిక విద్యలు, తాత తండ్రుల నుంచి వారసత్వంగా

వచ్చే విద్యలు కావు. ఒకరివి మరొకరికి పంచి ఇచ్చేవి కావు. మహాకవులు, పండితులు, గురువులు, పీఠాధిపతులు, మరెందరో స్వామీజీలు కఠోరమైన సాధనలు చేసి, అలాంటి స్థితులను పొందుతారు. అయినప్పటికీ వారి సంతానం, వారి తండ్రులు పొందిన స్థితులను పొందలేకపోవచ్చు. తండ్రి జ్ఞానిగా ఉన్నా, పుత్రులు అజ్ఞానులుగా మిగిలిపోవచ్చు, పండిత పుత్రులు కూడా పరమ శుంఠలు కావచ్చు. దానికి కారణం ఆధ్యాత్మిక విద్యలు వ్యక్తిపరంగా సాధన చేసి నేర్చుకోవలసినవే గాని, ధనసంపదలు లాగా ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి పంచటానికి గాని, బదిలీ చేయటానికి గాని వీలుకాదు. ఈ లోకంలో అధిక విద్యావంతులు కావడానికి, ఆధ్యాత్మిక విద్యలలో అగ్రగణ్యులుగా నిలబడటానికి కారణం, వారు పూర్వజన్మలలో చేసిన అనేక పుణ్యకార్యాల ఫలితమే. ఆ కారణం చేతనే వారికి ఈ జన్మల్లో, అనేక విద్యలు నేర్చుకొనే అవకాశాలు కలిగి ఆ అవకాశాలను వారు సరైన మార్గంలో సద్వినియోగం చేసుకుంటూ, వాటికి కృషి, సాధనలను జత చేసుకుంటూ, దినదిన ప్రవర్ధమానం పొందుతూ, అందుకు దైవం కూడా సహకరించటం వలన, వారిలో మంచి గుణాలు, మంచి బుద్ధులు అభివృద్ధి చెందుతాయి. అలాంటి సాధకోత్తములకు మాత్రమే అన్ని విద్యలూ సొంతం అవుతాయని, శ్రీగురుదేవులు తెలియచేస్తూ సిద్ధపురుషుల అనుగ్రహంతో సామాన్యుడు కూడా ధీమాన్యుడు కావచ్చు అంటూ మహాత్ములు, కారణజన్ములైన వారు మామూలు సామాన్య మానవులను కూడా మహిమాన్వితులను చేయగలిగిన శక్తి గలిగి ఉంటారు, అని శ్రీగురుదేవులు ప్రబోధిస్తుంటారు.

**15.సీ॥ నరుల జేజేల్ పెంచు నవ్యబంధమ్ములన్**
**సురపూజ మార్గముల్ శూన్యమగును**
**సభలు సత్కారముల్ సాగుచున్న యపుడు**
**అమరుల దీవెనల్ అందకుండు**
**విమలజగద్గురు లమలకీర్తులజ్యోతి**
**భవబంధముల్ పెంచ భస్మమగును**
**విజ్ఞానజ్యోతులన్ వెలిగించు చిత్తము**
**వైరాగ్య బుద్ధులన్ వరల జేయు**

ఆ. సురలు దగ్గరైన సుజ్ఞానవిభులకు
గోప్యరీతినుండ్రు గొప్ప గురులు
అల్పజనులరాక అపకీర్తి కొనితెచ్చు
మహితమర్మమెరిగి మసలవలయు.

తా॥ ఈ కలియుగంలో కలిమాయలో పడనివారుండరని పెద్దలంటుంటారు. అయితే ఈ లోకంలో పొగడ్తలకు పొంగిపోని వారు, ఇంకా లొంగని వారు ఉండరేమో. సత్కారాల సమయాలలో, ఆ కోలాహల వాతావరణంలో మానవులు పలికే జయజయ ధ్వానాల వలన ఉత్తేజం పొంది, కొత్త బంధాలను పెంచుకున్న వారికి, దివ్యకార్యాలు చేసే అవకాశం, దేవతలను పూజించే భాగ్యం దూరం అవుతుందని అంటారు శ్రీగురుదేవులు. ఎవరైనా ఒక గొప్ప వ్యక్తి లేదా కారణజన్ములైన వారు, నిరంతరం భగవదారాధనలో కాలం గడుపుతూ, జనుల మధ్యలోనికి వచ్చి, తమకు తెలిసినది, ఇతరులకు తెలియని విషయ జ్ఞానాన్ని అందరికీ పంచాలనే సద్భావనతో ఉన్నప్పుడు, తమకు అవసరం ఉన్నా లేకపోయినా, ప్రజల మనోభీష్టం మేరకు కొన్ని తప్పనిసరి పరిచయాలు, అనుబంధాలు ఏర్పడతాయి. అందువలన వారికి, ప్రజలతో మమేకమయ్యే విస్తృతి పెరుగుతుంది. ఉదాహరణకు ఒక పండితుడో, సద్గురువో, స్వామిజీనో లేక పీఠాధిపతో, దైవారాధన ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించుతారు. అంతకు మించి ఎంతో తపశ్శక్తిని, దైవ శక్తిని పొంది ఉంటారు. తమను నమ్ముకున్న భక్తుల యొక్క ఇబ్బందులను, తాము సంపాదించిన జ్ఞానం ద్వారా, శక్తిద్వారా, రకరకాల విధానాలను అనుసరించి తొలగిస్తుంటారు. ఇలాంటి విషయాలు మెల్లమెల్లగా అందరికీ వెల్లడి అవుతాయి. ప్రజలు కూడా అలాంటి మహానుభావుల శక్తిని, లీలలను, తమద్వారా అందరికీ తెలియ చెయ్యడం కోసం, ఆ మహానుభావులకు, వేదికలపైన సభలు ఏర్పాటు చేసి, సత్సంగాలు, ప్రవచనాలు, భజనలు అంటూ చేయిస్తూ, వారికి సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. సన్మానాలు అనేవి, అటువంటి మహానుభావులు చేసిన కృషికి నిదర్శనంగా చేయటం ధర్మమే. చేయించుకోవటానికి కూడా వారు అంతటి అర్హులే కావచ్చు. అలాంటి సత్కారాల వలన, ఆ పండితులు, సద్గురువులు, స్వామిజీలు, పీఠాధిపతుల కీర్తి చంద్రికలు లోకానికి వెల్లడి అవుతాయి. అయితే, అలాగని, ఇలాంటి సన్మానాలకు సత్కారాలకు, అలాంటివారు అలవాటు పడకూడదు.

తమ అత్యంత విలువైన సమయాలను భగవదారాధనలోనూ, తమ శిష్యులకు జ్ఞానబోధలు కావించటంలోనూ, తమ తదుపరి వారి శిష్యులను తమంతటి వారుగా తయారు చేయటంలోనూ విశేషమైన ప్రాధాన్యతను ఇయ్యవలసి ఉంటుంది. తమ శిష్యులను కూడా తమంతటి వారిగా తీర్చిదిద్ది, సభలు సత్కారాలకు వారిని కూడా అర్హులుగా చేయటం వలన, మరల ఆ శిష్యులు తమకు శిష్యబృందాలను ఏర్పాటు చేసుకుంటూ, జ్ఞానబోధలు కావిస్తూ, పరంపరగా ముందుకు సాగటంవలన, మూలపురుషునికీర్తి, తద్వారా వారి పీఠాలకు, సంస్థలకు శాశ్వత కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయని, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు ఎల్లప్పుడూ చెపుతూ ఉంటారు.

అంతే గాక తమకు ఉన్న సమయమంతా సభలు, సన్మానాలు, సత్కారాలు, ప్రజలతో జేజేలు పలికించుకోవడానికే సరిపోతే, ఇదివరకు తాము ఎంతో నిష్ఠగా దైవారాధనకు వినియోగించిన పూర్తి సమయాన్ని ఇప్పుడు వినియోగించలేకపోతారు. ఎల్లప్పుడూ, రేపటి సభాకార్యక్రమాలకు సిద్ధపడవలసిన ఆలోచనలతోనే మనసంతా నిండి ఉంటుంది. మానసికంగా, శారీరకంగా దైవారాధనకు దూరమై పోతారు. దైవారాధన సమయాలు, వాటిని పాటించే నియమాలు, అవకాశాలు దూరమై పోతాయి. తత్ఫలితంగా, అమరులు అనగా దేవతలతో అప్పటివరకూ ఉన్న సాన్నిహిత్యం తగ్గిపోతుంది. తద్వారా దేవతలు, వారి ఆశీస్సులు ఇలాంటి వారికి దూరం అవుతాయని శ్రీగురుదేవులు తెలియచేస్తున్నారు. ఇందులోని నిజానిజాలు ఆలోచించి, తరచి చూసిన వారికి, సంపూర్ణంగా అర్థమవుతాయి. ఈ లోకంలో శ్రేష్ఠులైన జగద్గురువులు భవబంధాలు పెంచుకుంటే, వారి కీర్తి అనే జ్యోతికూడా మసకబారిపోయి, వెలుగు తగ్గిపోతూ, చివరకు ఆ వెలుగు అంతర్ధానం అవుతుంది, అంటూ విజ్ఞానం అనే దివ్యకాంతుల దీపాలను, అక్షయంగా మనసులో వెలిగించిన వారికి మాత్రమే, జ్ఞానంతో వైరాగ్యభావాలు వృద్ధి చెందుతాయి అని అంటూ,ప్రేమను మాత్రం నిరంతరం అభివృద్ధి చేస్తూ, మమకారాలను తొలగించుకోవాలని అంటుంటారు శ్రీగురుదేవులు.

విజ్ఞాన సంపన్నులైన ఆత్మజ్ఞానులకు దేవతలు ఎల్లప్పుడూ దగ్గరగా ఉంటూ, వారితో సంభాషిస్తూ ఉంటారని శ్రీగురుదేవులు తెలియ చేస్తుంటారు. ఆత్మజ్ఞానం సాధించే క్రమంలో, దేవతలు వారికి ఎల్లప్పుడూ అండదండగా ఉంటూ, మాట్లాడుతూ,

మార్గదర్శకులుగా ఉంటారని గ్రహించవచ్చు. ఈ స్థితికి చేరగలిగిన ఆత్మజ్ఞానులు ఈ విశ్వంలో చాలా తక్కువమంది మాత్రమే ఉంటారని తెలుస్తున్నది. ఆ విధంగా దేవతలతో అనుసంధానమై, వారితో సంభాషించే శక్తి కలిగిన మహానుభావులైన వారు, బాహ్య ప్రపంచంలో ఎక్కువగా సంచరించరు, సంబంధాలు పెట్టుకోరు. కాని, అనేక సత్కార్యాలను వారు నిరంతరం లోకకళ్యాణం కోసం చేస్తూ, వాటికి అనుగుణంగా అనేక సన్మార్గాలను ప్రబోధిస్తూ, వాటిని ఆచరిస్తూ, లౌకికమైన సుఖాలకు, భోగాలకూ బహుదూరంగా ఉంటూ కాలం గడుపుతూ ఉంటారు. అల్పజనులంటేే, ఆధ్యాత్మిక భావాలను, ప్రవచనాలను, వాటి సారాంశాలను సరైన రీతిలో అర్థం చేసుకోలేక, తమకు తెలిసిందే సరైన మార్గమంటూ వక్రించి మాట్లాడే అల్పులను దగ్గరకు చేర్చుకున్నప్పుడు, మంచి వారి కీర్తి కూడా పతనమౌతూ, మహాత్ములైన వారికి కూడా అపకీర్తి మిగులుతుంది. ఆ విధంగా ఏర్పడిన అపకీర్తి తాత్కాలికమైనదే, అయినా, శ్రేష్ఠులైన వారికి దివ్యలోకాలలో అమరమైన కీర్తి లభించి, వారు కీర్తికాయులై ఉంటారని తెలుస్తున్నది. లోకం పోకడ ఎలా ఉందంటే, ఎక్కువగా గురువులు, స్వాములు, పండితులు, భౌతికమైన తాత్కాలికమైన కోరికలకు వశులై, తమ పేరు ప్రతిష్ఠలు పెంచుకోవటం కోసం రకరకాల ప్రజాకర్షక విధానాలను అవలంబిస్తారు. అందువలన వారికి కీర్తికంటే, అపకీర్తే ఎక్కువగా వస్తుందని వారు తెలుసుకోలేరు. అదే కలిమాయ. ఆ కలిమాయను జయించే వారే కారణ జన్ములు. అంటూంటారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**16.సీ॥ పూర్వజన్మలకాంక్ష పుట్టి పెరిగినప్డె**

**మంచివాక్కులెపుడు మహిమ గూర్చు**

**దివ్యజనులు నేర్చు నవ్యగానవిధులు**

**భావిజనులకిచ్చు భాగ్యమిదియె**

**నిత్యగానవ్రతముల్ నియతితో చేయంగ**

**మధురస్వరములన్ని మదికి వచ్చు**

**సురలనాకర్షించు సుస్వర గాత్రముల్**

**నరులకిచ్చుచు నుండు సురలకీర్తి**

ఆ॥ నామయజ్ఞములవి నవ్యమోదము లిచ్చు
పూజ స్తోత్రములవి పుణ్యమొసగు
ధ్యానయోగములవి దివ్యాత్మలను జేయు
కాళికాంబతనయ కనుము కృష్ణ !

తా॥ మానవులకు గడచిపోయిన జన్మలలో మిగిలి ఉన్న కోరికలు, ప్రస్తుత జన్మలలో మరలా చిగురించి, పుట్టి పెరిగినపుడు, మంచి వాక్కులు వారికి ప్రాప్తించి, వారిని ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు – ఒక వ్యక్తికి గడచిన జన్మల పరంపరలో, ఒక జన్మలో సాహితీప్రియుడుగాను, మరోజన్మలో సంగీత విద్వాంసుడు గాను, మరికొన్ని జన్మలలో శిల్పిగా, చిత్రకారునిగా, నాట్యాచార్యునిగా, గాయకునిగా, ఇలా ఎన్నో విధాలైన ప్రవృత్తులలో జీవించి, ఆ జన్మలలో, ఆయా వృత్తులయందు కోరికలు తీరక, ఇంకా ఏదో సాధించాలని అనుకుంటూ, అది చేయలేక తనువులు చాలించి, జీవితాలను ముగించటం వలన, అవన్నీ మరుసటి జన్మలలోనికి, పూర్వజన్మల వాసనాబలంగా సంక్రమిస్తాయని అంటారు శ్రీగురుదేవులు. అలాంటి వ్యక్తులకు, ఆయా వృత్తులకు సంబంధించి అనుబంధం ఏర్పడటం, వాటికి సంబంధించిన విషయాలతో అనురక్తి ఏర్పడి, తద్వారా ప్రభావితులై, అలాంటి ప్రక్రియలను, ప్రవృత్తులను వారు అతిసులభంగా, ఎవరి వద్దా ఎక్కువ నేర్వకపోయినా, ఎంతో నిపుణతతో చేయగలుగుతూ ఉంటారు. ఇలాంటివన్నీ పూర్వజన్మల వాసనా బలానికి చెందినవిగా భావించవచ్చును. కొంతమంది శ్రేష్ఠులైన వారు సంగీతంలో ఎన్నో కొత్త కొత్త ప్రయోగాలను చేస్తూ, నూతన ప్రక్రియలకు పునాదులు వేస్తూ, రాబోయే తరాల వారికి మార్గదర్శకులై నిలుస్తారు. ప్రతినిత్యం గానమే ఒక వ్రతముగా, దీక్షగా ఆచరించే వారికి ఎన్నెన్నో మధురాతిమధురమైన స్వరాలు వారి మదిలో ఉద్భవిస్తూ ఉంటాయి. అలాంటి మధుర స్వరాలు విన్న మానవులందరినీ, ఎంతో ఆనందానికి, సంతోషానికి, మధురానుభూతులకు లోను చేస్తాయి. అలాంటి గాత్ర సంగీతములు, దేవతలను సైతం ఆకర్షించి, ముగ్ధులను చేసి, ఆనందపరచినపుడు, దేవతలు మెచ్చి, దేవతలకుండే మహిమలను, కీర్తిని, వైభవాన్ని, శ్రేష్ఠతను, మానవులకు వరాలుగా ప్రసాదిస్తూ ఉంటారు.

మానవులు, దేవతల నామాలను స్మరిస్తున్నప్పుడు, ఆ వ్యక్తులకు, ఇంతకు ముందు తమకు లేని ఆనందము, సంతోషము కొత్తగా సంప్రాప్తమౌతాయి. అందువలన వారు మనశ్శాంతితో, మనో ఉల్లాసానికి లోనై, తమ పనులను గతంలో కన్నా ఇంకా మెరుగ్గా, తేలికగా చేయగలుగుతుంటారు. సమస్యలు, వారిని బాధించవు. మానవులు చేసే పూజలవలన, వారు చదివే స్తోత్రాల వలన వారికి, పుణ్యం లభిస్తుంది. అసలు పుణ్యం అంటే ఏమిటి, పాపం అంటే ఏమిటి. పుణ్యము అంటే సుఖము, సంతోషము. అనేక సుఖాలను పొందుతూ ఆనందమయ జీవితాన్ని గడపటమే పుణ్యం. పాపం అంటే, శోకము, దుఃఖము, అనేక బాధలతో జీవితాన్ని గడపటమే పాపం. ఈ సుఖ, దుఃఖాలు పాపపుణ్యాలు, మానవుల ఆలోచనల వలన, తాము సాగించే అనేక కార్యాల వలన వారికి సంప్రాప్తిస్తాయని శ్రీగురుదేవులు అంటారు.

మానవులుగా జన్మించిన తరువాత ప్రతివారూ కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అన్ని విషయాలనూ సక్రమమైన రీతిలో అంచనాలను వేసుకుంటూ, కాలాన్ని వృధా చేయకుండా పూర్తి చేసుకునే విధంగా ప్రణాళికాబద్ధంగా చేసుకోవాలి. ఎంత ఎక్కువ సమయాన్ని సద్వినియోగం చేసుకోగలిగితే అంత సుఖం ఆనందం లభిస్తాయని శ్రీగురుదేవులు ఎల్లప్పుడూ తెలియ చేస్తుంటారు. అంటే ప్రవృత్తిలో నివృత్తి మార్గాన్ని చూసుకోవాలని శ్రీగురుదేవుల వాక్కులలోని సారాంశం. అనగా మనకున్న సమయంలో కొంత భాగాన్ని ధ్యానానికి, యోగానికి వినియోగించాలి. అలా చేసిన వారికి నిర్మలత్వము, ప్రశాంతత, ఇంకా తృప్తి సంప్రాప్తమై, వారు ధ్యానించే దివ్యరూపాలలో ఐక్యమై, ఈ భువిలో వారు కూడా, ఇతరులచేత ధ్యానించ బడుతూ, ఆరాధించబడుతూ, పూజనీయులై, మరికొందరికి మార్గదర్శకులు అవుతారు. అలా కాలాన్ని సద్వినియోగపరచుకున్నవారు, దివ్యమూర్తులై వెలుగొందుతారు, అని తెలియచేస్తున్నారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**17.సీ॥ అద్భుతశక్తి యౌ అమ్మకాళి ఘనత**
**గర్వావధానుల కందదాయె**
**ఆశుకవీంద్రులు నవనిలో నెప్పుడు**
**కాళిరూపమ్ములన్ కనగలేక**

దూషణమ్ములు చేయు దుష్టాత్ములిలలోన
తుచ్ఛ జన్మలయందు దౌర్భుచంద్రు
ఖలులైన మానవుల్ కలియుగాన నెపుడు
కానకుందురు దివ్యకాళిమహిమ

ఆ॥ అవని సన్మానములనెన్నొ అందుకొనిన
అమ్మ కృపలేక సుజ్ఞాన మందలేరు
వాక్కులందు నియంత్రణ వలయు కవికి
కాళికృష్ణునివాక్కులు కనకనిధులు

తా॥ ఆదిపరాశక్తి శ్రీ కాళీమాత మహామంత్రాలను ఉపాసిస్తూ అమ్మవారి నామరూపాలను మనసులో ధరించినపుడు ఆతల్లిలోని అనంతమైన అద్భుతఘనశక్తులు దివ్య లీలలు ఉపాసించే వ్యక్తిలో ప్రవేశిస్తాయి. అలా అమ్మవారి అనుగ్రహం పొందినవారు ఈ ప్రపంచంలో గొప్పగొప్ప అవధానులు, ఆశుకవులు ఎందరో వున్నారు. వారి కవితాపాండిత్యప్రకర్షచేత ఎందరో గొప్పవారి మన్ననలను పొందుతూ స్వర్ణరత్నకంకణాభరణాలు బహుమతులుగా పొందుతూ ఈనాడు కలిమాయాప్రభావంవలన అమ్మవారి అవతార విశేషాలను తెలుసుకోలేక నేను గొప్ప కవిని, పండితుడను నాకు సాటి నేను తప్ప మరియొకరు లేరు అని ఉప్పొంగి పోయే గర్వాంధకారులు కొందరుంటారు. ఎంతటిఆశుకవి పండితేంద్రఅవధానులకైనా ఆ లోకమాత శ్రీ విశ్వజనని విద్యాప్రదాయినియొక్క శక్తి ఘనత లీలావిశేషాలు కొందరికి ఎన్ని జన్మలెత్తినా తెలియకపోవచ్చు. పాండిత్యాన్ని ప్రదర్శించే పలువిద్యలు ఎన్ని నేర్చినా గర్వం అనే అంధకారం వారి మనసుని కప్పి వుంచినంతకాలం ఆదేవియొక్క అవతారవిశేషాలను అల్పబుద్ధి జనులు తెలుసుకోలేరు వారి ఊహకు కూడా అందదు, కుటిలమనసుకు స్ఫురించదు. ఆశువుగా కొన్ని వేల పద్యాలను ఏకసంథాగ్రహణ శక్తితో అప్పటికప్పుడే అలవోకగా చెప్పగలిగినా అల్పబుద్ధి కలిగిన కవీంద్రులకు ఆ జగన్మాత శ్రీకాళీమాత యొక్క దివ్యరూప వైశిష్ట్యాలను లీలావిశేషాలను చూడగలిగే భాగ్యం వారి కనులకు కలుగదు. ఆకర్షిత జన

సమూహాల జయ జయ ధ్వానాల నడుమ బ్రతుకుచున్న దుష్టమతులు, అమ్మ శ్రీ కాళీ మాతను క్షుద్రదేవి అని నిందించే క్షుద్రబుద్ధి కలిగిన దుష్టాత్ములు భావి వర్తమాన జన్మలలో అంతులేని దుఃఖ వలయాలలో చిక్కుకొని మ్లేచ్ఛజన్మలు సంపాదించుకొనే మేధావులుగా మిగిలిపోతారు. దుర్జనులు గర్వాంధకారంలో దేవి శ్రీకాళీ మాతను దూషించటంవల్ల వారు శోకసాగరంలో మునిగిపోయి ఎన్నో బాధలు అనుభవిస్తూ అపకీర్తిని పొందుతారు. అటువంటికుజనులైన సంకుచితబుద్ధులకు శ్రీ కాళీ మాత మహిమలను తెలుసుకోవడం అంత సులువేమీ కాదు. నిరంతరం బాహ్యాభోగాలలో తేలియాడే వారికి అంతర్లీనంగా వున్న ఆత్మశక్తి అమృతానందప్రదాయిని అయిన శ్రీవరకాళీమాతను అర్థం చేసుకోలేక అలమటిస్తూ వుంటారు. సన్మానాంబుధి కిల్బిషకూపంలో పడిపోయినవారికి పరాశక్తి శ్రీకాళీమాత పరమార్థమును తెలుసుకొనుట సాధ్యమా సన్మానంకన్నా సన్మార్గం సత్యభాషణ మిన్న. అదే ఆ దేవిని చేరే మార్గం. మోక్షాన్ని పొందటానికి మోహక్షయం జరగాలి. మోహాంధకారంలో మునిగివున్నవారికి జన్మ వృధా అవుతుంది. మానవులజీవితలక్ష్యాలు అనేకవిధాలుగా వుంటాయి. అవి అమ్మవారిని చేరే మార్గాలైతే మంగళప్రదంగా వుంటాయి. అమ్మవారి అవతారవిశేషాలను అర్థం చేసుకోగలిగిన ఆత్మజ్ఞానులే అవనిలో శ్రేష్ఠమైన విద్యాపాండిత్య పరకర్ష కలిగిన భాగ్యవంతులు. అమ్మవారి కృపా కటాక్షాలు కలగనంత వరకు జ్ఞానం సిద్ధించదు. అలాంటి వారే అమ్మవారి అవతారవిశేషాలను అర్థం చేసుకోలేని అల్పజ్ఞులు. అమ్మవారి అవతారవిశేషాలను అర్థం చేసుకోగలిగిన వారే అనంత జ్ఞానాత్మ సిద్ధి సంపన్నులు వారే మోక్షానికి అర్హులు. కవులై పండితులై ఎంతో కష్టపడి సాధన ద్వారా సముపార్జించిన విద్యలు వారు పలికే వాక్కులలో నియంత్రణ లేకపోతే దుఃఖ సాగరంలో దొర్లుతూ జీవితాన్ని గడపవలసి వస్తుంది. శ్రీకాళీమాత అవతార విశేషాలను అర్థం చేసుకొని అందరికీ తెలియజేసి ఆనందింపజేస్తే వారికి అదే ఆఖరి జన్మ అంటూ ఇవి బంగారపు వాక్కులు స్వర్ణనిధులు అంటారు, పై పద్యంలో శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురు మహరాజ్ గారు.

# 16. నాశక్తి శక్తి (తాత్పర్యములతో)

భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, ఈ శీర్షిక పేరు నా శక్తి శక్తి అని పెట్టారు. ఇందులోని నిగూఢార్థం తెలుసుకొని వ్రాయాలంటే ఒక గ్రంథమే అవుతుంది. కానిమనం క్లుప్తంగా తెలుసుకోవటానికి ప్రయత్నిద్దాం. కనుక వారి శక్తికి మూలకారణమైన శక్తి ఏమిటో వారినే అడిగి తెలుసుకోవాలని నాకు అన్పించి 'గురుదేవా' ... మీశక్తికి కారణమైన ఆ అపరశక్తి ఏమిటో తెలియజేస్తారా, అని వినయంగా అడిగాను. వారు ఎప్పటి మాదిరిగానే చిరునవ్వులు చిందిస్తూ, 'మాస్టారూ ... మీరు ఎంతో కాలం నుంచి నా దగ్గరకు వస్తున్నారు, ఇక్కడ జరిగేవన్నీ చూస్తున్నారు. మీకు నేను చెప్పాలా? అంటూ "నాలో ఉన్న ప్రాణశక్తే శ్రీ ఆదిపరాశక్తి, నన్ను నడిపించేది, నాతో పలికించేది, అంతా శ్రీ ఆదిపరాశక్తి శ్రీవరకాళీ మాతయే" అంటూ నా శక్తికి మూలకారణం ఏమిటో మీరే చెప్పండి" అని సూటిగా నా వంక చూస్తూ, నవ్వి, లోతైన సమాధానం ఇచ్చారు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. వారి భావం అర్థం చేసుకోవటం చాలా కష్టం. వారు ఏదైనా చెబితే దాని భావం సముద్రపులోతుకన్నా ఇంకా ఎక్కువగా కన్పిస్తుంది. అంత లోతుకు ఎవ్వరూ వెళ్లడానికి సాహసించరు. కనుక వారు చెప్పే విషయాలను శ్రద్ధగా పరిశీలించి, అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం వలన మేలు కలుగుతుంది. వారి అనుభవాలు, అనుభూతులు, అన్నీ శ్లోకాలు, పద్యాల రూపంలో ఉంటాయి. మచ్చుకు ఈ శీర్షికలోని మొదటి పేజీలో ఆణిముత్యాలవంటి పద్యాలను పరిశీలిస్తే శ్రీగురుదేవులు ఏమంటున్నారో ఈ క్రింది పద్యంలో మీరే చూడండి...

**1. సర్వేశ్వరీ జనని సద్గురు మహాదేవి కాళి**
**దివ్యగాయత్రి శ్రీలలిత భువనేశ్వరీ దేవి**
**వేంకటేశుని సాక్షిగా వేజెండ్లపురములోన**
**పరమాదిమూర్తి శ్రీకాళి ప్రబోధించినవిద్య**

... అంటూ రచించారు. అయితే సకల లోకాలకూ ఈశ్వరి, సర్వాధికారిణి, సచ్చిదానందమూర్తి అయిన శ్రీవిశ్వమాత, ఈ జగత్తును పాలించే జగజ్జనని శ్రీవరకాళీ మాతయే వారికి సద్గురుమూర్తి అంటూ తెలియజేస్తూ, శ్రీవరకాళీమాత, శ్రీగాయత్రీ

మాత, శ్రీలలితామాత, శ్రీభువనేశ్వరీ మాతలు, నిరంతరము వేదాలచేత స్తుతింపబడే దేవతామూర్తులు. వీరు శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాక్షిగా వేజెండ్ల పురంలో శ్రీకాళీమాత, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారికి, ఈ విధంగా తెలియజేసింది.

ఆ తల్లి శ్రీవరకాళీమాత సనాతన ధర్మాలను, ప్రస్తుత కాలచక్ర మర్మాలను కలియుగ ధర్మాలను, మానవునిగా పుట్టిన తరువాత వివిధ దశలలో ఎలా ఉండాలి, పరమపదానికి, మోక్షమార్గానికి ఎలాంటి సాధనలు చేయాలి అనే విషయాలను, అమరలోకప్రాప్తిని ప్రసాదించే ఆదిపరాశక్తి మోక్షసామ్రాజ్యాన్ని పరిపాలించే శ్రీకాళీమాత, శ్రీగురుదేవులకు ప్రబోధించినట్లు వారు తెలియజేస్తున్నారు. అలాగే ఈ క్రింది పద్యం పరిశీలిస్తే...

**2. నిష్ఠతో చేయుమా నివృత్తికార్యమ్ముల ననుచు**
**ఆశీర్వదించె ఆదిపరాశక్తి అమరమూర్తి**
**నవ్యబోధలు చేయును నాగురువు వరకాళి**
**విమలవిద్యలు నేర్పెడి విజ్ఞానమూర్తి కాళి**

అనగా ... ఆ తల్లి శ్రీకాళీమాత ప్రబోధం ఇంకా ఇలా కొనసాగింది. ప్రతి పనిని ఎంతో నిష్ఠతో చేయాలి. మంచి మనసుతో, శ్రేష్టమైన భావాలతో, భక్తి, శ్రద్ధలతో మనం చేసే పనులు, ఇతరులకు సహాయపడేవిగా, అనగా అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఆకలిదప్పులతో ఎవరు బాధ పడుతున్నా వారికి సహాయం చెయ్యాలని, అందరూ కలిసి, మెలసి ఐక్యభావంతో ముందుకు వెళ్లాలని, లోకులహితం కోరాలని, అందువలన మోక్షసామ్రాజ్యం చేరే మార్గం సుగమం అవుతుందని శ్రీకాళీమాత, శ్రీగురుదేవులకు ప్రబోధించినట్లు పై పద్యంవలన తెలుస్తున్నది. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారికి, ఆ తల్లి శ్రీకాళీమాత, ప్రతిరోజూ, క్రొత్త, క్రొత్తవి శ్రేష్టమైనవి, మంచి మాటలు చెప్పే తల్లి, మంచి, మంచి విద్యలను అందరికీ ఉపయోగపడే విద్యలను నేర్పించే గొప్ప మహిమాన్వితశక్తి కలిగిన మూర్తి. అందువల్లనే, అన్నీ తెలిసిన శ్రీవరకాళీమాత నాకు సద్గురువంటూ శ్రీగురుదేవులు తెలియజేస్తున్నారు. తదుపరి పద్యంలో వారు ఏమంటున్నారో మీరే చూడండి.

**3. క్షణక్షణావతారిణి అక్షయమూర్తి శ్రీకాళి**
**అమ్మ కాళి నేర్పించును ఆత్మధ్యానయోగముల్**
**నిత్యనిర్మలత్వము శాంతి నిండుగా నిచ్చి కాళి**
**అమ్మ పలికించి వ్రాయించు అమృతాక్షరముల్**

అంటూ... ఈ పై పద్యాన్ని రచించారు శ్రీగురుదేవులు. అనుక్షణమూ, అవసరం అనిపిస్తే, పిలిచినా, పిలువకపోయినా, దేవి తనంతట తానే, అన్ని వేళలలో, నిరంతరము అవతరించి, అవసరాన్ని తీర్చే ఆపద్బాంధవి శ్రీ ఆదిపరాశక్తి, శ్రీకాళీమాతయే. సామాన్యులకు అంతు చిక్కని, ఆత్మ ధ్యాన విద్యలను, అనేక యోగ విద్యలను నేర్పించి, నిరంతరము, ఏ వేళయందైనా, ఏ పరిస్థితులలోనైనా, పట్టుదలగా, ఆనందంతో, ప్రశాంతంగా ఉండే గొప్ప ఓర్పుని, మనోధైర్యాన్ని, సదా సహన సంతృప్తిని, పరిపూర్ణంగా ప్రసాదిస్తూ శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారితో, కలకాలం నిలిచి ఉండే, అమృత సమానమైన అక్షరాలను పలికిస్తూ, వారిచేత వ్రాయిస్తూ ఉండేది. శ్రీకాళీమాతయే నని తెలియ చేస్తున్నారు శ్రీగురుదేవులు. ఈ క్రింది పద్యం చూస్తే మీకే తెలుస్తుంది...

**4. వేంకటకాళీకృష్ణుడ నైననాకు వేజెండ్లలో**
**అగ్నిహోత్రదీక్షలు ఆచరింపు మనుచు కాళి**
**సృష్టిమర్మముల్ దేవి స్పష్టముగ తెలిపెను**
**వేదాంతఘనమూర్తి వేజెండ్లపురవరకాళి**

అంటూ... పై పద్యాన్ని రచించారు శ్రీగురుదేవులు. శ్రీ వేంకట కాళీకృష్ణ నామము కలిగిన నన్ను, శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాత వేజెండ్ల గ్రామములో, అగ్నిహోత్రము యొక్క విశిష్టతను తెలియచేసి, దానిని ప్రతిరోజూ 18 సంవత్సరాలు నిత్యాగ్ని హోత్రంగా ఆచరించమని, దానిని ఎంతో నిష్టతో, భక్తి శ్రద్ధలతో చేయటంవలన లోకంలో కొంత శాంతి వర్ధిల్లుతుందని వారికి, శ్రీకాళీమాత తెలిపినట్లుగా, శ్రీ గురుదేవులు ఈ పై పద్యంలో తెలియచేస్తున్నారు. అదే విధంగా ఈ చరాచర జగత్తుయొక్క మూలము, వాటి వెనుక ఉండే సృష్టి మర్మాలను, అనగా, ప్రాణుల జననం, మరణం, పుట్టేటప్పుడు ఎక్కడి నుంచి వస్తాయి, మరణించిన తరువాత దేహాన్ని వీడి ఆత్మప్రాణశక్తి ఎటు వెళుతుంది, మనిషి జీవించి యున్న

కాలంలో వారు అనుభవించే సుఖ, దుఃఖాలు, వాటికి మూలకారణాలు మొదలుగా గల ఎన్నో మర్మాలను, ఇంతవరకూ, ఎక్కడా లభ్యంకాని గొప్ప రహస్యాలను ఎంతో వివరంగా, అర్థమయ్యే రీతిలో సకల శాస్త్రాలకు, వేదాలకు ఆదిమూర్తి అయిన శ్రీకాళీమాత, శ్రీగురుదేవులకు ఎంతో విస్పష్టంగా తెలియచేసినట్లు అర్థమౌతున్నది. సృష్టికి సంబంధించిన రహస్యాలు ఏ గ్రంథాలలో లభించినా అవి ఎక్కువ శాతం ఊహాజనితాలు, కాల్పనికాలుగానే ఉంటాయి. అవి వ్రాసేవారు, వారి అభిప్రాయాలను మాత్రమే చెప్పగలిగే అవకాశం ఉన్నది. అయినా శ్రీకాళీమాత, తమకు ఈ విధమైన విషయాలను తెలియచేశారని చెప్పగలిగిన వారు చాలా అరుదుగా ఉండవచ్చును. కాని, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, ఆ తల్లి తమకు ప్రబోధించే విషయాలను సందర్భానుసారంగా, తమ భక్తులకు తెలియచేస్తూ, వారికి తగిన మార్గదర్శనం చేయటం, శ్రీగురుదేవులకున్న విశిష్ట లక్షణం. అదే వారిదైవ గుణం. వారికున్న గొప్పదనం. శ్రీగురుదేవులు వ్రాసిన ఈ క్రింది పద్యంలో ఏమంటున్నారో మీరే చూడండి...

**5. అన్నివేళల నన్ను ఆదరించి నడిపించును**
**సనాతన మౌశక్తి శ్రీకాళి సద్భాషితమూర్తి**
**కాళిమాత తెల్పును కారణముల నన్నిటిన్**
**ఆద్యంతరహితమూర్తి అమ్మ కాళి నాగురువూ**

అంటున్నారు అన్ని సమయాలలో, సర్వకాల సర్వావస్థల యందునూ, శ్రీగురుదేవులను ఆదరించి, నడిపించే సద్గురుమూర్తి, అనాది కాలం నుంచి అలరారుతున్న శ్రీ ఆదిపరాశక్తి, శ్రీ కాళీమాతయేనని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు తెలియచేస్తున్నారు. వారు ఇంకా ఇలా తెలియ చేస్తున్నారు - మంచి మాటలు మాట్లాడుతూ, మంచి మాటలనే మాట్లాడమని చెప్పే తల్లి శ్రీకాళీమాత. అన్ని కారణాలను, అనగా జన్మ రావటానికి, సంతానం కలగటానికి, కలగకపోవటానికి ఎన్నెన్నో సుఖ, దుఃఖాలను అనుభవించడానికి, ఆశలు తీరకుండానే వృద్ధాప్యం, ముసలితనం రాకుండానే మానవులు, ఇతర ప్రాణులు కూడా మధ్యలోనే మరణించి, మళ్లీ, మళ్లీ జన్మించటానికి, అన్ని కారణాలను తెలియచేసే అమృతశక్తి, ఉన్నతమైన తల్లి శ్రీకాళీమాత. ఇతరులకు అనగా అల్పులైన

అజ్ఞానులకు ఎవరికీ పట్టుబడని దేవి, ఇహపరాలకు సద్గురుమూర్తియైన శ్రీకాళీమాతయే నాకు గురువు అంటూ, అందరికీ తెలియచేస్తూ వారి భక్తి భావాన్ని గొప్ప శక్తియుక్తులను ప్రదర్శించి ఈ క్రింది పద్యంలో ఎంతో చక్కగా వినయంగా తెలియచేశారో మీరే చూడండి ...

**6. సకలశుభముల నిచ్చు సర్వరక్షణశక్తి**
**అమ్మ వరకాళి చూపిన ఆదివ్యమార్గమున**
**విహరించుచుండెడివిద్యార్థి నే నెపుడు**
**విశ్వసుజనులార ఘనులార వినరే మీరు**

అంటూ ... శ్రీగురుదేవులు, వినయభావాన్ని చూపుతూ పలికిన పద్యరత్నం ఇలా ఉన్నది. అన్ని శుభములను ప్రసాదిస్తూ, అన్నివేళలా రక్షించే, అతులిత బలమూర్తి, అమేయశక్తి సంపన్నురాలు అయిన శ్రీకాళీమాత అమ్మవారు చూపిన శ్రేష్ఠమైన, ఉన్నతమైన, మంచి మార్గంలో ప్రయాణిస్తున్న శ్రీగురుదేవులు, అమ్మ శ్రీకాళీమాత దగ్గర ఎప్పుడూ తాను విద్యార్థినే అంటూ వినయంగా చెపుతున్నారు. సద్గురు శ్రీకాళీమాత వద్ద నేర్చుకునే అనేకవిద్యలు పూర్వ జన్మలలో, ఈ జన్మలో, రాబోయే జన్మలలో ఇంకా ఎప్పుడైనా వారికి జన్మంటూ ఉంటే, ఏ జన్మలోనైనా వారు ఆ తల్లికే విద్యార్థినంటూ తెలియచేస్తున్నారు. ఆ తల్లి శ్రీ ఆదిపరాశక్తియే, శ్రీగురుదేవులకు సద్గురుమూర్తి అని అంటూ, ఈ ప్రపంచంలో గొప్పవారందరూ ఈ విషయాలను తెలుసుకోవాలని, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు అందరికీ తెలియచేస్తున్నారు.

# 17. శ్రీ షోడశి జప మంత్రములు

ఓం క్లీం శ్రీం హ్రీం హ్రౌం హ్రూం క్రీం శ్రీవరకాళికాయై నమః
ఓం భూర్భువస్స్వః శ్రీం క్లీం యం శ్రీగాయత్రీదేవ్యై నమః
ఓం ఐం హ్రీం శ్రీం క్లీం సౌః ఓం శ్రీలలితాంబికాయై నమః
ఓం హ్రీం శ్రీం క్లీం శ్రీం హ్రీం క్లీం ఓం శ్రీ భువనేశ్వర్యై నమః
ఓం హ్రీం క్లీం శ్రీ సంతానబాలవేంకటేశాయ నమః

## శ్రీవేజెండ్ల శ్రీమాతల వర్ణన

ఓం శ్రీమద్గురు వరకాళీ మేకవదన దశభుజస్వరూపాం క్రీం శ్రీకాళికామ్
ఓం భూర్భువస్స్వః పంచవదన దశభుజస్వరూపాం యం శ్రీ గాయత్రీమ్
ఓం శ్రీం ఏకవదన చతుర్భుజస్వరూపాం ఐం హ్రీం శ్రీం శ్రీ లలితాంబికామ్
ఓం హ్రీం ఏకవదన దశభుజస్వరూపాం శ్రీం హ్రీం క్లీం శ్రీ భువనేశ్వరీమ్
వేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తిపీఠ శ్రీచక్రస్థలనివాసినీభ్యో నమః.

## శ్రీ వేజెండ్ల పుర శ్రీచక్రపీఠస్థ
## శ్రీవరకాళీ గాయత్రీ లలితా భువనేశ్వరీ మాతల మూల మంత్రములు

ఓం క్రీం హూం హ్రీం మహాకాళికే
క్రీం క్రీం హూం హూం హ్రీం హ్రీం క్రీం కామదాత్రి
హ్రీం హుం ఫట్ స్వాహామూర్తి స్వరూపిణి

ఓం భూ ర్భువః స్వః తత్సవితు ర్వరేణ్యం భర్గో దేవస్య ధీమహి
ధియో యో నః ప్రచోదయాత్ – స్వరూపిణి

ఓం శ్రీం హ్రీం క్లీం సౌః ఓం హ్రీం శ్రీం శ్రీలలితాంబికాదేవి
సౌః ఐం క్లీం హ్రీం శ్రీం బీజమహామంత్రాదిస్వరూపిణి

ఓం హ్రీం శ్రీం క్లీం భువనేశ్వర్యై స్వాహా సుస్వరూపిణి
క్లీం హ్రీం శ్రీం ఓం హ్రీం ఓం శ్రీం హ్రీంకారాదిస్వరూపిణి
శ్రీవరకాళీగాయత్రీ లలితా భువనేశ్వర్యః సదా
పాహి మాం వేజెండ్ల పురవాసినీభ్యః నమ స్సర్వాభ్యః

# 18. శ్రీ వేజెండ్లపురవాసిని శ్రీవరకాళీ సుప్రభాతమ్

**బౌళి రాగం**

**1. ఓం శ్రీమాతః ! చిద్రూపిణి ! కాళికే ! బ్రహ్మాదిసంసేవితే !**
**కారుణ్యాంబుధివారుణి ! సురనుతే ! కరుణాలయే ! కాళికే !**
**క్రీం బీజే ! శ్రుతినాదబిందువినుతే ! క్రీంకారనాదప్రియే !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సకల సంపదలను ప్రసాదించే శ్రీకాళీమాతా ! విశిష్ట విజ్ఞాన స్వరూపిణీ! బ్రహ్మ మొదలైన దేవతలచేత పూజించబడే కరుణా ప్రవాహమైన దేవీ ! దేవతలచే పూజించబడే మాతా ! దయా స్వభావానికి నిలయమైన కాళీ ! క్రీం బీజాక్షర స్వరూపిణీ! వేదనాదాలచే స్తుతించబడే వేదమాతా ! క్రీంకారనాదంపట్ల ఆసక్తిని చూపే శ్రీకాళీమాతా! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించి వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాతమగు గాక !

**2. ఆత్మానాత్మవిచారిణి ! జ్ఞానప్రదే ! చైతన్యబీజాక్షరే !**
**బ్రహ్మాదిపిపీలికాంతజగదానందసంధాయిని !**
**సద్భక్త్యార్చితపాదపల్లవయుగళే ! భక్తార్తిచింతామణి !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ఆత్మ అనాత్మల స్వభావాలను ఆలోచించి గ్రహింపజేసే దేవీ ! జ్ఞానాన్ని ప్రసాదించే విజ్ఞాన స్వరూపిణీ ! చైతన్యాన్ని కలిగించే బీజాక్షరాలకు నిలయమైన శుభస్వరూపిణీ! బ్రహ్మ నుంచి చీమవరకూ ఉన్న సమస్తలోకాలకూ ఆనందాన్ని కలిగించే ఆహ్లాద స్వరూపిణీ ! త్రికరణశుద్ధితో కూడిన భక్తిచేత పూజించబడే పాదపద్మములజంట గలిగిన పవిత్రస్వరూపిణీ ! భక్తులయొక్క బాధను తొలగించే చింతామణీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాత మగుగాక!

**3. దరహాసోజ్జ్వలచంద్రికే ! కాళికే ! సుమనోజ్ఞతన్మాత్రికే !**
**కవిబ్రహ్మానందప్రదాయిని ! కంకాళహారావళీవిలసితే !**
**పాశాంకుశసర్వాయుధాదిహస్తే ! సదా దుర్నిరీక్ష్యాకృతే !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ మిక్కిలిగా ప్రకాశించే పున్నమి వెన్నెలలాంటి చిరునవ్వుతో వెలుగొందే కాళికాదేవీ ! అత్యంత మనోహరమైన పంచతన్మాత్రలైన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలతో విలసిల్లే విశ్వమాతా ! కవులకు విశిష్టమైన ఆనందాన్ని ప్రసాదించే అమృతస్వరూపిణీ ! కంకాళహారసమూహాలతో ప్రకాశించే కాళీమాతా ! పాశం, అంకుశంలాంటి సమస్తాయుధాల్ని చేతులలో ధరించిన విచిత్రస్వరూపిణీ ! శత్రువులకు ఎల్లప్పుడూ ఎదుట నిలబడి చూడటానికి సాధ్యంకాని తీక్షణరూపిణీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ! నీకు సుప్రభాత మగుగాక!

**4. సౌవర్ణాంబరధారిణి ! వరప్రదే ! భద్రాత్మికే !**
**చండముండనిషూదిని ! దైత్యదమని ! త్రిపురాదిసంహారిణి !**
**ఆర్తత్రాణపరాయణి ! కాళికే ! శరణాగతై స్సేవితే !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ బంగారువస్త్రాలను ధరించినభవ్యమాతా ! వరాలను ప్రసాదించే భద్రస్వరూపిణీ ! చండుడు, ముండుడు అనే రాక్షసుల్ని చెండాడిన వీరమాతా! రాక్షసమూకల్ని నాశనం చేసిన రౌద్రస్వరూపిణీ ! త్రిపురాదుల్ని మట్టుపెట్టిన తీక్ష్ణరూపిణీ ! ఆర్తుల్ని రక్షించటంలో అత్యంత నైపుణ్యం కలిగిన మాతా ! శరణని వచ్చినవారిని కాపాడే కరుణాస్వరూపిణీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాతమగు గాక !

**5. బ్రహ్మాండాదిసమస్తలోకసృష్టికర్త్రి ! పాలికే ! ఆద్యంతరహితోజ్జ్వలే !**
**జ్ఞానక్షీరామృతవర్షిణి ! మాతృకే ! జీవాదిసంరక్షిణి !**
**బ్రహ్మానందసంధాయిని ! అగణితే ! జ్ఞానేశ్వరి ! జ్ఞానప్రదాత్రి !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ బ్రహ్మాండాలు మొదలైన సమస్తలోకాల్ని సృష్టించి పాలించే తల్లీ! ఆద్యంతాలు లేని అసదృశరూపిణీ ! జ్ఞానం అనే పాలను, అమృతాన్ని వర్షించే తల్లీ! సమస్తజీవుల్ని రక్షించే సాటిలేని మాతా ! విశిష్టమైన ఆనందాన్ని సమకూర్చే అమృత స్వరూపిణీ ! లెక్కించటానికి వీలుకాని మాహాత్మ్యంతో ప్రకాశించే వెలుగుల తల్లీ ! అత్యధికజ్ఞానానికి అధినేత్రివై, జ్ఞానాన్ని ప్రసాదించే జ్ఞానస్వరూపిణీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాత మగుగాక!

**6. భక్తిముక్తిప్రదాత్రి ! అంబికే ! సర్వార్థసిద్ధిప్రదాత్రి !**
**శ్రీభువనత్రయకారిణి ! మాలిని ! జీవాదిసంపోషిణి !**
**దుష్కరముష్కరరాక్షసాదిదమని ! లోకాదిసంరక్షిణి !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ భక్తినీ ముక్తినీ ప్రసాదించే భవ్యమాతా ! సర్వప్రయోజనాల్నీ, సిద్ధుల్నీ ప్రసాదించే సాధుస్వరూపిణీ ! ముల్లోకాలకు కారణమైన మూలమాతా ! వివిధ మాలలను ధరించి ప్రకాశిస్తూ సమస్త జీవుల పోషణ భారాన్ని వహించే మాతృమూర్తీ! దుష్కరుడు, ముష్కరుడు అనే రాక్షసుల్ని నాశనం చేసి లోకాలనన్నిటినీ రక్షించే కరుణాస్వరూపిణీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాత మగుగాక !

**7. బ్రహ్మవిష్ణుమహేశ్వరాదివినుతే ! శ్రీ ఆదిశక్తే ! ఆనందప్రదాయిని!**
**సృష్టిస్థితిలయకారిణి ! సుఖకరి ! శుభకరి ! జగదీశ్వరి !**
**బ్రహ్మాండాదిసమస్తలోకపాలికే ! విలసత్సమ్రాజ్ఞే !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు మొదలైన దేవతలచేత స్తుతింపబడే శ్రీ ఆదిపరాశక్తీ ! ఆనందాన్ని ప్రసాదించే సంతోష స్వరూపిణీ ! సృష్టి, స్థితి, లయాలకు కారణమైన మాతృస్వరూపిణీ ! సుఖాల్ని, శుభాల్ని కలిగించే జగదీశ్వరీ ! బ్రహ్మాండం మొదలైన సమస్తలోకాల్ని పాలించే ప్రకాశస్వరూపిణీ ! విశిష్టసామ్రాజ్యానికి పరిపాలకురాలి వైన తల్లీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ! నీకు సుప్రభాత మగుగాక !

**8. సర్వభూతాత్మికే ! రక్షణి ! భద్రేశ్వరి ! ముద్రిణి !**
**సర్వమంత్రాత్మికే ! మంత్రిణి ! తంత్రాదిసంసేవితే !**
**సర్వనాదాత్మికే ! నాదిని ! భవపాశనాశాత్మికే !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సర్వప్రాణుల ఆత్మల్లోనూ నిలిచి ఉండే రక్షాస్వరూపిణీ ! క్షేమాన్ని కూర్చటంలో ప్రత్యేకముద్రను కలిగిన భద్రమూర్తీ ! ఆలోచనల్ని చెప్పగలిగిన సమర్థత ఉన్న ఆదర్శస్వరూపిణీ ! తంత్రాలచేత సేవించబడే తాంత్రిక స్వరూపిణీ ! సర్వనాదాల్ని

ఆత్మలో నిక్షిప్తం చేసుకొన్న నిర్మలస్వరూపిణీ ! అనాది నుంచీ ఉన్న అమృతస్వరూపిణీ! భవబంధాల్ని తెంచే శ్రీకాళీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ! నీకు సుప్రభాతమగు గాక !

**9. సద్భక్త్యార్చితపాదపల్లవయుగళే ! శ్రీకాళి ! చిద్రూపిణి !**
**సతతసాధకమార్గదర్శనకరి ! శ్రీయోగయోగేశ్వరి !**
**శ్రీయోగీశ్వరసహస్రకమలవాసిని ! శ్రీశక్తిసంధాయిని !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ నిర్మలమైన భక్తిచేత పూజించబడే పాదపద్మాలజంటతో ప్రకాశించే పావనమూర్తీ ! చిత్తంలోనే రూపాన్ని ఏర్పరచుకోగలిగిన తల్లీ ! నిరంతరం సాధకులకు మంచిమార్గాన్ని దర్శింపజేసే దయాస్వరూపిణీ ! శ్రీకర మైన 'యోగ అయోగాలకు' ఈశ్వరివై, శ్రేష్ఠమైన యోగులహృదయకమలాల్లో ఉంటూ శ్రీశక్తిని ప్రసాదించే దివ్యమాతా ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాత మగుగాక !

**10 లోకాలోకసుపూజితే ! అసదృశే ! లోకత్రయాంకస్థితే !**
**వేజండ్లస్థితివిలసిని ! జయకరి ! శ్రీవిబుధసంసేవితే !**
**శ్రీసద్భక్త మకుటాయమాన వేంకట కాళీకృష్ణ ప్రతిష్ఠితే ! సదార్చితే !**
**శ్రీకాళికే ! వరవర్షదాయిని ! శ్రీచక్రపీఠస్థే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సాటిలేని మేటిమాతవై సకల లోకాలచేత పూజించబడే సౌమ్యస్వరూపిణీ! ముల్లోకాల స్థితికి మూలకారణమైన తల్లీ ! వేజెండ్లలో కొలువై ప్రకాశించే విశిష్టమాతా! సదా విజయాల్ని ప్రసాదించే విశ్వమాతా! పండితవర్యులచేత మిక్కిలిగా సేవించబడే పావనమూర్తీ ! మంచి భక్తులశ్రేణిలో అగ్రభాగాన నిలవగలిగే శ్రీ వేంకట కాళీ కృష్ణులచేత ప్రతిష్ఠించబడి, నిరంతరం పూజించబడే పుణ్యస్వరూపిణీ ! శ్రీచక్రపీఠంపై అధిష్ఠించిన వరప్రసాదినివైన శ్రీవరకాళీ ! నీకు సుప్రభాత మగుగాక !

# 19. శ్రీ వేజెండ్ల పురవాసిని శ్రీగాయత్రీమాతృ సుప్రభాతమ్

**హిందోళరాగం**

**1. ఓం సంధ్యావందనసంప్రీతే ! సామగానప్రహర్షిణి !**
**వేదమార్గప్రదర్శిని ! వేదవిద్యాప్రదాయిని !**
**సంపూర్ణజ్ఞానప్రదాత్రి ! సర్వసంపత్ప్రదాయిని !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సంధ్యావందనంవల్ల సంతోషించే సాధుమూర్తీ ! సామగానంతో ఆనందించే అమృతస్వరూపిణీ ! వేదమార్గాన్ని చూపించే విశ్వమాతా ! వేదవిద్యల్ని ప్రసాదించే విశిష్ట సద్గురు స్వరూపిణీ ! పరిపూర్ణమైన జ్ఞానాన్ని ప్రసాదించే పవిత్రమూర్తీ ! సమస్త సంపదల్ని సంక్రమింపజేసే సౌభాగ్యస్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్రస్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**2. సర్వపాపవిమోచని! సకలశాస్త్రార్థప్రబోధిని !**
**సర్వవ్యాధిప్రశమని ! సదారోగ్యప్రదాయిని !**
**సర్వారిష్టనివారిణి ! సకలశుభప్రదాయిని !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సమస్తమైన పాపాల్ని తొలగించే పుణ్యస్వరూపిణీ ! సకలశాస్త్రాల్ని తేటతెల్లం చేసే సద్గురుస్వరూపిణీ ! అన్ని వ్యాధుల్ని అణచివేసే అమృతస్వరూపిణీ ! ఎల్లప్పుడు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించే ఆనందస్వరూపిణీ ! అన్ని కష్టాల్ని తొలగించే అక్షయ స్వరూపిణీ ! సకలశుభాల్ని ప్రసాదించే నిత్యజ్యోతిస్స్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్రస్వరూపిణివైన శ్రీగాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**3. మహర్షిగణసేవితే ! మహావిద్యాప్రదాయిని !**
**మహామంత్రమూర్తే ! మహాయోగప్రదాయిని !**
**మహాసిద్ధిప్రదే ! మహాభోగప్రదాయిని !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ మహర్షుల సమూహాలచేత మహితంగా సేవించబడే మధురస్వరూపిణీ! మహావిద్యల్ని ప్రసాదించే ప్రజ్ఞాస్వరూపిణీ ! మహామంత్ర స్వరూపిణీ ! మహాయోగాన్ని కూర్చే మాన్యస్వరూపిణీ ! గొప్ప సిద్ధిని ప్రాప్తింప జేసే సిద్ధస్వరూపిణీ ! మహాభోగాల్ని అందించే మహద్భాగ్యస్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్రస్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**4. ప్రాణాయామసుప్రీతే ! పరతత్త్వప్రబోధిని**
**ప్రాణసంరక్షిణి ! పరమార్థప్రదాయిని !**
**పరమానందప్రదే ! ప్రకృతిస్వరూపిణి !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ప్రాణాయామంచేత మిక్కిలి సంతోషించే ప్రాణదాతా ! పరతత్త్వాన్ని గూర్చి చక్కగా ప్రబోధించే పరమగురుస్వరూపిణీ ! సమస్తప్రాణుల్ని సంరక్షించే సాధుస్వరూపిణీ! విశిష్టప్రయోజనాల్ని సమకూర్చే విమలస్వరూపిణీ ! ఉన్నతోన్నతమైన ఆనందాన్ని ప్రసాదించే ఉజ్జ్వల స్వరూపిణీ ! ప్రకృతి స్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగు గాక !

**5. సురాసురసేవితే ! శుభమార్గప్రసాదిని !**
**సువిశాలహృదయే ! శుద్ధవాక్ప్రదాయిని !**
**సుధాసముద్రవాసిని ! సుజనైకరక్షకే !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ దేవతలచేత, రాక్షసులచేత సేవించబడే మహాదేవీ ! మంచి మార్గాన్ని ప్రసాదించే మహామాతృస్వరూపిణీ ! విశాలహృదయం కలిగిన విశిష్టస్వరూపిణీ! మంచి మాటల్ని ప్రసాదించే మమతాస్వరూపిణీ ! అమృత సముద్రంలో నివసించే అద్భుత స్వరూపిణీ ! సుజనుల్ని మాత్రమే రక్షించే శుభస్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**6. రజస్తమోగుణధ్వంసిని ! సత్త్వగుణసంపోషిణి !**
**తంత్రమంత్రాదిసేవితే ! తపోమార్గప్రదాయిని !**
**తపోలోకనివాసిని ! తురీయపదప్రసాదిని !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ రజోగుణ తమోగుణాల్ని ధ్వంసం చేసి సత్త్వగుణాల్ని పోషించే సత్య స్వరూపిణీ ! తంత్రమంత్రాదులచేత సేవించబడే మంత్రస్వరూపిణీ ! తపోమార్గాన్ని ప్రసాదించే తాత్త్వికస్వరూపిణీ ! తపోలోకంలో నివసించే తపస్స్వరూపిణీ ! బ్రహ్మపదాన్ని ప్రసాదించే బ్రహ్మస్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాతమగు గాక !

**7. గగనమార్గసంచారిణి ! గానలీలాప్రహర్షిణి !**
**గంధర్వగణసేవితే ! ఘనకీర్తిప్రదాయిని !**
**గంగాస్నానఫలప్రదే ! గాయత్రి ! పరదేవతే !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ఆకాశమార్గంలో సంచరించే అద్భుతస్వరూపిణీ ! పాటలతో పులకించి పోయే గానస్వరూపిణీ ! గంధర్వులసమూహంచేత సేవించబడే ఘనస్వరూపిణీ ! అగణితకీర్తిని ప్రసాదించే కీర్తిస్వరూపిణీ ! గంగాస్నానఫలాన్ని ప్రసాదించే పవిత్ర స్వరూపిణీ ! విశిష్ట దేవతా స్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాతమగు గాక !

**8. ధర్మాధర్మవిచారిణి ! దైవమార్గప్రసాదిని !**
**నానావిద్యాస్వరూపిణి ! నవ్యమార్గప్రదాయిని !**
**దీర్ఘాయుఃప్రదాత్రి ! ద్విజబృందనిషేవితే !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ఏది ధర్మం ? ఏది అధర్మం ? అనేవిచక్షణ గలిగిన విశిష్టస్వరూపిణీ ! దైవమార్గాన్ని ప్రసాదించే ధర్మస్వరూపిణీ ! అనేకవిద్యల ఆకారంలో కనిపించే విద్యాస్వరూపిణీ ! కొత్తమార్గాన్ని చూపించే కోమలస్వరూపిణీ ! ఎక్కువ కాలం జీవించే విధంగా ఆయుస్సును ప్రసాదించే ఆరోగ్యస్వరూపిణీ ! దేవతల సమూహాలచేత సేవించబడే బ్రహ్మస్వరూపిణీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**9. సోऽహం మంత్రస్వరూపిణి ! సురవరప్రదాయిని !**
**పంచవదనే ! త్రినేత్రే ! ప్రణవాదిస్వరూపిణి !**
**దశభుజే ! నీలవర్ణే ! దివ్యధ్యానప్రవర్ధిని !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సోऽహం మంత్ర స్వరూపిణివై దేవతలకు వరాల్ని ప్రసాదించే దివ్యమాతా! ఐదు ముఖాలు, మూడు నేత్రాలు కలిగిన ఓంకార స్వరూపిణీ! పది చేతులు కలిగి నీలివర్ణంతో ప్రకాశించే పరమాద్భుత స్వరూపిణీ ! విశిష్ట ధ్యానాన్ని పెంపొందింపజేసే విమలమూర్తీ ! భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాతమగుగాక !

**10. ఆగమాదివినుతే ! అష్టభోగప్రదాయిని !**
**వరదాభయమూర్తే ! వంశప్రవృద్ధికారిణి !**
**వేజెండ్లపురవాసిని ! శ్రీ వేంకటకాళీకృష్ణప్రతిష్ఠితే ! సదార్చితే !**
**భక్తిముక్తిప్రదాత్రి ! శ్రీగాయత్రి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ వేదాలచేత ప్రశంసించబడే వేదస్వరూపిణీ ! అష్టభోగాల్ని ప్రసాదించే అమృతస్వరూపిణీ ! వరాలను ప్రసాదిస్తూ అభయహస్తాన్ని చూపే అక్షయ రూపిణీ! వంశాన్ని వృద్ధి చేసే వాత్సల్యస్వరూపిణీ ! వేజెండ్ల పురానికి వేంచేసి శ్రీ వేంకట కాళీకృష్ణులచేత ప్రతిష్ఠించబడి ఎల్లప్పుడూ పూజించబడుతూ భక్తినీ ముక్తినీ ప్రసాదించే భద్ర స్వరూపిణివైన శ్రీ గాయత్రీమాతా ! నీకు సుప్రభాత మగుగాక !

# ౨౦. శ్రీ వేజెండ్ల పురవాసిని శ్రీలలితాంబికా సుప్రభాతమ్

**లలితరాగం**

**1. ఓం వాగ్బీజపాలికే ! ఐంకారస్వరూపిణి !**
**మాయాబీజపాలికే ! హ్రీంకారస్వరూపిణి !**
**మహాభోగప్రదాత్రి ! శ్రీంకారస్వరూపిణి !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీలలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ఓ లలితాంబికా ! వాక్ బీజాన్ని పాలించే ఐంకార స్వరూపం కలిగిన మాతా ! మాయా బీజాన్ని పాలించే హ్రీంకార స్వరూపిణీ ! అత్యధిక భోగాల్ని ప్రసాదించే శ్రీంకార స్వరూపిణీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా! నీకు సుప్రభాతమగు గాక !

**2. ఘనవిద్యాప్రదాయిని ! కైవల్యపదదాయిని !**
**హ్లాదవిద్యాస్వరూపిణి ! హరిహరబ్రహ్మార్చితే !**
**శ్రీషోడశీమంత్రరూపే ! శ్రీచక్రసంచారిణి !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీలలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ గొప్పవిద్యల్ని ప్రసాదించే సద్గురుస్వరూపిణీ ! మోక్షాన్ని ప్రసాదించే మోదస్వరూపిణీ ! సంపూర్ణమైన సంతోషంతో కూడి హరిహరబ్రహ్మలతో అర్చించబడే అద్భుతస్వరూపిణీ ! శ్రీ షోడశీమంత్ర స్వరూపిణీ ! శ్రీచక్రంపై సంచరించే దేవి ! శ్రితజన సంరక్షణీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా! నీకు సుప్రభాతమగు గాక !

**3. భక్తివశ్యే ! భద్రమూర్తే ! భయవిధ్వంసకారిణి !**
**భక్తానుగ్రహరూపిణి ! భవబంధవిమోచని !**
**భక్తపోషణదీక్షితే ! భక్తక్షేమప్రదాయిని !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీలలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ భక్తికి వశమయ్యే భద్రస్వరూపిణివైన భవ్యమూర్తీ ! భయాన్ని తొలగించే అభయమూర్తీ ! భక్తుల్ని అనుగ్రహించే అనురాగమూర్తీ ! భవబంధాల్ని తొలగించే పావనమూర్తీ ! భక్తుల్ని పోషించటమే దీక్షగా గలిగిన కరుణామూర్తీ ! భక్తులకు క్షేమాన్ని కూర్చే దయార్ద్రమూర్తీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగుగాక !

**4. నిత్యసంతోషప్రదాత్రి ! నిఖిలార్థప్రదాయిని !**
**నిగ్రహానుగ్రహదాత్రి ! నిత్యానందప్రదాయిని !**
**నిత్యానుగ్రహరూపిణి ! నిర్వాణసుఖదాయిని !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ఎల్లప్పుడూ సంతోషాన్ని ప్రసాదించే ఆనందమూర్తీ ! సమస్త ప్రయోజనాల్ని ప్రసాదించే తల్లీ ! నిగ్రహాన్ని, అనుగ్రహాన్ని ప్రసాదించే మాతా ! నిత్యం ఆనందాన్ని ప్రసాదించే కరుణామూర్తీ ! నిరంతర దయామృతాన్ని కురిపించే నిర్మల స్వరూపిణీ! మోక్షానందాన్ని ప్రసాదించే మోదమూర్తీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్య స్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగుగాక !

**5. సర్వదుఃఖహంత్రి ! సదా శాంతిప్రదాయిని !**
**నిత్యదయామూర్తే ! సత్యకీర్తిప్రసాదిని !**
**సదా సౌమ్యరూపే ! సకలసౌఖ్యప్రదాయిని !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సమస్త దుఃఖాల్ని దూరం చేసే సౌభాగ్య స్వరూపిణి ! ఎల్లప్పుడూ శాంతిని ప్రసాదించే శాంత స్వరూపిణీ ! నిరంతర దయా స్వరూపిణీ ! సత్యమైన కీర్తిని ప్రసాదించే సాధుమూర్తీ ! నిత్యస్వరూపంతో ప్రకాశించే మాతా ! సమస్త సుఖాల్ని ప్రసాదించే సౌఖ్యస్వరూపిణీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగుగాక !

**6. విశ్వవినుతే ! వివిధాకారధారిణి !**
**విరాడ్రూపే ! దేవి ! విజయప్రసాదిని !**
**విశ్వక్షేమప్రదాత్రి ! విమలస్వరూపిణి !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సకల లోకాలచేత స్తుతించబడే వివిధ రూపాలు గలిగిన విశ్వమాతా ! విరాట్ స్వరూపంతో విజయాన్ని ప్రసాదించే తల్లీ ! విశ్వానికి క్షేమాన్ని కలిగింపజేసే స్వచ్ఛ స్వరూపిణీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా! నీకు సుప్రభాత మగు గాక !

**7. పూర్ణవిద్యాస్వరూపే ! పుణ్యధనప్రదాయిని !**
**పుష్పాలంకరణశోభితే ! పూజాసేవాఫలప్రదాయిని !**
**విశేషయుక్తిప్రదాత్రి ! అశేషశక్తిప్రదాయిని !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ పూర్ణవిద్యా స్వరూపంతో ప్రకాశించే పుణ్యమూర్తీ ! పుణ్యం అనే ధనాన్ని ప్రసాదించే పూజ్యస్వరూపిణీ ! పుష్పాలచేత అలంకరించబడి ప్రకాశించే జ్యోతిస్స్వరూపిణీ ! పూజలకు తగిన ఫలితాల్ని ప్రసాదించే పూర్ణ స్వరూపిణీ ! అత్యధికమైన యుక్తిని ప్రసాదించే అమలమూర్తీ ! తిరుగులేని, అనంతమైన బలాన్ని ప్రసాదించే అనంత స్వరూపిణీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగుగాక !

**8. సత్యజ్ఞానప్రదాత్రి ! సాకారవిలసితే !**
**సహృదయస్థితే ! సద్భక్తపరిపాలకే !**
**సదానందమూర్తే ! సద్విద్యాప్రదాయిని !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సత్యజ్ఞానాన్ని ప్రసాదించే చల్లనిరూపం గలిగిన తల్లీ ! మంచి మనసులు గలిగిన వారి హృదయాల్లో నిలిచి ఉండే మాతా ! నిజభక్తుల్ని రక్షించే నిర్మల

స్వరూపిణీ ! నిరంతరం ఆనందంతో ప్రకాశించే రూపం గలిగిన తల్లీ ! మంచి విద్యలను ప్రసాదించే మమతామూర్తీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగు గాక !

**9. విమలాచారప్రియే ! విశ్వక్షోభానివారిణి !**
**విశేషాకర్షిణి ! విమలజనసంసేవితే !**
**విశ్వాధారవిశిష్టే ! విశ్వమాతృతావిరాజితే !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ స్వచ్ఛమైన ఆచారాల పట్ల ఆసక్తి గలిగిన అమృతమూర్తీ ! ప్రపంచానికి కలిగే బాధల్ని తొలగించే భద్రమూర్తీ ! అందరిచేత బాగా ఆకర్షించబడే అనుపమ స్వరూపిణీ ! స్వచ్ఛ హృదయులచేత నిరంతరం సేవించబడే కరుణాస్వరూపిణీ ! సమస్త విశ్వానికీ ఆధారమైన విశిష్ట స్వరూపిణీ ! విశ్వమాతవై ప్రకాశించే విమలమూర్తీ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగు గాక !

**10. చతుర్భుజే ! శ్రీలలితే ! చంద్రకళాధరే !**
**వరదానప్రసాదితే ! వంశవృద్ధిప్రదాయిని !**
**వేజండ్లపురవాసిని ! శ్రీవేంకటకాళీకృష్ణప్రతిష్ఠితే ! సదార్చితే !**
**బహుభాగ్యప్రదాత్రి ! శ్రీ లలితాంబికే ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ఓ లలితాంబికా ! నాలుగు చేతులు కలిగి చంద్రకళను శిరసుపై దాల్చి ప్రకాశిస్తున్న దేవీ ! శ్రేష్ఠమైన దానాల్ని ప్రసాదిస్తూ వంశాన్ని అభివృద్ధి చేసే వరమాతా! శ్రీ వేంకట కాళీకృష్ణునిచే ప్రతిష్ఠించబడి, ఎల్లప్పుడూ పూజించబడుతూ, వేజెండ్ల పురంలో నివసించే తల్లీ ! బహుభాగ్యాల్ని ప్రసాదించే భాగ్యస్వరూపిణివైన శ్రీలలితాంబికా ! నీకు సుప్రభాత మగుగాక !

# 21.శ్రీ వేజెండ్ల పురవాసిని శ్రీ భువనేశ్వరీ మాతృ సుప్రభాతమ్

**సింధుభైరవి రాగం**

**1. ఓం హరిహరబ్రహ్మేంద్రసేవితే ! హ్రీంకారస్వరూపిణి !**
**సకలైశ్వర్యప్రదాత్రి ! శ్రీంకారస్వరూపిణి !**
**సర్వాభీష్టప్రదే ! సంరక్షిణి ! క్లీంకారస్వరూపిణి !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ త్రిమూర్తులచేత సేవించబడే హ్రీంకార స్వరూపిణివైన మాతా ! సమస్త సంపదల్ని ప్రసాదించే శ్రీంకార స్వరూపిణీ ! సకల వాంఛల్ని సఫలం చేసి సంరక్షించే క్లీంకార రూపిణీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృత స్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగు గాక !

**2. అనంతకోటిబ్రహ్మాండనాయికే ! అద్వైతస్వరూపిణి !**
**అణిమాద్యష్టసిద్ధిప్రదాత్రి ! అనంతవరప్రదాయిని !**
**అక్షయానందామృతవర్షిణి ! అమరలోకవాసిని !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ అసంఖ్యాకమైన బ్రహ్మాండాలను పాలించే అద్వైతరూపిణీ ! అణిమ, గరిమ, లఘిమ మొదలైన అష్టసిద్ధుల్ని ప్రసాదించే తల్లీ ! అనంతమైన వరాల్ని ప్రసాదిస్తూ ఆనందం అనే అమృతవర్షాన్ని కురిపించే అమరలోక నివాసినీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృత స్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**3. ప్రారబ్ధధ్వంసకారిణి ! పరాభక్తిప్రదాయిని !**
**పరిపూర్ణజ్ఞానప్రదాయిని ! పరమాహ్లాదదాయిని !**
**పంచభూతశక్తిప్రదే ! పరమతేజఃప్రవర్ధిని !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ పూర్వకర్మల్ని తొలగించే పుణ్యస్వరూపిణీ ! శ్రేష్ఠమైన భక్తిని ప్రసాదించే విశిష్టస్వరూపిణీ ! నిండైన జ్ఞానాన్ని అనుగ్రహించే విజ్ఞానస్వరూపిణీ ! అధికమైన ఆనందాన్ని అందించే ఆనందస్వరూపిణీ ! పంచభూతాలకూ శక్తిని ప్రసాదించే పరమశక్తిస్వరూపిణీ ! విశిష్టమైన ప్రకాశంతో వెలుగొందే తేజోరూపిణీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**4. నానాజన్మఫలప్రదే ! నమితార్తివినాశిని !**
**నవదుర్గార్చితపదే ! నానాలంకారభూషితే !**
**నవదివ్యానందమూర్తే ! నానాసుఖప్రదాయిని !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ అనేక జన్మల పుణ్యఫలితాల్ని ప్రసాదించే అమరమూర్తీ ! మొక్కిన వారి చిక్కులు దీర్చే మోదస్వరూపిణీ ! నవదుర్గలచేత అర్చించబడిన పవిత్రపాదాలతో ప్రకాశించే పావనమూర్తీ ! వివిధములైన అలంకారాలతో వెలుగొందే విమల స్వరూపిణీ! నిరంతరం సరికొత్త ఆనందంతో విరాజిల్లే విశ్వస్వరూపిణీ! అనేక విధాలైన ఆనందాల్ని ప్రసాదించే పవిత్ర స్వరూపిణీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృత స్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా! నీకు సుప్రభాత మగుగాక!

**5. సహస్రకోటిసూర్యతేజోవివర్ధిని ! సహస్రనయనోజ్జ్వలే !**
**సహస్రకోటిచంద్రకాంతిప్రకాశిని ! సకలలోకపరిపాలిని !**
**సకలప్రాణిశక్తిస్వరూపిణి ! సర్వదేహసంచారిణి !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ వేయికోట్ల సూర్యులకాంతి సమూహంతో వెలుగొందే విరాణ్మూర్తీ ! వేయి కన్నులతో మిక్కిలిగా ప్రకాశించే విఖ్యాత స్వరూపిణీ ! వేయి కోట్ల చంద్రుల కాంతులతో వెలుగొందే విశిష్టమూర్తీ ! సమస్త లోకాల్ని పరిపాలించే సామ్రాజ్ఞీ ! సమస్త ప్రాణులకూ శక్తివైన మాతా ! సకల దేహాలలో సంచరించే తల్లీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగు గాక !

**6. సకలమంత్రస్వరూపిణి ! సకలార్థసిద్ధిప్రదాయిని !**
**సకలమునిగణసంసేవితే ! సర్వయోగఫలప్రదాయిని !**
**సర్వారిష్టనివారిణి ! సకలశుభప్రదాయిని !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ సమస్తమంత్రాలస్వరూపిణివై అన్ని ప్రయోజనాల్ని ప్రాప్తింపజేసే అనంతస్వరూపిణీ ! మునులందరిచేత సేవించబడి, సమస్తయోగాలఫలితాల్ని ప్రసాదించే సాధుస్వరూపిణీ ! అన్ని కష్టాల్ని తొలగించి సమస్త శుభాలను ప్రాప్తింపజేసే దయాస్వరూపిణీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగు గాక !

**7. మాయామర్మప్రబోధిని ! మహాలావణ్యస్వరూపిణి !**
**మాయామోహవినాశిని ! మహామోక్షప్రదాయిని !**
**మహాశక్తిస్వరూపిణి ! మణిద్వీపనివాసిని !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ మాయారహస్యాన్ని బట్టబయలు చేసే మాతా ! మిక్కిలి ప్రకాశంతో వెలుగొందే ఆకారాన్ని గలిగిన తల్లీ ! మాయపట్ల కలిగేమోహాన్ని తొలగించి మహా మోక్షాన్ని ప్రసాదించే మంత్రస్వరూపిణీ ! అనంతమైనశక్తిని కలిగి మణిద్వీపంలో నివసించే మహితమూర్తీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగుగాక !

**8. బ్రహ్మవిద్యాప్రదాయిని ! పరబ్రహ్మస్వరూపిణి !**
**బ్రహ్మాండాసనస్థితే ! బ్రహ్మతేజోవివర్ధిని !**
**బ్రహ్మాండసృష్టిస్థితిలయకారిణి ! బ్రహ్మానందప్రదాయిని !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ బ్రహ్మవిద్యను ప్రసాదించే పరబ్రహ్మ స్వరూపిణీ ! బ్రహ్మాండాసనం పై కొలువుదీరి బ్రహ్మతేజస్సుతో వెలుగొందే జ్యోతిస్స్వరూపిణీ ! సమస్త బ్రహ్మాండాల

సృష్టి, స్థితి, లయాలకు కారణమై బ్రహ్మానందాన్ని ప్రసాదించే బ్రాహ్మీమూర్తీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగు గాక!

**9. అకాలమృత్యువారిణి ! అష్టైశ్వర్యప్రదాయిని !**
**ధీశక్తిప్రదాత్రి ! దీర్ఘాయుఃప్రసాదిని !**
**శ్రీచక్రమేరుస్థితే ! శ్రీమూర్తే ! భువనేశ్వరి !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ అకాలమృత్యువును అణచివేసే అమృతస్వరూపిణీ ! అష్టైశ్వర్యాల్ని ప్రసాదించే అతులితభాగ్యస్వరూపిణీ ! విశిష్టమైన బుద్ధిని ప్రసాదించే విమలమూర్తీ! దీర్ఘమైన ఆయుస్సును ప్రసాదించే దివ్యస్వరూపిణీ ! శ్రీచక్రమేరువుపై కొలువు దీరిన శ్రీ భువనేశ్వరీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాతమగు గాక !

**10. అష్టాయుధధరే ! అంతరిక్షసంచారిణి !**
**వరదాభయమూర్తే ! వంశవృద్ధిప్రదాయిని !**
**వేజెండ్లపురవాసిని ! శ్రీవేంకటకాళీకృష్ణప్రతిష్ఠితే ! సదార్చితే !**
**నిఖిలలోకార్చితే ! ఈశ్వరి ! శ్రీభువనేశ్వరి ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ అష్టాయుధాల్ని ధరించే శక్తి స్వరూపిణీ ! అంతరిక్షంలో తిరుగుతూ ఉండే అనంతస్వరూపిణీ ! వరాల నిచ్చే అభయ స్వరూపిణీ ! వంశాన్ని అభివృద్ధి చేసే వరమాతా! శ్రీ వేంకటకాళీకృష్ణునిచే ప్రతిష్ఠించబడి, ఎల్లప్పుడూ పూజించబడుతూ వేజెండ్లపురంలో నివసించే తల్లీ ! అన్ని లోకాలచేత ఆరాధించబడే అమృతస్వరూపిణివి, పరమేశ్వరివి అయిన శ్రీ భువనేశ్వరీ మాతా ! నీకు సుప్రభాత మగు గాక !

# ౨౨. శ్రీ వేజెండ్లపుర శ్రీచక్ర పీఠస్థ
# శ్రీవరకాళీ మహామంత్ర స్తోత్రమ్

**ఓం ప్రాతఃకాలభాస్కరార్చితే ! పరాశక్తికాళి !**
**సోమార్చితే ! సురసంసేవితే ! వహ్నినేత్రస్వరూపిణి !**
**సర్వదా సర్వత్ర చ పూజితే ! బహునుతే !**
**సాధకాభీష్టవరప్రదే ! సద్భక్తపరిపాలికే !** **29-8-1994**

తా॥ ఉదయభానునిచే పూజింపబడే పరాశక్తీ ! చంద్రుని పూజాసేవలు స్వీకరించే కాళీ ! అన్ని చోట్లా, అన్ని వేళలా, అందరిచేతా పూజింపబడే తల్లీ ! అనేక విధాలుగా స్తుతింపబడే మాతా ! సాధకులకు ఇష్టమైన వరాలు ఇస్తావు. సాధువులైన భక్తులను పరిపాలిస్తావు.

**శ్రీ భావనామసంవత్సర శ్రావణ సోమవార**
**కృష్ణాష్టమీ రోహిణీ నక్షత్ర రాత్రౌ ప్రతిష్ఠితే !**
**వేజెండ్లపుర శ్రీచక్రపీఠాధిదేవతే ! కాళి !**
**నిత్యదయామూర్తే ! దేవి ! సత్యానందస్వరూపిణి ! ॥**

తా॥ శ్రీ భావనామ సంవత్సరంలో, శ్రావణమాసంలో, కృష్ణపక్షంలో, శ్రీకృష్ణాష్టమీ తిథినాడు, సోమవారం, రోహిణీ నక్షత్రం కలిగిన రాత్రి సమయంలో వేజెండ్ల గ్రామంలో శ్రీచక్రపీఠంపై ప్రతిష్ఠింపబడిన శ్రీవరకాళీదేవీ ! నీవు నిరంతర దయామూర్తివి. సత్యమైన ఆనందమే నీ స్వరూపం.

**అష్టోత్తరశతకూపజలప్రతిష్ఠితే ! కాళి !**
**ప్రసన్నవదనస్వరూపిణి ! సంజీవని ! దేవి !**
**సదా భాషితమూర్తే ! శ్రీమద్గురువరకాళి !**
**స్మరణానందస్వరూపే ! సద్వందనప్రీతే ! కాళి ॥**

తా॥ దేవీ ! 108 బావులలోని నీళ్లతో నిన్ను అభిషేకించి ప్రతిష్ఠించారు. ప్రసన్నమైన ముఖంతో నీరూపం భక్తులకు సంజీవని. నిరంతరం భక్తులతో

సంభాషించే తల్లీ ! ఒక్కసారి నిన్ను స్మరించినంత మాత్రంచేతనే భక్తులకు నీ రూపాన్ని సాక్షాత్కరింపజేసి, ఆనందింపజేస్తావు. కాళీమాతా ! సాధుజనుల నమస్కారానికి సంతోషిస్తావు.

**స్తోత్రగానతుష్టాం దేవీం శ్రీమద్గురువరకాళీమ్**

**మహిమాన్వితమూర్తిం నిత్యానుగ్రహాం దేవీం కాళీమ్**

**మహామంత్రమర్మప్రబోధినీం విజయప్రదామ్**

**వటవృక్షాగ్రవహ్నిరూపసందర్శినీం దేవీం వందే ॥**

తా॥ భక్తుల స్తోత్రాలకూ, గానానికీ సంతోషించే తల్లీ మహిమ గలిగిన దేవీ, భక్తులను నిత్యం అనుగ్రహించే మాతా, మహామంత్రాల రహస్యాల్ని చక్కగా తెలియజేసే దేవీ, విజయాన్ని చేకూర్చే తల్లీ ! మఱ్ఱిచెట్టుపైన అగ్నిరూపంలో కనిపించే "శ్రీగురువర కాళీమాతా" నీకు నమస్కారం.

**హసకల హ్రీం హసకహల హ్రీంకారరూపిణి**

**సకల హ్రీం దేవి కాళి హాదివిద్యాస్వరూపిణి**

**కఏఈల హ్రీం హసకహల హ్రీం మంత్రరూపిణి**

**సకల హ్రీం శ్రీం షోడశికాదివిద్యాస్వరూపిణి ॥**

తా॥ "హసకహల హ్రీం – సకల హ్రీం" అనే మంత్ర బీజాక్షరాలతో హాదివిద్యా స్వరూపంగా ఉన్న ఓ కాళీమాతా !

"క ఏ ఈ ల హ్రీం – హ స క హ ల హ్రీం – స క ల హ్రీం – శ్రీమ్" అనే "షోడశీ" మంత్ర స్వరూపిణివి నీవే.

**క్రీం క్రీం క్రీం హ్రీం హ్రీం హూం హూం దక్షిణ కాళికే**

**క్రీం క్రీం క్రీం హ్రీం హ్రీం హూం హూం స్వాహా మంత్రమహాశక్తిస్వరూపిణి**

**క్లీం క్లీం క్లీం హూం హూం హ్రీం హ్రీం భద్రకాళి**

**క్లీం క్లీం క్లీం హూం హూం హ్రీం హ్రీం స్వాహా మంత్రమూర్తే దేవి కాలస్వరూపిణి॥**

తా॥ "క్రీం క్రీం క్రీం – హ్రీం హ్రీం – హూం హూం" మంత్ర స్వరూపిణీ ! దక్షిణ కాళీ !

"క్రీం క్రీం క్రీం – హ్రీం హ్రీం హూం హూం స్వాహా" అనే మంత్రం స్వరూపం నీదే మహాశక్తీ !

"క్లీం క్లీం క్లీం హూం హూం హ్రీం హ్రీం" అనే మంత్రం స్వరూపం, నీవే ఓ భద్రకాళీ !

"క్లీం క్లీం క్లీం హూం హూం హ్రీం హ్రీం స్వాహా" అనే మంత్ర స్వరూపం నీవే. ఓ కాల స్వరూపిణీ !

**సర్వదిక్పాలసంసేవితే ! సర్వాదిస్వరూపిణి !**
**సర్వకాలపూజనప్రీతే ! సద్గురుస్వరూపిణి !**
**సర్వాద్యంతరహితే ! సర్వశక్తి ! మాం పాహి దేవి !**
**నమ స్తే ఉస్తు నమ స్తే ఉస్తు శ్రీ కాళి ! తే నమో నమః ॥**

తా॥ సమస్తమైన దిక్పాలకులూ శ్రీకాళీమాతనే సేవిస్తారు. అన్నింటికంటే మొట్టమొదటిరూపం శ్రీకాళీదేవియే. ఈమెకు మొదలూ, చివరా లేవు. సమస్తమైన శక్తులూ ఈదేవియే. ఓ కాళీమాతా ! నీకు నమస్కారం. నన్ను రక్షించు. నీకు నిరంతరం మళ్లీ మళ్లీ నమస్కారం.

**అష్టమ్యాం నవమ్యాం వా చతుర్దశ్యాం అమావాస్యాయాం వా**
**మంగళవాసరే విశేషతః యః పఠేత్ ప్రీత్యా**
**మంత్రస్తోత్ర మేతత్ లభేత్ స శుభశక్తిం యుక్తిమ్**
**సర్వం న సంశయః, న సంశయః, న సంశయః ॥**

తా॥ ఈ వరకాళీ మంత్ర స్తోత్రాన్ని భక్తితో అష్టమినాడు గాని, నవమినాడు గాని, చతుర్దశినాడు గాని, అమావాస్య నాడుగాని, ఇంకా విశేషంగా మంగళవారం నాడుగాని ప్రీతితో పారాయణం చేసినవారికి సకలశుభాలూ కలుగుతాయి. శక్తిమంతులవుతారు. యుక్తిపరులవుతారు. ఇది ముమ్మాటికీ నిజం. సందేహం లేదు.

## 23. శ్రీవేజెండ్లపుర శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠస్థ శ్రీ గాయత్రీ లలితాంబికా శ్రీ భువనేశ్వరీమాతల స్తుతి

**1. ఓం సర్వజిత్ నామసంవత్సర శ్రీచైత్ర**
**తృతీయా శ్రీ బుధవార అశ్వినీ నక్షత్ర**
**ప్రాతఃకాల ప్రతిష్ఠితాం శ్రీ గాయత్రీమాతరమ్**
**శ్రీలలితాంబికాదేవీం శ్రీ భువనేశ్వరీమ్ ॥ నమామి 21-3-2007**

తా॥ సర్వజిత్‌నామ సంవత్సరంలో చైత్రశుద్ధ విదియ బుధవారం అశ్విని నక్షత్రంలో ప్రాతస్సమయంలో ప్రతిష్ఠింపబడిన శ్రీ గాయత్రీమాతకు, శ్రీలలితాంబికకు, శ్రీ భువనేశ్వరీ దేవికి నమస్కారం.

**2. శ్రీ వేజెండ్లపురవరే వరకాళీగర్భాలయే**
**త్రయోదశవర్షవహ్నియజ్ఞఫలరూపేణ**
**శ్రీచక్రమేరుస్థలే ప్రతిష్ఠితాం పుష్పయాగార్చనతుష్టామ్**
**గాయత్రీం లలితాంబికాం భువనేశ్వరీమ్ ॥ నమామి**

తా॥ వేజెండ్లపురంలో శ్రీవరకాళీ గర్భాలయంలో 13 సంవత్సరాల అగ్నిహోత్ర మహాయాగ ఫలితంగా, శ్రీచక్రమేరు స్థలంలో ప్రతిష్ఠింపబడి భక్తుల పుష్పార్చనలకు సంతోషించే శ్రీ గాయత్రీ లలితాభువనేశ్వరీ మాతలకు నమస్కారం.

**3. ఓం భూ ర్భువ స్సువః మంత్రార్చితాం బ్రాహ్మీకాలసేవితామ్**
**కారుణ్యభావదయామూర్తిం శ్రీయజ్ఞస్వరూపిణీమ్**
**బ్రహ్మానందవరప్రదాత్రీం విశ్వాత్మికాం దేవీమ్**
**సకలలోకవినుతాం శ్రీగాయత్రీం వేదమాతరమ్ ॥**

తా॥ "ఓం భూ ర్భువః సువః" అనే వ్యాహృతిమంత్రంతో నిత్యమూ అర్చింపబడే దేవి, బ్రాహ్మీ ముహూర్తంలో సేవింపబడే తల్లి, కరుణా స్వభావం నిండిన మూర్తి, యజ్ఞస్వరూపిణి, బ్రహ్మానందాన్ని అందించే మాత, సమస్తలోకాలచేత స్తుతింపబడే దేవి, విశ్వ స్వరూపిణి, వేదమాత అయిన శ్రీగాయత్రీదేవికి నమస్కారం.

**4. నిత్యమంత్రజపనామపారాయణసుప్రీతాం వరదాం శుభప్రదామ్**
**మహాతపశ్శక్తిఫలప్రదాం శ్రీలలితాంబికామ్**
**అరిషడ్వర్గధ్వంసినీం ఆత్మానందప్రదాయినీం**
**మహైశ్వర్యప్రదాత్రీం మాతరం లలితాంబికామ్ ॥**

తా॥ నిత్యమూ మంత్ర అనుష్ఠానంచేత, సహస్రనామ పారాయణంచేత సంతోషించే తల్లి, వరాలు కురిపించే దేవి, శుభాలు కలిగించే మాత, తీవ్రమైన తపస్సు చేస్తే కలిగే ఫలితం ఇచ్చే దేవి, కామం, క్రోధం మొదలైన అంతశ్శత్రువులు ఆరుగురినీ అణచి వేసి, ఆత్మానందాన్ని ఇచ్చి, గొప్ప సంపదలను ప్రసాదించే మూర్తి శ్రీలలితామాతకు నమస్కారం.

**5. ప్రశాంతస్వరూపిణీం ప్రజ్ఞాత్మికాం శ్రీమహాదేవీమ్**
**శ్రీనిధిస్థిరనివాసినీం దయామృతమూర్తిం దేవీమ్**
**మహాద్భుతశక్తిప్రదాత్రీం త్రినేత్రాం విశ్వమూర్తిమ్**
**జగన్మాతరం దివ్యమూర్తిం దేవీం శ్రీభువనేశ్వరీమ్ ॥**

తా॥ శాంతి స్వరూపిణి, ప్రజ్ఞారూపిణి, దయాగుణసంపదలో స్థిరంగా నిలిచి ఉండే మహాదేవీ అమృతంవంటి దయామూర్తీ, అద్భుతశక్తులను ప్రసాదించే తల్లి, మూడు కన్నులు కలిగిన దేవి, శ్రీ జగన్మాతా, విశ్వమూర్తి, దివ్యశక్తి అయిన శ్రీ భువనేశ్వరీదేవికి నమస్కారం.

**6. భృగువారార్చనతుష్టాం శ్రీచక్రపీఠవాసినీమ్**
**శ్రీగాయత్రీం శ్రీలలితాంబికాం శ్రీభువనేశ్వరీమ్**
**పూర్ణిమాయాం వా చతుర్దశ్యాం వా కుజవారే విశేషతః**
**యే పఠన్తి యేతత్ స్తోత్రం స్వర్గలోకే వసన్తి తే ॥**

తా॥ శుక్రవారపు పూజలతో సంతోషిస్తూ శ్రీచక్రపీఠంపై కొలువైన శ్రీ గాయత్రీ, లలితా, భువనేశ్వరీ మాతలకు నమస్కారం.

చతుర్దశినాడు కాని, పూర్ణిమనాడు గానీ, విశేషంగా మంగళవారంనాడు గానీ ఈ స్తోత్రాన్ని పఠించినవారు స్వర్గలోకంలో నివసిస్తారు.

# 24. శ్రీవేజెండ్లపుర శ్రీచక్రపీఠస్థ శ్రీమాతలు

**1. ఓం సత్యధర్మశక్తి సద్గురు వరకాళి**
**వాయువేగమున దేవి తా వరము లిచ్చి**
**అంతయు తెలుపుచు ఆదిశక్తిగ తాను**
**శ్రీచక్రపీఠమున స్థిర మాయె వరకాళి**

తా॥ సత్యధర్మ శక్తులకు సద్గురువుగా శ్రీ వరకాళి వాయువేగంతో తాను వరాలనిచ్చి, సమస్త విషయాల్ని తెలియజేస్తూ ఆదిశక్తిగా శ్రీకాళి శ్రీచక్ర యంత్రం మీద స్థిరంగా కొలువై ఉన్నది.

**2. సకలదోషమ్ములన్ సమయింపజేసేటి**
**సద్విద్య గాయత్రి సత్కాంతితో వెల్గ**
**వేదాల మూలమౌ వేజెండ్ల వాసినిగ**
**శ్రీచక్రపీఠమున స్థిరమాయె గాయత్రి**

తా॥ అన్ని దోషాల్ని అణచివేస్తూ, మంచి విద్యలకు ఆధారమైన అమ్మ గాయత్రి మంచి కాంతితో వెలుగొందుతూ, వేదాలకు మూలమైన వేజెండ్ల పురవాసినిగ శ్రీ గాయత్రీ మాత శ్రీచక్రయంత్రం మీద స్థిరంగా కొలువై ఉన్నది.

**3. కరుణార్ద్రచిత్తాని కాధారమైనట్టి**
**ఐశ్వర్యభోగాల నందజేయును లలిత**
**లాలించి పోషించు లావణ్యమూర్తియై**
**శ్రీచక్రపీఠమున స్థిరమాయె శ్రీలలిత**

తా॥ కరుణకు నిలయమైన మృదువైన మనస్సును కలిగి, సమస్త ఐశ్వర్యాలనూ, అనంత భోగాలను ప్రసాదిస్తూ, లావణ్యమూర్తిగా తన భక్తులను లాలించి పోషిస్తూ శ్రీలలితామాత శ్రీచక్రయంత్రంమీద స్థిరంగా కొలువై ఉన్నది.

**4. ఆత్మకే మూలమై అమరజ్యోతిగ వెల్గు**
**హరి హర బ్రహ్మలకు ఆధారమౌశక్తి**
**భువనాలు పాలించు భూరిశక్తిగ తాను**
**శ్రీచక్రపీఠమున స్థిరమాయె భువనేశ్వరి ॥**

ప్రాణశక్తికి మూలమై నిరంతరం నిండైన కాంతితో వెలుగొందుతూ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూలాధారమైన శక్తిగా నిలిచి సకల లోకాలను పరిపాలించే మహత్తరమైన శక్తితో కూడిన మాతగా శ్రీభువనేశ్వరీ దేవి శ్రీచక్రయంత్రం మీద స్థిరంగా కొలువై ఉన్నది.

# 25. శ్రీవేజెండ్లపుర శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠస్థ మాతలకు ప్రణామాలు

1. ఓం శ్రీవరకాళీం, కలికల్మషనాశినీమ్,
సర్వకాలశుభప్రదామ్, దేవీమ్,
శ్రీవరకాళికాం, ప్రణమా మ్యహమ్.

2. సకలపాపహరాం, సర్వయోగప్రదామ్,
సకలలోకేశ్వరీం, దేవీమ్,
శ్రీ గాయత్రీం, ప్రణమా మ్యహమ్.

3. సర్వసౌభాగ్యప్రదాయినీమ్,
సదానందమూర్తిం, దేవీమ్,
శ్రీలలితాంబికాం, ప్రణమా మ్యహమ్.

4. సర్వదేవనమస్కృతామ్,
సకలప్రాణేశ్వరీమ్, దేవీమ్,
శ్రీ భువనేశ్వరీం, ప్రణమా మ్యహమ్.

5. ఆదిపరాశక్తిపీఠస్థ శ్రీచక్రస్థలనివాసినీభ్యో,
వేజెండ్ల పురవర విలసితేభ్యో, దేవతాభ్యః
శ్రీవరకాళీ గాయత్రీ లలితా భువనేశ్వరీభ్యో నమః.

# 26. శ్రీవేజెండ్ల పురవాసిని
# శ్రీవరకాళీమాత నీరాజనం

**ముఖారి రాగం**

1. వేజెండ్ల గ్రామాన వెలసినా మా తల్లి
   వేదాంతరూపిణికి నీరాజనం – సద్గురూ కాళీకి నీరాజనం
   భక్తి మాణిక్యాల నీరాజనం

2. బ్రహ్మాది దేవతలు భక్తితో కొలిచేటి
   బహుభాగ్యదాయినికి నీరాజనం – సద్గురూ కాళీకి నీరాజనం
   భక్తి ముత్యాల నీరాజనం

3. శ్రీహరీ హరులకూ శ్రేయమ్ము చేకూర్చు
   శ్రీచక్రవాసినికి నీరాజనం – సద్గురూ కాళీకి నీరాజనం
   భక్తి పగడాల నీరాజనం

4. ఆస్తికుల హృదయాల అలరారు మా తల్లి
   ఆనందదాయినికి నీరాజనం – సద్గురూకాళీకి నీరాజనం
   భక్తి గోమేధికాల నీరాజనం

5. భవబంధములు ద్రుంచి బహుశాంతి నిచ్చేటి
   పరమాది శక్తికి నీరాజనం – సద్గురూకాళీకి నీరాజనం
   భక్తి పుష్యరాగాల నీరాజనం

6. నవదివ్యమూర్తిగా నవ్యమై వెలిగేటి
   దేవాదిదేవతకు నీరాజనం – సద్గురూకాళీకి నీరాజనం
   భక్తి నీలాల నీరాజనం

7. అభయాల మూర్తియౌ ఆమందహాసినికి
అక్షయా వెలుగులా నీరాజనం - సద్గురూకాళీకి నీరాజనం
భక్తి మరకతాల నీరాజనం

8. విశ్వాన్ని పాలించు విజయాల మూర్తికి
విలువైన విశ్వాస నీరాజనం - సద్గురూకాళీకి నీరాజనం
భక్తి వైడూర్యాల నీరాజనం

9. విజ్ఞానసంపదలు వికసింపజేసేటి
విశ్వగురు కాళీకి నీరాజనం - సద్గురూ కాళీకి నీరాజనం
వేజెండ్లవాసులౌ వేంకట కాళీకృష్ణులిచ్చు
భక్తి వజ్రాల నీరాజనం

# 27.శ్రీవేజెండ్ల పురవాసిని శ్రీవరకాళీ మంగళహారతి

**మధ్యమావతిరాగం**

1. వేదాల మూలమౌ వేజెండ్లవాసిని శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
2. కారుణ్యభావమ్ము ఘనముగా కలిగినా శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
3. పలుమార్లు దీక్షగా పదిలముగ కాచేటి శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
4. సంతోషపుణ్యములు సర్వమ్ము నిచ్చేటి శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
5. చల్లనీచూపులా సద్గురుమూర్తియౌ శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
6. భక్తితో పూజింప బంధువై యుండేటి శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
7. అడిగినా వెంటనే అతిసౌఖ్యమిచ్చేటి శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
8. నిండుగా మోక్షమ్ము నిరతమ్ము నిచ్చేటి శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
9. అమ్మలకు అమ్మయై అపురూప శక్తియౌ శ్రీకాళిమాతకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
10. అమరమై వెలిగేటి శ్రీకాళిమాతకు
    వేజండ్ల వాసులౌ వేంకట కాళికృష్ణ పలుకు
    జయమంగళం నిత్య శుభమంగళమ్

# 28. శ్రీవేజెండ్ల పురవాసిని కాళీ గాయత్రి

**మధ్యమావతి రాగం**

1. ఓం ప్రకృత్యై చ విద్మహే
   పరాశక్త్యై చ ధీమహి
   త న్నః కాళీ ప్రచోదయాత్

2. ఓం ఆదిశక్త్యై చ విద్మహే
   కాలస్వరూపిణ్యై ధీమహి
   త న్నః కాళీ ప్రచోదయాత్

3. ఓం వేదాంతరూపిణ్యై చ విద్మహే
   వేజెండ్లవాసిన్యై ధీమహి
   త న్నః కాళీ ప్రచోదయాత్

# 29. శ్రీవేజెండ్లపుర శ్రీ భువనేశ్వరీ లలితా గాయత్రీమాతల నీరాజనం

**చక్రవాకం - రాగం**

1. శ్రీచక్రపీఠమున స్థిరమైన మూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం శ్రీభానుతేజముల నీరాజనం
2. గతజన్మదోషాల కల్మషము తొలగించు ఘనశక్తిమూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం శ్రీచంద్రకాంతులా నీరాజనం
3. కారుణ్యనిలయలై కాపాడి పోషించు గణనీయమూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం నక్షత్రకాంతులా నీరాజనం
4. సాధుజన్మల నొసగి సకలమ్మునిచ్చేటి సౌజన్యమూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం శ్రీవజ్రకాంతులా నీరాజనం
5. సన్మార్గమందునా సాగింపజేసేటి చక్కనీ మూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం సకలమౌ జ్యోతులా నీరాజనం
6. అడిగినా వరములను ఆశువుగ నిచ్చేటి అద్భుతామూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం అమరమౌజ్యోతులా నీరాజనం
7. నిత్యమౌ సంపదలు నిరతమ్ము నిచ్చేటి నిర్వాణమూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం నిండుమాణిక్యముల నీరాజనం
8. భక్తులాపాలిటి బంగారునిధులైన భద్రాదిమూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం పసిడికాంతులా నీరాజనం
9. కలిమికీ నిలయమై కైవల్యమిచ్చేటి కమనీయమూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం కడుపచ్చకాంతులా నీరాజనం
10. వేజెండ్లపురములో వెలిగేటి విమలమౌ మూర్తులకు నీరాజనం
భువనేశ్వరీ లలిత గాయత్రిమాతలకు నీరాజనం
వేజెండ్ల వాసులౌ వేంకట కాళికృష్ణులిచ్చు వేదాల సారంపు నీరాజనం

# ౩౦.శ్రీవేజెండ్లపుర శ్రీ భువనేశ్వరీ లలిత గాయత్రీమాతల మంగళ హారతి

**సురటీ రాగం**

1. నను చూడవచ్చిన నవదివ్యమూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

2. వేజెండ్లపురమందు వెలిగేటి మూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

3. గండములు బాపేటి ఘనశక్తి మూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

4. బహువిద్యలిచ్చేటి భాగ్యాది మూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

5. మర్మాలు బోధించు మంత్రాది మూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

6. అధికార పదవులు అందించు మూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

7. అద్భుతరూప శక్తులౌ అతిపుణ్యమూర్తులకు
   భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్

8. నిజభోగ మిచ్చేటి నిర్వాణమూర్తులకు
భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
జయమంగళం నిత్య శుభమంగళమ్

9. తరియింప జేసేటి తత్త్వాదిమూర్తులకు
భువనేశ్వరీ లలిత గాయత్రీ మాతలకు
జయమంగళం నిత్య శుభమంగళమ్

10. అమరమై వెలిగేటి ఆదివ్యమూర్తులకు
వేజెండ్ల వాసులౌ వేంకట కాళీకృష్ణ పలుకు
జయమంగళం నిత్య శుభమంగళమ్

# 31. శ్రీవేజెండ్లపుర శ్రీ గాయత్రీ లలితా భువనేశ్వరీ మాతల గాయత్రులు

**రేవతీ రాగం**

**గాయత్రి**

1. ఓం సంచితదుష్కర్మనాశిన్యై విద్మహే
   సకలవిద్యాప్రదాయిన్యై చ ధీమహి
   తన్నో గాయత్రీ ప్రచోదయాత్

2. ఓం సచ్చిదానందరూపిణ్యై విద్మహే
   సర్వయోగప్రదాయిన్యై చ ధీమహి
   తన్నో గాయత్రీ ప్రచోదయాత్

3. ఓం శ్రీవేదమాత్రే చ విద్మహే
   వేజెండ్లవాసిన్యై చ ధీమహి
   తన్నో గాయత్రీ ప్రచోదయాత్

**లలితా**

1. ఓం మహాదేవ్యై చ విద్మహే
   మంగళప్రదాయిన్యై చ ధీమహి
   తన్నో లలితా ప్రచోదయాత్

2. ఓం శ్రీశక్త్యై విద్మహే
   శ్రీచక్రవాసిన్యై చ ధీమహి
   తన్నో లలితా ప్రచోదయాత్

3. ఓం శ్రీవిమలమూర్త్యై చ విద్మహే
   వేజెండ్లవాసిన్యై చ ధీమహి
   తన్నో లలితా ప్రచోదయాత్

## భువనేశ్వరి

1. ఓం హరిహరవిరించార్చితాయై విద్మహే

   విశ్వపాలిన్యై చ ధీమహి

   తన్నో భువనేశ్వరీ ప్రచోదయాత్

2. ఓం సకలలోకార్చితాయై విద్మహే

   సర్వాధికారిణ్యై చ ధీమహి

   తన్నో భువనేశ్వరీ ప్రచోదయాత్

3. ఓం శ్రీవిశ్వమాత్రే చ విద్మహే

   వేజెండ్లవాసిన్యై ధీమహి

   తన్నో భువనేశ్వరీ ప్రచోదయాత్

# 32. శ్రీ వేజెండ్లపుర శ్రీసంతాన బాలవేంకటేశ్వర సుప్రభాతమ్

**1. ఓం శ్రీ సంతానబాలవేంకటేశ ! పూర్వాసంధ్యా ప్రవర్తతే !**
**ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ శ్రీవేంకటేశ !**
**ఉత్తిష్ఠ దేవదేవ ! ప్రాణదాతః ! శ్రీ శ్రీనివాస !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ శ్రీ సంతాన బాలవేంకటేశా ! సంధ్యాకాలం సమీపిస్తున్నది. గోవిందుడవైన శ్రీవేంకటేశ లేలెమ్ము. దేవదేవా ! యోగనిద్రనుంచి మేలుకో. ప్రాణదాతవైన శ్రీవేంకటేశా! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగుగాక!

**2. విరించిసురవరప్రదాతః ! విమలతేజోవిరాజిత !**
**శ్రీచక్రపీఠస్థిరనివాస ! శ్రీమద్యజ్ఞస్వరూప !**
**దామోదర ! దారిద్ర్యవిద్రావణ ! దయాసాగరమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ బ్రహ్మాది దేవతా శ్రేష్ఠులకు వరాలను ప్రసాదించే స్వామీ ! స్వచ్ఛమైన తేజస్సుతో ప్రకాశించే ప్రభాస్వరూపా ! శ్రీచక్రపీఠంపై స్థిరంగా నిలిచి ఉండే శ్రీయజ్ఞస్వరూపా ! దామోదరుడా ! దారిద్ర్యాన్ని తొలగించే దయా సముద్రుడా ! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగుగాక !

**3. భక్తపోషణకళాదీక్షిత ! భవబంధవిదూర !**
**కమలార్చిత ! కమలనయన ! కారుణ్యసుస్వరూప !**
**అనంతవరప్రదాతః ! అఖిలేశ ! అద్వైతామృతమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ భక్తుల్ని పోషించటమనే కళా దీక్షను కలిగిన భక్తజన కల్పవృక్షమా! భవబంధాల్ని తొలగించే భగవంతుడా ! కమలాక్షుడవై లక్ష్మీదేవిచేత సేవించబడే కారుణ్య సుస్వరూపుడా ! అనంతమైన వరాల్ని ప్రసాదించే దయామూర్తీ ! సమస్త

లోకాలకు అధిపతివైన అద్వైతామృత స్వరూపుడా ! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**4. భక్తిముక్తిప్రదాతః ! భవ్యాత్మ ! బహుపుణ్యనిలయ !**
**ఆద్యంతరహిత ! ఆత్మేశ ! అగణితశుభప్రదాతః !**
**పరాశక్తిరూప ! పరమాత్మ ! పరమానందమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ భక్తిని ముక్తిని ప్రసాదించే భవ్యాత్ముడా ! అనేక పుణ్యాలకు నిలయమైన అమృతమూర్తీ ! ఆద్యంతాలు లేని అకలుషమూర్తీ ! సమస్త ఆత్మలకు ప్రభువువైన సర్వేశ్వరుడా ! లెక్కలేనన్ని శుభాల్ని ప్రసాదించే విశిష్ట దాతా ! పరాశక్తి స్వరూపుడా! పరమాత్ముడా ! ఉత్కృష్టమైన ఆనందాన్ని రూపంలో నింపుకొన్న పురుషోత్తముడా! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**5. మహాలీలావిలాస ! మహాదేవ ! మహిమాన్వితస్వరూప !**
**పద్మనాభ ! పద్మేశ ! పద్మపత్రవిలోచన !**
**సకలైశ్వర్యప్రదాతః ! సర్వేశ ! సచ్చిదానందమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ అవగాహనకు అందని లీలల్ని ప్రదర్శించే మనోహర స్వరూపుడా ! దేవాధిదేవ ! మహిమతో కూడిన రూపంతో ప్రకాశించే మాధవా ! పద్మమును నాభి యందు ధరించి ప్రకాశించే బ్రహ్మపితా ! కమలకు భర్తవై ప్రకాశించే కమలనయనా! సమస్తమైన సంపదల్ని ప్రసాదించే సర్వేశ్వరుడా ! సత్, చిత్ ఆనందమూర్తీ ! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**6. నందనందన ! నారాయణ ! నవ్యదివ్యస్వరూప !**
**ముకుంద ! మోహనకృష్ణ ! మురహర ! మురళీధర !**
**మోక్షప్రదాతః ! మోదస్వరూప ! మునిజనసేవితమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ నందుని కుమారుడవైన శ్రీనారాయణుడా ! నవ్యమైన దివ్యమైన రూపాలతో ప్రకాశించే నలిననాభుడా ! మోక్షాన్ని ప్రసాదించే మోహన కృష్ణుడా ! మురుడు అనే రాక్షసుణ్ణి మట్టుపెట్టిన వీరుడా ! మురళిని ధరించిన ముగ్ధస్వరూపుడా ! సంతోష తరంగితమైన స్వరూపంతో మోక్షాన్ని ప్రసాదించే మధురమూర్తీ ! మునిజనులచేత సేవించబడే కరుణా స్వరూపుడా ! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**7. మహామోహనరూప ! మహేశ ! మహామంత్రాదిదేవ !**
**సకలసిద్ధిప్రదాతః ! సప్తగిరీశ ! సత్యస్వరూప !**
**మహాప్రేమస్వరూప ! మహితాత్మన్ ! మహాలావణ్యమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ అత్యధికంగా ఆకర్షించే ఆకారం కలిగిన అద్భుత స్వరూపా ! గొప్ప ప్రభువువై ప్రకాశించే గోవిందా ! మహామంత్రాలకు ఆదిదేవుడవైన మహిత స్వరూపుడా! సకలసిద్ధుల్ని ప్రసాదించే సప్తగిరినాథుడా ! సత్యస్వరూపుడా ! నిండైన ప్రేమతో కూడిన విశిష్టమైన హృదయం కలిగిన మహాత్ముడా ! అత్యంత ప్రకాశంతో వెలుగొందే అక్షయ స్వరూపుడా ! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**8. సత్సంతానప్రదాతః ! సకలేశ ! సకలవిద్యాస్వరూప !**
**సకలలోకపూజిత ! సత్యాత్మన్ ! సర్వాభరణభూషిత**
**సుదర్శనాయుధధర ! సురేశ ! సురానందమూర్తే**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ మంచి సంతానాన్ని ప్రసాదించే మహాదేవా ! సకల లోకాలకు ప్రభువువైన సత్త్వస్వరూపా ! అన్ని విద్యలకు సాక్ష్యమైన ఆనందస్వరూపా ! అన్ని లోకాలచేత పూజించబడే అతులిత మహిమ స్వరూపా ! సత్యమైన ఆత్మ కలిగిన దేవా ! సమస్తమైన ఆభరణాలచేత అలంకరించబడే దయామూర్తీ ! సుదర్శనమనే ఆయుధాన్ని ధరించే సురాధిపతీ ! దేవతలకు ఆనందాన్ని కలిగింపజేసే శోభితమూర్తీ ! ఓ వేజెండ్లపురవాసా! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**9. నిగమాగమస్వరూప ! నిఖిలేశ ! నిత్యనిర్మలస్వరూప !**
**విమలగుణశోభిత ! విశ్వాత్మన్ ! విశ్వకల్యాణసంధాతః !**
**కరుణాంతరంగ ! కలియుగేశ ! కైవల్యామృతమూర్తే !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ వేదశాస్త్ర స్వరూపుడవైన సమస్త లోకాధీశుడా ! నిరంతరం స్వచ్ఛమైన రూపంతో వెలుగొందే విమల స్వరూపుడా ! నిష్కల్మష గుణాలతో ప్రకాశించే విశ్వాత్ముడా ! సమస్త ప్రపంచానికీ శుభాన్ని చేకూర్చే సాధుజన సంరక్షకుడా ! కరుణతో నిండిన హృదయం కలిగిన ఆర్ద్ర స్వరూపుడా ! కలియుగ నాథుడా ! మోక్షామృతాన్ని ప్రసాదించే మోహన స్వరూపుడా ! ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ ! నీకు సుప్రభాత మగు గాక !

**10. ప్రసన్నవదన ! బాలరూప ! భక్తాభీష్టవరద !**
**వంశవృద్ధిప్రదాతః ! వాసుదేవ ! వరదాభయమూర్తే**
**సంతానవేంకటేశ ! శ్రీవేంకట కాళీకృష్ణ ప్రతిష్ఠిత ! సదార్చిత !**
**వేజెండ్లవాస ! శ్రీ వేంకటేశవిభో ! తవ సుప్రభాతమ్ ॥**

తా॥ ప్రసన్నమైన ముఖంతో బాలరూపంలో ఉన్న శ్రీవేంకటేశా ! భక్తుల కోర్కెల్ని అనుగ్రహించే అమృత స్వరూపా ! వంశాన్ని వృద్ధి చేసే వాసుదేవా ! వరాలను ప్రసాదించే అభయ స్వరూపా ! ఓ సంతాన వేంకటేశా! శ్రీ వేంకట కాళీ కృష్ణులచే ప్రతిష్ఠించబడి నిరంతరం పూజించబడుతున్న ఓ వేజెండ్లపురవాసా ! శ్రీ వేంకటేశ ప్రభూ! నీకు సుప్రభాత మగు గాక !

# 33. శ్రీ వేజెండ్లపుర శ్రీసంతానబాల వేంకటేశ్వర మంత్రస్తోత్రమ్

**1.** ఓం శ్రీప్రమాదినామ సంవత్సర శ్రీచైత్రశుక్ల
ద్వితీయా శ్రీ బృహస్పతివాసరే ఉత్తరాభాద్రా నక్షత్రే
శ్రీవేజెండ్లపురే ప్రాతఃకాలే ప్రతిష్ఠితాయ
శ్రీ సంతానబాలవేంకటేశ శ్రీ మహాదేవాయ నమః ॥ **18-3-1999**

తా॥ ప్రమాదినామ సంవత్సరం, చైత్రమాసం, శుక్లపక్షం, విదియ, గురువారం, ఉత్తరాభాద్ర నక్షత్రంలో, ప్రాతస్సమయంలో వేజెండ్లపురంలో ప్రతిష్ఠింపబడిన శ్రీ సంతాన బాలవేంకటేశ్వర స్వామికి నమస్కారం.

**2.** నిత్యాభీష్టవరప్రదాయ సచ్చిదాత్మరూపాయ
శ్రీచక్రపీఠస్థిరనివాసాయ శ్రీనివాసాయ
శ్రీకుజవార శ్రీకుసుమార్చనసంప్రీతాయ
స్థిరవారవిశేషార్చనసంతుష్టాయ దేవాయ నమః ॥

తా॥ నిత్యమూ భక్తులకు కావలసిన వరాలు ప్రసాదించే స్వామి, ఆత్మజ్ఞాన స్వరూపుడు, శ్రీచక్రపీఠంపై స్థిరంగా ఉన్నవాడూ ఐన శ్రీనివాసునికి నమస్కారం. మంగళవారం నాడు చేసే పుష్పార్చనకు సంతోషించే దేవునకు నమస్కారం.

శనివారం విశేషార్చనలకు ఆనందించే స్వామికి నమస్కారం.

**3.** ఓం హ్రీం క్లీం బీజ శ్రీదివ్యమహామంత్రస్వరూపాయ
సామవేదపారాయణప్రీతాయ వేంకటేశాయ
విశ్వవీక్షణఫాలితసంరక్షకాయ శ్రీశాయ
సత్యస్వరూపాయ శ్రీనిత్యసంపూర్ణానుగ్రహాయతే నమః ॥

తా॥ ఓం హ్రీం క్లీం అనే బీజాక్షరాలతో కూడిన మహామంత్ర స్వరూపునికి నమస్కారం.

సామవేద పారాయణకు సంతోషించే వేంకటేశ్వరునకు నమస్కారం.

సమస్త లోకాలనూ తన కటాక్ష వీక్షణాలతో సంరక్షించే శ్రీపతికి నమస్కారం. సత్యస్వరూపుడూ, భక్తులను నిరంతరం సంపూర్ణంగా అనుగ్రహించేవాడూ ఐన గోవిందునికి నమస్కారం.

**4. అభిషేకప్రియాయ అనంతస్వరూపార్చితాయ**
**శ్రీకృష్ణగోవిందాయ మహామోహనస్వరూపాయ**
**సురసేవితాయ సుందరవదనామృతరూపాయ**
**నిత్యకల్యాణప్రదాయకాయ శ్రీవేంకటేశాయ ॥**

తా॥ అభిషేక ప్రియుడికి నమస్కారం. అనేక రూపాలతో అర్చింపబడే స్వామికి నమస్కారం. మోహనరూపుడైన శ్రీకృష్ణునకు నమస్కారం. దేవతల పూజలందుకొనే గోవిందునికి నమస్కారం. అందమైన ముఖంతో, భక్తులను బ్రతికించే స్వామికి నమస్కారం. నిత్యమూ శుభపరంపరలనిచ్చే శ్రీవేంకటేశ్వరునకు నమస్కారం.

**5. కరవీరవనవిహారాయ కమలకరాయ**
**భూగర్భసమాధిస్థలావిర్భూతాయ దివ్యాయ**
**వైకుంఠైకాదశీ పర్వదినే వేజెండ్లపుర**
**శ్రీగర్భాలయ ప్రత్యక్ష స్వరూప ప్రతిష్ఠితాయ**
**శ్రీసంతానబాల వేంకటేశాయ నమో నమః**

**వేజెండ్లపుర శ్రీసంతానబాలవేంకటేశా గోవిందా గోవిందా ॥**

తా॥ ఎఱ్ఱగన్నేరు పూలతోటలో విహరించే శ్రీనివాసునకు నమస్కారం. భూగర్భంలో సమాధి స్థలంలో ఆవిర్భవించిన దివ్యమూర్తికి నమస్కారం. వేజెండ్లపురంలో వైకుంఠ ఏకాదశి పండుగనాడు గర్భాలయంలో ప్రత్యక్షమైన మూర్తితో ప్రతిష్ఠింపబడిన శ్రీసంతానబాల వేంకటేశ్వరస్వామికి పునః పునః నమస్కారం.

వేజెండ్లపుర శ్రీ సంతాన బాలవేంకటేశా ! గోవిందా ! గోవిందా !

# 34. శ్రీ వేజెండ్ల పుర శ్రీసంతాన బాల వేంకటేశ్వర స్వామి స్తోత్రమ్

ఓం శ్రీ సంతానబాలవేంకటేశ ! సన్మూర్తే ! సర్వయోగీశ్వరేశ్వర !
ఆగమపండితేంద్రజిహ్వాగ్రవాస ! అనంతబ్రహ్మాండాదినాయక!
కరుణామృతస్వరూప ! కరివరప్రదాయక ! కలియుగనాథ!
కరవీరకుసుమార్చనప్రియ ! కమలాకరార్చిత ! కమలేశ !
తులసీపత్రార్చనసంతోషిత ! తురీయలోకప్రదాయక !
నవనీతప్రియ ! నారదగానానందదాయక ! నారాయణరూప !
ప్రసన్నవదనరూప ! ప్రారబ్ధధ్వంసక ! ప్రాణప్రదాయక!
పరిపూర్ణ ప్రభావ ! పద్మాక్ష ! పరమ తేజో విరాజిత ! పద్మేశ !
బ్రహ్మాది సుర సంసేవిత ! బహు భాగ్యప్రదాతః ! బ్రహ్మాండనాయక!
మహా మహిమాన్వితరూప ! మధుసూదన! మహామృత్యు వినాశక!
మహామంగళప్రదాయక ! మాధవ! మహావిష్ణురూప! మంత్రమూర్తే!
విమల గుణ జన సంసేవిత! వివిధ విద్యా విజ్ఞాన ప్రదాతః!
విశ్వార్చిత! వేద పురుష ! విశ్వ విరాణ్మూర్తే! విజయ ప్రదాయక!
సహృదయవాస! సౌమ్య స్వరూప! సుర నర వినుత ! సుందరేశ!
సకల లోకేశ ! సప్త గిరీశ ! సర్వాలంకార ప్రియ ! సగుణేశ!
సకలాగమ సన్నుత ! సదానంద ప్రదాతః ! సద్భక్త ప్రపూజిత !
సకలైశ్వర్య ప్రదాతః ! సామగాన ప్రియ ! సనకాదిముని స్తుత !
నిత్య నిర్మల జీవన ప్రదాతః ! నిఖిలేశ ! నిర్వాణ ప్రదాయక !
గుమ్మా వంశోద్ధారక ! గురువరదాభయమూర్తే! గుహ్యప్రబోధక!
సాక్షాత్ శ్రీకృష్ణ స్వరూప ! సర్వలోక సంపూజితమూర్తే ! సర్వేశ !
శ్రీచక్రపీఠ నిలయ ! శ్రీ లక్ష్మీ విరాజిత ! శ్రీవిద్యా ప్రబోధక !
వేద ప్రతిపాదిత ! వేజెండ్లపుర శ్రీసంతాన బాల వేంకటేశ !
నమస్తే నమస్తే నమస్తే నమో నమః

# 35. శ్రీ వేజెండ్ల పురవాసుడు
# శ్రీసంతాన బాల వేంకటేశ్వరస్వామి నీరాజనం

**మాయామాళవ బౌళరాగం**

1. వేవేల కాంతుల వేజెండ్ల వాసునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
మా మంచి మనసులా నీరాజనం

2. అంతటా వెలిగేటి ఆనందనిలయునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
మా భక్తి హృదయాల నీరాజనం

3. కోమలారూపుడౌ కోనేటి రాయునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
మా భక్తిశ్రద్ధలా నీరాజనం

4. సంతానమిచ్చేటి సర్వాంతరాత్మునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
మా భక్తి పలుకులా నీరాజనం

5. శ్రీ విష్ణురూపుడౌ శ్రీ పద్మనాధునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
మా మమతానురాగాల నీరాజనం

6. కరుణార్ద్ర హృదయుడౌ కలియుగదేవునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
మా సర్వసంపదల నీరాజనం

7. ప్రాణాలదాతయౌ పరమాత్మ రూపునకు
శ్రీ వేంకటేశునకు నీరాజనం - మా యిలావేల్పునకు నీరాజనం
వేజెండ్లవాసులౌ వేంకట కాళీకృష్ణులిచ్చు వేవేల కాంతులా నీరాజనం

# 36. శ్రీ వేజెండ్ల పురవాసుడు
# శ్రీ సంతాన బాలవేంకటేశ్వరస్వామి మంగళహారతి

1. మంగళము వేజెండ్ల వాసుడౌ శ్రీ వేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
2. మంగళము సర్వాంగసుందరుడు శ్రీవేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
3. మంగళము శ్రీవిశ్వమోహితుడు శ్రీవేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
4. మంగళము వైకుంఠనిలయుడౌ శ్రీవేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
5. మంగళము శ్రీ మహాదేవునకు శ్రీవేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
6. మంగళము శ్రీయజ్ఞపురుషునకు శ్రీ వేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
7. మంగళము సంతానదాతకు శ్రీ వేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
8. మంగళము మా హృదయ మేలేటి శ్రీ వేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
9. మంగళము మాయిలావేల్పునకు శ్రీ వేంకటేశునకు
   జయమంగళం నిత్య శుభమంగళమ్
10. కలియుగదేవుడౌ కారుణ్యమూర్తికి
    వేజెండ్లవాసుడౌ వేంకట కాళీకృష్ణ పలుకు
    జయమంగళం నిత్య శుభమంగళమ్

# 37. శ్రీ సంతాన బాలవేంకటేశ్వర గాయత్రి

**రేవతారాగం**

1. ఓం శ్రీబాలవేంకటేశాయ విద్మహే
ప్రసన్నవదనాయ ధీమహి
తన్నో వేంకటేశః ప్రచోదయాత్

2. ఓం వాత్సల్యరూపాయ విద్మహే
వరదాయకాయ ధీమహి
తన్నో వేంకటేశః ప్రచోదయాత్

3. ఓం సర్వాంతరాత్మనే విద్మహే
సంతానదాత్రే ధీమహి
తన్నో వేంకటేశః ప్రచోదయాత్

4. ఓం శ్రీ వేంకటేశాయ విద్మహే
త్రిపదనాథాయ ధీమహి
తన్నో శ్రీనివాసః ప్రచోదయాత్

5. ఓం వేదస్వరూపాయ విద్మహే
వేజెండ్లవాసాయ ధీమహి
తన్నో వేంకటేశః ప్రచోదయాత్

# ౩౮. శ్రీ వేజెండ్లపుర శ్రీవరకాళీ మాత స్తోత్రము

ఓం శ్రీ విశ్వమాతా, విశ్వాధారా, విశ్వోత్పత్తికారిణీ, విమలస్వరూపా, బ్రహ్మాండ సృష్టి, స్థితి లయకారిణీ, స్త్రీ పురుష స్వరూపా, బ్రహ్మ విష్ణు మహేశ్వర వినుతా, పరాశక్తి, బ్రహ్మానందసంధాయినీ, బ్రహ్మజ్ఞానప్రసాదినీ, సర్వభూత కోటి చైతన్య శక్తి స్వరూపిణీ, జీవన్ముక్తి ప్రదాయినీ, చిదానంద స్వరూపిణీ, సర్వశుభఫలప్రదాయినీ, అసదృశరూపలావణ్య స్వరూపిణీ, అనుపమదానగుణప్రకాశినీ, అమేయ బలప్రదాయినీ, ఆదిశక్తి, కాలస్వరూపిణీ, కాలాధికారిణీ, సర్వలోక సంరక్షిణీ, సకలవిద్యాప్రదాయినీ, సర్వకాలసంరక్షిణీ, సదాశక్తి సంధాయినీ, విశ్వాధికా, వేదస్థితా, విష్ణుమాయావిలాసినీ, అనంత సుఖశాంతి ప్రదాయినీ, అద్భుత శక్తి ప్రసాదినీ, ఆధివ్యాధి వినాశినీ, అమర లోకప్రసాదినీ, అసురకోటిభంజనీ, అతులితైశ్వర్యప్రదాయినీ, అకాలమృత్యు నివారిణీ, అగణితకీర్తిసంధాయినీ, సకల మంత్ర యంత్ర తంత్ర శక్తి ప్రసాదినీ, త్రిలోకపావనీ, త్రిగుణస్వరూపిణీ, జ్ఞానప్రసాదినీ, సత్యవాక్ప్రసాదినీ, ధర్మమార్గవర్తినీ, న్యాయమార్గసంచారిణీ, సురమునిగణసంసేవితా, సర్వదుఃఖ క్షయంకరీ, పరమానంద రూపిణీ, పరమప్రకాశినీ, మహాతేజస్వినీ, జ్ఞానమార్గ స్వరూపిణీ, స్థిరత్వ ప్రసాదినీ, వీరమాతా, వేదవిద్యావిలాసినీ, విజయోత్సవకారిణీ, అమరమూర్తీ, క్షుద్రశక్తి, విధ్వంసినీ, సర్వసంక్షోభనివారిణీ, అనంతకాంతిప్రకాశినీ, అద్భుతస్వరూపిణీ, షట్చక్రాధిష్ఠానశక్తీ, జ్యోతిస్స్వరూపా, సాధుజనసంరక్షిణీ, సకలార్థ సిద్ధిప్రదాయినీ, సర్వయజ్ఞ ఫలప్రసాదినీ, కైవల్యదాయినీ, కారుణ్యస్వరూపిణీ, కమలాకరపూజితా, కమలాసుతసేవితా, కపర్దిదేవసమర్చితా, కలికల్మషనాశినీ, కర్మబంధవిభేదినీ, ప్రణతార్తిప్రభంజనీ, గురుమాతా, గురుకృపా, గురుమండల సమర్చితా, శ్రీశక్తి చిద్విలాసినీ, సద్భక్తార్చితసాకారరూపిణీ, నిత్యానందప్రదాయినీ, శ్రీ జగన్మంగళకారిణీ, మూలశక్తి, సురాసురసుపూజితా, శుభదాయినీ, మణిద్వీప నివాసినీ, సర్వసిద్ధి ప్రదాయినీ, భక్తార్తిశమనీ, తుర్యమార్గప్రసాదినీ, సర్వోత్తమ కార్యకారిణీ, సకలస్తోత్ర ఫలప్రదాయినీ, సనాతనీ, ఖేచరాంతరనివాసినీ, సత్యజ్ఞాన ప్రబోధినీ, రాజ్యదా, రాజ్యవర్ధినీ, భయనాశినీ, భక్తచైతన్యనిలయా, భక్తారోగ్యప్రదాయినీ, ధనదాయినీ, భవసాగరతారిణీ, విశ్వోపద్రవనాశినీ, హితకార్య ప్రవర్ధినీ, ధర్మాధర్మవిచారిణీ,

చోరబాధావినాశినీ, భోగదాయినీ, సర్వపాపప్రభంజనీ, దుర్బుద్ధినాశినీ, సర్వదారిద్ర్య భంజనీ, సేవకప్రియకారిణీ, క్రతుకర్మఫలప్రదా, ఈతిబాధానివారిణీ, భక్తానాం పుష్టికారిణీ, రాగద్వేష వినాశినీ, క్రూరగ్రహధ్వంసినీ, సర్వమంగళదాయినీ, సస్యవర్ధినీ, సూక్ష్మబుద్ధిప్రబోధినీ, భూతావేశవినాశినీ, దుష్టమ్లేచ్ఛవినాశినీ, కల్యాణకారిణీ, చిత్తశుద్ధిప్రసాదినీ, విశ్వపాలనవిశారదా, విశ్వపావనీ, సర్వశాంతివిధాయినీ, సర్వభూతహితైషిణీ, గుణశాలినీ, ముక్తి ఫలప్రదాయినీ, సాధుమూర్తీ, సర్వదీక్షోపాసన ఫలప్రదాయినీ, సకలాచారప్రియా, విశ్వసద్గురుదర్శనానందఫలప్రదాయినీ, సదా సంతోషానందప్రదాయినీ, సర్వకాలపూజనప్రియా, భవపాశవినాశినీ, ప్రళయకాల సంరక్షిణీ, పరమంత్ర పరయంత్ర, పరతంత్ర ప్రభేదినీ, దివ్యభోగప్రసాదినీ, సంసారకూపసముద్ధరిణీ, సద్గతిప్రదాయినీ, అజ్ఞానవినాశినీ, పాపపంకిలక్షాళినీ, పుణ్యధనప్రసాదినీ, సర్వవిషభూతనివారిణీ, సర్వసంకటవినాశినీ, పాతాళ పరివ్యాప్తినీ, అంతరిక్ష అధివాసినీ, ప్రకృతి స్వరూపిణీ, ప్రహర్షసంవర్ధినీ, ప్రజ్ఞాపరివర్ధినీ, పరమపదప్రసాదినీ, శ్రీచక్రస్థిరనివాసినీ, హాస్యలాస్య విహారిణీ, దారిద్ర్యవిధ్వంసినీ, సకలసుకవికంఠాభరణా, బ్రహ్మర్షి గణపూజితా, చింతాకులధ్వంసినీ, వివాదే విజయప్రసాదినీ, సర్వయజ్ఞవిఘ్నవినాశినీ, జపాకుసుమసంశోభితా, సర్వదేవ తారాధన ఫలప్రదాయినీ, బుధజనతోషితా, భువనేశ్వరీ, అవతారపురుషరక్షిణీ, అమృతస్వరూపిణీ, శత్రుసంఘవిదారిణీ, కారాగృహబంధవిమోచనీ, సర్వకామఫల ప్రదా, సద్గురుస్వరూపిణీ, సర్వనదీస్నానఫలప్రదాయిని, మహాదుర్ఘటభేదినీ, క్షేమంకరీ, శాంకరీ, సర్వసమ్మోహకారిణీ, పురుషార్థప్రదాయినీ, బ్రహ్మహత్యాదిపాపవినాశినీ, నిత్యానంద స్వరూపిణీ, నిరాకారరూపిణీ, నిర్మలహృదయ నివాసినీ, పూజనీయా, పుణ్యమూర్తీ, సర్వకాలసంసేవితా, చంద్రమండలవర్తినీ, సకలపుణ్యక్షేత్రసందర్శన ఫలప్రదాయినీ, నానాసుఖవిలాసినీ, సాధకప్రియకారిణీ, సర్వశక్తిసమన్వితా, జన్మమృత్యుజరాతీత సదానందా, సత్యమూర్తీ, సర్వభూతాశయస్థితా, వేదశక్తీ, వేదమాతా, వేదవిద్యాప్రకాశినీ, దుష్టదూరా, దోషవర్జితా, మహాశక్తీ, మనోమయీ, కల్యాణీ, కమలవాసా, శరచ్చంద్రజ్యోత్స్నాస్వరూపిణీ, సర్వగర్వవిమర్దినీ, అనేకజన్మసంసిద్ధపుణ్యపూజితా, సర్వలోకప్రియా, పంచభూతాతీతశక్తి ప్రదాయినీ, తేజోవతీ, మహామాతా, మహాబుద్ధీ మహాసిద్ధీ, మహాయోగీశ్వరేశ్వరీ, శివోపరిస్థితా,

సర్వసంపత్స్వరూపా, కోటిసూర్య సమప్రభా, జ్ఞానరూపా, కళాతీతా, బ్రహ్మాండ నాయికా, ఆదిమధ్యాంతరహితా, కాలగమనప్రసాదినీ, లలితమార్గసంచారిణీ, శూలధారిణీ, భక్తాభీష్టఫలప్రదా, ధనధాన్యకరీ, మనోమాలిన్యహారిణీ, వంశవృద్ధిప్రదాయినీ, బ్రహ్మాదిసురసంసేవ్యా, దురాచారశమనీ, ప్రియభాషిణీ, భూతప్రేత పిశాచాదిహారిణీ, సుమనస్వినీ, మహామఖా, బ్రహ్మరాక్షసబాధానివారిణీ, గురురూపా, మహావీర్యా, మహాపాతకనాశినీ, మంత్రమయీ, విశ్వాత్మికా, విశ్వపాశ వినాశినీ, పరబ్రహ్మస్వరూపా, పరబ్రహ్మ నివాసినీ, శబ్దబ్రహ్మస్వరూపా, సర్వసంగ్రామజయదా, సర్వపీడోపశమనీ, సర్వారిష్ట నివారిణీ, దుఃఖదుస్స్వప్ననాశినీ, మాతాపితృస్వరూపిణీ, గుహ్యాతిగుహ్యవిద్యాప్రదాయినీ, మృతసంజీవకారిణీ, సన్మార్గసంధాయినీ, మహామాయా, మంత్రస్వరూపిణీ, విరాడ్రూపా, విద్యుత్కోటిసమప్రభా, సర్వాపవాదశమనీ, సర్వసౌభాగ్యవర్ధినీ, ధ్యానయోగప్రసాదినీ, యోగమాయా, యోగముద్రా, యోగనిద్రా, సమాకలితా యోగగమ్యా, యోగరూపా, యోగసిద్ధిప్రదాయినీ, యోగిమండల సంపూజితా, శ్రీవేంకటకాళీకృష్ణార్చితా నమ స్తే నమ స్తే నమ స్తే శ్రీవరకాళికే నమో నమః.

అనంతరూపిణి విశ్వపూజితా

పాహి మాం, పాహి మాం, పాహి మాం

శ్రీవరకాళీమాతా పాహి మాం

# 39. శ్రీవేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తికాళీ అమృతాక్షరాద్భుతానంద స్తోత్రరత్నమాలిక శ్లోకాలు

శ్లో॥ ఓంకారాదిమూర్తే ! కాళి ! మౌనాద్భుతయోగప్రదాయిని !
హ్రీం జగద్బీజే ! దేవి ! మహాశక్త్యాది స్వరూపిణి ! కాళి !
శ్రీం సకల సౌభాగ్యప్రదాత్రి ! శీతలేశ్వరి ! దేవి !
క్రీం కాళి ! సర్వాకర్షిణి ! మహాకాలచక్ర ప్రపాలిని ! 1

శ్లో॥ క్రాందేవి ! సదా కాల చక్రానుకూల్య ప్రాప్తిప్రదే ! కాళి !
క్రోం కోమల స్వరూపిణి ! కోటి కోటి శుభప్రదాయిని !
శ్రాం శాంతాకార మూర్తే ! శ్రీకాళి ! సదా సుశాంతి ప్రదాత్రి !
సౌంకార సౌందర్యాది మూర్తే ! వాగీశ్వరేశ్వరి ! శ్రీకాళి ! 2

శ్లో॥ హ్రాం మహాదోషాపహారిణి ! సుసంపూర్ణారోగ్యప్రదాత్రి !
హ్రూం మహామంత్రాదిదేవి ! సర్వశత్రు సంహారకారిణి !
హ్రౌం కారమూర్తే ! మహామృత్యుంజయ శక్తి ప్రదాత్రి ! కాళి !
స్త్రీం బ్రహ్మ విష్ణు శివారాధ్యే ! శ్రీ బ్రహ్మానందప్రదాయిని ! 3

శ్లో॥ క్షం భద్రకాళి ! మహాభయాతిశోక దుఃఖాదృశ్యమూర్తే !
జం జన్మరాహిత్య మార్గోపదేశమూర్తే ! జగదంబికే !
క్లీం కార వాసిని ! సర్వాభీష్టప్రదే ! సదా సంరక్షణి !
సుమంత్ర జప స్తోత్రోచ్చారక భక్తజన ప్రపాలిని ! 4

శ్లో॥ అష్టాదశ షోడశీ ద్వాదశ నవాక్షర పంచాక్షరీ ఏకాక్షరీ జపప్రియే !
శ్రీమూలమంత్ర సంపుటీ సహస్రనామ స్తోత్రపారాయణ వహ్నియాగతోషిణి!
అగ్నిహోత్ర నిర్వహణ కాలానేక సుఫల సమర్పణ సంతృప్తమూర్తే ! దేవి
విశ్వకల్యాణోపయోగ నిస్వార్థసుబుద్ధి జనానేక వరప్రదాయిని! కాళి!5

శ్లో॥ సౌగంధికపుష్పామృతాక్షయపరిమళోద్భవాక్షరానేకమాల్యార్పణానందమూర్తే!
పూర్వసంధ్యాగణితబాలాదిత్యోద్భవాధిక తేజోనఖానంత శ్రీచరణాదిశక్తే!
శుక్లపక్షపూర్ణిమాసుదిన చంద్రకోటి విరాజమానాద్భుతాక్షిరూపిణి ! శ్రీకాళి!
సర్వసంశయ నివృత్తికాల విశ్లేషణ వివరణాత్మక శక్తి ప్రదాయిని ! కాళి! **6**

శ్లో॥ వరకాళి ! ఆశ్రితజనపాలికే ! సంరక్షిణి ! ద్విభుజే ! ప్రసన్నదేవి !
మాం లాలితమూర్తే! మహాసమాధి స్థితిప్రదే! దేవి ! మాతః ! శ్రీవరకాళి!
చతుర్భుజే ! దేవి ! అమితానందప్రదే ! అష్టభుజ స్వరూపిణి ! శ్రీకాళి!
శ్రీదివ్యసింహాసనప్రదే! యజ్ఞప్రియే! ద్విజబృందపాలికే! శక్తిప్రదే! **7**

శ్లో॥ దశభుజే ! శ్రీ వరకాళి ! మహాసౌందర్యమూర్తే ! వేజెండ్లపురవాసిని !
నిత్యనూతనానుభూతిప్రదాత్రి ! సత్యసంపూర్ణ యోగసిద్ధిప్రదే ! కాళి!
షోడశభుజే ! అష్టాదశభుజమూర్తే ! అనంతకరవక్త్ర స్వరూపిణి!
నిశీధ సమయార్చన ప్రీతే! నిత్యసందర్శిని ! సత్య సంభాషణ మూర్తే! **8**

శ్లో॥ శ్రీచక్రపీఠేశ్వరి ! శ్రీ వేంకట కాళీకృష్ణ గురు సంసేవన ప్రియే !
వ్రతపూజాకాల కలశోద్భవ మూర్తే ! సుదీక్షాకాల సంరక్షిణి ! కాళి !
మనోభీష్టసిద్ధిప్రదాత్రి ! మాతాపితృ సుగురు దైవమూర్తే ! వరకాళి !
ఆశుతోషిణ్యమృత స్వరూపాద్వైతమూర్తే ! అగణిత వరప్రదాయిని ! **9**

శ్లో॥ శ్రీగురు ఆనంద నిలయ విహారిణి ! సాకార స్వరూపిణి ! వరకాళి !
అనేకరూప సందర్శిని ! శ్రీమహాదేవి ! ఆదిపరాశక్తే ! దేవి ! కాళి !
మహామంత్రనామ దివ్యస్తోత్ర పఠన యాగోత్సవానందమూర్తే ! శ్రీకాళి!
కరవీర కుసుమార్చన సంప్రీతే ! కాళి ! కదంబ వృక్షాగ్రనివాసిని ! **10**

శ్లో॥ శ్రీసత్యయుగ పూర్వోద్భవమూర్తే ! శ్రీలక్ష్మీనారసింహార్చనప్రియే ! దేవి!
బ్రహ్మవిష్ణు మహేశ్వర సృష్ట్యాదిశక్తే ! బ్రహ్మాండాసన యోగమూర్తే ! కాళి!
త్రిశక్త్యుద్భవ కారణమూర్తే! హే త్రిమూర్తిజనని ! త్రిగుణస్వరూపిణి!
గౌరీశంకర రమానారాయణ భారతీవిరించ్యర్చితానందమూర్త్యాదిశక్తే! **11**

శ్లో॥ సర్వ తపోధన ఫలత్యాగ సన్మౌని యోగిహృదయోద్యాన విహారిణి !
సన్మార్గాచరణ సాధు సజ్జన సాంగత్య సంపదుత్పత్త్యభివృద్ధిమూర్తే !
సుపూజానేక వ్రతాచరణ స్త్రీ పురుష భక్తజన హృదయవాసిని !
మహర్షీంద్రాలోచనానుగుణ ప్రకృత్యానుకూల్య ప్రదాన కారిణి! కాళి!12

శ్లో॥ అపూర్వాద్భుత కరచరణ వక్త్రాక్షి దివ్య స్వరూపావతారిణి ! కాళి !
మహాశ్చర్య దివ్యాచ్యుతదేహధారిణి! శ్రీకాళి! మంత్ర నామాద్భుతమూర్తే!
త్రిమూర్తీంద్ర సురగణ త్రిశక్తి సంరక్షిణి ! ప్రేమామృతాక్షయవర్షిణి !
దివ్యామృతాక్షరానేక మంత్రస్తోత్రా భరణాలంకృతోత్సాహమూర్తే ! కాళి!13

శ్లో॥ సర్వవిఘ్ననివారిణి! కార్య నిర్విఘ్న నిర్వహణశక్తి ప్రదాత్రి ! కాళి !
మహాపుణ్యకార్యాచరణ భక్తజన సంరక్షిణి ! దేవి ! మంగళమూర్తే !
అనేకాలంకారాద్భుత మూర్త్యర్చనాధిక ఫలప్రదాత్మ ధ్యాన ప్రదాత్రి !
సకల శక్తిపీఠ సందర్శనాధిక ఫల స్తుతిమాత్ర ప్రదాత్రి ! కాళి ! 14

శ్లో॥ అకారాదిమూర్తే ! ఆమ్నాయప్రదే ! ఆత్మసృష్ట్యాదిశక్తే ! అమృతరూపిణి!
ఉకారాదిమూర్తే ! దేవి ! ఉదారస్వభావిని ! ఉత్తమ సత్త్వగుణప్రదే!
మకారాదిమూర్తే ! మనోబుద్ధి వృత్తి శూన్యకారిణి ! మహాదేవి! శ్రీకాళి!
హ్రీంకార స్వరూపిణి ! దేవి ! హిమాలయాద్రీశ్వరి ! శ్రీకాళి ! భువనేశ్వరి!15

శ్లో॥ విష్ణుఫాలస్థానవిరించికంఠాగ్రస్థ ద్విపాదముద్రాస్థిరవరప్రదే !
ఈశ్వర వక్షస్ స్థలాగ్రస్థ ద్విపాదముద్ర స్థిరవరప్రదాత్రి ! కాళి !
అగణితాగ్ని మండల మహామహోజ్జ్వలాంతరానేక రూపసందర్శిని !
సర్వదేవగణసంసేవిత చరణమూర్తే ! సకల సురేశ్వరి ! కాళి ! 16

శ్లో॥ శ్రీచరణమూర్తే ! కాళి ! శ్రీవేజెండ్లపురవాసిని ! కోమల స్వరూపిణి !
స్వాయంభువమూర్తే ! స్వప్రకాశిని ! మహాదేవి ! స్వర్ణమండలనివాసిని!
హిరణ్యగర్భ కమలేశ్వరార్చిత పాదపద్మయుగళే ! శ్రీవరకాళి !
నిత్యనీలకంఠేశ్వరార్చనప్రియే ! దేవి ! నిజవరప్రదాయిని ! కాళి !17

శ్లో॥ శివోపరిస్థిరమూర్తే ! దేవి ! సింహవాహిని ! ప్రచండస్వరూపిణి ! కాళి!
దివ్యనిధి శిరోలంబకేశవిలాసిని ! సకల దేవతోద్భవ దేహమూర్తే!
శ్రీకపాలాకార సుగంధి సుదివ్యామృత పుష్పమాల్యాభరణాలంకృతే !
తపోభక్తశిరఃకర సుభూషణ కట్యాభరణధారిణి ! మహాదేవి ! 18

శ్లో॥ శంఖచక్రసనయనాసి ధనుర్బాణ ఛిన్నశిరశ్శూలరుధిర ఆక్షయ పాత్రహస్తే!
గదాఖడ్గాసిత్రాణాయుధపాణిమూర్తే ! అరుణచందన తులసీరుద్రాక్షప్రియే!
పద్మరాగ ప్రవాళమేచక స్ఫటికారుణ శ్వేతగుంజా మాల్యప్రియే ! శ్రీకాళి!
అశ్వత్థ, వట, కదంబ వృక్షచ్ఛాయా జపధ్యానయోగ తపః ప్రియమూర్తే! కాళి ! 19

శ్లో॥ దశదిశావిర్భావమూర్తే ! ద్విచరణ నాగాభరణధారిణి ! శ్రీకాళి !
అమామిళితరవిజయ భృగువారార్చనామిత ప్రియమూర్తే ! శ్రీకాళి!
యథాశక్త్యర్చన ప్రీతే ! కాళి ! స్వార్జితార్చితతోషిణి ! నిత్యశోభితే !
శతసహస్రకోటి యోగినీ గణసంసేవితే ! వేజెండ్లపురవాసిని ! 20

శ్లో॥ శ్రీమూలప్రకృతే ! ఈశ్వరి ! శ్రీకాళి ! నిత్యాలంకారప్రియే ! నిగమేశ్వరి!
కోటిసూర్యచంద్ర ప్రకాశాతీత తేజోవిరాజిత సుకిరీటధారిణి !
సుభక్త సురగణార్తి వీక్షణ శ్రవణ నయన కర్ణమూర్తే ! శ్రీకాళి !
ఆపత్కాలోద్భవమూర్తే ! దేవి ! అనేకాద్భుతాయుధావతారిణి! శ్రీకాళి!21

శ్లో॥ వరగర్వాసురధ్వంసిని ! వహ్నిజ్వాలోద్భవ సుఫాలనేత్ర స్వరూపిణి !
కృపామృతోద్భవాంబుధినిధి నయన యుగళమూర్తే ! కౌమారి ! శ్రీకాళి!
సురాసురనరవందితే ! శ్రీకాళి ! సుందరముఖి ! సహృదయవాసిని !
సురసురేతర రక్షణ సుకార్యార్థ స్వజిహ్వా విస్తరణకారిణి ! కాళి ! 22

శ్లో॥ విమలకాంతి విరాజిత వికసిత వదనమూర్తే ! శ్రీవిజయేశ్వరి !
సాకార నిరాకారమూర్తే ! వరకాళి ! సదామృదుమధుర సంభాషిణి !
సుశీతలామృత సంజీవినీ సమానామృత కరస్వరూపిణి ! శ్రీకాళి
మహాబాహుబలమూర్తే ! పారిజాత కుసుమతుల్యదంతపంక్తే ! శ్రీకాళి! 23

శ్లో॥ నీలారుణశ్వేతోత్పల పుష్పయుక్తమాలాలంకృతే ! నీలమేఘస్వరూపే!
సూర్యసోమకిరణోద్భవాద్భుత సుమాలాజటామకుటధారిణి ! కాళి !
సుసౌరభప్రియే ! సురమందార కుసుమాభరణ దేహధారిణి ! దేవి !
ధ్యానసమయ స్వర్ణాకారకేశ సందర్శనాదృష్టప్రాప్తి ప్రదాత్రి ! కాళి ! **24**

శ్లో॥ సుగంధమారుతోద్భవ వరనాసికామూర్తే ! వేజెండ్లపుర వరకాళి !
నాసికారంధ్రోద్భవ సుగంధాస్వాద భాగ్యదాత్రి ! భక్తజనప్రదాయిని !
హర్షవదనారుణాధరాద్భుతమూర్తే ! హయగ్రీవార్చనతోషిణి ! దేవి !
సురకరుణానుగ్రహ సాక్షాత్కారానేకమార్గ ప్రబోధిని ! వరకాళి ! **25**

శ్లో॥ సుబ్రహ్మానందానుభూతి ప్రదానకారణ సుస్వరోద్భవ ద్వికర్ణమూర్తే !
శిరోఽరణ్యకేశ వృక్షోద్భవ సుగంధ ధూమాక్షయ నిర్గమనశిరోమూర్తే !
మహామేఘమూర్తే ! దేవి ! మలయమారుతభవకారణముఖి ! కాళి !
త్రికాలార్చన ప్రియమూర్తే ! త్రినేత్ర స్వరూపిణి! త్రిశూలధారిణి ! దేవి!**26**

శ్లో॥ నానావిధ దివ్య కుసుమాగ్ని జలోద్భవ నిధిచరణమూర్తే ! శ్రీకాళి !
అఖండాద్భుత ప్రకాశాగణితజ్యోతిస్సమానానేక రోమదేహమూర్తే !
వివిధపుష్పమాల్యాదిక పరిపూర్ణ మనోభావాత్మార్పణానందమూర్తే !
స్తోత్రామృతాభిషేకప్రియే ! శ్రీకాళి! నమస్కార నైవేద్యానందకారిణి! **27**

శ్లో॥ వాఙ్మయాంతరేతరమర్మప్రబోధిని ! వాచస్పతి బిరుదాద్భుత ప్రదే !
దక్షయజ్ఞధ్వంసకారణేశ్వరదేహోద్భవ శ్రీవీరభద్రేశ్వరార్చితే !
వసుంధరార్చితే ! దేవి ! వరాహస్వామి నిత్యసంభాషణానుగ్రహరూపే!
వీరభక్త జన్మజన్మాంతరానుగ్రహమూర్తే ! వీరనారి ! అనుగ్రహకారిణి! **28**

శ్లో॥ పంచశక్త్యర్చిత ప్రియమూర్తే ! దేవి ! పంచభూతాది ప్రకృతీశ్వరి ! కాళి!
దశమహావిద్యాధి దేవతోద్భవ కారణ క్రీడామూర్తే ! భువనేశ్వరి !
శచీ అమరేశ్వరార్చితే ! వరుణాగ్ని వాయుసంసేవితే ! వరప్రదాత్రి!
అహోబిల పర్వతాగ్రోగ్ర నారసింహస్వరూప సందర్శిని! వరకాళి! **29**

శ్లో॥ అత్రిమహర్ష్యర్చన తోషిణి ! అనసూయాత్ర్యభీష్ట సుసిద్ధి ప్రదాయిని!
సుషుప్తికాల స్వప్నాలోచనాచరణానేక కార్యసిద్ధి ప్రదాత్రి ! దేవి !
దత్తాత్రేయార్చితానుగ్రహమూర్తే ! ధర్మాచరణమర్మప్రబోధిని ! కాళి !
సకలప్రాణి భవాభివృద్ధి మరణ కారణ మర్మజ్ఞాన ప్రదాయిని ! 30

శ్లో॥ అగస్త్య లోపాముద్రార్చితే ! అద్భుతానేక గ్రంథరచనాశక్తి ప్రదాత్రి !
వశిష్టముని తపోవృద్ధిమూర్తే ! విశ్వవీక్షణాదృష్ట వరప్రదాయిని !
మహామంత్ర ధ్యానయజ్ఞ మనోభావోపాసన విద్యాప్రదాయిని ! శ్రీకాళి!
విశ్వామిత్రార్చితానందమూర్తే ! యజ్ఞసంరక్షణ మార్గోపదేశదాయిని ! 31

శ్లో॥ భార్గవ మహర్ష్యర్చనతోషిణి ! బహువిధ విద్యాప్రదాయిని ! శ్రీకాళి!
జనకరాజార్చితే ! కాళి ! జననాడీ గృహీత జ్ఞానశక్తి ప్రదాయిని !
జానకీసదనుగ్రహమూర్తే ! కాళి ! జయవార్తా ప్రబోధానందకారిణి !
శ్రీరామచంద్రార్చితే ! శీతలోపదేశకారిణి ! దివ్యానందప్రదాయిని! 32

శ్లో॥ చైత్రశుద్ధ ప్రతిపత్ పర్వదిన ప్రాతఃకాల దీక్షాచరణ మర్మ ప్రబోధిని !
వసంతనవదిన త్రికాలవ్రతాచరణ భక్తరామచంద్రానుగ్రహ మూర్తే !
భూపుత్రీరామపత్నీ సందర్శనసంభాషణ భాగ్యప్రదాయిని ! శ్రీమహాదేవి!
సీతాన్వేషణాంజనీ పుత్రకార్యసిద్ధిప్రదాత్రి! రావణాహంకార ధ్వంసిని! కాళి! 33

శ్లో॥ అంజనాదేవి తపః కాలానుగ్రహకారిణి! మాతృత్వ మహాయశోభాగ్యప్రదాత్రి!
ఆంజనేయార్చనతోషిణి ! లంకానగరాంతర ప్రవేశమార్గ ప్రబోధిని !
అసురాద్భుతశక్తి ప్రతాపయుక్తి బలపరాక్రమ మర్మప్రబోధిని !
భీషణాకారాసురగణ కుక్షి శిరోబాధామాయా నిద్రావేశకారిణి ! 34

శ్లో॥ దేవకీ వసుదేవార్చితే ! యోగమాయే ! శ్రీకృష్ణానుగ్రహమూర్తే ! శ్రీకాళి!
వ్యాసమునీంద్రార్చితే ! గాంధార్యభీష్టమృత పుత్రాత్మ సందర్శనకారిణి !
ఆకాశరాజార్చితే ! దేవి ! ఆమ్నాయాక్షీ స్వరూపోద్భవమూర్తే ! శ్రీఆదిశక్తే!
పూర్వవర్తమానభావివాగ్దాన సాక్షాత్కార వ్రతదీక్షాచార్యశ్రీమూర్తే ! 35

శ్లో॥ శ్రీవసుదేవ స్తోత్రానందమూర్తే ! వర్తమానకాల వాస్తవ ప్రబోధిని !
నిశీధికాల ద్వారకానగర విహారిణి ! నిరంతర విఘ్న నివారిణి !
శ్రీకృష్ణ జన్మాష్టమీ పర్వదినకాల విశేష స్తోత్రార్చనానందమూర్తే !
గోసంఘ సంవృద్ధికారిణి ! గోకుల గోపాలబాల సంరక్షిణి ! శ్రీకాళి! 36

శ్లో॥ నిత్యశోక దుఃఖ కారణాన్యక్షేత్రాశుచిస్థలనివాసాదృశ్యకారిణి !
పూర్వవర్తమానకార్యాచరణ ప్రాప్తి పుణ్యక్షేత్ర నివాస భాగ్యప్రదే ।
విశ్వవిహార వీక్షణానుభవాధిక విమల యుక్తి ప్రదాయిని ! దేవి !
సదానంద జీవన భాగ్యోత్పత్తి మూర్తే ! సర్వదాత్రి ! సద్గురు స్వరూపిణి॥37

శ్లో॥ సత్ప్రవర్తన సుజనాధ్యాత్మ విద్యాభిలాషా దీక్షాప్రవృత్తి భాగ్యప్రదాయిని !
సుసంస్కారాలోచనా సుబుద్ధి సురగుణ నిత్యోత్పత్తి శ్రీమూర్తే ! సుహృత్పోషిణి।
బాహ్యాచరణానేకకుకర్మఫల స్వప్నకాలానుభవ వరప్రదాత్రి ! కాళి !
సత్కార్యాచరణ భక్తాయుః ప్రమాణకాలాద్భుత ప్రశాంత జీవన ప్రదాయిని॥ 38

శ్లో॥ శ్రీ వరాదిమూర్తే ! అధికజన్మాదృష్టాలయ నిర్మాణశక్తి ప్రదాయిని !
గర్భాలయాంతర్భాగ ధ్యాన యోగాసన సిద్ధ్యర్చనాదృష్టప్రాప్తి ప్రదాత్రి !
భూతభవిష్యద్వర్తమాన కాలధర్మసందర్శనభాగ్యప్రదాత్రి ! దేవి !
నిత్యకుసుమార్చనానందమూర్తే ! దేవి! సదా సంతృప్తిప్రదాయిని! కాళి! 39

శ్లో॥ ప్రవృత్తినిర్వహణ కాలాగణితక్లేశాదృశ్యకారిణి ! ధర్మప్రబోధిని !
అతిదుర్లభాధ్యాత్మికామృత ప్రబోధ శ్రవణాదృష్ట ప్రాప్తిప్రదాయిని !
భూగర్భాంతర పంచశీర్ష శేషతల్పాగ్రశయనకాల ప్రత్యక్షమూర్తే !
శ్రీమహా మంత్రోపదేశకారిణి ! జన్మధన్యత్వోపయోగవాక్య ప్రబోధిని!40

శ్లో॥ ఆధ్యాత్మికానేక విద్యామర్మ ప్రబోధన సుజనేంద్ర గణమైత్రి భాగ్యప్రదాయిని!
సువిద్యానేక మంత్ర స్తోత్ర సుషుప్తికాల పునశ్చరణాభ్యాసాద్భుత వరప్రదాత్రి!
చైతన్యాధార ప్రాణశక్తి దేహాంతర ప్రవేశోచ్చాటనమర్మ సందర్శన భాగ్యదాత్రి!
పునర్భావికాల మానవ జన్మేతర జన్మప్రాప్తి కారణాతిరహస్య ప్రబోధిని! 41

శ్లో॥ భూగర్భసమాధ్యంతర్భాగాద్భుతానేక సోమకిరణోద్భవకారిణి ! కాళి!
శ్రీచక్రమేరుబిందు స్థానాగ్ర భాగాసనధ్యానయోగ శక్త్యుత్పత్తిమూర్తే !
అగణితానేక బ్రహ్మాండ సందర్శనాదృష్ట ప్రాప్తి ప్రదానకారిణి ! కాళి !
శేషతల్పాగ్రశయనాధికార ప్రాప్తయోగనిద్రాద్భుతశక్తి ప్రదాత్రి ! 42

శ్లో॥ భూతభవిష్యద్వర్తమాన విషయవాస్తవ సందర్శనాగ్ని భాగ్యదాత్రి
పండితేంద్ర ముఖవాక్యశ్రవణానందమూర్తే ! సుస్వరాభివృద్ధికారిణి !
సర్వకార్య సాఫల్య నిర్వహణాతులితాద్భుత శక్తిప్రదాయిని ! కాళి !
భవిష్యత్కాలానేకావసర దివ్య ప్రణాలికామృత మార్గ ప్రబోధిని॥ 43

శ్లో॥ అశ్వత్థ వటప్లక్ష ఉదుంబర వృక్షాగ్ర సుఖాసన ధ్యానసిద్ధిప్రదాయిని !
కఫరోగహరౌషధ కర్ణవిద్యాసిద్ధ్యాది ప్లక్షవృక్షాగ్రదర్శిని ! శ్రీకాళి !
వృక్షాత్పతనకాలసంరక్షిణి ! దేవి ! సర్వభద్రస్వరూపిణి ! శ్రీమహాదేవి!
మహోత్కృష్టాద్భుత కాలజ్ఞానశక్తి ప్రదాత్రి ! కాళి ! ఉదుంబర వృక్షవాసిని! 44

శ్లో॥ ప్రభాసమను సంసేవిత చరణమూర్తే ! యోగసిద్ధ్యర్చనతోషిణి! శ్రీకాళి!
సురశిల్పి విశ్వకర్మ ప్రపూజితే ! దేవి! ప్రహ్లాదినీ సంసేవితప్రియే ! కాళి!
పరప్రయోగానేక మంత్ర తంత్ర యంత్ర వాయుజలాగ్ని స్తంభన విద్యాప్రదాత్రి
విశ్వబ్రాహ్మణ వంశాభివృద్ధికారిణి ! కాళి ! విమలకీర్తి ప్రదాయిని! దేవి!45

శ్లో॥ నిత్యాగ్నిహోత్రానందమూర్తే ! శ్రీకాళి ! ప్రాణశక్తే ! నిఖిలోత్పత్తికారిణి!
నిర్విరామానంద కృషిప్రదాయిని ! కాళి ! నింబవృక్ష నివాసిని ! దేవి !
మంత్రజపధ్యాన యోగానందకారిణి ! దేవి ! మౌనసిద్ధిప్రదాత్రి ! కాళి!
నిజజీవితానుభవ సుఫలప్రదే ! కాళి ! మహాదేవి ! నిర్వాణేశ్వరి! 46

శ్లో॥ సుశీల భక్తజన దేహాలంకారార్చిత ప్రియమూర్తే ! కాళి ! దేవదేవేశ్వరి !
సీమంత లలాట, కంఠ, హృదయస్థాన కుంకుమధారణ భక్తసేవితప్రియే!
కాషాయ శ్వేతారుణ నీలవస్త్రధారణ సంసేవన ప్రియమూర్తే ! వరకాళి!
జగన్మోహిని! దేవి ! జరాఽదృశ్యకారిణి! వృద్ధ జన మనోయౌవన ప్రదాత్రి!47

శ్లో॥ విభేద భావాదృశ్యకారిణి ! విశ్వవిహారమూర్తే ! విశాల హృదయేశ్వరి !
సమబుద్ధ్యభివృద్ధికారిణి ! సత్యాసత్య ప్రబోధిని ! సామవేద స్తుతి ప్రీతే !
సదాకుంకుమార్చన ప్రియతోషిణి ! దేవి ! సర్వకాలోద్భవమూర్తే ! కాళి!
జయాపజయ మర్మ ప్రబోధిని ! జయవారప్రీతే ! కాళి ! జగదీశ్వరి ! 48

శ్లో॥ శ్రీచక్ర రథారూఢమూర్తే ! మహాశక్తే ! శ్రీ విశ్వనగర సంచారిణి ! శ్రీకాళి!
పూర్వకాల విశేష సేవార్చన ఫల వర్తమాన బాల్యదశానుగ్రహమూర్తే !
తిథివార నక్షత్ర లగ్నరాశి గ్రహదోషాపహారిణి ! దేవివరకాళి !
మహోన్నతాశయాభివృద్ధిమూర్తే ! దేవదేవి! మహారాజ రాజేంద్రార్చితే ! కాళి!49

శ్లో॥ స్త్రీ పురుషభేద రహితమూర్తే ! దేవి ! స్థిరబుద్ధి సిద్ధిప్రదాత్రి ! వరకాళి !
సద్భక్త భావనానుగుణానేక రూపవర్ణధారణ సుశోభితమూర్తే ! దేవి !
సదామృతోద్భవాంబుధి సర్వనదీతీర నివాస స్నానాధిక ఫలప్రదాత్రి !
సకల పుణ్యక్షేత్ర సందర్శనానందాధిక ఫలప్రదాయిని ! శ్రీవరకాళి !50

శ్లో॥ శ్రీజగత్పాలనకేళీ విలాసిని ! పునర్జన్మనివారిణి ! ఆదిపరాశక్తే !
సర్వకులమత సద్గుణ సాధక జనప్రియే ! శ్రీకాళి ! సత్కృపామృతేశ్వరి!
నిస్స్వార్థ కార్యాచరణ దీక్షాభివృద్ధిప్రదాత్రి ! నిజకీర్తి ప్రదాయిని ! దేవి !
సర్వకాల జపానంద ప్రియే ! సదానంద ప్రదాయిని ! శ్రీమద్గురుకాళి! 51

శ్లో॥ వాచికస్తోత్ర పఠనానందమూర్తే ! ఉపాంశుమంత్ర జపానందకారిణి !
మన స్తోత్ర మంత్ర జప ధ్యాన యోగానందమూర్తే! మధురానుభూతిప్రదే!
దేహమనోదృష్ట్య దృశ్యమూర్తే ! ఆత్మదృష్టి ప్రదే ! సర్వానుగ్రహకారిణి!
సనాతన ధర్మప్రబోధిని ! కాళి ! సద్గ్రంథరచనాశక్తిప్రదాయిని ! 52

శ్లో॥ శ్రీబ్రహ్మవిద్యా మంత్రోపదేశకారిణి ! నిఃశ్వాసోచ్ఛ్వాసాదిమూర్తే ! శ్రీకాళి!
సర్వాధికారార్హతాప్రదే ! సచ్చరితాగ్రరూపిణి ! సంపూర్ణేశ్వరి ! దేవి !
ఆధ్యాత్మ విద్యోద్భవోత్పత్తిమూర్తే ! అగణితయశోవైభవప్రదే ! కాళి !
సకలవేదశాస్త్రపురాణేతిహాసపఠనశ్రవణాధిక ఫలప్రదాత్రి ! దేవి ! 53

శ్లో॥ నిత్యనిందావమాన కర్మాదృశ్యకారిణి ! నిరుపమానేశ్వరి ! శ్రీకాళి !
భయాదృశ్యకారిణి ! అభయప్రదాత్రి ! అద్భుతాత్మ స్థైర్య శక్తి ప్రదాత్రి!
తుంబురనారదాధిక నవ్యఘననాదగాన విద్యాప్రదాత్రి ! శ్రీకాళి !
సద్భక్తజన సగౌరవ సత్కార సార్వభౌమాధికార ప్రాప్తిప్రదాత్రి ! **54**

శ్లో॥ పరోపకారాగణిత దివ్యకార్యాభివృద్ధి మనోభావోత్పత్తికారిణి !
దయాప్రేమ గుణాధిక ధర్మమార్గ ధనార్జన జనార్చిత ప్రియమూర్తే !
వంశపారంపర్య స్వయంకృత సంక్రమిత సకల శుభాశుభ ప్రబోధిని !
చతురాశ్రమోత్తమోత్తమ గృహస్థాశ్రమ జీవనాదృష్ట ప్రదాత్రి! శ్రీకాళి!**55**

శ్లో॥ అగణిత జన్మార్చితశుద్ధతపో భక్తజనానుగ్రహకారిణి ! కాళి !
ఆరాధనాచారాద్భుత కాలానుగుణ నిర్ణయ వర్ణన ప్రబోధిని ! దేవి !
మూలాధారచక్ర కుండలినీ వైతాళిక యోగశక్త్యుత్పత్తిమూర్తే ! కాళి !
త్రిగుణాతీత స్థితి ప్రదాత్రి ! దేవి ! త్రిమూర్తిపాలికే ! త్రిపురాధీశ్వరి! **56**

శ్లో॥ శ్రీకాళి ! మహాద్భుతమూర్తే ! మణిరత్నమాల్య శ్రీకంఠాభరణభూషితే !
అశ్వత్థవృక్షాగ్రదర్శిని ! కాళి ! అమృతవాక్యప్రబోధిని ! ఆదిశక్తే !
అమంగళాదృశ్యకారిణి ! దేవి ! అక్షయామృతానందసుమంగళప్రదే !
ఊర్ధ్వలోక సంచారిణి ! దేవి ! శ్రీకాళి ! ఊహాతీత సుఫలప్రదాయిని! **57**

శ్లో॥ గతజన్మార్చనకారణ నివాసస్థల మహిమా ప్రబోధిని ! శ్రీకాళి !
వర్తమానార్చన కారణ జన్మస్థల మర్మప్రబోధిని ! శ్రీవరకాళి !
భావికాల జన్మస్థల భాగ్యమర్మప్రబోధిని ! కాళి ! భవ్యశక్తిప్రదే !
సుదూర ప్రాంతనివాస సుభక్తాకర్షిణి ! సుగంధర్వగానార్చితే ! కాళి! **58**

శ్లో॥ బాహ్యాభావన కార్యానేక స్వరూప స్వప్నదర్శనప్రాప్తి ప్రదాత్రి ! దేవి !
దుస్స్వప్న ధ్వంసిని! దుఃఖాపహారిణి! సుస్వప్నదృశ్య సిద్ధి ప్రదాత్రి! కాళి!
స్వప్నదర్శనకార్య స్వరూప ప్రత్యక్ష సందర్శన ప్రాప్తికారిణి ! దేవి !
స్థూలదేహానుభవాద్భుత శ్రీకార్యవీక్షణ కారణ మర్మప్రబోధిని ! **59**

శ్లో॥ శ్రీవిశ్వకల్యాణమూర్తే ! పరబ్రహ్మస్వరూపిణి ! పరాత్పరి ! ప్రాణేశ్వరి !
గగన దీపిత కోటి మార్తాండ తేజోవిరాజత్ స్వరూపిణి ! వరకాళి !
అరుణకుసుమాసనమూర్తే ! ఆదిశక్తే ! అనంతరూపావతారిణి ! దేవి !
భూమ్యాకాశాగ్రశయనమూర్తే ! శ్రీకాళి ! చతుర్దశ భువనేశ్వరి ! 60

శ్లో॥ శ్రీంకారిణి ! మహాదేవి ! సర్వమంత్రశక్త్యాదిమూర్తే ! సకల లోకేశ్వరి !
మహాగుప్తమర్మ ప్రబోధనాచార్య ప్రపాలికే ! దేవి ! మహామధురేశ్వరి !
వివిధ స్తోత్రానంద ప్రత్యక్షమూర్తే ! కాళి ! వికారస్వరూపాదృశ్యకారిణి!
పూర్వజన్మాదృష్ట విశేష విశ్వసుందర స్వరూప భాగ్యప్రదాత్రి! కాళి! 61

శ్లో॥ శ్రీజగన్మాతః ! మహాకవిమండలపూజితే ! జీవన్ముక్తిప్రదే ! శ్రీకాళి !
జాజ్జ్వల్య స్వరూపిణి ! మహాభయవినాశిని ! దేవి ! మహాకావ్యప్రదాత్రి!
అపవాద ధ్వంసిని ! అక్షయామృత కీర్తిప్రదాత్రి ! దీనజనోద్ధారిణి !
వేదవినుతే ! శ్రీకాళి ! విశ్వవిజయప్రదాత్రి ! శ్రీవిమలస్వరూపిణి !62

శ్లో॥ సుయుక్తి భక్తజనోద్యోగోత్పత్తిమూర్తే ! దేవి ! సుశాంతిప్రదాయిని ! కాళి!
సుపరిపాలనాశక్తిప్రదాత్రి ! దేవి ! సురగుణ భావోత్పత్తికారిణి !
సమయానుకూలోపయోగ సద్వాక్యోద్భవమూల కారణాది మూర్తే ! దేవి!
న్యాయగణిత వైద్యశాస్త్రానేకాధిక విద్యాప్రదే ! విజ్ఞానేశ్వరి ! కాళి! 63

శ్లో॥ అంబుధికూపతటాక జలాంతర్భాగ ప్రమాదాదృశ్యకారిణి ! శ్రీకాళి !
భూనభోంతరాళ సంచార సద్భక్త జనసంరక్షిణి ! దేవి ! మహామూర్తే !
వివిధ వృత్తి ధర్మ నిర్వహణాభివృద్ధి శక్తిప్రదే ! వినయ ప్రదాత్రి !
జ్ఞానబోధనాచార్య వయోవృద్ధ జనగౌరవబుద్ధి ప్రదాయిని ! కాళి !64

శ్లో॥ అనేకాద్భుత విద్యామితశాంత్యర్హజన వినయప్రదాయిని ! శ్రీకాళి !
సాధకోత్తమోత్తమ సదానంద జీవనభక్తజన సందర్శన ప్రాప్తిప్రదే !
పుణ్యస్థల తీర్థక్షేత్రాక్షయ సందర్శనాదృష్ట జనపూజ్య మనోభావప్రదే !
ప్రాతఃకాల జాగరాదృష్ట ప్రాప్తి ప్రదాత్రి ! ప్రారబ్ధ ధ్వంసన శక్తి ప్రదాయిని!65

శ్లో॥ గతవర్తమాన కర్మాహార కారణారోగ్యానారోగ్యమర్మ ప్రబోధిని !
దేహకురూపశారీరక వ్యాధిబాధాదృశ్యకారిణి! బాహ్యతేజఃప్రదే ! కాళి!
నిత్యనిర్మలానందప్రదే ! దేవి ! మానసికోల్లాసప్రదాయిని ! శ్రీకాళి!
సుసంపూర్ణ సుగుణ సుబుద్ధి ప్రదానకారిణి ! సర్వదానేశ్వరి ! కాళి ! 66

శ్లో॥ ఆందోళనాశాంతిక్రోధ నిరాశానిస్పృహాఽదృశ్యకారిణి ! అనంతమూర్తే!
అఖిల భక్తజనాదర్శ స్త్రీ పురుషార్థ సుయశోవైభవప్రదే ! మహాదేవి !
ఉన్నతాధికారయోగ్యతోద్భవమూర్తే ! సమున్నత శక్తిప్రదాత్రి ! కాళి !
భక్తిజ్ఞాన వైరాగ్య ప్రదాత్రి ! బహువిధ మంత్రసిద్ధి ప్రదాన కారణేశ్వరి!67

శ్లో॥ శ్రీవిమలమూర్తే ! కరుణానుగ్రహరూపిణి ! కలియుగేశ్వరి! శ్రీకాళి !
అజ్ఞానాంధత్వాదృశ్యకారిణి! విమలాద్భుతానంద విజ్ఞానోత్పత్తిమూర్తే!
మాం పాలితమూర్తే ! మహాదృష్టప్రదాయిని! దేవి ! శ్రీమద్గురు వరకాళి!
సన్మునియోగి ఋషి సద్గురుమండలపాలికే ! శ్రీకాళి! సర్వాధీశ్వరి ! 68

శ్లో॥ సుశ్రద్ధాభక్తి భావోత్పత్తిమూర్తే ! బహువిధభాషాభివృద్ధిశ్రీకారిణి !
సుమంత్రగృహనివాసిని! శ్రీకాళి ! సన్మంత్ర యంత్రావరణ సంచారిణి !
సుజన సిద్ధగణగళ సుసంస్కృత భాషాక్షరోద్భవమూర్తే ! శ్రీకాళి !
సుదినకాల సంసేవితే ! శ్రీమహాదేవి ! సుగుణవందనసంతోషిణి ! 69

శ్లో॥ నాస్తికత్వాదృశ్యమూర్తే ! వరకాళి ! ఆస్తికత్వామితభావప్రదాయిని !
విశ్వవిమోహనశక్తిప్రదాత్రి ! విమలవిద్యాభివృద్ధికారిణి ! దేవి !
ప్రపంచోత్పత్త్యభివృద్ధి మూలపరిశోధనా పటుత్వ శక్తిప్రదే ! కాళి !
ప్రజ్ఞాపాండిత్య సభాకర్షణ వశీకరణ ప్రాప్తిప్రదాయిని ! శ్రీకాళి ! 70

శ్లో॥ భావికాలోపయోగ కార్యాభివృద్ధి సుజన మనః ప్రవేశమూర్తే ! కాళి !
నిత్యనిష్ఠారాధన సంతుష్టే ! మహాదేవి ! శిష్టాలయ స్థలనివాసిని !
సర్వసుఖాసనాభీష్టమూర్తే ! సుసంపూర్ణ వరానుగ్రహరూపిణి ! దేవి !
ఖేచరీ ధ్యానయోగ చిన్ముద్రాభీష్ట ముద్రానందమూర్తే ! సర్వముద్రేశ్వరి! 71

శ్లో॥ శ్రీగురుకాళి ! సత్త్వసహన సహాయ సద్గుణ బుద్ధ్యభివృద్ధికారిణి !
పరపీడన ప్రయోగ రజోగుణ దుర్భావ ధ్వంసిని ! మహాదేవి ! కాళి !
స్వపరక్షేమ రజోగుణ మనోబుద్ధ్యభివృద్ధిమూర్తే ! శ్రీసుగుణేశ్వరి !
క్రోధాహంకారాజ్ఞాన జనన కారణ తమోగుణాపహారిణి! శ్రీకాళి! 72

శ్లో॥ గతజన్మవర్తమాన సేవార్చనాభీష్ట సుఫల ప్రదాత్రి ! వరకాళి !
ఘనభక్తజనదేహ ప్రవిష్టమూర్తే ! దేవి ! దివ్యవాక్యోద్భవకారిణి !
నానావిధ ప్రాణి గణోపయోగ కార్యాభివృద్ధి శక్తి ప్రదాయిని ! దేవి !
విశ్వక్షేమ శాంత్యుపకార జనాభివృద్ధి కారణకార్య ప్రబోధిని ! కాళి! 73

శ్లో॥ ఏకసంథాగ్రహణ ధారణాద్భుతశక్తి ప్రదే ! నవ్యసృజన శక్తి ప్రదాత్రి!
అత్యధిక కాలామృతోపన్యాసాద్భుతశక్తిప్రదాత్రి ! అమృతమూర్తే! శ్రీకాళి!
ఆస్తిక భక్తజనోద్ధారణాక్షయాలోచన సుభావోత్పత్తి ప్రదానకారిణి !
ఫలాపేక్షా రహితసుబుద్ధి ప్రదాత్రి! కాళి! స్వార్థత్యాగ స్వభావ ప్రదాయిని!74

శ్లో॥ పరిపూర్ణ జ్ఞానానుభవ పండిత శ్రేష్ఠ జనజిహ్వాగ్రవాసిని ! కాళి !
అమితపాండిత్యానుభవ శక్తిప్రదాత్రి ! కాళి ! ఆత్మజ్ఞానోద్భవమూర్తే !
అమరసంపదధ్యాత్మ విద్యాధికమర్మప్రబోధనాశక్తిప్రదే ! కాళి !
మంత్రాక్షర దేవి ! స్వరూపానేకాద్భుత వర్ణబోధక శక్తిప్రదాయిని ! 75

శ్లో॥ సకల వేదశాస్త్ర పఠనానుభవ శక్త్యధిక సుయుక్తిప్రదే ! కాళి !
అఖిలలోకాది ధర్మాచార్య శ్రీగురుదక్షిణామూర్తి సంసేవితప్రియే !
దశచరణ దశపాణిమూర్తే! దశముఖ స్వరూపిణి! దక్షిణ కాళీశ్వరి !
వివాద సమయకాలానుకూలాను గ్రహమూర్తే ! శ్రీకాళి! భువనేశ్వరి! 76

శ్లో॥ శ్రీవరకాళి ! మాతాపితృగురు దైవభక్తి శ్రీ యశోభాగ్యప్రదాయిని !
సదాలోచన దృఢసహనశక్తిప్రదే ! కాళి ! సదా సాహిత్యప్రదాత్రి !
నిత్యనిగ్రహ సాధనోత్పత్తి సత్యసంపూర్ణ శ్రీసత్ఫలితప్రదే ! కాళి !
బ్రహ్మజ్ఞానానంద సుప్రేమ దయాక్షమా కరుణాద్భుత గుణప్రదాయిని! 77

శ్లో॥ పూర్వజన్మాభీష్ట వర్తమానకృషి పుణ్యకార్యాచరణ స్వశక్తిప్రదే !
నిత్యభక్తి నియమనిష్ఠాచార దివ్య దేవ్యుపాసనాదృష్ట ప్రాప్తి ప్రదే !
ఉత్తమోపాధ్యాయ బిరుద విరాజమాన తేజశ్శక్తి సుయుక్తి ప్రదాత్రి !
జంబూవృక్షాగ్ర సంవాసిని ! శ్రీకాళి ! జంబూఫల నివేదనానందేశ్వరి! 78

శ్లో॥ అంతర్ముఖ సంచార స్థిరబుద్ధిప్రదాత్రి ! మనోనిగ్రహశక్తిదాయిని !
సద్భక్తానుగ్రహకారిణి ! దేవి ! సత్యమూర్తే ! సంపూర్ణ కీర్తి ప్రదాయిని !
నవ్యలోక సృష్ట్యాదిమూర్తే ! దేవి ! భవ్యదర్శన ప్రాప్తిప్రదాయిని ! కాళి!
మణిద్వీప పురనివాస యోగ్యతాప్రాప్తికారిణి ! కాళి ! భువనేశ్వరి! 79

శ్లో॥ పారిజాత కుసుమార్చనానందమూర్తే ! పరమపావన లోకేశ్వరి !
నిర్భాగ్య నిరాధారశక్తి భక్తజనప్రియే ! మనోధైర్యశక్తి ప్రదాత్రి !
విమల భృత్య జనాదరణ సంపోషణ సుజన సంరక్షిణి ! శ్రీకాళి !
సోదర సోదరీ జనగౌరవాధారసుజన నిత్యాశీర్వాదాభివృద్ధికారిణి !80

శ్లో॥ జీవితకాలావసర ప్రబోధిని ! జీవనావసర ధనప్రదాయిని !
ఉత్తేజోత్సాహప్రదాయిని ! ఉత్తమాదిమూర్తే ! ఊహోత్తమాభీష్ట ప్రదాత్రి!
దివ్యామరధన సముపార్జన మార్గోపదేశమూర్తే ! దీనజనప్రపాలికే !
సర్వకాల సర్వావస్థానేక పుణ్యకార్యాచరణ సుబుద్ధిప్రదాయిని ! 81

శ్లో॥ భూప్రకంపనవహ్నివృష్టి ప్రాణాంతకవృత్త వాయుస్తంభనకారిణి ! కాళి!
చిత్రాతిచిత్ర వ్యాధ్యుద్భవ ప్రకృతి మర్మ ప్రబోధనాది సువైద్యమూర్తే !
భూగర్భాంతరోద్భవ జలాగ్ని విషవాయు ప్రళయాదృశ్యమూర్తే ! శ్రీకాళి!
వర్తమానకాల మరణాసన్న భావిజన్మాయుర్వర ప్రదాయిని ! కాళి ! 82

శ్లో॥ శీఘ్రవరప్రదాత్రి ! దేవి ! సద్బుద్ధిప్రదే ! శ్రీకాళి ! సన్మార్గోపకారిణి !
నిత్యశుభప్రదే ! నిజభోగప్రదాత్రి ! కాళి ! మహాసామ్రాజ్యప్రదాయిని!
శ్రీమూర్తే ! జనని ! జగన్మోహనకారిణి ! కాళి ! జగద్రక్షాస్వరూపిణి !
వాణీరమాసేవితమూర్తే ! శ్రీదుర్గా రాజరాజేశ్వర్యర్చితే! వరకాళి ! 83

శ్లో॥ శ్రీకల్యాణమూర్తే ! అనావృష్టి దుర్భిక్షాతివృష్ట్యదృశ్యకారిణి! శ్రీకాళి !
మహాప్రళయనివారిణి ! సకాల జలవృష్టి ప్రదాత్రి ! విశ్వసంరక్షిణి !
సకల లోకాంతరాత్మ సంచారప్రాప్తికారిణి ! మనోభావమర్మ ప్రబోధిని!
సకల సురసంభాషణశక్తిప్రదాత్రి ! దివ్యగణమైత్రిభాగ్యప్రదాయిని !84

శ్లో॥ శ్రీకాళి ! ఆదిపరాశక్తే ! వేజెండ్లపురవాసిని ! చిద్విలాసిని ! దేవి !
జగజ్జనానందప్రదే ! ఆదిశక్తే ! జనన మరణ మర్మప్రబోధిని !
దివ్యమంగళ స్వరూపిణి ! దేవి ! శ్రీ శోభితే ! హే మహాప్రకాశిని !
నరఘోషధ్వంసిని ! సర్వరక్షిణి ! వరకాళి ! నానాశుభప్రదాయిని! 85

శ్లో॥ సూర్యోదయాస్తమయాది! చంద్రోదయాస్తమయ భాస్కరోదయ దేహసంరక్షిణి!
పరదూషణాపకారా సత్యవాక్య శ్రవణాఘదోషాపహారిణి ! కాళి !
సర్వకులమత సమాన సద్బుద్ధి సుభావోత్పత్తిమూర్తే ! సత్యవాక్యప్రియే !
సకల ప్రాణిహితారోగ్యోపయోగ వృక్షజంతు సంపోషణ శక్తిప్రదాత్రి! 86

శ్లో॥ అనవసర విషయాసక్త మనోబుద్ధ్య దృశ్యకారిణి ! శ్రీగురుకాళి !
కాలచక్రానుగుణావసరకార్యాచరణోత్పత్త్యమితజ్ఞానప్రదాయిని !
తత్త్వవిభు బ్రహ్మజ్ఞాని ముఖోద్భవ దివ్యవాక్య శ్రవణభాగ్యప్రదాత్రి !
ఆత్మోపాసనాద్భుత విద్యా మర్మప్రబోధిని! భక్తజనాత్మానందోద్భవకారిణి!87

శ్లో॥ శ్రీవిశ్వపూజ్యే ! దేవి ! శ్రీవరకాళి ! ఆదిపరాశక్తే ! శ్రీభువనేశ్వరి !
అనంతకోటి జన్మకృతపాపదోషాపహారిణి ! అద్వైతామృతమూర్తే !
సులగ్నకాలసునక్షత్రోద్భవకారిణి ! దేవి ! సుందరరూపప్రదాయిని !
శ్రేష్ఠవిద్యోద్యోగాది ప్రదాత్రి ! వ్యాపారాధికార జీవనశక్తి ప్రదాయిని ! 88

శ్లో॥ శిశుజన్మ నామకరణాన్నప్రాశన కాలక్రతు దోషనివారిణి ! శ్రీవరకాళి !
భవకేశ ఖండనోపనయన విద్యాభ్యాస కార్యాచరణానేక దోషాపహారిణి!
వివాహ ముహూర్త నిర్ణయకాల పాణిగ్రహణ క్రతుదోషోచ్చాటనమూర్తే! కాళి!
బాల్యకౌమార యౌవన వార్ధక్యాచరణ కార్యదోషాదృశ్యకారిణి! శ్రీమహాదేవి! 89

శ్లో॥ సుపుత్రగోత్రప్రదాత్రి ! దేవ దేవి ! సుమనోభావప్రదాయిని ! శ్రీవరకాళి!
బాల్యకౌమార యౌవన దేహాభివృద్ధి పతనకారణానేక మర్మప్రబోధిని !
దివ్య దేవాలయ నివాసానుక్షణారాధనాలోచనా సుబుద్ధి ప్రదాత్రి! కాళి!
సత్యలోక వైకుంఠ కైలాస గోలోక సర్వదా సందర్శనానందప్రదాయిని! 90

శ్లో॥ విశిష్టాలోచనాశక్తిప్రదాత్రి ! విమలమూర్తే ! దేవి ! శ్రీవిశ్వజనని !
శ్రేష్టమార్గదర్శకత్వప్రదాయిని ! సుబుద్ధిసంచారప్రధానకారిణి !
శాంతస్వభావవర్తనకారిణి ! శ్రీకాళి ! ధీసహనశక్తిప్రదే ! దేవి !
సదానుకూల సత్‌సతీసిద్ధిప్రదాత్రి ! సహృదయ సుపతి ప్రదాత్రి ! 91

శ్లో॥ శ్రీమద్గురుకాళి ! సర్వసిద్ధిప్రదే ! అతినిద్రాఽదృశ్యకారిణి ! శ్రీశక్తే !
వాక్‌శ్రవణ దృష్టి పాపదోషనివారిణి ! శ్రీ గురుమహాదేవి ! కాళి !
సదానుగ్రహమూర్తే ! శ్రీవరకాళి ! మితాహార తృప్తిప్రదాయిని ! దేవి !
సజ్జనోపకార బుద్ధిప్రదే ! మహాదేవి ! మితభాషా మౌనప్రదాయిని ! 92

శ్లో॥ విధాతృలిఖిత సంక్రమిత స్త్రీ వైధవ్యాశుభాదృశ్యకారిణి ! శ్రీకాళి !
దీర్ఘసుమంగళీ జీవనాదృష్టప్రదాత్రి ! దివ్యభావనోద్భవకారిణి!
పరస్పరాపవాదాశాంత్యదృశ్యకారిణి ! దాంపత్యాన్యోన్యతాదృష్టప్రదే!
మహామహోపకారకారిణి ! మహీమహిమోత్తమ జన్మప్రదాత్రి ! కాళి ! 93

శ్లో॥ సంచితవర్తమానకిల్బిష దుష్కర్మదోషాపహారిణి ! శ్రీవరకాళి !
వంధ్యత్వ నివారిణి ! దేవి ! వరదానప్రదాన కారణమూర్తే ! శ్రీకాళి !
వరప్రభావభవ కారణజన నివాసగృహస్థల ప్రవేశసంచారిణి !
ఉత్తమ భక్తాశయాభివృద్ధి మార్గోపదేశమూర్తే ! మాతృసుస్వరూపిణి! 94

శ్లో॥ గర్భోత్పత్త్యాతంక సకల దోషాదృశ్య మూలకారణాదిమూర్తే ! శ్రీకాళి !
గర్భస్థ పిండోత్పత్త్యాది మూర్తే ! కాళి ! గర్భాంతర శిశుసంవృద్ధికారిణి!
ప్రసూతి శుభకాలాసన్న పర్యంత హృదయార్చిత సుభక్తానుగ్రహమూర్తే!
సుఖ ప్రసూతి ప్రదాత్రి! మాతృశిశుక్షేమారోగ్యదాయిని! మహామాతృమూర్తే! 95

శ్లో॥ నూతన స్వస్థల స్వగృహానేక వస్తువాహన ప్రదాయిని ! వరకాళి !
సదాస్ఫూర్తి భావోత్పత్తి ప్రదానకారిణి ! సవ్యసాచిత్వప్రదాత్రి ! కాళి !

నవయుగ పాలనమూర్తే ! దేవి ! నరేంద్ర పదవీ ప్రదాయిని ! శ్రీకాళి !
సుకార్యాభివృద్ధి భావసిద్ధిప్రదే ! సుజనాభీష్ట పునర్జన్మ ప్రసాదిని ! **96**

శ్లో॥ మాతాపితృ పుత్రపౌత్ర బంధుమమకారహారిణి ! శ్రీదివ్యమూర్తే ! కాళి !
వాత్సల్యాభివృద్ధిప్రదాయిని ! దేవి ! పరిపూర్ణానుగ్రహమూర్తే ! శ్రీకాళి !
వర్తమానాద్భుత వరప్రదాయిని! కాళి ! భవకారణకార్య ప్రబోధిని !
సమయస్ఫూర్తిసుసంభాషణ శక్తిప్రదాత్రి! దేవి ! స్వర్గలోక ప్రదాయిని! **97**

శ్లో॥ శ్రీపురేశ్వరి ! దేవి ! భక్తశిరోగ్రభాగామృతవర్షిణి ! శ్రీవరకాళి !
మాతాపితృ సుపోషణ కర్తవ్యోద్భవ కారణమూర్తే ! శ్రీమద్వరకాళి !
దారాసుత సంపోషణ క్రియాప్రబోధిని ! దానధర్మబుద్ధిప్రదాయిని !
నరజన్మ సార్థక కారణ నానామార్గోపదేశకారిణి ! గురుకాళి ! **98**

శ్లో॥ శ్రీమద్భక్త కల్పవల్లి ! వరకాళి ! అవ్యయానందకరుణాంబుధిమూర్తే !
మందబుద్ధేరదృశ్యకారిణి ! దివ్యమూర్తే ! దేవి ! సదా శుభకరి ! కాళి!
నిత్యనూతన చైతన్యశక్తి ప్రదాత్రి ! దేవి ! నిర్మలహృదయప్రదాత్రి !
నిగర్వసుమనోబుద్ధిప్రదే ! నిగమాధిక మర్మప్రబోధిని ! శ్రీకాళి ! **99**

శ్లో॥ సకల భూతకోటి సంభాషణ వీక్షణ శ్రవణశక్తిప్రదాత్రి ! కాళి !
మహాసంకటనివారిణి ! దేవి ! మనోనిగ్రహసిద్ధిప్రదే ! వరకాళి !
విశ్వవీక్షణశక్తిప్రదాత్రి ! మహాదేవి ! విమలహృదయప్రదాయిని ! కాళి!
అనంత ప్రజ్ఞాశక్తికారిణి ! కాళి! అఖండ శ్రీయశోదీప్తిప్రదాయిని !**100**

శ్లో॥ వహ్నియాగాంతర్భాగ ప్రత్యక్షమూర్తే ! వాగమృతప్రదాత్రి ! దేవదేవి !
పితృదేవతాత్మస్వరూప దర్శనభాగ్యప్రదాయిని ! దేవి ! వరకాళి !
అనంతజ్ఞానప్రదే ! శ్రీకాళి ! ఆత్మస్వరూపసందర్శన ప్రాప్తికారిణి !
విశ్వసృష్ట్యాదిమర్మప్రబోధిని ! శ్రీకాళి ! వీర్యశౌర్యశక్తిప్రదాయిని ! **101**

శ్లో॥ కలియుగార్చితే ! మహాదేవి ! వేదపూర్వకాలోద్భవమూర్తే ! వరకాళి !
వాత్సల్యామృతమూర్తే ! కాళి ! శూలధారిణి ! వరాక్షయప్రదాయిని ! దేవి!
ఆయుఃప్రమాణకాల సంభవానేక సర్వకాలసర్పదోషాపహారిణి !
ప్రవృత్తి బంధన విమోచన మార్గోపదేశకారిణి ! ప్రాణాయామేశ్వరి ! **102**

శ్లో॥ నిత్యనిష్కామస్థితిప్రదాత్రి ! మహాదేవి ! నిస్సంకల్పస్థితిప్రదాయిని !
చిత్రలీలాప్రదర్శిత శ్రీమూర్తే ! చిద్రూపిణి ! నిశ్చింతాస్థితిప్రదాయిని !
సకల సత్కర్మానుష్ఠానఫలప్రదాత్రి ! సర్వదానఫలప్రదే ! దేవి !
విధివిధాన క్రమమర్మబోధిని ! శ్రీకాళి ! విచిత్రవిద్యాప్రదాయిని ! **103**

శ్లో॥ సంప్రజ్ఞాత స్థితిమూలబుద్ధే రదృశ్యకారిణి ! దేవి ! సర్వసిద్ధేశ్వరి !
అసంప్రజ్ఞాత సమాధిస్థితిప్రదాత్రి ! కాళి ! సర్వాసనసిద్ధిప్రదాత్రి !
తపోదీక్షాభివృద్ధి సిద్ధిప్రదే ! వరకాళి ! తురీయానందవిధాయిని !
సత్యకాల చక్రాంతర జీవనానంద ప్రదాత్రి ! దేవి ! వరకాళీశ్వరి ! **104**

శ్లో॥ సుధర్మానురక్తే ! సన్మార్గప్రబోధిని ! కాళి ! సురనరవర సంసేవితే !
మహామహిమాన్వితమూర్తే ! దేవి ! మహాప్రతాపశక్తిప్రదే ! మహాకాళి!
ధర్మమార్గానుసరణ సుభక్తపోషిణి ! సంరక్షకే ! దేవి ! దక్షిణకాళి !
సర్వాహంకారధ్వంసిని ! శీఘ్రవిజయప్రదాత్రి ! శ్రీమద్భద్రకాళీశ్వరి! **105**

శ్లో॥ పరాంబికే ! మహాదేవి ! శ్రీవరకాళికే ! సదాకాలచక్రప్రపాలికే !
శ్రీచక్రపీఠ స్థిరనివాసిని ! శ్రీకాళి ! వేజెండ్లపుర వరపాలికే !
అక్షరమధనామృతదాయిని ! ఆదిశక్తే ! అమరలోకనివాసిని !
మనోనేత్ర దృష్టి ప్రదాయిని! మాతృమూర్తే ! మహాకాలమర్మప్రబోధిని! **106**

శ్లో॥ మహామృత్యువినాశిని ! మాతృకాచైతన్య ప్రదీపికే ! మధురాంబుధివాసిని!
కవితాసామ్రాజ్య ప్రపాలికే ! కైవల్యపురపాలికే ! కరుణామృతవాసిని!
మునియోగి ఋషిగణ శక్తిప్రదాత్రి! కాళి ! అవధూతార్య గురుప్రపాలికే!
నిత్యనిర్వాణ యుక్తి ప్రదాత్రి ! దేవి ! శ్రీమద్గురువరకాళి ! నిత్యప్రకాశికే! **107**

శ్లో॥ విమలార్య హృదయవాసిని ! వినయ విజ్ఞానప్రదాయికే ! విశ్వపాలికే !
అగణితాద్భుత లీలామహిమ ప్రదర్శితమూర్తే ! ఆనందస్వరూపిణి !
వేజెండ్లపుర వరకాళికే ! శ్రీ వేంకట కాళీకృష్ణ గురుపాలికే ! దేవి !
నమస్తే నమస్తే నమస్తే శ్రీవరప్రదాత్రి ! శ్రీవరకాళి ! నమో నమః **108**

# 40. శ్రీ వేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తి కాళీ అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక ఫలశ్రుతి శ్లోకాలు

శ్లో॥ నవ దినార్చనేనైవ దశసహస్ర కాశీ కైలాసగిరి యాత్రాధిక ఫలప్రదే !
గయాక్షేత్ర సందర్శన గంగాదిక నదీతీర్థ స్నానాధిక ఫలప్రదాయిని! కాళి!
దశ దినార్చనేనైవ శతసహస్ర శ్రీశైలక్షేత్ర యాత్రాధిక పుణ్యఫలప్రదే!
ద్విశత సహస్ర హరిద్వార హృషీకేశామరనాథాదిక యాత్రాధిక ఫలప్రదే!1

శ్లో॥ భవిష్యత్త్రిజన్మాచరణానేక పుణ్యకార్యాధిక ఫల మద్యైవ ప్రదాత్రి ! శ్రీకాళి!
ద్వాదశ జ్యోతిర్లింగ చతుర్వింశతి కోటి యాత్రాధిక పుణ్యఫలప్రదాయిని! దేవి!
ఏకమాసార్చనేనైవ అష్టాదశజన్మ కృతాష్టోత్తరశత భూప్రదక్షిణాధిక ఫలప్రదే!
విశ్వాంతరానేక దేవతావృక్ష పూజా గిరి ప్రదక్షిణాధిక పుణ్యఫల ప్రదాత్రి!2

శ్లో॥ చతుఃపంచాశద్వర్ష త్రిమూర్త్యర్చన ఫలం సప్తవింశతిదినార్చనేనైవ ప్రదాత్రి!
త్రింశత్కోటి దీపస్థాపనకృతాలంకరణోత్సవ సందర్శనాధిక ఫలప్రదాత్రి!
దివ్యమాస పుణ్యదినాచరితానేక వ్రత పుణ్యాధిక ఫలప్రదాయిని! శ్రీకాళి!
కోటి గో పోషణ సంరక్షణ ప్రదక్షిణ సేవాధిక పుణ్యఫల ప్రదాత్రి! శ్రీకాళి!3

శ్లో॥ ఏకవింశతివర్ష లక్ష్మీనారాయణ నిత్యకల్యాణోత్సవార్చనాధిక ఫలప్రదాత్రి!
సుదర్శనాదిక మహాద్భుతానేక హోమ నిర్వహణాధికఫల ప్రదాయిని! కాళి!
నయనానందోత్సవ కారణ నారాయణ శివ మహోత్సవ సేవాధిక ఫలప్రదే!
షష్టివర్ష వివిధ దేవతార్చనాగ్నిహోత్ర నిర్వహణాధిక ఫలప్రదాత్రి! కాళి!4

శ్లో॥ షట్త్రింశద్వర్ష కార్తికేందువాసరానేక లింగాభిషేకార్చనాధిక ఫల ప్రదాత్రి!
చతుర్వింశతివర్ష పార్వతీశ్వర నిత్యకల్యాణోత్సవార్చనాధిక ఫల ప్రదాత్రి!
ద్విచత్వారింశద్వర్ష మాసమహాశివరాత్ర్యాచరిత రుద్రహోమాధిక ఫలప్రదే!
సప్తవింశతివర్ష షణ్ముఖ లంబోదరాయ్యప్ప దీక్షారాధన యాత్రాధిక ఫలదాత్రి!5

శ్లో॥ నైమిశారణ్యాద్యనేక వనాంతర జపపూజాధ్యాన హోమాధిక ఫలప్రదాయిని!
సురసంచార శైలాగ్ర కందరాంతరానేక యోగాచరణాధిక ఫలప్రదే! కాళి!
జలాంతరాగ్ర గగన స్థలానేక తప స్సాధనాచరణాదిక ఫలప్రదే! దేవి!
భూగర్భాంతరాగ్ర వహ్న్యాంతరాచరితానేకాద్భుత యోగక్రియాధిక ఫలప్రదే!6

శ్లో॥ అష్టాదశవర్షావధూతాది గురు చరిత్ర నిత్య పారాయణాధిక ఫలప్రదాత్రి!
ద్వాదశవర్ష మహాముని యోగిఋషి నిత్యదర్శనసేవాధిక ఫలప్రదాయిని!
చతుర్దశవర్షాచరితానేక ప్రాణాయామాధికాద్భుత శక్తి ప్రదాత్రి! వరకాళి!
ఏకదినార్చనేనైవ షోడశవర్షాచరితానేక తపో యోగాధిక ఫలప్రదే! కాళి!7

శ్లో॥ ద్వాత్రింశద్వర్ష వల్మీకాంతరాగ్ర తపోయోగాచరణాధిక ఫలప్రదాయిని! కాళి!
సురప్రసన్నాది మూలకారణామాపూర్ణిమాచరణాధిక పుణ్య ఫలప్రదే! దేవి!
సూర్యచంద్ర గ్రహణ పుణ్యకాలాచరితానేక తపోదానాధిక ఫలప్రదాయిని!
సర్వయుగోద్భవావతార పురుష దివ్యనామ సంకీర్తనార్చనాధిక ఫలప్రదాత్రి!8

శ్లో॥ అష్టవింశతివర్ష ఆమ్రవృక్ష ప్రచ్ఛాయా శాఖాగ్రధ్యానయోగాధిక ఫలప్రదాత్రి!
త్రింశద్వర్ష తాల నారికేళ వటపత్రాసనాత్త యోగాధిక ఫలప్రదే! శ్రీకాళి!
ద్వి ఘటికా ధ్యానేనైవ ఏకాదశ వర్షాదిత్యోపాసనాధిక ఫలప్రదాత్రి! కాళి!
ఏకదర్శనేనైవ దశవర్ష యోగ కరణానేక రూప సందర్శనాధిక ఫలప్రదే!9

శ్లో॥ అర్ధదినార్చనే నైవ నవ వర్ష సోమమంత్రో పాసన ధ్యానాధిక ఫలప్రదాత్రి!
ఏకదీప స్థాపనేనైవ అష్టోత్తర శతదిన అఖండ దీపస్థాపనాధిక ఫలప్రదే!
త్రయస్త్రింశత్ కోటిదేవతాప్రత్యక్షదర్శనఫలం త్వద్రూపదర్శన మాత్రేణ ప్రదే!
అక్షయానందానుభవకారణాధ్యాత్మిక గృహనివాస భాగ్యప్రదాయిని! శ్రీకాళి!10

శ్లో॥ చతుర్దినార్చనేనైవ నిత్య నిరాహార చాతుర్మాస్య దీక్షాధిక ఫలప్రదే! కాళి!
సప్త దినార్చనేనైవ షడ్వర్ష సమస్త దేవతా స్తోత్ర పఠనాధిక ఫలప్రదే!
పవిత్రోత్తమ స్త్రీపురుషదివ్య సిద్ధాత్మసమాధి సందర్శనాధిక ఫలప్రదాత్రి!
ధరణీ పాపపుణ్యఫలసుఖదుఃఖానుభవకారణ పునర్భవ నిర్మూలన కారిణి!11

శ్లో॥ అత్యద్భుతాసన పాణిపల్లవానేక ముద్రాచరణాధిక ఫలారోగ్యానంద ప్రదే!
నిత్యదుఃఖ కారణానేక కర్మరహిత పరమోత్కృష్టాద్భుత మహాస్థితి ప్రదాత్రి!
ఆజన్మాంతానాయాసావిఘ్నకృతాక్షయ యోగాధిక ఫలం దర్శనే నైవ ప్రదాయిని!
పంచయామార్చనే నైవ సకలధ్యానాతీతాద్భుత స్థితి ముముక్షుత్వ మహాసిద్ధిప్రదే!12

శ్లో॥ పంచదశ వర్షానుష్ఠిత శ్వాసాగ్రధ్యాస దృష్ట్యధిక ఫల నిర్వికల్ప స్థితిప్రదే!
ఏకయామార్చనేన దశవర్ష చిన్ముద్రాసన ధ్యాన షట్చక్ర భేదనాధిక ఫలప్రదే!
బహువిధాక్షయానుభూతిప్రదానకారణాత్మ సాక్షాత్కారాధిక సుసిద్ధి ప్రదాత్రి!
ఆత్మదర్శనోన్నతాద్భుత స్థితి పత్నీసమేత త్రిమూర్తి ప్రత్యక్షదర్శన ప్రాప్తిప్రదే!13

శ్లో॥ షట్ దినార్చనే నైవ షష్టివర్ష విష్ణు శివ సహస్రనామపారాయణఫలప్రదే!
పంచదినార్చనే నైవ వింశతివర్షభగవత్ప్రీతి గానాలాపనాధిక ఫలదాత్రి!
త్రిదినార్చనే నైవ షట్ షష్టికోటిహనుమాన్ చాలీసాధ్యయనాధిక ఫలప్రదే!
ద్విపక్షార్చనే నైవ సప్తసహస్ర జ్ఞానయజ్ఞ కృతాధికాఖండ విజ్ఞాన ప్రదాత్రి!14

శ్లో॥ సాధకోత్తమజనాభీష్ట సిద్ధికారణ ధ్యానయోగకాలాక్షయ శక్తిప్రదాత్రి! శ్రీకాళి!
అల్పబుధ్యనాలోచన హింసానేకదుర్ వాంఛా నిర్మూలనాధ్యాత్మిక జ్ఞానాయుధ ప్రదే!
సర్వభూతహితాక్షయవాత్సల్యాభివృద్ధి కారణానేక దివ్యాలోచన ప్రదే ! కాళి!
ఆచంద్రార్కాధ్యాత్మిక మార్గాంతరాద్భుత ప్రత్యక్షానేకాక్షయనూతనానుభవప్రదే!15

శ్లో॥ మహితశ్రేష్ఠ మూలమంత్రాభిషేకానేక యంత్రార్చన ఫలాధికాభీష్టసిద్ధి ప్రదాత్రి!
నిత్యసత్యభాషణ ప్రబోధదీక్షాచరణ పుణ్యజనానుగ్రహరూపిణి! శ్రీకాళి!
దివ్యధర్మాచరణ సంరక్షణోత్తమ పూజ్య జనసంభాషణానుభవాధిక యుక్తిప్రదే!
దైవ సమాన శిశుజనమైత్రి క్రీడాసంభాషణానంద మహాభాగ్యప్రదాత్రి! కాళి!16

శ్లో॥ నిత్యచిత్త భావోద్వేగ నియంత్రణౌషధ సమాన దివ్యమంత్ర ప్రబోధిని! శ్రీకాళి!
దురాచారాచరణ దుర్జన సాంగత్యాభిలాషాసుర దుర్బుద్ధి నిర్మూలనకారిణి!
బహువిధ పతనకారణబాహ్య సౌందర్యాతీతాంతఃకరణశుద్ధ్యానందప్రదాత్రి!
పూర్వసప్తజన్మాచరిత సంపూర్ణ కార్యదృశ్య సందర్శనామిత భాగ్యప్రదే! కాళి! 17

శ్లో॥ భూతవర్తమాన కాలఋషివరాచార్యాచరితానేక దృశ్యదర్శన ప్రాప్తిపదే !
పూర్వకాల దేవతాచరిత లోకకల్యాణ బృహత్కార్య దర్శన ప్రబోధశక్తి ప్రదే!
బాహ్యాడంబరరానేకవేషభూషణాతీతాంతరాత్మానంద కారణాధ్యాత్మ విద్యాప్రదే!
పంచవింశతివర్ష లౌకిక విద్యాభ్యాసాధిక పరిపూర్ణాధ్యాత్మిక శక్తి ప్రదాత్రి ! 18

శ్లో॥ ద్విదినార్చనేనైవ కోటిలింగ క్షేత్రాష్టవర్ష ధ్యానాచరణాధిక శక్తి ప్రదాత్రి !
షణ్మాసార్చనేనైవ త్రిశత సహస్ర తిరుమల క్షేత్రయాత్రాధిక ఫలప్రదాత్రి !
నవగ్రహాష్టదిక్పాలజప పూజాగ్ని హోత్ర నిర్వహణాధిక ఫలప్రదాయిని! వరకాళి!
చతుర్యుగ సంప్రాప్తానేక జన్మజన్మాంతరాక్షయ పుణ్యాభివృద్ధికారిణి! శ్రీకాళి!19

శ్లో॥ వేదోపనిషన్మహాపురాణాదిక సద్గ్రంథ పఠన ప్రవచనాధిక ఫలప్రదే !
రామాయణ మహాకావ్యపఠన సందేశ ప్రబోధనాధిక పుణ్యఫలప్రదాయిని!
భారత భాగవత గీతా శ్రవణ పఠనాచరణాదిక పుణ్యఫలదాత్రి ! కాళి !
మహాదివ్యాద్భుత దశసహస్రావధానక్రతు శక్తియుక్తి ప్రదాయిని ! శ్రీకాళి! 20

శ్లో॥ దివ్యలింగాగ్రోపరి మహాద్భుతాసన యోగకరణామృతాకర్షణరూపిణి ! కాళి !
శివలింగాద్యంతపరిపూర్ణావగతాక్షయసాక్ష్యాద్వైతామృతాదిశక్తే ! వరకాళి!
బ్రహ్మజ్ఞానోద్భవాక్షయోత్పత్తి కారణామృతాక్షర స్తోత్రపారాయణశక్తి ప్రదాత్రి!
త్వదీయ హృదయాలయ ప్రవేశార్హతాజన్మాంతర సుస్థిర నివాస భాగ్యప్రదే! 21

శ్లో॥ సహస్రకోటి వాణీశాలయ నిర్మాణ ప్రతిష్ఠారాధనాధిక సుఫలప్రదే ! కాళి!
లక్షకోటి లక్ష్మీశాలయ నిర్మాణప్రతిష్ఠారాధనాధిక సుఫలప్రదాత్రి ! కాళి!
కోటికోటి పార్వతీశాలయ నిర్మాణప్రతిష్ఠాభిషేకార్చనాధిక సుఫలప్రదే !
సకల దేవతాలయ నిర్మాణ విగ్రహప్రతిష్ఠార్చనాధిక సుఫలప్రదాయిని! 22

శ్లో॥ నవశతకూపతటాక విద్యా వైద్యాలయ నిర్మాణఫలాదిక సుఫలప్రదాత్రి ! కాళి !
అష్టయామార్చనేనైవ గోకోటి విద్యాభూ వస్త్రదానాదిక పుణ్యఫలప్రదే !
ద్వాదశదినార్చనేనైవ నవవర్ష రత్నస్వర్ణ నిత్యాన్న దానాదిక సుఫలప్రదే!
ఏకపక్ష త్రికరణశుద్ధ్యర్చనమాత్ర సకలదానాదిక మహాఫలప్రదాత్రి ! 23

శ్లో॥ సహస్ర లక్ష కోటి సాలగ్రామ ప్రతిష్ఠాభిషేకార్చనాధిక సుఫలప్రదాయిని!
కృతత్రేతా ద్వాపరకలి చతుర్యుగార్చితాదిమూర్తే ! వరకాళి! సర్వయుగేశ్వరి!
కలియుగాంతపునః సత్యయుగ సంస్థాపనాదిమూర్తే ! శ్రీఆదిశక్తే ! అమృతేశ్వరి!
అనుగృహీత వేజెండ్ల వేంకట కాళీకృష్ణ పూజితే దేవి ! శ్రీమద్గురు వరకాళి! 24

శ్లో॥ అమృతాక్షర ఫలశ్రుతి చతుర్వింశతి మహాదివ్యశ్లోకరచనాశక్తిప్రదాత్రి !
అష్టాశీతిషట్ శత ద్విసహస్రాక్షర ఫలశ్రుతి రచనాద్భుతశక్తి ప్రదాత్రి !
ఏకపంచ శతదశ సహస్రాక్షర అష్టోత్తరశత శ్లోక రచనాశక్తి యుక్తి ప్రదే !
వేజెండ్ల వేంకట కాళీకృష్ణేన మయాస్పష్టామృతరచనా సృష్టికారిణి! శ్రీకాళి!

# 41. శ్రీవేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తికాళీ అమృతాక్షరాద్భుతానంద స్తోత్రరత్నమాలిక

(తాత్పర్యములతో)

శ్లో॥ ఓంకారాదిమూర్తే ! కాళి ! మౌనాద్భుతయోగప్రదాయిని !
హ్రీం జగద్బీజే ! దేవి ! మహాశక్త్యాది స్వరూపిణి ! కాళి !
శ్రీం సకల సౌభాగ్యప్రదాత్రి ! శీతలేశ్వరి ! దేవి !
క్రీం కాళి ! సర్వాకర్షిణి ! మహాకాలచక్ర ప్రపాలిని ! 1

పై శ్లోకంలోని మొదటి మంత్రాక్షరం 'ఓం'కారము

తా॥ 'ఓం'కారానికి ఆదిమూర్తి, ఆది స్వరూపం శ్రీవరకాళీమాత. ఆ తల్లి తన భక్తులకు మౌనంగా ఆచరించే యోగవిద్యలను ప్రసాదిస్తుంది. మౌనంగా ఉండటం ఎంతో కష్టమైన ప్రక్రియ. ఎవరితోనూ మాట్లాడక, మనసులోనికి ఏ ఇతర ఐహిక భావాలను చొరనీయక, ఏకోన్ముఖులై, స్థిరచిత్తంతో, ఉండటమే మౌనయోగంగా చెప్పుకోవచ్చు. ఆ విద్యలన్నీ శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. మంత్రాలన్నింటిలో ప్రథమాక్షరం, అనగా మొదటి అక్షరం 'ఓం'కార బీజాక్షరం. ఈ బీజాక్షరం సుగుణ సముదాయం. ఏ బీజాక్షరాన్నయితే సాధకులు జపిస్తారో, ఆ బీజాక్షరానికి ఉన్న శక్తులన్నీ ఆ సాధకులకు లభిస్తాయి. తద్వారా ఆ సాధకులు తమ తమ మనోరథాలను సిద్ధింపచేసుకుంటారు. 'ఓం'కారం వేదాలంతటా వ్యాపించి ఉన్నది. ఇంకా చెప్పాలంటే మోక్షాన్ని కోరి సాధన చేసే ముముక్షువులు 'ఓం'కారాన్ని మించిన, మహిమ కలిగిన బీజాక్షరం మరొకటి లేదని విశ్వసిస్తారు. ఈ 'ఓం'కార నామస్మరణ సకల శుభాలనూ కలుగచేస్తుందనే భావన కలిగి ఉండటంవల్లనే సర్వ మంత్రాలకూ, సకల కార్యాలకు, సర్వవిద్యలకు 'ఓం'కారమే ఆదియైనదని అంటారు. ఈ 'ఓం'కారమే సాధకులకు మౌనయోగాన్ని ప్రసాదిస్తుంది. స్థిరంగా కూర్చొని అంతర నేత్రంతో 'ఓం'కారాన్ని దర్శించుకుంటూ మననం చేసుకోవటమే సాధన. దీనివలన వేగంగా మౌనాన్ని ఒక యోగంగా సాధించటం ఎంతో అద్భుతమైన క్రియ. ఈ సృష్టికి పూర్వం, అనగా ఆదికాలంలో, అఖిలబ్రహ్మాండములో ఒకే ఒక్క అపూర్వనాదం ప్రతిధ్వనిస్తూ ఉండేదనీ, అదే మహత్తరమైన 'ఓం'కార నాదమనీ

మహర్షులు అంటారు. అందువలన సృష్టిలో శబ్దరూపంలో ఉన్న శక్తినే శ్రీ ఆదిపరాశక్తిగా, 'ఓం'కార స్వరూపంగా వారు గ్రహించారు. ఇదియే శ్రీ ఆదిపరాశక్తి రూపంగా, ఆ తల్లి శరీరంలోని తేజస్సునుండి పుట్టిన అక్షర స్వరూపమైన 'ఓం'కారము. అందువల్లనే ప్రాచీన కాలం నుంచీ ఋషులందరూ ఈ 'ఓం'కారాన్నే సర్వమంత్రాలకూ మూలమైనదిగాను, మూలకారణంగాను, భావించి స్వీకరించారు.

'ఓం'కారము యొక్క స్మరణ, కీర్తన, శ్రవణ, జపాదులవలన, మానవులు ముక్తిని, పరబ్రహ్మను పొందుతారని అంటారు. మానవదేహం వీడిన తరువాత, ముక్తి అనేది ఏ రూపంలో ఉంటుందో ఎవరికీ తెలియకపోయినా, జీవించినంత కాలం, ఏ బాధలు, భయాలూ లేక, ప్రశాంతంగా, హాయిగా, అన్ని ఐహిక బంధాల నుంచీ విముక్తులై, తామరాకుపై నీటిబొట్టు నిలిచిన చందంగా, అన్ని బంధాల మధ్యా నివశించినా, ఏ బంధానికీ బద్ధులు కాకుండా స్వేచ్ఛను పొంది జీవిస్తారు. అందువలన నిత్యమూ 'ఓం'కార స్మరణ పారాయణులై యుండటం వలన, మానవుల జీవితానికి ధన్యత చేకూరుతుందని తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని రెండవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'హ్రీం'కారము**

ఈ బీజాక్షరం అద్భుతమైన మరియు మహిమాన్వితమైన మూడు అక్షరాల 'సం'యోగము (కలయిక). ఈ 'హ్రీం'కార మంత్రాక్షరం, సాధకులకు అపారమైన శక్తినిచ్చే మంత్రరాజం. ఈ మంత్రంలో దాగి ఉన్న మూడు అక్షరాలనూ పరిశీలిస్తే, 'హ్రీం'కారం మాయాప్రకృతి శ్రీ ఆదిపరాశక్తి బీజము. 'హ'కారం స్థూలదేహానికి, 'ర'కారం సూక్ష్మదేహానికి, 'ఈ'కారం కారణదేహానికీ ప్రతీకలుగా బిందువుతో కలసి ఉన్న బీజత్రయ సమిష్టిరూపం. ఈ 'హ్రీం'కార బీజాన్ని దేవి తనువుగా భావించి, గ్రహించి, ధ్యానించడంవలన సాధకులు, ఆ తల్లి శ్రీవరకాళీమాత సాయుజ్యాన్ని నిస్సందేహంగా పొందుతారు అని అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని మూడవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'శ్రీం'కారము**

ఈ 'శ్రీం'కారం మహిమాన్వితమైనది. 'శ్రీం' బీజాక్షరాన్ని నిష్ఠతో జపించిన వారిని, శ్రీవరకాళీమాత కరుణించి, దరిద్రులకు కూడా సర్వసంపదలనూ విరివిగా ప్రసాదిస్తుంది. సమస్త సంపదలకూ ఆదీశ్వరి అయిన శ్రీవరకాళీమాత, 'శ్రీం'కార బీజరూపంలో, సంపదలు కలిగిన శ్రీమంతులకు ఎల్లప్పుడూ గతియై ఉంటుంది. అంతేకాక ధనరూపంలోని సంపదలతో పాటు, విజ్ఞానధనాన్ని కూడా మిక్కిలిగా

ప్రసాదిస్తూ, ఆశాపాశాలలో బందీలు కాకుండా, నిగ్రహశక్తిని కలిగిస్తూ, వ్రత, పూజాకాలాలలో ఎదురయ్యే క్లేశాలను అనగా ఆటంకాలను, ఇబ్బందులను, అనేక కష్టాలను తొలగిస్తూ, ధర్మబుద్ధితో, ధర్మకార్యాలను ఆచరింపచేసే సద్బుద్ధిని ప్రసాదించే చల్లని తల్లి శ్రీవరకాళీమాతయే. అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని నాలుగవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'క్రీం'కారము**

ఈ బీజాక్షర మహిమవలన, సమస్త విశ్వంచేత ఆకర్షించబడే శ్రీవరకాళీమాత 'క్రీం'కార బీజాక్షర మంత్రమూర్తియై, మహాకాలచక్ర స్వరూపంగా నిలుస్తుంది. 'క్రీం'కార బీజాక్షరానికి అధిదేవత శ్రీవరకాళీ మాతయే. కాలచక్రాన్ని తన భక్తులకు అనుకూలంగా త్రిప్పగలిగే తల్లి శ్రీవరకాళీమాత. ప్రకృతి అనే మహామాయ తెరలను తొలగించి, దుఃఖాలను పోగొడుతూ, అనగా బ్రహ్మశక్తి ప్రాణశక్తియై సృష్టి స్థితి లయకారిణిగా, సచ్చిదానందమూర్తివలె, ఆత్మజ్యోతి స్వరూపంతో అక్షయమైన ఆనందాన్ని ప్రసాదిస్తూ, అంతటికీ ఆధారమైనది శ్రీ ఆదిపరాశక్తి వరకాళీమాత. ఈ 'క్రీం'కార బీజాక్షర మంత్రం, సాధకులకు కాలచక్ర మర్మాలను తెలియచేస్తుంది. అలాగే వారికి గొప్ప కవితాశక్తిని ప్రసాదించి, వారిని కాలజ్ఞాన కవులుగా, కవిసార్వభౌములుగా చేస్తుంది, శ్రీవరకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, 'క్రీం'కార బీజాక్షరాన్ని, ఏకాక్షర మంత్రంగా, తమ భక్తులచేత ఎల్లప్పుడూ జపింప చేస్తుంటారు. నాకు తెలిసిన దాదాపు 17, 18 సంవత్సరముల నుంచి, ప్రతి సంవత్సరం విజయదశమి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని, తొమ్మిదిరోజులపాటు, ప్రతినిత్యం భక్తులు దీక్షాబద్ధులై, మూడుపూటలా ఉదయం, మధ్యాహ్నం, మరియు సాయంత్రం, శ్రీవరకాళీమాతకు కుంకుమ పూజలను 'క్రీం'కార మంత్ర యుక్తంగా, ఎర్రటి వస్త్రధారులై సాగిస్తూ, అదే విధంగా హోమాలలో శ్రీవరకాళీమాతకు అత్యంత ప్రీతిపాత్రమైన గారెలు, పాయసం మొదలైన నైవేద్యాలను హవన ద్రవ్యాలుగా సమర్పిస్తూ, చేసే కార్యక్రమాలలో 'క్రీం'కార నాదం భక్తుల నోటివెంట ప్రతిధ్వనిస్తుంటే దేవాలయ ప్రాంగణమంతా భక్తిభావంతో వెల్లివిరుస్తుంది. ఇప్పటివరకూ కోటానుకోట్ల సార్లు 'క్రీం'కార మంత్ర జపం, వేజెండ్ల శ్రీవరకాళీమాత ఆలయ ప్రాంగణంలో జరగటం వలన, ఈ ఆలయ ప్రవేశం జరిగిన క్షణాలలోనే నిజమైన భక్తుల కోరికలు తీరతాయని వారి అనుభవాలు తెలియచేస్తున్నాయి.

శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు 'క్రీం'కార బీజాక్షరాన్ని ఉపాసన చేసి కాలచక్రంలోని మర్మాలను తెలుసుకోగల శక్తి సామర్థ్యాలను పొందినట్లు, వారు తమ భక్తులకు తెలియచేసే అనుభవాలను బట్టి తెలుస్తున్నది. వారు అవసరమని భావిస్తే, తమ యోగవిద్యద్వారా కాలచక్రగతులను పరిశీలిస్తూ, భక్తుల వివిధ జన్మలకు సంబంధించి, భక్తుల యొక్క జీవిత విశేషాలను, స్థితిగతులను పరిశీలిస్తూ, వివిధ జన్మలకు సంబంధించి, భక్తులయొక్క జీవిత విశేషాలను, స్థితిగతులను, దృశ్యరూపంలో దర్శించగలిగిన మహామహిమాన్వితశక్తి సంపన్నులు శ్రీగురుదేవులు. వారు ఉన్నత విద్యలను అభ్యసించకపోయినా, శ్రీకాళీమాత కృపవలన మహోన్నత కవితాశక్తిని సాధించారు. వారి కవితలలోని భావావేశాలను విశ్లేషించాలంటే, ఒక్కోసారి వారే వివరించవలసి వస్తుంది. ఎందుకంటే వారు వ్రాసే పద్యాలలో గాని, శ్లోకాలలో గాని భావం అంతలోతుగా విస్తరించి ఉంటుంది. వారి కవితా పటుత్వానికి 'క్రీం'కార బీజాక్షర మంత్ర మహిమే కారణంగా తెలుస్తున్నది. కనుక ఈ 'క్రీం'కార మంత్రము, సాధకులకు కాలచక్రమర్మాలను తెలియచేస్తూ, వారికి గొప్ప కవితాశక్తిని ప్రసాదించి, వారిని కాలజ్ఞాన కవులుగా, కవి సార్వభౌములుగా చేస్తుంది శ్రీకాళీమాత. అందుకు శ్రీగురుదేవులే మనకు ఉదాహరణ ప్రస్తుతానికి వారే మనకు సాక్షులు.

**శ్లో॥ క్రాందేవి ! సదా కాల చక్రానుకూల్య ప్రాప్తిప్రదే ! కాళి !**
**క్రోం కోమల స్వరూపిణి ! కోటి కోటి శుభప్రదాయిని !**
**శ్రాం శాంతాకార మూర్తే ! శ్రీకాళి ! సదా సుశాంతి ప్రదాత్రి !**
**సౌంకార సౌందర్యాది మూర్తే ! వాగీశ్వరేశ్వరి ! శ్రీకాళి ! 2**

**పై శ్లోకంలోని మొదటి పంక్తిలోని మంత్రాక్షరం 'క్రాం'కారము**

'క్రాం' ఈ మంత్రాక్షర దేవత శ్రీకాళీమాత. కాలచక్రానికి ప్రతీకగా నిలిచే 'క్రాం' బీజాక్షరం కాలుణ్ణి, కాలాన్ని కూడా శాసిస్తుంది. కాలాన్ని తన అదుపులో పెట్టుకుంటుంది. కాలగతిని మార్చగలిగిన మంత్రాక్షరం ఈ 'క్రాం' మంత్రాక్షరం గ్రహస్థితులు అనుకూలంగా లేక, అనేక బాధలు పడుతున్నవారు, అనగా మనసుకు శాంతి లేక తిరిగేవారు 'క్రాం' కార మంత్రజపం వలన బాధలన్నీ తొలగి సంతోషంగా ఉంటారు. సాధకులు ముహూర్త కాలాలను గమనించకుండా చేసే శుభకార్యాలు,

వ్రతాలు, పూజలు, ప్రయాణాలు ఈ 'క్రాం' కార మంత్రశక్తి వలన దుర్ముహూర్తాలైనా, శుభముహూర్తాలై మంచి ఫలితాలు ఇస్తాయి. ఈ మంత్రసాధన వలన శుభఫలితాలు పొందగలరు. ఎంత కాలం గడచినా ఏ పనులు కానివారు ఉద్యోగాలు రానివారు, వివాహాలు కానివారు, 'క్రాం' కార మంత్ర మహిమల వలన అనుకూల ఫలితాలు పొందగలుగుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే, ఈ మంత్ర సాధకులకు కాలం అనుకూలించకపోవటం అనేది ఉండదు. ఈ 'క్రాం'కార మంత్రజపం వలన అన్ని సమయాలలో కాలచక్రాన్ని, సాధకులకు అనుకూలంగా ఉండేటట్లు చేస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని రెండవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'క్రోం'కారము**

ఈ మంత్రాక్షర దేవత శ్రీకాళీమాత. ఈ మంత్రాక్షరం ఎంతో కోమలమైన, సుకుమారమైన ఆకర్షణశక్తితో సుగుణాలు కలిగినది. ఈ మంత్రసాధన వలన సాధకులు, తమలోని కోప కారణాలను తెలుసుకొని తొలగించుకుంటారు. వారి స్వరూప స్వభావాలలో మృదుత్వము, కోమలత్వము మొదలైన శాంతి కాముక లక్షణాలు జనిస్తాయి. దీన్నే ప్రాణశక్తి బీజమని కూడా అంటారు. అందువలన బాహ్యమైన శత్రువులు, సాధకుల దగ్గరకు రాలేరు. అలాగే అంతర్గత శత్రువులైన అరిషడ్వర్గాలు, అనగా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అణగిపోతాయి. ఇతరులపై ఉండే అసూయ, ద్వేషాలు నశించి, ఎలాంటి వారినైనా దయార్ద్ర హృదయంతో ఆదరించగలిగే స్థిరమైన మనస్సును పొందుతారు. ప్రపంచంలో మానవునికి ఏకైక శత్రువయిన కోపాన్ని 'క్రోం'కార మంత్రసాధన ద్వారా తొలగింపచేసి అనేకానేక శుభాలను అప్పటికప్పుడే ప్రసాదించే అతిసుందర సుకుమారమైన ఆనందమూర్తి శ్రీకాళీమాత. భక్తులు ఎలాంటి సంకల్పంతో చేస్తే అలాంటివే జరుగుతాయని అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని మూడవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'శ్రాం'కారము**

ఈ మంత్ర బీజాక్షర దేవత శ్రీకాళీమాత. ఇది శాంతి బీజాక్షరము. ఈ మంత్రాక్షర జపంవలన శాంతి సుఖాలు లభిస్తాయి. ఏ పని ప్రారంభించినా సరిగా చేయలేక, ఎలా చేయాలో తెలియక అశాంతి, అసహనంతో నిండి ఉన్నవారు,

'శ్రాం' బీజాక్షర జపంవలన వారు తలపెట్టిన కార్యక్రమం పై శ్రద్ధ కలిగి, అందులో ఆచరణీయమైన అంశాలను వివరంగా తెలుసుకుంటూ, ప్రశాంతంగా ఆ పనిని పూర్తి చేయగల్గుతారు. ప్రతిపనికీ చిరాకుపడుతూ, ఇతరులను ఇబ్బంది పెట్టే వారు, ఈ 'శ్రాం'కార మంత్రజపం వలన ప్రశాంతతను పొంది, ఇతరుల మన్ననలను పొందగల్గుతారు. శ్రీకాళీమాత ఎంతో ప్రశాంతంగా ఉంటుంది కనుక, ఈ 'శ్రాం'కార మంత్ర జపం, సాధకులకు చిత్తశాంతిని, మనసుకు ప్రశాంతతను ప్రసాదిస్తూ, అన్ని వేళలలోనూ మంచి ప్రశాంతతను ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని నాలుగవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'సౌం'కారము**

ఈ మంత్రాక్షర అధిదేవత శ్రీకాళీమాత. ఈ మంత్రాక్షర జపంవలన సాధకులు సౌమ్యగుణాలతో కూడిన సౌందర్యాన్ని, సౌభాగ్యాలను పొందుతారు. అందానికి ఆదిమూర్తి అయిన శ్రీకాళీమాతకు సాటి మరెవ్వరూ లేరనే చెప్పవచ్చు. ఈ మంత్రాక్షరాన్ని జపించటం వలన, సాధకుల యొక్క కురూపితనం లేదా అందవిహీనత పోయి, భక్తులు చక్కని సౌందర్యవంతులుగా తయారవుతారు. వారి మనసుల్లోని వికృతమైన ఆలోచనలు తొలగిపోయి, సక్రమమైన మార్గంలో ఆలోచించగలుగుతారు. సకల సౌభాగ్యాలకూ నిలయమైన ఈ 'సౌం'కార మంత్రాక్షర జపం, స్త్రీలకు నిండు సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. కలకాలం భార్యాభర్తలు, అన్యోన్యంగా జీవించటానికి అవసరమైన 'అన్యోన్యతలు' అనే భాగ్యాలను ఇస్తుంది. ఈ మంత్రసాధకులకు అన్ని భాగ్యాలనూ ప్రసాదిస్తూ, వారిచేత ఎల్లప్పుడూ సత్యమైన వాక్కులనే పలికించే వరాల తల్లి, సచ్చిదానంద స్వరూపిణి శ్రీకాళీమాత. ఆమె స్వరూపాన్ని ఎన్నోమార్లు దర్శించిన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. శ్రీకాళీమాతను, అతిసుందరమూర్తిగా పదేపదే మనకు, అనేకచోట్ల తెలియచేస్తున్నారు, శ్రీగురుదేవులు, వేసవికాలం మండుటెండలో చల్లదనాన్ని శీతాకాలంలో వెచ్చదనాన్ని పొందుతూ ఎంతో ప్రశాంతతతో ఆనందంగా వుండటం మనం చూస్తూనే వున్నాం, అది అమ్మ శ్రీకాళీమాత అందించే సంతోష సౌభాగ్యం, అందుకున్నవారే అదృష్టవంతులు వారే శ్రీగురుదేవులు.

శ్లో॥ హ్రాం మహాదోషాపహారిణి ! సుసంపూర్ణారోగ్యప్రదాత్రి !
హ్రూం మహామంత్రాదిదేవి ! సర్వశత్రు సంహారకారిణి !
హ్రౌం కారమూర్తే ! మహామృత్యుంజయ శక్తి ప్రదాత్రి ! కాళి !
స్త్రీం బ్రహ్మ విష్ణు శివారాధ్యే ! శ్రీ బ్రహ్మానందప్రదాయిని ! 3

**పై శ్లోకంలోని మొదటి మంత్రాక్షరం – 'హ్రాం'కారము**

ఈ 'హ్రాం'కార మంత్రక్షరానికి అధిదేవత శ్రీకాళీమాత. ఈ మంత్రాక్షర జపాన్ని ఆచరించిన వారికి సకల సంపూర్ణారోగ్యాలు ప్రాప్తిస్తాయి. పూర్వ జన్మలలో, పూర్వ కాలాలలో ఏవైనా పాపదోషాలు ఉండి, అవి ప్రతి పనికి అడ్డంకిగా వస్తున్నప్పుడు, వాటివలన ఆరోగ్యం క్షీణించినపుడు, 'హ్రాం'కార మంత్రాక్షర జపం వలన, సకల పాపకర్మల దోషాలు నశించి, శుభం చేకూరి, మంచి ఆరోగ్యం లభిస్తుంది. అలాగే మంచి ఆరోగ్యం పొందటానికి, మరియు ఉన్న ఆరోగ్యం కాపాడుకోవటానికి, ఈ 'హ్రాం' మంత్రాక్షరాన్ని జపిస్తూ సాధకులు మంచి ఆరోగ్యం పొందినట్లు తెలుస్తున్నది. 'హ్రాం' అనే మంత్రాక్షరాన్ని జపించినపుడు లేదా ఉచ్ఛరించినపుడు, మానవ దేహంలోని 'నాభి' స్థానం వేగంగా కదలి వత్తిడికి గురై శరీర అంతర్భాగాన్ని నొక్కుతుంది. తత్ఫలితంగా శరీర భాగాల కదలిక స్థాయి పెరిగి లోపల ఉన్న నాడులకు మంచి సాధన లభించి, అది యోగంగా మారి, దేహానికి శుభకరమైన ఆరోగ్యాన్నిస్తుంది. ఇదే ఆధునిక సమాజపు యోగా ఆరోగ్య రహస్యం. అందువల్లనే ఈ 'హ్రాం'కార మంత్రాక్షరం, అనారోగ్యాన్ని పోగొడుతూ మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించే ఓషధీ మంత్రం. ఇవన్నీ తన భక్తులకు ప్రసాదించేది శ్రీకాళీమాతయే అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని రెండవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'హ్రూం'కారము**

ఈ 'హ్రూం'కార మంత్ర జపం సాధకులకున్న శత్రుభావాలను పోగొడుతుంది. శత్రువులు ఎంతటి బలవంతులైనా ఈ మంత్రాక్షర సాధకుల జోలికి రాకుండా వెనుదిరిగి దూరంగా వెళ్ళిపోతారు. శత్రువులను కూడా, మిత్రులుగా ఆదరించే క్షమ, ఓర్పు సాధకులకు లభిస్తుంది. ఒకసారి శత్రువు అనే భావం మనసునుంచి వైదొలగినపుడు, లోకమంతా మిత్రభావంగా కన్పిస్తుంది. ఇది సాధకుల పురోభివృద్ధికి అండగా నిలుస్తుంది. దురుద్దేశంతో వచ్చి, ఇబ్బంది పెట్టాలనుకునే వారు కూడా

ఈ 'హ్రూం'కార మంత్రాక్షర మహిమ వలన సాధకులకు పాదాభివందనం చేసి వెళ్లిపోతారు. అంతటి మహాగొప్ప మహిమాన్వితమైన శక్తి కలిగిన ఈ 'హ్రూం'కార మంత్రాక్షరం సాధకులకు అంతర్గత శత్రువులైన అరిషడ్వర్గాలను, బాహ్య శత్రువులను సమూలంగా అణచివేసే సర్వశక్తి స్వరూపిణి శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని మూడవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'హ్రౌం'కారము**

ఈ 'హ్రౌం'కార మంత్రాక్షరానికి శ్రీకాళీమాత అధిదేవత. సాధకులకు ఈ 'హ్రౌం'కార మంత్రజపం, అకాల మృత్యువును తొలగించి దీర్ఘాయువును ప్రసాదిస్తుంది. ప్రయాణాలలో జరిగే ప్రమాదాల వలన గాని, ఆకస్మిక అనారోగ్యాల వలన ఏర్పడే దుస్సంఘటనల మూలంగా గాని ఏర్పడే ప్రాణాపాయ పరిస్థితులను నివారించి, అకాల మృత్యువు రాకుండా కాపాడుతుంది. భయంకరమైన దీర్ఘవ్యాధుల బారినపడి, మృత్యువుకు చేరువవుతున్న వారు కూడా ఈ 'హ్రౌం'కార మంత్ర, జపం నిష్ఠగా ఆచరించడంవలన, మృత్యు భయం తొలగిపోయి, ఆరోగ్యం కుదుటపడి దీర్ఘాయుష్కులౌతారు. ఆపద సమయాలలో, విపత్కర పరిస్థితులలో అనేక విధాలుగా శత్రువులను జయిస్తూ, మృత్యువును కూడా జయించే శక్తిని ప్రసాదిస్తూ, సాధకులకు ఎల్లప్పుడూ విజయాలను ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**పై శ్లోకంలోని నాలుగవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'స్త్రీం'కారము**

ఈ 'స్త్రీం'కార మంత్రాక్షరానికి అధిదేవతాశక్తి శ్రీకాళీమాత. ఈ 'స్త్రీం'కార మంత్రాక్షర సాధకులు, త్రిగుణాలకూ అతీతమైన స్థితిని నిర్వికల్పాన్ని పొందుతారు. ఈ మంత్రక్షారాన్ని పరిశీలిస్తే, ఇది మూడు అక్షరాల శక్తి కలయికగా గోచరిస్తుంది. త్రిగుణాలకూ ప్రతీకగా 'స్త్రీం' మంత్రాక్షరాన్ని భావించవచ్చు. స–కారం సత్వగుణం, ర–కారం రజోగుణం, త–కారం తమోగుణంగా, ఈ మూడు గుణాల కలయికే 'స్త్రీం' మంత్రాక్షరం అని తెలుస్తున్నది. స్వాభావికంగా ప్రసన్నపూరితమైన సత్వ, రజస్తమోగుణాలు, ఈ స్త్రీం'కార మంత్రాక్షర సాధన వలన, సాధకుని అదుపులో ఉంటాయి. కనుక వారు ఎల్లవేళలా 'తమో' గుణాన్ని దూరం చేసుకుంటారు. అందువల్లనే దేవి ప్రతిరూపం ఈ 'స్త్రీం' కార మంత్రమైనది. ఈ 'స్త్రీం'కార మంత్రాన్ని పునశ్చరణ చేస్తూ, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ దేవిని ఆరాధించారు. త్రిమూర్తులు ఎల్లవేళలా శ్రీ ఆదిపరాశక్తిని ఆరాధిస్తూ ఉంటారు.

**శ్లో॥ క్షం భద్రకాళి ! మహాభయాతిశోకదుఃఖాదృశ్యమూర్తే !**
**జం జన్మరాహిత్య మార్గోపదేశమూర్తే ! జగదంబికే !**
**క్లీం కార వాసిని ! సర్వాభీష్టప్రదే ! సదా సంరక్షణి !**
**సుమంత్ర జప స్తోత్రోచ్చారక భక్తజన ప్రపాలిని ! 4**

**పై శ్లోకంలోని మొదటి మంత్రాక్షరం 'క్షం'కారము**

'క్షం'కార మంత్రం సాధకులకున్న అన్ని భయాలనూ తొలగిస్తూ, అతి దుఃఖాలను, వాటివలన వచ్చే శోకాలనూ పోగొడుతుంది. సాధకులకు రాజ్యమును, అనేక ధన సంపదలను ఇచ్చి ధర్మార్థ కామ మోక్షాలను ఇస్తుంది. సాధారణంగా మానవులకుండే అన్ని రకాల భయాలు, అనగా ఎక్కడికి వెళ్లాలన్నా, ఏమి చెయ్యాలన్నా, ఎవరితోనైనా మాట్లాడాలన్నా, ఏ పని ప్రారంభించాలన్నా, ఇలా ప్రతిదానికి ముందుగానే భయం. అలాగే తనను ఏదోశక్తి పట్టి పీడుస్తున్నదనే భావంతో భయం. కలల్లో భయం, నిజ జీవితంలో భయం, విద్యార్థులకు పరీక్షలు బాగా వ్రాయగలమో లేమోననే భయం, అవివాహితులైన వారికి మంచి భర్త లేదా భార్య లభిస్తారో లేదోననే భయం, న్యాయస్థానాల్లో తమకు సరైన న్యాయం లభిస్తుందో లేదోననే భయం – ఇలా అన్ని విధాలుగా ఉండే భయాలనూ వాటినుంచి జనించే బాధలనూ, దుఃఖాలనూ పోగొడుతూ, భక్తులకు ధైర్యాన్ని ప్రసాదిస్తూ, భద్రమైన క్షేమాన్ని కల్గిస్తుంది 'క్షం'కార మంత్రాక్షరం. ఈ మంత్రాక్షరానికి అధిదేవత. శ్రీ భద్రకాళీమాత అంటారు శ్రీగురుదేవులు. భద్రం అంటే మంగళకరమైన శుభాలను ప్రసాదించే తల్లి శ్రీ భద్రకాళీమాత. నిరంతరము భక్తులకు క్షేమాన్ని కలిగిస్తూ వారిని సంరక్షిస్తుంది అంటారు శ్రీ గురుదేవులు.

**పై శ్లోకంలోని రెండవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'జం'కారము**

ఈ 'జం'కార మంత్రాక్షరానికి అధిదేవత శ్రీకాళీమాత. ఈ 'జం'కార మంత్రాక్షరం, సాధకులకు మరలా జన్మ రావటానికి కారణమైన వాటిని తెలియ చేస్తుంది శ్రీకాళీమాత. మితిమీరిన కోరికలు, వ్యామోహాలు, దైవచింతన లేకపోవటం మొదలైన వాటివలన, అవి ప్రస్తుత జన్మలో తీరకపోవటం వలన, వాటిని తీర్చుకోవటానికి మరలా జన్మ ఎత్తవలసి వస్తుందన్నది, పురాణాలు, ఉపనిషత్తులు మొదలైన ప్రామాణిక గ్రంథాల ద్వారా తెలుస్తున్నది. మరల, మరల ఎందుకు

జన్మించవలసి వస్తుందో, వాటికి కారణాలైన అంశాలు ఏమిటో ఎవ్వరూ తెలుసుకోలేరు. కాని ఈ 'జం'కారాక్షర మంత్ర జపం వలన, జన్మలు మరల మరల రావడానికి మూలమైన కారణాలు తెలుసుకోగల శక్తి లభిస్తుంది. తద్వారా వాటిని తొలగించుకొనే ఉపాయాన్ని తెలియచేస్తూ, మరలా జన్మ రాకుండా, అనగా మళ్లీ పుట్టుక లేకుండా ఉండే మార్గాన్ని చూపించే మాతృమూర్తి వంటిది ఈ 'జం'కార మంత్రాక్షరం. ఈ జగత్తుకే తల్లి శ్రీకాళీమాత. ఆమెయే అన్నీ తెలియచేస్తుంది. అంటారు శ్రీగురుదేవులు.

### పై శ్లోకంలోని మూడవ పంక్తిలోని మొదటి మంత్రాక్షరం 'క్లీం'కారము

ఈ 'క్లీం'కార మంత్రాక్షరానికి అధిదేవత శ్రీకాళీమాత. ఈ మహామంత్రాక్షరంలో 'దేవి' నివశిస్తుంది. 'క్లీం'కార బీజాక్షరం సకల అభీష్టాలనూ నెరవేర్చే అద్భుత రాజబీజాక్షరం. సాధకులను అన్ని వేళలా, అన్ని కాలాలలో రక్షిస్తూ, రక్షణ కవచం లాగా ఉపకరిస్తుంది. ఎక్కడికి వెళ్లినా, ఏ పరిస్థితులలో ఉన్నా, అనుకోని ఉపద్రవాల నుంచి కాపాడుతుంది. ఏమీలేని వారికి, తానే అన్నీ సమకూర్చి, సర్వవిధాలా రక్షిస్తుంది. అలాగే అన్నీ ఉండి మనశ్శాంతి కోల్పోయిన వారికి ఈ 'క్లీం' బీజాక్షరం ప్రశాంతిని, మనశ్శాంతిని ప్రసాదించి, హాయిని గొల్పుతుంది. అన్ని కాలాలలో ఆర్తులను రక్షించే బీజాక్షరం, ఈ 'క్లీం'కార బీజాక్షరము. తల్లిదండ్రులు లేనివారిని రక్షిస్తుంది. మంచి కోరికలతో ఈ 'క్లీం' బీజాక్షరాన్ని సాధన చేస్తే, శ్రీకాళీమాత త్వరితంగా కరుణించి వారి అభీష్టాలను తీరుస్తుంది. నిజమైన సాధకులకు అన్ని అవసరాలను అర్హతలను బట్టి తీరుస్తూ, సర్వకాల సర్వావస్థల యందూ సాధకులను కాపాడుతూ, తన భక్తుల తనువులకు రక్షణ కవచమై రక్షిస్తూ ఉంటుంది, ఈ 'క్లీం'కార మంత్ర బీజాక్షరం. ఇది మహాద్భుత శక్తి కలిగిన అమృతాక్షరం. అదే శ్రీకాళీమాత దివ్యస్వరూపం. ఒక్కమాటలో చెప్పాలంటే, సత్యమైన సాధకులకు, ఏ సమయానికి ఏది అవసరమో, దానిని అడగకుండానే, అర్హత కలిగియున్న భక్తులకు అన్నింటినీ ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అని తెలియచేస్తుంటారు శ్రీ గురుదేవులు. పైన చెప్పిన మంత్రాలకు అర్థాలు తెలుసుకొని వ్రాయాలంటే గురుదేవులకృప పొందినప్పుడే అవి తెలుసుకొనే అదృష్టం కలుగుతుంది. ఇది నా స్వానుభవం.

**శ్లో॥ అష్టాదశ షోడశీ ద్వాదశ నవాక్షర పంచాక్షరీ ఏకాక్షరీ జపప్రియే !**
**శ్రీమూలమంత్ర సంపుటీ సహస్రనామ స్తోత్రపారాయణ వహ్నియాగతోషిణి!**
**అగ్నిహోత్ర నిర్వహణ కాలానేక సుఫల సమర్పణ సంతృప్తమూర్తే ! దేవి**
**విశ్వకల్యాణోపయోగ నిస్వార్థసుబుద్ధి జనానేక వరప్రదాయిని! కాళి!5**

తా॥ ఈ శ్లోకంలో శ్రీ గురుదేవులు రూపొందించిన శ్రీకాళీమాత మంత్రాలను వివరించారు. భక్తులకు, జపించడానికి అనుకూలంగా ఉండటం కోసం వివిధ మంత్రాక్షరాల సమ్మేళనంతో, ఎంతో కాలం సాధన చేసి రూపకల్పన చేయటం జరిగింది. ఇందులోని ప్రతిమంత్రమూ ఎన్నో శుభఫలితాలను ప్రసాదిస్తుంది.

**అష్టాదశ మంత్రము :** ఓం హ్రీం శ్రీం క్రీం క్రాం క్రోం శ్రాం సౌం హ్రాం హ్రూం హ్రౌం స్త్రీం క్షం జం క్లీం కాళ్యై నమః

**షోడశీ మంత్రము :** ఓం క్లీం శ్రీం హ్రీం హ్రౌం హ్రూం క్రీం శ్రీవరకాళికాయై నమః

**ద్వాదశీ మంత్రము :** ఓం క్రీం శ్రీం హ్రీం క్లీం శ్రీకాళికాయై నమః

**నవాక్షర మంత్రము :** క్రీం శ్రీ కాళికాదేవ్యై నమః

**పంచాక్షర మంత్రము :** క్లీం కాళ్యై నమః

**ఏకాక్షర మంత్రము :** క్రీం

శ్రీకాళీమాత సహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ప్రతి రెండు పంక్తులకు మూలమంత్రాన్ని చేర్చి పారాయణ చేస్తూ అగ్నితో హోమం చేస్తే ఆ తల్లి ఎంతో సంతోషిస్తుంది. అగ్నిహోత్రం చేసే కాలంలో అనేక మంచి మధుర ఫలాలను అగ్నిహోత్రంలో వేసి ఆహుతి చేస్తే తృప్తి చెంది బాగా సంతోషించే బంగారుతల్లి శ్రీకాళీమాత. లోకంలో అందరికీ శుభం జరగాలని కోరుకుంటూ, స్వార్థబుద్ధిని విడనాడి, అందరికీ ఉపయోగపడే కార్యక్రమాలు చేసే మంచి జనులకు అనేక వరాలను ప్రసాదించే పరిపూర్ణశక్తి వరాలమూర్తి శ్రీకాళీమాత. అంటూ అమ్మవారిని కీర్తిస్తున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సౌగంధికపుష్పామృతాక్షయపరిమళోద్భవాక్షరానేకమాల్యార్పణానందమూర్తే!**
**పూర్వసంధ్యాగణితబాలాదిత్యోద్భవాధిక తేజోనఖానంత శ్రీచరణాదిశక్తే!**
**శుక్లపక్షపూర్ణిమాసుదిన చంద్రకోటి విరాజమానాద్భుతాక్షిరూపిణి ! శ్రీకాళి!**
**సర్వసంశయ నివృత్తికాల విశ్లేషణ వివరణాత్మక శక్తి ప్రదాయిని ! కాళి!6**

తా॥ సౌగంధిక పుష్పవనం కుబేరుని అధీనంలో ఉంటుందని అంటారు. అది ఎక్కడ ఉన్నా ఎవరి వద్ద ఉన్నా సౌగంధిక పుష్పాలు అనేవి దేవతా పుష్పాలని చెప్పవచ్చు. ఎందుకంటే అవి ఒకసారి విచ్చుకున్న తరువాత ఎన్నటికీ వాడిపోవని ప్రతీతి. అవి బంగారు వర్ణంతో మెరిసిపోతూ, ఆ మెరుపు ప్రసరించినంత మేర తనలో ఉండే అత్యద్భుతమైన సుగంధాన్ని ఆ పరిసరాలలో నింపేస్తుంది. ఆ పరిమళ భరితమైన సువాసనకు ముగ్ధులు కాని వారు ఎవ్వరూ ఉండరట. ఆ వాసన పీల్చిన వారికి యవ్వనం వికశిస్తుంది. శరీరంలోని కల్మషాలన్నీ కరిగిపోతాయి, దేహం ఎన్నటికీ విచ్ఛిన్నం కాని స్థితిలో ఉండి చిరంజీవులౌతారట. ఆ పుష్పాలలోని సుగంధం అమృతమయం. అమృతాన్ని త్రాగిన వారు మరణం లేకుండా జీవిస్తారని చెపుతారు. కాని, ఈ సౌగంధిక పుష్పాలలోని అమృత తుల్యమైన పరిమళం ముక్కుల ద్వారా లోనికి ప్రవేశించిన తరువాత, శరీరానికి మృతి లేకుండా చేస్తుంది. అందువలన సౌగంధిక వనం నుంచి వెలువడే పుష్ప సౌరభం నిరంతరం, అక్షయంగా వెలువడుతూనే ఉంటుంది కనుక, అక్కడ ఉండే వారికి ఆ సువాసనల కారణంగా, వారు చిరంజీవులౌతారని భావించవచ్చు. అందుచేత అలాంటి పుష్పాలతో అమ్మవారిని పూజించాలని ఎల్లప్పుడూ దేవతలు కోరుకుంటారట. ఎందుకంటే సౌగంధిక పుష్పాలు అందరికీ లభ్యమయ్యేవి కావు. వాటితో పూజ చేయటం వలన ఆజగన్మాత ఎంతో సంతోషిస్తుందట. సౌగంధిక పుష్పాల నుంచి వెలువడే సౌరభం ఎంత అద్భుతంగా, అక్షయంగా, పరిమళయుతంగా, అమృత ప్రాయంగా ఉంటుందో, అదే విధంగా అంతటి పరిమళాన్ని, అక్షయమైన ఆనందాన్ని, అమృత తుల్యంగా ఉండే అక్షరాలతో కూర్చబడిన అనేక అక్షర మాలలను ఆతల్లి శ్రీకాళీమాతకు సమర్పించటం వలన ఆతల్లి సంతోషానికి అవధులుండవు. ఆ స్తోత్రమాలలు చదివిన వారికి, అవి విన్న వారికి కూడా ఎంతో ఆనందం కలుగుతుంది. ఆ తల్లియొక్క అనుగ్రహానికి పాత్రులవుతారు, శారీరక రుగ్మతలన్నీ వీడిపోతాయి, స్వచ్ఛమైన మనసుతో శుభకరమైన జీవితం ప్రాప్తిస్తుంది.

ఉదయించే సూర్యుణ్ణి తనివితీరా దర్శించాలంటే, తెల్లవారుజామునే ఏ సముద్ర తీరానికో వెళ్లాలి. అక్కడ మనకు సూర్యోదయం యొక్క అద్భుత అనుభూతి కలుగుతుంది. గుండ్రని లేత ఎర్రని పండేదో సముద్ర గర్భం నుంచి పైకి వస్తున్నట్లుగా అనుభూతి కలుగుతుంది. ఆ లేత ఎర్రని రంగులోని అద్భుతమైన కాంతి సముద్రపు అలలపై పడి ఆ దృశ్యం కనువిందు చేస్తుంది. ఆ రంగు, ఆ కాంతి కంటికి హాయి నిస్తుంది. ఉదయించే సమయంలో అలాంటి అద్భుతాన్ని కొన్ని క్షణాలు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. సమయం గడిచే కొద్దీ, ఆ లేత ఎరుపు రంగు మారిపోయి తీక్షణతను సంతరించుకుంటుంది. ఒక్క సూర్యుడు ఉదయ కాంతిలో అంత తేజస్సుతో, సుందరంగా కన్పిస్తే, మరి లెక్క లేనంతమంది బాలాసూర్యులు అనగా ఉదయించే సూర్యులు ఒక్కసారిగా ఉదయిస్తున్నట్లు ఊహించుకుంటే మరెంతో అద్భుతమనిపిస్తుంది. వేల, లక్షల, కోట్లమంది సూర్యులు ఉదయ సమయంలో ఎంతటి లేత ఎరుపు రంగుతో కూడిన తేజస్సును కలిగి ఉంటారో, అంతకు మించిన లేత ఎరుపు రంగు, అద్భుత కాంతి తేజస్సు గలిగిన కాలిగోళ్లు ఉన్న పాదాలు కలిగిన తల్లి శ్రీకాళీమాత. ఆతల్లి గోళ్ల నుంచి వెలువడే కాంతి, సూర్యునికి శక్తినిస్తుంది.

పౌర్ణమి రోజున చంద్రుడు తన నిండైన రూపంతో ఎంతో ఆహ్లాదకరంగా కన్పిస్తాడు. విను వీధిలో తళుక్కు, తళుక్కుమనే తారల మధ్యన వెండి కొండలా మెరిసిపోయే నిండు చంద్రుని అందం చూడ చక్కనిది. ఆ వెన్నెల వెలుగులో, చంద్రుని చల్లని కిరణాలను ఆస్వాదిస్తూ కొంచెం సేపు అలా ఆరుబయట తిరిగితే బాగుంటుందని చాలామంది భావిస్తారు. చంద్రుడు మనసును రంజింప చేస్తాడు, మనో వికారాలను తొలగించి మనసుకు హాయినిస్తాడు. పూర్ణ చంద్రునిలో అంతటి చల్లదనం, హాయిని ప్రసాదించే శక్తి, మనసులను మైమరపించగల వెలుగుతో నిండిన ఆకర్షణ శక్తిఉన్నాయి. జగన్మాత అయిన శ్రీకాళీమాత అమ్మవారి కన్నులు కూడా, ఒక్కసారిగా కోటిమంది పౌర్ణమి చంద్రులు ప్రకాశిస్తున్నప్పుడు వాటి నుంచి వెలువడే చల్లని శక్తి, మైమరుపు కలిగించే వెండి వెన్నెలల కాంతి, మనసులను రంజిల్ల చేసే ఏదో తెలియని ఆకర్షణపూరితమైన శక్తి, విస్మయం తాదాత్మ్యం కలిగించే విధంగా ఉంటాయి. ఆతల్లి నేత్రాలను ఒక్కసారి దర్శించుకుంటే కోటి పున్నమి చంద్రులను ఒకేసారి దర్శించుకుంటే ఎంతటి మహత్తర అనుభూతి కలుగుతుందో అంతకు మించిన అనుభూతి, ఆతల్లి నేత్రాలను దర్శించుకుంటేనే కలుగుతుంది.

లోకంలో ప్రతి మనిషికీ ఏదో ఒక సమయంలో, ఏదో ఒక విషయంలో సందేహం కలుగుతుంది. అది సహజం. తాను చేసే పని సరిగా చేస్తున్నా లేక ఎక్కడయినా పొరపాట్లు జరుగుతున్నాయా అని సందేహం కలుగవచ్చు. ఆ సందేహం తీరాలంటే, ఆ పనిలోని వివరాన్ని మరలా ఒకసారి నిశితంగా పరిశీలించుకుంటూ రావాలి. ఒక్కొక్క సందర్భంలో ఎన్నిసార్లు పరిశీలించినా దొర్లిన పొరపాట్లు కన్పించక పోవచ్చు. అందుకు కారణం ఆ పని యొక్క సాంద్రతను బట్టి వాటి వివరాలను పరిశీలించగలిగే నేర్పు, ఓర్పు లేకపోవటం కావచ్చు. భక్తులకు కలిగే అనేక సంశయాలను తమ వివరణాత్మక, విశ్లేషణాత్మక పద్ధతులలో చెప్పగలిగే నేర్పును సంతరించుకోవాలి. శ్రీకాళీమాత అమ్మవారిని అను నిత్యం పూజించే వారికి, ఆ తల్లి, వారికి ఏర్పడే అన్ని రకాల సందేహాలనూ, సంశయాలనూ, వారంతట వారే నివృత్తి చేసుకొనే విధంగా, వాటిని విశ్లేషించుకొని, వివరణాత్మకమైన పద్ధతితో ముందుకు సాగిపోగల శక్తిని యుక్తిని ప్రసాదిస్తుందని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో ఎంతో చక్కగా వివరించారు.

**శ్లో॥ వరకాళి ! ఆశ్రితజనపాలికే ! సంరక్షిణి ! ద్విభుజే ! ప్రసన్నదేవి !**
**మాం లాలితమూర్తే! మహాసమాధి స్థితిప్రదే! దేవి ! మాతః ! శ్రీవరకాళి!**
**చతుర్భుజే ! దేవి ! అమితానందప్రదే ! అష్టభుజస్వరూపిణి ! శ్రీకాళి!**
**శ్రీదివ్యసింహాసనప్రదే! యజ్ఞప్రియే! ద్విజబృందపాలికే! శక్తిప్రదే! 7**

తా॥ సకల శుభాలకూ మూలమైనది, మరియు సమస్త సౌభాగ్యాలకు ఆలవాలమైన 'ఓం'కార బీజాక్షర స్వరూపిణి శ్రీవరకాళీమాత. బాధలలో ఉన్నవారు ఆ తల్లిని ఆశ్రయించి, వాటినుంచి విముక్తులవ్వాలని మనస్సులో తలచిన మరుక్షణంలోనే వారికి అన్ని సమస్త బాధల నుంచి ఉపశమనం కల్గిస్తుంది శ్రీకాళీమాత. తద్వారా ఆతల్లి దరికి చేరాలనే తీవ్రమైన వాంఛలను కలిగించి, వారిని ఆతల్లి సన్నిధికి రప్పించుకుంటుంది. ఆతల్లిని ఆశ్రయించిన భక్తజనులను కాపాడుతూ ఉండటం శ్రీకాళీమాత లీలావిలాసమే. అన్ని లోకాలలోను తల్లులకే తల్లి అయిన, మరియు తల్లులకే జన్మనిచ్చే మహాచల్లని తల్లి శ్రీకాళీమాతయే. రెండు

భుజములు కలిగి, ప్రసన్నమైన వదనంతో, భక్తుల మనోరథాలకు ప్రశాంతతను ఆనందాన్ని చేకూర్చే, లలిత సంపన్నమై భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారిని భూగర్భంలోని శేషపాన్పుపైన తన ఒడిలో కూర్చుండ బెట్టుకొని, లాలించి, మహాసమాధి స్థితిని అనుగ్రహించినది ఆ తల్లి శ్రీవరకాళీమాతయే. ఆతల్లిని నమ్మిన వారికి అన్నీ సమకూరుస్తుందని అనుభవ పూర్వకంగా తెలుస్తున్నది. అందువల్లనే ఆతల్లిని ఆశ్రయించి అమ్మవారిని ఆదిపరాశక్తి శ్రీకాళీమాతను, సద్గురుమూర్తిగా స్వీకరించాలి. చతుర్వేదములకు ప్రతీకయై, నలుదిక్కులకూ, కార్యాచరణకు, ధర్మ, అర్ధ, కామ, మోక్షాలకు దిక్కయిన, నాలుగు భుజములు కలిగిన తల్లి. శ్రీకాళీమాత. ఆతల్లిని నమ్మి దరిచేరిన భక్తులకు, అంతులేని ఆనందాన్ని అందిస్తుంది శ్రీకాళీమాత. అవసరమైనపుడు అష్టదిక్కులకూ ప్రతిరూపంగా, దిక్కులన్నింటిలోనూ, ఆతల్లే నిలిచి ఉంటుందనే భావాన్ని తన భక్తులలో కలిగిస్తూ, ఎనిమిది చేతులు కలిగిన రూపంతో శ్రీకాళీమాత, వారికి దర్శన భాగ్యాన్ని కలిగిస్తుంది. అందువలన ఆతల్లి అనుగ్రహం పొందినవారు, లోకంలో సర్వోత్తమమై మరియు దివ్యమైన స్థితులను పొందుతారు. దేవతలు కూర్చొనే, శ్రేష్ఠమైనగొప్పదైన సింహాసనాన్ని అధిష్టించే మహాభాగ్యాన్ని కూడా, తన భక్తులకు ఆ తల్లి ప్రసాదిస్తుంది. శ్రీకాళీమాతకు అసాధ్యమైనది ఏదీలేదు. నిరంతరం, మంత్రజప యజ్ఞయాగాదులు చేస్తూ, ఆ దేవిని స్మరించే వారిని, అపారమైన తన కృపవలన బ్రహ్మవేత్తలను చేస్తూ, వారిని ఆదరించి, వారి రక్షణను, ఎల్లప్పుడూ పర్యవేక్షించడం శ్రీకాళీమాతకు ఎంతో ప్రీతికరమైనది, మరియూ సంతోషకరమైనది. యజ్ఞ కార్యక్రమాలంటే ఆ తల్లికి ఎంతో ఇష్టం. అందువలన ఆతల్లి కోసం యజ్ఞాలు నిర్వర్తించే భక్తులను, శ్రీకాళీమాత, శీఘ్రంగా కరుణించి, వారికి అవసరమైన వరాలను అనేక సంపదలను ప్రసాదిస్తుంది. అలాగే అందరికీ అవసరమైన శక్తిని ప్రసాదించి, భక్తుల ఆనందానికి కారణమౌతుంది ఆతల్లి. కనుక శ్రీకాళీమాతయే సర్వశక్తిమయి, ప్రేమమూర్తి అని ఆతల్లిని. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు కీర్తిస్తున్నారు.

శ్లో॥ దశభుజే ! శ్రీ వరకాళి ! మహాసౌందర్యమూర్తే ! వేజెండ్లపురవాసిని !
నిత్యనూతనానుభూతిప్రదాత్రి ! సత్యసంపూర్ణ యోగసిద్ధిప్రదే ! కాళి!
షోడశభుజే ! అష్టాదశభుజమూర్తే ! అనంతకరవక్త్ర స్వరూపిణి!
నిశీథ సమయార్చన ప్రీతే! నిత్యసందర్శిని ! సత్య సంభాషణ మూర్తే! 8

తా॥ దశదిశలనూ అనగా తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణములు, ఈశాన్యము, ఆగ్నేయము, నైరుతి, వాయువ్యములు, భూమి మరియు ఆకాశమనే పది దిశలనూ ఏకకాలంలో పర్యవేక్షిస్తూ, ఆ దిక్కులలో నివసించే సమస్త జీవులనూ అనుగ్రహించే శక్తి కలిగినది శ్రీవరకాళీమాత. ఆతల్లికున్న పది చేతులూ, నిరంతరం భక్తులను రక్షిస్తూ విరివిగా వరాలను ప్రసాదిస్తూ, వారిని దీవిస్తూ, రక్షిస్తూ ఉంటాయి. అనగా దీని అర్థం, ఆతల్లిని ఆశ్రయించిన భక్తులకు ఒకటికి, పది వరాల చొప్పున ఉదారంగా ఇవ్వగలిగే మనసున్న తల్లి. శ్రీవరకాళీమాత అని తెలియజెయ్యడానికి సంకేతంగా, పది చేతులు కలిగి, ఆ తల్లి ఉన్నదని అర్థమౌతున్నది. అదే విధంగా భక్తుల కీర్తిని దశదిశలా వ్యాపింప చేస్తుంది, శ్రీ వేజెండ్ల పురములో కొలువై ఉన్న శ్రీవరకాళీమాత. ఆ దేవి అతిసుందరమైన రూపం కలిగిన మూర్తిగా విరాజిల్లుతూ, వున్న అత్యంత సుందరమైన ఆ తల్లి బాహ్య, అంతర రూపాలను దర్శించిన వారు ఎవరైనా సరే, వారు మరుజన్మలో సుందరాతి సుందర రూపులుగా వినుతి కెక్కుతారు. వారు జన్మ వద్దనుకుంటే మోక్షాన్ని పొందుతారు. శ్రీవరకాళీమాతను దర్శించే భక్తులు ప్రతిరోజూ, ప్రతి క్షణం నూతనమైన దివ్యానుభూతులను పొందుతారు. వారికి నిత్యం కొత్తవిగా ఉండే అనుభవాలను, అనుభూతులను ప్రసాదించేది ఆతల్లి శ్రీవరకాళీమాతయే. ఆ దేవి సత్యమైన తల్లి. ఆతల్లి అనుగ్రహం కోసం పరితపించే భక్తులకు, సంపూర్ణమైన అనుగ్రహాన్ని, యోగసిద్ధులను, వరప్రసాదంగా ఇవ్వటం ద్వారా ఆమె, సత్యవాక్కు నిజమని ఋజువు చేసి చూపించేది మహిమాన్వితమూర్తి ఆతల్లి శ్రీవరకాళీమాతయే అంటారు శ్రీగురుదేవులు. అలాగే మానవుల మనుగడకోసం, వారి జీవితాలతో మమేకమై, ముడిపడి యున్న అతి ముఖ్యమైన కళలే షోడశి కళలు. ఆ షోడశీ కళలకు ప్రతీకగా, పదహారు భజములు కలిగిన తల్లి శ్రీకాళీమాత. అలాగే లోకంలోని అష్టాదశ శక్తి పీఠాలలో కొంత కాలం నుంచి వెలుగొందుతున్న పదునెనిమిది (18) శక్తి పీఠాలకూ ప్రతీకగా, అందలి దేవతలకు

మూలశక్తియై, ఆయా పీఠాలకు అధిదేవతగా, పదునెనిమిది భుజములు కలిగిన మహాశక్తి శ్రీకాళీమాత. లెక్కించడానికి వీలులేనన్ని చేతులతో, అసంఖ్యాకమైన, తేజోవంతమైన సుందర ముఖాలతో కనుపించే ఆతల్లి దివ్యదర్శనం, మానవ మాత్రులకు వర్ణించనలవి కానిది. ఆ రూపదర్శనం అనుభూతిని వివరించటానికి నిఘంటువులలోని పదాలు, సరైన భావాలను, అర్థాలను వ్యక్తీకరించలేకపోవచ్చు. ఎంతో ప్రశాంతమైన అర్ధరాత్రి సమయంలో చేసే పూజలు, అర్చనలంటే శ్రీకాళీమాతకు ఎంతో ప్రీతి. అర్ధరాత్రి సమయంలో దేవతలు మొదలైన వారు ఆకాశ సంచారం చేస్తుంటారని అంటుంటారు. అందువలన భక్తులను అనుగ్రహించడానికి, అర్ధరాత్రి సమయంలో ఆతల్లి ఎదురుచూస్తూ, సిద్ధంగా ఉంటుంది. అంతేకాక ప్రతినిత్యమూ భక్తులకు, తన దివ్యమైన దర్శనాన్ని అనుగ్రహించే, నిజమైన సత్యస్వరూపిణి శ్రీకాళీమాత. అదే విధంగా ఆతల్లిని సేవించే వారికి వాక్సుద్ధి మరియు వాక్సిద్ధులను ప్రసాదించి, వారు ఎల్లప్పుడూ సత్యభాషణ చేయు విధంగా భక్తులను అనుగ్రహిస్తుంది. శ్రీకాళీమాత అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీచక్రపీఠేశ్వరి ! శ్రీ వేంకట కాళీకృష్ణ గురు సంసేవన ప్రియే !**
**వ్రతపూజాకాల కలశోద్భవ మూర్తే ! సుదీక్షాకాల సంరక్షిణి ! కాళి !**
**మనోభీష్టసిద్ధిప్రదాత్రి ! మాతాపితృ సుగురు దైవమూర్తే ! వరకాళి !**
**ఆశుతోషిణ్యమృత స్వరూపాద్వైతమూర్తే ! అగణిత వరప్రదాయిని ! 9**

తా॥ శ్రీవరకాళీమాత ప్రతిష్ఠాపన, వేజెండ్ల పురములో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారిచేత చేయబడింది. అక్కడ ఆతల్లి శ్రీచక్రపీఠానికి అధీశ్వరియై ఉన్నది మరియు మూలదేవత కూడా శ్రీ వరకాళీమాతయే. శ్రీ గురుదేవులైన, శ్రీ కాళీకృష్ణుల వారి దంపతుల చేత నిరంతరమూ పూజలందుకుంటూ, వారితో సదా సేవలు చేయించుకుంటూ, వారిని ప్రియభక్తులుగా ఆశీర్వదించి, ఆ పుణ్యదంపతులకు, శ్రీ వరకాళీమాత, తనదర్శన భాగ్యాన్ని అనేకమార్లు కల్పించింది. అలాగే శ్రీగురుదేవులకు, అనేక సిద్ధులను ప్రసాదించింది శ్రీ వరకాళీ మాత. ఎన్నో పర్యాయములు, వ్రతకాలంలో స్థాపించే కలశం నుంచి, వ్రతం పూర్తయ్యేలోపు ఉద్భవించి, వ్రతఫలితాన్ని, ఆ సమయంలోనే, అక్కడికక్కడే, ప్రసాదించి, భక్తజనులకు, శ్రీకాళీమాత సులభంగా వశమవుతుందనే వాక్కులను, నిజమని తెలియచెప్పిన

దయగల తల్లి ఆ దేవి అమృతమూర్తి. అంతేకాక మంచి కోసం భక్తులు చేసే దీక్షలను అనగా, మంచి ఆలోచనలు మంచి సంకల్పాలతో, భక్తులశ్రేయస్సుకోరి, లేక మరి ఏ ఇతర శుభాలను ఆశించి చేసే దీక్షలు సత్ఫలితాలను ఇచ్చే విధంగా, వారి దీక్షలకు ఎలాంటి ఆటంకాలు రాకుండా, దీక్షాకాలం పూర్తయ్యే వరకూ, వారిని కంటికి రెప్పలా కాపాడే కరుణామూర్తి శ్రీకాళీమాతయే అంటుంటారు శ్రీగురుదేవులు. అదే విధంగా భక్తులకు ప్రతినిత్యం ఎన్నో అవసరాలు కలుగుతూ ఉంటాయి. ఆ అవసరాలకు అనుగుణమైన కోరికలు వారి మనసుల్లో ఉద్భవిస్తుంటాయి. నిజ భక్తుల మంచి ఆలోచనలకు తగినట్లుగా, వారి కోరికలను, వరప్రదాయిని అయిన శ్రీకాళీమాత తీరుస్తుంది. ఆమెయే సృష్టిలోని తల్లులందరికీ తల్లి. అలాగే తండ్రులందరికీ, తండ్రిలా సంరక్షించే తండ్రికూడా ఆ తల్లే. సద్గురువులైన మంచి గురువులకు కూడా శ్రీకాళీమాతయే గురువై నిలుస్తుంది. అనగా తల్లి, తండ్రి గురువుగా ఉండే అన్ని బాధ్యతలు నిర్వర్తించే దైవం. ఆ తల్లి శ్రీకాళీమాతయే. మరియు భక్తులు ఆచరించే పూజలకు సంతోషించి, అప్పటికప్పుడే వారికి అమృతమయమైన ఆనందాన్ని ప్రసాదించి, సంతోషపడే తల్లి ఏకైక మూర్తి శ్రీకాళీమాత. ప్రార్థించిన మరుక్షణంలోనే లెక్కించటానికి వీలుకాని విధంగా వరాలను ప్రసాదిస్తూ, ఆ వరాలను ప్రసాదించటంలో కూడా సాటిలేని మేటి అయినది, వరాల తల్లియైన సద్గురుమూర్తి శ్రీకాళీమాత. వాస్తవాలను తెలియచేస్తూ వుండే వరదానాది మూర్తి అంటారు శ్రీ గురుదేవులు.

**శ్లో॥ శ్రీగురు ఆనంద నిలయ విహారిణి ! సాకార స్వరూపిణి ! వరకాళి !**
**అనేకరూప సందర్శిని ! శ్రీమహాదేవి ! ఆదిపరాశక్తే ! దేవి ! కాళి !**
**మహామంత్రనామ దివ్యస్తోత్ర పఠన యాగోత్సవానందమూర్తే ! శ్రీకాళి!**
**కరవీర కుసుమార్చన సంప్రీతే ! కాళి ! కదంబ వృక్షాగ్రనివాసిని ! 10**

తా॥ శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, ఎంతో శ్రమ కోర్చి, సుగంధభరితమై, సౌరభాలను వెదజల్లే పుష్పాలతో కూడిన వనాన్ని అభివృద్ధి చేశారు. దానిపేరే శ్రీగురు ఆనంద నిలయం. అందులో శ్రీవరకాళీ మాతకు అత్యంత ప్రీతిపాత్రమైన పుష్పాలు ఎల్లవేళలా పూస్తుంటాయి. అందులో వికసించే పూలను స్వయంగా కోసి, శ్రీగురుదేవులు నిత్యం, ఆ తల్లిని

అర్చిస్తుంటారు. ఆ తోటలో ఎన్నో రకాలైన ఫల, పుష్ప జాతులకు చెందిన మొక్కలు, కదంబవృక్షాలు ఉండటంవలన, శ్రీవరకాళీమాత ఆ వనంలో ఆనందంగా విహరిస్తుంది. ఆ తల్లికి శ్రీగురు ఆనంద నిలయంలో విహరించటమంటే ఎంతో మక్కువ. అందువలన, అందరూ ప్రకృతిని ప్రేమించాలనే, అంతర్లీనమైన సందేశాన్ని, తన భక్తులకు, శ్రీవరకాళీమాత ఇస్తుందని భావించటం వలన ఎంతో మేలు కలుగుతుంది. ఆ తల్లి అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందగలిగిన శ్రీ గురుదేవులు మహాభాగ్యవంతులు. వారికి, శ్రీ వరకాళీమాత. ఎన్నోసార్లు, అద్భుతమైన తన సగుణ రూపాన్ని దర్శింపచేసింది. ఆ తల్లి అమృత తేజోమూర్తి. ఆ తల్లిని నమ్మిన భక్తులకు, అనేకమైన రూపాలతో దర్శనభాగ్యాన్ని కల్గించిన ఆదిపరాశక్తి శ్రీకాళీమాత. ఆ తల్లి, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారితో అను నిత్యం సంభాషిస్తుందని, వారి ప్రియభక్తులైన మూల్పూరు వీరారెడ్డి మరియు ఆలశ్యం సాంబిరెడ్డిగార్లు వారి అనుభవాలలో తెలియచేస్తున్నారు. భక్తుల సౌకర్యం కోసం ఇప్పుడు ఆ వనాన్ని మార్పు చేస్తూ ఆ వనంలో యజ్ఞాలను చేస్తూ ఇంకా కొన్ని కట్టడాలను చేస్తున్నారు.

అమ్మవారి మహామంత్రాలను జపించినా, ఆ తల్లిని స్తోత్రం చేసినా ఆమె దివ్య నామాలను పఠించినా, త్రికరణ శుద్ధిగా ఆ తల్లిని ఆరాధించినా సేవించినా నిరంతరం బృహత్తర యజ్ఞ యాగ కార్యక్రమం లాగా ఆ తల్లికి చేసే సేవలకు ఎంతో సంతోషించి భక్తులకు ఎన్నో అద్భుతమైన వరాలను ప్రసాదిస్తుంది. శ్రీకాళీమాతను ఎఱ్ఱగన్నేరు పూలతో పూజిస్తే ఆ తల్లి ఎంతో సంతోషించి, భక్తులను సత్వరం అనుగ్రహిస్తుంది. అలాగే ఎరుపు వర్ణం కలిగిన పుష్పాలంటే ఆ తల్లి ఇష్టంగా స్వీకరిస్తుంది. ఎర్రని కుంకుమ, ఎర్రని మందారము, ఎర్రని కలువపూలు, ఇలా ఎరుపు వర్ణం కలిగిన పూలతో చేసే పూజలు, ఆ తల్లికి మిక్కిలి సంతోషాన్ని కల్గిస్తాయి. ఎరుపు వర్ణం ప్రగతికి, మానవులలో కలిగే ఉత్తేజానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. శ్రీవరకాళీమాత నుదుటిపై ధరించే ఎర్రని కంకుమ, భక్తజనులకు సకల శుభాలనూ ప్రసాదిస్తుంది. అలాగే కదంబ వృక్షాలకు నెలవై ఉన్న వనములలో ఎంతో ఇష్టంగా ఆ తల్లి సంచరిస్తుంది. కదంబ వృక్షంపైన నివశిస్తూ భక్తుల మనసుల్లోని కోరికలను తీర్చుతుంది ఆ తల్లి శ్రీకాళీమాత అంటూ శ్రీగురుదేవులు పై శ్లోకంలో మహాద్భుతంగా తెలియచేశారు.

**ఓం హ్రీం శ్రీం క్రీం క్రాం క్రోం శ్రాం సౌం హ్రాం హ్రూం హ్రౌం స్త్రీం క్షం జం క్లీం కాళ్యై నమః**

ఈ మంత్రము శ్రీవరకాళీమాత 'అష్టాదశ బీజాక్షర' మహామంత్రము. శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు రూపొందించి, 1984 సంవత్సరం ప్రారంభం నుంచి, ఈ మహామంత్రాన్ని జపించి, ధ్యానమాచరిస్తూ, ఈ బీజాక్షరాలపై నిరంతర, కఠోరసాధన ఫలితంగా లభించిన సమస్త శుభఫలితాలనూ నేటికి, భక్తులకూ, లోకానికీ అందరికీ తెలియచేస్తున్నారు.

ఒక మంత్రాన్ని జపించి సాధన చెయ్యాలంటే ఎవరికి వారు చెయ్యలేరు. పుస్తకాలలోనో, గ్రంథాలలోనో లభించే మంత్రాలను సాధన చెయ్యటం సాధ్యం కాదు. సద్గురుముఖంగానే, వారి పర్యవేక్షణలోనే ఉచ్చారణ దోషాలు లేకుండా మననం చేయటం తెలుసుకొని ప్రారంభిస్తే అనుకున్న విధంగా సత్ఫలితాలు లభిస్తాయి. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు గురు సాంప్రదాయాన్ని గౌరవిస్తూ, వారు ఆరాధించే పరదేవత అయిన శ్రీవరకాళీ మాతనే తమ గురువుగా స్వీకరించారు. అలాంటి వారు లోకంలో చాలా తక్కువమంది కనిపిస్తారు. శ్రీకాళీమాత అంటేనే, భయంతో దూరంగా వెళ్లిపోయే ఈ రోజుల్లో శ్రీగురుదేవులు వీటన్నింటినీ అధిగమించి, ఆ తల్లి చెంతకు చేరి, సాధన చేసి, శ్రీకాళీమాతను మెప్పించి, ఆ తల్లిని, తన గురువుగా చేసుకున్నారు. అనుక్షణం ఆ తల్లి పర్యవేక్షణలో ఎన్నో మంత్రాలను శ్రీగురుదేవులు సాధనచేసి అపూర్వమైన సిద్ధులను సాధించారు. ఆ తల్లి వారికి అపారమైన జ్ఞానసంపదను, అమోఘమైన కవితాశక్తిని ప్రసాదించారు. వాటన్నింటినీ క్రోడీకరించుకొని, శ్రీగురుదేవులకున్న అపారమైన మంత్రశక్తులను ఏకం చేసిన విధంగా, ప్రతి మంత్రాక్షరాన్నీ, దాని గుణగణాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి స్థాయీ భేదాలను దృష్టిలో ఉంచుకొని, ప్రతి మంత్రాక్షరం ప్రక్కనున్న, రెండో మంత్రాక్షరానికి మైత్రీ బేధం లేకుండా గమనిస్తూ, సాధనకు అనువైన క్రమంలో మంత్రాక్షరాలను పొందుపరచి, పైన లిఖించిన శ్రీవరకాళీమాత అష్టాదశ బీజాక్షర' మహామంత్రాన్ని రూపొందించినట్లుగా శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేసిన విషయాలను బట్టి అర్థమవుతున్నది.

ఈ మహా మంత్రంలో పొందుపరచిన మంత్రాక్షరాలన్నీ ఎంతో అద్భుతమైన శుభఫలితాలను ప్రసాదించే శక్తి కలిగినవి. అలాంటివి పదునెనిమిది కలసి ఒకే రూపాన్ని సంతరించుకుంటే, ఆ మహామంత్రం కల్గించే శుభ యోగాలు ఎన్నో చెప్పటం సాధ్యం కాదు. అలా లభించే శుభ యోగాలన్నింటినీ, శ్రీగురుదేవులు తమకున్న కవితాశక్తి ద్వారా, శ్లోకాల రూపంలో పొందుపరిచారు. వాటిని చదివి భావాలను గ్రహించగలిగిన వారికి, అప్పటికప్పుడే ఆ శ్లోకాలలోని మంత్రాక్షర ప్రభావం వారిపై ప్రసరిస్తుంది అనడం అతిశయోక్తి కాదనిపిస్తుంది. ఎందుకంటే వాటిలో నిక్షిప్తమై యున్న శక్తి అలాంటిది. ఒక్కసారి "శ్రీవరకాళీమాత అష్టాదశ బీజాక్షర మహామంత్రాన్ని చదివితే ఒళ్లు పులకించి పోవడం నా స్వీయ అనుభవం. ఇంతటి సర్వశ్రేష్ఠమైన మహామంత్రాన్ని రూపొందించిన 27 ఇరవై ఏడు సంవత్సరాల తరువాత, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, లోక కల్యాణార్థం రూపొందించిన ఈ మంత్రరాజాన్ని తమ భక్తులకు అందజేసి, దాని విశేషమైన మహాత్మ్యాలను తెలియచేశారు. 'అ'కారం మొదలు అన్ని అక్షరాలకు అధిదేవత యైన శ్రీవరకాళీమాత, ఈ మహామంత్రంలోని, ప్రతి మంత్రాక్షరాన్నీ, తన అమేయమైన శక్తితో నింపడం వలన, అది ఒక అమృతభాండం (కుండ) అయింది. రోజుకు కొంచెం చొప్పున అమృతం సేవిస్తే లభించే శుభాలకన్నా, మరెంతో ఎక్కువగా, ఇంకా ఎన్నో శుభఫలితాలు, ఈ మంత్ర పారాయణం వలన లభిస్తాయని తెలుస్తున్నది. శ్రీగురుదేవులు, వారి శిష్యులు కొందరు ఈ మహామంత్ర రాజాన్ని ఇప్పటికి ప్రతినిత్యం జపం చేస్తూ ఈ మంత్రంతో యజ్ఞాలను కూడా చేస్తూ వుంటారు. ఎన్నో పర్వదినాలలో నేను కూడా చూశాను. నేనూ ఒకసాక్షినే.

**ఓం హ్రీం శ్రీం క్రీం క్రాం క్రోం శ్రాం సౌం హ్రాం హ్రూం హ్రౌం స్త్రీం క్షం జం క్లీం కాళ్యై నమః**

**శ్లో॥ శ్రీసత్యయుగ పూర్వోద్భవమూర్తే ! శ్రీలక్ష్మీనారసింహార్చనప్రియే ! దేవి!**
**బ్రహ్మవిష్ణు మహేశ్వర సృష్ట్యాదిశక్తే ! బ్రహ్మాండాసన యోగమూర్తే ! కాళి!**
**త్రిశక్త్యుద్భవ కారణమూర్తే ! హే త్రిమూర్తిజనని ! త్రిగుణస్వరూపిణి!**
**గౌరీశంకర రమానారాయణ భారతీవిరించ్యర్చితానందమూర్త్యాదిశక్తే! 11**

తా॥ యుగయుగాలలో ప్రారంభ యుగమైన కృతయుగానికి ముందే, అమ్మవారు ఎప్పుడు అవతరించారో ఎవరికీ తెలియదు, తెలుసుకోగలిగిన వారు కూడా ఉన్నట్లు కనిపించుట లేదు ఎందుకంటే ఆతల్లి శ్రీకాలచక్ర స్వరూపిణి, కాలచక్రానికి మొదలు ఎక్కడో ఎవ్వరూ గుర్తించలేరు, తెలుసుకోలేరు. కృతయుగంతో ఆరంభమై కలియుగంతో అంతమయ్యే ఈ విశ్వం, అసలు ఇలాంటి సత్యయుగములు, త్రేతాయుగములు, ద్వాపరయుగములు, కలియుగములు, ఒకదాని తరువాత ఒకటిగా వస్తూ పోతూ ఉంటాయని తెలుస్తున్నది. ఇప్పటివరకు ఎన్నోసార్లు క్రమానుసారంగా, ఈ విధంగా జరిగి ఉంటుందని చెపుతారు. ఇలా ఎన్నివేల యుగాలు, ఎన్ని వందలసార్లు, వేలసార్లు పునరావృతమయ్యాయో ఆతల్లి శ్రీకాళీమాతకు మాత్రమే తెలుసు. ఎందువల్లనంటే ఆతల్లి అన్ని యుగాలలోనూ ప్రారంభంనుంచి ఉండి, వందల, వేల, లక్షల, కోట్ల సంవత్సరాల నుంచీ, అన్ని కాలాలలో అన్ని యుగాలలో మానవులచేత, దేవతలచేతా ఆరాధించబడుతూ, అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నది. ఆత్మస్వరూపమైన ఆద్యంతమూర్తి శ్రీకాళీమాత ఆత్మకు నాశనం లేదు. జీవులలో ఆత్మరూపంలో ప్రాణశక్తిని ప్రవేశింపచేసే దివ్యస్వరూపిణి ఆ తల్లే. హిరణ్యకశపుని సంహరించి, ప్రహ్లాదుని యొక్క భక్తిని లోకానికి తెలియజెప్పిన, శ్రీ విష్ణు స్వరూపమైన శ్రీ నారసింహ స్వామి, తన దేవేరి అయిన శ్రీలక్ష్మీమాత ఇద్దరితో ఆరాధించబడిన తల్లి శ్రీకాళీమాత, వారిని అన్ని యుగాలలోనూ అనుగ్రహించే బ్రహ్మాండశక్తిగా భాసిల్లే ఆతల్లి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కూడా సృష్టి చేసింది. శ్రీ ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాత ఈ బ్రహ్మాండాన్నే సుఖాసనంగా చేసుకొని, ఆ బ్రహ్మాండం పైనే యోగమాచరిస్తూ ఉంటుంది. ముగ్గురు శక్తులైన సరస్వతీదేవి, లక్ష్మీదేవి, మహేశ్వరి అనగా పార్వతి, గౌరి భవాని అనేక నామాలతో పిలువబడే శక్తులు పుట్టడానికి కారణమైన తల్లి శ్రీకాళీమాత. ఆదిపరాశక్తి బిడ్డలైన సరస్వతి, లక్ష్మి, పార్వతులు మానవులకు వివిధ దశలలో వారికుండే అవసరాలైన విద్య, ధనం, శక్తి మొదలైన వాటిని సమకూర్చి వారి ఉన్నతికి సహకరిస్తారు. ఈ ముగ్గురు మూర్తులకూ తల్లి, మూడు గుణాలు కలిగిన దేవత శ్రీఆదిపరాశక్తి. పార్వతీ పరమేశ్వరులు, లక్ష్మీనారాయణులు, సరస్వతీ బ్రహ్మదేవులు అమ్మవారిని ఎల్లప్పుడూ ఆరాధించటం వలన, ఆతల్లి ఎనలేని ఆనందాన్ని పొందుతూ, వారిని ఆశీర్వదించి తరింపచేస్తుంది శ్రీకాళీమాత. అందువలన వారు అన్ని యుగాలలో పూజింపబడుతుంటారు. అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ సర్వ తపోధన ఫలత్యాగ సన్ముని యోగిహృదయోద్యాన విహారిణి !
సన్మార్గాచరణ సాధు సజ్జన సాంగత్య సంపదుత్పత్త్యభివృద్ధిమూర్తే !
సుపూజానేక వ్రతాచరణ స్త్రీ పురుష భక్తజన హృదయవాసిని !
మహర్షీంద్రాలోచనానుగుణ ప్రకృత్యానుకూల్య ప్రదాన కారిణి! కాళి!12

తా॥ మహాత్ములైన మునులు, యోగులు, ఋషులు వారి తపశ్శక్తిని ఎల్లప్పుడూ లోక కల్యాణం కోసమే వినియోగిస్తుంటారు. ఎందువల్ల నంటే వారు భవబంధాలకు దూరంగా ఉంటూ, కోరికలు ఏమీ లేనివారై ఉంటారు. వారు సంపాదించి ఎవరికో పెట్టాలి అనే బాధ, అవసరం కూడా ఉండదు. డబ్బు కంటే అత్యంత విలువైన జ్ఞాన సంపదను, దైవశక్తి సంపదను తమ తపశ్శక్తి ద్వారా పొందుతారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచం తమకు ఏమి ఇచ్చిందనే ఆలోచనలతో సంబంధం లేకుండా, ఇతరులకు తాము ఏమి చేయటం వలన లోక కల్యాణం జరుగుతుందనే భావనల్లో ఉంటారు. అలాంటి, తపో, ధన సంపన్నులైన మునులు, యోగులు, వారి మనసుల్లో తలచినంత మాత్రానే సకల పైన మంగళకర కార్యక్రమాలనూ ఆచరింప చేయగలరు. వారు తమ జీవితంతో ప్రతిక్షణం ఆ శక్తి మాతనే ఊపిరిగా, శ్వాసగా చేసుకొంటారు. ఆ తల్లి కోసమే తమ జీవితాలను అంకితం చేసి బ్రతుకుతుంటారు కనుక, వారిని పరమాత్మ స్వరూపులుగానే అందరూ భావిస్తారు. విశాల భావాలు కలిగిన వారి మనసులు కూడా అత్యంత విశాలంగా, హద్దులే లేనట్లుగా ఉంటాయి. అవి సుందర వనాలతో సమానం. కనుకనే అలాంటి మునుల, యోగుల హృదయాలనే వికశించిన సుగంధ పుష్ప వనంలో శ్రీకాళీమాత సంతోషంగా విహరిస్తూ ఉంటుంది. ఆతల్లి వారి హృదయాలలో విహరిస్తూనే ఆ ముని, యోగుల ఆలోచనలను సాకారం చేస్తుంది. అలాగే మంచి బుద్ధి గలిగి, సాధు స్వభావంతో, సత్ప్రవర్తన అనే భూషణాన్ని కలిగి సరైన మార్గంలో నడిచే మంచి జనులతో స్నేహం చేసే భాగ్యాన్ని కలిగించి, అలాంటి మంచి అలవాట్లను అభివృద్ధి చేస్తుంది. అమృత స్వరూపిణియైన ఆ తల్లి శ్రీకాళీమాత. మంచి జీవితాన్ని గడపాలంటే ముందు మనం సరైన మార్గంలో ఉంటూ మన బుద్ధిని, స్వభావాన్ని, ప్రవర్తనను సరళతరంగా మలచుకుంటూ ముందుకు సాగే విధంగా ఆతల్లి మంచి మార్గాన్ని ఏర్పరుస్తుంది. ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరతాయి అన్నట్లుగా, మన సత్ప్రవర్తనను అనుసరించి, అలాంటి

సత్ప్రవర్తన గలిగిన వారే మన దరి చేరే విధంగా, లేక మనమే అలాంటి సత్ప్రవర్తనాపరుల చెంతకు చేరేలా ఆతల్లి శ్రీకాళీమాత చేస్తుంది. మరలా వారితో మంచి స్నేహం చేసే అదృష్టాన్ని కూడా ఆ మాత కలిగిస్తుంది. మంచి స్నేహం లభించటం ఒక భాగ్యమే కదా! ఎంతో మంది ఈ లోకంలో ఉదయం లేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకూ తీరిక లేకుండా ఏవేవో పూజలని, వ్రతాలని, అమ్మవారికి నైవేద్యాలని, భక్తులకు ఫలహారాలని చేస్తూనే ఉంటారు. చూసే వారికి, వీరు ఎలా చెయ్యగలుగుతున్నారు అని అన్పిస్తుంది, వారేమో అంతా అమ్మ దయ అని అంటుంటారు. ఇదంతా వారి జీవితాల్లో నిత్యకృత్యాలుగా ఉంటాయి. ఇవన్నీ వారు ఎంతో సంతోషంతో, ఆనందంతో చేస్తూ ఉంటారు. ఏదైనా ఒకరోజు ఇబ్బంది వచ్చి చెయ్యలేకపోతే, ఆ రోజంతా వారి మనసుల్లో ఆలాపనగానే ఉంటుంది. అయ్యో! చెయ్యలేక పోయామే, అమ్మవారికి నైవేద్యం పెట్టలేకపోయామే అని అనుకుంటూనే ఉంటారు. ఆ భావన వారిని అమ్మవారికి ఇంకా దగ్గరగా చేరుస్తుంది. ఎవరైతే స్త్రీలుగాని, పురుషులు గాని అనేకమైన, దివ్యమైన పూజలను, వ్రతాలను చేస్తుంటారో, అలాంటి స్వచ్ఛమైన భక్తిభావం కలిగిన వారి మనసుల్లో శ్రీకాళీమాత నిశ్చలంగా కొలువై ఉంటుంది. మహర్షులంటే సత్యమైన నిత్యానందాన్ని అనుభవించే మహాత్ములు. వారు ఎల్లప్పుడూ ఆ జగన్మాతనే స్మరిస్తూ దర్శిస్తూ బ్రహ్మానందాన్ని పొందుతుంటారు. అలాంటి సత్పురుషుల ఆలోచనలకు అనుగుణంగా, ఆతల్లి అవసరమైతే ప్రకృతి శక్తులను కూడా వారికి అనుకూలంగా మారుస్తుంది. ఎలాగంటే ఒక మహాత్ముడు యజ్ఞమో, యాగమో తలపెట్టినప్పుడు, ప్రకృతి ప్రళయంగా మారుతున్న సందర్భాలలో, ఆతల్లి, ఆ మహాత్ముడు తలపెట్టిన కార్యక్రమానికి ప్రకృతి ప్రకోపాన్ని ఆనందకర వాతావరణంగా మారుస్తుంది. నిండు రోహిణీ కార్తె ఎండ తీవ్రతను, పండు వెన్నెలలో పరవశింపజేసే పిల్ల తెమ్మెరలుగా చేస్తుంది. ఇలా జరుగుతుందా అంటే జరుగుతుంది. ఆతల్లిని నమ్మి, ఆతల్లి కోసమే జీవితాన్ని ధారపోసే గురుల, యోగుల, మునుల, మహాత్ముల సేవలు చేసుకునే వారికి మాత్రమే, ఆతల్లి శ్రీకాళీ మాత చేసే మహా అద్భుతాలు దర్శించే భాగ్యం కలుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సత్పురుషుల ఆలోచనలకు అనుగుణంగా, ఈ ప్రకృతిని వారి ఆశయాలకు అనుకూలంగా మార్పు చేయగలిగిన మహిమాన్విత మూర్తి, మహాద్భుత శక్తి శ్రీకాళీమాత, అంటూ ఆతల్లి

యొక్క గొప్పదనాన్ని, భక్తులు, యోగులైన వారి యెడల ఆ తల్లికుండే ప్రేమను తెలియచేస్తున్నారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**శ్లో॥ అపూర్వాద్భుత కరచరణ వక్త్రాక్షి దివ్య స్వరూపావతారిణి ! కాళి !**
**మహాశ్చర్య దివ్యాచ్యుతదేహధారిణి! శ్రీకాళి! మంత్ర నామాద్భుతమూర్తే!**
**త్రిమూర్తీంద్ర సురగణ త్రిశక్తి సంరక్షిణి ! ప్రేమామృతాక్షయవర్షిణి !**
**దివ్యామృతాక్షరానేక మంత్రస్తోత్రా భరణాలంకృతోత్సాహమూర్తే ! కాళి!13**

తా॥ ఈ విశ్వంలో శ్రీవిశ్వమాత, ఆదిపరాశక్తి శ్రీకాళీమాత ఉద్భవించిన క్షణం నుంచి ఇప్పటి వరకూ ఆతల్లి, తమ భక్తులకు ఎన్నెన్నో రూపాలలో దర్శనమిస్తూ సాక్షాత్కరించింది. భక్తుల మనోభీష్టాల మేరకు ఆ తల్లి శాంతరూపంలో, ఉగ్రరూపంలో, మహా అద్భుత సౌందర్యంతో, వరాలనిచ్చే తల్లిగా, కోరికలను తీర్చే కల్పవల్లిగా, సకల కళలతో, సర్వమంగళప్రదాయినిగా, సకల శుభాభరణభూషితగా, సర్వాయుధ ధారిణిగా, ఒక రూపం అని లేదు, ఎన్నో లక్షల, కోట్లమందికి, అదే సంఖ్యలో తన రూప వైవిధ్యాలను ప్రదర్శిస్తూ అనుగ్రహించింది. కాని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి, ఆ తల్లి శ్రీకాళీమాత సాక్షాత్కరించిన స్వరూపం ఇంతవరకు లోకంలో ఎవ్వరికీ లభ్యం కాలేదేమో ఎవ్వరూ దర్శించనటువంటి తల్లి శ్రీకాళీమాతగా అవతరించిన అతి సుందరస్వరూపాన్ని, శ్రీగురుదేవులు దర్శించి వర్ణించిన మహా అద్భుత శ్లోకం ఇది. ఆతల్లి పాదాల సౌకుమార్యం ఆశ్చర్యం కలిగించే విధంగా ఉన్నది. ఆతల్లి పాదాలకు అలంకరించుకున్న మంజీరాలు అనేక రత్న శోభితంగా దివ్యకాంతులను వెదజల్లుతున్నాయి. అలాగే చేతులు, ముఖము, అవయవ సంపద అంతా కలిపి ఒక అద్భుతమైన స్త్రీమూర్తిగా కన్పిస్తున్నది. అంత అద్భుతమైన, ఆశ్చర్యకరమైన స్వరూపం ఇంతవరకూ ఎవ్వరూ దర్శించుకున్నట్లుగా తెలియటం లేదు. అలాంటి దర్శన భాగ్యం శ్రీగురుదేవులకు, ఆ తల్లి కల్పించింది. శ్రీవరకాళీ మాత దేహ దార్ఢ్యం ఎన్నటికీ విచ్ఛిన్నం కాని విధంగా, లోకంలో ఏ శక్తీ, ఏ బలం ఆతల్లికి సాటిరాని విధంగా ఉన్నది. ఆతల్లి శ్రీకాళీమాత నామం మహా అద్భుతం. ఆ తల్లికి రూపానికో నామం ఉన్నది. ఆ ప్రతి నామంలోనూ ఆ తల్లియొక్క అద్భుత శక్తి నిక్షిప్తమై ఉన్నది. ఏ నామాన్ని స్మరించినా సరే, తత్‌క్షణమే,

ఆ నామంలో అంతర్భాగంగా దాగి ఉన్న శక్తి విడుదలై, స్మరించిన వారి మనోరథాలను తీరుస్తుంది. ఆ శక్తిని మరే శక్తీ అడ్డుకోలేదు, విచ్ఛిన్నం చేయలేదు. ఎల్లవేళల స్మరించిన వారి మనసులను చేరి వారి కోరికలు ఏవైనా సరే సాకారం చేస్తుంది. అదే విధంగా శ్రీకాళీమాత మహామంత్రం జపించాలని, భక్తులు మనసులో తలచిన మరుక్షణమే, ఆ తల్లి తన సర్వశక్తులతో కూడి ఆ భక్తుని దరి చేరుతుంది. అతని కోరికలను తీర్చటానికి సర్వసన్నద్ధమై నిలుస్తుంది. స్మరణ మాత్రంతోనే ఇంతటి ఔదార్యం చూపించే తల్లి నిజంగా పరమాద్భుత భక్తజనపాలికా మూర్తి. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, దేవతల రాజైన ఇంద్రుడు మొదలగు వారికి, దేవగణాలకు, వారికున్న శక్తియుక్తులను ఎల్లప్పుడూ సంరక్షిస్తూ ఉంటుంది. అవసరమైనప్పుడు వారికి, తన అసమానమైన, అద్భుతమైన, దివ్యశక్తులను అధికముగా ప్రసాదిస్తూ వారి విజయాలకు అండగా నిలుస్తుంది ఆ తల్లి శ్రీకాళీమాత. అంతటి శక్తి సంపన్నురాలైన ఆతల్లి, సహజ స్త్రీ లక్షణాలైన ప్రేమ, దయ, అనురాగాలను తన భక్తజనులపై అక్షయమైన అమృతధారల వలె కురిపిస్తుంది. ఆ తల్లి ప్రేమామృత వర్షంలో తడిసిపోని భక్తులెవరూ ఉండరేమో. శ్రీకాళీమాతను పూజించటానికి, ఆతల్లిని రకరకాల పుష్పాలతో మాలలతో అలంకరిస్తుంటారు. కొందరైతే అద్భుత సువాసనలు వెదజల్లే పూలమాలలతో, గజమాలలతో అలంకరిస్తూ ఆతల్లి అనుగ్రహం కోసం ప్రార్థిస్తుంటారు, స్తోత్రాలు చేస్తుంటారు. ఐతే ఎంత ఖరీదు గలవైనా, గొప్ప సుగంధభరితమైన పూలైనా మాలలైనా ఒకటి, రెండు రోజుల్లో ఎండిపోయి, వడలిపోయి, వాటి రూప సౌందర్యాన్ని సౌరభాన్ని కోల్పోయి నిర్మాల్యంగా మారిపోతాయి. కాని అమృత తుల్యమైన, ఆ తల్లిని మంత్రాక్షరాలనే మాలలతో స్తోత్రాలు చేస్తే ఆ స్తోత్రాలనే ఆతల్లి, తమ భక్తులు తనకు అలంకరింప జేసిన దివ్యాభరణాలుగా భావిస్తూ అత్యంత ఉత్సాహాన్ని, సంతోషాన్ని, ఆనందాన్ని పొందుతుంది. ఈ దివ్యాక్షరాలనే మాలలు ఎన్నటికీ పాడైపోనివి, శాశ్వతంగా ఆ తల్లి హృదయ స్థానంలో నిలిచిపోయి ఉంటాయి అని మహామంత్ర సిద్ధగురువులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురు మహరాజ్ గారు శ్రీకాళీమాత నామానికి, మంత్రానికి ఉన్న శక్తిని, వైభవాన్ని తెలియచేస్తున్నారు.

శ్లో॥ సర్వవిఘ్న నివారిణి! కార్య నిర్విఘ్న నిర్వహణశక్తి ప్రదాత్రి ! కాళి !
మహాపుణ్యకార్యాచరణ భక్తజన సంరక్షిణి ! దేవి ! మంగళమూర్తే !
అనేకాలంకారాద్భుత మూర్త్యర్చనాధిక ఫలప్రదాత్మధ్యాన ప్రదాత్రి !
సకల శక్తిపీఠ సందర్శనాధిక ఫల స్తుతిమాత్ర ప్రదాత్రి ! కాళి ! 14

తా॥ లోకంలో చాలామంది ముఖ్యమైన కార్యక్రమాలను ప్రారంభించేటప్పుడు అనగా అవి వివాహ కార్యక్రమాలు కావచ్చు, శుభకార్యాలు కావచ్చు, ఉద్యోగ, వ్యాపార, గృహ సంబంధ కార్యక్రమాలు, మరే ఇతర కార్యక్రమాలైనా చేయ తలపెట్టినప్పుడు, ఆ కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగటానికి భవిష్యత్తులో అవి విజయవంతంగా ముందుకు సాగిపోవటానికి ఆటంకాలు తొలగిపోవటానికి పూజలు చేస్తుంటారు. అలా చేయటం వలన తాము తలపెట్టిన కార్యక్రమాలు విజయవంత మవుతాయని, ఎలాంటి విఘ్నాలు కలుగవని భావిస్తారు. కాని కొన్ని సందర్భాలలో నిర్విఘ్న పూజలకు, కార్యక్రమాలకు కూడా అనుకోని అవాంతరాలు వస్తుంటాయి. అంటే అవిఘ్నాలు జరుగకుండా నిర్వర్తించే కార్యక్రమాలకు కూడా విఘ్నాలు కలుగుతూ ఉంటాయి. ఎందుకు అలా జరుగుతూ ఉంటాయో తెలియదు. శాస్త్రబద్ధంగా అన్ని ప్రమాణాలనూ పాటిస్తూ చేసినా అలా జరుగుతూ ఉంటాయి. సాక్షాత్తూ విఘ్న నాయకుడు వినాయకుడి కార్యక్రమానికే విఘ్నాలు కలిగాయని చెప్పుకుంటారు కదా! అలా విఘ్న నివారణ కోసం చేసే పూజా కార్యక్రమాలకే విఘ్నాలను కలిగించే అతిరహస్యమైన అంశాలను లేక శక్తులను సైతం అంతం చేసి, నివారించగలిగే శక్తిని తమ భక్తులైన వారికి శ్రీకాళీమాత వరంగా ప్రసాదిస్తుంది. అందువలన నిజభక్తులు ఆచరించే కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయో అనే ఆలోచనలను కూడా వారి మనసుల్లోనికి రానీయకుండా, ఆచరించే ప్రతిపనిలోనూ శుభాలను మాత్రమే పరంపరలుగా ప్రసాదించే శుభకారిణి ఆ తల్లి, శ్రీకాళీమాత సర్వమంగళమూర్తి. ఎంతో శుభకరంగా అలంకరించుకుంటుంది. అలంకారమంటే ఆతల్లికి ఎనలేని ప్రీతి. అందువలనే భక్తులు ఆతల్లిని, ఎంతో అద్భుతమైన సుగంధ పరిమళాలు వెదజల్లే పూలతో అలంకరించి, తమ భక్తిని చాటుకుంటూ ఆనందిస్తుంటారు. అలాగే, భక్తులు తనకు చేస్తున్న అలంకారాలను చూసి, ఆతల్లి మురిసిపోతుంది. భక్తులు కూడా అందుకు తగినట్లుగానే, ఆతల్లిని

అలంకరించే విధానంలో, ఎన్నో వైవిధ్యాలను ప్రదర్శిస్తూ అత్యద్భుతమైన రీతిలో అలంకరిస్తూ, శోభాయమానంగా చేస్తూ ఆతల్లి కృప కోసం ఆరాటపడుతుంటారు. అలాంటి అలంకారాలలో శ్రీకాళీమాతను పూజిస్తూ అధిక ఫలితాలను ఆశిస్తుంటారు. అదే విధంగా ఆ తల్లి కూడా వారిని అనుగ్రహిస్తుంది. అయితే, శ్రీకాళీమాతను నిరంతరం మనోనేత్రంలో దర్శిస్తూ, ఆత్మధ్యానం చేసే భక్తులకు, తనను ఎంతో ప్రీతికరంగా, అద్భుతంగా అలంకరించి పూజలు చేసే వారికి ప్రసాదించే శుభఫలితాల కంటే, అత్యధికమైన శుభఫలితాలను ప్రసాదిస్తుంది అనటంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. అలాంటి ఎన్నో శుభఫలితాలను పొందిన వారు సాక్షాత్తూ శ్రీగురుదేవులే. వారు నిరంతరం, ఆతల్లిని, తమ మనోనేత్రంతో దర్శిస్తూ చేసిన జప, తపాదుల వల్లనే ఎన్నో సిద్ధులను పొందారు, అనే విషయం వారి వద్దకు వచ్చే భక్తులందరికీ తెలిసిందే.

ఈ లోకంలో ఎన్నో శక్తి పీఠాలు ఉన్నాయి. ఒక్కో శక్తి పీఠానికి, ఒక్కో తల్లి అధిదేవతగా ఉంటుంది. శక్తి పీఠాలను దర్శించుకోవటం వలన ఎంతో పుణ్యం లభిస్తుంది. శుభఫలితాలు కలుగుతాయి. ఎన్ని ఎక్కువ శక్తి పీఠాలను దర్శించుకుంటే అంత ఎక్కువ పుణ్యఫలం లభిస్తుంది, అనేది భక్తుల విశ్వాసం. లోకంలో ఉన్న శక్తి పీఠాలన్నింటినీ దర్శించటం అందరికీ సాధ్యం అయ్యే పని కాకపోవచ్చు. ఎందువల్ల నంటే జీవిత కాలం తిరుగుతూనే ఉండాలి. అందుకు శ్రమ, శక్తి, ఆరోగ్యం, డబ్బు అన్నీ అవసరమే. అవన్నీ అధిగమించి, నిరంతరం తిరుగుతూ, శక్తి పీఠాలను దర్శించుకోగలిగిన వారికి, ఆ శక్తి దేవతల అనుగ్రహం కలిగి, వారికి ఎంతో మేలు కలుగుతుంది. అలా నిరంతరం తిరుగుతూ, శక్తి పీఠాలను దర్శనం చేసుకుంటూ తద్వారా పొందే మేలు, శుభఫలితాలకన్నా అధికంగా, ఆతల్లి శ్రీకాళీమాతను త్రికరణ శుద్ధిగా అనగా మాట్లాడే మాటలు, మనసులో కలిగే భావనలు, ఆచరించే పనులన్నీ ఎలాంటి కల్మషం లేకుండా నియంత్రించుకుంటూ, ఆతల్లిని మనసులోనే నిరంతరం ధ్యానించటం, స్తుతించటం వలన, ప్రసాదిస్తుందని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో వివరించారు.

శ్లో॥ అకారాదిమూర్తే ! ఆమ్నాయప్రదే ! ఆత్మసృష్ట్యాదిశక్తే ! అమృతస్వరూపిణి!
ఉకారాదిమూర్తే ! దేవి ! ఉదారస్వభావిని ! ఉత్తమ సత్త్వగుణ ప్రదాత్రి!
మకారాదిమూర్తే ! దేవి ! మనోబుద్ధి వృత్తి శూన్యకారిణి ! మహాదేవి! కాళి
హ్రీంకార స్వరూపిణి ! దేవి ! హిమాలయాద్రీశ్వరి ! శ్రీకాళి ! భువనేశ్వరి!15

తా॥ అకారమూర్తిగా, సృష్ఠి చేసే బ్రహ్మశక్తిగా, వేదాలను లోకాలకు ప్రసాదించిన తల్లి శ్రీకాళీమాత. అక్షరమాలలో 'అ'కారం ప్రధమాక్షరం. అదే విధంగా, ఈ సృష్ఠిలో ఆదినుంచి అనగా మొట్టమొదటినుంచి ఉన్నతల్లి శ్రీకాళీమాతే. ఆ తల్లే సృష్ఠిలో మొదటి తల్లి, మొదటి శక్తి. ఆ తరువాత ఆమె సృష్టిని చేయటం ప్రారంభించి, బ్రహ్మశక్తిగా, వేదాలను లోకాలకు ప్రసాదించిన తల్లిగా, ఆత్మను సృష్ఠించే శక్తిగా, అన్నివేళలా ఉండే ఆత్మకు ఆదిమూర్తిగా, ఎల్లప్పుడూ శాశ్వతంగా ఉండే స్వరూపం కలిగిన తల్లి శ్రీకాళీమాత. ఉకారమూర్తిగా ఆదిపరాశక్తి శ్రీకాళీమాత, పాలనాశక్తిగా, ఉదార స్వభావం అంటే జాలి, దయ, ప్రేమ, క్షమ, కరుణ, దానగుణం అన్నీ ఉన్న తల్లి. తమ భక్తులకు ఉజ్జ్వలమైన జీవితాన్ని భవిష్యత్తును ప్రసాదిస్తూ ఉచ్ఛమైన సచ్ఛీలతను ఇస్తుంది. శ్రేష్ఠమైన శాంతిగుణాన్ని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. మకారమూర్తిగా లయకారిణియై దేవి, మనసు బుద్ధి చేసే సంకల్పాలను కూడా తొలగించి, భక్తులలో ఘనులైన వారికి సమాధి స్ఠితిని ప్రసాదిస్తుంది. శ్రీకాళీమాత 'అ'కార, 'ఉ'కార, మకారాలతో కూడి యున్నది 'హ్రీం'కారమని, సద్గురువులు, సాధువులు,మునులు, ఋషీంద్రులంటారు. ఈ హ్రీంకారమే దేవి తనువు. ఆ దేవి హిమాలయ పర్వతాలపై విహరిస్తూ అక్కడ అధినాయకురాలుగా ఉంటూ, తపోజనులకు మంచి మహిమాన్విత శక్తులను ప్రసాదించే భువనేశ్వరియే శ్రీకాళీమాత. తపస్సంపన్నులైన వారికి ఎన్నో వందల వేల లక్షల కోట్ల సంవత్సరాలు జీవించి వుండే గొప్ప శక్తులను వరాలుగా ప్రసాదించి వాటిని, వారిని, వర్ధిల్లచేస్తూ వారిని ఎల్లవేళల కాపాడుతూ వుంటుంది. శ్రీకాళీమాత. చివరకు తపోభక్తులను తనలో ఐక్యం చేసుకొంటుంది, అదే శ్రీకాళీమాతకు వున్న గొప్ప ప్రేమనిధి. అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ విష్ణుఫాలస్థానవిరించికంఠాగ్రస్థ ద్విపాదముద్రాస్థిరవరప్రదే !
ఈశ్వర వక్షస్ స్థలాగ్రస్థ ద్విపాదముద్ర స్థిరవరప్రదాత్రి ! కాళి !
అగణితాగ్ని మండల మహామహోజ్జ్వలాంతరానేక రూపసందర్శిని !
సర్వదేవగణసంసేవిత చరణమూర్తే ! సకల సురేశ్వరి ! కాళి ! 16

తా॥ శ్రీమహావిష్ణువు తన ఫాలభాగంలో అమ్మవారి పాదముద్రలను ధ్యానించటం వలన వారికి దివ్యశక్తి లభించి, వికసించి యున్న మనోనేత్రంతో, సర్వలోకాలనూ, తాను ఉన్న ప్రదేశం నుంచే వీక్షించి, వాటి వివరాలను తెలుసుకో గలిగే వరాలను, అద్భుతమైన దివ్యదృష్టిని ప్రసాదించింది. బ్రహ్మదేవుని కంఠంపైన తన రెండు పాదాల గుర్తులూ ఎల్లప్పుడూ ఉండే విధంగా వరాలనిచ్చి, ఆ బ్రహ్మచేత అద్భుత వాక్యాలను పలికిస్తూ, బ్రహ్మ దేవుని, జ్ఞానమూర్తిగా చేసిన తల్లి ఆదిపరాశక్తి శ్రీకాళీమాత. అదే విధంగా సాంబశివుని గుండెలపైన నిలిచి, ఆ సాంబశివునికి గొప్ప ధైర్యము, సాహసము మరియు అనేక శుభశక్తులను ప్రసాదిస్తూ, అమ్మవారి పాదాలు ఎప్పటికీ శివుని గుండెలపై గుర్తుగా ఉండే వరాన్ని, శివునికి ప్రసాదించింది శ్రీకాళీమాత. భక్తులు అమ్మవారి అనుగ్రహానికి పాత్రులై, ఆ తల్లి వారిని అనుగ్రహించాలని సంకల్పించినప్పుడు, లెక్కించటానికి వీలుకాని ఎన్నో బాగా మండుతున్న అగ్నిమండలాలలో ఒక్కొక్క జ్వాలలో, ఒక్కొక్క అగ్నిశిఖలో, ఒక్కో రూపంతో, అనగా వివిధ రకాలైన రూపాలతో దర్శనమిస్తూ సాధకులను సంతోష పెడుతూ ఉంటుంది. సాధకులు ఎవరైనా, వారి ఆశయం, సంకల్పం అంతిమంగా శ్రీకాళీమాతను దర్శించాలనే ఉంటుంది. వారి ఆశయాలు సిద్ధించడానికి ఆ తల్లి అలా, తన దర్శనభాగ్యాన్ని ప్రసాదిస్తుంది. సకల దేవతలకు నాయకురాలై, వారిని పాలించి రక్షించే పరమాత్మ స్వరూపిణి ఆ తల్లి శ్రీకాళీమాత. ఆ తల్లిని ఆరాధించే భాగ్యం అందరికీ దక్కదు. శ్రీకాళీమాతను ఆరాధించే భాగ్యం దక్కిన వారే అదృష్టవంతులు, వారే అమరులు. అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ శ్రీచరణమూర్తే ! కాళి ! శ్రీవేజెండ్లపురవాసిని ! కోమల స్వరూపిణి !
స్వాయంభువమూర్తే ! స్వప్రకాశిని ! మహాదేవి ! స్వర్ణమండలనివాసిని!
హిరణ్యగర్భ కమలేశ్వరార్చిత పాదపద్మయుగళే ! శ్రీవరకాళి !
నిత్యనీలకంఠేశ్వరార్చనప్రియే ! దేవి ! నిజవరప్రదాయిని ! కాళి !17

తా॥ సకల భోగాలను, అన్ని వైభవాలను, ఈ ప్రపంచంలోని అర్హులైన భక్తులందరకూ ప్రసాదించగలిగిన శక్తి, ఈ ప్రపంచమంత పాదాలు గలిగిన తల్లి శ్రీకాళీమాత. ఆ తల్లి పాదాలలోనే సర్వసంపదలూ, సకల విద్యలూ నిలయమై ఉంటాయి. అవన్నీ ఎప్పుడూ తన్ను పూజించే భక్తులకు అందుబాటులోనే ఉంచుతుంది శ్రీకాళీమాత. వేజెండ్లపురంలో నివసిస్తున్న దేవి, అత్యంత సుందరమైన, సుకుమారమైన, మృదువుగా ఉండే స్వరూపంతో స్వయంగా అవతరించే తల్లి శ్రీకాళీమాత. తనంతట తానే స్వయంగా అద్భుతంగా ప్రకాశించే గొప్పశక్తి కలిగిన దేవి, స్వర్ణమయమైన కాంతులతో శోభిల్లే ప్రదేశంలో నివాసం ఉండే తల్లి శ్రీకాళీమాత. ఆ తల్లి ఎక్కడ ఉంటే ఆ ప్రదేశం, ఆ ప్రాంతం అంతా స్వర్ణమయమై తీరుతుంది. పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల చేత నిరంతరం అర్చించబడే పద్మములవంటి సుకుమారమైన రెండు పాదములు కలిగిన శ్రీవరకాళీమాత, నిత్యమూ పరమశివునిచేత ఆరాధించబడుతూ, ఆనందిస్తూ, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు, కలకాలం నిలిచి ఉండే నిజమైన వరాలను ప్రదానం చేసే వరప్రదాయిని శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శివోపరిస్థిరమూర్తే ! దేవి ! సింహవాహిని ! ప్రచండస్వరూపిణి ! కాళి!**
**దివ్యనిధి శిరోలంబకేశవిలాసిని ! సకలదేవతోద్భవదేహమూర్తే!**
**శ్రీకపాలాకార సుగంధి సుదివ్యామృత పుష్పమాల్యాభరణాలంకృతే !**
**తపోభక్తశిరఃకర సుభూషణ కట్యాభరణధారిణి ! మహాదేవి ! 18**

తా॥ సాంబశివుని పైన ఎల్లప్పుడూ శుభదాయినిగా నిలిచి ఉండే దేవి శ్రీకాళీమాత. పూర్వకాలంలో నాగులకు రాజైన వాసుకి, తన భార్యను వదలివెళ్ళి, శివుని గురించి ఘోరతపస్సు చేశాడు. ఆయన తపస్సుకు మెచ్చిన శివుడు, ఫణీంద్రుని కోరిక మేరకు ఆయనను తన కంఠంలో ఆభరణంగా ధరించాడు. తన భర్త ఈ విధంగా శివుని మెడలో స్థానం ఏర్పరచుకోవటం వలన, ఫణీంద్రుని భార్య, భర్త ఎడబాటుకు ఎంతో చింతిస్తూ, దిక్కుతోచని స్థితిలో ఏమి చేయాలో తెలియక, తన భర్త శివుణ్ణి ఆశ్రయించాడు కనుక, తను అమ్మవారిని ఆశ్రయించి రక్షణ కోరింది. ఎప్పటికైనా, ఎలాగైనా, తన భర్తను చేరుకోవాలని తలంచి, శ్రీకాళీమాతను ఆశ్రయించి, తన బాధను చెప్పుకొన్నది. దయామయి అయిన ఆ తల్లి, ఆమెను

కరుణించి, తన పాదాలవద్ద ఆశ్రయం కల్పించగా, ఆమె, ఆ తల్లి పాదాలకు చుట్టుకొని ఉండి, అక్కడి నుంచే ఆ తల్లిని సేవిస్తున్నది. శ్రీకాళీమాతను సేవించే భక్తులకు కూడా, సకల భోగాలూ సమకూరుతాయనే విధంగా, భక్తులు ఆ తల్లి పాదాలకు చేస్తున్న ప్రతిపూజా, కుంకుమపూలు మొదలైనవి కూడా శ్రీకాళీమాతతో పాటు ఆ నాగరాణికి కూడా చెందుతున్నాయి. శ్రీకాళీమాత పాదాలచెంత ఆమె ఎంతో సంతోషిస్తూ, అత్యంత ఆనంద వైభవాన్ని పొందుతున్నది. అమ్మవారి పాదాలను ఆశ్రయించిన వారికి అనేక సుఖాలు, శుభాలు కలుగుతాయి. అనటానికి ఇది ఒక నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

శివుని మెడలో ఉన్న నాగరాజును, తన పాదాలవద్ద నివాసం ఏర్పరచుకొన్న నాగరాణిని, ఇద్దరినీ కలపాలనీ, భార్యాభర్తలకు ఎడబాటు ఉండకూడదని శ్రీకాళీమాత సంకల్పించింది. దేవదానవ సంగ్రామంలో శివుడు తీవ్రంగా యుద్ధం చేస్తున్నాడు. శ్రీకాళీమాత కూడా శివుడు ప్రార్థించగా, సహాయంగా వచ్చి, రాక్షసులను చంపుతూ ఆనందంతో ముందుకు వస్తున్నది. శివుని మెడలోని నాగరాజుకూడా, శత్రుమూకలపై తన విషప్రభావాన్ని కురిపిస్తూ, అకస్మాత్తుగా, శ్రీకాళీమాత పాదాలకు చుట్టుకొని ఉన్న, తన భార్య అయిన నాగరాణిని చూసి, ఒక్కక్షణం పాటు తత్తరపడి, ఆమెకు కనిపించకూడదనే ఉద్దేశ్యంతో, తాను శివుని మెడలో ఉన్నాననే విషయం మరచిపోయి, వేగంగా ప్రక్కకు తిరిగాడు. ఈ హటాత్ పరిణామానికి సిద్ధంగా లేని శివుడు, నియంత్రణ కోల్పోయి, క్రింద పడిపోయాడు. అదే సమయంలో తీవ్రమైన వేగంతో అటువైపు వస్తున్న ఆదిపరాశక్తి శ్రీకాళీమాత రెండు కాళ్లూ శివుని గుండెలపై పడ్డాయి. ఆ తల్లి పాదాలకు చుట్టుకొని ఉన్న నాగరాణి, శివునితోపాటు క్రింద పడిపోయిన నాగరాజు, ఇద్దరూ ఒకరినొకరు చూసుకొని, ఆ విధంగా కలుసుకొని, శ్రీకాళీమాత ఆశీర్వాదం తీసుకొని తమలోకానికి వెళ్లిపోయారు.

శ్రీకాళీమాత పాదాలు తన గుండెలపై తాకిన మరుక్షణం, శివునికి అమితమైన శక్తి, నూతనోత్సాహం ప్రాప్తించాయి. అప్పటినుంచే శివుడు, ఆ తల్లి పాదాలను తన గుండెపై స్థానంలో ప్రతిష్ఠించుకొని పూజించసాగాడు. ఆ విధంగా ఆకాశంలో ఉన్న దాన్ని, భూమిపై ఉన్నదాన్ని ఏకం చేసి కలపగల శక్తి శ్రీకాళీమాతకే ఉన్నది. భర్తను వదలిన భార్యను, భార్యను వదలిన భర్తను సహించదు. ఇద్దరినీ కలిసి జీవించమని ప్రబోధించే తల్లి శ్రీకాళీమాత.

సింహాన్ని వాహనంగా కలిగిన తల్లి శ్రీకాళీమాత. మృగాలకు రాజు మరియు వాటిలో శ్రేష్ఠమైనది సింహము. భక్తులకు అత్యంత సౌమ్యమైనదిగా సుందరమైనదిగా ఉండే రూపంలో కన్పిస్తూ, అహంకారులకు, దుర్మార్గులకు అతిభయంకరమైన రూపంతోను కన్పించే తల్లి శ్రీకాళీమాత. అద్భుతమైన, శ్రేష్టమైన నిధులున్న శిరస్సు కలిగిన తల్లి, ఆ శిరస్సు నుంచి జలతారు ప్రవాహంవలె నేలను తాకుతూ వ్రేలాడుతున్న అతిసుందరమైన, పొడవైన వెంట్రుకలు, అందుండి వెలువడే సుగంధ పరిమళాలు, ఆ విరబోసుకున్న కేశమాలికలు, సుందరమై, సౌకుమార్యంతో పోటీపడుతున్నట్లుంటాయి. ఆ కేశ సంపద యొక్క నల్లని ఛాయ మెరిసిపోతూ, విలాసంగా కన్పిస్తుంది. లోకంలోని సకల దేవతలు పుట్టడానికి, మూలకారణమైన దేహం కలిగిన శక్తి శ్రీకాళీమాతయే. ఆ తల్లి మెడలోని మాల, కపాలాల ఆకారంలో కన్పించే మంచి గంధంతో కూడుకొని ఉన్న అతిశ్రేష్ఠమైన అమృతపుష్పాలు. అనగా ఎన్నటికీ వాడిపోని, సువాసనలు వెదజల్లుతూ ఉండే పుష్పమాలలను కంఠాభరణముగా ఆ తల్లి, శ్రీకాళీమాత అలంకరించుకున్నది. శ్రీ ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాత, ఎంతో నిష్ఠతో కొన్ని లక్షల సంవత్సరాలు తపస్సు చేసిన భక్తులు, అనగా అమ్మవారి మంత్రాన్ని, నామాన్ని స్మరిస్తూ, ఆ తల్లి పాటలను గానాల రూపంలో పాడుకుంటూ, ఆ దేవి పాదాలను తాకిన వారి శిరస్సులు, అమ్మవారిని అనేక విధాలుగా అలంకరించి, పూజలు చేసి, అర్చనలు చేసి, సేవలు చేసిన చేతులు ఎంతో ధన్యత చెందుతాయి. అందువల్లనే అమ్మవారికి నమస్కరించిన చేతులను, స్తుతించిన శిరస్సులను, శ్రీకాళీమాత, అలాంటి భక్తులను తరింపచేయాలని, గుర్తుగా తన నడుముకు అలంకారంగా, భక్తులు తాము చేసిన పూజలకు, సేవలకు ప్రతిఫలం అన్నట్లు, 'వడ్డాణ' రూపంలో, ఒక ఆభరణంవలె ధరించింది శ్రీకాళీమాత. అమ్మవారి భక్తులైనందుకు వారు ఎంతో అదృష్టవంతులైనారు. నిజమే కదా మరి, ఎందుకంటే ఆ తల్లిని సేవించే భాగ్యం లభించి, శ్రీకాళీమాతను పూజించేవారు ఎంతో అదృష్టవంతులై లోకంలో వాసికెక్కుతారనేది అక్షరసత్యం, మరియు భక్తుల అనుభవసారము. ఈ శ్లోక వివరణ ఎంత గొప్పగా వర్ణించారో, శ్రీగురుదేవులు చూశారు గదా మీరే, అదే గురుదేవుల శక్తి. మహాయుక్తి.

శ్లో॥ శంఖచక్రసనయనాసి ధనుర్బాణ ఛిన్నశిరశ్శూలరుధిర ఆక్షయ పాత్రహస్తే!
గదాఖడ్గాసిత్రాణాయుధపాణిమూర్తే ! అరుణచందన తులసీరుద్రాక్షప్రియే!
పద్మరాగ ప్రవాళమేచక స్ఫటికారుణ శ్వేతగుంజా మాల్యప్రియే ! శ్రీకాళి!
అశ్వత్థ, వట, కదంబ వృక్షచ్ఛాయా జపధ్యానయోగ తపః ప్రియమూర్తే! కాళి! **19**

తా॥ శ్రీకాళీమాత యొక్క దివ్యవైభవరూపం ఈ విధంగా ఉంటుందని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో తెలియచేస్తున్నారు. శంఖము, చక్రము, మంచి కన్ను స్వయంచలిత శక్తి కలిగిన కత్తి అందులో కన్ను లోకంలో ఎవరికీ లేని అత్యద్భుతమైన ధనుస్సు, నిశితమైన బాణము, ఒక చేతిలో రక్తబీజుని శిరస్సు, శూలము, మరొక చేతిలో ఆక్షయపాత్ర, రాక్షసుని శిరస్సు నుండి పడుతున్న రక్తాన్ని పీల్చివేసే ఆక్షయపాత్ర చేతిలో కలిగిన తల్లి శ్రీకాళీమాత. (అక్షయ అంటే వృద్ధి, ఆక్షయ అంటే క్షయము) ఒక్కదెబ్బతోనే శత్రువుని సంహరించ గలిగేశక్తి, సామర్థ్యము కలిగిన గద, ఖడ్గము, పెద్దవిచ్చుకత్తి, భూచక్రమువంటి త్రాణాయుధము, ఇది ఆ తల్లియొక్క ఆయుధ సంపత్తి. తన పది చేతులలోనూ, ఒక్కొక్క చేతిలో ఒక్కొక్క ఆయుధం కలిగిన మహా అద్భుత రూపంతో ఆ తల్లి, తన భక్తులకు కనువిందు చేస్తుంది. ఆ రూపాన్ని దర్శిస్తే ఆ క్షణంలోనే సర్వపాపాలు, అక్కడికక్కడే నశించిపోయి సకల శుభాలు చేకూరతాయి. ఈ ఆయుధాలను ఆ తల్లి వివిధ సందర్భాలలో ప్రయోగిస్తుంది. పైనుంచి పడుతున్న అసంఖ్యాకమైన అస్త్రశస్త్రాలను నిలువరించటానికి అంటే ఆపటానికి, దేవి, త్రాణాయుధాన్ని గొడుగువలె అడ్డుపెట్టి దేవతలను రక్షిస్తూ ఉంటుంది. మరొక విచిత్రమైన శక్తి కలిగిన ఆయుధం కనుదృష్టి కలిగిన కత్తి. అమ్మవారి మీదకు ఏ సమయంలో ఏ ప్రక్క నుంచి, ఎలాంటి ఆయుధాలు, శత్రువులూ రావాలని అనుకొని ప్రయత్నించిన మరుక్షణంలో అంతమొందిస్తుంది. ఈ కన్ను ఉన్న కత్తి. ఆతల్లి చేత ధరించిన మిగిలిన ఆయుధాలుకూడా సర్వశ్రేష్ఠమైన శక్తి మహిమలు కలిగినవి. అలాగే ఆ తల్లి, ఏ విధమైన మాలలద్వారా భక్తులు జపం చేస్తే ఇష్టపడుతుందో కూడా వాటిని శ్రీగురుదేవులు వివరిస్తున్నారు. ఎర్రచందనమాల, తులసిమాల, శ్రేష్టమైన రుద్రాక్షలతో తయారైన మాలతో, కెంపులమాలతో అనగా (మాణిక్యము) (పద్మరాగము) పగడము అనగా (ప్రవాళమాలతో), నీలము అనగా (మేచకము) లేదా (ఇంద్రనీలమణి) స్ఫటికమాల, ఎర్రని, తెల్లని గురివింద గింజలమాల ఇవి జపమాలలుగా సర్వశ్రేష్టమైనవని.

అందువలన పై వాటిలో ఏ మాలనైనా చేత ధరించి, రావిచెట్టు, జువ్విచెట్టు, మఱ్ఱిచెట్టు, మేడిచెట్టు, కదంబచెట్టు – ఈ చెట్ల నీడలో కూర్చొని మంత్రజపం, ధ్యానం, యోగం, తపస్సు చేస్తే ఆ తల్లి ఎక్కువ ప్రీతి చెంది, సాధకులకు అమోఘమైన గొప్ప శక్తులనిచ్చి, వారిని గొప్ప శక్తిమంతులను చేస్తూ మహిమాన్వితమైన వ్యక్తులుగా విశ్వపూజ్యులుగా చేస్తుంది శ్రీకాళీమాత.

**శ్లో॥ దశదిశావిర్భావమూర్తే ! ద్విచరణ నాగాభరణధారిణి ! శ్రీకాళి !**
**అమామిళితరవిజయ భృగువారార్చనామిత ప్రియమూర్తే ! శ్రీకాళి!**
**యథాశక్త్యర్చన ప్రీతే ! కాళి ! స్వార్జితార్చితతోషిణి ! నిత్యశోభితే !**
**శతసహస్రకోటి యోగినీ గణసంసేవితే ! వేజెండ్లపురవాసిని ! 20**

తా॥ పదివైపుల నుంచి ఏ ప్రక్కనుంచైనా, ఏ క్షణంలోనైనా అవతరించి భక్తులకు పరిపూర్ణమైన అనేక శుభాలను చేకూర్చే తల్లి శ్రీకాళీమాత. పదివైపుల నుంచంటే, నాలుగు దిక్కులైన తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాలు. నాలుగు మూలలైన ఈశాన్యము, ఆగ్నేయము, నైఋతి, వాయువ్యము అలాగే ఆకాశము, పాతాళలోకము మొత్తం కలిపి పదివైపులు. రెండుకాళ్లకూ నాగుపాములను ఆభరణాలుగా ధరిస్తుంది శ్రీకాళీమాత, నాగుపాములైన దేవసర్పాలకు తలపైన గొప్పకాంతులను వెదజల్లే అద్భుతమైన 'మణు'లు ఉండేవి. అవి ఎంతో మహిమలు కలిగి ఉండటం వలన, వాటికోసం నాగులను చంపటం ప్రారంభించారు దుష్టులు. వాటికి రక్షణ కరువై జగన్మాతయైన శ్రీకాళీమాతను ఆశ్రయించగా ఆ జాతికి కొంతకాలం రక్షణ కల్పించి ఆ తల్లి తన పాదాలవద్దే స్థిరమైన స్థానం కల్పించింది. అందువలన నాగుపాములు శ్రీకాళీమాత పాదాలకు చుట్టుకొని ఉండి, అవి కదలుతున్నప్పుడల్లా ఆ తల్లి పాదాలకు రాసుకోవటంవలన సువాసనలు ఆ ప్రాంతమంతా వ్యాపిస్తుంటాయి. అలాగే నాగుపాముల తలపై ఉండే మణులవలన వాని నుంచి వెలువడే కాంతివలన పాతాళ లోకంలో ఏమి జరుగుతుందో నాగులు చూడగలుగుతారు. అమావాస్యతో కూడి వచ్చే ఆదివారము, మంగళవారము, శుక్రవారము, ఈ మూడు రోజులలో ఆ దేవిని శ్రీకాళీమాతను పూజిస్తే, ఆ తల్లి ఎంతో సంతోషించి, ఇష్టపడుతూ, వారికి వుండే ఎన్నో కోరికలను తీర్చి శుభాలను ఇస్తుంది శ్రీకాళీమాత. శ్రీకాళీమాతను,

భక్తులు వారి శక్తి కొలదీ సేవిస్తే, సంతోషించి ఆశీర్వదిస్తుంది. భక్తులు స్వయంకృషితో, కష్టపడి సంపాదించిన డబ్బుతో ఆరాధిస్తే ఎంతో సంతోషించి అత్యధిక శుభఫలితాలను ప్రసాదిస్తుంది. ప్రతిరోజూ కొత్తదైన తేజస్సుతో వెలిగిపోతూ ప్రకాశిస్తూ, వందల వేల కోట్ల యోగినీగణాలచేత పూజింపబడుతూ శ్రీవరకాళీమాత వేజెండ్లపురములో దర్శనమిస్తున్నదని, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురు మహరాజ్‌గారు తెలియచేస్తున్నారు.

**శ్లో॥ శ్రీమూలప్రకృతే ! ఈశ్వరి ! శ్రీకాళి ! నిత్యాలంకారప్రియే ! నిగమేశ్వరి!**
**కోటిసూర్యచంద్ర ప్రకాశాతీత తేజోవిరాజిత సుకిరీటధారిణి !**
**సుభక్త సురగణార్తి వీక్షణ శ్రవణ నయన కర్ణమూర్తే ! శ్రీకాళి !**
**ఆపత్కాలోద్భవమూర్తే ! దేవి ! అనేకాద్భుతాయుధావతారిణి! శ్రీకాళి!21**

తా॥ లోకంలోని జీవరాసులన్నింటికీ, వాటి జీవనాధారాలకు ఆధారమై యున్న గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశమనే పంచభూతాలను సృష్టించి ఈ ప్రకృతి పుట్టడానికి మూలకారణమైన తల్లి శ్రీకాళీమాత. అమ్మవారికి అలంకారమంటే ఎంతో ప్రీతి. రకరకాల పుష్పాల మాలలతో అలంకరించి, పూజిస్తూ అలాగే స్వర్ణాభరణాలతో అలంకరించి పూజిస్తే, అమితంగా సంతోషిస్తూ, వెంటనే భక్తుల మనసుల్లోని కోరికలను తీర్చివేస్తుంది. ఆ తల్లి వేదాలకు నాయకి. వేదాలన్నీ ఆ తల్లినే కీర్తిస్తాయి. కోటిమంది సూర్యులు, కోటిమంది చంద్రులు ఒకేసారి ఉదయిస్తే, ఎంత కాంతి వెలువడుతుందో, ఆ కాంతులను మించిన, కాంతిని విరజిమ్మే కిరీటాన్ని ధరించి ఉంటుంది శ్రీకాళీమాత. ఆ కాంతిలో సూర్యునిలోవలె వేడి తీక్షణత ఉండదు, నిండు పౌర్ణమి రోజు నడిరేయి చంద్రునివలె హాయిని గొలుపుతుంది. ఆ కాంతి, భక్తులు చూడలేనంత తీవ్రత ఉండదు. భక్తులు ఆ కాంతిలో, ఆ తల్లి మనోహరమైన సుందర రూపాన్ని ఆపాదమస్తకం ప్రస్ఫుటంగా చూసి తరించగలిగే కాంతి. అంతటి వెలుగులు చిమ్మే కాంతిని భక్తులు తమ మనోదృష్టితో మాత్రమే వీక్షించగలరు. ఆ తల్లి దారిద్ర్య వినాశిని. పేదవారైన తన భక్తులను, స్థితి అంటే భాగ్యమంతులుగా చేస్తుంది. జీవితంలో వారికి ఎలాంటి ఇబ్బందులూ రాకుండా అన్నీ తనే చూస్తుంది. శ్రీకాళీమాత, మంచి భక్తులు దేవగణాల యొక్క పిలుపులను, తను ఎక్కడ ఉన్నా

(భక్తుల మనోభావాల ననుసరించి ఆ తల్లి ఎక్కడ ఉందనుకుంటే అక్కడ) శ్రద్ధగా ఆలకిస్తూ వారిని చూసే కన్నులు, వినే చెవులు కలిగిన దివ్యశక్తి శ్రీకాళీమాత, ఆపద సమయాలలో వారిని ఆదుకొని, రక్షించడానికి, అనేక అద్భుతమైన మరియు ఆశ్చర్యకరమైన ఆయుధాలతో అవతరించి ఆర్తులను భక్తులను కాపాడుతుంది. ఆ తల్లి శ్రీకాళీమాత అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ వరగర్వాసురధ్వంసిని ! వహ్నిజ్వాలోద్భవ సుఫాలనేత్ర స్వరూపిణి !**
**కృపామృతోద్భవాంబుధినిధి! నయన యుగళమూర్తే ! కౌమారి ! శ్రీకాళి!**
**సురాసురనరవందితే ! శ్రీకాళి ! సుందరముఖి ! సహృదయవాసిని !**
**సురసురేతర రక్షణ సుకార్యార్థ స్వజిహ్వా విస్తరణకారిణి ! కాళి ! 22**

తా॥ రాక్షసులు, మానవులు, ఎన్నో వరాలను సిద్ధులను పొంది, వరములు పొందటం మూలంగా ఏర్పడిన గర్వకారణంగా, తమకు ఎదురులేదు, తమను ఎవరూ ఏమీ చేయలేరని విఱ్ఱవీగుతుంటే వారికి ముందుగా, వారు చేస్తున్న చెడుపనుల గురించి మంచిగా చెప్పి, వారు విని చెడుమార్గాలను వీడే విధంగా ప్రబోధం చేస్తుంది. కాని వారు వినక లోకకంటకులవలె మారినప్పుడు, వారిని ఆ తల్లి అణచివేసి, బూడిద చేసే, అతిభయంకరమైన, అగ్నిజ్వాలలను అక్షయంగా కురిపించే నేత్రాన్ని, ఆ తల్లి శ్రీకాళీమాత తన 'ఫాల' భాగంలో కలిగి ఉన్నది. అదే విధంగా 'కృప' అనే అమృతం పుట్టే, సముద్రమంతటి గొప్ప నిధులలాంటి రెండు కన్నులు కలిగిన తల్లి శ్రీకాళీమాత ఆ కంటి దృష్టి సోకితే కాలిబూడిద అయిన వారు కూడా మళ్లీ యధా రూపాన్ని పొందుతారు. అంటే ఆ తల్లి కంటి నుంచి వెలువడే శక్తి కాల్చి బూడిద చేస్తుంది. కాలిబూడిదై పోయిన వారిని తిరిగి బ్రతికిస్తుంది. ఎలాగైనా చేయగలదు శ్రీకాళీమాత అందువలన భక్తులైనా సేవకులైనా ఆ తల్లి అనుగ్రహాన్నే కోరుకోవాలి. అప్పుడు ఆ తల్లి అమృత సమానమైన తన శుభదృష్టిని వారిపై ప్రసరింపచేస్తూ రక్షిస్తుంది కుమారియైన ఆ తల్లి చావుపుట్టుకలు లేనిది. ఎల్లప్పుడూ, శాశ్వతంగా ఉండే అమృతమూర్తి శ్రీకాళీమాత దేవతలు, రాక్షసులు, మానవులచేత నమస్కరింపబడే ముఖవర్చస్సు, మంచి రూపము కలిగిన తల్లి శ్రీకాళీమాత. మంచి వారి హృదయాలలో నివసిస్తూ, దేవతలను ఇంకా ఇతరులైన

మంచివారిని రక్షించటానికి, మంచి కార్యాలకోసం, లోకాలకు మేలు చేయటానికి, ఆ తల్లి, తన నాలుకను స్వయంగా పెంచి, రాక్షసులపీడ తొలగించి అందరికీ మేలును చేకూర్చిన తల్లి శ్రీకాళీమాత. అలాంటి దేవతామూర్తికి ఈ విశ్వంలో సాటి మరెవరూ లేరనే చెప్పవచ్చు అంతటి శక్తి సాహసం ఏ దేవతా మూర్తులకు దేవుళ్ళకు కూడా లేదంటారు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు.

**శ్లో॥ విమలకాంతి విరాజిత వికసిత వదనమూర్తే ! శ్రీవిజయేశ్వరి !**
**సాకార నిరాకారమూర్తే ! వరకాళి ! సదామృదుమధుర సంభాషిణి !**
**సుశీతలామృత సంజీవినీ సమానామృత కరస్వరూపిణి ! శ్రీకాళి**
**మహాబాహుబలమూర్తే ! పారిజాత కుసుమతుల్యదంతపంక్తే ! శ్రీకాళి! 23**

తా॥ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురు మహారాజ్ గారు, శ్రీకాళీమాత, తన భక్తులయెడల చూపించే దయాగుణాలను ఈ విధంగా శ్లాఘిస్తున్నారు. మంచి కాంతితో వెలిగిపోతున్న ముఖము కలిగిన తల్లీ ! సకల విజయాలకూ అధినాయకురాలవైన శ్రీ ఆదిపరాశక్తీ ! ఒక్కొక్క సమయంలో కనిపిస్తూ, అప్పటికప్పుడే మరలా కనుపించకుండా, అదృశ్యమయ్యే శ్రీవరకాళీమాతా ! నీవు అన్నివేళలలోనూ ఎంతో మృదువుగా, మధురంగా, చక్కగా, ఎదుటివారు ఆనందపడే విధంగా మాట్లాడగల శక్తి యుక్తి కలిగిన సర్వసమర్థురాలవు. చల్లని అమృతము వంటి, సంజీవినీ సమానమైన చేతులు కలిగిన శ్రీకాళీమాతా! సంజీవిని, కేవలం మూర్ఛపోయిన వారినే, తిరిగి మేలుకొలిపే శక్తిని కలిగి ఉంటుంది, కాని నీ చేతి స్పర్శతోనే, అందుండి అమృతమయమైన శక్తి వెలువడి, చనిపోయిన వారు కూడా బ్రతికి సంపూర్ణ ఆరోగ్యం పొందగలుగుతారు. అదే నీ చేతులకుండే మహత్తరమైన స్పర్శాశక్తి; శ్రీకాళీమాతను మించిన బలము, శక్తిగలిగినవారు ఎవ్వరూ లేరు. ఇక ముందుకూడా ఉండరు. అంత బలంగలిగిన ఆ తల్లి, పలువరుస మాత్రం, పారిజాత పుష్పాలవంటి శోభను కలిగి, మెరుస్తూ పారిజాత పుష్పాలకన్నా మించిన మృదుత్వంతో అలరారే దంతాలు కలిగిన ఏకైక దివ్యశక్తి శ్రీకాళీమాత, అంటూ శ్రీ గురుదేవులు ఆ తల్లిని ఎంత గొప్పగా వర్ణించి కీర్తిస్తున్నారో మీరే చూడండి కాలస్వరూపిణియైన శ్రీకాళీమాతను వర్ణించి ఆమె లీలలను మహిమలను తెలియచేయాలంటే సంపూర్ణ సాధన చేసిన సద్గురువర్యులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్

గారు, ఒక్కరే సమర్ధులని నాకు అనిపిస్తున్నది. చాలామంది భక్తుల అనుభవం కూడా ఇదే సత్యం ముమ్మాటికి సత్యం.

**శ్లో॥ నీలారుణశ్వేతోత్పల పుష్పయుక్తమాలాలంకృతే ! నీలమేఘస్వరూపే!**
**సూర్యసోమకిరణోద్భవాద్భుత సుమాలాజటామకుటధారిణి ! కాళి !**
**సుసౌరభప్రియే ! సురమందార కుసుమాభరణ దేహధారిణి ! దేవి !**
**ధ్యానసమయ స్వర్ణాకారకేశ సందర్శనాదృష్టప్రాప్తి ప్రదాత్రి ! కాళి ! 24**

తా॥ ఈ శ్లోకంలో కూడా శ్రీగురుదేవులు ఆ తల్లియైన శ్రీకాళీమాతను వర్ణిస్తున్నారు. నల్లకలువలు, ఎర్రకలువలు, తెల్లకలువపూలు కలిపి గ్రుచ్చిన పూలమాలలను అలంకరించుకొని, నల్లటి కారుమబ్బు వంటి మేఘస్వరూపం గలిగిన తల్లీ ! సూర్యచంద్ర కిరణాలు వెదజల్లే ఆశ్చర్యకరమైన మంచి మాలలను జడకొప్పులో ధరించిన తల్లి శ్రీకాళీమాత. అమ్మవారు ధరించిన ఆ పూలమాలలు, ఆ తల్లి మెడలో చేరేసరికి జీవాన్ని పోసుకొని, సజీవమై, ఎప్పటికీ వాడిపోకుండా, గొప్పకాంతులను వెదజల్లుతూ, ఈ లోకాలన్నింటికీ మంచి కాంతిని, సువాసనలను వెదజల్లుతూ ఉంటాయి. అదే అమ్మవారి మహిమ. మంచి వాసనలంటే అమ్మవారికి ఎంతో ఇష్టం. అందువల్లనే భక్తులు ఆ తల్లిని పూజించేటప్పుడు ఎన్నో రకాల సుగంధ భరితమైన పూజాద్రవ్యాలను ఉపయోగిస్తుంటారు. అందువలన ఆ తల్లి మిక్కిలి ప్రీతి చెందుతుంది. దేవలోకాలలో మాత్రమే లభించేవి, దేవమందార పుష్పాలు. అవి అక్కడ మాత్రమే వికసించి, సౌరభాలను వెదజల్లుతుంటాయి. అలాంటి సువాసనలు కలిగిన దేవమందార పుష్పమాలలను అమ్మవారు తన దేహానికి ఆభరణాలుగా ధరించి ఉంటారు అమ్మవారు ధరించిన తరువాత అవి ఎన్ని లక్షల కోట్ల సంవత్సరాలైనా 'ఒడిలి' పోకుండా నిలుస్తాయి. అంటే ఆ తల్లిదరి చేరినవారు ఎవరైనా శాశ్వతకాలం చరిత్రలో నిలిచి ఉంటారనేది శ్రీగురుదేవుల భావం అయి ఉంటుంది. భక్తులకు ధ్యాన సమయంలో, బంగారు రంగుతో మెరిసిపోయే అమ్మవారి వెంట్రుకలను చూసే అదృష్టాన్ని ఆతల్లి కలిగిస్తుంది. అలా దర్శించుకొనే భాగ్యం పొందిన భక్తులకు జన్మచరితార్థమై మోక్షప్రాప్తి కలుగుతుంది. వారే ఈ లోకంలో మహాభాగ్యవంతులు. అలా చేయగలిగిన తల్లి శ్రీకాళీమాత మాత్రమే. అలా దర్శించుకున్నవారు అమరులౌతారు, అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ సుగంధమారుతోద్భవ వరనాసికామూర్తే ! వేజెండ్లపుర వరకాళి !
నాసికారంధ్రోద్భవ సుగంధాస్వాద భాగ్యదాత్రి ! భక్తజనప్రదాయిని !
హర్షవదనారుణాధరాద్భుతమూర్తే ! హయగ్రీవార్చనతోషిణి ! దేవి !
సురకరుణానుగ్రహ సాక్షాత్కారానేకమార్గ ప్రబోధిని ! వరకాళి ! 25

తా॥ మంచి గంధపు పరిమళాలతో కూడిన గాలి పుట్టడానికి వలయు, శ్రేష్ఠమైన సుగంధభరితపు నిధులున్న తల్లి, చూడముచ్చటగా కనిపించే చక్కని ముక్కు కలిగిన తల్లి, శ్రీ వేజెండ్ల గ్రామములో వెలసిన శ్రేష్ఠమైన శ్రీకాళీమాత. ఆ తల్లి ఎప్పుడు ఎటువంటి ఆశ్చర్యకరమైన మహిమలను, లీలలను చూపుతుందో ఆ తల్లికే తెలుసు, లేదా ఆ కాళీమాత ప్రియపుత్రులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికే తెలుసు. వారు అనేక దివ్యమైన మరియు మహత్తరమైన అనుభూతులు పొంది, ఆ అనుభూతులను శ్లోకాలు, పద్యాల రూపంలో అందరికీ తెలియచేస్తుంటారు. పై శ్లోకంలో శ్రీగురుదేవులు చెప్పిన మర్మాలను బాగుగా ఆలోచించి అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. అందుకోసం ఎంతో భక్తి, శ్రద్ధలతో కూడిన సహనము, తెలివితేటలు కావాలి. అమ్మ శ్రీ వరకాళీమాత ముక్కు రంధ్రాల నుంచి వెలువడే మంచి గంధపు అనగా దేవలోకాలలో లభించే అన్నిరకాల దివ్య సుగంధ పుష్పాలనుంచి వెలువడే దివ్యపరిమళాలను మించిన సుగంధపు వాసనలను, ఆస్వాదిస్తూ ఆనంద లోకాలలో విహరించే గొప్ప భాగ్యాన్ని, ఆ తల్లి, తన భక్తులైన వారికి మరియు అమ్మ శ్రీకాళీమాత అవతార మర్మాలను అర్థం చేసుకోగలిగే ఆత్మజ్ఞానులకు మాత్రమే ప్రసాదిస్తుంది. నిరంతరం చిరుదరహాసాలను చిందిస్తూ, ఆశ్చర్యాన్ని కలిగించే ఎర్రని పెదవులు కలిగిన తల్లి శ్రీకాళీమాత. ఆ తల్లి ఆనందంగా ఉంటూ, ఆమెను చూచినవారికి బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తుంది. శ్రీ మహావిష్ణు స్వరూపమైన హయగ్రీవ మహాదేవునిచేత ఆరాధించబడుతూ, తద్వారా ఆమె సంతోషిస్తూ దేవలోకాలన్నింటికీ మేలు చేసే దేవి శ్రీకాళీమాత. భక్తులకు, దేవతల కరుణ అనుగ్రహం కలిగి, దేవతలు ప్రసన్నం కావటానికి, సాధకులకు అనేక మంచి మార్గాలను తెలియచేసే తల్లి శ్రీకాళీమాత అని అంటారు శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

శ్లో॥ సుబ్రహ్మానందానుభూతి ప్రదానకారణ సుస్వరోద్భవ ద్వికర్ణమూర్తే !
శిరోఽరణ్యకేశ వృక్షోద్భవ సుగంధ ధూమాక్షయ నిర్గమనశిరోమూర్తే !
మహామేఘమూర్తే ! దేవి ! మలయమారుతభవకారణముఖి ! కాళి !
త్రికాలార్చన ప్రియమూర్తే ! త్రినేత్ర స్వరూపిణి! త్రిశూలధారిణి ! దేవి!26

తా॥ అన్నింటిని మరచిపోయే, అనగా సుఖాలనూ, దుఃఖాలను కూడా మరచిపోయేటట్లు చేసేదే ఆనందం. అలాంటి బ్రహ్మానందానుభూతిని పొందడానికి ప్రధాన కారణం, మంచి సంగీత స్వరము ఆ స్వరము పుట్టడానికి కారణమైన రెండు చెవులు గల్గిన తల్లి శ్రీకాళీమాత. సంగీతం చెవులనుంచి పుట్టడమనేదే విచిత్రం. అదే గొప్ప మహిమ శ్రీకాళీమాత ప్రత్యేకత. విశ్వంలో అందరికీ స్వరాలు నోటినుంచి మాత్రమే పుడితే, అమ్మవారి చెవులనుంచి మంచి స్వరాలు వెలువడతాయి. ఈ ప్రపంచంలో ఉన్న మానవులు, జంతువులు, పక్షులు, మిగతా అనేక రకాలైన జీవరాశులు, వాటి వాటి భాషలలో అనేక స్వరాలు వినిపిస్తుంటాయి. జాతి వైవిధ్యం వలన ఒక జాతికి చెందిన జంతుజాలాల మధ్య సాగే ఈ స్వరాల ముచ్చట, రెండో జాతి వాటికి తెలియదు, అర్థం కాదు. కాని శ్రీకాళీమాతకు ఈ లోకంలోని అన్ని జీవరాశుల భాషలు, స్వరాలు తెలుసు. ఎందుకంటే వాటన్నింటినీ సృష్టి చేసింది ఆ తల్లే. అందువలన ఆ స్వరాలనన్నింటినీ వినే అమ్మవారు. ఒక చెవితో వాటిని వింటూ, అందులోని స్వరలోపాలను సరిచేసి, శుద్ధిచేసి, రెండవ చెవితో మనకు అనగా అదృష్టవంతులైన మంచి భక్తులకు, సిద్ధులకు, సాధకులకు వినిపిస్తుంది. శ్రీకాళీమాత. అంటే ఆ తల్లి చెవిదగ్గర మన చెవి పెడితే, మనకు సుస్వరమైన మధుర స్వరాలు వినిపిస్తాయి. అమ్మవారి చెవులనుంచి స్వరాలు వినిపించటం అంటే ఇదే. అలాంటి దివ్యానుభూతిని శ్రీగురుదేవులు స్వయంగా చూచి విని తెలియచేశారు. మహారణ్యంలో అసంఖ్యాకమైన వృక్షసంపద ఉన్నట్లుగా, ఆ తల్లి శిరస్సుపై అనేక కేశాలు ఉంటాయి. శిరస్సు అనే అరణ్యంలో, వెంట్రుకలు అనే చెట్లనుంచి నిరంతరము పుట్టి వెలువడుతున్న మంచి గంధపు వాసనలవలె, అమ్మవారి శిరస్సులోని కేశాలనుంచి ఎల్లప్పుడూ అత్యంతశ్రేష్ఠమైన సుగంధపు పరిమళాలు వెలువడుతుంటాయి. మనం తలంటిస్నానం చేసి తలకు వేసుకొనే సాంబ్రాణి పొగ మాదిరిగా, ఆ తల్లి వెంట్రుకల నుంచి దట్టమైన పొగలను తలపించే సుగంధపు

ఆవిరులు ఎల్లవేళలా వెలువడుతుంటాయని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారు, స్వయంగా వీక్షించి, ఆ తల్లి కురులయొక్క మనోహర, సుందర విషయాలను, ఈ శ్లోకం ద్వారా తెలియజేస్తున్నారు. అలా, మంచి గంధపు సువాసనలు వెలువడుతున్న శిరస్సు గల్గిన తల్లి, కారుమబ్బువలె కన్పిస్తున్న దేవి ముఖంనుండి, చల్లని హాయిని కొలిపే చల్లగాలి, అమ్మవారి నోటినుండి, ముక్కు రంధ్రాల నుండి శ్వాస రూపంలో వస్తున్నప్పుడు, ఆ గాలిని పీల్చే అదృష్టవంతులైన భక్తులకు శరీరాలకు మంచిశక్తి, మంచి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఆ అమృతవాయువు పీల్చినప్పుడు, ఆ వాయువు సోకితే మరణానికి చేరువైన వారు మళ్ళీ తిరిగి లేస్తారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు సమయాలలో ఆ తల్లిని అర్చిస్తే ఎంతో ఇష్టపడుతుంది. మూడు నేత్రాలు కలిగిన దేవి, జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలకు సాక్షిగా, దేవతలు, మానవులు వారి అహంకారాలను విడిచినప్పుడు, అలాగే రాక్షసులను కూడా రక్షించడానికి శూలాన్ని ధరిస్తుంది శ్రీకాళీమాత.

**శ్లో॥ నానావిధ దివ్య కుసుమాగ్ని జలోద్భవ నిధిచరణమూర్తే ! శ్రీకాళి !**
**అఖండాద్భుత ప్రకాశాగణితజ్యోతిస్సమానానేక రోమదేహమూర్తే !**
**వివిధపుష్పమాల్యాదిక పరిపూర్ణ మనోభావాత్మార్పణానందమూర్తే !**
**స్తోత్రామృతాభిషేకప్రియే ! శ్రీకాళి! నమస్కార నైవేద్యానందకారిణి! 27**

తా॥ అనేక రకాలైన పుష్పాలు, వాటిమధ్య నుంచి అగ్ని, అగ్ని మధ్య నుంచి జలము, అందుండి పుడుతున్న ఎన్నో నిధులు వున్న పాదాలు కలిగి ఉన్నది శ్రీకాళీమాత. ఇక్కడ జాగ్రత్తగా పరిశీలిస్తే అమ్మవారి పాదాలపై నున్న పూలమధ్యలో అగ్నిజ్వాలలు అగ్నిమధ్యలో జలధారలు పుట్టే అద్భుత నిధులున్న తల్లి శ్రీకాళీమాత అనగా ఆ తల్లికి మనం సమర్పించే పూలనుంచే అన్నింటినీ ఉద్భవింపజేసి మనకు నిధుల రూపంలో ప్రతిఫలాన్ని అందిస్తుందని అర్థమవుతున్నది. ఇలాంటి మహిమలను పరిపూర్ణులైన ఆ తల్లి భక్తులు మాత్రమే చూడగలరు, ఆ అనుభూతిని పొందగలరు. లెక్కించటానికి వీలుకానంత అద్భుతమైన వెలుగుతో, నిరంతరము ప్రకాశించే జ్యోతితో సమానమైన, అనేక జ్యోతుల లాంటి, జ్యోతి శిఖలవంటి వెంట్రుకలు కలిగిన శరీరం కలిగి ఉన్న శ్రీకాళీమాత, అనేక రకాలైన పుష్పమాలలకన్నా ఇంకా ఎంతో అధికమైన మంచిమనసును, శ్రేష్ఠమైన భావనలతో కూడిన ఆత్మను, ఆ తల్లికి త్రికరణశుద్ధిగా

అనగా మనసా, వాచా, కర్మణా సమర్పిస్తే ఆ తల్లి బాగా ఆనందిస్తుంది. ఎంతోమంది భక్తులు నీకు అభిషేకాలు చేసి మహానైవేద్యాలను సమర్పిస్తారు. కాని అలా సమర్పించే స్తోమతలేని భక్తులు కొందరు అభిషేకాలకు బదులుగా అనేక స్తోత్రాలు మాత్రమే చెయ్యగలుగుతారు, అదే విధంగా మరికొందరు నైవేద్యాలు పెట్టలేరు, స్తోత్రాలు చెయ్యలేరు. వీటికి బదులుగా వారు నీకు భక్తితో ఒక్క నమస్కారం చేసినా నీవు సంతసించి, వారికి వరాలను ప్రసాదించే అమృతమూర్తివి నీవే కదా ! తల్లీ ! శ్రీకాళీమాత ! అంటూ ఎంతో గొప్పగా తెలియజేశారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ వాఙ్మయాంతరేతరమర్మప్రబోధిని ! వాచస్పతి బిరుదాద్భుత ప్రదే !**
**దక్షయజ్ఞధ్వంసకారణేశ్వరదేహోద్భవ శ్రీవీరభద్రేశ్వరార్చితే !**
**వసుంధరార్చితే ! దేవి ! వరాహస్వామి నిత్యసంభాషణానుగ్రహరూపే!**
**వీరభక్త జన్మజన్మాంతరానుగ్రహమూర్తే ! వీరనారి ! అనుగ్రహకారిణి! 28**

తా॥ సకల శాస్త్రాలలో ఉన్న మర్మాలే కాకుండా, ఇంకా లోకంలోని ఇతర మర్మాలను ఎన్నింటినో తెలియజేసే పరమాద్భుత గురుమూర్తి శ్రీకాళీమాత. శాస్త్రాలలో మానవ మనుగడకు ముడిపడి ఉన్న అనేక రహస్యాలు, మర్మాలు గోప్యంగా నిక్షిప్తమై ఉంటాయి. మనం చదివితే విన్పించే భావాలు వేరుగా, తరచి చూస్తే వాటిలో అంతర్లీనంగా దాగి ఉన్న విషయాలు వేరుగా ఉంటాయి. అలాగే ప్రతిపని వెనుక అంతరార్థం దాగి ఉంటుంది. వాటిని తెలుసుకొని ఆచరించే తెలివిని లేదా మంచిబుద్ధిని ఆ తల్లి ప్రసాదిస్తుంది. అన్నీ తెలిసిన శ్రీ ఆదిపరాశక్తి, అన్ని వాక్కులను వశం చేసుకోగల శక్తిని, శబ్దబ్రహ్మ బిరుదును పొందడానికి అర్హతను ప్రసాదిస్తుంది. లోకంలో మానవులు ఒకరినొకరు అర్థం చేసుకోవటానికి వారి అవసరాలను తీర్చుకుంటూ భూమిపై మనుగడ సాగించడానికి అవసరమైన ఎన్నో రకాలైన భాషలు ఈ ప్రపంచంలో ప్రాచుర్యంలో ఉన్నాయి. ప్రతిభాషలోనూ ఎన్నో శాస్త్రాలు, గ్రంథాలూ ఉంటాయి. వాటిలో కూడా ఎన్నో నిగూఢ రహస్యాలుంటాయి. మాతృభాష తప్ప వేరే భాషలు తెలియకపోవటం వలన, వాటిలోని కొత్త విషయాలను మనం తెలుసుకోలేము. కాని శ్రీకాళీమాత, తనను ఆరాధించే భక్తులకు అన్ని భాషలను అందరి వాక్కులను వాటిలోని మర్మాలను తెలుసుకొని వాటిని అర్థం చేసుకొనే శక్తిని ప్రసాదిస్తూ, అలాంటి వారికి, వాచస్పతి, శబ్దబ్రహ్మ మొదలగు శ్రేష్ఠమైన

బిరుదులను పొందేటట్లు చేస్తుంది. ఈశ్వరుని ప్రాణేశ్వరి అయిన సతీదేవి, తాను వద్దని వారిస్తున్నా వినకుండా, తన తండ్రి చేస్తున్న యజ్ఞానికి పిలవని పేరంటంగా వెళ్లి అక్కడ తన తండ్రి అయిన దక్షుడు, తన ప్రాణేశ్వరుడైన ఈశ్వరుని తూలనాడటం, సహించలేక, తిరిగి తన ముఖం ఈశ్వరునికి చూపించలేక బాధాతప్తయై ప్రాణత్యాగానికి ఒడిగట్టి, యోగాగ్నిలో తన దేహాన్ని దగ్ధం చేసుకున్నది. అది తెలిసిన పరమశివుడు ప్రళయకాలరుద్రుడై తన జటాజూటం నుంచి వీరభద్రుణ్ణి సృష్టించాడు. వీరభద్రుడు ప్రమధ గణాలను వెంటపెట్టుకొని వెళ్లి దక్షుడు ప్రారంభించి చేస్తున్న యజ్ఞాన్ని విధ్వంసం కావించి వస్తాడు. అలాంటి వీరభద్రునకు, దక్ష యజ్ఞ సమయంలో కాలాన్ని పూర్తిగా అనుకూలింపచేసి విజయాన్ని అందించి వీరభద్రునిచేత ఆరాధించబడినది శ్రీ భద్రకాళీమాత. హిరణ్యాక్షుడనే రాక్షసుడు భూదేవిని అపహరించి పాతాళంలోనికి పారిపోయినప్పుడు, శ్రీమహావిష్ణువుకు వరాహ అవతార రూపం ప్రసాదించి, పాతాళంలో శ్రీవరాహ స్వామితో ప్రతిరోజూ, ప్రతిక్షణం మాట్లాడుతూ, భూదేవి జాడ తెలియజేసిన తల్లి శ్రీకాళీమాత. వీరభక్తులకు ప్రతిజన్మలోనూ, వారిని అనుగ్రహించి దీవించే తల్లి, ఈ కలియుగంలో కూడా వీరనారీమణులైన కొందరు రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి లాంటి వనితా మణులను అనుగ్రహించిన శక్తి శ్రీకాళీమాత. అంటారు శ్రీ గురుదేవులు.

**శ్లో॥ పంచశక్త్యర్చిత ప్రియమూర్తే ! దేవి ! పంచభూతాది ప్రకృతీశ్వరి ! కాళి!**
**దశమహావిద్యాధి దేవతోద్భవ కారణ క్రీడామూర్తే ! భువనేశ్వరి !**
**శచీ అమరేశ్వరార్చితే ! వరుణాగ్ని వాయుసంసేవితే ! వరప్రదాత్రి!**
**అహోబిల పర్వతాగ్రోగ్ర నారసింహస్వరూప సందర్శిని! వరకాళి! 29**

తా॥ శ్రీ విశ్వమాత ఐదురూపాలయిన, శ్రీదుర్గాదేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ సరస్వతీదేవి, శ్రీ సావిత్రీదేవి (గాయత్రి) శ్రీ రాధాదేవిలను ఆరాధించే వారంటే ఎంతో ఇష్టపడుతుంది. శ్రీ ఆదిపరాశక్తి ఆ ఐదు రూపాలు తనవే కనుక అందులో ఎవరిని ఆరాధించినా, చివరకు తనకే చెందుతుంది. ఫలితాన్ని ఆయా తల్లుల రూపంలోనే వారి వారి భావనలకు అనుగుణంగా ప్రసాదిస్తుంది. అదే విధంగా విశ్వంలోని ప్రకృతి అంతా నిండి ఉన్న పంచభూతాలైన గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశములకు మూలశక్తి అయిన ప్రకృతి అధినాయకి శ్రీకాళీమాత. అనగా గాలిలో

ఆ తల్లి శక్తి లేనిదే, జీవులకు గాలి ప్రాణాధారమైన జీవశక్తి కాలేదు, నీటిలో ఆ శక్తి లేనిదే అది జీవజలం కానేరదు, అదే విధంగా అగ్నిలో ఉండే దహించే శక్తికి కారణం ఆ తల్లే, భూమిలో ఆ తల్లి తనశక్తిని ప్రతిక్షేపించకపోతే భూమిపైన చెట్లు, చేమలు, అరణ్యాలు మొదలైనవి పెరగవు. వాటివలన వర్షాలు కురుస్తాయి. వర్షపునీరు భూమిలోనికి వెళ్ళిన తరువాత, ఆ తల్లి శక్తివలన అది జీవజలంగా మారుతుంది. అలాగే ఆకాశంలో ఆ తల్లి శక్తిలేనిదే, పక్షులు మొదలైనవి ఎగరలేవు, మేఘాలు వర్షాలను కురిపింపజాలవు. పంచభూతాలలోను దాగి ఉన్న శ్రీకాళీమాత శక్తి మానవ మనుగడకు ఎంతో అవసరం, ఆ శక్తి లేనిదే మనుగడే లేదు. ఇంకా లోకంలోని పది మహావిద్యలకూ మూలమైన పదిమంది దేవతలను, ఆవిర్భవింపచేసిన తల్లి, శ్రీ ఆదిపరాశక్తి, శ్రీకాళీదేవి, తారాదేవి, త్రిపురభైరవీదేవి, ధూమవతీదేవి, ఛిన్న మస్తాదేవి, త్రిపురసుందరీదేవి, భువనేశ్వరీ దేవి, బగళాముఖీదేవి, మాతంగిదేవి, మరియు కమలాత్మికాదేవి. ఈ విధంగా పదిమంది దేవతలను ఆవిర్భవింప చేసిన తల్లి, శ్రీ ఆదిపరాశక్తి, ఈ భువనానికే అధినాయకురాలు శ్రీకాళీమాత. దశమహావిద్యల దేవతలలో వున్న భువనేశ్వరీ. కాళీమాతలు వేరు, అసలు శ్రీ భువనేశ్వరీ శ్రీకాళీమాత అవతారాలు, వేరు. ఇది అందరూ తెలుసుకోవలసిన రహస్యం. దేవతలలో ప్రముఖులైన శచీ ఇంద్రులచేత, ఆరాధింపబడుతూ శ్రీకాళీమాత, వరుణుడు వాయుదేవుడు, అగ్నిదేవుడు మొదలైన దిక్పాలకులు నిరంతరం ఆ శక్తినే ఆరాధిస్తూ ఉంటారు. అందువలన వారు, నిరంతరం శక్తిమంతులై తమ బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నారు, మరియు ఆ తల్లివారికి అనేక వరాలను ప్రసాదిస్తుంది. లోకకల్యాణం కోసం రూపుదాల్చిన అన్ని అవతారాలూ తనవేనని, తెలియజెయ్యడానికి సంకేతంగా, అన్ని అవతారాలకూ మూలరూపం తానేనని సూచనగా తెలియపరచటం కోసం, యాత్రాకాలంలో శ్రీగురుదేవులకు అహోబిలంకొండపైన, శిఖరాగ్రాన అద్భుతమైన ఉగ్రనారసింహ స్వరూపంతో, అందులో సగం పైభాగం శ్రీకాళీమాతగా, ఆ తల్లి హృదయ స్థానంలో సింహపుతల, ఆ క్రింద నుంచి నరుని రూపంతో కూడిన నారసింహుని రూపం, మొత్తంగా శ్రీకాళీ నారసింహ రూపంగా భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి దర్శనమిచ్చినట్లు పై శ్లోకంలో తెలియచేస్తున్నారు. ఆ రూపాన్ని శ్రీగురుదేవులు శ్రీ వేంకట కాళీ నారసింహరూపంగా

అభివర్ణిస్తుంటారు. ఇంతటి అదృష్టం ఎవరికి కలుగుతుంది కదా మరి, మహా అదృష్టవంతులు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, ఒక్కరేనని నాకు అనిపిస్తున్నది.

**శ్లో॥ అత్రిమహర్ష్యర్చన తోషిణి ! అనసూయాత్ర్యభీష్ట సుసిద్ధి ప్రదాయిని!**
**సుషుప్తికాల స్వప్నాలోచనాచరణానేక కార్యసిద్ధి ప్రదాత్రి ! దేవి !**
**దత్తాత్రేయార్చితానుగ్రహమూర్తే ! ధర్మాచరణమర్మప్రబోధిని ! కాళి !**
**సకలప్రాణి భవాభివృద్ధి మరణ కారణ మర్మజ్ఞాన ప్రదాయిని ! 30**

తా॥ అత్రిమహాముని చేసే పూజలకు సంతోషిస్తూ, ఆ మహర్షి ఆచరించే అనేక విధములైన ఆరాధనలకు ఆనందిస్తూ, అనసూయాదేవి అత్రి మహర్షులకు మంచివి, గొప్పవి అయిన సిద్ధులను ప్రసాదించి, వారి సకల కోరికలను తీర్చిన వరప్రదాయిని శ్రీకాళీమాత. సాధకుల కోరికలు తీరటం అంత సులభమైన విషయమేమీ కాదు. అందుకు వారు ఎంతో కఠోరమైన తపస్సు చేయాలి. అలాంటి తపస్సంపన్నులే ఈ పుణ్యదంపతులు. వీరికి శ్రీకాళీమాత ప్రసాదించిన వరాలను గూర్చి, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తున్నారు. అత్రి అనసూయా దంపతులు గాఢనిద్రా సమయంలో కొన్ని విశేషమైన కలలను కంటూ, అందులో కొన్ని కార్యాలను తాము ఆచరించినట్లుగా అనుభూతులు పొందేవారట. తదుపరి, నిద్ర లేచిన తరువాత చూస్తే, రాత్రి కలలో కన్పించినవి, వారికి భౌతికంగా పూర్తయిపోయి కన్పించేవట. ఉదాహరణకు వారు ఒక కుటీరాన్ని నిర్మించాలని తలంచినప్పుడు, ఆ పని స్వప్నంలో చేసినట్లు కన్పించేది. నిద్రలేచి చూడగానే, ఆ కుటీరం నిర్మితమై వారి ఎదురుగా కన్పించేదట. ఇలాంటి ఎన్నో సిద్ధులను, దేవి వారికి ప్రసాదించినట్లు శ్రీగురుదేవులు తెలియజేసారు. దత్తాత్రేయుని చేత అర్చించబడి, ఆయనను అనుగ్రహించి ధర్మంయొక్క మర్మాలను, వాటిని ఆచరించే మంచి మార్గాలను ప్రబోధించి, అన్ని జీవులు పుట్టటానికి గల కారణాలను, మానవులు కొంతకాలం జీవించి మరణించటానికి గల కారణాలను, ఇంకా కొన్ని జీవులు పుట్టగానే చనిపోవటానికి, మరికొన్ని కొంత కాలం జీవించి మరణించటానికి గల కారణాలు, అలాగే పూర్తి ఆయువు ఉన్నంతవరకు జీవించి తదుపరి మరణించి, మరలా జన్మించటానికి గల అనేకానేక కారణాలను, వాటి వెనుక దాగి ఉన్న

రహస్యాలను ముందుగానే తెలుసుకోగలిగిన అద్భుతమైన మేధాసంపత్తిని, దత్తాత్రేయునికి ఆదిపరాశక్తి శ్రీకాళీమాత ప్రసాదించారని, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, తమ అపూర్వమైన తపశ్శక్తి ద్వారా గ్రహించి ఆ విషయాలను తమ భక్తజనులకు తెలియచేస్తున్నారు.

**శ్లో॥ అగస్త్య లోపాముద్రార్చితే ! అద్భుతానేక గ్రంథరచనాశక్తి ప్రదాత్రి !**
**వశిష్టముని తపోవృద్ధిమూర్తే ! విశ్వవీక్షణాదృష్ట వరప్రదాయిని !**
**మహామంత్ర ధ్యానయజ్ఞ మనోభావోపాసన విద్యాప్రదాయిని ! శ్రీకాళి!**
**విశ్వామిత్రార్చితానందమూర్తే ! యజ్ఞసంరక్షణ మార్గోపదేశదాయిని ! 31**

తా॥ అగస్త్య మహాముని మరియు వారి సతీమణి లోపాముద్ర ఇరువురి చేతా ఆరాధించబడి వారికి, అనేక ఆశ్చర్యకరమైన నాడీ గ్రంథాలను, ఇంకా ఇతర గ్రంథాలనూ రచించే రచనాశక్తిని ప్రసాదించిన తల్లి శ్రీకాళీమాత. ఈ నాడీగ్రంథాల అధ్యయనం వలన ఎవరైన ఒక మనిషియొక్క ఆరోగ్య విషయాలు ఎప్పుడు ఎలాంటి అనారోగ్యాలకు లోనయ్యారు. ప్రస్తుతం ఎలా ఉంది రాబోయే కాలంలో శరీరం ఎలా మార్పు చెందుతుంది, ఎక్కడ పుడతారు ఏ నక్షత్రంలో పుట్టి ఏ పేర్లతో పిలవబడతారు అనే విషయాలు ఖచ్చితంగా అంచనా వేయవచ్చని తెలుస్తున్నది. అలాగే ఒక వ్యక్తిని చూసి లేదా చూడకుండా కూడా అతనియొక్క గతజన్మ రహస్యాలు, పుట్టుకను గురించి, అతని గ్రహస్థితులను గురించి పూర్తిగా చెప్పగలిగే శాస్త్రం, ఒక్కమాటలో చెప్పాలంటే కాలచక్రగతులను తెలుసుకోగలిగేదని అదే నాడీ జ్యోతిష గ్రంథమని నా అభిప్రాయం. దీని సాధన బహుకష్టం. వశిష్ట మహాముని సూర్యవంశపు చక్రవర్తులకు కులగురువు ఆయన గొప్ప తపస్సంపన్నుడు, శ్రీకాళీమాత ఆయనను అనుగ్రహించి, ఆయన తపస్సును అభివృద్ధి చేస్తూ, మహా గొప్ప విద్యలను కూడా ప్రసాదించింది. ఆయన తాను వున్న చోటునుంచే కదలకుండా, ఈ విశ్వాన్నంతటినీ చూడగలిగే అదృష్టాన్ని వరంగా ఇస్తూ, మహామంత్రాలను, అనేక ధ్యానాలను, యజ్ఞాలను, మనసులోని భావనతోనే, ఉపాసనగా సిద్ధించే అద్భుత విద్యను శ్రీ వశిష్ట మహామునికి ప్రసాదించింది శ్రీకాళీమాత. ఈ విధానం ఉపాసనా పద్ధతిలోనే అత్యంత శ్రేష్ఠమైనదిగా పేర్కొనవచ్చు. విశ్వామిత్రుని ఆరాధనకు ఆనందించి, ఆయన చేసే యజ్ఞాలు యాగాలు మొదలైనవి, రాక్షసులు, దుర్మార్గులు పాడు చేయకుండాఎలా

సంరక్షించుకోవాలనే మార్గాలను తెలియజేసింది. శ్రీకాళీమాత అంటూ ఎన్నో గొప్ప గొప్ప రహస్యాలను తెలియచేస్తున్నారు. శ్రీగురుదేవులు.

**శ్లో॥ భార్గవ మహర్ష్యర్చనతోషిణి ! బహువిధ విద్యాప్రదాయిని ! శ్రీకాళి!**
**జనకరాజార్చితే ! కాళి ! జననాడీ గృహీత జ్ఞానశక్తి ప్రదాయిని !**
**జానకీసదనుగ్రహమూర్తే ! కాళి ! జయవార్తా ప్రబోధానందకారిణి !**
**శ్రీరామచంద్రార్చితే ! శీతలోపదేశకారిణి ! దివ్యానందప్రదాయిని! 32**

తా॥ పరశురాముని సేవలకు ఆనందించి, దేవి సంతోషంతో ఆయనకు అనేక విద్యలను దానంచేసిన తల్లి శ్రీకాళీమాత. ఆ అమ్మను చేరాలన్నా, అర్చించి, పూజించి, ఆరాధించాలన్నా ఆ అదృష్టం అందరికీ దక్కేది కాదు. దేవత లందరిచేతా ఆరాధింపబడే దివ్యమైన పాదాలు కలిగిన శక్తి స్వరూపిణియైన శ్రీకాళీమాత. జనకమహారాజు చేత ఆరాధించబడినదై, ఆయన చేసే పూజలకు, సేవలకు అనుగ్రహించి, జనులనాడిని తెలుసుకోగలిగే గొప్ప జ్ఞానశక్తిని వరంగా ప్రసాదించింది. శ్రీరాముని భార్య, జానకీమాతను, రావణాసురుడు అపహరించి, తన లంకానగరంలోని అశోకవనంలో ఉంచినపుడు, భర్త ఎడబాటును, భరించలేక శోకిస్తున్న సీతాదేవిని, శ్రీకాళీమాత అనుగ్రహించి, ఎన్నో సంతోషకరమైన శుభవార్తలను తెలియజేసి, జానకీమాత యొక్క దుఃఖాన్ని ఉపశమనం కావించింది. అలాగే శ్రీరామచంద్రుని చేతకూడా పూజింపబడిన శ్రీకాళీమాత ఆయనకు రామ, రావణ యుద్ధకాలంలో, విజయం రాముడినే వరిస్తుందని, జానకీమాతతో కలసి మరలా శ్రీరాముడు రాజ్యాధికారం చేపడతాడనే, ఎన్నో చల్లటి, శుభకరమైన వార్తలను తెలుపుతూ, శ్రీరామచంద్రుని అనుగ్రహించిన తల్లి శ్రీకాళీమాత. అంటూ శ్రీగురుదేవులు, అసలు రావణుని లంకలో ఉన్నది. సీతాదేవి కాదు, వేదవతి అని కొన్ని గ్రంథాలు చెబుతున్నాయి. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ చైత్రశుద్ధ ప్రతిపత్ పర్వదిన ప్రాతఃకాల దీక్షాచరణ మర్మ ప్రబోధిని !**
**వసంతనవదిన త్రికాలవ్రతాచరణ భక్తరామచంద్రానుగ్రహ మూర్తే !**
**భూపుత్రీరామపత్నీ సందర్శనసంభాషణ భాగ్యప్రదాయిని ! శ్రీమహాదేవి!**
**సీతాన్వేషణాంజనీ పుత్రకార్యసిద్ధిప్రదాత్రి! రావణాహంకార ధ్వంసిని! కాళి! 33**

తా॥ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, దేవీ నవరాత్ర మాహాత్మ్యాలను గురించి తెలియచేస్తూ అవి రెండు రకాలుగా ఉంటాయి, అంటున్నారు. మొదటిది చైత్రమాసంలో వచ్చే చైత్ర నవరాత్రులు, రెండోది ఆశ్వయుజమాసంలో వచ్చే శరన్నవ రాత్రులు. చైత్ర మాసంలో, అమావాస్య తరువాత, మరునాడు వచ్చే పాడ్యమి రోజు నుండి ప్రారంభమయ్యేవే చైత్ర నవరాత్రి ఉత్సవాలు. అదే రోజు యుగయుగాలకూ మూలారంభమైన ఉగాది. అదే యుగ ఆది. అదే సంవత్సరాది. అంటే బ్రహ్మ, జీవుల సృష్టి ప్రారంభించిన పర్వదినము. అందువలన ఆ రోజు నుండే మానవుల విధివ్రాతలలో మార్పులు వస్తాయి, అంటారు శ్రీగురుదేవులు. ఉగాది రోజు నుంచే పంచాంగాలలో జాతకాలను మార్పు చూపిస్తూ, కొత్త పంచాంగాలు వెలువడతాయి. అదే ఉగాది పర్వదినమున, శ్రీ ఆదిపరాశక్తి నేత్రాల నుండి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, సరస్వతి లక్ష్మీ పార్వతీ మాతలు కూడా ఉద్భవించినట్లుగా, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తున్నారు. అంటే, అదే చైత్రశుద్ధ పాడ్యమి, అదే ఉగ + ఆది = ఉగాది కాదు, అదే యుగ+ఆది = యుగాది. అదే చరాచర జీవరాశుల సృష్ఠికి మూలమైన పర్వదినము. ఆ రోజు నుంచే చైత్ర నవరాత్రులు ప్రారంభమై, శ్రీరామనవమితో పూర్తి అవుతాయి. వీటినే చైత్ర వసంత నవరాత్రులు అంటారు. అమావాస్య తరువాత మరుసటి రోజైన 'పాడ్యమి' నుంచే చైత్ర నవరాత్రులైనా, శరన్నవరాత్రులైనా ప్రారంభం అవుతాయి.

ఈ చైత్రనవరాత్రులు అత్యధికమైన, అద్భుతమైన శుభఫలితాలను ఇస్తాయి. పాడ్యమి రోజు నుంచి చంద్రకళలలో మార్పులు సంభవిస్తూ, చంద్రుని వెలుగు దినదిన ప్రవర్ధమానం అవుతూ, పౌర్ణమి రోజునకు పరిపూర్ణమైన నిండుతనాన్ని, నిండైన వెలుగును, కాంతిని వెదజల్లుతుంది. అనగా మానవుని జీవితంలో కూడా అభివృద్ధి, శుభఫలితాలు రోజురోజుకూ వృద్ధి అవుతాయని, అవి పౌర్ణమి నాటి నిండు చంద్రునివలె, నిండైన ఫలితాలను ఇచ్చే స్థాయిలో ఉంటాయని శ్రీగురుదేవులు తెలియ చేస్తున్నారు.

చైత్ర నవరాత్రులను అత్యంత నిష్ఠ, భక్తిశ్రద్ధలతో ఆచరించటం వలన ఏర్పడే అధిక శుభఫలితాలను, శ్రీ ఆదిపరాశక్తి, త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు, ఇంకా దేవ, ఋషి గణాలకు తెలియచేయగా, ఆ వ్రతాన్ని, శివపార్వతుల సలహాతో,

వశిష్ఠుల వారు ఆ దీక్షను పాటించి, దేవి అనుగ్రహాన్ని పొందినట్లు శ్రీగురుదేవులు తెలియచేశారు. ఆ వ్రత విధానాన్నే, వశిష్ట మహాముని, త్రేతాయుగంలో, శ్రీరామచంద్రమూర్తికి తెలియచెప్పగా, రాములవారు, ఆ వ్రతాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉగాది నుంచి ప్రారంభమయ్యే, చైత్రమాస వసంత నవరాత్ర దీక్షను పాటించి, మూడుపూటలా శ్రీఆదిపరాశక్తిని ఆరాధించి, బహువిధములైన వరములను భాగ్యముగా పొందిన వాడైనాడు.

భూదేవి పుత్రికయైన సీతాదేవిని, రావణాసురుడు అపహరించిన తరువాత, సీత జాడ తెలియని శ్రీరాముడు, వసంత నవరాత్రి వ్రతాన్ని ఆచరించిన ఫలితంగా శ్రీరామునికి, అలాగే అంజనాదేవి సలహా మేరకు, చిన్నవయసు నుండే, దేవిదీక్షను పాటిస్తున్న ఆంజనేయునికి, శ్రీ ఆదిపరాశక్తి అనుగ్రహంతో వారికి కార్యసిద్ధి కలిగి, ఆంజనేయుడు సీతమ్మవారిని లంకానగరంలో చూసి, మాట్లాడే భాగ్యం లభించింది. దుష్టుడు, దురాచారుడైన రావణాసురుని దురహంకారాన్ని అణచివేసి, రావణుని సంహరించేందుకు తగిన దివ్యశక్తినిచ్చి, శ్రీరామచంద్రునికి విజయాన్ని ప్రసాదించిన తల్లి శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి విజయకాళికయే.

మానవదేహంలోని నవరంధ్రాలలో ఉండే నానావిధాలైన వికారాలు అదృశ్యం కావటానికి, సకల శుభాలు జరిగి, సుఖసంతోషాలతో జీవించటానికి, మనిషి చైతన్యవంతమైన సత్యమైన అభివృద్ధిని పొందటానికి, నరజన్మను సార్ధకం చేసుకోవటానికి, ఈ చైత్ర వసంత నవరాత్ర దీక్ష ఎంతో దోహదపడుతుంది. అందుచేత ఈ దీక్షను పాటించి భక్తులు భుక్తిని పొందుతూ, సుఖశాంతులతో ఆనందమయ జీవితాన్ని సాగిస్తూ, ఆదిపరాశక్తి శ్రీకాళీమాత అనుగ్రహంతో ముక్తిని పొందాలని, తప్పక పొందుతారని, ఆశిస్తూ నిజమైన భక్తులకు, నిర్వాణమే సంపదగా ఇవ్వమని శ్రీ ఆదిపరాశక్తిని ప్రార్ధిస్తూ ఉంటాను, అంటూ తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు.

**శ్లో॥ అంజనాదేవి తపః కాలానుగ్రహకారిణి! మాతృత్వ మహాయశోభాగ్యప్రదాత్రి!**
**ఆంజనేయార్చనతోషిణి ! లంకానగరాంతర ప్రవేశమార్గ ప్రబోధిని !**
**అసురాద్భుతశక్తి ప్రతాపయుక్తి బలపరాక్రమ మర్మప్రబోధిని !**
**భీషణాకారాసురగణ కుక్షి శిరోబాధామాయా నిద్రావేశకారిణి ! 34**

తా॥ అంజనాదేవి, తనకు పుత్రసంతానం లేకపోవటం వలన, పుత్ర సంతాన ప్రాప్తి కోసం ఘోరతపస్సు చేస్తున్న కాలంలో, ఆమె తపస్సుకు మెచ్చి, అనుగ్రహించి, ఆమెను దీవించి, తల్లి అయ్యే మంచి యోగ్యతను, భాగ్యాన్ని మంచి కీర్తిని వరంగా ప్రసాదించినది శ్రీకాళీమాత. ఆ తరువాత ఆంజనేయుడు జన్మించాడు. ఆయన వరప్రసాది. బాల్యంనుంచీ మహాభక్తుడై ఆ తల్లిని సేవించటం వలన, ఆ తల్లి ఆంజనేయుని ఆరాధనకు సంతసించి, ఆయనకు ఎన్నో మహిమాన్వితమైన వరాలను ప్రసాదించింది. ఆ వరాల ప్రభావంతో అత్యంత శక్తిమంతుడై, బుద్ధికుశలతను పొందగలిగాడు. శ్రీరాముడు సీతా అన్వేషణా క్రమంలో, ఆయనకు అత్యంత ఆప్తుడైన బంటుగా మారాడు. ఆంజనేయుడు జానకీమాత జాడ తెలుసుకోవటం కోసం లంకా నగరం ప్రవేశించే మార్గాన్ని తెలియజేస్తూ, అక్కడ నిరంతరం పహరాకాసే అత్యంత భయంకరులైన రాక్షసుల యొక్క శక్తిని, వారి కుయుక్తులను, తెలివిని, ప్రతాపాన్ని, బలపరాక్రమాలను, వాటిని ఛేదించి ముందుకు వెళ్లే మర్మాలను నిశితంగా ప్రబోధించిన తల్లి మహాశక్తి. శ్రీకాళీమాత. భయంకర ఆకారాలు కలిగిన రాక్షసులు, హనుమంతుని, సీతా అన్వేషణకు అడ్డు రాకుండా వారికి కడుపునొప్పి, తలనొప్పులతో కూడిన మాయారుగ్మతల వలన నిద్రను ఆవహింపచేసి, హనుమంతుని కార్యం సఫలం అయ్యేటట్లు చేసిన శక్తిస్వరూపిణి శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ దేవకీ వసుదేవార్చితే ! యోగమాయే ! శ్రీకృష్ణానుగ్రహమూర్తే ! శ్రీకాళి!**
**వ్యాసమునీంద్రార్చితే ! గాంధార్యభీష్టమృతపుత్రాత్మసందర్శనకారిణి !**
**ఆకాశరాజార్చితే ! దేవి ! ఆమ్నాయాక్షీ స్వరూపోద్భవమూర్తే ! శ్రీఆదిశక్తే!**
**పూర్వవర్తమానభావివాగ్దాన సాక్షాత్కార వ్రతదీక్షాచార్యశ్రీమూర్తే ! 35**

తా॥ దేవకీ వసుదేవులచేత అర్చించబడిన తల్లి శ్రీకాళీమాత. కంసుని సంహరించడానికి శ్రీకృష్ణుడు దేవకి అష్టమ గర్భంలో జన్మించి, గోకులంలో పెరిగి పెద్దవాడవుతున్నాడని, యోగమాయ రూపంలో వినువీధిలో నిలిచి కంసుని హెచ్చరించిన మహాదేవి శ్రీకాళీమాత. తానే శ్రీకృష్ణ స్వరూపమై శ్రీకృష్ణుని అనుగ్రహించిన కృష్ణ స్వరూపిణి శ్రీకాళీమాత. వ్యాసభగవానుని చేత అర్చించబడి, స్తుతింపబడిన మాయాదేవి, మరణించిన పుత్రులవలన శోకంలో ఉన్న గాంధారికి ఆమె పుత్రుల ఆత్మస్వరూపాలను మరలా చూసే భాగ్యాన్ని, గాంధారికి ప్రాప్తింపచేసిన

పరమాద్భుత శక్తిస్వరూపిణి శ్రీకాళీమాత. ఆ తల్లి కరుణించి అనుగ్రహిస్తే కాలి బూడిద అయిపోయిన వారుకూడా, తిరిగి ప్రాణం పోసుకొని, తిరుగ గల్గుతారు. ఈ కలియుగంలో కలియుగ దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి మామగారు, మరియు పద్మావతీదేవి తండ్రిగారైన ఆకాశరాజు చేత అర్చించబడిన దేవి, వారి ఇలవేల్పు, కులదైవం అయిన ఆమ్నాక్షీదేవి స్వరూపంతో, బ్రహ్మదేవుని ప్రార్థనమేరకు ఈ భువిపై అవతరించిన ఆదిపరాశక్తి శ్రీకాళీమాత అమ్మవారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారు. శ్రీ పద్మావతీ అమ్మవారిని వివాహం చేసుకొనే సమయంలో వారు ఇద్దరు నూతన దంపతులు కాబోయే ముందుగా ఆకాశరాజుకు ఇలవేల్పుగా నున్న ఆమ్నాక్షీ స్వరూపంతో నున్న శ్రీకాళీమాతను ముందుగా దర్శించి పూజించి వారు పెళ్ళి మండపానికి వెళ్ళినట్లు యోగంలో కనిపిస్తున్నదని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తున్నారు శ్రీకాళీమాత ఆడిన మాట తప్పని సత్యవాక్కుల తల్లి తాను ఏమి చెబితే దాన్నే చేస్తుంది. పూర్వ జన్మలలో, పూర్వ కాలంలో, ఇప్పుడు ప్రస్తుతం జరుగుతున్న కాలంలో, అలాగే రాబోయే కాలంలో జరుగబోయే వాటిని తెలియచేస్తూ అమ్మవారు చెప్పినవి, చెప్పినట్లుగా జరిగేటట్లు చేసే వ్రతాన్ని దీక్షగా మంచి ఆచారంగా పెట్టుకునే తల్లి శ్రీ ఆదిపరాశక్తియైన శ్రీకాళీమాత. అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీవసుదేవ స్తోత్రానందమూర్తే ! వర్తమానకాల వాస్తవ ప్రబోధిని !**
**నిశీథికాల ద్వారకానగర విహారిణి ! నిరంతర విఘ్న నివారిణి !**
**శ్రీకృష్ణ జన్మాష్టమీ పర్వదినకాల విశేష స్తోత్రార్చనానందమూర్తే !**
**గోసంఘ సంవృద్ధికారిణి ! గోకుల గోపాలబాల సంరక్షిణి ! శ్రీకాళి! 36**

తా॥ వసుదేవుని స్తోత్రానికి ఆనందపడి ప్రస్తుత సమయంలో ఏమి చెయ్యాలో, ఎలా చెయ్యాలో, ఆ కర్తవ్యాన్ని బోధించి ముందుకు నడిపించిన మూలశక్తి శ్రీకాళీమాత. కంసుని మారణహోమం తెలిసిన వసుదేవుడు, శ్రీకృష్ణుడు జన్మించిన తరువాత, ఎలాగైనా కంసుని కంట పడకుండా శ్రీకృష్ణుని తప్పించాలని యోచించి మార్గోపదేశం కోసం శ్రీకాళీమాతను స్తోత్రం చేయగా, ఆ తల్లి వసుదేవునికి దర్శన మిచ్చి, శ్రీకృష్ణుని అక్కడినుంచి గోకులానికి తీసుకొని వెళ్లమని చెప్పి, ఆ కార్యాన్ని ఎలా సానుకూలం చేసుకోవాలో ప్రబోధించింది. తదనుగుణంగా శ్రీకృష్ణుని అక్కడి

నుంచి తరలించే అర్ధరాత్రి సమయంలో, శ్రీకాళీమాత ద్వారకానగరంలో విహరిస్తూ, వసుదేవునికి కాలాన్ని అనుకూలంగా చేస్తూ అక్కడ ఎదురైన దుష్టశక్తులను తన మాయాప్రభావానికి లోను చేస్తూ మరి కొన్నింటిని హతమారుస్తూ అన్ని ఆటంకాలను తొలగింపచేసింది. శ్రీకృష్ణ జన్మాష్టమినాడు, అక్కడ వారు చేసే విశేషమైన పూజలకు స్తోత్రాలకు ఆనందించి, గో సంపదను బాగా వృద్ధి చేస్తూ, గోకులంలో ఉన్న గోపాలకులైన, గోపబాలలను అనేక సందర్భాలలో రక్షించిన తల్లి శ్రీకాళీమాత. వసుదేవుని పూర్వజన్మ తపస్సుకు మెచ్చి వరమిచ్చి ఈ జన్మలో ఆయనకు దర్శనమిచ్చి అనుగ్రహించిన ఆదిపరాశక్తి శ్రీకాళీమాత, అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ నిత్యశోక దుఃఖ కారణాన్యక్షేత్రాశుచిస్థలనివాసాదృశ్యకారిణి !**
**పూర్వవర్తమానకార్యాచరణ ప్రాప్తి పుణ్యక్షేత్ర నివాస భాగ్యప్రదే ।**
**విశ్వవిహార వీక్షణానుభవాధిక విమల యుక్తి ప్రదాయిని ! దేవి !**
**సదానంద జీవన భాగ్యోత్పత్తి మూర్తే ! సర్వదాత్రి ! సద్గురు స్వరూపిణి॥37**

తా॥ ఈ లోకంలో శోకించనివారు, దుఃఖించనివారు దాదాపు ఎవ్వరూ ఉండరేమో. అలా ఉండటానికి కారణాలు అనేకం ఉండవచ్చు. కొన్ని మానసికమైనవి, ఇంకా కొన్ని శారీరకమైనవి, మరికొన్ని పూర్వజన్మలలోని కర్మల ఫలితంగా సంక్రమించేవి కావచ్చు. వాటిలో కొన్ని మనోనిబ్బరంతో నిగ్రహించగలిగేవిగా ఉన్నా, ఇంకొన్ని స్వయంకృతాపరాధాల వలన వచ్చేవిగా ఉండవచ్చు. కొంతమంది నివశించే ప్రదేశాలు నివాస యోగ్యం కానివిగా, లోపభూయిష్టంగా, అనారోగ్యాలను విస్తరింప చేసేవిగా ఉండి, ప్రతినిత్యం అనేక బాధలను ఉద్భవింప చేస్తుంటాయి. అవి ఎలా ఉండవచ్చునంటే  మురికి కాల్వల ప్రక్కన, చెత్తకుప్పలు నిల్వ ఉంచే ప్రదేశాలు, అశుద్ధస్థలాలు, ఏ విధంగానూ  మానవ నివాసయోగ్యం కాని ప్రదేశాలలో ఉండవలసి వస్తుంది. అందువలన అలాంటి వారికి, ప్రతినిత్యం ఏదో ఒక సమస్య చుట్టుముడుతూ, అనారోగ్యాలతో, ఎన్నో బాధలకు గురౌతూ కాలం గడుపుతూ ఉంటారు. శ్రీకాళీమాతను ఎల్లప్పుడూ పూర్తి విశ్వాసంతో నమ్మి కొలిచే వారికి, ఆ తల్లి పైన చెప్పిన ప్రదేశాలలో నివసించవలసిన అగత్యం రానీయక, అలాంటి దుస్థితిని సమూలంగా రూపుమాపి వారికి, మంచి, పుణ్యప్రదమైన, ఆరోగ్యకరమైన మరియు ప్రకృతి ఒడిలో ప్రశాంతత లభించే ప్రదేశాలలో నివసించగలిగే ప్రాప్తాన్ని,

భాగ్యంగాను, వరంగాను అమృతమూర్తియైన శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. పూర్వజన్మలలో మరియు ప్రస్తుత జన్మలో, మంగళకరమైన, శుభప్రదమైన, పుణ్యప్రదమైన, మరియు లోకకళ్యాణం కోసం చేసే పనులవలన, ఆ తల్లి సంతృప్తి చెంది, అలాంటి వారికి, పుణ్యస్థలాలలో అనగా దేవాలయ ప్రాంగణాలు, సద్గురువుల సన్నిధి, యజ్ఞాలు, హోమాలు నిర్వహించే ఆశ్రమాలు సాధువులు సత్పురుషులు, కారణజన్ములు మొదలైన మహాసిద్ధపురుషులు నివశించే అతిపవిత్రమైన స్థలాలలో నివశించే యోగ్యతను, దేవి, తమ భక్తులైన వారికి ప్రసాదిస్తుంది అనడానికి ఎలాంటి సందేహం అక్కరలేదు. చాలామంది లోకంలో ఉన్న దేవాలయాలను, పుణ్యస్థలాలను, తీర్థాలను, ఇంకా అనేకానేక ప్రదేశాలను సందర్శిస్తూ కొంత అనుభవాన్ని, జ్ఞానాన్ని పొందుతూ ఉండవచ్చు. కాని, ఎవరైనా ఈ విశ్వమంతా తిరిగి చూసినవారి అనుభవం కన్నా శ్రీకాళీమాత తమ భక్తుల మదిలో స్థిరనివాసం ఏర్పరచుకున్నప్పుడు, వారికి, అంతకు మించినటువంటి, అధికమైన మంచి తెలివిని, జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. నిరంతరము, ప్రతినిత్యము ఆనందంగా జీవించేటటువంటి భాగ్యాన్ని, క్షణ, క్షణానికీ అభివృద్ధి చేస్తూ ఉంటుంది. అదే విధంగా ఆ తల్లి అన్నింటిని దానం చేయగలిగి నటువంటి సర్వసమర్థురాలు. అనగా మానవులు వస్త్రదానం, సువర్ణదానం, గోదానం, భూదానం, అన్నదానం మొదలైన దానాలు ఎన్నైనా చేయవచ్చు. కాని మానవులు చేయలేనిది ఒక్కటే. అదే ప్రాణదానం. అలాంటి అతివిలువైన ప్రాణాన్ని దానంగా ఇవ్వగలిగి నటువంటి తల్లి, శ్రీ ఆదిపరాశక్తి, శ్రీకాళీమాతయే. ఆ తల్లియే, అన్ని లోకాలకు, అందరకు సద్గురు స్వరూపిణి ఐనటువంటి తల్లి శ్రీకాళీమాత, అంటూ శ్రీగురుదేవులు పై శ్లోకంలో అద్భుతంగా తెలియచేశారు.

**శ్లో॥ సత్ప్రవర్తన సుజనాధ్యాత్మ విద్యాభిలాషా దీక్షాప్రవృత్తి భాగ్యప్రదాయిని !**
**సుసంస్కారాలోచనా సుబుద్ధి సురగుణ నిత్యోత్పత్తి శ్రీమూర్తే ! సుహృత్పోషిణి।**
**బాహ్యాచరణానేకకుకర్మఫల స్వప్నకాలానుభవ వరప్రదాత్రి ! కాళి !**
**సత్కార్యాచరణ భక్తాయుః ప్రమాణకాలాద్భుత ప్రశాంత జీవన ప్రదాయిని॥ 38**

తా॥ పై శ్లోకంలో శ్రీగురుదేవులు, శ్రీకాళీమాత యొక్క విశేషమైన సుగుణాలను ప్రస్తావిస్తున్నారు. మంచి నడవడిక కలిగిన అనగా మాట్లాడే మాటలలో మంచితనము, చేసే పనులలో అందరికీ మంచి జరగాలనే ఆశయము కలిగి ఉన్న మంచి జనులకు,

ఆధ్యాత్మిక విద్యలయందు మంచి ఆసక్తిని, బాగా ఇష్టాన్ని కలిగించి, అలా ఏర్పడిన ఆసక్తిని, ఇష్టాన్ని వారు బ్రతికి ఉన్నంతవరకూ దీక్షగా పాటించే గొప్ప భాగ్యాన్ని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. అలాగే మంచి సంస్కారము, మంచి ఆలోచనలు, మంచి బుద్ధి అంటే, ఈర్ష్యాద్వేషాలు లేకుండా, అందరియందూ ప్రేమ భావంతో ఉండే మంచి గుణాలను, అనగా దేవతలకు ఉండే గొప్ప గుణాలను, స్వార్థబుద్ధి లేకుండా, త్యాగబుద్ధిని నింతరమూ పెంచి పోషించే తల్లి శ్రీకాళీమాత. మంచి భక్తుల హృదయాలలో, అనగా ఆ తల్లిని విశ్వాసంతో నమ్మి కొలిచే మంచి భక్తుల హృదయాలలో నిలిచి ఉండి, ఆ భక్తులను అన్నివేళలా పోషిస్తూ ఉంటుంది. మానవులు తమ దైనందిన కార్యక్రమాలలో తెలిసి తెలియక చేసిన అనేక చెడ్డపనుల యొక్క చెడ్డ ఫలితాలను ఆ దేవి, తమ భక్తులు బాహ్యంగా అనగా భౌతికంగా అనుభవించకుండా, అలాంటి బాధలను స్వప్నాల ద్వారా అనుభవింపచేస్తుంది. ప్రతి మంచి పనికీ మంచి ఫలితం ఉన్నట్లే, చెడ్డపనికి కూడా చెడు ఫలితాన్ని అనుభవించేటప్పుడు మానసికంగా, శారీరకంగా ఎంతో బాధను, అవమానాన్ని అనుభవించవలసి వస్తుంది. అలాగే ఆ బాధ, అవమానం మాయనిమచ్చగా ఎంతో కాలం ఉండవచ్చు. కాని, మంచి భక్తులైన వారు అలాంటి బాధలను, అవమానాలను భౌతికంగా అనుభవించకుండా, వారు నిద్రపోయేటప్పుడు, ఆ బాధలను కలలో అనుభవించే గొప్ప వరాన్ని ప్రదానం చేసే తల్లి శ్రీ ఆదిపరాశక్తి శ్రీకాళీమాత. మంచి పనులు అంటే దైవకార్యాలు, పరోపకారమైన మంచి పనులు చేసే భక్తులు, వారు బ్రతికి ఉన్నంత కాలం విచిత్రమైన, ఆనందమయ జీవితాన్ని గడిపే అదృష్టాన్ని ప్రశాంతతను, శ్రేష్ఠులైన తన భక్తులకు ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత, అంటూ తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీ వరాదిమూర్తే ! అధికజన్మాదృష్టాలయ నిర్మాణశక్తి ప్రదాయిని !**
**గర్భాలయాంతర్భాగ ధ్యాన యోగాసన సిద్ధ్యర్చనాదృష్టప్రాప్తి ప్రదాత్రి !**
**భూతభవిష్యద్వర్తమాన కాలధర్మసందర్శనభాగ్యప్రదాత్రి ! దేవి !**
**నిత్యకుసుమార్చనానందమూర్తే ! దేవి! సదా సంతృప్తిప్రదాయిని! కాళి! 39**

తా॥ ఎన్నో జన్మలలో చేసుకున్న పుణ్యం సమకూరటంవలన ఈ జన్మలో శ్రీకాళీమాతను పూజించాలనే జ్ఞానం కలుగుతుంది. అలా లభించిన జ్ఞానంవలన

మరల ఎన్నెన్నో జన్మలలో ఆ తల్లి శ్రీకాళీమాతను ఆరాధించుకుంటూ వస్తే, తదుపరి జన్మలో, లభించిన పుణ్యరాశివలన ఆ తల్లికి దేవాలయాన్ని నిర్మించాలనే కోరిక కల్గుతుంది. ఆ కోరిక ఆ జన్మలో తీరక మరికొన్ని జన్మలు శ్రీకాళీమాత సేవలో తరిస్తూ వస్తే ఆ తరువాత వారి కోరిక నెరవేర్చి, వారికి దేవాలయాన్ని నిర్మాణం చేసుకునే భాగ్యాన్ని కల్గిస్తుంది శ్రీకాళీమాత. లెక్కలేనన్ని జన్మలనుంచీ శ్రీకాళీమాతను ఆరాధిస్తూ వస్తే, ఆ తల్లి అనుగ్రహించి తన దివ్య దేవాలయ నిర్మాణానికి తనే పూనుకొని, అన్ని హంగులూ ఏర్పరచి, ఆ కీర్తి ఆ భక్తులకి లభించేటట్లు చేస్తుంది ఆ తల్లి శ్రీకాళీమాత. దేవాలయ నిర్మాణం కావించడానికి ఎన్నెన్నో జన్మల పుణ్యఫలం అవసరమైతే, మరి దేవాలయాన్ని నిర్మించి, స్వయంగా ఆ తల్లి శ్రీకాళీమాతను ప్రతిష్ఠ చేయడానికి ఎంతశక్తి కావాలి, ఎంత పుణ్యం కావాలి, ఎన్ని వందల వేల జన్మల నుంచీ శ్రీకాళీమాతను విడవకుండా పూజిస్తూ రావాలి, అనే విషయాన్ని ఊహించటం చాలా కష్టం. సాధారణ తపస్సంపన్నులకది సాధ్యం కాదని తెలుస్తుంది. అసాధారణ శక్తి సంపన్నులలో కూడా ఉత్తమోత్తమ గుణసంపన్నులై వందలవేల సంవత్సరాలలో చాలా తక్కువమంది మాత్రమే ఉండవచ్చు. అలాంటి వారే భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. వారు శ్రీకాళీమాత ఆలయాన్ని స్వయంగా నిర్మించి, ఆ తల్లిని స్వయంగా ప్రతిష్ఠ చేశారు. లోకంలో పేరుగాంచిన శ్రీకాళీమాత భక్తులు వారే స్వయంగా ఆ తల్లిని ప్రతిష్ఠించి పూజించిన దాఖలాలు చాలా అరుదు. అంతటి అద్భుతశక్తి కలిగి, శ్రేష్ఠాతిశ్రేష్ఠమైన సుగుణ సౌశీల్యంతో వెలుగొందుతున్న వేజెండ్లలో నున్న శ్రీగురుదేవులు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు సాక్షాత్తూ శ్రీకాళీమాత స్వరూపమేనని, నా అనుభవాల సారంవలన గ్రహించ గలిగాను. వారి వద్దకు చేరి, వారి సేవ చేసుకోవడానికి నా పూర్వ పుణ్యఫలం కూడా నాకు తోడై సహకరించిందని భావిస్తున్నాను. వారు అనుగ్రహిస్తే శ్రీకాళీమాత అనుగ్రహించినట్లే.

శ్రీవరకాళీమాత ఎంతటి కరుణామూర్తో చూడండి భక్తులు ఎలాంటి పూజలు చేసినా ఆ తల్లి మనసు పొంగిపోయి, సంతసించి వరాలను కురిపిస్తుందని శ్రీగురుదేవులు పై శ్లోకంలో తెలియజేస్తున్నారు. అనేక శుభకరమైన వరాలను ప్రసాదించే తల్లీ ! అనేక జన్మలలో మంచి పనులను చేస్తే వచ్చే పుణ్యఫలం వలన

నీ ఆలయాన్ని కట్టించే అదృష్టాన్ని నీ భక్తులకు నీవు భాగ్యంగా ప్రసాదిస్తావు. అప్పుడు కూడా నీ ఆలయాన్ని ఎలా కావాలో అలా నీవే రూపకల్పన చేసి భక్తులద్వారా అదే విధంగా నిర్మింపచేసుకుంటావు. పరమాద్భుతాలకు ఆవాసం అయి ఉండే విధంగా వేజెండ్లలోని నీ గుడిని శ్రీగురుదేవులచేత అలాగే నిర్మింప చేసుకున్నావు. చూపరులకు సాధారణ దేవాలయం వలె కన్పిస్తూ, భూ అంతర్భాగంలో ఏర్పాటు కావించిన భూగర్భసమాధి, పంచశిరస్సుల ఆదిశేషుడు, సప్తశిరస్సుల ఆదిశేషుడు, శ్రీగురుదేవుల యోగనిద్ర కోసం శేషపాన్పు మొదలైనవి ఇక్కడ తప్ప, భూగర్భంలో వేరెక్కడా కన్పించవు. నీ ఆలయ గర్భాలయంలో ధ్యానము, యోగము చేస్తున్న శ్రేష్ఠ భక్తులకు ఆసన సిద్ధులను ఆశువుగా ప్రసాదిస్తావు. అదే విధంగా, ఎల్లప్పుడూ నిన్ను అర్చించి, పూజించే భాగ్యాన్ని ప్రసాదిస్తావు. ఆ సమయంలో వారికి నీ దివ్య మంగళ స్వరూపాన్ని దర్శించే అదృష్టాన్ని కల్గిస్తావు. గడచిపోయిన కాలమర్మాలను, ప్రస్తుత కాలంలో జరుగుతున్న కాలమర్మాలను, రాబోవు కాలంలో జరుగబోవు కాలచక్రమర్మాలను ధర్మాలను, భక్తులు తెలుసుకునే అదృష్టాన్ని కల్గించే తల్లివి నీవు. ప్రతిరోజు లభించిన మంచి సువాసన కలిగిన పూలతో పూజిస్తే ఎంతో ఆనందిస్తూ ఆమెను పూజించిన భక్తులను ఆనందింపచేసే అమృత స్వరూపిణి శ్రీకాళీమాత. తన భక్తులకు అతి ఆశలను తొలగించి మాకు ఉన్నది చాలు అనే ఉత్తమబుద్ధిని ఉన్నత భావాలను అభివృద్ధి చేస్తూ అన్నివేళలా తృప్తిని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ ప్రవృత్తినిర్వహణ కాలాగణితక్లేశాదృశ్యకారిణి ! ధర్మప్రబోధిని !**
**అతిదుర్లభాధ్యాత్మికామృత ప్రబోధ శ్రవణాదృష్ట ప్రాప్తిప్రదాయిని !**
**భూగర్భాంతర పంచశీర్ష శేషతల్పాగ్రశయనకాల ప్రత్యక్షమూర్తే !**
**శ్రీమహా మంత్రోపదేశకారిణి ! జన్మధన్యత్వోపయోగవాక్య ప్రబోధిని!40**

తా॥ తల్లీ ! శ్రీకాళీమాతా ! నిన్ను నమ్మిన భక్తులు వారు చేస్తున్న వృత్తిపరమైన భుక్తిపరమైన వ్యాపారపరమైన మొదలైన అనేక పనులలో వచ్చే అనేకమైన కష్టాలను, ఆటంకాలను తొలగిస్తూ, వారికి వృత్తిధర్మాన్ని, అది సక్రమంగా నెరవేర్చితే కలిగే తృప్తిని, ఉపయోగాలనూ తెలియజేస్తూ, ఎంతో కష్టమైన, శ్రమకోర్చవలసిన, ఆధ్యాత్మిక పరమైన, అమృత సమానమైన ప్రబోధాలను వినే అదృష్టాన్ని, అవకాశాన్ని ఏ

కొద్దిమంది భక్తులకో ప్రసాదిస్తూ ఉండే తల్లివి నీవే కదా ! నిన్నే నమ్మి, పరిపూర్ణమైన విశ్వాసంతో, నిన్ను ధ్యానిస్తూ, ఆరాధించే, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకటకాళీకృష్ణ గురుమహరాజ్ గారికి, అనేక అత్యద్భుతమైన దివ్యానుభూతులను ప్రసాదిస్తూ, భూగర్భంలోని శేషపాన్పుపై, వారిని పవళింపచేసి, ఆ సమయంలో నీవే శ్రీగురుమాత రూపంలో భూగర్భంలో ప్రత్యక్షమై, శ్రీగురుదేవులకు శ్రీ మహా మంత్రోపదేశం చేశావు. అలాగే మానవులజన్మ చరితార్ధం కావటానికి ఉపయోగపడే ఎన్నో మహామంచి వాక్యాలను ప్రబోధించిన సద్గురుమూర్తివి నీవే కదా ! తల్లీ ! శ్రీకాళీమాతా ! శ్రీగురుదేవులు భూగర్భ సమాధిలో ధ్యానమాచరిస్తున్నప్పుడు శేషపాన్పుపై యోగనిద్రలో ఉన్నప్పుడు, వారిని దర్శించుకున్న వారు ఎంతో అదృష్టవంతులు, ఆ భక్తులకు సాక్షాత్తూ శ్రీకాళీమాత అమ్మవారి నిజదర్శన ప్రాప్తి మరియు పుణ్యఫలం కలుగుతాయి. ఈ విధంగా శ్రీగురుదేవులు వారి అనుభవాలను అనుభూతులను శ్లోకాలలో పద్యాలలో తెలియజేశారు.

**శ్లో॥ ఆధ్యాత్మికానేక విద్యామర్మ ప్రబోధన సుజనేంద్ర గణమైత్రి భాగ్యప్రదాయిని!**
**సువిద్యానేక మంత్ర స్తోత్ర సుషుప్తికాల పునశ్చరణాభ్యాసాద్భుత వరప్రదాత్రి!**
**చైతన్యాధార ప్రాణశక్తి దేహాంతర ప్రవేశోచ్చాటనమర్మ సందర్శన భాగ్యదాత్రి!**
**పునర్భావికాల మానవ జన్మేతర జన్మప్రాప్తి కారణాతిరహస్య ప్రబోధిని! 41**

తా॥ ఆధ్యాత్మిక విద్యలు, ఇంకా లోకంలో ప్రాచుర్యంలో ఉన్న అనేక విధాలైన విద్యలయొక్క మెళకువలను, వాటి మర్మాలను ప్రబోధించి, వాటిని సులభంగా నేర్చుకోగలిగే శక్తిని శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. అదే విధంగా మంచి, గొప్పవారు, ఉద్దండులు అయిన పండిత సమూహంలో అత్యంత అగ్రగణ్యులైన వారు, అంతకన్నా మిన్నగా, గొప్పవారుగా వెలుగొందే ఇంద్ర గణాలతో చెలిమిని, సఖ్యతను అనగా స్నేహం చేయగలిగిన అద్భుతమైన భాగ్యాన్ని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. ఇంకా ఉన్నతమైన మంచి విద్యలు, అనేక శ్రేష్ఠమైన మంత్రాలను, విలువైన స్తోత్రాలను, బాహ్యంగా చదవటం, పఠించటమే కాక, సుఖ నిద్రా సమయంలో, అనగా నిద్రలో కూడా చదవటం, మళ్లీ మళ్లీ పఠించటం వంటి విచిత్రమైన వరాలను శ్రీకాళీమాత తన భక్తులకు దానం చేస్తుంది. ఏ జీవులైనా కదలటానికి కావలసినది శక్తి. అదే ప్రాణశక్తి, చలనశక్తి. అలాంటి ప్రాణశక్తి మానవులకు గాని, పశుపక్ష్యాదులకు గాని,

ఇంకా అనేకానేక ప్రాణులకు, ఆ దేహాలలో ఎలా ప్రవేశిస్తుందో, అనగా పుట్టుక, మరలా బయటకు ఎలా వెళ్ళిపోతుందో, అనగా మరణం, అనే అతిగొప్ప, మహామర్మాలను తెలుసుకోవటమే కాక, వాటి వివరాలను మనోనేత్రంతో దృశ్యరూపంలో దర్శించే భాగ్యాన్ని, విజ్ఞానోత్తములైన వారికి ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అలాగే ఈ మానవజన్మ తదుపరి ఎలాంటి జన్మ లభిస్తుంది, ఇంకా ఇతర ప్రాణులైన పశువులు, పక్షులు మొదలైన భూచర, జలచర, ఆకాశచరములైన జీవులకు అవి మరణించిన తరువాత మానవజన్మలు వస్తాయా, లేక ఇతర జన్మలు ఏమయినా వస్తాయా, అలా రావటానికి గల కారణాలు, ఏమిటి అనే అతి గొప్ప రహస్యాలను తెలియచేస్తుంది, శ్రీకాళీమాత.

**శ్లో॥ భూగర్భసమాధ్యంతర్భాగాద్భుతానేక సోమకిరణోద్భవకారిణి ! కాళి!**
**శ్రీచక్రమేరుబిందు స్థానాగ్ర భాగాసనధ్యానయోగ శక్త్యుత్పత్తిమూర్తే !**
**అగణితానేక బ్రహ్మాండ సందర్శనాదృష్ట ప్రాప్తి ప్రదానకారిణి ! కాళి !**
**శేషతల్పాగ్రశయనాధికార ప్రాప్తయోగనిద్రాద్భుతశక్తి ప్రదాత్రి ! 42**

తా॥ శ్రీగురుదేవులు భూగర్భంలో నిర్మించిన సమాధి ఎన్నో విశిష్టతలు కల్గినది. ఆ స్థలంలో, భూగర్భ సమాధి నిర్మాణం కావడానికి ముందు, శ్రీగురుదేవులు, అత్యంత ముఖ్యులైన ఒకరిద్దరు శిష్యులను దగ్గరుంచుకొని యజ్ఞాలు చేసేవారు. ఎందుకంటే భూగర్భంలో బయటకు వెళ్లడానికి ఒకే ఒక్క చిన్నదారి ఉంటుంది. యజ్ఞం తాలూకు వెలువడే పొగలో కూర్చొని, భూగర్భంలో యజ్ఞం చేయటం సాధారణ వ్యక్తులకు సాధ్యంకాదు. పొగంతా నిండిపోయి శ్వాసకూడా అందని పరిస్థితి ఎంతో ప్రమాదకరమైనది. అందువలన యజ్ఞం ప్రారంభం కాగానే శ్రీగురుదేవులు, మిగిలిన వారిని భక్తులను వెలుపలికి పంపించి వేసేవారు. అక్కడ చేసే యజ్ఞం నుంచి వెలువడే వేడిసెగలు, వెలుపలనున్న అమ్మవారి గర్భాలయ ముందు ప్రాంగణం వరకు వచ్చేవి. కాని శ్రీగురుదేవులు చలింపక అపారమైన తమశక్తితో గంటల తరబడి అక్కడే ఉండి యజ్ఞాలను పూర్తి చేసేవారు. అంతటి మహత్తరశక్తి భూగర్భ సమాధిలో ఉన్నది. అక్కడ, లోపల వెలుగు ఉండదు. ఏమీ కన్పించదు. కాని ఎన్నో సందర్భాలలో భక్తులకు భూగర్భ సమాధిలో ఆకస్మికంగా వెన్నెల వెలుగులు కన్పించేవి. అలా చంద్రుని వెన్నెలలు అప్పటికప్పుడే పుట్టించి భక్తులను

ఆశ్చర్యపరచడానికి కారణమైన తల్లి ! శ్రీకాళీమాత! శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి అనేక దివ్యశక్తులను ప్రసాదించి, వారు శ్రీచక్రమేరు బిందుస్థానంపై కూర్చొని ధ్యానము, యోగము చేసే శక్తిని వృద్ధి చేస్తూ, అక్కడినుంచే శ్రీగురుదేవులకు, అనేక బ్రహ్మాండాలను, వారి యోగదృష్టి ద్వారా చూసేఅదృష్టాన్ని ప్రసాదించి అలాగేవారు భూగర్భంలోని శేషపాన్పుపై పవళించే అర్హతను అదృష్టాన్ని ప్రసాదిస్తూ, శ్రీగురుదేవులకు ఎన్నో అద్భుతమైన ఆశ్చర్యకరమైన శక్తులను ప్రసాదించిన మంచి తల్లి శ్రీకాళీమాత !

**శ్లో॥ భూతభవిష్యద్వర్తమాన విషయవాస్తవ సందర్శనాగ్ని భాగ్యదాత్రి**
**పండితేంద్ర ముఖవాక్యశ్రవణానందమూర్తే ! సుస్వరాభివృద్ధికారిణి !**
**సర్వకార్య సాఫల్య నిర్వహణాతులితాద్భుత శక్తిప్రదాయిని ! కాళి !**
**భవిష్యత్కాలానేకావసర దివ్య ప్రణాలికామృతమార్గప్రబోధిని॥ 43**

తా॥ మహాత్ములు నిష్ఠాగరిష్టులైన వారు సుదీర్ఘకాలం అనగా ద్వాదశ వత్సరములు, (12 సంవత్సరములు), అష్టాదశ వత్సరములు (18 సంవత్సరములు), లేదా ఇంకా కొంత కాలం నియమ నిష్ఠలతో నిత్యాగ్ని హోత్రాన్ని ఆచరిస్తూ, తత్ఫలితంగా ఎన్నో అపూర్వమైన దివ్యశక్తులను, మంత్ర సిద్ధులను పొందుతారు. మహోపాసకులైన వారు, భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలో, అంటే పూర్వకాలంలో అనగా, గడచిపోయిన యుగాలైన, కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగాలలో జరిగిపోయిన వాటిని, ప్రస్తుత కాలంలో అంటే ఈ కలియుగంలో జరిగిపోయినవి, జరుగుతున్నవి, మరియు రాబోయే కాలంలో అనగా ముందు రాబోతున్న యుగాలలో కూడా (కలియుగాంతం తరువాత మరలా యుగారంభం సత్యయుగంతో ప్రారంభం అవుతుందనేది శాస్త్రం) జరుగబోయే వాటిని అన్నింటినీ, వారి సంకల్ప మాత్రం చేతనే అగ్నిహోత్రంలో దర్శించగలిగే శక్తి సామర్థ్యాలను, ఆత్మజ్ఞానులైన వారికి ఆ తల్లి శ్రీకాళీమాత ప్రసాదిస్తుందని శ్రీగురుదేవులు ప్రతి సందర్భంలోనూ తెలియ చేస్తుంటారు. అలాంటి అద్భుత శక్తులను, అమ్మవారు, అతినిష్ఠాగరిష్ఠులైన కారణ జన్ములకు ప్రసాదించి, వారిని సిద్ధపురుషులను చేస్తుంది. పురాణ కాలంలో ఇలాంటి కథనాలు దర్శనమిస్తాయి. ఈ కాలంలో కూడా అలాంటి దివ్యపురుషులు చాలా అరుదుగా, తరచి చూస్తేనే గోచరిస్తారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ

గురుమహారాజ్ గారు, వేజెండ్ల గ్రామములో కొలువై ఉన్న, శ్రీ వరకాళీమాత దివ్య కృపాకటాక్షాలను పొంది, త్రికాలవేదులై, అగ్నిహోత్రంలోనే, తమకు అవసరమైన విషయాల యొక్క పూర్వాపరాలను దృశ్యరూపంగా తిలకించగలిగే అద్భుతశక్తి సంపన్నులుగా ఉన్నారు. వారు ఎంతోమంది భక్తుల పూర్వజన్మల కర్మలను అగ్నిహోత్రం ద్వారా దర్శించి, తెలుసుకొని, వారి చెడుకర్మలు కూడా తొలగిపోయే పరిహారాలను సైతం ఆచరింపచేశారు. అందులో నేను కూడా ఒకణ్ణి. నాకైతే గడచిన నాలుగు జన్మలలో నేను ఏమిటి, ఆ జన్మలలో నేను ఎలా ఉండేవాడిని, నా పేర్లు ఏమిటి, మొదలైన అనేక ఆసక్తికర, అద్భుతమైన విషయాలను వివరంగా తెలియ చేశారు. ఇప్పుడు నేను ఆచరిస్తున్న కర్మలను బట్టి, అవన్నీ నిజమేనని తెలుస్తున్నది.

పండితులలో అతిగొప్ప పండితులైన వారి ముఖం నుంచి వెలువడే దివ్యమైన వాక్యాలను విని, ఆ తల్లి ఆనందిస్తూ, వారికి ఇంకా మంచి వాక్కులను, వారి స్వరంలో నిపుణతను నిరంతరం అభివృద్ధి చేస్తూ ఉంటుంది శ్రీకాళీమాత. కొన్ని పనులు చేయాలంటే ఒక్కో పర్యాయం, ఎంతో శారీరక, మానసిక శ్రమ అవసరం అవుతుంది. అలాంటి కార్యాలను ఎలా చేయాలో, ఏ విధంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయో, అనే ఆలోచనలకు ప్రేరణ కల్గించి, వాటిని సులభంగా నిర్వర్తించగలిగే విచిత్రమైన శక్తినిచ్చి, కార్య సాఫల్యతను ప్రసాదించే తల్లి శ్రీ ఆదిపరాశక్తి, శ్రీకాళీమాత రాబోయే కాలంలో అనేక పరోపకారకమైన కార్యాలను అవసరాలను తీర్చుడానికి చక్కని, శ్రేష్ఠమైన మరియు ప్రణాళికాబద్ధత కల్గిన మార్గాలను ప్రబోధించే తల్లి, మహోపకారిణియైన మాతృమూర్తి శ్రీకాళీమాత, అంటూ శ్రీగురుదేవులు పై శ్లోకంలో ప్రవచించారు.

**శ్లో॥ అశ్వత్థ వటప్లక్ష ఉదుంబర వృక్షాగ్ర సుఖాసన ధ్యానసిద్ధిప్రదాయిని !**
**కఫరోగహరౌషధ కర్ణవిద్యాసిద్ధ్యాది ప్లక్షవృక్షాగ్రదర్శిని ! శ్రీకాళి !**
**వృక్షాత్పతనకాలసంరక్షిణి ! దేవి ! సర్వభద్రస్వరూపిణి ! శ్రీమహాదేవి!**
**మహోత్కృష్టాద్భుత కాలజ్ఞానశక్తి ప్రదాత్రి ! కాళి ! ఉదుంబర వృక్షవాసిని! 44**

తా॥ ఈ శ్లోకంలో శ్రీగురుదేవులు రావిచెట్టు, మఱ్ఱిచెట్టు, జువ్విచెట్టు, మేడిచెట్ల యొక్క విశిష్టతలను తెలియజేస్తున్నారు. ఇప్పుడున్న దేవీయజ్ఞశాల ప్రదేశంలో ఇంతకు ముందు ఈ మూడుచెట్లు పెనవేసుకొని, ఒకే వృక్షంగా కన్పించేవి. రాత్రి సమయాలలో

శ్రీగురుదేవులు ఈ వృక్షాలపైనే సుఖాసీనులై మంత్రజపం ధ్యానం ఆచరించేవారు. భయం లేకుండా ఒకే కొమ్మపై స్థిరంగా కూర్చునేవారు. వాటిపై కూర్చొని ధ్యానమాచరించటం చూసిన ఒకరిద్దరిలో నేను ఒకణ్ణి. అది నా భాగ్యం. తెల్లవార్లూ అలాగే ఉండి ధ్యానం చేస్తూ ఎన్నో సిద్ధులను పొందినట్లు తెలుస్తున్నది.

రావి, మట్టి, జువ్వి, మేడిచెట్లపైన సుఖాసనంలో కూర్చొని ధ్యానం చేస్తే అనేక సిద్ధులను ప్రసాదిస్తూ, ఉబ్బసం ఆయాసం వంటి శరీర రుగ్మతలను తగ్గించి వేస్తుంది. కర్ణవిద్యలు సిద్ధిస్తాయి. ఎక్కడో దూరప్రాంతంలో ఉండే వారు మాట్లాడే మాటలు వినగలిగే సిద్ధులనిచ్చే జువ్విచెట్టుపైన దర్శనమిచ్చిన శ్రీకాళీమాత! యజ్ఞాల నిమిత్తం సమిధలకోసం వెళ్లినపుడు, వాటిని సేకరించే క్రమంలో శ్రీగురుదేవులు గాని, ఇతర శిష్యులుగాని ఎన్నోసార్లు చెట్లపైనుంచి పడినపుడు వారికి ఎలాంటి గాయాలూ, ప్రమాదాలూ జరుగకుండా రక్షించి వారికి భద్రతను చేకూర్చిన తల్లి శ్రీకాళీమాత! ఎంతో కష్టమైన కాలగమనాన్ని తెలుసుకొని, ఇతరులకు, స్వయంగా తెలియచేసే అద్భుతమైన కాలజ్ఞానశక్తిని ప్రసాదిస్తూ మేడిచెట్టు పైన నివసించే తల్లి! శ్రీకాళీమాత ! నీవు శ్రీగురు ఆనంద నిలయంలోని చెట్లపైన సూక్ష్మరూపంలో నివసిస్తూ ఒక్క శ్రీగురుదేవులకు మాత్రమే కన్పిస్తూ ఉంటావని, వారిచేత అనేక వాక్కులను పలికిస్తావని నేను అనుభవ పూర్వకంగా చూసి నమ్ముతున్నాను. ఎందుకంటే చాలా సందర్భాలలో శ్రీగురుదేవులు చెప్పే విషయాలు, వారు చెపుతున్నట్లుగా అన్పించవు. ఆ భావావేశం, చెప్పే తీరు గమనించగలిగితే వారిని ఎవరో పలికిస్తున్నట్లుగా అనిపిస్తుంది. ఆ ఎవరో, పలికించేది అని ఆలోచిస్తే శ్రీకాళీమాతే. ఓ తల్లీ ! నన్ను కూడా ఆశీర్వదించమని నిన్ను వేడుకుంటున్నాను. శ్రీకాళీమాత శ్రీగురు ఆనంద నిలయంలో ఎందుకు విహరిస్తుంటారు అంటే అక్కడ శ్రీగురుదేవులు మంత్రజపం చేస్తూ ఎన్నో వేల రోజులు యజ్ఞాలు చేశారు.

**శ్లో॥ ప్రభాసమను సంసేవిత చరణమూర్తే ! యోగసిద్ధ్యర్చనతోషిణి! శ్రీకాళి!**
**సురశిల్పి విశ్వకర్మ ప్రపూజితే ! దేవి! ప్రహ్లాదినీ సంసేవితప్రియే ! కాళి!**
**పరప్రయోగానేక మంత్ర తంత్ర యంత్ర వాయుజలాగ్ని స్తంభన విద్యాప్రదాత్రి**
**విశ్వబ్రాహ్మణ వంశాభివృద్ధికారిణి ! కాళి ! విమలకీర్తి ప్రదాయిని! దేవి!45**

తా॥ ప్రభాసుడు అనే మనువు, అతని భార్య యోగసిద్ధి (ప్రభ) అనే నామాంతరాలు కల్గిన ఈ దంపతులు, దేవశిల్పి విశ్వకర్మ యొక్క తల్లిదండ్రులు. వీరిచేత సేవించి, అర్చించబడిన, పద్మాలవంటి పాదాలు కల్గిన దేవి, యోగసిద్ధి అర్చనతో సంతోషించినటువంటి తల్లి శ్రీకాళీమాత. దేవశిల్పియైన విశ్వకర్మచేత పూజింపబడినటువంటి దేవి, విశ్వకర్మయొక్క భార్య ప్రహ్లాదిని చేత ఆరాధింపబడిన శక్తి శ్రీకాళీమాత. ఆ తల్లి, విశ్వకర్మకు అనేకమైన అద్భుత, మంత్ర, తంత్ర, యంత్ర సంయుతమైన; వాయువు, జలము, అగ్ని మొదలైన ప్రకృతి శక్తులను నియంత్రించి, అవసరమైతే స్తంభింపచేసే మహావిద్యలను ప్రదానం చేసిన తల్లి శ్రీకాళీమాత. విశ్వకర్మ భవనాలు, కట్టడాలు, దేవాలయాలు, నగరాలు, పట్టణాలు మొదలైన వాటిని నిర్మాణం చేస్తున్నప్పుడు, ప్రకృతి ప్రకోపించి జలప్రళయాలు, భీకరమైన గాలులు, మహోదగ్ర అగ్నిజ్వాలలు ఏర్పడిన సందర్భాలలో వాటి నుంచి తమ కట్టడాలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా, వాయువును అనగా గాలిని, నీటిని, అగ్నిని ఆ ఛాయలకు రాకుండా వాటి గతిని స్తంభింపచేసి, తమ నిర్మాణాలను రక్షించుకోగలిగిన విద్యలను, విశ్వకర్మకు శ్రీకాళీమాత ప్రసాదించింది. విశ్వకర్మకు నలుడు, విశ్వరూపుడు అనే ఇద్దరు కుమారులు. సూర్యుని భార్యయగు సంజ్ఞాదేవి, విశ్వకర్మ కుమార్తె. విశ్వకర్మ కుమారులలో ఒకడైన నలుడు సుగ్రీవుని కొలువులో మంత్రిగా ఉండేవాడు. ఈతనికి, తండ్రియైన విశ్వకర్మ, మహాశక్తిమంతమైన, మహాకాళీ శక్తి మంత్రాన్ని ఉపదేశించాడు. శ్రీరాముడు సీతా అన్వేషణలో భాగంగా నూరు యోజనాల సముద్రానికి వారధి నిర్మించవలసి వచ్చింది. అప్పుడు నలుడు, తన తండ్రి, శ్రీకాళీమాత అనుగ్రహం ద్వారా తనకు ప్రసాదించిన, శ్రీకాళీమాత శక్తి మంత్రాన్ని సంకల్పంచేస్తూ, వారధిలో నిర్మాణానికి ఉపయోగిస్తున్న ప్రతి బండరాయిని, తాను ఎక్కడ వేస్తే అక్కడే స్తంభించి, సముద్రంలో తేలే విధంగా స్తంభన విద్యను ప్రయోగం చేశాడు. అలా స్తంభన చేయటం వలన, వారధి నిర్మాణంలోని బండలు, రాళ్లు ఎక్కడ ఉంచినవి అక్కడే స్థాణువులుగా ఉండిపోయాయి. సముద్రంలో ఎన్ని జలప్రళయాలు సంభవించినా, ఆ నీరు ఎంత శక్తితో, ఎంత ఒత్తిడితో ఆ రాళ్లను ఢీ కొట్టినా, రాళ్ల సందుల్లో నుంచి నీరు వెళ్లవలసిందేగాని, ఆ రాతి నిర్మాణానికి ఎలాంటి హాని చేయలేదు. ఆ రాళ్ల మధ్య బంధనాలను ఏ విధంగానూ ఛేదించలేదు. ఇంతటి మహోన్నతమైన శక్తి. శ్రీకాళీమాత శక్తిమంత్రంలో అనేక దివ్యశక్తులు ఉన్నాయని తెలుస్తున్నది. అందువల్లనే

విశ్వకర్మ, శ్రీకాళీమాతను తమ కులదేవతగా ఆరాధించారు. అందుచేతనే విశ్వబ్రాహ్మణ వంశాన్ని వృద్ధి చేస్తూ, వారికి మంచికీర్తిని ప్రసాదించిన తల్లి శ్రీకాళీమాత. విశ్వబ్రాహ్మణులు, శ్రీకాళీమాతను తమ కులదేవతగా ఆరాధిస్తూ ఉండటంవల్లనే, శ్రీకాళీమాత ఆలయాలలో విశ్వబ్రాహ్మణులే, ఆ తల్లికి పూజారులుగా, పూజలు నిర్వహిస్తూ ఉండటం కర్ణాటక రాష్ట్రంలో కనిపిస్తుంది.

**శ్లో॥ నిత్యాగ్నిహోత్రానందమూర్తే ! శ్రీకాళి ! ప్రాణశక్తే ! నిఖిలోత్పత్తికారిణి!**
**నిర్విరామానంద కృషిప్రదాయిని ! కాళి ! నింబవృక్ష నివాసిని ! దేవి !**
**మంత్రజపధ్యాన యోగానందకారిణి ! దేవి ! మౌనసిద్ధిప్రదాత్రి ! కాళి!**
**నిజజీవితానుభవ సుఫలప్రదే ! కాళి ! మహాదేవి ! నిర్వాణేశ్వరి! 46**

తా॥ ప్రతిరోజూ యజ్ఞం చేస్తూ శ్రీకాళీమాత బీజాక్షర మంత్రజపాన్ని చేయటం వలన ఆ తల్లి ఆనందిస్తుంది. అదియును గాక హోమం నుంచి వెలువడే పొగను పీల్చటం వలన శారీరక, మానసికమైన అనేక బాధలు దూరమవుతాయి. ఆ పొగ సోకిన ప్రదేశంలో నున్న సూక్ష్మక్రిములు నశిస్తాయి. ఆ పొగ ఆకాశంలో మేఘాల రూపంలో సమకూడి సకాలంలో వర్షాలు కురవటానికి సహాయపడుతుంది. ఒక యజ్ఞం మూలాన ఇన్ని లాభాలుంటాయి. అందుకే ఆ తల్లి యజ్ఞాలు చేయటంవలన సంతసిస్తుంది. జీవుల ప్రాణాలకు ఆధారమైన ప్రాణశక్తి రూపంలో ఉండే తల్లి శ్రీకాళీమాతే ! ఆ తల్లి ఈ విశ్వంలోని జీవరాశులనన్నింటినీ పెంచి పోషిస్తూ ఉంటుంది. తన భక్తులకు నిరంతరము ఆనందముతో శ్రమపడే శక్తిని ప్రసాదిస్తుంది. అమ్మ భక్తులు ఎంత శ్రమించినా అలసట అనేది ఎరుగక ఇంకా చెయ్యాలనే ఉత్సాహాన్ని కల్గి ఉంటారు. వృద్ధులుకూడా యువకులతో పోటీపడి ఆనందంతో శ్రమిస్తూ ఉండటం గుడిప్రాంగణంలో చూడవచ్చు. శ్రీకాళీమాత వేపచెట్టుపై కూడా నివసిస్తుంది. అందువల్లనే వేపచెట్టులోని ప్రతిభాగానికి ఎన్నో ఔషధ తత్వాలు వచ్చాయి. వేపసర్వ రోగనివారిణి, ఆ తల్లియొక్క అమృత తత్వాలు ఆ చెట్టులో ఉంటాయి. భక్తులకు వారి నిజజీవితాలలో ఏర్పడే అనేక ఒడిదుడుకుల ద్వారా, ఏమి ఆచరించాలి, ఏమి ఆచరించకూడదు అనే జ్ఞాన అనుభవాలను కలిగించి, మంచి ఫలితాలను సాధించే దిశగా వారిని ప్రోత్సహిస్తుంది. శ్రీకాళీమాతా ! మోక్ష సామ్రాజ్యానికి అధినాయకివైన చాలా పెద్ద తల్లివి నీవే కదా ! దేవీ ! నిన్ను నమ్మి

సేవించే భక్తులకు ఆనందము, సంతోషము, తృప్తిని ప్రసాదించి వారికి, మోక్షాన్ని ఇచ్చే శ్రీకాళీమాతవు నీవే తల్లీ ! అంటున్నారు పై శ్లోకంలో శ్రీగురుదేవులు.

**శ్లో॥ సుశీల భక్తజన దేహాలంకారార్చిత ప్రియమూర్తే ! కాళి ! దేవదేవేశ్వరి !**
**సీమంత లలాట, కంఠ, హృదయస్థాన కుంకుమధారణ భక్తసేవితప్రియే!**
**కాషాయ శ్వేతారుణ నీలవస్త్రధారణ సంసేవన ప్రియమూర్తే ! వరకాళి!**
**జగన్మోహిని! దేవి ! జరాఽదృశ్యకారిణి! వృద్ధ జన మనోయౌవన ప్రదాత్రి!47**

తా॥ మంచి బుద్ధి, మంచి ప్రవర్తన, గౌరవము, అభిమానము, పరువు, ప్రతిష్ఠలు ఇతరులను గౌరవించి ఆదరించే స్వభావం, దానగుణం, మంచి నడవడిక మొదలైన మంచి గుణాలు కలిగిన భక్తులు, ఎంతో నిష్ఠతో, శ్రద్ధతో దేహాలంకరణ చేసుకొని, అనగా వారి అలంకరణలో చూసేవారికి భక్తిభావం కన్పించే విధంగా ఉండి అమ్మవారిని ఆరాధిస్తే, శ్రీకాళీమాత ఎంతో సంతోషిస్తుంది. ఆ తల్లి సకల దేవతలకు, దేవుళ్లకు ప్రభువు. ఆ తల్లి పాలనలోనే జగమంతా నిలిచి ఉంది. ఆమెను కాదని లోకంలో ఎవ్వరూ ఏదీ చేయలేరు. ఆ తల్లిని సేవిస్తే అంతా ఆమె చేసి చూపెడుతుంది. ఆ తల్లి మార్గదర్శకంలో నడిస్తేనే జీవితాలు సక్రమంగా నిలుస్తాయి. అలాగే ఆ తల్లిని ఆరాధించేటప్పుడు, ఆమెకు ఇష్టమైన పద్ధతిలోనే చేయాలి. అప్పుడే ఆ తల్లి భక్తులకు సంపూర్ణ ఫలితాన్ని అందిస్తుంది. ఆ తల్లిని సేవించేటప్పుడు స్త్రీ భక్తులు తలపాపిడి దగ్గర, ముక్కుపై భాగాన (లలాటంలో) గొంతుదగ్గర, గుండెపైనా ఎర్రనికుంకుమ బొట్టును ధరించాలి. ఆజ్ఞాచక్రము (భ్రూమధ్యభాగం) విశుద్ధ (కంఠభాగము) మరియు అనాహతము (హృదయస్ధానం) ఉంటాయి. పాపిడి, నుదురు, కంఠము, హృదయ స్ధానాలలో కుంకుమధారణ చేయటంవలన ఆ స్థానాల క్రింద ఉండే భాగాలు రక్షణ పొంది ఉత్తేజితమౌతాయి. ఆరోగ్యం పూర్తి స్థాయిలో లభిస్తుంది. అలాగే భక్తులు కాషాయము, తెలుపు, ఎరుపు నీలవస్త్రాలను ధరించి ఆ తల్లిని నిరంతరమూ సేవిస్తూ ఉంటే శ్రీకాళీమాత ఎంతో ఆనందిస్తుంది. ఈ జగత్తునే మోహింపచేసే శ్రీకాళీమాత, వయసు మళ్లినా ముసలి ఛాయలు లేక, వృద్ధులకు కూడా యౌవనంతో ఉండే మనసును ప్రదానం చేసే తల్లి శ్రీకాళీమాత. అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ విభేద భావాదృశ్యకారిణి ! విశ్వవిహారమూర్తే ! విశాల హృదయేశ్వరి !**
**సమబుద్ధ్యభివృద్ధికారిణి ! సత్యాసత్య ప్రబోధిని ! సామవేద స్తుతి ప్రీతే !**
**సదాకుంకుమార్చన ప్రియతోషిణి ! దేవి ! సర్వకాలోద్భవమూర్తే ! కాళి!**
**జయాపజయ మర్మ ప్రబోధిని ! జయవారప్రీతే ! కాళి ! జగదీశ్వరి ! 48**

తా॥ భక్తులలో ఉండే బేధభావాలను బేదాభిప్రాయాలను రూపుమాపుతుంది శ్రీకాళీమాత. ప్రతి మనిషిలో పుట్టుకతోనే కొంత జ్ఞానం ఉంటుంది. పెరిగేకొద్దీ ఆజ్ఞానం పరిణతి చెంది వారి జీవన పురోగతికి తోడ్పడుతుంది. జ్ఞానం ఎంత పెరిగినా, ఒకరంటే మరొకరికి ఈర్ష్య, ద్వేష భావాలు పెరుగుతూనే ఉంటాయి. నేనే గొప్ప అనే భావం ప్రతివారిలో ఉండటం వల్లనే ఈ విధంగా జరుగుతుంది. కాని అందరికన్నా గొప్పదైన శక్తి శ్రీకాళీమాత అని గ్రహిస్తే ఇవేమీ ఉండవు. అందువల్లనే శ్రీకాళీమాత తమ భక్తులలో బేధభావాలను పూర్తిగా తొలగించి వేస్తుంది. అందరూ ఒక్కటే అనే భావం వారిలో కలిగేటట్లు చేస్తుంది. అన్ని లోకాలూ ఆ తల్లివే, అందువల్లే ఎల్లప్పుడూ అన్ని లోకాలలోనూ విహరిస్తూ భక్తుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు తీర్చుతుంది. భక్తులు ఒక్కోసారి తెలియక తప్పులు చేస్తుంటారు. అలాగే పూజా సమయంలో ఆ తల్లిని సేవించేటప్పుడు అనుకోకుండా అపచారాలు జరిగే సందర్భాలలో వాటిని ఆ తల్లి శ్రీకాళీమాత సహృదయంతో అర్థం చేసుకొనే పెద్ద మనసు కలిగిన తల్లి. లోకంలో అందరినీ అనగా, ఉన్నవారిని, లేనివారిని, పేదవారిని, ధనవంతులను యాచకులను మొదలైన వారినందరినీ తారతమ్యం లేకుండా ఆదరించే గుణాలను అభివృద్ధి చేస్తుంది శ్రీకాళీమాత. ప్రతివిషయంలోనూ నిజానిజాలను తెలుసుకొని జాగ్రత్తగా వ్యవహరించే తెలివిని ప్రసాదిస్తుంది. నాలుగు వేదాలైన ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదాలలో సర్వోత్కృష్టమైన సామవేద మంత్రాలతో కీర్తించటంవలన ఎంతో ఆనందిస్తుంది. నిరంతరం కుంకుమ పూజలు అంటే ఇష్టపడే శ్రీకాళీమాత, అన్ని సమయాలలో, ఏ సమయంలోనైనా ఆర్తిగా పిలిస్తే భక్తులకోసం పరుగున వచ్చి ప్రత్యక్షమవుతుంది. గెలుపు ఓటములను దైవాధీనాలంటారు. కాని అందులోని మర్మాలను తెలియజేసి భక్తులను విజయతీరం వైపుకు నడిపిస్తుంది శ్రీకాళీమాత. మంగళకరమైన, మంగళవారమంటే ఆ తల్లికి మిక్కిలి ప్రీతి. అందువలన మంగళవారంనాడు భక్తులు,

ఆ తల్లికి కుంకుమపూజలు చేస్తే శీఘ్రాతి శీఘ్రంగా కరుణించి వరాలను కురిపిస్తుంది లోకాలన్నింటికి అధినేత్రి అయిన శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీచక్ర రథారూఢమూర్తే ! మహాశక్తే ! శ్రీ విశ్వనగర సంచారిణి ! శ్రీకాళి!**
**పూర్వకాల విశేష సేవార్చన ఫల వర్తమాన బాల్యదశానుగ్రహమూర్తే !**
**తిథివార నక్షత్ర లగ్నరాశి గ్రహదోషాపహారిణి ! దేవివరకాళి !**
**మహోన్నతాశయాభివృద్ధిమూర్తే ! దేవదేవి! మహారాజ రాజేంద్రార్చితే ! కాళి!49**

తా॥ శ్రీకాళీమాత పన్నెండు చక్రాలు ఉన్న స్వర్ణ రథంలో కూర్చొని ఈ విశ్వమంతా సూక్ష్మరూపిణిగా సంచరిస్తూ ఉంటుంది. పన్నెండు చక్రాలంటే పన్నెండు నెలలకు ప్రతీక, పన్నెండు రాశులకు చిహ్నం. ఎవరైనా వీటిలో ఇమిడి జీవించవలసిందే. స్వర్ణ రథంలో సూక్ష్మరూపంలో సంచరించే శ్రీకాళీమాత ఎవ్వరికీ కన్పించకపోయినా అందరూ ఆ తల్లి దృష్టిలోనే ఉంటారు. విశ్వమంతా సంచారం చేస్తూ తన రథంలో ఉండే సిరులను ఆశ్రితులకు కురిపిస్తూ వెళ్తుంది. అన్ని సిరులూ ఆ రథంలోనే ఉంటాయి. శ్రీచక్రమంటే సిరులతో నిండి ఉన్న చక్రం లాంటినిధి అని చెప్పుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ తల్లి స్వర్ణ రథంలో విశ్వసంచారం చేయటం వెనుక పరమార్థం, ఎవరికి కావలసిన సిరులను, సంపదలనూ వారికి పంచుకుంటూ వెళ్లటమే అని నా భావం. ఈ సమయంలోనే భక్తులకు వచ్చే అన్ని ఆపదలనూ తొలగిస్తుంది. పూర్వజన్మలలో భక్తులు చేసిన అనేక సేవలు, పుణ్య కార్యముల వలన, అర్చనలవలన ప్రస్తుత కాలంలో వారిని చిన్నవయసులోనే వారి పుణ్యఫలం వలన, అనుగ్రహించే తల్లి శ్రీకాళీమాత. ఆ తల్లిని పూజించే సమయంలో తిథి,వారము, నక్షత్రము, లగ్నము, గ్రహాలు మొదలైన వాటివలన కలిగే దోషాలను పోగొడుతూ, అలాంటి సమయాలను కూడా అనుకూలమైన శుభసమయాలుగా మార్చి, నిజమైన భక్తులకు శుభకరమైన ఫలితాలను ప్రసాదిస్తూ, ఉన్నతమైన ఆశయాలు గలవారికి వారి స్థితిగతులను మెరుగుపరచి, వారి ఆశయ సాధనను సిద్ధింపచేస్తుంది శ్రీకాళీమాత. అందరికీ ఉపయోగకరంగా ఉండి మేలు జరిగే పనులను ప్రోత్సహిస్తూ, అభివృద్ధిపరుస్తూ, మహారాజులచేత, అలాగే రాజులను పరిపాలించే చక్రవర్తుల చేతా పూజించి, సేవించబడే తల్లీ ! శ్రీకాళీమాతా! నీవే అన్ని లోకాలకూ ఆధారం. అంటూ తెలియజేశారు శ్రీగురుదేవులు.

శ్లో॥ స్త్రీ పురుషభేద రహితమూర్తే ! దేవి ! స్థిరబుద్ధి సిద్ధిప్రదాత్రి ! వరకాళి !
సద్భక్త భావనానుగుణానేక రూపవర్ణధారణ సుశోభితమూర్తే ! దేవి !
సదామృతోద్భవాంబుధి సర్వనదీతీర నివాస స్నానాధిక ఫలప్రదాత్రి !
సకల పుణ్యక్షేత్ర సందర్శనానందాధిక ఫలప్రదాయిని ! శ్రీవరకాళి !50

తా॥ ఆడవారు మగవారు అనే భేదభావాన్ని చూపకుండా, భక్తులకు నిలకడగా ఉండే మంచి బుద్ధిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. భక్తులలో ఆడమగ అని తేడా ఏమీ ఉండదు. ఎవరు ఎంత ఆ తల్లిని పూజిస్తే అంత ఫలితం పొందుతారు. భక్తి అనేది ఒక్కటే. దానికి లింగభేదం, రంగు భేదం ఏమీ ఉండదు. స్త్రీ పురుషులలో ఎవరు సాధన చేసినా ఆ తల్లి ఒకే విధంగా కరుణిస్తుంది. స్త్రీ భక్తులకు ఒక విధంగా, పురుష భక్తులకు ఒక విధంగా అనుగ్రహం, వరాలు ఉండవు. అంతా ఒక్కటే అనే భావంతో అందరు భక్తులూ ఉండే విధంగా, వారికి నిలకడగా ఉండే మంచి బుద్ధిని ప్రసాదిస్తూ, అనేక రూపాలతో దర్శనమిస్తుంది శ్రీకాళీమాత. కొంతమంది భక్తులు, అమ్మవారు, సుందరమైన రూపంలో కన్పిస్తే చూడాలని భావిస్తారు. వారికి ఆ తల్లి అలాగే దర్శనమిస్తుంది. మరికొందరు అద్భుత రూపంలో కన్పించాలని, అలా దర్శనమిస్తే తమ జన్మలు ధన్యమవుతాయని భావిస్తే, వారి మనసులోని భావాలకు అనుగుణమైన రీతిలో ఆ తల్లి వారికి దర్శనమిచ్చి వారిని తరింపచేస్తుంది. ఇంకా కొంతమంది శ్రీకాళీమాతను, రౌద్రకాళీ రూపంలో దర్శించాలని అభిలషిస్తే వారికి అలానే కన్పిస్తుంది. భక్తులకు వారు కోరిన విధంగా దర్శనమిచ్చే శ్రీకాళీమాత, అద్భుతమైన కాంతులతో వెలిగిపోతూ నిరంతరం అమృతం పుట్టే సముద్రము, సమస్త నదులు వాటి తీరాలలో, నివశిస్తున్న వారికి, ఆ సముద్రాలలో నదులలో స్నానం చేస్తే వచ్చే పుణ్యంకన్నా అధికమైన శుభఫలితాలను, మంచి ఆరోగ్యాన్ని పూర్ణాయుష్షును శ్రీకాళీమాత తన భక్తులకు ప్రసాదిస్తుంది. మానవులు తమ పాపాలను పరిహారం చేసుకోవటం కోసం, లోకంలోని ఎక్కడెక్కడో ఉన్న పుణ్యక్షేత్రాలను, ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి దర్శించుకుంటారు. జీవితకాలం తిరిగినా అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించుకోవటం సాధ్యం కాదు. అనుకున్నవి దర్శించుకోలేక అశాంతి పాలవుతారు. కాని లోకంలో ఉన్న అన్ని పుణ్యక్షేత్రాలను దర్శించినందువలన వచ్చే పుణ్యఫలంకన్నా, శ్రీకాళీమాత తన నిజభక్తులకు ఇంకా ఎంతో అధికమైన పుణ్యఫలాన్ని ప్రసాదిస్తుంది. అని అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ శ్రీజగత్పాలనకేళీ విలాసిని ! పునర్జన్మనివారిణి ! ఆదిపరాశక్తే !
సర్వకులమత సద్గుణ సాధక జనప్రియే ! శ్రీకాళి ! సత్కృపామృతేశ్వరి!
నిస్స్వార్థ కార్యాచరణ దీక్షాభివృద్ధిప్రదాత్రి ! నిజకీర్తి ప్రదాయిని ! దేవి !
సర్వకాల జపానంద ప్రియే ! సదానంద ప్రదాయిని ! శ్రీమద్గురుకాళి! 51

తా॥ ఈ విశ్వాన్ని పాలించే జగన్మాత శ్రీకాళీమాత, ఈ జగత్తును ఒక క్రీడారంగంగా చేసి ఎన్నో రకాలైన ఆటలను ఆడుతూ, భక్తులు కోరుకుంటే మళ్లీ జన్మ లేకుండా చేస్తుంది. ఒకే ఇంటిలో పుట్టేవారిని ఎన్నో వైవిధ్యాలతో పుట్టిస్తుంది. ఒకరిని తెలివి గలవారుగా, ఇంకొకరిని మందమతులుగా, వేరొకరిని దైవభక్తులుగా, మరొకరిని నాస్తికులుగా రకరకాల భావాలు గలవారిని ఒకే ఇంటిలో చేర్చి వారి మధ్య రోజూ జరిగే నాటకాన్ని చూసి ఆనందించడం ఆ తల్లికి ఒక క్రీడే గదా ! మరొకరు ధనికులై సంతానం లేక బాధపడుతుంటే మరొకరు, పేదరికంలో అధిక సంతానంతో బాధపడుతుంటారు. ఇద్దరి బాధా ఒక్కటే, ఒకరు ధనవంతులై బాధ పడుతున్నారు రెండోవారు అధిక సంతానంవల్ల బాధపడుతున్నారు. మూడవవారు అనారోగ్యంతో ఆలుమగలు అన్యోన్యం లేక బాధ పడుతుంటారు. ఆ తల్లి మనుషుల మధ్య జీవితాలలో అంతరాలను కల్పించేది వారిని శోధించడానికే అది వారు తెల్సుకొని శ్రీకాళీమాత పై మనసు లగ్నం చేస్తే ఎలాంటి పరిస్థితిలోనైనా బాధలు దరిచేరవు. ఇది భక్తుల అనుభవసారం. ఆ తల్లి దరిచేరిన భక్తులు కోరుకుంటే మళ్లీ జన్మ లేకుండా వరాన్ని ప్రసాదిస్తుంది ఆ తల్లి శ్రీకాళీమాత. ఏ కులంలోనైనా ఏ మతంలోనైనా మంచిగుణాలు కలిగినవారు ఎప్పుడూ ఉంటారు. శ్రీకాళీమాత దృష్టిలో లోకంలోని జనులందరూ ఒక్కటే, కులాలు, మతాలుగా విభజించి ఆ తల్లి ఎప్పుడు అనుగ్రహించదు. ఏ కులం, మతం వారు పూజించినా అనుగ్రహిస్తుంది. మంచి గుణాలున్న సాధకులు ఎవరినైనా కరుణిస్తుంది. వరాలనిస్తుంది ఇష్టపడుతుంది. భక్తులపై మంచి కృప అనే అమృతవర్షాన్ని కురిపించే ఈశ్వరి, స్వార్థం లేకుండా చేసే పనులను, దీక్షలను, అభివృద్ధి చేసుకునే శక్తిని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. అన్ని కాలాలకూ నిలిచి ఉండే నిజమైన కీర్తిని, ప్రతిష్ఠలను ఆ తల్లి ప్రసాదిస్తూ, కాలనియమం, సమయ నియమం లేకుండా అన్ని కాలాలలో జపం చేస్తూ ఆ తల్లిని ఆరాధించే భక్తులంటే ఎంతో ఇష్టపడే శ్రీకాళీమాత, వారికి ఎల్లవేళలా,

నిరంతరంగా ఆనందాలను, సంతోషాలనూ ప్రసాదిస్తుంది, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారికి సద్గురువైన శ్రీకాళీమాతకు కోటి కోట్ల నమస్కారాలు నేను సమర్పిస్తున్నాను.

**శ్లో॥ వాచికస్తోత్ర పఠనానందమూర్తే ! ఉపాంశుమంత్ర జపానందకారిణి !**
**మన స్తోత్ర మంత్ర జప ధ్యాన యోగానందమూర్తే! మధురానుభూతిప్రదే!**
**దేహమనోదృష్ట్య దృశ్యమూర్తే ! ఆత్మదృష్టి ప్రదే ! సర్వానుగ్రహకారిణి!**
**సనాతన ధర్మప్రబోధిని ! కాళి ! సద్గ్రంథరచనాశక్తిప్రదాయిని ! 52**

తా॥ పైకి వినిపించేటట్లు పెద్దగా చదవటాన్ని వాచకము అంటారు. అలాపైకి విన్పించేటట్లు ఆ తల్లిని స్తోత్రం చేయటంవలన శ్రీకాళీమాత సంతోషిస్తుంది. అలాగే పెదవులు మాత్రమే కదిలే విధంగా, మాటలు బయటకు విన్పించకుండా నోటిలోనే మననం చేస్తూ మంత్రజపం, స్తోత్రం చేయటాన్ని ఉపాంశువు అంటారు. ఈ విధంగా చేయటంవలన ఇంకా ఎక్కువగా ఆ తల్లి ఆనందిస్తుంది. మూడోపద్ధతి, కనులు మూసుకొని, పైకి వినపడకుండా, పెదవులు కదిలించకుండా మనసులోనే ఆ తల్లి నామాన్ని లేదా మంత్రాన్ని జపం చేసినా, స్తోత్రం చేసినా, ధ్యానం చేసినా, యోగం చేసినా ఆ దేవి మిక్కిలిగా ఆనందపడుతూ సాధకులకు ఎన్నెన్నో మరువలేని, తీయని, మహిమాన్వితమైన అనుభూతులను ప్రసాదిస్తుంది. ఒక మనిషిని చూడగానే అతని కులాన్ని, రంగును, మిగతా బాహ్యంగా కన్పించే విశేషాలను చూడటం దేహదృష్టి అంటారు. అనగా అతని భౌతికరూపమే చూడగలుగుతారు. అలాగే ఆ మనిషి చేసే పనులు, అతని విద్య, గుణగణాలు మొదలైన వాటిని గమనించి తెలుసుకోవటం, మనోదృష్టి అంటారు. అలాంటి రెండు దృష్టులను పోగొట్టి, అమ్మవారు, మూడవ దృష్టి అయిన ఆత్మదృష్టిని ప్రసాదిస్తారు. ఆత్మదృష్టి అనగా మనిషిని చూడగానే కులము, మతము, రూపురేఖలు, విద్యా వైవిధ్యాలు కాకుండా వానిలో ఉన్న శ్రేష్ఠమైన ప్రసన్నతను, మాత్రమే చూసి ఆత్మజ్ఞానులైన వారిని గౌరవించే బుద్ధిని ప్రసాదించి, అలాంటివారినే అన్ని వేళలా అనుగ్రహిస్తూ, వారికి అనాదినుంచి ఉన్న ధర్మాలను తెలియజేస్తూ, మంచి గ్రంథాలను, అందరికీ ఉపయోగపడే విధంగా, రచించే శక్తిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటూ తెలియజేస్తున్నారు శ్రీగురుదేవులు.

శ్లో॥ శ్రీబ్రహ్మవిద్యా మంత్రోపదేశకారిణి ! నిఃశ్వాసోచ్ఛ్వాసాదిమూర్తే ! శ్రీకాళి!
సర్వాధికారార్హతాప్రదే ! సచ్చరితాగ్రరూపిణి ! సంపూర్ణేశ్వరి ! దేవి !
ఆధ్యాత్మ విద్యోద్భవోత్పత్తిమూర్తే ! అగణితయశోవైభవప్రదే ! కాళి !
సకలవేదశాస్త్రపురాణేతిహాసపఠనశ్రవణాధిక ఫలప్రదాత్రి ! దేవి ! 53

తా॥ శ్రీవిద్యను బ్రహ్మవిద్య అనికూడా అంటారు కొందరు. అలాంటివి ఎన్నో విద్యలు వున్నాయి శుద్ధవిద్య, అన్నా, ఆత్మవిద్య అన్నా రెండూ ఒకటే. దాన్నే బ్రహ్మవిద్య అనికూడా అంటారు. అనగా ఆత్మయొక్క స్వరూప స్వభావాలను, సాధకునికి అనుభవంలోనికి తెచ్చే జ్ఞానసంపదన్న మాట. శక్తిని ఉపాసించే శాక్తేయ సంప్రదాయంలో దీనికే శ్రీవిద్య అనే పేరు ఉన్నది. శ్రీవిద్యామంత్రంలో 16, పదహారు బీజాక్షరాలు ఉంటాయి. ఈ విద్యకే షోడశీ విద్య అనే వ్యావహారిక నామం కూడా ఉన్నది. మనిషిలో ఉండే ప్రాణవాయువు అనగా గాలిని దేహంలోనికి పీల్చడం, మరల బయటకు వదలటం అనబడే శ్వాసక్రియకు శక్తినిచ్చేది అమ్మవారే. ఎందుకంటే ఆ శక్తికి మూలాధారమైన శక్తి శ్రీకాళీమాతయే కనుక. భక్తులకు అన్ని అధికారాలను, దానికి కావలసిన అన్ని అర్హతలను ప్రసాదించే మంచి మనసు, ఉన్నతమైన చరిత్ర కలిగిన శ్రీకాళీమాత, ఒక పరిపూర్ణమైన శక్తి స్వరూపిణి. మంచి భక్తులకు ఆధ్యాత్మిక విద్యలను ప్రసాదిస్తూ, వాటిని అనేక విధాలుగా అభివృద్ధి పరుస్తూ, లెక్కించటానికి వీలులేనంత కీర్తిని, శక్తిని వైభవాలను భక్తులకు ప్రసాదిస్తూ, అన్ని వేదాలను, శాస్త్రాలను, పురాణాలను, ఉపనిషత్తులను మొదలైన అనేక గ్రంథాలను చదివినా, ఎవరైనా చదువుతున్నప్పుడు ఆయా గ్రంథ పఠనాలను విన్నా వచ్చే ఫలితంకన్నా, ఇంకా ఎక్కువ మంచి ఫలితాలను శ్రీకాళీమాత, తనను మనస్ఫూర్తిగా నమ్మి సేవించే భక్తులకు ప్రసాదిస్తుంది. అనగా ఏ గ్రంథాలను చదవలేకపోయినా, కనీసం వినలేక పోయినా ఆ తల్లి, వాటి వలన వచ్చే శుభఫలితాలను మించి ఎక్కువ ఫలితాలను ఇచ్చే వరాలను ప్రసాదిస్తుంది. శ్రీకాళీమాత, తన భక్తులు, ఏ విద్యలూ నేర్చుకోలేక పోయినా, ఏ విద్యలూ రాకపోయినా, అన్ని అర్హతలను ప్రసాదించి కైవల్యాన్ని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ నిత్యనిందావమాన కర్మాదృశ్యకారిణి ! నిరుపమానేశ్వరి ! శ్రీకాళి !**
**భయాదృశ్యకారిణి ! అభయప్రదాత్రి ! అద్భుతాత్మ స్థైర్య శక్తి ప్రదాత్రి!**
**తుంబురనారదాధిక నవ్యఘననాదగాన విద్యాప్రదాత్రి ! శ్రీకాళి !**
**సద్భక్తజన సగౌరవ సత్కార సార్వభౌమాధికార ప్రాప్తిప్రదాత్రి ! 54**

తా॥ కొందరు వారి కర్మానుసారం ప్రతిరోజూ ఇతరులచేత నిందించబడుతూ, అవమానించబడుతూ వేదనకు గురౌతుంటారు. అలాంటి నిందలను, దుష్టకర్మలను శ్రీకాళీమాత పోగొడుతుంది. ఆ తల్లిని ఎవరితోనూ సరిపోల్చటానికి వీలుకాని దేవి. ఎంతో గొప్ప అపరశక్తి గనుక శ్రీకాళీమాతను ఇంకొక దేవతతో పోల్చకూడదు కదా మరి నిజమే. భక్తులలో కలిగే అన్ని రకాల భయాలనూ పోగొట్టి, నేనున్నానుగా. నీకు భయమెందుకు, నిర్భయంగా ఉండు అన్నట్లు అభయాన్నిస్తూ విచిత్రమైన గొప్ప మనోధైర్యాన్ని, మంచి శక్తిని ప్రసాదిస్తుంది. తుంబురుడు, నారదుడు. వీరిద్దరూ గానవిద్యలో చాలా గొప్పవారు. వారు ప్రదర్శించే విద్యలకన్నా ఇంకా గొప్ప అత్యున్నతమైన 'నాదగానం' అంటే మంచి సంగీతంతో పాడగలిగే విద్యలను, ప్రతిభాశక్తిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. మంచి భక్తజనులను అమ్మవారే గౌరవించి వారిని సత్కరించి, అందరికంటే చాలా గొప్పవారిని చేస్తూ, చూస్తూ వారికి సర్వాధికారాలనూ ప్రాప్తింపచేసి, సర్వాధికారులుగా చేస్తుంది శ్రీకాళీమాత. భక్తులను, అమ్మవారు ప్రేమతో గౌరవించి, సత్కరించినప్పుడే వారు ఈ స్థూల దేహాన్ని వదలిన తరువాత కూడా, అనగా మరణించిన తరువాత కూడా భక్తులు కీర్తించబడుతూ, ఆరాధించబడుతూ ఉంటారు. తదుపరి, వారే ఇలవేల్పులై భావితరాల చేత పూజింపబడుతూ ఈ లోకంలో దైవంతో సమానంగా నిత్యము ఆరాధించబడు తుంటారు. వారే పరిపూర్ణులైన కారణజన్ములు, అలాంటివారికే అమ్మ శ్రీ కాళీమాతను ఆరాధించాలనే కోరిక మనసులో మంచి భావాలు వృద్ధి చెందుతుంటాయని శ్రీగురుదేవులు ఎప్పుడూ అంటుంటారు.

**శ్లో॥ పరోపకారాగణిత దివ్యకార్యాభివృద్ధి మనోభావోత్పత్తికారిణి !**
**దయాప్రేమ గుణాధిక ధర్మమార్గ ధనార్జన జనార్చిత ప్రియమూర్తే !**
**వంశపారంపర్య స్వయంకృత సంక్రమిత సకల శుభాశుభ ప్రబోధిని !**
**చతురాశ్రమోత్తమోత్తమ గృహస్థాశ్రమ జీవనాదృష్ట ప్రదాత్రి! శ్రీకాళి!55**

తా॥ ఇతరులకు ఉపయోగపడే అనేక శ్రేష్టమైన పనులను అభివృద్ధి చేసే మనసుని మంచి భావాలను, నిరంతరంగా వృద్ధి చేసే ఆలోచనలను పుట్టించే తల్లి అందుకు కారణమైన శక్తి శ్రీకాళీమాత. వారికి దయ, ప్రేమ, క్షమా గుణాలను పెంచుతూ, వారు ధర్మమార్గంలో సంపాదించిన డబ్బును ఖర్చు చేసి వాటితో పూజించినా, అర్చించినా ఆ తల్లి ఎంతో ఇష్టపడుతుంది. అలా ఆచరించిన వారికి మాత్రమే పూర్వకాలం నుంచీ, వారి పూర్వీకులు చేసినవి లేదా ఇంకా ఇప్పుడు వారు స్వయంగా చేసుకుంటున్న వాటివలన వస్తున్న వాటినన్నింటి, మంచి చెడులను తెలియచేస్తుంది. బ్రహ్మచర్యము, గృహస్థాశ్రమము, వానప్రస్థము, సన్యాసాశ్రమము అని పిలువబడే నాలుగు విధాలైన ఆశ్రమాలు చెప్పబడినాయి. వీటిలో గృహస్థాశ్రమం ఎంతో ఉత్తమమైనది. అలాంటి గృహస్థాశ్రమంలో ఆనందంగా జీవించే అదృష్టాన్ని తన భక్తులకు ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. గృహస్థాశ్రమం అంటే సంసారం, మహాసముద్రం లాంటిది. బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు చివరకు గృహస్థులను చేరవలసిందే. ఎందుకంటే వీరందరూ గృహస్థులై ఉన్న తల్లిదండ్రుల నుంచి పుట్టినవారే గదా ! ఆకాశం నుంచి పడే వాన నీరు భూమ్మీద కొండలపైన పడి ప్రవహిస్తూ వచ్చి నదులలో కలుస్తాయి. నదులన్నీ పొంగి పొర్లుతూ వచ్చి చివరకు సముద్రంలోనే కలుస్తాయి. అదే విధంగా బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్యాసులు, సంసారిని ఆశ్రయించియే జీవించుచున్నారు. అందువలన సంసారులే ఉత్తములైన వారని వారు కొంచెం తెలివి తోమసలుకొంటూ అన్యోన్యంగా వుంటూ అందరికి ఆదర్శవంతులై ఆనందమయ జీవితాన్ని గడపవచ్చు అని అంటారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**శ్లో॥ అగణిత జన్మార్చితశుద్ధతపో భక్తజనానుగ్రహకారిణి ! కాళి !**
**ఆరాధనాచారాద్భుత కాలానుగుణ నిర్ణయ వర్ణన ప్రబోధిని ! దేవి !**
**మూలాధారచక్ర కుండలినీ వైతాళిక యోగశక్త్యుత్పత్తిమూర్తే ! కాళి !**
**త్రిగుణాతీత స్థితి ప్రదాత్రి ! దేవి ! త్రిమూర్తిపాలికే ! త్రిపురాధీశ్వరి! 56**

తా॥ అనేక జన్మలలో అర్చించి పూజించి, సేవించిన గొప్ప తపస్సంపన్నులైన భక్తజనులను అనుగ్రహించే తల్లి శ్రీకాళీమాత. ఎన్నో జన్మలనుంచీ వారు ఆ తల్లిని సేవిస్తూ రావటంవలన ప్రస్తుత జన్మలో ఆ పుణ్యఫలం ఎంతో ఎక్కువగా ఉంటుంది.

అందువలన అలాంటి భక్తులు, ఆ తల్లి అనుగ్రహించే వారిలో అగ్రస్థానంలో ఉంటారు. వారిని త్వరగా కరుణిస్తుంది. ఆరాధన, ఆచార వ్యవహారాలను ఆశ్చర్యంగా కాలానికి అనుగుణంగా ఉండే రీతిలో నిర్ణయించి వాటిని ఎలా ఆచరిస్తూ ఉండాలో వివరంగా తెలియజేసే తల్లి శ్రీకాళీమాత. మానవుని మూలాధార చక్రంలోని కుండలినీ శక్తిని మేలుకొలిపి తరువాత సాధకులయొక్క యోగశక్తిని బాగా పెంచే యోగమూర్తి శ్రీకాళీమాత. ఈ కుండలినీ శక్తి మేలుకొని మూలాధారచక్రం నుంచి ఊర్ధ్వముఖంగా పయనించి స్వాధిష్టాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రాలను దాటుకుంటూ సహస్రారానికి చేరుకుంటుంది. ఈ ప్రక్రియ శక్తిపాతమై మానవులను మహర్షులుగా మహనీయులుగా చేసి వారిని మహిమాన్వితులను చేస్తుంది. అప్పుడు వారిని మూడుగుణాలకూ అతీతులుగా చేసి, బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో సమానులుగా చేసి ఆ ముగ్గురునీ పాలించినట్లే, వీరిని కూడా పాలిస్తూ ఉంటుంది శ్రీకాళీమాత. త్రిపురాలైన సత్యలోకం, వైకుంఠం, కైలాస లోకాలను వాటికి అధీశ్వరులైన వాణీ బ్రహ్మలను, లక్ష్మి విష్ణువులను, ఉమాశంకరులను పాలించే తల్లి పరమాదిమూర్తి పరమేశ్వరి అయిన శ్రీకాళీమాతయే. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీకాళి ! మహాద్భుతమూర్తే ! మణిరత్నమాల్య శ్రీకంఠాభరణభూషితే !**
**అశ్వత్థవృక్షాగ్రదర్శిని ! కాళి ! అమృతవాక్యప్రబోధిని ! ఆదిశక్తే !**
**అమంగళాదృశ్యకారిణి ! దేవి ! అక్షయామృతానందసుమంగళప్రదే !**
**ఊర్ధ్వలోక సంచారిణి ! దేవి ! శ్రీకాళి ! ఊహాతీత సుఫలప్రదాయిని! 57**

తా॥ తన భక్తులకు తాను ప్రదర్శించే ఎన్నో మాహాత్మ్యాల ద్వారా, వారిని అనుగ్రహించి వరాలను ప్రసాదించటం ద్వారా, భక్తులు కోరిన కోరికలను అప్పటికప్పుడే తీర్చడం ద్వారా ఇలా ఎన్నో మరెన్నో విధాలుగా వారిని ఆదుకుంటూ ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. శ్రీకాళీమాతను అర్థం చేసుకునే శక్తి అందరికీ ఉండదు. పూర్వజన్మ పుణ్యఫలం తోడైనప్పుడు మరల జన్మలోకూడా ఆ తల్లినే, నమ్మి కొలిచే వారికి మాత్రమే అవి అర్థమౌతాయి. ఇంతకాలం నుంచి పూజిస్తున్నా ఆ తల్లి నాకు ఏమీ ఇవ్వలేదు అనే నిరాశావాదం నుంచి బయటపడి, ఆ తల్లిని సేవించే భాగ్యం కలిగితే చాలు, అదే నాకు గొప్పవరం, అదృష్టం అనే భావనతో ముందుకు వెళితే, అప్పటినుంచే ఆ తల్లి మనకు కావలసినవన్నీ మనకు తెలియకుండానే సమకూరుస్తుంది.

అదే శ్రీకాళీమాత మహిమ గొప్పదనం. ఈ నిజం తెలుసుకునే స్థాయిని భక్తులందరూ పొందాలి. అనేక మణులను, రత్నాలను, మాణిక్యాలను మొదలైన వాటిని మాలలుగా చేసి, వాటిని తన మెడలో అలంకార ఆభరణాలుగా ధరిస్తుంది. వీటినుంచి వెలువడే కాంతి, ఆ తల్లి మేనిఛాయను మరింత అద్భుతంగా కన్పించేటట్లు చేస్తుంది. శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి, ఆ తల్లి రావిచెట్టుపైన కన్పించి అన్ని కాలాలలో, అందరికీ ఉపయోగపడే మంచి వాక్యాలను, శ్రీఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాత, తమకు తెలియజేసినట్లుగా పై శ్లోకంలో తెలిపారు. అదే విధంగా శ్రీకాళీమాత అశుభాలను పోగొడుతూ, నిరంతరము నిలిచి ఉండే ఆనందాన్ని, అనేక మంచి శుభఫలితాలను ప్రసాదిస్తూ, పై లోకాలలో సంచరిస్తూ, లోకాలన్నింటినీ వీక్షిస్తూ, మానవులు ఊహించలేని అనేకానేక మంచి ఫలితాలను ప్రసాదిస్తుంది అని తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ గతజన్మార్చన కారణ నివాసస్థల మహిమా ప్రబోధిని ! శ్రీకాళి !**
**వర్తమానార్చన కారణ జన్మస్థల మర్మప్రబోధిని ! శ్రీవరకాళి !**
**భావికాల జన్మస్థల భాగ్యమర్మప్రబోధిని ! కాళి ! భవ్యశక్తిప్రదే !**
**సుదూర ప్రాంతనివాస సుభక్తాకర్షిణి ! సుగంధర్వగానార్చితే ! కాళి! 58**

తా॥ శ్రీకాళీమాత భక్తులు పూర్వజన్మలలో తనను ఎలా అర్చించారు, ఎలా ఆరాధించారు, వారి కుటుంబ నేపథ్యం ఏమిటి, ఆయా జన్మలలో ఆ భక్తులు ఎలాంటి వృత్తివ్యాపారాలు చేసేవారు, వారి కళలు, అభిరుచులు, ఏ దేశము, ఏ రాష్ట్రము, ఏ పట్టణము, ఏ గ్రామములో నివసించారు, ఆ స్థల మహిమలను శ్రీకాళీమాత తెలియచేస్తూ, ప్రస్తుత జన్మలో అర్చించడానికి, జన్మించిన స్థలమర్మాలను తెలియచేసే శ్రేష్ఠమైన తల్లి శ్రీకాళీమాత. ఎంతోమంది భక్తుల పూర్వజన్మల విశేషాలను, అమ్మవారు శ్రీ గురుదేవులకు తెలియజేసినట్లుగా తెలుస్తున్నది. ఆ భక్తులందరూ కూడా గతజన్మలలో శ్రీకాళీమాత భక్తులే, మరలా వేజెండ్లలోని శ్రీకాళీమాత దరి చేరటం వారి పూర్వజన్మల సుకృతం. అలాగే రాబోయే జన్మలలో ఎక్కడ జన్మించబోతున్నారో, ఆ జన్మస్థలం యొక్క విశేషాలను, పుణ్యశీలతను, అదృష్టాన్ని ఆ స్థలమర్మాన్ని, అక్కడే జన్మించటానికి తోడైన కారణాలను తెలియచేస్తూ, భక్తులకు బాహ్యంగా కావలసిన శక్తిని ప్రసాదిస్తూ, అనగా ఆ తల్లిని సేవించడానికి అనువైన

మనసును, పరిస్థితులను, ఆర్థికపరమైన సంపత్తి లేకపోయినా దానికనుగుణమైన సంకల్పాన్ని ప్రసాదిస్తుంది. ఎంతో దూర ప్రాంతాలలో, ఇతర దేశాలలో, ఇతర రాష్ట్రాలలో ఉన్నవారైనా, వారు మంచి భక్తులైతే, దేవి, మహిమతో వారిని ఆకర్షించి, తన వద్దకు రప్పించుకొని వారి సేవలు అందుకుంటుంది. ఈ విషయాన్ని అందరూ గమనిస్తూనే ఉన్నారు. ఏదో చుట్టం చూపుగా వచ్చినవారు, దేశపర్యటన చేస్తూ వచ్చేవారు, స్నేహితుల ద్వారా తెలుసుకొని వచ్చేవారు, అమ్మవారి మాహాత్మ్యాలను పుస్తకాలద్వారా తెలుసుకొని వచ్చేవారు, ఇలా కారణం ఏదైనా ఆతల్లి దర్శనం కోసం వస్తారు. అదే ఆ తల్లి ఆకర్షణశక్తి అంటే. వారి మనసుల్లో అమ్మవారి గురించి ఆలోచనలు రావటమే ఆ తల్లి శక్తి. మంచి గంధర్వులచే గానం చేయబడుతూ ఆగానాలకు ఆనందిస్తుంది శ్రీకాళీమాత. అంటూ పై శ్లోకంలో ఎన్నో గొప్ప మర్మాలను తెలియజేశారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ బాహ్యభావన కార్యానేక స్వరూప స్వప్నదర్శనప్రాప్తి ప్రదాత్రి ! దేవి !**
**దుస్స్వప్న ధ్వంసిని! దుఃఖాపహారిణి! సుస్వప్నదృశ్య సిద్ధి ప్రదాత్రి! కాళి!**
**స్వప్నదర్శనకార్య స్వరూప ప్రత్యక్ష సందర్శన ప్రాప్తికారిణి ! దేవి !**
**స్థూలదేహానుభవాద్భుత శ్రీకార్యవీక్షణ కారణ మర్మప్రబోధిని ! 59**

తా॥ బాహ్యంగా భావించుకున్న పనులను, అనేక స్వరూపాలను కలలో చూసే గొప్ప భాగ్యాన్ని ఆ తల్లి ప్రసాదిస్తుంది. అనగా మనం ఎక్కడో ఏదో చూస్తాం, ఆ కార్యాన్ని ప్రారంభించి సఫలం చెయ్యాలని భావిస్తాం. కాని సరైన పరిష్కారం దొరకదు, కాలయాపన జరుగుతుంది. మనసు మాత్రం ఆ పనిమీదే లగ్నమై ఉంటుంది. అప్పుడు ఆ సమస్యలకు సరిపోలే సమస్యలను పరిష్కరించినట్లు కలలో రావటం, నిజ సమస్య కూడా చక్కగా తేలికగా పరిష్కారం కావటం జరుగుతుంది. ఇదంతా ఆ తల్లి ప్రేరణ. అదే విధంగా కలలో ఎక్కడో ఏదో మహిమాన్విత దేవాలయం ఉన్నట్లు కన్పిస్తుంది. ఆ తరువాత మనసు ఆ కలలో కన్పించిన దేవాలయం గురించే ఆలోచిస్తుంటుంది. ఆ కోరిక, సంకల్పంగా మారి నిజజీవితంలో కూడా ఆ దేవాలయం ఎక్కడుందో తెలుసుకొని వెళ్లి దర్శించుకునే శక్తిని, యుక్తిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. దేవాలయం కావచ్చు, సుందరప్రదేశాలు కావచ్చు మరే ఇతర విషయాలైన కావచ్చు. ఇదంతా శ్రీకాళీమాత సంకల్పంతోనే జరుగుతుంది. ఇలాంటి

దృష్టాంతాలు చాలా జరిగాయి. ఆ తల్లిని ఆరాధించేవారికి, చెడ్డకలలు రాకుండా చేస్తూ, దుఃఖాలను తొలగించి, మంచి, శుభప్రదమైన కలలు వచ్చేటట్లు చేస్తూ, ఆ కలలో చూసినవి జరిగేటట్లు మంచిగా చేస్తుంది శ్రీకాళీమాత. కలలో చూసిన వాటిని, చేసిన అనేక పనులను, ఇంకా దర్శించిన అనేక రూపాలను, మళ్ళీ బాహ్యంగా నిజంగా చూసే అదృష్టాన్ని ప్రాప్తింపచేసే తల్లి శ్రీకాళీమాత, ఈ దేహం, వివిధ పరిస్థితులలో అనుభవించే అనేక విచిత్రమైన కార్యాలు చూడటానికి కారణాలు, వాటి వెనుక దాగి ఉన్న మర్మాలు తెలియచేస్తుంది శ్రీకాళీమాత. కలలో చూచిన వాటిని కలలో చేసిన వాటిని బాహ్యంగా భావించిన వాటిని అన్నింటిని చేయించే తల్లి శ్రీకాళీమాతయే. అంటూ శ్రీగురుదేవులు నాకు ఎన్నోమార్లు కలలో వచ్చినవి జరిగేటట్లు జరుగబోయే వాటిని కలలో చూచేటట్లు నన్ను దీవించారు, అవి అన్నీ జరిగినవి కూడా. ఇది, సత్యం.

**శ్లో॥ శ్రీవిశ్వకల్యాణమూర్తే ! పరబ్రహ్మస్వరూపిణి ! పరాత్పరి ! ప్రాణేశ్వరి !**
**గగన దీపిత కోటి మార్తాండ తేజోవిరాజత్ స్వరూపిణి ! వరకాళి !**
**అరుణకుసుమాసనమూర్తే ! ఆదిశక్తే ! అనంతరూపావతారిణి ! దేవి !**
**భూమ్యాకాశాగ్రశయనమూర్తే ! శ్రీకాళి ! చతుర్దశ భువనేశ్వరి ! 60**

తా॥ ఈ లోకాలకు శుభాలను ప్రసాదించే శుభమూర్తి శ్రీకాళీమాత. కోరుకున్న భక్తులకు, కోరుకున్న విధంగా, వారు ఏది కావాలన్నా ప్రీతితో ప్రసాదించే చల్లని తల్లి శ్రీకాళీమాత లోకంలోనే శ్రేష్ఠమైన ఆత్మకు ప్రతిరూపమై, శ్రేష్ఠులలో అత్యంత శ్రేష్ఠురాలైన తల్లి. ప్రాణానికి ఆధారమైన తల్లి. మానవులు పీల్చే గాలికి, తన శక్తిని చేర్చి, దాన్ని అతిముఖ్యమైన 'ప్రాణాధారశక్తి'గా మార్చి మానవులకు మరియు సకల జీవకోటికి ఎంతో మేలు చేకూర్చుతోంది శ్రీకాళీమాత. ఆకాశంలో వెలిగే మహాగొప్ప దీపంలాగా, కోటిమంది సూర్యులు మిట్ట మధ్యాహ్నకాలంలో ఒకేసారి వచ్చి కన్పిస్తే వచ్చేటంత వెలుగు తేజస్సుతో వెలిగిపోయే రూపం కలిగినది శ్రీవరకాళీమాత. ఎఱ్రటి వర్ణం కలిగిన పుష్పాన్ని ఆసనంగా వేసుకొని అగ్రస్థానంలో కూర్చుని ఆకాశంపైన వుంటూ శ్రీఆదిపరాశక్తి. భక్తులు కోరిన విధంగా, అనేకమైన దివ్యరూపాలతో అవతరించి వారిని కటాక్షిస్తుంది శ్రీకాళీమాత, భూమికీ, ఆకాశానికీ కూడ పైన ఉండే దివ్యమైన లోకంలో పడుకొని ఉండే తల్లీ, అలాగే ఏడు ఏడు

పద్నాలుగు లోకాలైన భూలోకం భువర్లోకం సువర్లోకం మహాలోకం, జనోలోకం, తపోలోకం, సత్యలోకం, అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలను ఏకకాలంలో పరిపాలించడానికి శక్తియుక్తి సామర్థ్యాలు కలిగిన తల్లి శ్రీకాళీమాత. ఈ లోకాలన్నీ మానవదేహంలోనే వున్నాయంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీంకారిణి ! మహాదేవి ! సర్వమంత్రశక్త్యాదిమూర్తే ! సకల లోకేశ్వరి !**
**మహాగుప్తమర్మ ప్రబోధనాచార్య ప్రపాలికే ! దేవి ! మహామధురేశ్వరి !**
**వివిధ స్తోత్రానంద ప్రత్యక్షమూర్తే ! కాళి ! వికారస్వరూపాదృశ్యకారిణి!**
**పూర్వజన్మాదృష్ట విశేష విశ్వసుందర స్వరూప భాగ్యప్రదాత్రి! కాళి! 61**

తా॥ తనను నమ్ముకొని ఆరాధిస్తున్న భక్తులకు అనేక సుఖాలనూ, భోగాలను మంచి వైభవాలను ఆనందంగా ప్రసాదించే చాలా పెద్ద తల్లి శ్రీకాళీమాత. లోకంలోని అన్ని మంత్రశక్తులకూ ఆదిమూర్తి ఆ తల్లి. అన్ని మంత్ర బీజాక్షరాలూ, వాటి శక్తులు ఆ తల్లి నుంచి ఉద్భవించినవే. అన్ని లోకాలనూ పరిపాలిస్తూ, ఏకకాలంలో వాటన్నింటిని సమర్థించగల శక్తి, ఆ తల్లియైన పరమేశ్వరికే సాధ్యం. అత్యంత రహస్యమైన మర్మాలను ప్రబోధించే, గురువర్యులను పాలించే తల్లి, ఎంతో గొప్పవైన మాటలను ఎంతో మృదువుగా మధురంగా మాట్లాడే ఈశ్వరి, మహాదేవి అనేక విధాలుగా స్తోత్రాలు చేస్తే ఆనందించి ప్రత్యక్షమై కనిపించే శ్రీకాళీమాత భక్తులకు అందవిహీనమైన రూపాన్ని పోగొట్టి, వారికున్న పూర్వజన్మ సుకృతాన్ని, అదృష్టాన్ని దృష్టిలో ఉంచుకొని, ఈ విశ్వంలో అందరికన్నా అందమైన రూపాన్ని ప్రసాదిస్తూ, వృద్ధాప్యంలో కూడా మంచి శరీర తేజస్సును ఇచ్చి దేవతలు సైతం ఆకర్షించే దివ్యరూపాన్ని భాగ్యంగా ప్రసాదించే భాగ్యప్రదాయిని శ్రీకాళీమాత. భక్తులు, కొన్ని సందర్భాలలో అనారోగ్యం వలన గాని అతిగా ఆహారాన్ని తీసుకున్నందువలన గాని ఎంతో లావుగా అందవిహీనంగా వుంటారు, కాని వారు అమ్మవారిని ఆరాధిస్తూ సంకల్పం చెప్పుకుంటే వారిని సన్నగా నాజూకుగా వుండేటట్లు దీవిస్తుంది. భక్తులు అమ్మవారిని కీర్తించి ఆ తల్లి అనుగ్రహాన్ని పొందినపుడే వారి అభీష్టాలు నెరవేరుతాయి అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ శ్రీజగన్మాతః ! మహాకవిమండలపూజితే ! జీవన్ముక్తిప్రదే ! శ్రీకాళి !
జాజ్జ్వల్య స్వరూపిణి ! మహాభయవినాశిని ! దేవి ! మహాకావ్యప్రదాత్రి!
అపవాద ధ్వంసిని ! అక్షయామృత కీర్తిప్రదాత్రి ! దీనజనోద్ధారిణి !
వేదవినుతే ! శ్రీకాళి ! విశ్వవిజయప్రదాత్రి ! శ్రీవిమలస్వరూపిణి !62

తా॥ అమ్మా ! శ్రీకాళీమాతా ! నీవు అత్యంత శుభకరమైన తల్లివి. నిన్ను పూజించేవారికి శుభాలేగాని, అశుభాలనేవి దగ్గరకు కూడా రావు. లోకంలోని గొప్పకవులందరిచేతా పూజింపబడుతున్నావు. అదే విధంగా నిన్ను నమ్మి సేవించి ఆరాధించటం వల్లనే వారికి అంతటి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. నీ అనుగ్రహం లేనిదే వారు, వారి కవితాశక్తిని ప్రదర్శింపలేరు. అద్భుతమైన కళలన్నింటికీ నీవే ఆదిమూర్తివి. నీకృప లేనిదే వారు కవితలలో, కళలో నైపుణ్యతను సాధించలేరు. వారికుండే గొప్ప భయాలను తొలగించి వారు ఎన్నో అతివిలువైన అక్షర సంపదలను భావితరాలకు ఉపయోగపడే అమృతనిధి వంటి గొప్ప కవితాశక్తిని ప్రసాదించే శ్రీకాళీమాతవు నీవే ! అపవాదులను భక్తులకు తొలగించి, నిరంతరము నిలిచి ఉండే, శాశ్వతమైన కీర్తిని ప్రసాదిస్తావు. పూర్వజన్మల కర్మల ఫలితంగా లేదా దోషపూరితమైన కార్యాలను చేయటం వలన వచ్చే అపవాదులు, వాటి కారణంగా వారికి వచ్చే ఇబ్బందులు బాధలనుంచి విముక్తిని కలిగించి, దోషనివారణ చేసి, భవిష్యత్తులో వారిపై ఎలాంటి నిందారోపణలు, అపవాదులు రాకుండా చేస్తావు. పేదజనులను ఉద్ధరిస్తూ వారికి మంచి స్థితి రావటానికి సహాయకారిణివి అవుతావు. అలాగే వేదాలచేత పొగడబడుతున్న తల్లివి నీవే! శ్రీకాళీమాతా ఈ విశ్వంలోని భక్తులందరికీ, ఎల్లప్పుడూ విజయాలను ప్రసాదించే మంచి స్వరూపం కలిగిన దానమూర్తివి. నీ స్వరూపాన్ని దర్శించిన వారికి ఉత్తేజం, బలము కలుగుతుంది, ఆ ఉత్తేజం వలన భయాలు తొలగిపోయి, మానసికంగా ఉండే స్తబ్ధతలు వదలిపోతాయి. అందువలన వారు ఎలాంటి కార్యాన్నైనా సులభంగా ఆకళింపు చేసుకొని విజయం సాధించే మానసిక ధైర్యాన్ని శ్రీకాళీమాత ప్రసాదిస్తూ, మంచివారికి ఎప్పుడూ తోడుగా, అండగా నిలిచి ఉంటుంది. అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సుయుక్తి భక్తజనోద్యోగోత్పత్తిమూర్తే ! దేవి ! సుశాంతిప్రదాయిని ! కాళి!**
**సుపరిపాలనాశక్తిప్రదాత్రి ! దేవి ! సురగుణ భావోత్పత్తికారిణి !**
**సమయానుకూలోపయోగ సద్వాక్యోద్భవమూల కారణాది మూర్తే ! దేవి!**
**న్యాయగణిత వైద్యశాస్త్రానేకాధిక విద్యాప్రదే ! విజ్ఞానేశ్వరి ! కాళి! 63**

తా॥ మంచి తెలివి కలిగిన భక్తజనులకు ఉన్న ఉద్యోగాన్ని ఇంకా పెద్దదిగా చేసి, వారికి మంచి శాంతిని ప్రసాదిస్తుంది. తెలివైన వారు ఎల్లప్పుడూ ఒకమెట్టుపైనే ఉండాలని ఆశిస్తూ అందుకు తగిన విధంగా ప్రయత్నాలు చేస్తుంటారు. కాని విధి వారికి అనుకూలించక, ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా వారు, తాము చేస్తున్న ఉద్యోగాలలో ఉన్నతిని సాధించలేరు. వారి ప్రయత్న లోపమేమీ లేకపోయినా, దైవానుగ్రహం లేకపోవటంవలన ఇలా జరుగుతున్న సందర్భాలలో శ్రీకాళీమాత వారిని ఆశీర్వదించి, ఉద్యోగాలలో ఉన్నత స్థానాలు పొందే విధంగా వారిని చేస్తుంది. అలాగే వారు అనుకున్న దానిని సాధించామనే తృప్తితో అశాంతిని పోగొట్టుకుంటారు. ఆ తరువాత వారికి మంచిగా పరిపాలించే శక్తిని ప్రసాదించి, వారిలో శ్రేష్ఠమైన దేవతాగుణాలను, ఇంకా శ్రేష్టమైన మంచి భావాలను అమితంగా పెంచుతుంది శ్రీకాళీమాత. మానవులకు కొన్ని కాలాలలో అనుకూలత ఉండదు. అయితే శ్రీకాళీమాత తన భక్తులకు సమయానుకూలంగా ఉపయోగపడే మంచి మంచి వాక్యాలు భక్తుల నోటివెంట పుట్టడానికి శక్తినిచ్చే మూలకారణశక్తి శ్రీకాళీమాత. ఇంకా న్యాయశాస్త్రాలను, గణిత శాస్త్రాల విద్యలను, వైద్యశాస్త్రాల విద్యలను ఇంకా మరెన్నో మంచి విద్యల రహస్యాలను శ్రీకాళీమాత తన భక్తులకు తెలియచేస్తుంది. అసలు శ్రీకాళీమాత చెప్పే న్యాయం. ధర్మం, వేరుగా వుంటుంది. అమ్మశ్రీ కాళీమాత ప్రబోధించే న్యాయధర్మాలు, భక్తులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి అనుభవంలో అవి అన్నీ నిజమని తెలుస్తాయి. అతిగొప్ప మర్మాలను తెలుసుకొనే శక్తిని దేవి, తన భక్తులకు ప్రసాదిస్తుంది. అవసరమనిపిస్తే వారు ఏ విద్యలు నేర్వకపోయినా వారికి సకల శాస్త్రాలలో వున్న మర్మాలకన్నా యింకా నిగూఢమైన రహస్యాలను శ్రీకాళీమాత భక్తులకు, సాధకులకు తెలియజేస్తుంది. అంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ అంబుధికూపతటాక జలాంతర్భాగ ప్రమాదాదృశ్యకారిణి ! శ్రీకాళి !
భూనభోంతరాళ సంచార సద్భక్త జనసంరక్షిణి ! దేవి ! మహామూర్తే !
వివిధ వృత్తి ధర్మ నిర్వహణాభివృద్ధి శక్తిప్రదే ! వినయ ప్రదాత్రి !
జ్ఞానబోధనాచార్య వయోవృద్ధ జనగౌరవబుద్ధి ప్రదాయిని ! కాళి !64

తా॥ సముద్రము, బావి, చెరువులలో ఉండే నీళ్లలో పడిపోయి భక్తులు ప్రయాణంలో ప్రమాదంలో ఉన్నప్పుడు ఆ ప్రమాదం నుంచి కాపాడే తల్లి శ్రీకాళీమాత. వృత్తిరీత్యాగాని, వ్యాపారరీత్యా గాని, జ్ఞానాభివృద్ధి కోసం గాని మరి ఏ ఇతర కారణాల వలనైనా ఒక్కోసారి, సముద్రాలలో, నదులలో మరే నీటికి సంబంధించిన ప్రాంతాలలో పని చేసేటప్పుడు, పనిలో నిమగ్నమై ఒక్కోసారి అదుపు తప్పి నీటిలో పడిపోయిన సందర్భాలలో వారిని ఈతగాని రూపంలోనో, మరేదో విధంగానైనా తక్షణం రక్షించే పద్ధతిలో వారిని రక్షించి కాపాడుతుంది శ్రీకాళీమాత. భూమిపైనా, అంతరిక్షంలో సంచరిస్తున్న మంచి భక్తజనులను ఎల్లవేళలా రక్షిస్తూ ఉండే దేవి, మహాతల్లియైన శ్రీకాళీమాత. ఒకసారి, అమ్మవారి భక్తుడు మరియు, శ్రీగురుదేవుల శిష్యుని కుమారుడు అమెరికా నుంచి ఇండియా విమానంలో బయలుదేరాడు. ఆ సమయంలో వాతావరణం అనుకూలంగానే ఉన్నది. రాత్రిపూట విమానంలో, సముద్రం మీద నుంచి ప్రయాణం చేయాలి. విమానం నడిరేయి సముద్రంపై ప్రయాణం చేస్తున్నప్పుడు ఆకస్మికంగా, భయంకరమైన కుదుపుకు గురైంది. అందరూ నిద్రలో ఉన్నారు. ఈ హటాత్ పరిణామానికి ప్రయాణికులంతా భయభ్రాంతులై భీతిల్లి పోయారు. ఏడు నిముషాలపాటు విమానం ఎండుటాకులా విలవిలలాడింది. ఆ మరుక్షణంలో ఎవరో దాన్ని పట్టుకొని యధాస్థితిలో ఉంచినట్లుగా, అంతవరకూ ఏమీ కానట్లుగా ప్రయాణించి గమ్యస్థానాన్ని చేరింది. ఆ తరువాత ఆ భక్తుని కోరిక మేరకు అలా ఎందుకు జరిగిందని అడుగగా దానికి శ్రీగురుదేవులు చెప్పిన సమాధానం ఏమిటంటే, మీ అబ్బాయి ఒక్కడు అందులో ఉన్న కారణంగానే మిగతా వారంతా బ్రతకగలిగారు, మీ అబ్బాయి అందులోలేని పక్షంలో ఆ విమానం గాలిలోనే ప్రమాదానికి గురై మొత్తం శిధిలమయ్యేది అని చెప్పారు. అనగా ఒక్కరు ఆ తల్లి శ్రీకాళీమాత భక్తుడు ఉండటంవలన అతని పుణ్యశక్తి వలన శ్రీకాళీమాత అందరినీ కాపాడింది. అంతటి దయామయి శ్రీకాళీమాత. ఆ అబ్బాయి ఎవరో కాదు మా

అబ్బాయి నరేష్. ఇది శ్రీగురుదేవులు శ్లోకంలో చెప్పిన అంతరిక్షంలో సంచరిస్తున్న మంచి భక్తుల గురించి, వారిని తల్లి శ్రీకాళీమాత ప్రమాదాల నుంచి రక్షిస్తుంది అనడానికి నిదర్శనమైన సంఘటనలలో ఒకటి, అలాగే భూమ్మీద జరిగే ప్రమాదాలనుంచి కూడా ఆ తల్లి తన భక్తులను ఎన్నోసార్లు ప్రాణాపాయం నుంచి రక్షించిన సంఘటనలు ఎన్నో భక్తుల అనుభవాలలో ఉన్నాయి. భక్తులు అనేకానేక పనులు చేసే సమయంలో, ఆ పనులను ధర్మబద్ధంగా వృద్ధి చేసుకునే శక్తిని ప్రసాదించి వారికి కావలసిన వినయ విధేయతలను ప్రసాదిస్తుంది. అలాగే మంచి జ్ఞానాన్ని ప్రబోధించే గురువర్యులైన పెద్దవారిని గౌరవించే మంచి శ్రేష్ఠమైన, ఉన్నతమైన బుద్ధిని, మనసును తన భక్తులకు ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ అనేకాద్భుత విద్యామితశాంత్యర్థజన వినయప్రదాయిని ! శ్రీకాళి !**
**సాధకోత్తమోత్తమ సదానంద జీవనభక్తజన సందర్శన ప్రాప్తిప్రదే !**
**పుణ్యస్థల తీర్థక్షేత్రాక్షయ సందర్శనాదృష్ట జనపూజ్య మనోభావప్రదే !**
**ప్రాతఃకాల జాగరాదృష్ట ప్రాప్తి ప్రదాత్రి ! ప్రారబ్ధ ధ్వంసన శక్తి ప్రదాయిని!65**

తా॥ నిరంతరమూ ఎన్నెన్నో, ఆశ్చర్యకరమైన విద్యలున్ననూ, ఎంతో గొప్ప శాంత స్వభావులైన వారిదగ్గర వినయంగా ఉండే సహనాన్ని భక్తులకు ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అమ్మ అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందిన ఆత్మజ్ఞాన సంపన్నులకు మాత్రమే వినయ భావాన్నిస్తుంది శ్రీకాళీమాత. అనగా ఎంత విద్య నేర్చినా, శ్రీకాళీమాత తన భక్తులు వినయంతో ఉండే సద్గుణాన్ని ప్రసాదిస్తుంది. విద్య, వినయం ఉన్నప్పుడే శోభిల్లుతుంది. అలాగే విద్యావంతులైననూ శాంతిని ఆకాంక్షించే మృదుస్వభావులకు కూడా వినయాన్ని ప్రసాదించి, సాధకులలో ఉత్తములైన వారిలోనే సర్వోత్తములైన వారికి ఎల్లప్పుడూ ఆనందంగా జీవించే భాగ్యాన్ని ప్రసాదిస్తుంది. భక్తులైన వారు పుణ్యస్థలాలను, పుణ్యతీర్థాలను, పుణ్యక్షేత్రాలను నిరంతరం దర్శించుకొని వాటి ప్రాశస్త్యాన్ని, విశేషాలను తెలుసుకునే అవకాశాన్ని, భాగ్యంగా కల్పించి వారికి మంచి మనసును మంచి భావాలను ప్రసాదిస్తూ, ఉదయకాలంలో తెల్లవారుఝామునే నిద్ర లేచే అలవాటును వరంగా అదృష్టంగా ప్రసాదించి, వారు

అనుభవించే అనేక బాధలను, దుఃఖాలను, సమస్యలను, ఆరోగ్య సమస్యలను స్వయంగా వారంతట వారే పోగొట్టుకోగల శక్తిని శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. ఉదయాన్నే నిద్రలేచి స్నానాదులు ముగించి సూర్యోదయానికి ముందే శ్రీకాళీమాతను పూజించటంవలన ఎన్నో మానసిక, శారీరక రుగ్మతలను ఆ తల్లి దూరం చేస్తుందని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తూ భక్తులు తెలియక ఇంతకుముందు చేసిన తప్పులను మళ్ళీ చేయకుండా మనసుకు మంచి ఆలోచనలు మంచి భావాలు తెచ్చుకొంటూ మంచి ప్రవర్తనతో జీవిస్తున్నప్పుడే ఆ భక్తులను శ్రీకాళీమాత ఆత్మజ్ఞాన సంపన్నులుగా చేసి అందరికి ఆదర్శవంతులుగా చేస్తూ వారిని ఆరాధ్యదైవాలుగా చేస్తుందంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ గతవర్తమాన కర్మాహార కారణారోగ్యానారోగ్యమర్మ ప్రబోధిని !**
**దేహకురూపశారీరక వ్యాధిబాధాదృశ్యకారిణి! బాహ్యతేజఃప్రదే ! కాళి!**
**నిత్యనిర్మలానందప్రదే ! దేవి ! మానసికోల్లాసప్రదాయిని ! శ్రీకాళి!**
**సుసంపూర్ణ సుగుణ సుబుద్ధి ప్రదానకారిణి ! సర్వదానేశ్వరి ! కాళి ! 66**

తా॥ పూర్వకాలంలోనూ మరియు ఇప్పుడు చేసిన పనులవలన లేదా చేస్తున్న పనుల వలన, అలాగే భుజించిన ఆహారంవలన ఎందుకు ఆరోగ్యంగా ఉన్నారు. ఎందుకు అనారోగ్యంగా ఉన్నారు, అనే మర్మాలను తెలియచేస్తుంది శ్రీకాళీమాత. మానవులు ఎల్లప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటారు. అందులో కొన్ని సమాజానికి నచ్చేవి, మరికొన్ని వ్యక్తిగతంగా వారికి నచ్చేవి. కొన్ని మంచి నడవడికతో చేసేవి, మరికొన్ని నడవడికతో సంబంధం లేకుండా మనసు కోరితే చేసేవి. అదే విధంగా ఆహార విషయాలలో కొంతమంది ఎక్కువ శ్రద్ధ తీసుకుంటూ జాగ్రత్తగా ఉంటారు. మరి కొందరు అలాంటి జాగ్రత్తలేమీ లేకుండా, సమయపాలన లేకుండా, అన్నీ తినేస్తుంటారు. రోగగ్రస్తులౌతుంటారు. మానవుల ఆహార విహారాలలో జరిగే మార్పులు వారి శారీరక మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. కాని వారికి తెలియదు, తాము ఎందుకు అనారోగ్యంతో బాధపడుతున్నదీ. అలాంటి మర్మాలను శ్రీకాళీమాత భక్తులకు తెలియచేస్తుంది. అలా ప్రాప్తించిన అనారోగ్యం వలన ఈ దేహానికి, ఈ శరీరానికి వచ్చే చెడ్డరూపం, అనేక వ్యాధులను బాధలను పోగొట్టి, ఈ బాహ్య

దేహానికి మంచి తేజస్సును, మంచి బలాన్ని, మనసుకు ప్రశాంతతను ఇస్తుంది శ్రీకాళీమాత. అన్నివేళలా ప్రశాంతమైన ఆనందాన్ని ప్రసాదిస్తూ, మనసుకు ఉల్లాసాన్ని ప్రసాదించే శ్రీకాళీమాత, పరిపూర్ణమైన మంచి గుణమును, మంచి బుద్ధిని, ప్రదానం చేసే తల్లి, అన్ని దానాలనూ మించి ప్రాణదానం కూడా చేయగలిగిన ఆదిపరాశక్తి అందరికి తల్లి శ్రీకాళీమాత. నిజమైన సుగుణ భక్తులకు అన్ని శుభాలు జరిగేలా చూస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ ఆందోళనాశాంతిక్రోధ నిరాశానిస్పృహాఽదృశ్యకారిణి ! అనంతమూర్తే!**
**అఖిల భక్తజనాదర్శ స్త్రీ పురుషార్హ సుయశోవైభవప్రదే ! మహాదేవి !**
**ఉన్నతాధికారయోగ్యతోద్భవమూర్తే ! సమున్నత శక్తిప్రదాత్రి ! కాళి !**
**భక్తిజ్ఞాన వైరాగ్య ప్రదాత్రి ! బహువిధ మంత్రసిద్ధి ప్రదాన కారణేశ్వరి!67**

తా॥ భయాలను, అశాంతిని, కోపాన్ని, కోరికలు తీరకపోవటం వలన కలిగే బాధలను తొలగించి, కోరికలను లేకుండా పోగొట్టే అనేక రూపాల తల్లి శ్రీకాళీమాత. మానవులకి సహజంగా ఉండే భయం, కోపం, అనుకున్న కోరికలు నెరవేరకపోవటం వలన మానసిక అశాంతి మొదలైన వాటివలన దేహం అనారోగ్యం పాలౌతుంది. కోపంవలన శత్రుత్వం పెరుగుతుంది. అవసరానికి కూడా ఎవ్వరూ సహాయం చెయ్యటానికి రారు. భయంవలన మానసిక క్రుంగుబాటు కలిగి నలుగురిలో కలసి తిరగలేరు, ఏ పని చెయ్యలేరు. అభివృద్ధిని సాధించలేరు. కాని అనుకున్నవి తీరకపోవటం వలన, వారి ఆలోచనలు ఎల్లప్పుడూ వాటిమీదే కేంద్రీకృతమై ఉండటం వలన మానసిక అశాంతి పెరిగి క్రుంగిపోతారు. కాని ఆ కోరికలు అభివృద్ధిని సాధించటానికైతే వారు పురోగతి సాధిస్తారు. ఈ లోకంలో భక్తజనులకు స్త్రీ పురుషుల అర్హతలను బట్టి వారికి ఆదర్శదంపతులు అనే మంచి కీర్తిని, వైభవాలనూ ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. ఆ దంపతులకు మంచి జీవితం ఏ అరమరికలు లేక సాగిపోతూ, చూసే వారికి ముచ్చట గొలుపుతుంది. తాముకూడా వారిలాగా హాయిగా ఆనందంగా గడపాలని అందరూ భావిస్తారు. అదే వారి ఆదర్శ దాంపత్యానికి కీర్తి, వైభవంగా మిగులుతాయి. భక్తుల యోగ్యతలను బట్టి ఉన్నత అధికారాలను కల్పించి, వారికి తగిన మంచి ఉన్నతమైన, వారు చేపట్టిన అధికారానికి అనువైన శక్తి సామర్థ్యాలను ప్రసాదిస్తూ, వారికి ఆధ్యాత్మిక మార్గంలో కూడా ఎక్కువ పాత్ర

కల్పించడానికి అనేక మంత్రసిద్ధులను ఇచ్చి, వారు విజ్ఞానముతో అన్నీ తెలుసుకున్న తరువాత, మోక్షానికి కారణమైన వైరాగ్యాన్ని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీవిమలమూర్తే ! కరుణానుగ్రహరూపిణి ! కలియుగేశ్వరి! శ్రీకాళి !**
**అజ్ఞానాంధత్వాదృశ్యకారిణి! విమలాద్భుతానంద విజ్ఞానోత్పత్తిమూర్తే!**
**మాం పాలితమూర్తే ! మహాదృష్టప్రదాయిని! దేవి ! శ్రీమద్గురు వరకాళి!**
**సన్మునియోగి ఋషి సద్గురుమండలపాలికే ! శ్రీకాళి! సర్వాధీశ్వరి ! 68**

తా॥ యోగాలనూ, భోగాలను ప్రసాదించే చక్కని తల్లి శ్రీకాళీమాత. భక్తులు కోరిన విధంగా వారికి వివిధ రకాలైన యోగాలను ప్రసాదిస్తుంది. భక్తి యోగము, జ్ఞానయోగము, కర్మయోగము మొదలైనవి. ఆ యోగాలద్వారా వారు ఆ తల్లిని ఆరాధించి అనుగ్రహం పొందటం సులువౌతుంది. అదే విధంగా అనేక భోగాలను అనగా సంసారభోగము, సిరిసంపదలను అనుభవించే భోగము, రాజభోగము మొదలైనవి ఆ తల్లే ప్రసాదిస్తుంది. ఈ కలియుగానికే ఈశ్వరి, ప్రభువు అయిన శ్రీకాళీమాత తన భక్తులను కరుణించి, అనుగ్రహిస్తుంది. అజ్ఞానమనే గుడ్డితనాన్ని పోగొట్టి మంచి, ఆశ్చర్యకరమైన ఆనందాన్ని, మంచి తెలివినిచ్చి వాటిని అభివృద్ధి చేస్తుంది. జ్ఞానం లేకపోవటం అనేది అంధత్వంతో సమానం. ఒక విషయాన్ని పరిశీలించాలంటే అందులోకి వెళ్లి దానిలోని మంచి చెడులను గుర్తించాలి. మంచి దృష్టి మాత్రం గుర్తించే జ్ఞానం కలిగిఉంటుంది. వెళ్ళే మార్గాన్ని కూడా చూపించేది దృష్టే. అలాగే అన్నింటినీ చూడగలిగిన కన్నులున్నా ఒకోసారి గుడ్డితనం ఆవరిస్తుంది. ఎలాగంటే భాష రాని వారికి పుస్తకం చూపిస్తే అందులో ఏమి ఉన్నదో తెలియదు, గుర్తించలేరు. దాన్నే కన్నులుండి గ్రుడ్డితనం అంటారు. కాని శ్రీకాళీమాత తన భక్తులకు ఈ స్థితిని రానీయదు. జ్ఞానదృష్టిని ప్రసాదిస్తుంది. మనలను అందరినీ అన్నివేళలా, పాలించే తల్లి, మనందరకూ గొప్ప అదృష్టాన్నిచ్చే దేవి, మనకు మంచి సద్గురుమూర్తియై దారిచూపే తల్లీ, మంచి మునులు, యోగులు, ఋషులు, సద్గురువుల నందరినీ పాలించే తల్లివి శ్రీకాళీమాతా! ఈ లోకాలన్నింటికీ నీవే అధీశ్వరివి. అంటూ పై శ్లోకంలో తెలియచేశారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సుశ్రద్ధాభక్తి భావోత్పత్తిమూర్తే ! బహువిధభాషాభివృద్ధిశ్రీకారిణి !**
**సుమంత్రగృహనివాసిని! శ్రీకాళి ! సన్మంత్ర యంత్రావరణ సంచారిణి !**
**సుజన సిద్ధగణగళ సుసంస్కృత భాషాక్షరోద్భవమూర్తే ! శ్రీకాళి !**
**సుదినకాల సంసేవితే ! శ్రీమహాదేవి ! సుగుణవందన సంతోషిణి ! 69**

తా॥ మంచి శ్రద్ధ భక్తితో కూడిన భావాన్ని పెంచుతూ అనేక రకాలైన భాషలను అభివృద్ధి చేస్తుంది శ్రీకాళీమాత. మనసులోని భావాలను నియంత్రించుకొని మంచి ఆలోచనలనే అమలుపరుస్తూ, వాటిని కూడా ఆచరణీయమైన మంచి విధానాల ద్వారానే అనగా చేసే పనిలో శ్రద్ధ, పనినే దైవంగా భావించే భక్తిశ్రద్ధలు ఉండే విధంగా ఆ తల్లి చూస్తుంది. అనేక ప్రాంతాలలో తిరుగుతూ అక్కడి వారి ఆచార వ్యవహారాలను తెలుసుకుంటూ అక్కడ మాట్లాడే అన్ని రకాల భాషలనూ నేర్చుకొని మాట్లాడగలిగే అదృష్టాన్ని ఆ తల్లి కలుగజేస్తుంది. శ్రీకాళీమాత మంత్రాన్ని ఏ ఇంటిలో ఎల్లప్పుడూ జపిస్తూ ఉంటారో, ఆ ఇంటిలో ఆ తల్లి నివసిస్తుంది. మంత్రపఠన చేసే హృదయంలో స్థిరంగా వుంటుంది. నిరంతరం ఆ తల్లిని స్తోత్రం చేసే మంత్రాలలో విలసిల్లుతూ, చక్కటి యంత్ర స్థాపితం జరిగిన ఆవరణలో శ్రీకాళీమాత సంచరిస్తూ, ఆనందంగా తిరుగుతూ భక్తులకు కన్పిస్తూ ఉంటుంది. మంచి సిద్ధులను పొందిన భక్తుల యొక్క నోటినుంచి మంచి సంస్కృత భాషను పుట్టించి, దానిని వృద్ధి చేస్తుంది. అసలు కవితాజ్ఞానం, భాషాజ్ఞానం లేని వారి నోటినుంచి ఎన్నో అద్భుతమైన సంస్కృత, భాషా పరిమళాలను ఉద్భవింపచేసి, అమోఘమైన శ్లోకాలను, పద్యాలను వ్రాయగల శక్తినిస్తుంది శ్రీకాళీమాత. దీనికి, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారే తిరుగులేని ఉదాహరణ. తల్లీ! మంచిరోజున, మంచి కాలంలో సేవించబడుతూ, అలా నిన్ను సేవించిన వారికి అన్ని రోజులూ, అన్ని కాలాలు మంచిగా ఉండేటట్లు చేస్తూ, మంచి గుణవంతులైన వారు నీకు నమస్కరిస్తే బాగా సంతోషించే తల్లివి నీవే కదా! శ్రీకాళీమాతా! అంటూ రచించారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ నాస్తికత్వాదృశ్యమూర్తే ! వరకాళి ! ఆస్తికత్వామితభావప్రదాయిని !**
**విశ్వవిమోహనశక్తిప్రదాత్రి ! విమలవిద్యాభివృద్ధికారిణి ! దేవి !**
**ప్రపంచోత్పత్త్యభివృద్ధి మూలపరిశోధనా పటుత్వ శక్తిప్రదే ! కాళి !**
**ప్రజ్ఞాపాండిత్య సభాకర్షణ వశీకరణ ప్రాప్తిప్రదాయిని ! శ్రీకాళి ! 70**

తా॥ దేవుడు లేడు, దేవతలు లేరు, అనే ఈ భావనలను పోగొట్టే తల్లి, మంచి విశ్వాసంతో కూడిన అధికమైన భక్తి భావాన్ని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. వీపుపైన 'మసి' అంటుకున్నదని ఎవరైనా చెప్పినా, అది నిజమే, అయినా నమ్మరు. నా వీపుపైన ఎందుకు ఉంటుంది, నేను నమ్మను అంటారు. ఎందుకంటే తనలో ఉన్నదాన్నే చూడగలిగే శక్తి లేక, దాన్ని కప్పిపుచ్చుకోడానికి, ఎదుటివారిని మభ్య పెట్టడానికి కాదు, లేదు అని వాదిస్తారు. వారిచేతనే ఆ 'మసి'ని తాకించి చూపిస్తే, చేతికి అంటుకున్న మసిని చూసి, అతను చెప్పింది నిజమేనని నమ్ముతారు. నాస్తిక భావాలు కలిగి దేవుడు లేడనుకునేవారు కూడా అంతే. ఎవరో ఒకరు, వారికి చెప్పే విధానంలో చెప్పి భక్తిభావాన్ని స్పృశింపచేసిన తరువాత వారు పొందే అనుభూతుల వలన, నిజమే దేవుడున్నాడు అనే భావం వారిలో కలుగుతుంది. ఈ విశ్వాసాన్ని వారిలో పెంపొందించి, అధికమైన ఆధ్యాత్మిక భావాలను వారికి ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. ఈ లోకంలో భక్తులకు మంచి ఆకర్షణ శక్తిని ప్రసాదించి, మంచి ఉన్నతమైన, శ్రేష్ఠమైన విద్యలను వారికి అభివృద్ధి చేసే తల్లి శ్రీకాళీమాత. ఈ ప్రపంచం అన్ని రంగాలలో బాగా అభివృద్ధి చెందడానికి మూలకారణం పరిశోధనలు. పెరిగే జనాభాకి సరిపడినంత ఆహారం పండించాలంటే పరిశోధించి, పరీక్షించి వాటి ఫలితాలు సాధించాలి, అలాగే జనులకు మంచి జరగాలంటే ఏమి చేయాలి, ప్రపంచం వ్యాపార వ్యవసాయ విద్యా ఇంకా అనేక రంగాలలో అభివృద్ధి సాధించాలి చెడు జరుగకుండా ఎలా నివారించాలి ఇలా ప్రతి విషయంలోనూ ఎంతో శ్రమకోర్చి వారు చేసే సాధన ప్రస్తుత కాలానికి ముందు రాబోయే తరాలలో ఇంకా విపులంగా పరిశోధన జరగాలంటే అందుకు తగ్గ మేధాసంపత్తి కావాలి. అలాంటి పరిశోధనా పటుత్వశక్తిని, ఆ తల్లే, అర్హులైన వారిని కొందరిని నిర్ణయించి వారికి గొప్ప తెలివి తేటలను, మంచి పాండిత్యాన్నిచ్చి, వారి వాక్చాతుర్యంతో సభలను ఆకర్షింపచేసుకొని, వారి మనసులను చూరగొనే శక్తిని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాతా. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ భావికాలోపయోగ కార్యాభివృద్ధి సుజన మనః ప్రవేశమూర్తే ! కాళి !**
**నిత్యనిష్ఠారాధన సంతుష్టే ! మహాదేవి ! శిష్టాలయ స్థలనివాసిని !**
**సర్వసుఖాసనాభీష్టమూర్తే ! సుసంపూర్ణ వరానుగ్రహరూపిణి ! దేవి !**
**ఖేచరీ ధ్యానయోగ చిన్ముద్రాభీష్ట ముద్రానందమూర్తే ! సర్వముద్రేశ్వరి! 71**

తా॥ రాబోయే కాలంలో ఉపయోగపడే అనేక పనులను అభివృద్ధి చేసే మంచి మనుషుల మనసుల్లో చేరే తల్లి శ్రీకాళీమాత. కొంతమంది అప్పటి సమయానికి ఏది అవసరమో తలంచి దానిని చేస్తుంటారు. అందువలన అది వారికి తాత్కాలికంగా ఉపయోగపడవచ్చు. మరికొందరు, అవసరం వచ్చినప్పుడు దాన్ని గురించి ఆలోచించవచ్చులే ఇప్పుడు నుంచే ఎందుకు అంటూ దాటవేసి ఆ పని చేయకుండా తప్పించుకుంటారు. వీరిద్దరూ కాక మూడోవిధంగా ఆలోచించే వారుంటారు. వారు నిరంతరం ఆలోచిస్తూ ఏదో ఒక ప్రజోపయోగ కార్యక్రమాలను చేపడుతూ, అన్ని వేళల శ్రమిస్తూ సేవ చేస్తుంటారు. ఆ శ్రమవల్ల సేవవల్ల వారికి తాత్కాలికమైన లాభం, ఫలితం కలుగకపోవచ్చు. కాని దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఏదో ఒకటి సాధించి సమాజానికి అందించాలనే తపనలో ఉంటారు. వారే నిత్య సత్య కృషీవలులు. అలాంటి సేవాభావం కలిగిన వారి మనసుల్లో, ఆ తల్లి శ్రీకాళీమాత నిలిచి ఉండి వారి కృషికి, తద్వారా మానవశ్రేయస్సుకు తోడ్పడుతుంది. అలాంటి వారు ప్రతిరోజూ శుచిగా శుభ్రంగా తయారై ఆరాధిస్తే ఆ తల్లి ఇంకెంతో సంతోషిస్తుంది. ఆ తల్లి మంచి, శ్రేష్ఠమైన హృదయాలయంలో నివాసం ఉంటుంది. అన్నీ, ఎవరికి కావలసిన విధంగా వారు, వారి వారి అనుకూలతను బట్టి, కూర్చున్నప్పుడు ఇబ్బంది కలగని పద్ధతిలో, సుఖాసీనులై చేసే ధ్యానానికి సంతోషించి వారి కోరికలను తీర్చి, వారికి మంచి పరిపూర్ణమైన వరాలను అనుగ్రహిస్తుంది శ్రీకాళీమాత. ఇంకా దేవతా అనుగ్రహంకోసం దివ్యమైన ధ్యానాలు యోగాలు, అలాగే చిన్ముద్రలో కూర్చుని రెండు చేతులూ నిటారుగా పెట్టి, చూపుడు వ్రేలును బొటన వ్రేలుతో కలిపితే వచ్చే ముద్రను చిన్ముద్ర అంటారు ఈ విధంగా ధ్యానముద్ర వేసి ఆ తల్లిని స్మరణ చేస్తుంటే మిక్కిలిగా సంతోషిస్తుంది శ్రీకాళీమాత. ఎందుకంటే అన్ని ముద్రలకూ అమ్మవారే గదా అధిపతి. ఏ ముద్రతో చేసినా ఆనందిస్తుంది ఆ తల్లి అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీగురుకాళి ! సత్త్వసహన సహాయ సద్గుణ బుద్ధ్యభివృద్ధికారిణి !**
**పరపీడన ప్రయోగ రజోగుణ దుర్భావ ధ్వంసిని ! మహాదేవి ! కాళి !**
**స్వపరక్షేమ రజోగుణ మనోబుద్ధ్యభివృద్ధిమూర్తే ! శ్రీసుగుణేశ్వరి !**
**క్రోధాహంకారాజ్ఞాన జనన కారణ తమోగుణాపహారిణి! శ్రీకాళి! 72**

తా॥ ఈ శ్లోకంలో శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, ఇతరులలో ఉండే దుర్గుణాలను నశింపచేసి, వారికి మంచి బుద్ధులను ప్రసాదించమని శ్రీకాళీమాతను కోరుతున్నారు. అమ్మా ! శ్రీగురుకాళీమాతా ఎంతో ఓర్పుతో కూడి ఉండే సహనాన్ని, ఇతరులకు సహాయం చేసే మంచి గుణాన్ని, మంచి బుద్ధి అభివృద్ధికి కారణమైన తల్లివి నీవే అంటున్నారు శ్రీగురుదేవులకు, అమ్మవారు గురువు. అందువల్లనే ఆ తల్లిని శ్రీగురుకాళీమాతా అని సంబోధించారు. మనుషులలో ఉండే దుర్గుణాల వలన, వారికి ఎప్పటికైనా చేటు కలుగుతుంది, దానివలన వారు వారి కుటుంబ సభ్యులు బంధువులకు వారితో కలసి ఉన్నవారికి స్నేహితులకు అనుకోని ఇబ్బందులు వస్తాయి వారి వలన సమాజానికి కూడా కీడు కలుగుతుంది. ఒకరిలో ఉండే చెడు లక్షణాల వలన ఎంతోమంది కుటుంబంలో అందరూ బాధపడవలసి వస్తుంది. అందుకే జనులలో ఉండే దుర్గుణాలను నశింపచేసి ఓర్పుతో సహనంతో ఉండే మంచితనాన్ని ప్రసాదించమని ఆ తల్లిని కోరుతున్నారు శ్రీగురుదేవులు. అలాగే ఇతరులను పీడించి వారికి నష్టం కలిగించే పనులు చేసే వారి కోరికలను, దుష్టభావాలను ధ్వంసం చేసే తల్లి శ్రీకాళీమాత. ఒకరిని ఒకరు ఏ కారణం చేత కూడా పీడించకూడదు, అలాంటి భావాలున్న వారి మనసులను మార్చి, వారి దుర్మార్గపు కోరికలను అందుండి తొలగించమని శ్రీగురుదేవులు ఆ తల్లిని ప్రార్థిస్తున్నారు. అదే విధంగా వారికి వారే మేలు చేసుకుంటూ, పరులకు కూడా తమ వంతు మేలు చేసేవారి కోరికలను, మనసును, మంచిబుద్ధిని సత్వరం అభివృద్ధి చేసే తల్లీ, మహామంచి సుగుణాలకు ఈశ్వరివై, కోపము, అహంకారము, అజ్ఞానము పుట్టడానికి కారణమైన తమోగుణాన్ని జనుల బుద్ధినుంచి తొలగించు తల్లీ అంటూ శ్రీకాళీమాతను వేడుకుంటున్నారు, శ్రీగురుదేవులు.

**శ్లో॥ గతజన్మవర్తమాన సేవార్చనాభీష్ట సుఫల ప్రదాత్రి ! వరకాళి !**
**ఘనభక్తజనదేహ ప్రవిష్టమూర్తే ! దేవి ! దివ్యవాక్యోద్భవకారిణి !**
**నానావిధ ప్రాణి గణోపయోగ కార్యాభివృద్ధి శక్తి ప్రదాయిని ! దేవి !**
**విశ్వక్షేమ శాంత్యుపకార జనాభివృద్ధి కారణకార్య ప్రబోధిని ! కాళి! 73**

తా॥ భక్తులు, వారి పూర్వజన్మలలో, మరియు ప్రస్తుత జన్మలో చేసిన సేవలకు, వారి మనసులలో ఉన్న కోరికల మేరకు, వారికి మంచి ఫలితాలను ప్రసాదిస్తుంది

శ్రీకాళీమాత. గొప్ప భక్తులైన వారి దేహంలో ప్రవేశించి, వారి నోటి వెంట ఎల్లప్పుడూ వెలువడే మంచిశ్రేష్ఠమైన వాక్కులవలన సమాజానికి ఎంతోమందికి మేలు జరగాలని ఆ తల్లి సంకల్పించి, అలాంటి వాక్కులను వృద్ధి చేస్తుంది. యుద్ధాలు జరిగినా స్నేహాలు పెరిగినా దానికి మూలకారణం వారి నోటి వెంట వెలువడే మాటే. కారణం ఒకే విధమైన మాటను లౌక్యంగా మాట్లాడటం వలన ఆనందం కలిగి, స్నేహం అభివృద్ధి చెందుతుంది. అలాకాక అదే మాటను కటువుగా, హెచ్చరిక మాదిరి కోపంగా మాట్లాడటం వలన అనర్థాలు జరుగుతాయి. మాట ఒక్కటే, మాట్లాడే నోరు ఒక్కటే, కాని ఆ నోట్లోంచి వెలువడే మాట తీరు మారటం వలన ఎంతో వ్యత్యాసం కన్పిస్తున్నది. అలాంటి ఎన్నో ఇబ్బందులు, అనర్థాలు రాకుండా ఆ తల్లి భక్తుల మనసుల్లోని భావాలను, సుతిమెత్తగా, సౌమ్యంగా వెలువడే విధంగా, చేసి వారి వలన, వారి మాటలవలన ఇతరులకు మేలు జరిగేటట్లు దీవిస్తుంది. అదే విధంగా, భక్తులు సర్వప్రాణులకు ఉపయోగపడే పనులను అభివృద్ధి చేసే శక్తిని వారికి ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అనగా లోకంలో అన్ని ప్రాణులు ఒక్కటే, వాటి అవసరాలు బాధలు అనేకం అందువలన మనుషులతో పాటుగా తిరుగుతూ, సహజీవనం చేసే ప్రాణులకు కూడా శక్తివంచన లేకుండా అందరూ సాయపడాలని శ్రీగురుదేవుల అభిప్రాయం అన్ని లోకాలకూ శాంతి, ఉపకారం జరగాలని ఆశించే జనుల అభివృద్ధికి కారణమై, అలాంటి జనులకు మంచి మార్గాలను ప్రబోధించాలని, అంటే దేనికైనా సరే సాయపడే గుణం ఉన్న వారికి అలాంటి సుగుణాలను వృద్ధి చేస్తూ వారికి శ్రీకాళీమాత సాయపడుతుందని శ్రీగురుదేవులు తెలియచేస్తున్నారు.

**శ్లో॥ ఏకసంథాగ్రహణ ధారణాద్భుతశక్తి ప్రదే ! నవ్యసృజన శక్తి ప్రదాత్రి!**
**అత్యధిక కాలామృతోపన్యాసాద్భుతశక్తిప్రదాత్రి ! అమృతమూర్తే! శ్రీకాళి!**
**ఆస్తిక భక్తజనోద్ధారణాక్షయాలోచన సుభావోత్పత్తి ప్రదానకారిణి !**
**ఫలాపేక్షా రహితసుబుద్ధి ప్రదాత్రి! కాళి! స్వార్థత్యాగ స్వభావ ప్రదాయిని!74**

తా॥ ఒక పర్యాయము చూచినా, చదివినా, విన్నా వాటిని ఎప్పటికీ మరచి పోకుండా, మదిలో నిక్షిప్తం అయి ఉండే ఆశ్చర్యకరమైన శక్తిని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. ఆ దేవి, తన భక్తులకు, లోకంలో మరెక్కడా లేని, లభ్యం కాని రచనలు, ఇంతకు ముందెన్నడూ విననటువంటి సద్వాక్కులను పలికించి, ఇతరులకు వినిపించి,

ప్రాయించే పరమాద్భుత శక్తిని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. ఆ దేవి, తన భక్తులు జీవించి ఉన్నంతకాలము, అనగా, ఎక్కువ కాలం అలుపెరుగని రీతిలో ఆధ్యాత్మిక మరియు ఇతర మంచి ప్రసంగాలను ప్రవచించే, ఆశ్చర్యకరమైన శక్తి యుక్తులను సాధకులకు ప్రసాదించే తల్లి, ఆద్యంత కాలాలకు ఆధార రూపిణి అయినటువంటి శక్తి స్వరూపిణి శ్రీకాళీమాత. భక్తిశ్రద్ధలు ఎక్కువగా ఉన్న భక్తజనులను, నిరంతరమూ ఉద్ధరించే ఆలోచనలను, మంచి భావాలను, అమ్మ కరుణకు పాత్రులైనటువంటి మంచి జనులకు పెంపొందిస్తూ ఉంటుంది. ఆ తల్లి శ్రీకాళీమాత. ప్రతిఫలాన్ని ఆశించకుండా పరులకు ఉపయోగపడే మంచి కార్యాలను చేసే మంచి బుద్ధిని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. ఆ అమ్మ తన భక్తులకు స్వార్థం లేని బుద్ధిని, అలాగే సర్వస్వాన్ని త్యాగం చేయగలిగే మనోభావాలను, మంచి భక్తులకు ప్రసాదించే మహిమాన్విత స్వరూపిణి శ్రీకాళీమాత.

**శ్లో॥ పరిపూర్ణ జ్ఞానానుభవ పండిత శ్రేష్ఠ జనజిహ్వాగ్రవాసిని ! కాళి !**
**అమితపాండిత్యానుభవ శక్తిప్రదాత్రి ! కాళి ! ఆత్మజ్ఞానోద్భవమూర్తే !**
**అమరసంపదధ్యాత్మ విద్యాధికమర్మప్రబోధనాశక్తిప్రదే ! కాళి !**
**మంత్రాక్షర దేవి ! స్వరూపానేకాద్భుత వర్ణబోధక శక్తిప్రదాయిని ! 75**

తా॥ జ్ఞానంలో సంపూర్ణమైన అనుభవం కలిగిన పండితులలో శ్రేష్ఠులైన వారి నాలుకపై నివశిస్తుంది శ్రీకాళీమాత. అందువలన వారు ఎలాంటి సందర్భాలలో నైనా, ఎలాంటి వేదికల పైనుంచైనా, ఎలాంటి విషయాలనైనా అనగా, ఆధ్యాత్మిక, జ్ఞాన, సామాజిక, విద్య, వైద్య, న్యాయపరమైన మరియు ఏ ఇతర విషయాల గురించైనా అనర్గళంగా మాట్లాడి, అక్కడికి వచ్చిన వారిని ఆనందపరిచే యుక్తిని ఆ తల్లి ప్రసాదిస్తుంది. అలాగే వారికి అధికమైన పండితానుభవశక్తిని ప్రసాదించి, ఆత్మజ్ఞానాన్ని పుట్టిస్తుంది. అన్ని కాలాలకూ నిలిచి ఉండే గొప్ప ఆధ్యాత్మిక విద్యలలో ఉన్న మర్మాలకన్నా ఇంకా అధికమైన మహాగొప్ప మర్మాలను ప్రబోధించి, వాటిని అర్థం చేసుకోగల జ్ఞానశక్తిని భక్తులకు ప్రసాదిస్తుంది. భక్తి, ఆధ్యాత్మికత అనేవి, దేవుడున్నాడు, ఆయన్ను అడిగితే ఏమైనా ఇస్తాడు అనే జ్ఞానం మనిషికి కలిగిన దగ్గర నుంచీ ఏర్పడుతుంటాయి. అప్పటినుంచే ఎలా పూజిస్తే త్వరగా కటాక్షించి కోరికలు తీరుతాయనే భావాలు ఉద్భవిస్తుంటాయి. కాలం గడిచి యుగాలు మారిన

తరువాత శ్రీకాళీమాతే సర్వప్రపంచానికీ, అన్ని లోకాలకూ మూలాధారమని గ్రహించిన భక్తులకు, ఆ తల్లి తనను ఆరాధించే మార్గాలను ప్రబోధించి వారిని అనుగ్రహిస్తుంది. ఇందులో అత్యంత శ్రేష్ఠులైన భక్తులకు తనను సేవించే మార్గాలలోని అత్యంత రహస్యమైన విషయాలను తెలియచేస్తుందని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు అనుభవ పూర్వకంగా తెలియ చేస్తున్నారు. శ్రీగురుదేవులు ఈ శ్లోకంలో ఇంకా ఇలా ఉద్బోధిస్తున్నారు. శ్రీకాళీమాత సేవలో తరించి మహాయోగులైన వారు ఎన్నో సిద్ధులు పొందినవారు మంత్రాక్షరాలను ఎన్నో విధాలుగా వర్ణించి వాటి విశిష్టతలను మహిమలను తెలియచేస్తుంటారు. ఒకే మంత్రాక్షరం వివిధ సందర్భాలలో భక్తునికి రక్షణ కల్పిస్తుంది, సంపదలను ప్రసాదిస్తుంది, వారిలోని దుర్గుణాలను పోగొట్టి మంచిని పెంచుతుంది, జ్ఞానాన్నిస్తుంది, భక్తులకి ఏ సమయంలో ఏది అవసరమో ఆ విధంగా అవసరాలను తీర్చుతుంది, అలాగే ఒక దేవతాశక్తిని అనేక రూపాలుగా వర్ణన చేసి ప్రబోధించే శక్తిని ఆ తల్లి శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. ఎలాగంటే ఒకే రూపమైన శ్రీకాళీమాత వేర్వేరు సందర్భాలలో వేర్వేరుగా కన్పిస్తున్నట్లు వర్ణిస్తారు. ఒకసారి సుందర రూపంగా, దుష్ట సంహార సమయంలో రౌద్రరూపంగా, భక్తులకు వరాలను ప్రసాదించే సందర్భంలో ఆనందమూర్తిగా వరప్రదాయినిగా, విద్యలను దానం చేసేటప్పుడు సౌమ్యమైన సాత్వికమూర్తిగా, ఇలా ఎన్నో విధాలుగా వర్ణన చేసే శక్తిని ఆ తల్లి సాధకులకు ప్రసాదిస్తుంది శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తమ పరిపూర్ణమైన అనుభవ జ్ఞానంతో తెలియచేస్తున్నారు.

**శ్లో॥ సకల వేదశాస్త్ర పఠనానుభవ శక్త్యధిక సుయుక్తిప్రదే ! కాళి !**
**అఖిలలోకాది ధర్మాచార్య శ్రీగురుదక్షిణామూర్తి సంసేవితప్రియే !**
**దశచరణ దశపాణిమూర్తే! దశముఖ స్వరూపిణి! దక్షిణ కాళీశ్వరి !**
**వివాద సమయకాలానుకూలానుగ్రహమూర్తే ! శ్రీకాళి! భువనేశ్వరి! 76**

తా॥ అన్ని వేదశాస్త్రాలు చదివితే వచ్చే అనుభవ శక్తి కన్నా, ఇంకా ఎక్కువ మంచి తెలివిని, జ్ఞానాన్ని ప్రసాదించే తల్లి శ్రీకాళీమాత. లోకంలో లభించే అన్ని వేదాలను శాస్త్రాలను చదివి వాటి సారాంశాన్ని అర్థం చేసుకోవాలంటే జీవితం సగభాగం కన్నా ఎక్కువే సమయం పడుతుంది. అలాగని అవి అన్నీ ఒకచోట

లభించేవి కావు. వాటిని తిరిగి పొందటం కోసమే ఎంతో సమయం వృధా అవుతుంది. ఒకవేళ లభించినా వాటినన్నింటినీ వివరించి చెప్పగలిగిన గురువు కావాలి. ఒకే గురువు సకల శాస్త్రాలు వేదాలూ, ఆయనకు అనుకూలత లేకపోవటం వలన చెప్పలేకపోవచ్చు. కాబట్టి ఎక్కువమంది గురువుల నాశ్రయించవలసి వస్తుంది. ఇంత కష్టపడి నేర్చుకున్న విషయజ్ఞానం కన్నా, ఆ తల్లి శ్రీకాళీమాతను ఆరాధించటం వలన, సాధకులు వారున్నచోటు నుంచి కదలకుండా, అన్ని వేదశాస్త్రాలు చదివిన అనుభవాన్ని మించిన శక్తిని ఆ తల్లి ప్రసాదిస్తుంది. సమస్త లోకాలలో ఉన్న అన్ని ధర్మాలు తెలిసిన, మంచి ఆచారవంతులైన, శ్రీ గురుదక్షిణామూర్తి (శివుడు) సేవలకు సంతృప్తి చెందిన శ్రీకాళీమాత, పదికాళ్లు, పదిచేతులు మరియు పదిముఖాలు కలిగిన తల్లియే శ్రీదక్షిణ కాళీమాత. ఈ విశిష్టమైన రూపాన్నే శ్రీదక్షిణామూర్తి రూపంలో నున్న శివుడు ఆరాధించినట్లు శ్రీగురుదేవులు తెలియచేస్తూ న్యాయాలయాలలో వాది ప్రతివాదుల మధ్య జరుగుతున్న వివాద సమయంలో కాలచక్రాన్ని అనుకూలంగా మార్చి అనుగ్రహించి, భక్తులకు ప్రతివాదిపై విజయాన్ని ప్రాప్తింపచేసే తల్లి, సర్వభువనాలకూ ఈశ్వరియైన శ్రీకాళీమాత అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీవరకాళి ! మాతాపితృగురు దైవభక్తి శ్రీ యశోభాగ్యప్రదాయిని !**
**సదాలోచన దృఢసహనశక్తిప్రదే ! కాళి ! సదా సౌహిత్యప్రదాత్రి !**
**నిత్యనిగ్రహ సాధనోత్పత్తి సత్యసంపూర్ణ శ్రీసత్ఫలితప్రదే ! కాళి !**
**బ్రహ్మజ్ఞానానంద సుప్రేమ దయాక్షమా కరుణాద్భుత గుణప్రదాయిని! 77**

తా॥ అమ్మా శ్రీ వరకాళీమాతా ! తల్లిదండ్రులపైన, గురుమూర్తిపైన దైవభక్తిని ప్రసాదించి, మంచిభోగము, వైభవాలతో కూడి యున్న కీర్తిని అదృష్టాన్ని నీ భక్తులకు దానం చేస్తావు. జన్మకు కారకులైన తల్లిదండ్రులు దైవంతో సమానం, దేవుణ్ణి ఎలా పూజిస్తామో వారిమీద కూడా అలాంటి భక్తిభావమే ఉండాలి. బాల్యంనుంచి ఎదురయ్యే ఎన్నో బాధలకోర్చి, వారి ఆకలి దప్పులను కూడా లెక్కించక పెంచి పెద్ద చేస్తారు. నడకలు నేర్పిస్తారు. నడవడికను, విద్యాబుద్ధులను, కావలసిన జ్ఞానాన్ని ఇవన్నీ నేర్పించి జీవితంలో స్థిరమైన స్థానాన్ని ఉద్యోగంద్వారా గాని, వ్యాపారం ద్వారా గాని కల్పిస్తారు. వారు ఏమీ ఆశించకుండా తమ సంతానానికి ఇన్ని సేవలు చేస్తారు. ఏ లోకంలోనైనా తల్లిదండ్రులు మంచిసేవ చేసి సంతానాన్ని

వృద్ధిలోనికి తీసుకొని వచ్చే బంధం, అనుబంధం వేరొకటి లేదు. అదే విధంగా గురువు. లోకంలో గురువుకున్న స్థానం ఎంతో పవిత్రమైనది, ఉత్తమమైనది. జీవితానికి అవసరమయ్యే అన్ని విషయాలనూ తెలియజేస్తూ, ముఖ్యంగా అవసరమయ్యే వినయం, విధేయత, పెద్దలను గౌరవించటం, మన మాటలవలన ఎదుటివారిని నొప్పించక పోవటం మొదలైన అన్ని విషయాలను, శాస్త్రాలలోని వ్యక్తుల, సంఘటన ద్వారా తెలియజేస్తూ, వారిని కన్నబిడ్డలవలె చూసుకుంటారు. ఒక గురువు శిష్యులకు చేసే జ్ఞాన బోధనా, సేవలు మరెవ్వరికీ సాధ్యంకాదు. అందువలన తల్లిదండ్రులు, సద్గురువులే ఈ లోకంలో మొదటగా ఆరాధించవలసిన దైవాలు. అందువలన వారిని సేవించుకోగలిగే అదృష్టాన్ని, దైవభక్తిని అందరికి ప్రసాదించమని శ్రీగురుదేవులు ఆ తల్లిని వేడుకొంటున్నారు. అన్నివేళలా మంచి ఆలోచనలను, గట్టి సహనశక్తి నిచ్చి, మంచిని కోరుకునే మనసునిచ్చి అన్ని కాలాలలో నిగ్రహంతో ఉంటూ, చేసే సాధనలను ఏ ఆటంకం లేకుండా అభివృద్ధిపరుస్తూ, దానికి ఫలితంగా పరిపూర్ణమైన మంచి ఫలితాలను ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. బ్రహ్మజ్ఞానాన్ని సాధకులకు కానుకగా ప్రసాదించి తద్వారా సాధకులకు సంప్రాప్తించే ఆనందము, మంచిని ప్రేమించే గుణము, ఇతరుల యందు దయ, క్షమించగలిగే గుణం, కరుణతో కూడిన మహత్తరమైన సుగుణాలను వరాలుగా ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ పూర్వజన్మాభీష్ట వర్తమానకృషి పుణ్యకార్యాచరణ స్వశక్తిప్రదే !**
**నిత్యభక్తి నియమనిష్ఠాచార దివ్య దేవ్యుపాసనాదృష్ట ప్రాప్తి ప్రదే !**
**ఉత్తమోపాధ్యాయ బిరుద విరాజమాన తేజశ్శక్తి సుయుక్తి ప్రదాత్రి !**
**జంబూవృక్షాగ్ర సంవాసిని ! శ్రీకాళి ! జంబూఫల నివేదనానందేశ్వరి! 78**

తా॥ గతజన్మలో మిగిలియున్న కోరికలు, ఈ జన్మలో మనంచేసే కృషివలన పుణ్యకార్యాలు చేసే సొంతశక్తిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. ఏదైనా పుణ్యకార్యాన్ని తలపెట్టి దాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేయాలంటే ఎంతో ఖర్చు, శ్రమ అందులో కూడుకొని ఉంటాయి. దైవకార్యం గనుక అందరూ తలోకాస్త చందా వేసుకొని, ఆ కార్యక్రమంలో భాగస్వాములై దాన్ని పూర్తి చేయటంవలన వచ్చే పుణ్యంలో అందరికీ కొద్దికొద్దిగా పుణ్యఫలం లభిస్తుందని భావిస్తారు. ఇందులో పాల్గొనే శక్తి పూర్వజన్మ

సుకృతం తగినంత లేకపోవటంవలన, ఆ పుణ్యకార్యాలను ఒక్కరే సొంతంగా చేసే శక్తి కలిగి ఉండకపోవచ్చు అది వారికి ఎవ్వరికీ తెలియదు. అందువలన వారు అందరూ కలిసి చెయ్యగలిగే ప్రాప్తిని మాత్రమే కలిగి ఉంటారు. కాని గతజన్మలో ఏవైనా పుణ్యకార్యాలు చెయ్యాలనే కోరికలుండి, అవి తీరకుండానే జన్మ చాలించిన వారు ఈ జన్మలో వాటిని, గతజన్మ వాసనలుగా పొందగలిగి, సొంతంగా చెయ్యగలిగే శక్తిని వారికి శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. రోజూ భక్తితో, నియమనిష్ఠలు ఆచరించి శ్రేష్ఠమైన దేవి ఉపాసన చేసే అదృష్టాన్ని భక్తులకు ఆ తల్లి కలిగిస్తుంది. శ్రీకాళీమాత ఉపాసనకు, ఆరాధనకు నిశ్చలమైన, మనసు పూర్తి విశ్వాసంతో కూడియున్న భక్తి, నియమనిష్ఠలు ఎంతో ముఖ్యమని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తమ అనుభవాల సారాన్ని ఈ శ్లోకంలో వివరించారు. అధ్యాపక వృత్తిలో ఉన్నవారికి, ఆ వృత్తిలో వారు అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా శ్రేష్ఠమైన అధ్యాపకుడు అధ్యాపకురాలు అనే బిరుదుతో వారు సత్కారాలను అందుకుంటూ, విశేషంగా ప్రకాశించే మంచి శక్తితో కూడిన కీర్తిని తెలివితేటలను ప్రసాదిస్తుంది ఆ తల్లి, శ్రీకాళీమాత. నేరేడు చెట్టుపై కనుపించిన శ్రీకాళీమాత, నేరేడు ఫలాలను నైవేద్యంగా నివేదిస్తే ఎంతో ఆనందిస్తుంది. అంటూ తెలియజేశారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ అంతర్ముఖ సంచార స్థిరబుద్ధిప్రదాత్రి ! మనోనిగ్రహశక్తిదాయిని !**
**సద్భక్తానుగ్రహకారిణి ! దేవి ! సత్యమూర్తే ! సంపూర్ణ కీర్తి ప్రదాయిని !**
**నవ్యలోక సృష్ట్యాదిమూర్తే ! దేవి ! భవ్యదర్శన ప్రాప్తిప్రదాయిని ! కాళి!**
**మణిద్వీప పురనివాస యోగ్యతాప్రాప్తికారిణి ! కాళి ! భువనేశ్వరి! 79**

తా॥ అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లు సంచరిస్తూ, నిలకడగా ఉండే బుద్ధిని ప్రసాదించి మనసును నిగ్రహించుకొనే శక్తిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. ఆ తల్లిని ఆరాధించటం ప్రారంభించిన తరువాత మొదటగా సమకూరేది, మనసుకు ఏదో తెలియని అనుభూతి, ఆనందం, ప్రశాంతత. దానివలన రోజూ పూజ చేయాలి అనే భావం తెలియకుండానే కల్గుతుంది. రోజు మొత్తంలో ఎప్పుడు ఖాళీ దొరుకుతుందా, ఆ తల్లికి ఎప్పుడు సేవ చేద్దాము అనే కోరిక, రోజు రోజుకీ పెరుగుతుంది. ఎల్లప్పుడూ దృష్టి ఆ తల్లిపై ఉండటం వలన, బయటివారితో వ్యవహారాలను, తక్కువగా మాట్లాడి ముగించెయ్యటానికి ప్రయత్నిస్తారు. ఆ తరువాత

అవసరం అయినంతవరకే మాట్లాడటానికి మొగ్గు చూపుతారు. ఈ స్థితులన్నీ దాటి ముందుకు వెళ్లే సరికి ఆ తల్లి శ్రీకాళీమాత, సాధకులకు ఎంతో జ్ఞానాన్ని పెంచుతుంది. అందువలన వారు నిండుకుండలా, తొణకక, బెణకక, దేనికీ చలించని రీతిలో ప్రవర్తిస్తుంటారు. మనసును పూర్తిగా తమ అధీనంలోనికి తెచ్చుకోగల శక్తి ఆ తల్లి ప్రసాదిస్తుంది. మంచి భక్తులను ఆ తల్లి ఎప్పుడూ అనుగ్రహించే సత్యమైన మూర్తి. ఆ తల్లి తమ భక్తులకు ఎప్పటికీ నిలిచి ఉండే కీర్తిని యశస్సునూ సొంతం చేస్తుంది. కొత్త లోకాలను సృష్టించే ఆదిమూర్తి అయిన శ్రీకాళీమాత ఆ లోకాలను చూడగలిగే శక్తిని భక్తులకు ఇస్తుంది. సాధారణంగా మానవులు చూడగలిగేది భూలోకంలో ఉన్న ప్రాంతాలు మాత్రమే. కాని, ఆ తల్లి సాధకులకు ప్రసాదించే అమోఘమైన దివ్యశక్తి వలన, వారు దివ్యదృష్టి ద్వారా, ఆ తల్లి సృష్టించిన అనేక మహత్తర లోకాలను దర్శించగలిగే భాగ్యం కలుగుతుంది. అలాగే ఆ తల్లి ప్రసాదించిన శక్తివలన, ఆ తల్లి నివసించే మణిద్వీప పురంలో సాధకులు నివసించే యోగ్యతను ప్రసాదిస్తుంది భువనేశ్వరీయైన శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ పారిజాత కుసుమార్చనానందమూర్తే ! పరమపావన లోకేశ్వరి !**
**నిర్భాగ్య నిరాధారశక్తి భక్తజనప్రియే ! మనోధైర్యశక్తి ప్రదాత్రి !**
**విమల భృత్య జనాదరణ సంపోషణ సుజన సంరక్షిణి ! శ్రీకాళి !**
**సోదర సోదరీ జనగౌరవాధారసుజన నిత్యాశీర్వాదాభివృద్ధికారిణి !80**

తా॥ పారిజాత పుష్పాలతో పూజిస్తే ఆనందించే తల్లి శ్రీకాళీమాత. ఈ పూలు దేవలోకంలో మాత్రమే పుష్పిస్తాయని అంటారు వాటి సౌరభం, సకల లోకాలలోనూ లభించే పూలన్నింటికంటే ఎక్కువగా ఉంటుంది. పారిజాత పుష్పాల పరిమళంలో దివ్యత్వం ఉంటుంది. అందువలన శ్రీకాళీమాతకు ఆ పూలతో తనకు చేసే పూజలంటే ఎంతో ఇష్టం. ఆ తల్లి మిక్కిలి పవిత్రమైనది మరియు సకల లోకాలకు ఈశ్వరి. అన్ని లోకాలను పాలిస్తూ అందులోని చరాచర జీవరాసుల సృష్టి, స్థితి, లయలకు ఆ తల్లే మూలకారణం. అశక్తులైన భక్తజనులంటే ఇష్టపడుతూ వారి మనసుకు ధైర్యశక్తిని ప్రసాదించి, మంచి సేవకులను ఆదరించి పోషించే, మంచివారిని రక్షిస్తుంది శ్రీకాళీమాత. భక్తిభావనతో కొంతమంది జనులు, సహభక్తులంటే ఇష్టపడి, వారు శక్తిలేని వారుగా, పూజలు చేయాలన్నా, ఆరాధనలు చేయాలన్నా ఆర్థికస్థితి సరిపోని

వారిని గమనించి వారికి అన్నివిధాలా సహాయపడుతూ, ఉపశమన వాక్యాలు పలుకుతూ, ఆ తల్లి మేలు చేస్తుంది, ఆ తల్లి భక్తులు ఇతరులకు అధైర్యపడవద్దు, అంటూ ధైర్యాన్ని చెబుతుంటారు. అలా సాటి భక్తులను ప్రోత్సహిస్తూ, సాయం చేసే భక్తులను ఆ తల్లి ఎల్లప్పుడూ రక్షిస్తూ, వారి సేవాతత్పరతను వృద్ధి చేస్తుంది శ్రీకాళీమాత. అన్నదమ్ములను, అక్కాచెల్లెళ్లను, గౌరవించి, ఆదరించే వారిని ప్రతిరోజూ ఆశీర్వదిస్తూ, ఆ ఆశీర్వాదాన్ని అభివృద్ధిపరుస్తుంది శ్రీకాళీమాత. సాంప్రదాయాలను గౌరవిస్తూ, తల్లిదండ్రుల నుంచి వారికి సంక్రమించిన మంచి గుణాలుండి, కుటుంబంలోని సభ్యులైన మిగతా వారిని ఎల్లప్పుడూ పూజ్య, గౌరవ భావంతో, ఆదరించే వారికి ఆ తల్లి శుభకరమైన ఆశీర్వచనాలను ఇస్తూ వాటిని వృద్ధి చేస్తుంది శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ జీవితకాలావసర ప్రబోధిని ! జీవనావసర ధనప్రదాయిని !**
**ఉత్తేజోత్సాహప్రదాయిని ! ఉత్తమాదిమూర్తే ! ఊహోత్తమాభీష్ట ప్రదాత్రి!**
**దివ్యామరధన సముపార్జన మార్గోపదేశమూర్తే ! దీనజనప్రపాలికే !**
**సర్వకాల సర్వావస్థానేక పుణ్యకార్యాచరణ సుబుద్ధిప్రదాయిని ! 81**

తా॥ జీవితంలో భక్తులకు ఏమి అవసరమో తెలియజేస్తూ, వారు జీవించటానికి అవసరమైన ధనాన్ని ప్రసాదిస్తూ సంతోషాన్ని, ఆనందాన్ని ఇచ్చే శ్రేష్ఠమైన తల్లి శ్రీకాళీమాత. జీవితమనే ప్రయాణంలో ఎప్పుడు, ఎక్కడ ఏ విధమైన అవసరాలు కలుగుతాయో ఎవ్వరూ ముందుగా తెలుసుకోలేరు. ఒక్కొక్కసారి ఊహించని విధంగా జరిగే పరిణామాలవలన, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుంది. కొన్నిసార్లు అనవసరమైన విషయాలలో తలదూర్చి బాధలు పడవలసి వస్తుంది. కాని ఆ తల్లి, తనను నమ్మిన వారికి, సరైన మార్గాన్ని నిర్దేశిస్తూ వారికి ఏది అవసరమో తెలుసుకోగల విషయజ్ఞానాన్ని ప్రసాదిస్తూ, అదే విధంగా వారి అవసరాలకు, తగిన విధంగా వారికి కావలసిన దాన్ని సమకూర్చుకొనే శక్తిని అనుగుణమైన పరిస్థితులను వారికి కల్పించి, అందువలన భక్తులు పొందే ఆనందాలను, సంతోషాలను అభివృద్ధి చేస్తుంది శ్రీకాళీమాత. ఊహకు అందని కోరికలనెన్నింటినో తీరుస్తూ, భక్తులకు, శ్రేష్ఠమైన ధనమేమిటో తెలియజేసి ఆ ధనాన్ని సంపాదించే మార్గాలను ఆ తల్లి దీనజనులకు తెలియజేస్తుంది. శ్రేష్టమైన ధనమంటే మొదటిది జ్ఞానం, రెండవది ఇతరులను

దోచుకోకుండా, మోసం, దగా, కుట్రలు చేయకుండా, స్వార్ధం లేకుండా, స్వయంకృషితో సంపాదించే డబ్బుని చెప్పుకోవచ్చు. అలా సంపాదించడానికి ఎన్ని ఇబ్బందులెదురైనా కష్టపడి సంపాదించిన డబ్బు అందులో కొంత వెచ్చించి ఆ తల్లిని పూజించటం వలన సంతోషించి, ఆ విధమైన డబ్బు కృషితో సంపాదించడానికి అనువైన మార్గాలను ఆ తల్లి సమకూర్చుతుంది. అలాంటి డబ్బే దివ్యమైనది, అమరమైనది. అన్ని కాలాలలోను, ఏ సమయములలోనైనా అనేక పుణ్యకార్యాలను చేసే మంచి బుద్ధిని, మంచి గుణాన్ని ప్రసాదించి, వారి జన్మను ధన్యం చేసుకుంటూ, వారి దరి చేరిన వారి జన్మలను కూడా సార్ధకం చేసుకునే మంచి మార్గాలను ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత.

**శ్లో॥ భూప్రకంపనవహ్నివృష్టి ప్రాణాంతకవృత్త వాయుస్తంభనకారిణి ! కాళి!**
**చిత్రాతిచిత్ర వ్యాధ్యుద్భవ ప్రకృతి మర్మ ప్రబోధనాది సువైద్యమూర్తే !**
**భూగర్భాంతరోద్భవ జలాగ్ని విషవాయు ప్రళయాదృశ్యమూర్తే ! శ్రీకాళి!**
**వర్తమానకాల మరణాసన్న భావిజన్మాయుర్వర ప్రదాయిని ! కాళి ! 82**

తా॥ ప్రకృతిలో సంభవించే అనేక ముప్పులైన భూకంపాలు, అగ్నివర్షాలు, ప్రాణాలను సైతం హరించివేయగల జలప్రళయాలు తీవ్రమైన సుడిగాలులను, ఆ తల్లి శ్రీకాళీమాత మాత్రమే ఆపగలిగిన సమర్ధురాలు. పంచభూతాలలోను, జీవ, నిర్జీవ పదార్ధాలలోనూ, అన్ని భువనాలలోని ప్రతి అణువులోనూ నిండి సర్వలోకాల లోనూ వ్యాపించి ఉన్నది శ్రీకాళీమాతయే. శతాబ్దాలు, యుగాల తరబడి నిర్జీవంగా ఉన్న కొండలు గుట్టలు సైతం ప్రకృతిమార్పువలన అవి మహత్తరమైన ప్రళయశక్తులను సంతరించుకొని మానవాళికి కోలుకోలేని విధ్వంసాన్ని సృష్టిస్తాయి. అదే విధంగా అగ్ని, వాయువు నీటికి సంబంధించిన జలప్రళయాలు కూడా ఉద్భవిస్తాయి. అలాంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆ తల్లి అలాంటి ప్రళయ సమానమైన పరిస్థితులను చక్కదిద్ది, వాటిని శాంతింపచేసి భక్తులకు ఏ ఆపదా రాకుండా కాపాడుతుంది. ఆ శక్తి ఆ తల్లికి మాత్రమే ఉన్నది. కలుషితమైన ప్రకృతినుంచి జనించే అనేక గొప్ప ప్రాణాంతక, ఆశ్చర్యకరమైన జబ్బులను శాశ్వతంగా నివారించుకొని, మంచి ఆరోగ్యాన్ని పొందగలిగే మర్మాలను తెలియజేసే మంచి వైద్యమూర్తి శ్రీకాళీమాత.

భూగర్భంలోపల పుట్టే, నీళ్లతో కలసి అగ్ని, వాయువుతో కూడి అత్యంత భయానకంగా, భూమిని చీల్చుకొని, ఎగసివచ్చే మహాప్రళయాలను సైతం ఆ తల్లి శాంతింపచేసి పోగొడుతుంది. అమ్మవారు సంకల్పిస్తే, మానవులకు ప్రస్తుత జన్మలో, మరణం ఆసన్నమైనా, ఆ భక్తులకి రాబోయే జన్మలలో ఉండే ఆయువులోని కొంత భాగాన్ని ఈ జన్మలోని ఆయువుకు జతచేసి వారి ఆయువును పెంచగలిగే శక్తి సామర్థ్యాలు కలిగిన మహాశక్తి స్వరూపిణి శ్రీకాళీమాత. ప్రాణాన్ని దానంచేసి వరంగా ప్రసాదించ గల శక్తి ఆ తల్లి. శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శీఘ్రవరప్రదాత్రి ! దేవి ! సద్బుద్ధిప్రదే ! శ్రీకాళి ! సన్మార్గోపకారిణి !**
**నిత్యశుభప్రదే ! నిజభోగప్రదాత్రి ! కాళి ! మహాసామ్రాజ్యప్రదాయిని!**
**శ్రీమూర్తే ! జనని ! జగన్మోహనకారిణి ! కాళి ! జగద్రక్షాస్వరూపిణి !**
**వాణీరమాసేవితమూర్తే ! శ్రీదుర్గా రాజరాజేశ్వర్యర్చితే! వరకాళి ! 83**

తా॥ చాలా త్వరగా వరాలను ఇవ్వగలిగిన తల్లి శ్రీకాళీమాత. ఎందువల్ల నంటే భక్తుల మనసులో ఏ కొంచెమయినా ఆ తల్లిని సేవించాలని ఆలోచన చిగురిస్తే చాలు, ఆ ఆలోచనలను వృద్ధిచేసి, వెంటనే వారికి, కొన్ని దృష్టాంతాలను, 'ఆ తల్లి సత్యదేవతయే' అనే భావనలు కలిగే విధంగా చూపిస్తుంది ఆ తల్లే శ్రీకాళీమాత. అందువలన ఆ భక్తులు ఆ తల్లిని మరువలేని విధంగా ఆరాధిస్తారు. ఫలితంగా వారికి ఆ తల్లి అనేక వరాలను ప్రసాదిస్తుంది. మంచి భక్తులైన వారికి శ్రీకాళీమాత మంచిబుద్ధిని ప్రసాదించి, జీవితాలు సక్రమంగా, ఏ ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగే మార్గాలను చూపిస్తుంది. రోజూ అధికమైన శుభాలను ఇస్తూ కలకాలం, తరతరాలకూ నిలిచి ఉండే భోగాలను ప్రసాదిస్తూ, గొప్ప గొప్ప పదవులను ప్రసాదించే శుభమూర్తియైన తల్లి శ్రీకాళీమాత. ఈ విశ్వాన్ని మోహింప చేయగలశక్తి, ఈ జగత్తునే రక్షించే తల్లి శ్రీకాళీమాత. సరస్వతీ, లక్ష్మి దేవతలచేత సేవింపబడుతూ, దుర్గాదేవి, శ్రీరాజరాజేశ్వరి దేవతలచేత అర్చించబడే శ్రీ ఆదిపరాశక్తి శ్రీకాళీమాత. ఆ అమ్మ శ్రీకాళీమాతను ఆరాధిస్తే అందరి దేవతలను ఆరాధించిన ఫలితం దక్కుతుందని, ఆ దేవతామూర్తులందరూ ఇచ్చే అనేక శుభఫలితాలను అన్నిటిని, భక్తులకు శ్రీకాళీమాత ప్రసాదిస్తుందని శ్రీగురుదేవులు తెలియజేస్తుంటారు.

**శ్లో॥ శ్రీకల్యాణమూర్తే ! అనావృష్టి దుర్భిక్షాతివృష్ట్యదృశ్యకారిణి! శ్రీకాళి !**
**మహాప్రళయనివారిణి ! సకాల జలవృష్టి ప్రదాత్రి ! విశ్వసంరక్షిణి !**
**సకల లోకాంతరాత్మ సంచారప్రాప్తికారిణి ! మనోభావమర్మ ప్రబోధిని!**
**సకల సురసంభాషణశక్తిప్రదాత్రి ! దివ్యగణమైత్రిభాగ్యప్రదాయిని !84**

తా॥ సద్గురుమూర్తియైన శ్రీకాళీమాత భక్తజనులకు సమస్త శుభాలనూ ప్రసాదిస్తుంది. అనగా బాల్యం నుంచి ప్రతివిషయంలోనూ వారికి జరిగే ప్రతి కార్యక్రమం శుభకరంగానే ఉంటుంది. బాల్యంలో మంచి చదువుకు శుభకరమైన పునాది పడుతుంది. యవ్వనంలో వేసే ప్రతిఅడుగూ శుభకరమైన మార్గంలోనే పడుతుంది. కౌమారంలో యవ్వనంలో వారికి అనుకూలమైన మంచి ఉద్యోగం వ్యాపారం ఇది అదీ అని లేక అన్నీ శుభకరంగానే సాగిపోతుంటాయి, ఇవన్నీ శ్రీకాళీమాత, తన భక్తులకు, వారి కుటుంబాలకు, వారితో అనుబంధం ఉన్న అందరి బంధువులకూ, మిత్రులకూ కూడా ఆ తల్లి ప్రసాదిస్తుంది. అదే విధంగా అన్ని విధాలైన వైభవాలనూ ప్రసాదిస్తుంది. సంఘంలో, అందరిలో ప్రముఖులుగా పేరుగాంచి వైభవాన్ని, రాజభోగాలను అనుభవింప చేస్తుంది శ్రీకాళీమాత. అలాగే లోకంలో ఏర్పడే అనావృష్టినీ, అనగా వర్షాలు పడక, పంటలు పండక, దుర్భరమైన ఘోరమైన కరువు కాటకాలు వచ్చి మనుషులు, పశుసంపద నశించే పరిస్థితిని రానీయక అతివృష్టినీ, అనావృష్టినీ అదృశ్యం చేసి, సకాలంలో, అవసరమైనంతవరకు వర్షాలను కురిపిస్తూ, పంటలను సస్యశ్యామలం చేస్తూ, దుర్భిక్షాన్ని అనగా ప్రజలు తిండికి లేకుండా పస్తులుండే పరిస్థితి, మరియు పొలాలన్నీ ఎండిపోయి బీడులుగా మారే పరిస్థితులు కలుగకుండా చేస్తుంది శ్రీకాళీమాత. ప్రపంచానికి కలిగే మహా ఉపద్రవాలను, నివారించగల మహాశక్తి స్వరూపిణి ఆ తల్లి. అనుకూల సమయంలో అవసరానికి తగిన విధంగా వర్షాలను కురిపిస్తూ జగత్తును రక్షించే జగజ్జనని ఆ తల్లి. సూక్ష్మరూపంతో, సకల లోకాలలోనూ సంచరిస్తూ, బ్రహ్మాండంలోని వివిధ అద్భుతాలతో నిండి ఉన్న గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుషాది దేవలోకాలను దర్శించగలిగే మహాఅద్భుతమైన శక్తిని, భక్తులకు శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. ఆ తల్లి భక్తులకు ప్రసాదించే వరాలలోకెల్లా గొప్పవరం ఇదియే కాక, ఎదుటివారి మనసులో దాగి ఉన్న భావరహస్యాలను తెలియచేసే శక్తిని, భక్తులకు ప్రసాదించే

తేజస్స్వరూపిణి శ్రీకాళీమాత. వీటన్నింటికంటే మహాద్భుత విషయం ఏమిటంటే, ఆ తల్లి తన భక్తులకు, వారు సకల దేవతలతోనూ సంభాషిస్తూ వారితో మిత్రత్వాన్ని పెంచుకొనే అద్భుతశక్తిని ప్రసాదిస్తుంది. సత్యస్వరూపిణి అయిన శ్రీకాళీమాత అంటూ తెలియచేస్తున్నారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**శ్లో॥ శ్రీకాళి ! ఆదిపరాశక్తే ! వేజెండ్లపురవాసిని ! చిద్విలాసిని ! దేవి !**
**జగజ్జ్ఞానానందప్రదే ! ఆదిశక్తే ! జనన మరణ మర్మప్రబోధిని !**
**దివ్యమంగళ స్వరూపిణి ! దేవి ! శ్రీ శోభితే ! హే మహాప్రకాశిని !**
**నరఘోషధ్వంసిని ! సర్వరక్షిణి ! వరకాళి ! నానాశుభప్రదాయిని! 85**

తా॥ శ్రీకాళీమాత అమ్మవారు, వేజెండ్లలో, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారిచే ప్రతిష్ఠింపబడి, వేజెండ్లపురవాసిని అయినది. ఆ తల్లి అక్కడి జనులను ఉద్ధరిస్తూ, ఆ గ్రామప్రజలను కంటికి రెప్పలా, వారికి ఎలాంటి ఈతిబాధలూ లేకుండా కాపాడుతుంది. గతంలో, ఆ గ్రామంలో కలరా వ్యాధి ప్రబలినపుడు, గ్రామప్రజలు ఆ వ్యాధి బారినపడి విలవిలలాడుతున్నప్పుడు, వారిని, మృత్యువు బారినపడకుండా కాపాడింది శ్రీకాళీమాతయే. వేజెండ్ల గ్రామంలో ఇంతకు పూర్వం ఎప్పుడూ కొట్లాటలు జరుగుతూ వుండేవి శ్రీకాళీమాతను ప్రతిష్ఠించిన తరువాత అవి అన్నీ ఆగిపోయాయి. ఆ తల్లిని సేవించవచ్చే నిజభక్తులకు, అనగా మనసా, వాచా, కర్మణా ఎల్లప్పుడూ ఆ తల్లినే నమ్ముకుని ఆరాధించే భక్తులకు, ఆ తల్లి సకల శుభాలనూ, సౌకర్యాలను కలుగచేస్తూ, శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారికి సద్గురువై విరాజిల్లుతూ, భక్తజనులకు సత్యదేవతయై నిలిచి పూజలందుకుంటున్నది శ్రీకాళీమాత. ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాత చిద్విలాస స్వరూపిణియై, ఆ తల్లిని సేవించవచ్చే భక్తజనులకు, సదా సంతోషాన్ని ఆనందాన్ని, ఆత్మసంతృప్తిని ప్రసాదిస్తుంది. అమృతమూర్తి అయిన శ్రీకాళీమాత. జీవులు ఎందుకు పుడుతున్నారో, ఎందుకు మరణిస్తున్నారో, వాటి వెనుక దాగి ఉన్న జనన మరణ మర్మాలను తెలియచేస్తుంది జగన్మాత. అందువలన మరల మరల జన్మలు రాకుండా ఉండే మార్గాలను అనుసరిస్తూ, అందుకు తగిన ప్రవృత్తులను సాధకులు ఆచరించే విధంగా, ఆ తల్లి, కాలస్వరూపిణి అయిన శ్రీకాళీమాత, వారికి తగిన మార్గాలను సూచిస్తుంది. ఆ తల్లి దివ్యమంగళ

స్వరూపంతో, బంగారుమయమైన వర్ణం గలిగిన మహాకాంతితో ప్రకాశించే పరమాద్భుతశక్తి స్వరూపిణి. నరఘోషలను అనగా ఒకరు బాగుండి మంచిగా అభివృద్ధి చెందుతుంటే, ఇతరులు చూసి ఓర్వలేక అసూయ చెందటం, అలాగే నరులదిష్టిని అనగా బాగుపడే వారిని చూసి, వారు నాశనం కావాలనే కోరికలు ఇతరులలో కలగటం వంటి వాటివలన ఏర్పడే పీడలను, బాధలను విధ్వంసం చేసి భక్తజనులలను రక్షిస్తూ, సకల శుభాలనూ, భక్తులకు, ఆ తల్లి, వరస్వరూపిణియైన శ్రీకాళీమాత, పరంపరగా ప్రసాదిస్తూ ఉంటుందని అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సూర్యోదయాస్తమయాది చంద్రోదయాస్తమయ పునః భాస్కరోదయ దేహసంరక్షిణి!**
**పరదూషణాపకారా సత్యవాక్య శ్రవణాఘదోషాపహారిణి ! కాళి !**
**సర్వకులమత సమాన సద్బుద్ధి సుభావోత్పత్తిమూర్తే ! సత్యవాక్యప్రియే !**
**సకల ప్రాణిహితారోగ్యోపయోగ వృక్షజంతు సంపోషణ శక్తిప్రదాత్రి! 86**

తా॥ ఉదయం నుంచి సాయంత్రం వరకు అనగా సూర్యుడు ఉదయించిన దగ్గర నుంచి సూర్యుడు అస్తమించే వరకు, మరలా సూర్యుడు ఉదయించేవరకు, పగలు రాత్రి ఇలా ప్రతిరోజూ భక్తుల దేహాన్ని శ్రీకాళీమాత రక్షిస్తూ ఉంటుంది. అంటే ఒక్కక్షణం కూడా భక్తులను వీడి ఆ తల్లి ఉండదు. అనుక్షణం రక్షణ చేస్తూ ఉంటుంది. ఇతరులు, ఎవరినైనా దూషించేటప్పుడు వినటంవలన వచ్చే పాపాలు, ఇతరులకు అపకారం చేయటం వలన వచ్చే దోషాలు, అబద్ధాలు చెప్పటం వలన, ఎవరైనా అబద్ధాలు చెప్పేటప్పుడు మనం వినటంవలన వచ్చే పాపదోషాలను పోగొడుతుంది శ్రీకాళీమాత. ఒకరిపైన వేరొకరు విసురుకునేటప్పుడు, వారికి దగ్గరలో మనం ఉంటే అది మనమీద కూడా పడుతుంది. వారి ఉద్దేశం మనమీద వెయ్యాలని ఉండదు. కాని వారికి అందుబాటులో ఉండటం వలన వారు విసురుకునేది ఏదైనా కొంచెం మనమీద కూడా పడుతుంది. అలాంటివే పైన చెప్పిన దోషాలు కూడా. అలాంటి దోషాలను భక్తులదరి చేరనీయదు ఆ తల్లి. భక్తులకు కుల మత బేధాలు లేకుండా, అందరూ కలసి జీవించాలని మంచి కార్యక్రమాలను భక్తితో చేయాలనే సమభావం, భక్తులలో ఏర్పడే విధంగా వారికి మంచి బుద్ధిని మనసుని పెంచుతుంది. నిజం ఎల్లప్పుడూ చెప్పి, మాట్లాడే భక్తులను ఆ తల్లి సంతోషంగా చేరదీస్తుంది. అన్ని ప్రాణుల మేలుకోరి, వాటి ఆరోగ్యానికి, ఆహ్లాదానికి ఉపయోగపడే చెట్లను,

వృక్షాలను, అలాగే జంతువులను పోషించే శక్తిని ప్రసాదించే వరాలతల్లి శ్రీకాళీమాత. మొక్కలను, చెట్లను, జంతువులు మొదలైన వాటినికూడా సమదృష్టితో చూసి వాటి వృద్ధికి తోడ్పడాలని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారి అభిప్రాయం, అలాగే అందరూ ఆ భావాలను పెంపొందించుకోవాలని ఈ శ్లోకంలో తెలియజేస్తున్నారు.

**శ్లో॥ అనవసర విషయాసక్త మనోబుద్ధ్య దృశ్యకారిణి ! శ్రీగురుకాళి !**
**కాలచక్రానుగుణావసరకార్యాచరణోత్పత్త్యమితజ్ఞానప్రదాయిని !**
**తత్త్వవిభు బ్రహ్మజ్ఞాని ముఖోద్భవ దివ్యవాక్య శ్రవణభాగ్యప్రదాత్రి !**
**ఆత్మోపాసనాద్భుత విద్యా మర్మప్రబోధిని! భక్తజనాత్మానందోద్భవకారిణి!87**

తా॥ ఈ పద్యంలో శ్రీగురుదేవులు ఈ విధంగా వివరిస్తున్నారు. కొందరు విశ్వక్షేమానికి గాని, పరులకు ఉపయోగపడే కార్యాలను గురించి ఆలోచించకుండా, ఎవరికీ ఉపయోగపడని, ఎందుకూ కొరగాని విషయాలను గురించి తీవ్రంగా ఆలోచిస్తూ, ఎంతో విలువైన సమయాన్ని వృధా చేస్తుంటారు. కాని మానవులుగా పుట్టిన తరువాత ఒంట్లో ఓపిక, దేహంలో ప్రాణం ఉన్నప్పుడే అమ్మ శ్రీకాళీమాతను గురించి తలంచి, ఆలోచిస్తే, అలాంటి, సమయం వృధా చేసేవారికి, వారు అనవసరంగా లేనిపోని విషయాల గురించి ఆలోచించే మనసును, బుద్ధిని పోగొట్టి, అవసరమైన విషయాలను మాత్రమే ఆలోచించే బుద్ధిని ప్రసాదిస్తుంది ఆ తల్లి శ్రీగురుకాళీమాత. ఈ కాలచక్రంలో తన భక్తులకు ఎప్పుడు ఏది అవసరమో, ఎప్పుడు ఏమి చేయాలో తెలుసుకోగల జ్ఞానాన్ని, అనగా అనేక విధాలుగా ఆలోచించే శక్తిని సాధకులైన మంచి భక్తులకు ఆ తల్లి శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది, ఇంకా ఆ తల్లి తమ భక్తులకు ఇచ్చే దివ్యసంపదలు ఏమిటంటే, తత్త్వవిభులైన బ్రహ్మజ్ఞానుల ముఖము నుంచి వెలువడే అమృత వాక్యాలను వినే భాగాన్ని ఆ తల్లి తన భక్తులకు మంచి సంపదగా ప్రసాదించి, ఆ సాధకులకు ఆత్మోపాసన ఎలా చేయాలో, ఆ విద్యయొక్క మర్మము ఏమిటో అనే విషయాలను సవివరంగా తెలియచేసి, భక్త జనులకు నిత్యమూ ఆత్మానందాన్ని పుట్టించే గురుమూర్తి ఆదిపరాశక్తి శ్రీకాళీమాత, అంటారు శ్రీగురుదేవులు. అసలు మానవులు అవసరమైనంత వరకే ఆలోచిస్తూ, ఆనందంగా జీవితాలను సాగిస్తూ, తీరిక కల్పించుకొని, ఆ సమయాలలో ఆధ్యాత్మిక

ప్రసంగాలను వింటూ అనేక మంచి గ్రంథాలను చదువుతూ అందులోని మర్మాలను గ్రహించే ప్రయత్నం చేయటంవలన, వారికి ఆత్మోపాసన చేసే శక్తి లభిస్తుంది. ఆత్మోపాసన చేయటం అంత సులభం కాదు, అందరికీ సాధ్యం కాదు. అమ్మ అనుగ్రహం పొందిన వారు మాత్రమే చేయగలుగుతారు. అమ్మ శ్రీకాళీమాతను ఆరాధించే వారందరూ మహదానందంతో జీవన్ముక్తిని పొందవచ్చునని, శ్రీగురుదేవులు ఎల్లప్పుడూ తమ భక్తులకు శిష్యులకు చెపుతూ ఉంటారు.

**శ్లో॥ శ్రీవిశ్వపూజ్యే ! దేవి ! శ్రీవరకాళి ! ఆదిపరాశక్తే ! శ్రీభువనేశ్వరి !**
**అనంతకోటి జన్మకృతపాపదోషాపహారిణి ! అద్వైతామృతమూర్తే !**
**సులగ్నకాలసునక్షత్రోద్భవకారిణి ! దేవి ! సుందరరూపప్రదాయిని !**
**శ్రేష్ఠవిద్యోద్యోగాది ప్రదాత్రి ! వ్యాపారాధికార జీవనశక్తి ప్రదాయిని ! 88**

తా॥ సమస్త లోకాలలో ఉండే మానవులు, దేవతలు, గంధర్వులు మరియు అన్ని జీవరాశులచేతా ఆరాధించబడుతూ పూజించబడే పుణ్యస్వరూపిణివైన శ్రీవరకాళీమాతా ! అఖిలాండంలోని బ్రహ్మాండమంతా మరియు అందులోని సర్వశక్తులకూ మూలస్వరూపంగా నిలిచి ప్రకాశిస్తున్న పరమశక్తివైన ఓ ఆదిపరాశక్తీ! సకల భువనాలకూ అధినేత్రివైన శ్రీ భువనేశ్వరీమాతా ! లెక్కింప వీలుకానన్ని ఎన్నో జన్మలనుంచి పాపాల రూపంలో సంక్రమిస్తున్న దోషాలను సమూలంగా పరిహారం చేసే పరమపావన మూర్తివి నీవే కదా ! పరమాద్భుత శక్తి స్వరూపిణివై జగములనేలే తల్లీ ! సర్వజగత్తులలో భక్తుల పూజలకు సంతసించి, వారిని ఉద్ధరించే సంకల్పంతో వారికి నీ సాక్షాత్కార భాగ్యాన్ని కల్గించే ఏకైక శాశ్వత స్వరూపిణివి నిజభక్తులకు, పుట్టిన మరుక్షణం నుంచే నీ కృపాభాగ్యాన్ని కల్గించటం కోసం, వారిని శుభలగ్నంలో, శుభకాలంలో, మంచి నక్షత్ర గ్రహరాశుల కూటమి ఉండే విధంగా, నీవు సంకల్పం చేసి, పుట్టింపచేసే పూజ్య స్వరూపిణివైన శ్రీమహాదేవీ ! నీలో ఉన్న ముగ్ధమనోహర సౌందర్య రూపాన్ని, ఆర్తులై నిన్ను సేవించే వారికి, వారి సంకల్పాలకు అనుగుణంగా ప్రసాదించే పవిత్ర స్వరూపిణీ ! శ్రీకాళీమాతా ! విద్యలు కోరివచ్చే వారికి మరియు విద్యలో రాణించలేక వెనకబడిన వారికి, ఉత్తమ విద్యలను ప్రసాదించి, మహోన్నత ఉద్యోగాలను ప్రసాదించే కరుణా స్వరూపిణివి నీవేకదా! తల్లీ! వ్యాపారాలను వృత్తిగా ఎంచుకున్న వారికి, మంచి విలువలతో కూడిన వ్యాపారాల్ని, ప్రయోజనకరమైన

అధికారాన్ని నిర్వహించే శక్తిని ప్రసాదించి ధర్మజీవన మార్గాన్ని దర్శింపజేసే దయామూర్తివైన శ్రీమద్గురు వరకాళీ మాతవు నీవే కదా ! తల్లీ ! అంటూ ఈ శ్లోకాన్ని రచించారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు.

**శ్లో॥ శిశుజన్మ నామకరణాన్నప్రాశన కాలక్రతు దోషనివారిణి ! శ్రీవరకాళి !**
**భవకేశ ఖండనోపనయన విద్యాభ్యాస కార్యాచరణానేక దోషాపహారిణి!**
**వివాహ ముహూర్త నిర్ణయకాల పాణిగ్రహణ క్రతుదోషోచ్చాటనమూర్తే! కాళి!**
**బాల్యకౌమార యౌవన వార్ధక్యాచరణ కార్యదోషాదృశ్యకారిణి! శ్రీమహాదేవి! 89**

తా॥ శ్రీకాళీమాత ఎలాంటి సమయాలలో ఎలాంటి దోషాలను పోగొడుతుందో శ్రీగురుదేవులు తాము రచించిన పై శ్లోకం ద్వారా తెలియచేస్తున్నారు. బిడ్డలు జన్మించే సమయంలో, వారికి నామకరణం అనగా పేరు పెట్టేటప్పుడు ఆ పిల్లలకు అన్నప్రాశన చేసేటప్పుడు, పిల్లలకు పుట్టువెంట్రుకలు తీసే సమయంలో, విద్యాభ్యాసం జరిపించే సమయాలలో, ఉపనయనం జరిగే సందర్భాలలో, పెళ్ళి ముహూర్తాలు నిర్ణయించే సందర్భంలో, వివాహం జరుగుతున్నప్పుడు, ఆయా సందర్భాలలో ఉండే కాలచక్ర దోషాలను, అనగా వర్జ్యం, దుర్ముహూర్తం, యమగండం, రాహుకాలం, తిథి, లగ్న, నక్షత్ర వారాలలో ఉండే దోషాలను తక్షణమే పోగొట్టి, వారికి శుభకరమైన ఫలితాలను ఇచ్చి, వారు బాగా అభివృద్ధి చెందేటట్లు చేస్తుంది శ్రీకాళీమాత. అంతేకాక మానవుల బాల్యము, కౌమారము, యౌవనము, వృద్ధాప్యాలను పరిశీలిస్తే, పుట్టినది మొదలు 5 సంవత్సరాల వరకూ కౌమారము, 5 నుంచి 16 సంవత్సరాల వయసు వరకూ బాల్యదశ, 16 నుండి 40 సంవత్సరముల వయసు వరకూ యౌవనదశ, ఆ తరువాత 40 సంవత్సరాలు వయసు దాటితే వార్ధక్య దశయని చెప్పవచ్చు. అయితే మానవులు కౌమారదశలో తెలియక చేసిన అనేక తప్పులను, బాల్యంలో తెలిసి తెలియక చేసిన పాపదోషాలను, యౌవనంలో అన్నీ తెలిసి కూడా బుద్ధిని మనస్సును జయించలేక, లెక్కలేనన్ని తప్పులు, పాపాలు ద్రోహాలు, మోసాలు, స్వార్థచింతనతో అనేక అపరాధాలను చేసిన వారైనా, ఆ తల్లి శ్రీకాళీమాతను ఆశ్రయించి, ఆరాధించినప్పుడు, ఆ తల్లి వారిని క్షమించి, వారు గతంలో చేసిన పాపదోషాలను పోగొట్టి వారికి, తిరిగి మరలా దివ్యమైన జీవితాన్ని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత అంటూ తెలియ జేస్తున్నారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు.

**శ్లో॥ సుపుత్రగోత్రప్రదాత్రి ! దేవ దేవి ! సుమనోభావప్రదాయిని ! శ్రీవరకాళి!**
**బాల్యకౌమార యౌవన దేహాభివృద్ధి పతనకారణానేక మర్మప్రబోధిని !**
**దివ్య దేవాలయ నివాసానుక్షణారాధనాలోచనా సుబుద్ధి ప్రదాత్రి! కాళి!**
**సత్యలోక వైకుంఠ కైలాస గోలోక సర్వదా సందర్శనానందప్రదాయిని! 90**

తా॥ ఆ తల్లే సర్వస్వమని భావించి సేవించేవారికి సుగుణ సంపన్నులైన మంచి పుత్రులను ప్రసాదిస్తుంది, సద్గురుమూర్తి అయిన శ్రీవరకాళీమాత. ఆ తల్లి కృప వలన జన్మించిన పుత్రులు, మంచి గుణగణాలతో, గొప్ప తెలివితేటలు, ధైర్యసాహసాలతో, చదువులలో అద్భుతంగా రాణిస్తూ, తాను చేపట్టిన వృత్తి వ్యాపారాలలో ఉన్నతశిఖరాలను అధిరోహిస్తూ, తల్లిదండ్రులను, గురువును, దైవాన్ని సదా గౌరవిస్తూ, లోకానికి మేలు చేసే వారుగా విరాజిల్లుతూ, వరపుత్రులుగా వర్ధిల్లుతారు ఆ తల్లి. తనను సేవించే వారందరికీ మంచి మనస్సును, మంచి భావాలను ప్రసాదించే పుణ్యప్రదాయిని. మానవులు కొందరు పుట్టిన తరువాత బాల్యంలోనే చనిపోతారు. మరికొందరు కొంతకాలం జీవించి యుక్తవయసు వచ్చేలోగా చనిపోతారు, ఇంకా కొందరు యౌవనం వచ్చిన తరువాత చనిపోతారు. వృద్ధాప్యంలో అందరూ చనిపోక తప్పదనుకోండి. అయితే, ఈ దేహాలు అభివృద్ధి అంటే పెరగటానికి, మరలా నశించటానికి అనేక కారణాలు, వాటియొక్క మర్మాలను క్షుణ్ణంగా తెలియచేసే తల్లి శ్రీకాళీమాత. శ్రేష్ఠమైన దేవాలయంలో నివసిస్తూ ప్రతిక్షణము దేవతారాధన చేయాలనే మధురమైన మంచి ఆలోచనలను, ఇంకా శ్రేష్టమైన బుద్ధిని, ఉన్నతమైన సుగుణాలను భక్తులకు ప్రసాదించే బ్రహ్మాండజనని శ్రీ వరకాళీమాత. అదే విధంగా, నిరంతరం ఆ తల్లినే ఆరాధిస్తూ, పూజిస్తూ, ఉపాసిస్తూ, ఆ తల్లి నామస్మరణయే తమలోకంగా భావించి, బాహ్యలోకంతో ఎలాంటి బంధనాలూ లేకుండా జీవించే అర్హులైన భక్తులకు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు నివశించే దివ్యలోకాలను దర్శింపచేసి, అదే విధంగా అతిపవిత్రము మరియు పుణ్యప్రదమైన గోలోక సందర్శనభాగ్యాన్ని కూడా ప్రసాదించి, భక్తులకు పరమానందాన్ని కలిగించే పావనమూర్తి నిస్సందేహంగా ఆ తల్లి శ్రీవరకాళీమాతయే నని అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ విశిష్టాలోచనాశక్తిప్రదాత్రి ! విమలమూర్తే ! దేవి ! శ్రీవిశ్వజనని !**
**శ్రేష్ఠమార్గదర్శకత్వప్రదాయిని ! సుబుద్ధిసంచారప్రధానకారిణి !**
**శాంతస్వభావవర్తనకారిణి ! శ్రీకాళి ! ధీసహనశక్తిప్రదే ! దేవి !**
**సదానుకూల సత్‌సతీసిద్ధిప్రదాత్రి ! సహృదయ సుపతి ప్రదాత్రి ! 91**

తా॥ ఎల్లప్పుడూ కొత్తవిగా ఉండే విశిష్టమైన ఆలోచనలు, విలువలతో కూడి ఉండేవిగా భక్తులకు ప్రసాదిస్తుంది, విమల స్వరూపిణి అయిన శ్రీకాళీమాత. విశ్వమాత అయిన ఆ తల్లి, భక్తులకు మంచి మార్గాలను దర్శింపచేస్తూ, వారికి విశిష్టమైన ప్రతిభా పాటవాలను ప్రసాదించే మహిమాన్వితమూర్తి మరియు మంచి బుద్ధితో భక్తులు ప్రవర్తించటానికి ప్రధాన కారణమైన పవిత్ర స్వరూపిణి శ్రీకాళీమాత. ఆ దేవిని సేవించటం వలన, భక్తుల మనసులు సదా ప్రశాంత పూరితమౌతాయి. అలా వారు ప్రశాంత భావంతో నిరంతరం సంచరించటానికి అవసరమైన, పవిత్రమైన మార్గాన్ని చూపిస్తుంది, పరమానంద స్వరూపిణి అయిన శ్రీకాళీమాత. ఆ తల్లిని నమ్మి విశ్వాసంతో కొలిచేవారికి, బుద్ధివికాసాన్ని కలిగించి, ఉన్నతమైన బుద్ధికి మనసుకి తోడుగా, భక్తులకు గొప్ప సహనశక్తిని ప్రసాదిస్తుంది. సంసార సాగరంలో జీవితనావను నడపటానికి, అన్నివేళలా అనుకూలంగా ఆదర్శవంతంగా, పరిస్థితులకు అనుగుణంగా అనుసరిస్తూ, అన్యోన్యంగా ఇద్దరూ పాలు, నీళ్లవలె కలసి మెలసి, మసలుతూ ఉండే, ఉత్తమురాలైన మంచి భార్యను ప్రసాదించి, అదే విధంగా భార్య మనసెరిగి ఆమె అవసరాలను తెలుసుకుంటూ, మంచి మనసుతో గుర్తించి, సానుకూలమైన, సాదరంగా, స్నేహంతో కూడిన ప్రవర్తనతో అర్థం చేసుకునే భర్తను ప్రసాదించే మహిమాన్వితమూర్తి ఆ తల్లి శ్రీవరకాళీమాత, అంటూ శ్రీ గురుదేవులు పై శ్లోకం ద్వారా తెలియచేస్తున్నారు.

**శ్లో॥ శ్రీమద్గురుకాళి ! సర్వసిద్ధిప్రదే ! అతినిద్రాఽదృశ్యకారిణి ! శ్రీశక్తే !**
**వాక్‌శ్రవణ దృష్టి పాపదోషనివారిణి ! శ్రీ గురుమహాదేవి ! కాళి !**
**సదానుగ్రహమూర్తే ! శ్రీవరకాళి ! మితాహార తృప్తిప్రదాయిని ! దేవి !**
**సజ్జనోపకార బుద్ధిప్రదే ! మహాదేవి ! మితభాషా మౌనప్రదాయిని ! 92**

తా॥ శ్రీకాళీమాతను, ఈ వేళా, ఆ వేళా అని లేకుండా అన్ని కాలాలలోనూ, అదే విధంగా సాధకులు, ఏ పనిలో ఉన్నప్పుడైనా, ఎలాంటి అననుకూల పరిస్థితులలో ఉన్నా, అనగా సర్వకాల సర్వావస్థలయందూ, ఆ తల్లిని నిశ్చలమైన మనసుతో సేవించి, పూజించేవారికి, గురువులకే గురువైన శ్రీమద్గురుకాళీమాత, అనేక సిద్ధులను, వరాలను ప్రసాదిస్తుంది. ఆరోగ్యభంగానికీ, వ్యవహారభంగానికీ, మిగతా అన్ని విధాలైన చెడ్డ కలలకు దుర్గుణాలకూ కీలకపాత్ర వహించే అతినిద్రను, భక్తులకు దూరం చేసి, వారు ఎల్లప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటూ, అవసరమైన వరకే నిద్రపోగల శక్తిని ప్రసాదిస్తుంది. అద్భుత స్వరూపిణి అయిన శ్రీకాళీమాత. అదే విధంగా మాటలను పలకటంవలన, వినడంవలన, చెడు దృశ్యాలను చూడటం వలన సంక్రమించే అనుకోని పాపాలను, దోషాలను తొలగిస్తుంది పవిత్రమూర్తి అయిన శ్రీకాళీమాత. శ్రీగురుమహాదేవి అయిన ఆ తల్లి, నిరంతరం భక్తులను అనుగ్రహిస్తూ, అందువలన వారు పొందే ఆనందాన్ని చూస్తూ సంతోషించి పొంగిపోతుంది. మితాహారం వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. అంటుంటారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు అలాకాక తృప్తిలేని భోజనం, అనగా వండినది రుచిగా లేకపోవటంవలన దాన్ని తింటే తృప్తి కలుగకపోవటం, లేదా రుచికరమైన భోజనం చాలినంత లభించకపోవటం వలన ఏర్పడే అసంతృప్తి, అదే విధంగా పరిమితిలేని భోజనం అనగా, రుచిగా ఉండటంవలన లేదా ఇష్టమైన భోజనాన్ని అపరిమితంగా, పొట్ట ఖాళీ లేకుండా భుజించటంవలన ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలు మరియు ఉద్రేకాన్ని పెంచే ఆహారం అనగా మసాలా దినుసులు, రుచికోసం ఎక్కువగా కలిపి వండే మొదలైనవి తినటంవలన, అజీర్ణ సమస్య ఏర్పడి, తద్వారా ఉత్పన్నమయ్యే చెడుఫలితాల నివారణకోసం, స్వల్ప (మితమైన) మరియు సాత్వికమైన ఆహారాన్ని, అనగా లభించినదాన్నే కొద్దిగా, ఇష్టంగా భుజించాలి. లేని దానికోసం ఎదురుచూడకుండా, ఉండటం అలాగే సౌమ్యమైన ఆహారం వలన తృప్తి, ఆరోగ్యం, ప్రశాంతత అన్నివేళలా లభిస్తాయని, ఆ తల్లి శ్రీకాళీమాత తెలియచేస్తుంది. మంచి జనులకు మేలు చేసే సద్బుద్ధిని, మహా అద్భుతశక్తి స్వరూపిణి అయిన శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. మానవుని ఎదుగుదలకు ఎంతో మేలు చేసే మితభాషణనూ, అనగా అవసరమైన సందర్భాలలో, అవసరమైనప్పుడే మాట్లాడుతూ, ఎక్కువగా మౌనంగా ఉండే శక్తిని ప్రసాదించేది కూడా నిశ్చయంగా శ్రీవరకాళీ మాతయే నని ఎప్పుడు శ్రీ గురుదేవులు చెబుతుంటారు.

**శ్లో॥ విధాతృలిఖిత సంక్రమిత స్త్రీ వైధవ్యాశుభాదృశ్యకారిణి ! శ్రీకాళి !**
**దీర్ఘసుమంగళీ జీవనాదృష్టప్రదాత్రి ! దివ్యభావనోద్భవకారిణి!**
**పరస్పరాపవాదాశాంత్యదృశ్యకారిణి ! దాంపత్యాన్యోన్యతాదృష్టప్రదే!**
**మహోమహోపకారకారిణి ! మహీమహిమోత్తమ జన్మప్రదాత్రి ! కాళి ! 93**

తా॥ మానవ జీవితంలో వివాహ బంధం అనేది ఆవశ్యకమైన మరియు అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశము. ఎవరెవరో, ఎక్కడెక్కడి వారో, అంతకు ముందు వరకు పరిచయాల్లేనివారు, తెలియనివారు, వివాహ బంధం ద్వారా ఒకటై, ఒకటిగా, జీవితాంతం తోడుగా, నీడగా కలసి మెలసి ముందుకు సాగాలి. విధి లిఖితం ఖచ్చితమైనది, ఎంతో బలీయమైనది. పూర్వజన్మ చెడుకర్మల వలన, ఈ జన్మలో వారు చేసుకున్న చేస్తున్న కర్మలవలనగాని, విధివ్రాతవలన గాని భర్తకాలం చేస్తే, స్త్రీ ఒంటరిదై, తోడును కోల్పోవటం వలన, ఆమె బ్రతుకులో చీకటి ఏర్పడుతుంది. అలాగే భార్య తోడు కోల్పోయిన, భర్త పరిస్థితికూడా అగమ్య గోచరంగా ఉంటుంది. తల్లి, తండ్రి లేకపోతే పిల్లలు దిక్కులేని అనాధలై పోయి వారికి దిక్కుతోచని స్థితి ఏర్పడుతుంది. కాని శ్రీవరకాళీమాతను, మనసారా నమ్మి సేవించే భక్తజనులపైన, ఆ తల్లి యొక్క కరుణామృత దృక్కులు ఎల్లవేళలా ఉంటాయి. ఆ తల్లి శుభదృష్టి వారిపై పడటం వలన, వారియొక్క విధివ్రాతలు, భార్యాభర్తలకు, వారి పుత్ర సంతానానికి, కుటుంబ సభ్యులందరికీ పూర్వ జన్మాంతర పాపాలు నశించి, వారికి సకల శుభాలూ లభిస్తాయి. బ్రహ్మ వ్రాసిన రాతను కూడా, ఆ తల్లి శ్రీకాళీమాత, మార్చి, తిరగవ్రాసి ఆ స్త్రీ దీర్ఘసుమంగళిగా, జీవితాన్ని గడుపుతూ, మంచి మంచి భావాలతో, భార్యాభర్తల తల్లిదండ్రుల, బిడ్డల మధ్య ఎలాంటి గొడవలు, అభిప్రాయ భేదాలు రాకుండా, ఒకరిపై మరొకరు అపార్థాలు, నిందారోపణలు చేసుకునే పరిస్థితులను రానివ్వకుండా, పరిస్థితులను అర్థం చేసుకుంటూ సంయమనంతో మెలగుతూ, ఒకరికొకరు తోడునీడగా, పరస్పర అవగాహనతో, కుటుంబ సభ్యులందరూ ఒకరికొకరు అన్యోన్యతా భావాలను పెంపొందించుకుంటూ, దాంపత్యంలో మంచి ఆనందమయ జీవితాన్ని అనుభవిస్తూ ఉన్నత శిఖరాలను స్పృశిస్తూ, మేలైన ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ, పరులకోసం పాటుపడే మంచి మనసును, బుద్ధిని సుగుణాలను ప్రసాదిస్తుంది, శ్రీకాళీమాత. ఈ భూమిపై

మహత్తరమైన జన్మలను ప్రసాదించి, ఈ జన్మను సార్ధకం చేసుకోవటానికి, ఆ తల్లి శ్రీవరకాళీమాత జనావళికి మహోపకారం చేస్తున్నది, అంటూ ఎంతో గొప్ప రహస్యాన్ని తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సంచితవర్తమానకిల్బిష దుష్కర్మదోషాపహారిణి ! శ్రీవరకాళి !**
**వంధ్యత్వ నివారిణి ! దేవి ! వరదానప్రదాన కారణమూర్తే ! శ్రీకాళి !**
**వరప్రభావభవ కారణజన నివాసగృహస్థల ప్రవేశసంచారిణి !**
**ఉత్తమ భక్తాశయాభివృద్ధి మార్గోపదేశమూర్తే ! మాతృసుస్వరూపిణి! 94**

తా॥ పూర్వజన్మలు లేదా పూర్వకాలంలో, మరియు ప్రస్తుతం జరుగుతున్న కాలంలో చేసిన పాపాలను, చెడ్డపనులవల్ల వచ్చే దోషాలను, బాధలను తొలగించే తల్లి శ్రీవరకాళీమాత. మానవజన్మ ఎత్తిన తరువాత, సహ సమాజంలో తిరుగుతూ జీవిస్తున్నప్పుడు ఎన్నో పనులు చేయవలసి వస్తుంది. వాటిలో మనకు తెలియకుండానే తప్పులు జరుగుతూ ఉంటాయి. వాటివలన పాపం మూటకట్టుకోవలసి వస్తుంది. దైవచింతన లేకుండా గడిపే జీవితాలలో ఎక్కువ శాతం పాపకర్మలుంటాయి. ఎందుకంటే వారికి పాపభీతి, దైవభక్తి ఏమీ లేకపోవటం వలన, విచ్చలవిడి మనస్తత్వ ప్రభావంచేత పాపం, పుణ్యం ఆలోచించే జ్ఞానం వారిలో ఉండదు. కాని దైవచింతన, దేవునిపై భక్తి భావం ఉన్నవారు ఆలోచించి పనులు చేయటం వలన, ఏదైనా పాపం తెలియక జరిగితే, దైవచింతన దాన్ని తొలగించి వేస్తుంది. ఇలా అందరికీ ఉండే ఎక్కువ తక్కువ పాపాల శాతం శ్రీవరకాళీమాతను ఆరాధించటం వలన, జన్మజన్మల నుంచీ ఉన్న పాపాలు కూడా క్రమంగా నశించిపోతాయి. పిల్లలు కలగటం లేదని బాధపడే స్త్రీలకు, వారి గొడ్రాలుతనాన్ని పోగొట్టి వారికి వరాలనొసగే తల్లి శ్రీవరకాళీమాత. శ్రీకాళీమాత వరప్రసాదంగా పుట్టిన బిడ్డలు ఎక్కడ నివశిస్తుంటే, ఆ తల్లి ఆ వరపుత్రులున్న గృహాలలో వారు తిరిగే స్థలాలలో శ్రీకాళీమాత వుంటూ వారిని వెన్నంటి సంచరిస్తూ కాపాడుతుంది. ఉత్తములైన భక్తుల ఆశయాలను వారు కోరుకునే విధంగా విద్యా ఉద్యోగ వ్యాపారాలు అనేక రంగాలలో వారే స్వయంగా అభివృద్ధి చేసుకొనే విధంగా వారికి అనేక మంచి మార్గాలను తెలియచేస్తుంది శ్రీకాళీమాత. వారు ఉత్తములైన భక్తులు, ఎందుకంటే ప్రతిక్షణం, ప్రతినిత్యం శ్రీకాళీమాత ధ్యాస, ధ్యానం తప్ప వారికి వేరే ప్రపంచం ఉండదు. కాని ఎదిగి

వచ్చిన పిల్లలు, ఎన్నో తెలివితేటలతో, ఆలోచనలతో ఏదైనా సాధించాలనే తపనతో ఉంటారు. కాని వారి ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పుడు అలాంటి సందర్భాలలో ఆ తల్లి శ్రీకాళీమాత వారి బాధ్యతలను తనే తీసుకొని, వారి ఆశయ సాధనలో ప్రతిక్షణం తోడు ఉండి, వారిని విజయాలవైపు నడిపిస్తుంది అందరినీ, కన్న తల్లికన్నా ఎక్కువగా ప్రేమించి, ఆదరించేది." శ్రీవేజెండ్లపుర వరకాళీమాత. ఇది సత్యం. సత్యం. సత్యం. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ గర్భోత్పత్త్యాతంక సకల దోషాదృశ్య మూలకారణాదిమూర్తే ! శ్రీకాళి ! గర్భస్థ పిండోత్పత్త్యాది మూర్తే ! కాళి ! గర్భాంతర శిశుసంవృద్ధికారిణి! ప్రసూతి శుభకాలాసన్న పర్యంత హృదయార్చిత సుభక్తానుగ్రహమూర్తే! సుఖ ప్రసూతి ప్రదాత్రి! మాతృశిశుక్షేమారోగ్యదాయిని! మహామాతృమూర్తే! 95**

తా॥ స్త్రీలకు తమ జీవితంలో అత్యంత క్లిష్టమైనది, కఠోర పరీక్షలాంటి సమయం ఏమిటంటే వారు గర్భాన్ని ధరించిన సమయం నుంచి ప్రసవ సమయం వరకు ఉన్న మధ్యకాలం. పూర్వజన్మలలో ఉన్న దోషాలవలన గాని లేదా, ప్రస్తుత జన్మలో స్త్రీ సహజ ప్రకృతి అయిన ఋతుక్రమంలో ఏర్పడే లోపాలవలన గాని, పురుషునిలోని బీజశక్తి స్త్రీలోని అండ పరిపక్వతలలోని లోపాలవలన మరి ఏ ఇతర ఆనువంశిక కారణాలవలన గాని, స్త్రీ గర్భం దాల్చడానికి ఆటంకాలు ఏర్పడతాయి. బిడ్డలు లేని వారి జీవితం ఎంత బాధగా వుంటుందో అనుభవించే వారికి తెలుస్తుంది. కాని శ్రీ వరకాళీమాతను నమ్మి కొలిచే వారికి ఏ విధమైన నరకబాధలు ఉండవు. ఏ బాధలూ దరిచేరనివ్వదు గర్భం ఉత్పత్తి జరగటానికి ఆటంకాలుగా నిలిచే సకల దోషాలనూ, వాటి మూలకారణాలను సమూలంగా హరించి వేస్తుంది. గర్భం దాల్చిన మొదటి క్షణం నుంచి పిండం ఎదుగుదల, అభివృద్ధి, సక్రమమైన రీతిలో, ఆరోగ్య వంతంగా ఉండడానికి, గర్భంలో, శిశువు అత్యంత భద్రంగా పెరుగుతూ, తల్లికి ఎలాంటి ఆందోళన లేకుండా, శుభసంకేతాలు పొందుతూ ఉంటుంది. ఈ కాలంలో వారి ధ్యాస పుట్టే బిడ్డపైన, మనసు శ్రీవరకాళీమాతపైన లగ్నం కాబడి ఉండటం వలన, ఆ తల్లి శ్రీవరకాళీమాత, తల్లీబిడ్డల సంరక్షణ బాధ్యత తనపై వేసుకొని, ఒక శుభసమయాన్ని ప్రసవ సమయంగా నిర్ణయించి, ప్రసవం సుఖమయంగా జరిగేటట్లు

తల్లీబిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండేటట్లు అనుగ్రహిస్తుంది. అసలు శ్రీకాళీమాతయే అన్ని జీవులను పుట్టిస్తూ వుంటుంది. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ నూతన స్వస్థల స్వగృహానేక వస్తువాహన ప్రదాయిని ! వరకాళి !**
**సదాస్ఫూర్తి భావోత్పత్తి ప్రదానకారిణి ! సవ్యసాచిత్వప్రదాత్రి ! కాళి !**
**నవయుగ పాలనమూర్తే ! దేవి ! నరేంద్ర పదవీ ప్రదాయిని ! శ్రీకాళి !**
**సుకార్యాభివృద్ధి భావసిద్ధిప్రదే ! సుజనాభీష్ట పునర్జన్మ ప్రసాదిని ! 96**

తా॥ శ్రీవరకాళీమాతను నిష్కల్మషంగా, మనస్ఫూర్తిగా ఆరాధించినా, సేవించినా మంచి ఫలితం ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇది ముమ్మాటికి నిజం. దీనికి, ఆ తల్లి కృపకు పాత్రులైన వారే సాక్ష్యం. ఏమీలేక, పెద్ద కుటుంబాలను అతికష్టంమీద పోషించుకుంటూ వస్తున్న వారిపైన ఆ తల్లి కరుణాకటాక్ష వీక్షణాలు పడిన మరుక్షణం నుంచి ఆ భక్తుల జీవితాలలో ఆనందం వెల్లివిరుస్తుంది. అంతకు ముందున్న ఏమీ లేదనే భావనగాని, పెద్దకుటుంబాన్ని కష్టించి పోషిస్తున్నాననే బాధగాని లేక మనస్సు ప్రశాంతమై స్ఫూర్తి దాయకమవుతుంది. నూతనంగా స్థలాలను, గృహాలను, వస్తువాహనాలనూ, ఇదీ అదీ అని ఏమీలేక, వారికి అవసరమైన అన్ని సంపదలను సదుపాయాలనూ సమకూరుస్తుంది. జీవితంలో ఇల్లే కొనగలిగే స్తోమత లేదు అనుకున్నవారికి బ్రహ్మాండమైన మేడలను మిద్దెలను ప్రసాదిస్తుంది. వాహనాలను ఎప్పటికి కొనలేమేమో అనుకున్న వారికి వాహనయోగం కల్పిస్తుంది. శ్రీకాళీమాత పరమదయామయి. ఆ తల్లిని మనసారా నమ్మితే చాలు ఏదైనా ప్రసాదిస్తుంది. రెండు చేతులా పని కల్పించి అదే విధంగా ఫలితాన్ని అందిస్తుంది. ఈ ఆధునిక కాలంలో సుపరిపాలన అందించటానికి అవసరమైన శక్తియుక్తులను కల్పిస్తుంది. ఆ విధంగా ప్రజాపరిపాలనలో రాజమకుటధారణ కావించి ఉన్నతమైన మరియు శ్రేష్ఠమైన పదవులను ప్రసాదిస్తుంది. మంచి భావాలను కల్పించి మంచి కార్యక్రమాల అభివృద్ధికి తోడ్పడుతుంది. మంచి జనులకు సేవ చేయటం కోసం అవసరమైతే పునర్జన్మను ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత అంటూ ఎంతో నిగూఢమైన రహస్యాన్ని తెలియచేశారు శ్రీగురుదేవులు.

శ్లో॥ మాతాపితృ పుత్రపౌత్ర బంధుమమకారహారిణి ! శ్రీదివ్యమూర్తే ! కాళి !
వాత్సల్యాభివృద్ధిప్రదాయిని ! దేవి ! పరిపూర్ణానుగ్రహమూర్తే ! శ్రీకాళి !
వర్తమానాద్భుత వరప్రదాయిని! కాళి ! భవకారణకార్య ప్రబోధిని !
సమయస్ఫూర్తిసుసంభాషణ శక్తిప్రదాత్రి! దేవి ! స్వర్గలోక ప్రదాయిని! 97

తా॥ మానవ జీవితంలో ఎన్నో విధాలైన బంధాలు పెనవేసుకొని ఉంటాయి. తల్లికి బిడ్డలపైన పేగు బంధం. ఈ బంధాన్ని తెంచుకోవడం అసాధ్యం. తల్లిదండ్రులకు సంతానం మీద విడదీయలేని మానసిక అనుబంధం. అలాగే బంధుమిత్రుల మధ్య ప్రేమ అభిమానం, ఆపేక్షలకు తలొగ్గే బంధాలు. ఈ బంధాలన్నీ ఎంతో బలీయంగా ప్రేమవలన వారు ఏది చెప్పినా, మంచి చెడు నిమిత్తం లేకుండా చేసి తమప్రేమను చాటుకుంటారు. కాదనలేరు. ఈ విధమైన మమకారాలు పెంచుకోవటం వలన, హఠాత్తుగా వారికి ఏమైనా చిన్నబాధ కలిగినా వీరు ఏ మాత్రం తట్టుకోలేరు. ఈ విధమైన మమకారం అనర్థాలకు దారితీస్తుంది. శ్రీకాళీమాతను అను నిత్యం సేవించే వారికి, ఇది నాది, నావాళ్లు, మనవాళ్లు అనే మమకారం తొలగిపోతుంది. ఆ స్థానంలో వారిపైన వాత్సల్యం మాత్రమే పెంచుకొని, వారి అభివృద్ధికి తోడవ్వాలనే సంకల్పాన్ని ఆ తల్లి ప్రసాదిస్తుంది. ఆ తల్లే దివ్యమూర్తి శ్రీకాళీమాత. పరిపూర్ణమైన తన అనుగ్రహాన్ని శ్రీకాళీమాత భక్తులకు ప్రసాదిస్తుంది. జరుగుతున్న కాలంలో ఆశ్చర్యకరమైన అనేక వరాలను ప్రసాదించి వారు ఎందుకు జన్మించారు వారు ఏమి చేయాలి అనే విషయాలను తెలియచేస్తూ పరులతో మాట్లాడే సందర్భాలలో ఎదుటివారి మనస్సు నొచ్చుకోని విధంగా, సరళంగా, సమయానుకూలమైన మంచి మాటలను మాట్లాడేశక్తిని, చాతుర్యాన్ని ఆ తల్లే ప్రసాదిస్తుంది. అలాగే స్వర్గలోక సుఖాలను అలవోకగా ప్రాప్తింపచేస్తుంది శ్రీకాళీమాత. ఈ పైన చెప్పబడిన మంచి ఆలోచన పలికే దివ్యవాక్యాలను అన్నిటిని శ్రీకాళీమాతయే ప్రతినిత్యం భక్తులకు ప్రదానం చేస్తుందంటారు శ్రీగురుదేవులు.

శ్లో॥ శ్రీపురేశ్వరి ! దేవి ! భక్తశిరోగ్రభాగామృతవర్షిణి ! శ్రీవరకాళి !
మాతాపితృ సుపోషణ కర్తవ్యోద్భవ కారణమూర్తే ! శ్రీమద్వరకాళి !
దారాసుత సంపోషణ క్రియాప్రబోధిని ! దానధర్మబుద్ధిప్రదాయిని !
నరజన్మ సార్థక కారణ నానామార్గోపదేశకారిణి ! గురుకాళి ! 98

తా॥ శ్రీ వేజెండ్లపురములో కొలువై, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ వారిచేత నిత్య యజ్ఞపూజలందుకుంటున్న తల్లి శ్రీవరకాళీమాత. ఆ తల్లి భక్తజనులపాలిట కల్పవల్లియై భక్తుల మనసులలో స్థిరంగా నిలిచి వారికి సదా అమృతమయమైన భావాలను వర్షంలా కురిపించే తల్లి శ్రీవరకాళీమాత. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఆదరించి పోషించాలనే సద్భావనను కల్గించి, తమ జీవితాలు ఉన్నత స్థితిలో నిలవడానికి అనుక్షణం శ్రమించి వృద్ధాప్యంలో, శక్తులుడిగి పరులపై ఆధారపడవలసిన స్థితిలో వారి ఆలనాపాలనా చూడవలసిన బాధ్యత బిడ్డలదేననే, కర్తవ్యాన్ని బోధించే కరుణామూర్తి శ్రీకాళీమాత. బంధుమిత్రులు సోదరులు మొదలైన వారికి ఆపన్నహస్తం అందించాలనే జ్ఞానాన్ని కలిగించే క్రియాప్రబోధిని శ్రీకాళీమాత. ఆర్థికంగా లేనివారికి అన్నార్తులకు తగు విధమైన దానధర్మాలను చేయాలనే మంచి బుద్ధిని దానగుణాన్ని ప్రసాదించే తల్లి. శ్రీకాళీమాత. మానవునిగా పుట్టిన తరువాత జన్మసార్థకత పొందటానికి అవలంబించవలసిన అనేక మంచి మార్గాలను ఆ తల్లి ఉపదేశానుసారంగా భక్తులకు, ఆ తల్లి ఆచరింపచేస్తుంది. ఆ తల్లే శ్రీగురుకాళీమాత. శ్రీపురేశ్వరి. శ్రీ అంటే శ్రీపురము, ప్రపంచము, వైభవము, భోగము, సంపద అనే అర్థాలున్నాయి వీటన్నిటికి అధిదేవత శ్రీవరకాళీమాత అంటూ అన్నింటినీ ప్రసాదించే తల్లి శ్రీఆదిపరాశక్తి కాళీమాతయే అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీమద్భక్త కల్పవల్లి ! వరకాళి ! అవ్యయానందకరుణాంబుధిమూర్తే !**
**మందబుద్ధేరదృశ్యకారిణి ! దివ్యమూర్తే ! దేవి ! సదా శుభకరి ! కాళి!**
**నిత్యనూతన చైతన్యశక్తి ప్రదాత్రి ! దేవి ! నిర్మలహృదయప్రదాత్రి !**
**నిగర్వసుమనోబుద్ధిప్రదే ! నిగమాధిక మర్మప్రబోధిని ! శ్రీకాళి ! 99**

తా॥ నిరంతరం భక్తులమదిలో జనించే అనంతమైన మంచి కోరికలను, అనగా ఇతరులకు మంచి జరిగే పనులను ఆచరించటం, అందరిలో భక్తిని పెంపొందించే కార్యక్రమాలను, రూపొందించి వాటిని, వారందరి సహాయ సహకారాలతో జరిపించటం, ఏ విషయంలోనైనా సహాయం కోసం ఎదురుచూసే వారికి, ఫలాపేక్ష లేని విధంగా సహాయాన్ని అందించటం, అన్నార్తులకు తృప్తిగా భోజనం పెట్టటం మొదలైనవన్నీ మంచి కోరికలతో చేసే పనులే. అలాంటి భక్తులకు,

ఆ తల్లి, వారి కోరికలను సంతోషంగా తీర్చి వారికి, సకల శుభాలను, సంతోషాలనూ అప్పటికప్పుడే అందించే అమృతమూర్తి, భాగ్యప్రదాయిని శ్రీకాళీమాత. ఆ తల్లి అందించే సుఖసంతోషాలూ, ఆనందం, తృప్తి ఎప్పటికీ తరిగేవి కావు. అందువలన ఆ తల్లి కరుణాసముద్ర స్వరూపిణి, దయగలమూర్తి. మనోవికాసం లేని, మందబుద్ధిని తొలగించి బుద్ధివికాసాన్ని ప్రసాదించే మధురమూర్తి, శ్రీదివ్యకాళీమాత. కొంతమంది పుట్టుకతో గాని లేదా ఏదైనా అనారోగ్య కారణాలవలన, ప్రమాద కారణాల వలన మెదడులో ఏర్పడిన నిస్తేజం వారిని మందబుద్ధులుగా, ఏమీ ఆలోచించి తెలుసుకోలేని విధంగా లేదా బుద్ధిలో లోపం లేకపోయినా ఏది చెయ్యాలన్నా బద్ధకం ఆవరించి ఏమి చేయలేకపోవటం మొదలైన అవలక్షణాలను పూర్తిగా తొలగించి వారికి ఉత్సాహాన్ని, బుద్ధివికాసాన్నిస్తుంది శ్రీకాళీమాత. గ్రహస్థితులు, భక్తుల జాతకాలలోని దోషాలతో పనిలేకుండా ప్రతినిత్యం వారికి శుభపరంపరలను ప్రసాదిస్తుంది సత్యమూర్తి అయిన శ్రీకాళీమాత. ఎందుకంటే గ్రహాల చెడుఫలితాలు, వాటి దోషాలు శ్రీకాళీమాత భక్తులను తాకలేవు. ఏమీ చేయలేవు. తాకిన మరుక్షణం దూదిపింజకు నిప్పురవ్వ తగిలిన విధంగా మాడి మసైపోతాయి. ఇది నిజం. మందబుద్ధిని, పారద్రోలి క్షణక్షణానికి వారికి నూతన ఉత్తేజాన్నిప్రాప్తింపచేసే పరమపావని, పరమానంద ప్రసాదిని శ్రీకాళీమాత. ఆ దేవి, మంచి మనస్సుతో కూడిన మహోన్నతమైన బుద్ధిని ప్రసాదించే జ్ఞానోద్భవమూర్తి, శ్రీకాళీమాత. వేదాలలో చెప్పబడని రహస్యాలను కూడా విశదీకరించి భక్తులకు చెప్పే విజ్ఞాన ఘననిధి స్వరూపిణి ఆ తల్లి శ్రీవరకాళీమాత అని అంటున్నారు, శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు.

**శ్లో॥ సకల భూతకోటి సంభాషణ వీక్షణ శ్రవణశక్తిప్రదాత్రి ! కాళి !**
**మహాసంకటనివారిణి ! దేవి ! మనోనిగ్రహసిద్ధిప్రదే ! వరకాళి !**
**విశ్వవీక్షణశక్తిప్రదాత్రి ! మహాదేవి ! విమలహృదయప్రదాయిని ! కాళి!**
**అనంత ప్రజ్ఞాశక్తికారిణి ! కాళి! అఖండ శ్రీయశోదీప్తిప్రదాయిని !100**

తా॥ మానవులకున్న శక్తి సాధారణంగా, మానవులలో వివిధ ప్రదేశాలలో వివిధ తెగలలో వారి సౌలభ్యం కోసం ఏర్పాటు చేసుకున్న వివిధ రకాల భాషలను అర్థం చేసుకోగలగటం మరియు వాటిలో కొన్నింటిని నేర్చుకొని మాట్లాడగలగటం

వరకు మాత్రమే సాధ్యమవుతుంది. వేరే జంతుజాలాల మధ్య జరిగే సంభాషణలను గ్రహించి తెలుసుకోవటం అసాధ్యం. కాని మానవులకు అసాధ్యమైన విద్యలలో ఒకటైన, ఇతర సమస్త ప్రాణులయొక్క పలుకులను, సంభాషణలను, విని వాటి భావాలను గ్రహించి అర్థం చేసుకునే శక్తిని ప్రసాదిస్తూ, వాటిని చూడగలిగిన వరాలను ప్రసాదించే తల్లి శ్రీవరకాళీమాత. ఆ తల్లి, భక్తులకు ప్రతినిత్యం ఎదురయ్యే ఎన్నో అసంఖ్యాకమైన ఆటంకాలను తొలగించి, వారికి ప్రశాంతిని చేకూర్చే అద్భుతశక్తి స్వరూపిణి. భక్తుల, చంచలమైన ఆలోచనలతో నిండి ఉండే మనసులకు, అచంచలమైన నిగ్రహశక్తిని ప్రసాదించే మధుర మంజుల మనోహర స్వరూపిణి శ్రీకాళీమాత. చంచలమైన ఆలోచనలవలన ఎవరూ ఏ పనినీ సక్రమంగా చేయలేరు, అలాగే వాటికి పూర్తి ఫలితాల్ని సాధించలేరు. అలాంటి వారికి ఆ తల్లి మేలు చేసి, వారి ఆలోచనలు స్థిరమైనవిగా ఉండేశక్తినిస్తుంది. ఈ విశ్వంలో జరిగిన, జరుగుతున్న, జరుగబోయే విశేషాలను వివరంగా తెలుసుకొని చూడగలిగే విశిష్ట దృష్టిని ప్రసాదిస్తుంది, శ్రీవిశ్వమాత అయిన శ్రీకాళీమాత. అలాంటి విషయాలు తెలుసుకోవటం వలన మానవాళికి ఒక్కోసారి ఎంతో మేలు కలుగుతుంది. మంచి విషయాలను తెలుసుకొని ఆచరింపవచ్చు. లేదా చెడు విషయాలను ముందుగానే గ్రహించి, వాటి నివారణ చర్యలు తీసుకోవచ్చు. శ్రీమద్గురు వరకాళీమాత, భక్తులకు మంచి హృదయాలను ప్రసాదించే మహాశక్తి స్వరూపిణి. జాలి, దయ, క్షమా, కరుణ మొదలైనవి లోకంలో శాంతిని విస్తరింపజేయటానికి దోహదపడతాయి. అలాంటి హృదయాన్నే ఆ తల్లి ప్రసాదిస్తుంది. శ్రీకాళీమాత, అంతములేని, అపరిమితమైన, అద్భుత, విశేష జ్ఞానశక్తిని ప్రసాదించే అమృతస్వరూపిణి. ఆ దేవి, నిరంతరం ప్రకాశిస్తూ ఉండే నిత్య, నిరంతరమైన శుభ, సత్యకీర్తిని ప్రసాదించే నిర్భర కరుణా స్వరూపిణి. ఆ తల్లే శ్రీ వరకాళీమాత, అని అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ వహ్నియాగాంతర్భాగ ప్రత్యక్షమూర్తే ! వాగమృతప్రదాత్రి ! దేవదేవి !**
**పితృదేవతాత్మస్వరూప దర్శనభాగ్యప్రదాయిని ! దేవి ! వరకాళి !**
**అనంతజ్ఞానప్రదే ! శ్రీకాళి ! ఆత్మస్వరూపసందర్శన ప్రాప్తికారిణి !**
**విశ్వసృష్ట్యాదిమర్మప్రబోధిని ! శ్రీకాళి ! వీర్యశౌర్యశక్తిప్రదాయిని ! 101**

తా॥ యజ్ఞకాలంలో, యజ్ఞం చేసేటప్పుడు ఎన్నోసార్లు అగ్నికుండం మధ్య నుంచి అవతరించి భక్తులను తరింపచేసిన అద్భుతమూర్తి శ్రీకాళీమాత. సత్యదేవత అయిన శ్రీకాళీమాత, చాలా సందర్భాలలో శ్రీగురుదేవులు యజ్ఞం చేసేటప్పుడు, ఆ యజ్ఞాలకు ఆ తల్లి సంతసించినదనటానికి ఋజువుగా అప్పటికప్పుడే యజ్ఞకుండం లోని, జ్వాలలలో ప్రత్యక్షమై, అద్భుతమైన తన నిజదర్శనాన్ని శ్రీగురుదేవులకు, వారితో కలసి యజ్ఞం చేస్తున్న వారికి, కన్పించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. శ్రీకాళీమాత, భక్తజనులకు అమృతప్రాయమైన వాక్కులను ప్రసాదించే అమృతమూర్తి. ఆ తల్లి ప్రసాదించిన అమృతవాక్కులను, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, తమ కవితాశక్తితో, వాటిని శ్లోకాల రూపంలో, పద్యాలరూపంలో, తమ భక్తులకు భవిష్యత్తు మార్గదర్శకాలుగా అందిస్తున్నారు. అక్షయమూర్తియైన శ్రీవరకాళీమాత మహాశక్తి సంపన్నురాలు. ఎలాగంటే అవసరమైన సందర్భాలలో, ఎన్నో సంవత్సరాల క్రితం చనిపోయిన పితృదేవతల యొక్క స్వరూపాలను దర్శింపచేసే దయాస్వరూపిణి శ్రీకాళీమాత. ఒకానొకసారి ఆలశ్యం సాంబిరెడ్డి తన తండ్రి చనిపోయిన విషయాన్ని ఎంతకూ మరచిపోలేక మానసిక వ్యధకు గురవుతుంటే 12 – పన్నెండు సంవత్సరాల తరువాత శ్రీగురుదేవులు ఆ తల్లి. శ్రీకాళీమాతను ప్రార్థించి, ఆమె దయవలన, ఆ భక్తుని పితృదేవుని సాక్షాత్కరింప చేశారు. అంతటితో ఆ భక్తునియొక్క మానసిక వ్యధ తీరి, శ్రీగురుదేవులకు ముఖ్యశిష్యుడైనాడు. అనంతమైన జ్ఞాన సంపదలకు నిలయమై ఆ సంపదలను భక్తులకు ప్రసాదించే ఆదిపరాశక్తి ఆ తల్లి. అతిదుర్లభమైన, అనితర సాధ్యమైన, ఆత్మజ్యోతి స్వరూపాన్ని స్వయంగా దర్శించే, అదృష్టాన్ని ప్రసాదించే పరమదయా స్వరూపిణి శ్రీకాళీమాత. అలాంటి అదృష్టవంతుణ్ణి నేనే. ఒకరోజు శ్రీగురుదేవులు, నాయొక్క ఆత్మజ్యోతి స్వరూపాన్ని, ఆ తల్లి శ్రీకాళీమాత కృపతో, నాకు దర్శింపచేసి, నా జీవితానికి ధన్యతను చేకూర్చారు. ఈ విశ్వంయొక్క రహస్యాలైన సృష్టి, స్థితి, లయలను, వాటి మర్మాలను వివరంగా తెలియచెప్పే విశేషానందమూర్తి శ్రీకాళీమాత. అమితమైన బలపరాక్రమశక్తిని, వీరత్వమును విజయాలను ప్రసాదించే శక్తి స్వరూపిణి, ఆ తల్లియైన శ్రీవరకాళీమాతయేనని శ్రీగురుదేవులు తెలియచేస్తున్నారు.

శ్లో॥ కలియుగార్చితే ! మహాదేవి ! వేదపూర్వకాలోద్భవమూర్తే ! వరకాళి !
వాత్సల్యామృతమూర్తే ! కాళి ! శూలధారిణి ! వరాక్షయప్రదాయిని ! దేవి!
ఆయుఃప్రమాణకాల సంభవానేక సర్వకాలసర్పదోషాపహారిణి !
ప్రవృత్తి బంధన విమోచన మార్గోపదేశకారిణి ! ప్రాణాయామేశ్వరి ! 102

తా॥ ఈ కలియుగంలో ఎందరో మహర్షులచేత ఆరాధింపబడిన తల్లి శ్రీకాళీమాత. వేదాలు పుట్టక పూర్వమే అవతరించిన శక్తి స్వరూపిణి ఈ కలియుగంలో రాబోవు కాలంలో ఈ విశ్వమంతటా ప్రతి ఇంటా ఇలవేల్పుగా ఆరాధించబడే అద్భుతానందమూర్తి ఆదిపరాశక్తి శ్రీకాళీమాత. ఎందుకంటే ఆ తల్లి వాత్సల్యామృత మూర్తి కనుక, భక్తుల మనసులను తెలుసుకొని, వారికి ఎదురయ్యే అన్ని అశుభాలనూ పారద్రోలి, నిత్యశుభాలను ప్రసాదించే శూలాన్ని ధరించి, అక్షయంగా భక్తులకు, అంతులేని వరాలను ప్రసాదించే అమృతస్వరూపిణి శ్రీకాళీమాత. మానవులను ఎన్నో ఈతిబాధలకు గురిచేసే అనేక విధాలైన కాలసర్పదోషాలను నిజమైన దేవి భక్తులు, వారు, బ్రతికి ఉన్నంతకాలం, వారికి వచ్చే అనేక కాలసర్పదోషాలను పోగొడుతూ తన భక్తులకు అనేకమైన శుభ ఫలితాలను ప్రసాదిస్తూ రక్షించే తల్లి శ్రీకాళీమాత. భక్తులు, జీవనాధారం కోసం ఏర్పరచుకొన్న ప్రవృత్తి మార్గంలో ఏర్పడే కలతలనుంచి, దూరం చేసే నివృత్తి మార్గాలను ఆ తల్లి ప్రబోధిస్తుంది. బ్రతుకుతెరువు కోసం ఎంచుకున్న ఉద్యోగ వ్యాపారాలలో ప్రతినిత్యం ఎన్నో ఇబ్బందులు, వత్తిడులు, వాటి మూలంగా ఉత్పన్నమయ్యే ఎన్నో మానసిక సమస్యలు ఉంటాయి. ఆ వృత్తులలో ఉన్నంతకాలం అవన్నీ తప్పకపోవచ్చును. కాని ఆ తల్లిని నమ్ముకొన్న వారికి ప్రవృత్తిలోనే నివృత్తి మార్గం లభిస్తుంది. ఎలాగంటే ఆ తల్లి సదా వారి మనసులో మెదలుతూ ఉండటంవలన, తాత్కాలికంగా వచ్చే సమస్యలు వారిని బాధించలేవు. మరోవిధంగా భక్తులకు, భుక్తికి లోటు లేకుండా ప్రవృత్తిని వదలి నివృత్తి మార్గంలోనికి ఆ తల్లే, తీసుకువెళుతుంది. ఇది, ఆ తల్లి, వారి శుభం కోరి ఏర్పరచే మార్గమే. మానవుని ప్రాణానికి ఆధారమై నిలిచే ప్రాణాయామ విద్యలకు మూలశక్తియై, ఈ విశ్వానికే ప్రభువైనది శ్రీకాళీమాత. అలాగే ప్రాణాయామం వలన లభించే సత్ఫలితాలను, పరమాద్భుత గురుమూర్తి అయిన శ్రీకాళీమాత తన భక్తులకు వరంగా ప్రసాదిస్తుంది. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ నిత్యనిష్కామస్థితిప్రదాత్రి ! మహాదేవి ! నిస్సంకల్పస్థితిప్రదాయిని !**
**చిత్రలీలాప్రదర్శిత శ్రీమూర్తే ! చిద్రూపిణి ! నిశ్చింతాస్థితిప్రదాయిని !**
**సకల సత్కర్మానుష్ఠానఫలప్రదాత్రి ! సర్వదానఫలప్రదే ! దేవి !**
**విధివిధాన క్రమమర్మబోధిని ! శ్రీకాళి ! విచిత్రవిద్యాప్రదాయిని ! 103**

తా॥ నిరంతరమూ ఏ కోరికలూ లేని స్థితిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. (నిష్కామ స్థితిని కామధేనుసిద్ధి అంటారు)

ఎటువంటి ఆలోచనలూ లేని శూన్యస్థితిని శ్రీకాళీమాత ఇస్తుంది. (నిస్సంకల్ప స్థితిని కల్పవృక్ష సిద్ధి అంటారు)

ఎలాంటి చింతలూ లేని స్థితిని శ్రీవరకాళీమాత ప్రసాదిస్తుంది. (నిశ్చింత స్థితిని చింతామణి సిద్ధి అంటారు)

అద్భుతమైన మహిమలను ప్రదర్శించే శ్రీ ఆదిపరాశక్తి ఆ దేవి. భక్తుల ఆలోచనలకు అనుగుణంగా, అనుగ్రహరూపాలను ధరించే దయాస్వరూపిణి ఆ మాత. భక్తులు, ఆ తల్లి, ఏ రూపంలో ఉంటుందని మనసులో ఊహించుకొని అర్చించి పూజిస్తారో, వారికి వారుకోరుకున్న రూపంలోనే ఆ తల్లి దర్శనమిస్తుంది. సమస్త సత్కార్యాల ఆచరణ శుభ ఫలితాలను ప్రాప్తింపచేసే పరమదయానుగ్రహ స్వరూపిణి శ్రీకాళీమాత. లాభాలను, ఫలితాలను ఆశించకుండా చేసే మంచి పనులకు, ఆ తల్లి ఎల్లప్పుడూ, వారికి శుభఫలితాలనే ఇస్తుంది. శ్రీవరకాళీమాత, భక్తులు ఈ లోకంలో ఇతరులతో ఎలా ప్రవర్తించాలి, తల్లిదండ్రులతో ఎలా ప్రవర్తించాలి, బంధుమిత్రులతో, స్నేహితులతో, పిల్లలతో, పెద్దలతో, స్త్రీలతో ఎలా ప్రవర్తించాలి, అలా ప్రవర్తించటం వలన సమకూరే మంచి, అందుకు భిన్నంగా ప్రవర్తించటం వలన కలిగే అనర్థాలను, అందలి రహస్యాలను వివరంగా తెలియ చేస్తుంది, తేజస్స్వరూపిణి అయిన శ్రీవరకాళీమాత అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సంప్రజ్ఞాత స్థితిమూలబుద్ధే రదృశ్యకారిణి ! దేవి ! సర్వసిద్ధేశ్వరి !**
**అసంప్రజ్ఞాత సమాధిస్థితిప్రదాత్రి ! కాళి ! సర్వాసనసిద్ధిప్రదాత్రి !**
**తపోదీక్షాభివృద్ధి సిద్ధిప్రదే ! వరకాళి ! తురీయానందవిధాయిని !**
**సత్యకాల చక్రాంతర జీవనానంద ప్రదాత్రి ! దేవి ! వరకాళీశ్వరి ! 104**

తా॥ అనేకమైన కోరికలు నిరంతరమూ, పుట్టడానికి కారణమైన స్థితినే సంప్రజ్ఞాత స్థితి అంటారు. మానవునికి ఊహ తెలిసిన కాలంనుంచి, గతించే వరకూ ప్రతిక్షణం ఎన్నో కోరికలు కలుగుతుంటాయి. అవి రెండు రకాలుగా భావిస్తే ఒకటి బాహ్యమైన కోరికలు, రెండోవి అంతర్గతమైన ఇంద్రియములకు సంబంధించిన కోరికలు. ఈ కోరికలన్నీ, మానవులకు ఆశలను పెంచి, అవి ఫలించకపోవటం వలన అశాంతిని రేకెత్తించేవే. మరికొన్ని కోరికలను సాకారం చేసుకోవడానికి, అధర్మ మార్గాలను ఆచరించవలసి వస్తుంది. చివరకు అవి పతనానికి దారి తీస్తాయి. ఈ విధమైన కోరికలు పుట్టడానికి కారణమైన ఈ స్థితిని శాశ్వతంగా తొలగించి మంచి ఆలోచనతో స్థిరంగా ఉండే ఆసన సిద్ధులను ప్రాప్తింపచేసే ఈశ్వర స్వరూపిణియే శ్రీకాళీమాత. ఆ విధంగా ఎలాంటి కోరికలూ లేని స్థితినే అసంప్రజ్ఞాత సమాధి స్థితి అంటారు. మనసులో ఏ ఇతర కోరికలూ లేకపోవటం వలన, వారు పరిపూర్ణంగా ఆ తల్లిమీదే మనసు కేంద్రీకరించగలిగే స్థితిని సంపాదిస్తుంది. దీనినే నిర్వికల్ప సమాధిస్థితి అని కూడా అంటారు. ఈ నిర్వికల్ప సమాధిస్థితిని ప్రసాదించి, సమస్త యోగాసన సిద్ధులను ప్రాప్తింపచేసే యోగస్వరూపిణి శ్రీకాళీమాత. మరియు ఆ తల్లి భక్తుల తపోదీక్షలను అభివృద్ధి చేస్తూ, వారికి అధికమైన శుభఫలితాలను అందచేస్తుంది, అమృతానంద స్వరూపిణి అయిన శ్రీవరకాళీమాత. అంతేకాకుండా భక్తులకు మోక్షస్థితిని ప్రసాదించే మోదస్వరూపిణి ఆ తల్లి. సత్యమైన ఈ కాల చక్రంలో ఆనందమయ జీవితాన్ని గడపటానికి, అఖండ సహనశక్తిని, యుక్తిని ప్రసాదించే శ్రీవరాలకు మూలకారణమైన విశ్వమోహన స్వరూపిణి, శ్రీ వరకాళీశ్వరి అయిన ఆ తల్లి శ్రీవరకాళీమాతయే నని శ్రీగురుదేవులు తెలియచేస్తున్నారు.

**శ్లో॥ సుధర్మానురక్తే ! సన్మార్గప్రబోధిని ! కాళి ! సురనరవర సంసేవితే !**
**మహామహిమాన్వితమూర్తే ! దేవి ! మహాప్రతాపశక్తిప్రదే ! మహాకాళి!**
**ధర్మమార్గానుసరణ సుభక్తపోషిణి ! సంరక్షకే ! దేవి ! దక్షిణకాళి !**
**సర్వాహంకారధ్వంసిని ! శీఘ్రవిజయప్రదాత్రి ! శ్రీమద్భద్రకాళీశ్వరి! 105**

తా॥ మంచి ధర్మం అంటే శ్రీకాళీమాతకు ఎంతో ఇష్టం. అలాగే మంచి ధర్మాలను ఆచరించే వారన్నా, ధర్మపాలన అనగా ధర్మాన్ని పాటించేవారన్నా ఆ తల్లి ఎంతో ఇష్టపడుతుంది. అసలు అమ్మవారు ధర్మం వేరుగా ప్రబోధిస్తారు. అలాంటి

ధర్మాన్ని ఆచరిస్తూ ధర్మాలను ప్రబోధించేవారు, స్వయంగా ధర్మమార్గంలో నడిచి మిగతా వారికి అందరికి ఆదర్శవంతులు కావాలి. అప్పుడే లోకంలో ధర్మం వర్ధిల్లుతుంది. అలాకాక ధర్మాలను వల్లించడం వరకే గాని ఆచరణసాధ్యం కాదు అనుకున్న వారికి, ఎప్పటికైనా ధర్మమే వారికి సహాయపడుతుందనే విషయం తెలుసుకోవాలి. ఇలా భక్తులకు మంచి మార్గాలను తెలియజేస్తూ, శ్రీకాళీమాత దేవతలచేత మానవులచేత సేవించబడుతూ, వారికి అండగా నిలిచే మహిమలు కలిగిన తల్లి శ్రీకాళీమాత ఏ పని చేయాలన్నా ఎక్కడికి వెళ్లాలన్నా, ఎవరితో మాట్లాడాలన్నా ధైర్యం లేక వెనుకబడి, అభివృద్ధి సాధించలేని వారికి శ్రీకాళీమాత, గొప్ప బలము, ధైర్యశక్తులను ప్రసాదించే మహాశక్తిమంతురాలు. మంచి నడవడికతో, మంచి మనసుతో, మంచి గుణగణాలతో మంచి మార్గంలో నడుస్తున్నటువంటి మంచి భక్తులను పోషిస్తూ, సదా వారిని రక్షించే తల్లి శ్రీదక్షిణకాళీమాత. ఆ తల్లి జనులకుండే అహంకారాన్ని తొలగించి, వారికి తనను పూజించాలనే కాంక్షను కలిగించి, అన్నివేళలా విజయాలను ప్రసాదిస్తుంది. ఆ తల్లే వేజెండ్లపుర శ్రీవరకాళీమాత. ఆ అమ్మవారు అద్భుతమైన ధర్మాలను ఇంకా ఎన్నో మంచిమార్గాలను, ఆచరణ సాధ్యమైన నియమ నిష్ఠలను, ప్రబోధించే పరమదయాగుణమూర్తి శ్రీభద్రకాళీమాత అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ పరాంబికే ! మహాదేవి ! శ్రీవరకాళికే ! సదాకాలచక్రప్రపాలికే !**
**శ్రీచక్రపీఠ స్థిరనివాసిని ! శ్రీకాళి ! వేజెండ్లపుర వరపాలికే !**
**అక్షరమధనామృతదాయిని ! ఆదిశక్తే ! అమరలోకనివాసిని !**
**మనోనేత్ర దృష్టి ప్రదాయిని! మాతృమూర్తే ! మహాకాలమర్మప్రబోధిని! 106**

తా॥ శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు వేజెండ్ల గ్రామంలో కొలువై ఉన్న, జగన్మాత శ్రీఆదిపరాశక్తి అయిన శ్రీవరకాళీ మాతను. ఈ విధంగా స్తుతిస్తున్నారు. అమ్మా ! నీవు అత్యంత శ్రేష్ఠమైన తల్లివి. అందరి దేవతలకన్నా పెద్ద తల్లివైన మాతా ! భక్తులకు ఎల్లవేళలా, నిరంతరంగా శుభాలను ప్రసాదిస్తూ, అన్నివేళలా కాలచక్రాన్ని పరిపాలించే తల్లివినీవే ! భక్తులకు వారి పూర్వజన్మల కర్మలవలన ఏర్పడే కాలచక్ర దోషాలను నివారించి వారికి సుఖసంతోషాలను అందిస్తావు. శ్రీచక్రపీఠంలో స్థిరంగా నివశిస్తున్న శ్రీకాళీమాతా!

వేజెండ్లపురాన్ని పరిపాలించే వెలుగుల మూర్తివి, మరియు వేజెండ్ల గ్రామాన్ని పాడిపంటలతో విలసిల్ల చేస్తూ, గ్రామప్రజలకు ఈతిబాధలు లేకుండా, రోగాల బారిన పడకుండా, వారి పిల్లాపాపలు కలకాలం వర్ధిల్లుతూ ఉండే విధంగా రక్షణ చేస్తున్న తల్లీ సముద్రాన్ని మథించినప్పుడు అమృతం ఉద్భవించినట్లుగా, పెరుగును చిలికితే వెన్న లభించిన విధంగా, మంత్రాక్షరాలను శ్రద్ధగా భక్తితో మననం చేయటం వలన, నీ భక్తులు అమరత్వాన్ని పొందినట్లుగా మృతిలేని అమృత సమానమైన కవితలను రచించే అద్భుతశక్తిని, దానంగా నీ భక్తులకు ఇస్తావు. సృష్టి ఆరంభానికి ముందు నుంచీ ఉన్న మహామూర్తివి శ్రీ ఆదిపరాశక్తివి నీవే ! అమర లోకంలో నివసిస్తావు అందువలన నీవు నివశించే లోకాలన్నీ అమరలోకాలుగా భాసిల్లుతాయి. నీ భక్తులకు మనోనేత్ర దృష్టితో వారు అనుకున్నవి అన్నింటినీ దర్శించగలిగే అద్భుతమైన దివ్యదృష్టిని ప్రసాదిస్తావు! ఓ తల్లీ ! నిన్ను సేవిస్తూ, నిన్నే విశ్వసించే భక్తులకు, నీవిచ్చే కానుకలుగా, వారికి గొప్ప కాలచక్రమర్మాలను తెలియజేస్తావు. అందువలన వారు నీవు తెలియజేసిన విషయాలను గుర్తించి తగు జాగ్రత్తలను తీసుకునే అవకాశం కల్గిస్తావు. కాలచక్ర మర్మాలను బోధిస్తూ వారు తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రబోధించే సద్గురుమూర్తివి కూడా నీవే కదా తల్లీ! శ్రీవరకాళీమాతా ! అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ మహామృత్యువినాశిని ! మాతృకాచైతన్య ప్రదీపికే ! మధురాంబుధివాసిని!**
**కవితాసామ్రాజ్య ప్రపాలికే ! కైవల్యపురపాలికే ! కరుణామృతవాసిని!**
**మునియోగి ఋషిగణ శక్తిప్రదాత్రి! కాళి ! అవధూతార్య గురుప్రపాలికే!**
**నిత్యనిర్వాణ యుక్తి ప్రదాత్రి ! దేవి ! శ్రీమద్గురువరకాళి ! నిత్యప్రకాశికే! 107**

తా॥ శ్రీవరకాళీమాతా ! నీ భక్తులను నీవు ఎల్లవేళలా అనుసరిస్తూ వారికి ఏ చిన్న ఆపద కూడా రాకుండా కాపాడుతావు. చివరకు నీ భక్తులను చంపడానికి వచ్చిన మృత్యువును కూడా చంపగలిగే మహాశక్తివి నీవే కదా తల్లీ ! సకల జీవులలో చైతన్యశక్తిగా వెలిగే తల్లివి నీవే అన్ని జీవులలో నీ ఉనికి లేనిదే వాటికి కదలిక లేదు. నీ శక్తి లేనప్పుడు జీవులు కూడా నిర్జీవులే. అంటే వాటికి ప్రాణశక్తివి నీవే! తేనెకన్నా తియ్యనైన జలంతో నిండిన సముద్రంలో నివసించే తల్లీ ! కవితా సామ్రాజ్యాన్ని పాలించే నిన్ను, ఆరాధించే భక్తులు అక్షరజ్ఞానం లేనివారైనా, చదువు

లేనివారైనా, మందబుద్ధులైనా, తెలివి లేనివారైనా వారికి అమితమైన జ్ఞానశక్తిని కవితాశక్తిని ప్రసాదించి లోకంలో వారికి గొప్ప వైభవాన్ని మంచి కీర్తిని కల్గిస్తావు. జ్ఞానశక్తిని కవితాశక్తిని ప్రసాదించి లోకంలో వారికి గొప్ప వైభవాన్ని మంచికీర్తిని కల్గిస్తావు. మోక్షసామ్రాజ్యాన్ని పరిపాలించే తల్లివి నీవే ! అనేక జన్మలనుంచీ బాధలు పడుతూ, చేసిన పాపకర్మలను అనుభవిస్తూ వాటి నివృత్తికోసం నీ దరిచేరిన అభాగ్యులను, నీ భక్తులుగా చేసుకొని, నిన్ను సేవించే విధానాన్ని వారికి ప్రసాదించి, మోక్షమార్గానికి అనువైన స్థితిని వారికి కల్పిస్తూ, మరలా వారికి జన్మ లేకుండా, గతజన్మల పాపకర్మలనన్నింటినీ నిర్మూలన కావించి, వారిని, నీవు పరిపాలిస్తున్న మోక్షసామ్రాజ్యానికి రప్పించుకుంటావు. నిజంగా నీవు భక్తులపాలిట వరాల తల్లివి నీవే అమృతంలో నివశించే తల్లివి, శ్రీకాళీమాతవు. మునులకు, యోగులకు, ఋషిగణాలకు అవసరమైన శక్తితోపాటు, వారికి కావలసినవి అన్నీ సమకూరుస్తావు. అవధూతార్య గురుజనులను, అనగా దిగంబరులై, తమ శరీరాలపై వ్యామోహాలు వదలి, అంతా ఒక్కటే, ఏ భేదభావమూ లేదు అని వారి దిగంబర వేషధారణ ద్వారా తెలియజెప్పే అవధూతలు, సంపూర్ణ జ్ఞానసంపదతో నిండిన సద్గురువులు, గురువులై జనులను మంచి మార్గంలోకి నడిపించే వారిని పాలించే తల్లీ ! అలాంటి మంచి వారికి నిత్యము, మోక్షాన్ని పొందటానికి కావలసిన తెలివిని, అర్హతను ప్రసాదించే సద్గురుమూర్తి వైన శ్రీవరకాళీమాతా ! నిరంతరమూ, నిత్యమూ ప్రకాశిస్తూ ఉండే తల్లివి నీవే కదా ! శ్రీఆదిపరాశక్తివి అంటున్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ విమలార్య హృదయవాసిని ! వినయ విజ్ఞానప్రదాయికే ! విశ్వపాలికే !**
**అగణితాద్భుత లీలామహిమ ప్రదర్శితమూర్తే ! ఆనందస్వరూపిణి !**
**వేజెండ్లపుర వరకాళికే ! శ్రీ వేంకట కాళీకృష్ణ గురుపాలికే ! దేవి !**
**నమస్తే నమస్తే నమస్తే శ్రీవరప్రదాత్రి ! శ్రీవరకాళి ! నమో నమః 108**

తా॥ సహృదయులు, మంచివారు, పరిపూర్ణ జ్ఞానసంపన్నులైన సద్గురువులు, సదా లోక కల్యాణార్థం శ్రమించే జనుల హృదయాలలో నివశించే తల్లీ ! నీ భక్తులకు, నిన్ను ఆశ్రయించిన వారికి, నిన్ను నమ్మి ఆరాధించే వారికి, పరులయెడ వినయాన్ని విధేయతలతో మసలుకొనే విధానాన్ని అన్నీ అనుభవ పూర్వకంగా తెలుసుకోగలిగే శక్తియుక్తులను ప్రసాదిస్తావు. విశ్వాన్ని పాలించే శ్రీకాళీమాతా ! భక్తులకు లెక్కకు

మిక్కిలిగా, వారు అద్భుత, ఆశ్చర్యాలకు లోనయ్యే విధంగా నీ మహిమలను, లీలలను చూపిస్తావు. అవి తిలకించే అదృష్టానికి నోచుకున్న వారు ఎల్లప్పుడూ నీపాదసేవ చేయాలని, నీవే వారి సర్వస్వం అని పొంగిపోతూ, జన్మజన్మలకూ నీ నామస్మరణ వీడని విధంగా తగిన భాగ్యాన్ని కల్గించమని వేడుకునేది నిన్నే కదా ! తల్లీ ! నీవు ఎల్లవేళలా ఆనందంతో ఉంటావు. నీ దివ్యమైన రూపం దర్శించిన వారికి, నిన్ను సేవించే వారికి సదా ఆనందాన్ని కల్గిస్తూ ఉంటావు. ఆ ఆనందం వారికి ఎల్లకాలం నిలిచి ఉంటుంది ఉండేటట్లు నీవే చేస్తావు అందువలన వారు మరల, మరల నీ దర్శన భాగ్యం కోసం, నిన్ను సేవించే తరుణం కోసం ఆనందంగా ఎదురుచూస్తూ ఉంటారు. శ్రీ వేజెండ్లపురములో, శ్రీచక్రపీఠంలో స్థిరనివాసం ఏర్పరచుకొన్న శ్రేష్ఠమైన శ్రీకాళీమాతా ! భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారైన శ్రీగురుదేవులను పాలించే తల్లివి నీవే ! భక్తుల శ్రేయస్సుకోసం, విశ్వక్షేమం కోరుతూ అభివృద్ధి కోసం, లోకంలోని జనులు సకల సుఖశాంతులతో వర్ధిల్లడం కోసం శ్రీగురుదేవులు చేసే యజ్ఞయాగాదులవలన, వారికి నీవెన్నో వరాలను, సిద్ధులను ప్రసాదించావు. దాని ఫలితంగా శ్రీగురుదేవులు ఆశించిన రీతిలో ఎన్నో శుభకరమైన ఫలితాలను ప్రసాదిస్తున్న శ్రీవరకాళీమాతా ! నీకు ముమ్మార్లు మళ్లీ, మళ్లీ, మళ్లీ నమస్కారం ! అంటూ రచించారు ఈ శ్లోకాన్ని శ్రీగురుదేవులు.

# 42. శ్రీ వేజెండ్లపుర శ్రీ ఆదిపరాశక్తి కాళీ అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక

## ఫలశ్రుతి (తాత్పర్యముతో)

**శ్లో॥ నవ దినార్చనేనైవ దశసహస్ర కాశీ కైలాసగిరి యాత్రాధిక ఫలప్రదే !**
**గయాక్షేత్ర సందర్శన గంగాదిక నదీతీర్థ స్నానాధిక ఫలప్రదాయిని! కాళి!**
**దశ దినార్చనేనైవ శతసహస్ర శ్రీశైలక్షేత్ర యాత్రాధిక పుణ్యఫలప్రదే!**
**ద్విశత సహస్ర హరిద్వార హృషీకేశామరనాథాదిక యాత్రాధిక ఫలప్రదే!1**

తా॥ మానవులు ఏ పని చేయ తలపెట్టినా ముందుగా ఎలాంటి ఫలితం కావాలో సంకల్పించుకుంటారు. అది సహజం. అందుకోసమే ఎన్నో పుణ్యకార్యాలు చేస్తుంటారు, యాత్రలు చేస్తుంటారు. ప్రపంచంలో ఎలాంటి యాత్రలు చేయటం వలన ఎక్కువ ఫలితం వస్తుందో తెలుసుకొని అలాంటి తీర్థయాత్రలు చేస్తుంటారు. అలాంటి యాత్రా స్థలాలలో ముఖ్యంగా కాశీ మరియు మానస సరోవరంలోని కైలాసగిరి. కాశీయాత్ర అత్యంత ప్రశస్తమైనవి. పూర్వపు రోజుల్లో కాశీయాత్రకి వెళ్లిన వాళ్లు మరలా తిరిగి ఇంటికి వస్తారో లేదో తెలిసేది కాదు. ఎలాంటి ప్రయాణ సౌకర్యాలు ఉండేవి కావు. అత్యంత దుర్భరమైన ప్రయాణం. ఐనా గాని జీవితంలో ఒక్కసారైనా కాశీయాత్ర చేసి ఆతల్లి శ్రీఅన్నపూర్ణేశ్వరిని మరియు కైలాసనాథుడైన పరమశివుని దర్శించుకొని తమ జన్మలను సార్థకం చేసుకోవాలని తలంచేవారు. ఆ యాత్ర పరమార్థం కూడా అదే. కాశీలోని అత్యంత పావనమైన గంగానదిని, హరిశ్చంద్ర మహారాజు పరిపాలించిన స్థలాలను, అక్కడ శివునికి జరిగే చితాభస్మంతో అభిషేకం, మొదలైన దైవకార్యాలన్నీ దర్శించి, తమ తనువులను కూడా కాశీక్షేత్రంలోనే చాలించాలని తద్వారా పునర్జన్మ ఉండదని భావిస్తుంటారు. అదే విధంగా మానస సరోవరం. ఇది మహాశివునికి అత్యంత ప్రీతికరమైన పుణ్యస్థలం. ఈ యాత్ర కఠినాతికఠినమైన ఇబ్బందులతో కూడి ఉంటుంది. సరైన ప్రయాణమార్గం ఉండదు. కొండ మార్గంలొ సరిగ్గా నడవటానికి కూడా కష్టమే. కొండ మార్గం ఎక్కే కొద్దీ ప్రాణవాయువు కూడా అందదు. ఆరోగ్యవంతులు మాత్రమే చేయగలిగే యాత్ర.

కాని పరమశివుని లింగరూపంలో దర్శించి పునీతులు కావటానికి ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొని, పరమశివుని దర్శనమే పరమార్థంగా ఈ యాత్ర సాగుతుంది. ఇన్ని కష్టాలకోర్చి కాశీ, కైలాసగిరి క్షేత్రాలను దర్శించటం వలన ఎంతో పుణ్యం వస్తుంది. ఈ క్షేత్రాలను ఒకసారి దర్శిస్తేనే మహాపుణ్యఫలం లభిస్తుంది. అలాంటిది (10) పదివేలసార్లు ఈ క్షేత్రాలను దర్శించగలిగితే వచ్చే ఫలితం ఎంత అనేది లెక్క వేసి చెప్పటం సాధ్యం కాదు. అలాగే గయాక్షేత్ర సందర్శనం, గంగానదిలో స్నానమాచరించటం వంటి పుణ్యకార్యక్రమాలను పది వేల సార్లు చేయటం వలన లభించే పుణ్యఫలితం కన్నా ఎక్కువగా, ఆ తల్లి శ్రీకాళీమాతను, మనసు నిగ్రహించి, తదేక దీక్షతో ఆరాధిస్తే, తొమ్మిది (9) రోజులలోనే వారికి ప్రసాదిస్తుంది. ఇందువల్ల ప్రయాణంలో బాధలను ఎదుర్కొనే సమస్య లేదు, కొండలు ఎక్కలేము. దిగలేము అనే భయం ఉండదు. ఈ క్షేత్రాలను దర్శించుకోవటానికి అయ్యే ఖర్చు కూడా లేదు. ప్రయాణాలలో ఆరోగ్యాలు పాడవుతాయనే బాధ కూడా లేదు. వీటన్నింటినీ అధిగమించి ఉన్న చోటు నుంచే ఆతల్లి శ్రీకాళీమాతను మనసారా తొమ్మిది రోజులు ఆరాధిస్తే చాలు, పై క్షేత్రాలను (10) పది వేల సార్లు దర్శించుకుంటే వచ్చే పుణ్యపలితం కన్నా అధికమైన శుభఫలితాలను ఆ తల్లి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

శ్రీశైల పుణ్యక్షేత్రం ఎన్నో యుగాల నుంచి మహత్తరమైన ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్నది. ఈ క్షేత్ర ప్రాశస్త్యం పురాణాలలో కూడా కన్పిస్తున్నది. ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులిక్కడ శ్రీమల్లికార్జున స్వామి శ్రీ భ్రమరాంబికా దేవిగా పూజలు అందుకుంటున్నారు. ఈ చుట్టుప్రక్కల అటవీ ప్రాంతంలో ఎన్నెన్నో పుణ్యతీర్థాలు కన్పిస్తాయి. త్రేతాయుగం నాటి శ్రీరామచంద్రుడు, ద్వాపరయుగం నాటి పాండవులు ఈ శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకొని, యుద్ధాల ద్వారా వారికి ప్రాప్తించిన పాపాలను తొలగించుకున్నారని తెలుస్తున్నది. అలాగే ఆదిశంకరాచార్యుల వారిని, శ్రీ నారసింహ స్వామి, శత్రుకూటమి నుంచి రక్షించింది కూడా శ్రీశైల క్షేత్రం పైనే. అంతటి మహిమ గలిగిన క్షేత్రం ఈ శ్రీశైలక్షేత్రం. ఈ స్వామిని దర్శించి తరించాలని అందరూ కోరుకుంటారు. కోరిన కోరికలను ఈ స్వామి తప్పక తీరుస్తాడని ప్రతీతి. ఒక్కసారి శ్రీశైల క్షేత్రదర్శనం చేస్తేనే, వారికి మరల జన్మ లేకుండా పోతుందని సాక్షాత్తూ శ్రీరామచంద్రుల వారే సెలవిచ్చినట్లుగా

స్థలపురాణం ద్వారా తెలుస్తున్నది. అంతటి మహిమ గలిగిన ఈ క్షేత్రదర్శనం ఒక్కసారి కాక (100000) లక్షసార్లు చేయగలిగితే ఎంతటి గొప్పదైన పుణ్యఫలితం, శుభఫలితాలూ వస్తాయో, అంతకు మించి అధికమైన అద్భుతమైన, మహత్తరమైన పుణ్య ఫలితాలను, శ్రీకాళీమాత, తనను మనసా, వాచా, కర్మణా పూజ చేసిన వారికి పది (10) రోజులలోనే వరంగా ప్రసాదిస్తుంది అని చెప్పటంలో ఎలాంటి సందేహం లేదు.

అదే విధంగా హరిద్వారము, హృషీకేశము మరియు అమరనాథ్ పుణ్యక్షేత్రాలు. హరిద్వారము ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉన్నది. అమృతం కోసం సాగర మథనం జరిగింది. ఈ ప్రాంతంలోనే అని చెప్తారు. సాగర మథనంలో అమృతం ఉద్భవించినపుడు ఆ అమృత భాండం రాక్షసుల బారిన పడకుండా కాపాడటం కోసం, విష్ణువు వాహనమైన గరుత్మంతుడు ఆ అమృత భాండాన్ని అక్కడి నుంచి రాక్షసులకు అందకుండా తరలించే క్రమంలో కొన్ని అమృత బిందువులు ఈ ప్రాంతంలో జల్లులా కురిసిందని ప్రతీతి అందువలన ఈ క్షేత్రానికి ఎంతో మహిమ ఉన్నట్లుగా భావిస్తారు. అలాగే ప్రతి పన్నెండు సంవత్సరాలకు జరిగే మహాకుంభ మేళాలో కొన్ని లక్షల మంది భక్తులు పాల్గొని గంగానదిలో స్నానమాచరించి, తాము మోక్షానికి అర్హత పొందినట్లుగా భావిస్తారట. ఇది మహా విష్ణుక్షేత్రం. విష్ణు సాయుజ్యం పొందటానికి ఈ ప్రాంతం ఒక మార్గదర్శకం అని భక్తుల విశ్వాసం. హృషికేశ్ పుణ్యక్షేత్రం, ఇది హిమాలయ పర్వతాల పాదసానువులలో ఉన్నది. దీన్ని హిమాలయాలకు ముఖద్వారంగా చెపుతుంటారు. ఇది హిందువులకు అతిపవిత్రమైన పుణ్యస్థలం. దీన్ని దర్శించి తరించాలనుకోని భక్తులు ఉండరు. అంతటి అద్భుతమైన పాపవినాశన క్షేత్రం, ఇది కూడా ఉత్తర దేశంలోనే ఉన్నది. అలాగే అమరనాథ్ పుణ్యక్షేత్రం, ఈ క్షేత్రం కాశ్మీర దేశంలో ఉన్నది. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి భక్తులు ఇక్కడి మంచు శివలింగాన్ని దర్శించుకొని పునీతులు అవుతారు. ఈ శివలింగం ఒక గుహలోపల, సంవత్సరంలో కొన్ని రోజులు మాత్రమే ఏర్పడి భక్తులకు, అలౌకికమైన ఆనందానుభూతులను పంచుతుంది. సాక్షాత్తూ శివుడు నివసించే ప్రాంతంగా ఈ క్షేత్రాన్ని భావిస్తారు. ఈ పైన చెప్పిన దివ్యక్షేత్రాలైన హృషికేశ్, హరిద్వార్ మరియు అమరనాథ్ క్షేత్రాలను (200000) రెండు లక్షలసార్లు దర్శించుకున్నప్పుడు వారికి లభ్యమయ్యే పుణ్యఫలితాల కన్నా శ్రీకాళీమాతను

పదిరోజులపాటు ఏకాగ్ర చిత్తంతో ఆరాధించిన వారికి, ఆతల్లి ఈ క్షేత్ర దర్శనాలకు మించిన ఫలితాన్ని ప్రసాదిస్తుంది. ఎందుకంటే శ్రీకాళీమాత అత్యంత సులభంగా ప్రసన్నురాలై భక్తులు కోరిన వరాలను అధిక మొత్తంలో ప్రసాదించే తల్లిగా భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకం ద్వారా తెలియచేస్తున్నారు.

**శ్లో॥ భవిష్యత్త్రిజన్మాచరణానేక పుణ్యకార్యాధిక ఫల మద్యైవ ప్రదాత్రి ! శ్రీకాళి!**
**ద్వాదశ జ్యోతిర్లింగ చతుర్వింశతి కోటి యాత్రాధిక పుణ్యఫలప్రదాయిని! దేవి!**
**ఏకమాసార్చనేనైవ అష్టాదశజన్మ కృతాష్టోత్తరశత భూప్రదక్షిణాధిక ఫలప్రదే!**
**విశ్వాంతరానేక దేవతావృక్ష పూజా గిరి ప్రదక్షిణాధిక పుణ్యఫల ప్రదాత్రి!2**

తా॥ ప్రతి మానవుడూ తమకు రాబోయే రోజులన్నీ సుఖంగా, శుభప్రదంగా జరిగి పోవాలని ఆశిస్తూ, అందుకోసమై ఇప్పటి నుంచే, ఏమి చేయటం వలన తమ భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందనే ఆలోచనలను చేస్తుంటారు. కొంతమంది పుణ్యకార్యాలను ఆచరిస్తుంటారు. తద్వారా లభించిన పుణ్యం రాబోయే రోజుల్లో తమకు, తమ బిడ్డలకు మంచి ఫలితాలను ప్రసాదిస్తుందని, జీవితాలు సుఖమయం అవుతాయని భావిస్తారు. మరికొంతమంది ఇప్పుడు డబ్బు సంపాదించి కూడబెట్టటం వలన, రాబోయే కాలంలో ఆ డబ్బు తమకు ఆసరాగా ఉంటుందని భావిస్తూ అందుకు అనుగుణంగా సంపాదనా మార్గాలను అన్వేషిస్తుంటారు. వందకు ఒక్కరో ఇద్దరో తప్ప మిగిలిన వారందరూ తమ భవిష్యత్ కార్యాచరణలో భాగంగా ఏదో ఒక దేవుడినో, దేవతనో పూజిస్తూ ఉంటారు. ఒక జీవితం పూర్తిగా, ఆ విధంగా పుణ్యం కోసం గాని, ధనం కోసం గాని ప్రాకులాడటం వలన, అందు నిమిత్తం ఆచరించే కార్యక్రమాలలో పుణ్యఫలితం ఉంటే, అది వచ్చే జన్మలో వారికి భోగభాగ్యాలను, సుఖ సౌఖ్యాలను ప్రసాదించి పెడుతుంది అనేది మానవుల విశ్వాసం అంటే విత్తనం ఒకరు వేస్తే, చెట్టును వేరొకరు పెంచితే, వాటి పండ్లను మరొకరు అనుభవించటం. ఇది లోక సహజమైన విషయమే. కాని, శ్రీకాళీమాతను మనసారా సేవించిన వారికి ఈ ఫలితాలు మరో విధంగా ఉంటాయి. ఈ జన్మలోని పుణ్యఫలం వచ్చే జన్మలో లభించటం కాదు, ముందు రాబోయే (3) మూడు జన్మలలో, మానవులుగా ఆచరించబోయే పుణ్యకార్యాల వలన వచ్చే పుణ్యఫలితం, దాని వలన సంప్రాప్తించే సకలమైన వైభవాలు, భోగాలు, సిరిసంపదలు అన్నీ కూడా ఈ జన్మలోనే,

ఈ క్షణంలోనే తమ భక్తులైన వారికి ఆ తల్లి సంతోషంగా ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

అలాగే ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం సర్వపాపహరం అని భక్తులు నమ్ముతారు. కైలాస నాథుడైన శివుడు, లోకంలో వివిధ ప్రాంతాలలో మొత్తం పన్నెండు చోట్ల జ్యోతిర్లింగ రూపాలలో కొలువై ఉన్నాడు. ఆ జ్యోతిర్లింగాలు ఏమిటంటే 1) గుజరాత్ రాష్ట్రంలోని సోమనాథ్ 2) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీశైల క్షేత్రం 3) మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని మహాకాళేశ్వర్ 4) మధ్యప్రదేశ్‌లోని మరొక జ్యోతిర్లింగం ఓంకారేశ్వర్ 5) ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ 6) మహారాష్ట్రలోని భీమశంకర్ 7) ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాశీ విశ్వనాథ్ 8) మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ 9) గుజరాత్ రాష్ట్రంలోని నాగేశ్వర జ్యోతిర్లింగం 10) ఝార్ఖండ్ రాష్ట్రంలోని వైద్యనాథేశ్వర్ 11) తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం మరియు 12) మహారాష్ట్రలోని ఘృష్ణేశ్వర్ మందిరము.

ఇవన్నీ శివారాధకులకు ఎంతో పవిత్రమైన పుణ్యప్రదమైన ఆరాధనా స్థలాలు. వీటన్నింటినీ ఒక్కసారి దర్శించుకోగలిగితే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ప్రయత్నం చేస్తే జీవిత కాలంలో వీటన్నింటినీ కొన్నిసార్లయినా దర్శనం చేసుకోవచ్చు. అందువలన అమితమైన పుణ్యఫలితం లభిస్తుంది. ఈ విధంగా దర్శించుకోవటానికి ఎంతో వ్యయ, ప్రయాసలు ఓర్చుకోవాలి. వీటన్నింటినీ అధిగమించి తిరిగినా జీవితం మొత్తం మీద కొన్ని వందలసార్లు, లేదా కొన్ని వేలసార్లు మాత్రమే మానవ మాత్రులు దర్శించుకోగలుగుతారు. అలా కొన్ని లక్షల జన్మలు మానవులుగా పుట్టి ప్రతిజన్మలోనూ సాధ్యమైనన్ని ఎక్కువసార్లు ఈ జ్యోతిర్లింగాలను దర్శించుకోగలిగి వాటి సంఖ్య (24 కోట్లు) అయినట్లయితే దానివలన ఒనగూడే పుణ్యఫలితం మహత్తరంగా, అద్భుతమైనదిగా ఉంటుంది. అలా అన్ని లక్షల జన్మలు మానవులుగా పుట్టి (24) కోట్ల సార్లు జ్యోతిర్లింగ దర్శనాలు చేసుకోవటం అనేది ఊహకందని వాస్తవం. కాని అన్ని జన్మల ద్వారా, అన్ని కోట్ల సార్లు జ్యోతిర్లింగ దర్శనాల వలన వచ్చే పుణ్యఫలం కన్నా, ఆ తల్లి శ్రీకాళీమాతను మనసారా త్రికరణ శుద్ధిగా (24 రోజుల)పాటు పూజించటం వలన, అంతకంటే ఎక్కువ పుణ్యాన్ని, శుభఫలితాలను శ్రీకాళీమాత తన భక్తులకు ప్రసాదిస్తుంది. ఇందులో అతిశయోక్తి ఏమియును లేదు.

ఒకసారి మానవజన్మ నెత్తి, ఆ జన్మలో ఈ లోకంలోని పుణ్యక్షేత్రాలన్నింటినీ కలదిరుగుతూ (108) సార్లు భూప్రదక్షిణం చేయగలిగిన వారు ఎంతో ధన్యులు వారు చరిత్రలో నిలిచిపోతారు. అలాగే (18) జన్మలు వరుసగా మానవులుగా పుట్టి, ఆధ్యాత్మిక చింతన కలిగి మరల, మరల ఒక్కొక్క జన్మలోనూ (6)సార్లు చొప్పున (18) జన్మలలో భూమిపై నుండే సకల పుణ్య క్షేత్రాలను, స్థలాలను దర్శిస్తూ, ప్రతిజన్మలోనూ భూప్రదక్షిణ చేయటం వలన సంప్రాప్తించే మహాద్భుతమైన పుణ్యఫలితం కన్నా, జగన్మాత శ్రీకాళీమాతను చిత్తశుద్ధితో, తదేక దీక్షతో (ఒక నెలరోజులు) పాటు ఆరాధించటం వలన, ఆతల్లి అలాంటి వారికి అంతకు మించిన అద్భుత పుణ్య ఫలితాలను ప్రసాదిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు అంటారు శ్రీగురుదేవులు.

విశ్వం అనబడే ఈ విశాల భూప్రపంచంలో ప్రకృతి ఒడిలో సంరక్షింపబడుతూ అనేక వృక్షాలు, కొండలు కోనలు ఉన్నాయి. వాటిలో మహత్తరమైన వృక్షాలు, కొన్ని కొండలుఉన్నట్లుగా చెప్పుకోవచ్చు. కొన్ని వృక్షాలు దేవతావృక్షాలుగా పరిగణింప బడతాయి. ఋషులు, మునులు, యోగులు వారి పూర్వజన్మల కర్మానుసారం, ఈ భూమ్మీద పూజింపబడే వృక్షాలుగా పుట్టి వారి పూర్వ పుణ్యఫలం వలన పూజింపబడుతుంటారు. అలాంటివే దేవాలయాలలో, పవిత్ర ప్రదేశాలలో కన్పిస్తూ, తమకున్న దివ్యశక్తులను, తమను ఆశ్రయించి వచ్చే వారికి, తమను పూజిస్తూ తమ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ భక్తిని ప్రదర్శించే వారికి, ఇంకా ఎలాంటి భావంతో ఆ చెట్టువద్దకు వెళ్లినా, ఔషధ గుణరూపంలో ప్రసాదిస్తూ, తద్వారా వారికి హాయిని మనశ్శాంతిని, ప్రశాంతతను ప్రసాదిస్తూ ఉంటాయి. ఇలాంటి శుభఫలితాలను ప్రసాదించగలిగేది సాక్షాత్తూ దైవ స్వరూపులైన సద్గురువులే. అలాంటివారు చెట్టు రూపంలో ఉన్నా మరే రూపంలో ఉన్నా తమ సహజత్వాన్ని కోల్పోక తమ పంచన చేరిన వారికి పుణ్యఫలితాలనే ఇస్తుంటారు. అదే విధంగా కొన్ని కొండలు, పర్వతాలు ఎంతో పురాణ ప్రసిద్ధి చెంది ఉంటాయి. అందుకు కారణం వాటిపై నున్న పుణ్యప్రదేశాలు, దేవాలయాలు, ఋషుల ఆశ్రమాలు, దివ్య ఋషుల తపస్స్థలాలు ఉండటమే. తిరుమల, శ్రీశైలం, అరుణాచలం ఇంకా ఎన్నో ఇలాంటి ప్రదేశాలు ఉన్నాయి. వీటన్నింటినీ దర్శిస్తూ, పూజిస్తూ, వీటికి భక్తితో ప్రదక్షిణలు చేయటం వలన మహత్తరమైన పుణ్యఫలితాలు లభిస్తాయి. కాని వీటన్నింటిని చేయకుండానే,

అనగా శ్రమతో, డబ్బు ఖర్చుతో, దేవతా వృక్షాలను, గిరిప్రదక్షిణలను చేయకుండానే, అలా చేస్తే వచ్చే శుభఫలితాల కన్నా అధికమైన శుభయోగాలను, శుభ ఫలితాలను, కాలరూపిణియైన శ్రీకాళీమాతను, శ్రేష్టమైన బుద్ధితో పూజించటం వలన అన్నింటినీ ప్రసాదిస్తుందనే అనుభవ సారాంశంగా తెలియజేస్తున్నారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**శ్లో॥ చతుఃపంచాశద్వర్ష త్రిమూర్త్యర్చన ఫలం సప్తవింశతిదినార్చనేనైవ ప్రదాత్రి!**
**త్రింశత్కోటి దీపస్థాపనకృతాలంకరణోత్సవ సందర్శనాధిక ఫలప్రదాత్రి!**
**దివ్యమాస పుణ్యదినాచరితానేక వ్రత పుణ్యాధిక ఫలప్రదాయిని! శ్రీకాళి!**
**కోటి గో పోషణ సంరక్షణ ప్రదక్షిణ సేవాధిక పుణ్యఫల ప్రదాత్రి! శ్రీకాళి!3**

తా॥ త్రిమూర్తులనగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. బ్రహ్మ ఈ విశ్వంలోని జీవరాశుల నన్నింటినీ ఎప్పటికప్పుడు, నిరంతరం సృష్టిస్తూనే ఉంటాడు. ఆయన సృష్టికర్త. ఆయనకున్న శాపం కారణంగా ఆయనకు పూజలు లేవని అంటారు. ఆయన దేవాలయాలు కూడా లోకంలో చాలా తక్కువే. అలాగే విష్ణుమూర్తి. ఈయన, జీవుల పాలన కర్త, పోషణకర్త, జీవుల దేహం సజీవంగా నిలిచి ఉండాలంటే వాటి యొక్క పోషణ అత్యంత ఆవశ్యకమైనది. ఈ పోషణాభారం అంతా విష్ణుమూర్తియే వహిస్తారు. బ్రహ్మ నారు పోస్తే, విష్ణువు నీరు పోస్తాడు. జీవులు ముఖ్యంగా మానవులు సుఖశాంతులతో జీవించటానికి అవసరమైన వనరులన్నింటినీ కల్పిస్తాడు. విష్ణువు అలంకార ప్రియుడు. సర్వాభరణభూషితుడై, సకలమైన అలంకారాలతో ఎల్లప్పుడు వైభవోపేతంగా కన్పిస్తూ ఉంటాడు. అందువలన తనను ఆశ్రయించి వచ్చే భక్తులకు కూడా తనలాగే సర్వ వైభవాలనూ అనుభవించే అవకాశాన్ని ప్రసాదిస్తాడు. అందువల్లనే కలియుగ దైవం, సాక్షాత్తూ విష్ణు స్వరూపమైన శ్రీవేంకటేశ్వర స్వామివారు, ఎల్లప్పుడూ సర్వాలంకరణ భూషితుడై భక్తులకు దర్శనమిస్తూ, కోరిన వారికి కొంగు బంగారమై, సర్వ సంపదలను వారికి ప్రసాదించటానికి సర్వదా సన్నద్ధుడై ఉంటాడని ప్రతీతి. ఈ ప్రపంచంలో డబ్బు అవసరం లేనివారు ఎవ్వరూ ఉండరు. పోషణకు, వైభవాలను అనుభవించటానికి మూలద్రవ్యం ధనమే కదా! కలియుగంలో శ్రీవిష్ణుమూర్తి ప్రసాదించలేని వైభవం ఏమీ లేదు. అందువల్లనే ప్రతివారు విష్ణు స్వరూపమైన, శ్రీ వేంకటేశ్వర స్వామిని లెక్కలేనన్ని సార్లు

దర్శించుకోవాలని సంబరపడుతుంటారు. అందువలన అధికమైన సంపదలు పొందవచ్చుని వారి విశ్వాసం. అదే విధంగా త్రిమూర్తులలో మూడవవాడు శ్రీమహాశివుడు. ఈయన లయకారకుడు. జీవుల అంతిమ సమయంలో వాటిని తనలో లయం చేసుకుంటాడు. అంతేకాదు సులభంగా భక్తులకు వరాలను ప్రసాదించే వరదేవుడు శివుడు. ఎలాంటి వరాలనయినా భక్తులకు ప్రసాదిస్తాడు. తాను ప్రసాదించిన వరాలతో గర్వించి ఎవరైనా లోక కల్యాణానికి విఘాతం కల్గిస్తే వారిని నిర్దాక్షిణ్యంగా తనలో లయం చేసుకొని లోక కల్యాణానికి అండగా ఉంటాడు. మోక్షప్రదాత శివుడే. అందువలన మోక్షాన్ని కోరి ప్రవర్తించే జనులు నిరంతరం శివ నామాన్ని జపిస్తూ ఆయనకు అవసరమైన అన్ని పూజలు, జపాలు, అభిషేకాలు చేస్తూ ఉంటారు. శివుడు ఆడంబర ప్రియుడు కాదు, ఎలాంటి అలంకారాలూ ఆయన చేసుకోడు. కేవలం శరీరమంతా భస్మలేపనం చేసుకొని, ఏనుగు చర్మాన్ని వస్త్రంలాగా చుట్టుకొని కన్పిస్తాడు. అయినా గాని తనను నమ్మి పూజించే వారికి సకల సంపదలనూ సౌభాగ్యాలనూ ప్రసాదిస్తాడు. లోకంలో ప్రతిదీ విష్ణు స్వరూపమే, శివ స్వరూపమే. అందువలన ఎవరిని పూజించినా అష్ట ఐశ్వర్యాలనూ, సుఖభోగాలనూ ప్రసాదిస్తారు. ఆ విధంగా ఒక సంవత్సరం కాదు రెండు సంవత్సరాలు కాదు ఏకంగా (54) ఏబది నాలుగు సంవత్సరాల పాటు త్రిమూర్తులను, అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించటం వలన వారికి లభించే పుణ్యఫలితం ఎంత అద్భుతంగా ఉంటుందో అంతకు మించిన అద్భుతమైన మంచి శుభ ఫలితాలను, శ్రీకాళీమాతను (27) రోజులపాటు తదేక దీక్షతో పూజిస్తే, ఆతల్లి తన భక్తులకు ఏబదినాలుగు సంవత్సరాల పూజాఫలితాన్ని ఇరువది ఏడురోజులలో ఇస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

హిందూ సంప్రదాయంలో దీపానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నది. దాదాపు ప్రతివారూ ఉదయం నిద్ర లేవగానే శుచిగా స్నానమాచరించి దీపారాధన చేస్తుంటారు. అలా చేయటం వలన తమ జీవితాలలో వెలుగులు, సౌభాగ్యాలు నిండుగా లభిస్తాయని విశ్వాసం. అలా ఆచరించే ప్రతివారికీ ఈ విషయం అవగతమౌతుంది. శుభఫలితాలనే వారు కోరుకుంటుంటారు, అనుభవిస్తుంటారు. అలాగే పండుగలలో, శుభ దినాలలో ప్రత్యేక సందర్భాలలో అనగా ఏ కొత్త కార్యక్రమం ప్రారంభించాలన్నా దీపారాధనతోటే ప్రారంభించటం అందరూ చూస్తూనే ఉంటారు. దీపాన్ని తెలిసి వెలిగించినా, తెలియక వెలిగించినా, ఏ భావంతో వెలిగించినా, అది వెలుగులనే ప్రసాదిస్తుంది. చీకటిని

పారద్రోలుతుంది. జీవితం వెలుగులతో నిండుతుంది. పసిపిల్లలు దైవ స్వరూపులంటారు. చీకట్లో చిన్న దీపాన్ని వెలిగిస్తే, ఆ వెలుగును చూసి వారు ఆనందంతో కేరింతలు కొడుతుంటారు. వారి కేరింతలు చూస్తుంటే మనకెంతో ఆనందంగా, ఆహ్లాదంగా ఉంటుంది. అలాంటి భావన అనుభూతి మరే సందర్భంలోనూ మనం పొందలేము. ఇది నిజం. అలాగే దీపారాధన చేయగానే దేవుడు ఎంతో సంతోషిస్తూ మనకు ఆనందాన్ని ప్రసాదిస్తాడు, అనటంలో సందేహం లేదు. ఆ ఆనందం మన మనసు కోరిన రూపంలో లభిస్తుంది. కార్తికమాస దీపారాధన ఎంతో విశేషమైనది. ఈ మాసంలో కార్తిక దీపోత్సవాలని, లక్ష దీపోత్సవాలు, అలాగే కోటి దీపాలను వెలిగించి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. అలా చేసినపుడు ఆ శుభఫలితాలు అందరి మీద ప్రసరిస్తాయి. నిర్వహించిన వారి మీదా, చూసిన వారి మీదా అందరి మీదా ఉంటాయి. ఎందుకంటే దీపం వెలుగు దాన్ని వెలిగించిన వారి మీదే కాక ఆ చుట్టుప్రక్కల ఉన్న వారి మీద కూడా ప్రసరిస్తుంది. అలాగే దైవానుగ్రహం కూడా పూజలు చేసిన వారి మీద, అవి చూసిన వారి మీద కూడా అద్భుత శుభఫలితాలు ఉంటాయి. కాని ఒక్కసారిగా (30) ముప్పై కోట్ల దీపాలను వెలిగించి, వాటిని అనేకమైన పుష్పాలతో తీర్చిదిద్ది, అంతకంటే ఎక్కువగా వాటిని సకల శోభితంగా దైవ రూపాలతో అమర్చిన ఆ దీపాలంకార శోభను దర్శించటం వలన వచ్చే ఆత్మ తృప్తిని, సంతోషాన్ని, అంబరాన్నంటే సంబరం కంటె మిన్నగా, సర్వసృష్టికర్తయైన ఆ జగన్మాత శ్రీకాళీమాతకు (3) మూడు దీపాలను వెలిగించి స్వచ్ఛమైన మనసుతో ప్రార్థించటం వలన (30) కోట్ల దీపాలను వెలిగించిన ఫలం అక్షయంగా ప్రసాదిస్తుంది.

ఒక సంవత్సరంలో అనగా చైత్రమాసం నుంచి, ఫాల్గుణమాసం వరకూ ఉన్న కాలంలో ఎన్నో పుణ్యప్రదమైన నెలలు వస్తుంటాయి. ఒక్కో నెలలో ఒకోవిధమైన పూజలు, వ్రతాలు, నోములు మొదలైనవి ఆచరిస్తుంటారు. ఉదాహరణకు కార్తీక మాసం, శివునికి ఎంతో ప్రత్యేకమైనది. ఈ నెలలో ప్రతిరోజూ ఎంతో పవిత్రమైనది, ముఖ్యంగా సోమవారం మరింత ప్రశస్తమైనది. ఈ నెలలో శివుని ఆరాధించటం వలన ఆయన త్వరగా కరుణించి అందరికీ శుభాలను పంచుతాడని విశ్వసిస్తారు. అలాగే నోములు, వ్రతాలు కూడా అన్ని కుటుంబాల వారు తమ వారి క్షేమం కోసం చేస్తుంటారు. అదే విధంగా శ్రావణ మాసంలో లక్ష్మీ అమ్మవారి పూజలు,

ప్రతాలు చేస్తుంటారు. ఆ తల్లి అనుగ్రహం కోసం ప్రతివారూ తమ శక్తి కొలదీ, ఆ తల్లిని పూజిస్తారు. ఇవే కాక ప్రతినెలలోనూ ఏదో ఒక పూజ, సంబరం మొదలైనవి చేస్తూనే ఉంటారు. సంవత్సరం మొత్తం మీద ప్రతినెలలోనూ ఏదో ఒక విశేషాన్ని పురస్కరించుకొని పూజలు చేస్తూ అధికమైన శుభఫలితాలను ఆశిస్తుంటారు. ఇలా సంవత్సరమంతా ప్రతి పుణ్యప్రదమైన కార్యక్రమం వదలకుండా ఆచరిస్తే వచ్చే పుణ్యఫలం కన్నా అధికంగా, ఆ తల్లి, దేవదేవి శ్రీకాళీ మాతను ఒక్కసారి దర్శించి స్మరిస్తే చాలు ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

హైందవ సంప్రదాయంలో గోపూజకు ఉన్న విశిష్టత మరి దేనికీ ఉండదేమో! గోవును ఆశ్రయించి సకల దేవతలు ఉంటారని ప్రతీతి. గోవును ఒక్కసారి పూజిస్తే సకల దేవతలను పూజించిన ఫలితం లభిస్తుంది. అన్ని సంపదలను మించి గోసంపదే ఎక్కువ విలువైనదిగా పూర్వం భావించేవారు. గోవు మనిషి మనుగడకు అవసరమైన సంపూర్ణ పోషణను ప్రసాదిస్తుంది. కనుక దానిని కామధేనువుగా అందరూ భావిస్తారు. కామధేనువు ఇవ్వలేనిది ఏమీలేదు. అందువలన దానిని కామధేనువుగా భావిస్తూ వాటి పోషణ, వాటి సంరక్షణ మొదలైనవి ఒక పుణ్యకార్యంలాగా భావిస్తారు. అందువలన ఆవును దేవతలూ ప్రసన్నమై మహత్తరమైన, అనంతమైన శుభఫలితాలను ప్రసాదిస్తారని నమ్ముతారు. అలాంటి ఒక కోటి గోవుల పోషణ, సంరక్షణ, గోప్రదక్షిణ చేయటం వలన సమకూరే పుణ్యరాశి కన్న అత్యధికంగా, శ్రీకాళీమాతను పూజించటం వలన, ఆతల్లి తన భక్తులైన వారికి తక్షణం ప్రసాదిస్తుంది, అని తెలియచేస్తున్నారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు.

**శ్లో॥ ఏకవింశతివర్ష లక్ష్మీనారాయణ నిత్యకల్యాణోత్సవార్చనాధిక ఫలప్రదాత్రి!**
**సుదర్శనాదిక మహాద్భుతానేక హోమ నిర్వహణాధికఫల ప్రదాయిని! కాళి!**
**నయనానందోత్సవ కారణ నారాయణ శివ మహోత్సవ సేవాధిక ఫలప్రదే!**
**షష్టివర్ష వివిధ దేవతార్చనాగ్నిహోత్ర నిర్వహణాధిక ఫలప్రదాత్రి! కాళి!4**

తా॥ పూర్వకాలంలో అనగా జరిగిపోయిన యుగాలైన కృతయుగం, త్రేతాయుగం, ద్వాపర యుగాలలో శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణోత్సవాలు ఎక్కువగా జరుగుతూ ఉండేవని తెలుస్తున్నది. శ్రీమహాలక్ష్మితో కూడియున్న నారాయణుడినే లక్ష్మీనారాయణునిగా పిలుస్తారు. 'నారాయణ' అనగా సర్వత్రా వ్యాపించి ఉండేవాడు

అని అర్థంగా పెద్దలు తెలియజేస్తారు. సర్వకాల సర్వావస్థల యందునూ లక్ష్మీదేవితో కలసిఉంటాడు కనుక, యుగాల ఆది నుంచి పూజలందుకుంటూ ఆదినారాయణు డయ్యాడని భావించవచ్చు. ప్రతి యుగంలోనూ, వేర్వేరు అవతారాలను, నిర్దిష్టమైన ప్రయోజనాల కోసం, స్వీకరించటం జరిగింది. ముఖ్య ఉద్దేశ్యం, దుష్టులను శిక్షించటానికి, మంచి వారిని రక్షించటాని కావచ్చు. కాని ఈ విషయాన్ని ధర్మబద్ధంగా లోకానికి తెలియజేసే క్రమంలో శ్రీలక్ష్మీనారాయణులు, లక్ష్మిగాను నారాయణుడి గాను విడిపోయి, సామాన్యుల మధ్యలో సాధారణ జీవితాలను గడుపుతూ అనేక సుఖాలనూ, బాధలనూ, బరువులనూ, అవమానాలను, సవాళ్లనూ ఎదుర్కొంటూ, కొన్ని అవతారాలలో అయితే భార్యా భర్తల వియోగ దుఃఖాలను కూడా అనుభవిస్తూ కన్పిస్తారు. మానవులెప్పుడూ గొప్పవారినే ఆదర్శంగా తీసుకొని, వారు ఏర్పరచిన, సూచించిన నియమాలనూ, మార్గాలనే అనుసరిస్తుంటారు. ఎలాగంటే ఒక ప్రభుత్వం ప్రజల కోసం ఒక రహదారిని ఏర్పరచిందంటే అందరూ ఆ దారినే, మార్గంగా అనుసరిస్తారు కాని, ముళ్లు, కంపలు, రాళ్లు రప్పలు ఉన్న చోటు నుంచి నడవరు. ఈ భావన ఈ నాటిది కాదు, మనుషులకు దేవుడు కల్పించినదే. కాని కల్పన వలన ఏమీ జరగదు, ఒరగదు. అందుచేత ముందుగా శ్రీలక్ష్మీనారాయణుడే, యుగధర్మాల కనుకూలంగా అన్నీ అమర్చి, తాను అనుభవించి, ఆచరించి చూపించాడు. అందుచేత శ్రీలక్ష్మీనారాయణులు కల్యాణ కారకులయ్యారు. కనుకనే వారి కల్యాణం, లోక కల్యాణంగా భావిస్తూ అప్పటికీ ఇప్పటికీ కూడా శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణ వైభవాలనూ, ఎంతో వైభవంగా, కన్నుల పండుగగా జరిపిస్తుంటారు. శ్రీలక్ష్మీనారాయణుల వైభవం నిత్య కల్యాణం పచ్చతోరణంగా ఉంటుంది. అలా చేయటం వలన ప్రజలకు అనగా కల్యాణం జరిపించిన వారికి, ఆ కల్యాణాన్ని కనులారా దర్శించిన వారికీ, సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలూ లభిస్తాయని విశ్వసిస్తారు. ఆ విధంగా (21) ఇరువది ఒక్క సంవత్సరాల పాటు శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం నిత్యం, ప్రతిరోజూ ఆపకుండా చేయటం వలన సమకూరే సౌభాగ్యాలు, ఆయురారోగ్య ఐశ్వర్యాల కంటే ఎంతో అధికంగా శ్రీకాళీమాత (21 రోజులలోనే) తనను మనసారా నమ్మి పూజించిన వారికి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

హిందూ సంప్రదాయం సనాతనమైనది. హోమాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. వేదాలు, శాస్త్రాలు వీటిలో హోమాల విశిష్టతలు వివరించబడ్డాయి. పురాతన కాలం నుంచి, అన్ని యుగాల యందూ ఈ హోమాలు ప్రముఖంగా కన్పిస్తాయి. పూర్వం ఋషులు, మునులు, యోగులు, హోమాల ద్వారానే ప్రతిదీ సాధించే వారని తెలుస్తున్నది. ఒక విధమైన కార్యక్రమంలో విజయం సాధించటానికి, ఒక్కో రకమైన హోమం చేస్తారని చెప్తారు. ఆరోగ్యానికి, ఐశ్వర్యానికి, శత్రువులపై విజయానికి, తలచింది నెరవేరటానికి ఇలా రకరకాల అవసరాలు, రకరకాల హోమాలు. హోమాలు ఆచరించే పద్ధతి, అందులో ఉపయోగించే ద్రవ్యాలు చేసే సమయాలు, ఆవాహన చేసే దేవతలు, కూర్చొని చేసే దిక్కు, ఇంకా ఎన్నో అంశాలను దృష్టిలో ఉంచుకొని, తగిన సంకల్ప బలంతో ఈ హోమాలను నిర్వహిస్తుంటారు. పురాణ కాలంలో అస్త్రశస్త్రాలను నియంత్రించి, శత్రువులను నిలువరించటానికి గాని, నిర్వీర్యం చేయటానికి గాని అవసరమైన శక్తి యుక్తులను హోమాలు చేసి పొందే వారని తెలిసిందే. ఒక గడ్డిపోచను అభిమంత్రించి బ్రహ్మాస్త్రంగా ప్రయోగించిన దాఖలాలు పురాణాల్లో ఉన్నాయి. ఈ ప్రపంచాన్ని క్షణమాత్రంలో సర్వనాశనం చేయగలిగిన మహోన్నతమైన నారాయణాస్త్రం, బ్రహ్మాశిరోనామకాస్త్రం లాంటివి ఎన్నో ఉన్నా, వాటికంత శక్తి రావటానికి కారణమైనవి హోమాలే. హోమాల వలన వర్షాలు పడతాయనేది సాధారణమైన విషయం. అందరికీ తెలిసిందే. ఇందులో మహా అద్భుతమైన హోమాలు ఉన్నట్లుగా చెపుతారు. నారాయణ, సుదర్శన, విష్ణు హోమం మొదలైనవి. వీటిని అందరూ చేయలేరు. ఎంతో నియమ నిష్ఠలతో, అత్యంత కఠినమైన మంత్ర జప ఆచరణలో సంకల్ప సిద్ధులైన మహాత్ములు మాత్రమే చేసి శుభఫలితాలను రాబట్టగలరు. లేకపోతే వైద్యుడిచ్చిన మందు వికటించి, రోగి అవస్థల పాలైనట్లుగా ఉంటుంది. విష్ణువుకు చేసే యజ్ఞాలలో ప్రశస్తమైనది సుదర్శన మహా హోమం అంటారు పెద్దలు. అయితే ఆ సుదర్శన హోమాలతో పాటుగా నారాయణ హోమాలు, విష్ణు సంబంధమైన అగ్నిహోత్రాలను చేసినందువలన వచ్చే అద్భుత శక్తి, పుణ్యఫలితం కన్నా అత్యధికమైన శుభఫలితాలను, శక్తులను శ్రీకాళీమాత తనను ఆశ్రయించి పూజించిన వారికి ఇస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

మనం చూస్తూనే ఉంటాము. ఇప్పుడు ప్రతిచోటా బ్రహ్మోత్సవాలని, కల్యాణోత్సవాలని, మాసోత్సవాలని, పక్షోత్సవాలని శివునికి, విష్ణువుకు జరుపుతున్నారు. శివుని

విషయానికి వస్తే, ప్రతిరోజూ పార్వతీ సమేతుడై లోకసంచారం చేస్తూ, సూర్యాస్తమయం తరువాత ప్రదోష కాలంలో శివాలయాల్లోనికి వచ్చి భక్తుల కోరికలు తీరుస్తాడని, అందువలన శివునికి ప్రదోషకాల పూజలని రోజూ నిర్వహిస్తుంటారు. అలాగే నెలకొక శివరాత్రి, అంటే మాసశివరాత్రి మరియు సంవత్సరానికి ఒకసారి వచ్చే మహాశివరాత్రి. ఇవన్నీ శివునికి మహోత్సవాలు, ఆడంబరంగా జరిగే సంబరాలే. ఇందువలన ఎంతో పుణ్యం, ధనం, ధాన్యం పశుసంపద వృద్ధి జరుగుతుందని భక్తుల నమ్మకం. అదే విధంగా విష్ణువు వివిధ రూపాలో అనగా శ్రీవేంకటేశ్వర స్వామిగా, శ్రీనరసింహస్వామిగా, శ్రీరామునిగా, శ్రీకృష్ణునిగా ఇలా ఏ రూపంలో ఉన్నా వారికి ప్రత్యేకమైన పూజలను చేస్తుంటారు. బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవాలు, నిత్య కల్యాణోత్సవాలు, పల్లకి సేవలు, పుష్పాలంకరణ సేవలు పవళింపు సేవలంటూ ప్రతి సందర్భానికి ఒక పేరుతో వివిధ రకాలుగా కన్నుల పండుగగా సేవలను చేస్తూ తరిస్తుంటారు. అందులో పాల్గొనటం వలన, ఆ మూర్తులను దర్శించటం వలన ఆశించిన వాటికన్నా ఎక్కువగా శుభఫలితాలు లభిస్తాయనేది హిందువుల విశ్వాసం. అందువల్లనే నేమో కొంతమంది ఎక్కువగా ఈ 'సేవా' కార్యక్రమాలలో పాల్గొంటూ, తమకు తోచిన విధమైన సేవలను ఆస్వామి వారికి అందిస్తుంటారు. స్వామి వారికి అలాంటి సేవలు చేసినపుడు ఆయన కరుణ వారిపై నిలిచి చల్లగా కాపాడుతూ ఉంటాడనేది యథార్థం. కాని, వీటన్నింటి కన్నా మిన్నగా, అధిక పుణ్యఫలాన్ని శ్రీకాళీమాత తమ భక్తులైన వారికి ప్రసాదిస్తుందనేది వాస్తవం.

లోకంలో కొంతమంది ఎప్పుడూ ఎవరో ఒక దేవునికో దేవతకో ఏదో ఒక పూజో, యజ్ఞమో, హోమమో చేయిస్తూ ఉంటారు. అంటే ఎవరో ఒకరికి కాక అందరు దేవుళ్లకూ దేవతలకూ నిత్యం పూజలు చేస్తూనే ఉంటారు. అందరు దేవతలనూ పూజిస్తూ ఉంటే అందులో ఎవరో ఒకరు త్వరగా తమ కోర్కెలు తీర్చుతారు అనే ఉద్దేశ్యం కావచ్చు. ఏది ఏమయినా అదీ ఒక భక్తే. పుణ్యం సంపాదించే మార్గమే. విశేషం ఏమిటంటే ఎవరైనా కొత్త పూజ గురించో, యజ్ఞం గురించో చెపితే వెంటనే దాన్ని ఆచరణలో పెట్టేస్తారు. ఫలానా హోమం చేయటం వలన ఎక్కువ లాభం ఉంటుందని తెలిస్తే ఇంక ఆ విషయాన్ని ఎంత ఖర్చు పెట్టయినా సాధిస్తారు. ఇలాంటి విచిత్రమైన ఆసక్తి ఈ లోకంలో దాదాపు ప్రతి ఒక్కరికీ ఉండే ఉంటుంది. ఐతే ఇలా చేయటం వలన కూడా ఎంతో కొంత మేలే జరుగుతుందని

అనుకోవచ్చు. ఏ దేవునికి చేసినా, ఏ దేవతకు చేసినా పూజ ఒక్కటే కనుక మంచి ఫలితమే తప్పక లభిస్తుందని అనుకోవాలి. ఈ విధంగా అనేకమంది దేవుళ్లకు, దేవతలకు వివిధ రకాలైన ఆరాధనలు, అగ్నిహోత్రాలు, విశేష పూజలు, ప్రత్యేక పూజలు మొదలైనవన్నీ (60) అరువది సంవత్సరాలపాటు చేయటం వలన లభించే ఉత్తమమైన ఫలితాల కన్నా అధికంగా, జగన్మాత, కాలస్వరూపిణియైన శ్రీకాళీమాత, తన చెంత చేరి "అన్యథా శరణం నాస్తి" అంటూ మనసారా ప్రార్థించిన వారికి ఒక్కసారిగా వెనువెంటనే ప్రసాదిస్తుందనటంలో ఎలాంటి సందేహం వలదు, అంటూ శ్రీ విశ్వమాత ఆదిపరాశక్తి పీఠాధీశులు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పైశ్లోకం ద్వారా స్వీయఅనుభవాలను తెలియచేస్తున్నారు.

**శ్లో॥ షట్త్రింశద్వర్ష కార్తికేందువాసరానేక లింగాభిషేకార్చనాధిక ఫల ప్రదాత్రి!**
**చతుర్వింశతివర్ష పార్వతీశ్వర నిత్యకల్యాణోత్సవార్చనాధిక ఫల ప్రదాత్రి!**
**ద్విచత్వారింశద్వర్ష మాసమహాశివరాత్ర్యాచరిత రుద్రహోమాధిక ఫలప్రదే!**
**సప్తవింశతివర్ష షణ్ముఖ లంబోదరాయ్యప్ప దీక్షారాధన యాత్రాధిక ఫలదాత్రి!5**

తా॥ మాసాలలో కార్తిక మాసం, వారాలలో సోమవారం శివార్చనకు ఎంతో ప్రాముఖ్యతలు ఉన్నవి. ప్రపంచంలోని ఏ దేవాలయంలో ఉన్నా శివుడు లింగ రూపంలోనే దర్శనమిస్తాడు. ఆయన పూజలందుకొనేది లింగ రూపంలోనే. ఎక్కడయినా ఒకటి రెండు ప్రాంతాలలో మినహాయింపు ఉంటే ఉండవచ్చు. అన్ని శివాలయాలలోనూ ప్రతిరోజూ ఆయనకు అభిషేకాలు, అర్చనలు చేస్తూనే ఉంటారు. కొన్ని ముఖ్యమైన దేవాలయాలలో రుద్ర హోమాలు లాంటివి చేస్తుంటారు. మరి కొన్ని ప్రాంతాలలో శివపార్వతుల నిత్య కల్యాణాలు జరిపిస్తూ ఉంటారు. బిల్వార్చనలు, లక్ష బిల్వార్చనలు, కోటి బిల్వార్చనలు అంటూ కొన్ని ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకొని శివలింగానికి పూజలు చేస్తుంటారు. బిల్వపత్రం (మారేడు)తో పూజ చేస్తే శివుడు త్వరగా కరుణించి భక్తులు కోరిన కోరికలు తీరుస్తాడని ప్రతీతి. సోమవారం రాగానే, ఆ రోజు కొంతమంది భక్తులు నియమాలు పెట్టుకొని, ఉపవాసాలు కావచ్చు, శివపూజలు కావచ్చు, మౌనవ్రతాలు కావచ్చు ఇలా ఎవరికి అనుకూలమైన రీతిలో వారు, స్వయం నిర్దేశితంగా ఆ రోజంతా ఎంతో నిష్ఠగా పవిత్రంగా గడుపుతూ ఉంటారు. అందువలన వారికి మంచి ఆరోగ్యం, సుఖసౌఖ్యాలు

లభిస్తాయని భావిస్తుంటారు. శివభక్తిని ప్రకటన చేసుకోవటానికి ఇలాంటివి కొన్ని మార్గాలు కావచ్చు. అందువలన వారికి పుణ్యం పురుషార్థం రెండూ లభిస్తాయనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇలా కాక మరికొంతమంది ఏ దేవాలయాలకూ వెళ్లక ఇంటి వద్దనే కూర్చొని శివధ్యానం చేస్తూ ఉంటారు. ఏ విధంగా శివారాధన చేసినా, అది శివుని మనసును తాకే విధంగా ఉంటేనే అసలైన ఫలితం లభిస్తుంది. అదే విధంగా కార్తిక మాసం ప్రారంభం అవుతుంది అనే సరికి శివభక్తులు చేసే కోలాహలం అంతా ఇంతా కాదు. ముందుగానే అన్ని శివాలయాలనూ సర్వశోభితంగా అలంకరించి భక్తులకు కావలసిన అన్ని సౌకర్యాలనూ, అనగా వారు అవసరమైన పూజలు, అభిషేకాలు, శివపార్వతుల కల్యాణాలు, రుద్రహోమాలు, పుష్పార్చనలు, బిల్వదళార్చనలు చేసుకొనడానికి అనువుగా రూపొందించటం జరుగుతుంది. ఆ నెలంతా, ప్రతిరోజూ  తెల్లవారుజామునే, చన్నీటి స్నానాలను ఆచరించి భక్తితో కార్తీక దీపాన్ని ఆరాధిస్తారు. అలా చేయటం వలన శివానుగ్రహం ఎక్కువగా లభిస్తుందని అందరూ చెప్తారు. దీపం కార్తికేయ స్వరూపం అంటారు. అంటే సుబ్రహ్మణ్య స్వామి స్వరూపం. ఈయన సాక్షాత్తూ శివపార్వతుల తనయుడే. కొడుకును అందరూ ఆరాధిస్తుంటే తల్లితండ్రులకు సంతోషంగానే ఉంటుంది. ఆ సంతోషాన్ని వరాల రూపంలో భక్తులకు ప్రసాదిస్తారనేది వాస్తవం. ఇలా సంవత్సరం పొడవునా ప్రతివారం వచ్చే అన్ని సోమవారాలు, ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో ఉండే అన్ని రోజులూ, వారాలతో నెలలతో సంబంధం లేకుండా సంవత్సరం పొడవునా, అలా (36) ముప్పది ఆరు సంవత్సరాల పాటు, మధ్యలో ఎలాంటి ఆటంకం లేకుండా శివలింగాభిషేకాలు, బిల్వదళార్చనలు, పుష్పార్చనలు లాంటివి ఆచరిస్తూ ఉండటం వలన సంప్రాప్తించే అధికమైన పుణ్యఫలం కన్నా ఎక్కువగా, శ్రీకాళీమాత మనసారా తనను ఆరాధించిన వారికి (36) ముప్పది ఆరు రోజులలోనే శుభకరమైన, అత్యంత పుణ్యప్రదమైన ఫలితాలను ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

యజమాని అయినవారు, తమను నమ్ముకొని, రాత్రనక పగలనక తమకు సేవ చేసే సేవకులకు, తమ సంతోషం కొద్దీ ఎన్నో విధాలైన బహుమతులను, వస్తురూపంలోనో, ధన ధాన్యాల రూపంలోనో పంచి, సేవకుల సంతోషానికి కారకులౌతారు. తాము పొందిన బహుమతులను చూసుకుంటూ ఆనందిస్తూ ఉంటే,

సేవకుల సంతోషం చూసి ఆ యజమాని కూడా ఎంతో సంబరపడిపోతూ, ఇంకా ఎక్కువ బహుమతులను సేవకులకు ప్రసాదించాలని తద్వారా ఆ సేవకుల ముఖాలలో ఇనుమడించే ఆనందాన్ని చూడాలని అనుకుంటారు. అలాగే సేవకుడు కూడా తన యజమానికి ఇంకా ఎక్కువ సేవ చేసి ఆయనను సంతోషపరచాలని తలుస్తూ ఉంటాడు. ఇది కేవలం యజమాని సేవకుల మధ్య ఉండే సంబంధం మాత్రమే కాదు, సాక్షాత్తూ దేవుడు, భక్తుడు మధ్య కొనసాగే అత్యంత పవిత్రమైన అనుబంధం. అందుచేతనే ప్రతి భక్తుడూ దైవానికి ఎక్కువ సేవ చేయటానికి ఆరాటపడతాడు. పార్వతీ పరమేశ్వరులకు చేసే సేవ ఎంతో ప్రశస్తమైనది. ఈ సేవకు మించిన సేవ లేదంటారు కొందరు. ప్రతినిత్యం ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం అంటే శివ కల్యాణం, పూజా కార్యక్రమాలను చేయటానికి మించిన కార్యక్రమం తద్వారా ఉత్పన్నమై వెలుగొందే శోభ, వైభవం ఆనందం వేరొకటి మరేదీ ఉండబోదని పెద్దలు చెపుతారు. నిజమే శివ కల్యాణాన్ని నిత్యం జరుపుతూ, అలా (24) ఇరువది నాలుగు సంవత్సరాల పాటు ఆ ఆది దంపతులకు సేవ చేయటం వలన లభించే శుభఫలితాల కన్నా ఎక్కువైన, అధికమైన, అద్భుతమైన మంచి ఫలితాలను ఆ జగన్మాత శ్రీకాళీమాత తమ భక్తులైన వారికి అక్షయంగా (24) రోజులలోనే ప్రసాదిస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

శివార్చన చేసే పుణ్య దినాలలో మహాశివరాత్రికి ఉన్నంత విశిష్టత మరే పండుగకూ ఉండదేమో. ఈ రోజు కోసమే అందరూ ఎదురుచూస్తూ ఉంటారు. శివలింగోద్భవ సమయం కోసం ఎదురు చూస్తూ రాత్రంతా జాగరణ చేస్తారు. ఆ సమయంలో ఆ స్వామివారి దర్శనం చేసుకోవటం వలన సర్వపాపాలూ హరించి పోతాయని విశ్వాసం. శివభక్తులకే కాదు, అందరికీ ఈ మహాశివరాత్రి, మహా తిరునాళ్లగా అన్ని శివాలయాల్లోనూ చేస్తారు. ఎలాంటి వారయినా ఆ రోజు శివదర్శనం చేసుకోవటానికి తరలి వెళ్తారు. వారితో పాటు వారి పశుసంపదను కూడా చక్కగా అలంకరించి, రంగులు చల్లి, వాటికి మెడలో గంటలు వగైరా అమర్చి హర హర మహాదేవ శంభో అంటూ, పశువులను కూడా గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేయిస్తారు. అందువలన వాటికి ఆ సంవత్సరమంతా ఎలాంటి వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటాయని, తద్వారా తమ సంపదలు వృద్ధి అవుతాయని భావిస్తారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే మహాశివరాత్రి ఒక్కటే కాకుండా, ప్రతినెలా

వచ్చే మాసశివరాత్రిని కూడా శివారాధనకు మంచి రోజుగా భావించి, ఆ రోజు కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పాలంకరణలు ఎవరి భక్తి విశ్వాసాలకు అనుగుణంగా వారు చేస్తుంటారు. అందువలన ఎంతో పుణ్యం, సంపదలు లభిస్తాయని భావిస్తారు. అలాగే శివుని ప్రీతి చెందించి తమ సంకల్పాలను నెరవేర్చుకోవటానికి రుద్రహోమాలు, మహారుద్ర హోమాలంటూ చేస్తుంటారు. అందువలన ప్రత్యేకమైన ఫలితాలు వస్తాయని భావిస్తారు. ఈ విధంగా ఒక సంవత్సరంలో ప్రతినెలా వచ్చే మాసశివరాత్రి, సంవత్సరానికి ఒకసారి వచ్చే మహాశివరాత్రి అనగా (12) మాసశివరాత్రులు, ఒక మహాశివరాత్రి, రాత్రులందు చేసే రుద్రహోమాలను, (42) సంవత్సరాల పాటు ఎలాంటి అవాంతరం లేకుండా చేయటం వలన వచ్చే మహా గొప్ప శుభఫలితాల కన్నా ఇంకా మిక్కిలిగా, ఎక్కువగా శ్రీకాళీమాత తనను నిశ్చలంగా తదేక దీక్షతో పూజించిన వారికి (42) రోజులలోనే నిశ్చయంగా, దయతో ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

భక్తి అనేక విధాలుగా ఉంటుంది. అలాగే భక్తులు కూడా రకరకాలుగా ఉంటారు. దేవుడు ఒక్కడే అని అన్ని శాస్త్రాలు చెప్పినా, అనేక విధాలైన పేరులతో దేవుళ్లు ఉన్నారు కనుక భక్తులు కూడా వారికి నచ్చిన దేవుడిని నమ్మి పూజిస్తూ శుభఫలితాలను పొందుతూ ఉంటారు. ఉదాహరణకు కుమారస్వామి, వినాయకుడు, అయ్యప్పస్వామి మొదలైన వారికి కొన్ని ప్రత్యేకమైన మాసాలలో, ఏకబిగిన కొన్ని రోజులపాటు పూజలు నిర్వహిస్తూ ఉంటారు. అలాంటి సందర్భాలలో భక్తులు కూడా ఎంతో నిష్ఠగా, పవిత్రంగా ఉండేందుకు కొన్ని దీక్షలను తీసుకొని, నియమానుసారంగా దైవ కార్యక్రమాలను ఆచరిస్తుంటారు. విడిగా ఉన్న రోజుల కంటే దీక్షా సమయంలో ఎక్కువ భక్తి భావంతో ఉండగలుగుతారనేది వారి ఉద్దేశ్యం కావచ్చు. ఉద్దేశ్యం ఏదయినా దీక్షలలో పాటించే కొన్ని నియమాల వలన, వారి ప్రవర్తన తీరులో తగినంత మంచి మార్పు చోటు చేసుకుంటుంది. దురలవాట్లకు దూరమౌతారు, కుటుంబ సభ్యులతోనూ, తోటివాళ్లతోనూ వాళ్లు ప్రవర్తించే తీరులోను, వారి ఆరోగ్యంలోనూ మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. అలాగే మరికొంతమంది, దీక్షలు, ఆరాధనలతో పాటుగా పుణ్యక్షేత్రాలను దర్శిస్తుంటారు. ఇలా చేయటం వలన వారికి ఎన్నో శుభాలు కలుగుతాయి. ఈ విధంగా (27) సంవత్సరాల పాటు కుమారస్వామి, వినాయకుడు, అయ్యప్ప స్వామి వారి దీక్షలు, ఆరాధనలు, పూజలు,

మరియు వారి క్షేత్ర దర్శనాలూ ప్రతిసంవత్సరం, ప్రతిరోజూ చేయటం వలన లభించే పుణ్యపలం ఎంతో అదికంగా ఉంటుంది. కాని శ్రీకాళీమాత అమ్మవారు ఇంతకంటే ఘనమైన, అద్భుతమైన, శుభకరమైన ఫలితాలను (27) రోజులలోనే తనను ఆరాధించే వారికి ప్రసాదిస్తుందని పై శ్లోకం ద్వారా భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తెలియచేస్తున్నారు.

**శ్లో॥ నైమిశారణ్యాద్యనేక వనాంతర జపపూజాధ్యాన హోమాధిక ఫలప్రదాయిని!**
**సురసంచార శైలాగ్ర కందరాంతరానేక యోగాచరణాధిక ఫలప్రదే! కాళి!**
**జలాంతరాగ్ర గగన స్థలానేక తప స్సాధనాచరణాదిక ఫలప్రదే! దేవి!**
**భూగర్భాంతరాగ్ర వహ్న్యాంతరాచరితానేకాద్భుత యోగక్రియాధిక ఫలప్రదే!6**

తా॥ నైమిశారణ్యం అనేది అత్యంత పురాతనమైన పవిత్రమైన వనము. దీని ప్రస్తావన అన్ని పురాణాలలోనూ కన్పిస్తుంది. ఈ నైమిశారణ్యం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ప్రవహించే గోమతి నదీ తీరాన ఉన్నది. పూర్వపు రాజ్యాలైన కోసల మరియు పాంచాల రాజ్యాల మధ్య ఉన్నట్లుగా తెలుస్తున్నది. శౌనకాది మహామునులు ఈ అరణ్యంలోనే మహాభారతాన్ని తమ శిష్యగణానికి వినిపించినట్లుగా పురాణ కథనం. మహాభారత యుద్ధం తరువాత ప్రపంచ శాంతిని నెలకొల్పటానికి ఆయన చేసిన ప్రయత్నమే ఈ మహాభారత ప్రవచనంగా చెప్పుకోవచ్చు. ఈ అరణ్యంలోనే శౌనకుడు అనే ఋషి శివుణ్ణి స్తోత్రం చేస్తూ ఎన్నో శ్లోకాలు వ్రాసినట్లుగా తెలుస్తున్నది. ఈ నైమిశారణ్యాన్ని గురించిన ప్రస్తావన రామాయణం యుద్ధకాండలో కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. శ్రీరాముని పుత్రులైన కుశ, లవులు రామాయణ కావ్యాన్ని గానం చేసే సందర్భంలో ఈ నైమిశారణ్యాన్ని గురించి కూడా కొన్ని పలుకులు పలికినట్లు పురాణ కథనాలు ఉన్నట్లుగా తెలుస్తున్నది. దాదాపు భారతీయ పురాణ కథనాలన్నీ మొదటిసారిగా లోకానికి పరిచయమయింది ఈ నైమిశారణ్యం నుంచేనని చెపుతారు. అందుచేత ఈ నైమిశారణ్యానికి ప్రపంచంలో మరే ప్రాంతానికీ లేని ఆధ్యాత్మికత, పవిత్రత ఉన్నదని అందుచేత ఈ ప్రాంతాన్ని దర్శించటం మహత్తర భాగ్యంగా హిందువులు భావిస్తారు. చాలామంది ఈ ప్రాంతంలో తపస్సు ఆచరిస్తుంటారు. అసలు ఈ అరణ్యంలోని ప్రతిచెట్టు మొక్క అన్నీ కూడా ఒక్కొక్క ఋషికి రూపాంతరంగా చెపుతారు. అందుచేత వారి దేహత్యాగం తరువాత కూడా

చెట్టురూపాన్నో పుట్టరూపాన్నో పొంది అక్కడి పవిత్రతను అనుభవిస్తూ, ప్రశాంతంగా వాటి రూపాల్లో జప తపాదులు ఆచరిస్తూ ఉంటారని ప్రతీతి. ఏది ఏమయినా ఈ నైమిశారణ్యానికి పురాణ ప్రాశస్త్యం, పవిత్రత కలసి ఉండటం వలన ఇక్కడ జపాలు, తపస్సులు, పూజలు, హోమాలు మొదలగునవి చేయటం వలన ఎంతో పుణ్యఫలం లభిస్తుంది. శ్రీ గంధపు వనంలో ప్రవేశించి అక్కడ కొంతసేపు విహరించి మరలా మనం వెనక్కు వచ్చేసినా అప్పటి వరకు మన చుట్టూ ఉన్న వాతావరణంలో మంచి గంధపు సుగంధం కలసి ఉంటుంది గనుక దాన్ని మన శరీరం కొంత పీల్చుకుంటుంది. శ్వాస రంధ్రాల ద్వారా మరికొంత శరీరం లోపలి భాగానికి చేరుతుంది, అలాగే పుణ్యఫలం కూడా మన ఖాతాలో చేరుతుందని భావించవచ్చు.

ఈ విశాల ప్రపంచంలో కొండలు, కోనలు, అరణ్యాలు, వనాలు ఉంటాయి. కొన్ని చోట్ల గుహలు లాంటి ప్రదేశాలు ఎన్నో ఉంటాయి. పూర్వం ఎవరైనా తపస్సులు ఆచరించాలి అనుకొనే వారు, జనావాసాలు లేని ప్రదేశాలను ఎంచుకొని అక్కడ తగిన స్థలాలను చూసుకొని జప, తపాదులను చేసుకొనేవారు. ఒక్కొక్క చెట్టుకు, వృక్షానికి ఒక విధమైన ప్రత్యేకత, ఔషధ తత్త్వాలు ఉంటాయి. మనకు ఆ సంగతి తెలిసినా తెలియక పోయినా వాటి చెంతకు చేరగానే, అవి వాటి సుగుణాలను మనకు అందిస్తాయి. దాన్నే మనం ప్రశాంతత అని గానీ, హాయి అని గానీ అంటుంటాము. పూర్వ యుగాలలో శ్రీరాముడు అరణ్యవాసం చేసినప్పుడు ఆయనకు ఆశ్రయం కల్పించింది కొండలూ, కోనలూ, గుహలూ మొదలైనవే. అలాగే పాండవులు అరణ్యవాస సమయంలో కూడా తమకు తగిన ప్రదేశాలను ఎంపిక చేసుకొని నివసించినట్లు పురాణాల వలన తెలుస్తున్నది. ఇప్పటికి కూడా ఆ ప్రదేశాలను అందరూ దర్శించుకుంటూ, వాటిని ఎంతో పవిత్రంగా కాపాడుకుంటూ వస్తున్నారు. అవి ద్వైతవనం కావచ్చు, ఋశ్యమూక పర్వతం కావచ్చు. ఇలాంటివన్నీ దేవతలు తిరుగాడే ప్రదేశాలని అనుకుంటుంటారు. సాక్షాత్తూ శ్రీకృష్ణ పరమాత్మ తిరుగాడిన ప్రాంతం బృందావనం, యమునాతీరం, గోకుల ప్రాంతం, అదే విధంగా ఎంతోమంది మహాఋషులు కొండ గుహల్లో తపస్సు చేసుకొనేవారు. ఇలాంటి పుణ్య పావనమైన ప్రదేశాలలో యోగాలను చేయటం, తపస్సులను ఆచరించటం వలన గొప్పవైన అనుభూతులు కలుగుతాయంటారు. అందువల్లనే కాబోలు చాలామంది సుదూర ప్రాంతాలకు వెళ్లి అనగా హిమాలయాలకో, అరణ్య ప్రాంతాలకో వెళ్లి

తపమాచరించాలని కోరుకుంటారు. అందువలన బహు ఉత్తమమైన పుణ్యఫలితాలు సాధించవచ్చని అనుకుంటారు.

పూర్వం ఋషులు, మునులు, యోగులు, రాజులు, చక్రవర్తులు కూడా అద్భుతమైన శక్తులను సాధించటానికి, అతీంద్రియ శక్తులను వశపరచుకొనడానికి, లోక కల్యాణార్థం కొంతమంది, ఈ విధంగా ఎవరి అవసరాలను అనుసరించి వారు యోగాలను ఆచరించినట్లు పురాణగాథలు తెలియజేస్తున్నాయి. ఇలాంటి వారంతా మహాసంకల్పాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం ప్రకృతి ధర్మాలకు విరుద్ధంగా తపస్సులను యోగాలను ఆచరించేవారు. జలగర్భంలో (నీటి లోపల మునిగి) కూర్చొని కొంతమంది యోగ దీక్షను ఆచరించే వారు. నీటి లోపల ఎవరూ కూడా కొన్ని క్షణాలు మించి ఉండలేరు. ప్రాణశక్తి నశించిపోతుంది. జలచరాలు మాత్రమే నీటిలో మనుగడ సాగించే విధంగా ప్రకృతి తన ధర్మాన్ని పాటిస్తుంది. మనిషి నీటి లోపల బ్రతకటం అసాధ్యం. కాని కొన్ని యోగప్రక్రియల ద్వారా ప్రకృతిని తన అదుపులో ఉంచుకొని, నీటి లోపల బ్రతకటం, యోగం చేయటం అనేది ఒక అద్భుతమైన సాధన. జలస్తంభన విద్యను సాధించటమే ఎంతో కఠినమైనది. ఆ విద్య సహకారంతో నీటి అడుగున యోగం ఆచరించటం ఎంతో దుర్లభమైనది. ఆ విద్యను సాధించిన వాడు మహాభారతంలో దుర్యోధనుడు. అదే విధంగా నీటిపై తామర ఆకులా తేలుతూ ఏకాగ్ర చిత్తంతో యోగసాధన ఎంతో క్లిష్టమైనది. శరీరాన్ని 'చిన్నం' ఎత్తు కూడా బరువు లేకుండా చేస్తే తప్ప నీటిపై కూర్చొని, జలాన్నే ఆసనం చేసుకొని యోగమాచరించటం అసాధ్యం. వాయు స్థంభన విద్య ద్వారా ప్రకృతి శక్తిని నిలువరించి నీటిపై కూర్చొని యోగాన్ని ఆచరించి సిద్ధులను, శక్తులను సంపాదించిన వారు హిందూ పురాణ గాథలలో కన్పిస్తారు. ఇంకా యోగ్యులైన యోగులు, ఋషులు, నీటిలో కాక, నీటిపై కాక ఆకాశంలో, గగన వీధిలో తపమాచరించిన వారు కూడా లేకపోలేదు. ఇలాంటి వారు ఏకంగా భూతత్త్వం, జల తత్త్వం, వాయు తత్త్వాలను దాటి వాటికి అతీతంగా ఆకాశ తత్త్వాన్ని సాధించి అధిగమించి, భూమిపై సిద్ధాసనంలో గాని మరే ఇతర ఆసనాలలో గాని కూర్చొని, అలాగే పైపైకి గాల్లో లేస్తూ, కావలసినంత ఎత్తునకు వెళ్ళి అక్కడ అలాగే నిశ్చలంగా ఏ ఆధారం లేకుండా కూర్చొని యోగమాచరిస్తారు. ఇలాంటి వారికి భూవాతావరణంలో లభించే ప్రాణశక్తితో పనిలేదు. భూవాతావరణం దాటి పైకి వెళితే అసలు ప్రాణశక్తే ఉండదు. వారికి కావలసిన జీవశక్తి యోగశక్తి ద్వారా

లభిస్తుంది. ఇవన్నీ కల్పిత కథలు కానే కావు. ఇవన్నీ పురాణాలలో, ఇతిహాసాలలో ఉన్నవే, పూర్వీకులు చేసి చూపించారు. సాధన చేస్తుంటే ఆక్రమంలో అన్నీ అవగతమౌతుంటాయి.

పూర్వపు కాలాల్లో ఎంతోమంది మహానుభావులు తమ కోరికల సాధన కోసం, ప్రాణాలను గడ్డిపోచలా భావించి తపస్సులు చేసేవారు. తదుపరి ఎంతటి శక్తుమంతులుగా మారే వారంటే అగ్ని కూడా, గడ్డిపోచను సైతం భస్మం చేయలేనంత, శక్తి లేని దాన్నిగా తమ శక్తితో నియంత్రించగలిగేవారు. ఆ స్థితిలో, అగ్నిలో దూదిని పడవేసినా ఆ దూది కాలిపోక అలాగే ఉంటుంది. అగ్ని భయంకరంగా ప్రజ్వలిస్తూ ఉంటుంది, కాని దానిలో దహనశక్తి ఉండదు, వేడి ఉండదు. ఇలాంటి ప్రక్రియనే మన పూర్వీకులు అగ్నిస్తంభనశక్తి అని పిలిచే వారని పెద్దలు చెపుతారు. ఇంతటి భయంకరమైన శక్తిని పొందిన తరువాత మరలా వారు ఆ అగ్నిలో కూర్చొని యోగమాచరించే వారని తెలుస్తున్నది. కపిలుడు లాంటి మహాఋషులు ఏకంగా భూమి లోపలే ఉండి తపస్సు చేసుకునే వారని, అందుచేతనే వారు అంతటి శక్తి సంపన్నులైనారని పురాణ కథనాలు మనకు తెలియ చేస్తున్నాయి. ఇలాంటి మహాపురుషులు ఈ ఆధునిక యుగంలో కూడా కన్పిస్తూ అలాంటి యోగప్రక్రియలను లోకానికి ప్రకటన చేస్తున్నారని అక్కడక్కడా చూస్తున్నాం, చదువుతున్నాం. పైన చెప్పిన విద్యలను సాధించాలంటే అకుంఠిత దీక్ష కావాలి, దృఢసంకల్పం కావాలి, సాధనలు ఫలించాలంటే ఒక్కొక్కసారి జీవితకాలం పట్టవచ్చు, కొన్ని సందర్భాలలో పడిన శ్రమంతా వృధా కావచ్చు. కాని శ్రీకాళీమాతను మనసారా నమ్ముకొని పూజిస్తే, సాధన చేస్తే అతిస్వల్ప కాలంలోనే పైన చెప్పిన అన్నింటివల్ల ఒనగూడే ఫలితాలకన్నా, అత్యధికంగా ఆ తల్లి ప్రసాదిస్తుందని, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు, శ్రీ కాళీమాత యొక్క ఉదార స్వభావ శక్తి సామర్థ్యాలను పై శ్లోకం ద్వారా తెలియ చేస్తున్నారు.

**శ్లో॥ అష్టాదశవర్షావధూతాది గురు చరిత్ర నిత్య పారాయణాధిక ఫలప్రదాత్రి!**
**ద్వాదశవర్ష మహాముని యోగిఋషి నిత్యదర్శనసేవాధిక ఫలప్రదాయిని!**
**చతుర్దశవర్షాచరితానేక ప్రాణాయామాధికాద్భుత శక్తి ప్రదాత్రి! వరకాళి!**
**ఏకదినార్చనే నైవ షోడశవర్షాచరితానేకతపోయోగాధికఫలప్రదే! కాళి!7**

తా॥ ఆధ్యాత్మిక జీవితం గడిపే వారికి, ఈ విశ్వంలో చూడదగిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి ప్రదేశాలలో ముఖ్యంగా సద్గురువులు, పీఠాధిపతులు, అవధూతలు మొదలైన వారు ఎందరో ఉన్నారు. వారు తమ జీవితంలో ఏదో సాధించి తద్వారా ప్రజలకు ముఖ్యంగా బాధలలో ఉన్న వారి కోసం, విశ్వకల్యాణార్థం పాటు పడాలనే ఆకాంక్షతో జన జీవన స్రవంతిలోనే తాము ఉంటూ, సాధనలు చేస్తూ దీనులకు మంచి జరగటం కోసం పాటుపడుతూ ఉంటారు. ఈ నూతన ప్రపంచంలో కొండల్లో, కోనల్లో, అరణ్యాలలో తపస్సాధన చేయటం అందరికీ కుదిరేపని కాదు కనుక తమకంటూ ఒక ప్రత్యేక ప్రపంచాన్ని ఏర్పరచుకొని, అనగా ఇతరుల వలన తమ తపస్సాధనకు భంగం వాటిల్లని విధంగా సాధనలు చేస్తూ అద్భుతమైన తమ శక్తులతో మహిమలను చూపిస్తూ ఉంటారు. మానవ సహజ లక్షణం ఏమిటంటే, ఎక్కడయినా, ఎవరయినా సాధువో, స్వామిజీయో, అవధూతలో మహిమలతో రోగాలను నయం చేస్తున్నారనో, బంగారాన్ని, ధనాన్ని, వస్తువులను ఏది కావాలంటే అది తమ దైవశక్తితో సృష్టించి ఇస్తున్నారనో తెలిస్తే, వెంటనే మనసుల్లో అక్కడికి వెళ్లాలి, తమ కోరికలు తీర్చుకోవాలని అనే భావాన్ని ఏర్పరచుకొంటారు. అక్కడికి వెళ్లటం వెంటనే కుదరని వారు, ఆ మహానుభావుని చిత్ర పటాన్ని సంపాదించి, దానికి రోజూ పూజలు చేస్తూ భజనలు చేస్తూ ఆయన దర్శనం కోసం తపిస్తూ ఉంటారు. అందరి మనసులూ ఇలాగే ఉంటాయని కాదు భావం. మానవ బలహీనతలు ఆ విధంగానే ఎక్కువగా ఉంటాయి. ఇలా ఒకరిని దర్శించుకున్నాక, వేరెవరో చెప్తారు, వేరేచోట స్వామిజీ ఐతే మనం ఏది కోరుకుంటే దానికి రెట్టింపు ఇస్తారు, అనగానే అక్కడికి పరుగెత్తుతారు. ఇలా వారి మనసులో ఉద్దేశం నెరవేరినా లేకపోయినా లోకంలో ఎవరెవరు ఉన్నారో తెలుసుకుంటూ అందరి దగ్గరకూ వెళ్లటానికి ప్రయత్నిస్తుంటారు. ఇందువలన వారికి లోకజ్ఞానం పెరుగుతుంది. లోకం తీరు అర్థం చేసుకొనే అవకాశం లభిస్తుంది. ఏ మహానుభావుని వద్దకు వెళ్లినా వారు, వీరికి ఎంతో కొంత జ్ఞానబోధ చేస్తుంటారు. అలాంటి జ్ఞానబోధలు సుఖమయ జీవితాలు ఏర్పరచుకోవటానికి సహాయ పడతాయి. అందరు వ్యక్తులూ, అందరు భక్తులూ ఒకే విధంగా ఉండరు. కొందరు మహాపురుషుల దర్శనం తరువాత ఇంటికి వచ్చి, ఆ మహాపురుషుని యొక్క దివ్య చరిత్రను అందరికీ తెలియ చెయ్యాలనే సంకల్పంతో భక్త సమాజాలను ఏర్పాటు చేస్తూ భజనలని, సత్సంగాలని పెద్ద ఎత్తున

ఏర్పాటు చేస్తుంటారు. మరికొందరు ఇంటికే పరిమితమై, తాము దర్శించిన మహానుభావులను స్మరించుకుంటూ ఉంటారు. ఇలాంటి కార్యక్రమాలను ఎలా ఆచరించినా, ఆచరించిన వారికి శుభకరమైన ఫలితాలే వస్తాయి. మందిలో కూర్చొని భోజనం చేసినా, ఒక్కరే ఒంటరిగా కూర్చొని భోజనం చేసినా ఆకలి మాత్రం తప్పక తీరుతుంది. ఇదికూడా అంతే అనుకోవాలి. ఈ విధంగా ప్రపంచంలో ఉండే అవధూతలు, సద్గురువులు మొదలైన మహాపురుషులను (18) సంవత్సరాల పాటు నిత్యం దర్శనం చేసుకుంటూ వారి దివ్యమైన చరిత్రలను మరియు గురుచరిత్రలను నిత్య పారాయణం చేయటం వలన లభించే మహాపుణ్య ఫలితాలకన్నా ఎక్కువగా శ్రీకాళీమాత తమ భక్తులైన వారికి (18) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

గతంలో రాజులు రాజ్యాలను ఏలిన కాలంలో గాని, అంతకు ముందు పురాణ కాలాల్లో గాని, పిల్లలకు విజ్ఞానం బోధించటానికి ఆచార్యులు ఉండేవారు. ఆచార్యులంటే వేదవేదాంగాలలోనూ, భూగోళ, ఖగోళ, వైద్య, రసవిద్య, మంత్ర, తంత్ర విద్యలలో అత్యంత నిష్ణాతులై ఉండేవారు. వారు సమభావం కలిగి, సాక్షాత్తూ దైవ స్వరూపులుగా కొలవబడే వారు. చక్రవర్తులు కూడా వారి ముందు సామాన్య మానవుల వలె మసలుకొనే వారు. ఆచార్యుల వారికి, వారి శిష్యులకు అనువైన ప్రదేశాలను, వారి ఆశ్రమాల కోసం రాజులే ఏర్పాటు చేసి, ఆశ్రమ నిర్వహణా బాధ్యతలన్నీ ఆదేశపు రాజులే భరించే వారు. వీరే శిష్యులకు పాఠాలు చెప్పేటప్పుడు ఆచార్యులు, తపమాచరించేటప్పుడు యోగులు, ఋషులు. వీరి వద్ద చేరిన శిష్యులు రోజుకు మూడు సార్లు సంధ్యావందనం ఆచరిస్తూ, ఆచార్యుల వద్ద వేదాలు, ఉపనిషత్తులను నేర్చుకొంటూ మిగతా సమయాలలో గురుశుశ్రూషలు చేస్తుండే వారు. నాలుగు వేదాలను వేదాంగాలను కూలంకషంగా నేర్చుకోవటానికి వీరికి (12) సంవత్సరాలు పట్టేదట. అనగా ఒక్కొక్క వేదాన్ని అభ్యసించటానికి మూడు సంవత్సరాలన్న మాట. ఈ వేదాలు 1.ఋగ్వేదము 2.యజుర్వేదము 3.సామవేదము 4.అథర్వణ వేదము. మరల ఒక్కొక్క వేదం, నాలుగు విభాగాలుగా వివరించబడింది. అవి ఒక్కొక్కటి సంహిత, ఆరణ్యక, బ్రాహ్మణ మరియు ఉపనిషత్తులు. వీటన్నింటిని అత్యంత విపులంగా నేర్చుకోవటానికి, నేర్చుకున్న వాటిని అనుభవ పూర్వకంగా తెలుసుకోవటానికి కనిష్టంగా (12) సంవత్సరాలు పడుతుంది. ఈ (12) అనే

సంఖ్య పుష్కర కాలాన్ని సూచిస్తుంది. సంవత్సరంలో ఉండే (12) మాసాలను ఒక ప్రామాణికంగా ఆవిష్కరిస్తుంది. పుష్కర కాలంలోని మాసాలన్నింటినీ కలిపితే పూర్ణ సంఖ్యయైన (9) వస్తుంది. అనగా (12) సంవత్సరాల కాలంలోనూ నేర్చుకునే విద్యలన్నీ, వీరిని పరిపూర్ణులను చేస్తుందని భావించవచ్చు. ఈ ప్రకారంగా (12) సంవత్సరాల కాలంపాటు ఒక యోగివద్దో, ఋషి వద్దో శిష్యరికం చేస్తూ వారిని నిత్యం దర్శనం కావించుకుంటూ, శుశ్రూషలు చేస్తూ, వారు చెప్పే బోధనలు వినటం వలన వచ్చే విద్యాబుద్ధులు, జ్ఞానసిద్ధులు మొదలైన శుభ ఫలితాలకన్నా ఎక్కువగా తనను పూజించి నిష్ఠగా సేవించే వారికి శ్రీకాళీమాత కేవలం (12) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

ఆదికాలం నుంచీ మానవుడు తన శరీర ఆరోగ్యం గురించి ఎక్కువ శ్రద్ధ వహిస్తూ వస్తున్నాడు. అందుకోసం ఎందరో ఋషులు యోగవిద్యను సాధన చేస్తూ సాధ్యమైనంత ఎక్కువ కాలం జీవించినట్లుగా ఎన్నో కథనాలు ఉన్నాయి. మానవ శరీరంలో ముఖ్యంగా ప్రాణశక్తిని, అన్ని అవయవాలలోకి సక్రమంగా సరఫరా కావటానికి, తద్వారా ఆరోగ్యం సక్రమంగా ఉండటానికి, శరీరాన్ని వివిధ భంగిమలలో వంచుతూ శ్వాసను నియంత్రిస్తూ, వదులుతూ ఉండే క్రియనే యోగప్రక్రియ అనియు, శరీరాన్ని వివిధ పద్ధతులలో వంచి, ఆ స్థితిలోనే కొంచెం సేపు ఉంచే పద్ధతిని యోగాసనాలు మరియు ప్రాణాయామము అని చెప్పుకోవచ్చు. ఈ పద్ధతులలో నిష్ణాతులైన గురువుల సమక్షంలోనే నేర్చుకోవాలని పెద్దలు చెపుతారు. మానవుడు ఏది తలపెట్టినా, దాన్ని విజయవంతంగా పూర్తి చెయ్యటానికి అన్నింటికన్నా ముఖ్యమైనది మంచి ఆరోగ్యం మాత్రమే. దాన్ని మించిన సంపద ఈ లోకంలో మరేదీ లేదు అని చెప్పటం అతిశయోక్తి కాదు. నిండు నూరేళ్లూ హాయిగా జీవించాలంటే, అందుకు మంచి ఆరోగ్యం ఎంతో దోహదపడుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటే ఆరోగ్యం చక్కగా ఉంటుంది. మనసు ప్రశాంతంగా ఉండాలంటే అందుకు తగిన యోగసాధన, ప్రాణాయామం ప్రతిరోజూ తప్పక ఆచరించాలి. అందువలన శరీరం శక్తిమంతమవుతుంది. ఎలాంటి అనారోగ్యాలూ దరిచేరవు. ప్రాణాయామం ఆచరించే వారిలో దుర్గుణాలన్నీ దూరమై పోతాయి. మనసు ఎలాంటి దుష్ట ఆలోచనల వైపునకు మళ్లదు అని యోగసాధకులు చెపుతారు. ఇంతటి మహత్తరమైన శక్తి ప్రాణయామాది ప్రక్రియలను, (14) సంవత్సరాలపాటు చేయటం

వలన లభించే అద్భుతమైన, విమలమైన, విచిత్రమైన శక్తులకన్నా అత్యధికంగా, శ్రీకాళీమాతను నిష్ఠతో పూజించే వారికి ఆ తల్లి, అంతకంటే ఎక్కువైన శక్తులను శ్రేష్టమైన ఆరోగ్యాన్ని (14) రోజులలోనే ఇస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

ఒక మనిషి తనకు తాను జీవితాన్ని చక్కదిద్దుకోవటానికి స్వీయ ఆచరణ ఎంతో ముఖ్యం. స్వీయ ఆచరణ అంటే ఎవరికి వారు, తమ వైపు నుంచి అన్ని విషయాలలోనూ నియంత్రణను చేసుకోగలగటం. మంచి గుణాలను పెంపొందించు కొనటం, చెడు గుణాలను తొలగించుకోవటం ఎవరికి వారికే సాధ్యమవుతుంది. ఈ విషయాలలో ఎవరూ ఎవరినీ మార్పు చేయలేరు. మంచి సమాజ నిర్మాణానికి ఇది ఎంతో దోహదపడుతుంది. అందుచేత ప్రతి ఒక్కరూ తపస్సు, యోగాల ద్వారా బుద్ధిని, మనసును చంచలత్వం నుంచి దూరం చేసుకోగలగాలి. వీటిని నిత్య సాధనగా జీవితంలో భాగంగా చేసుకోవటం వలన మనిషికి ఎన్నో సుగుణాలు అలవడతాయి. ఆ విధంగ (16) సంవత్సరాల పాటు ఏకదీక్షతో తనువును మరచి చేసే తపస్సు యోగాల వలన లభించే అద్భుతమైన శుభఫలితాల కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా, శ్రీకాళీమాత అమ్మవారు, తనను మనస్ఫూర్తిగా ఆరాధించే భక్తులకు, ఈ ఫలితాలన్నింటి కన్నా ఎక్కువ ఫలితాల్ని (1) ఒక్క రోజులోనే ప్రసాదిస్తారని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకం ద్వారా తెలియ చేస్తున్నారు.

**శ్లో॥ ద్వాత్రింశద్వర్ష వల్మీకాంతరాగ్ర తపోయోగాచరణాధిక ఫలప్రదాయిని! కాళి!**
**సురప్రసన్నాది మూలకారణామాపూర్ణిమాచరణాధిక పుణ్య ఫలప్రదే! దేవి!**
**సూర్యచంద్ర గ్రహణ పుణ్యకాలాచరితానేక తపోదానాధిక ఫలప్రదాయిని!**
**సర్వయుగోద్భవావతార పురుష దివ్యనామ సంకీర్తనార్చనాధిక ఫలప్రదాత్రి!8**

తా॥ ఒక గమ్యాన్ని చేరటానికి ఎన్నో మార్గాలుంటాయి. అందులో కొన్ని సుగమమైన మార్గాలు, మరికొన్ని దుర్గమమైన మార్గాలు అనగా కొన్ని మార్గాలలో పయనించటం సులభంగా ఉంటుంది, మరి కొన్ని మార్గాలలో ప్రయాణం కష్టతరంగా ఉంటుంది. సమస్యలు కష్టాలు లేకుండా సుఖంగా ప్రయాణించాలని అనుకొనే వారు కొందరు, మరికొందరైతే గమ్యస్థానాన్ని చేరటం ముఖ్యమే కాని, దారిలో ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని సవాలుగా స్వీకరించి కష్టాలను ఇష్టాలుగా చేసుకొని ముందుకు సాగుతుంటారు. ఎందుకంటే ఒకసారి గమ్యస్థానాన్ని చేరుకున్న తరువాత

చేసేది ఏమీ ఉండకపోవచ్చు. అందుకని ఏదయినా చెయ్యాలి, సాధిస్తూ గమ్యస్థానం చేరాలనుకుంటే మార్గమధ్యంలో ఎదురయ్యే కష్టాలను పైను సవాళ్లను అధిగమించుకుంటూ ముందుకు వెళ్లటం వలన భావితరాల వారికి, తమ అనుభవాలను వినూత్న విజ్ఞాన రూపంలో అందించటం జరుగుతుంది. మన ప్రాచీనులైన యోగులు, ఋషులు మొదలైన వారు ఎంతో మంది అత్యంత కఠినమైన మార్గాలను, తమ యోగసాధన కోసం, తపమాచరించటం కోసం అనుసరించినట్లు తెలుస్తున్నది. మామూలుగా దర్భాసనమో, యోగాసనమో వేసుకొని ఇంట్లోనో, ఆశ్రమంలోనో ముక్కు మూసుకొని తపమాచరించిన వారు కొందరైతే, మరికొందరు వినూత్నమైన పద్ధతులను ఆచరించి తపస్సు చేసి, పరమశివుణ్ణో లేక వారి అధిష్ఠాన దేవతలనో మెప్పించి కైవల్యప్రాప్తి పొందిన దాఖలాలు ఉన్నాయి. ఆ వినూత్న పద్ధతులలో ఒక పద్ధతి పుట్ట లోపల కూర్చొని మరియు పుట్ట పై భాగంలో ఆసీనులై తపమాచరించటం. పూర్వపు ఋషులు అత్యంత యోగ్యమైన ఆలోచనలు చేసే వారనటానికి ఈ పుట్ట లోపల కూర్చొని మరియు పుట్టపై భాగంలో కూర్చొని తపస్సు చేయటం. ఇందులో ఆగమ శాస్త్రానికి సంబంధించిన రహస్యాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉన్నట్లుగా కన్పిస్తున్నది. ఎందుకంటే పుట్టను మనం ఒకసారి ఎలా ఉంటుందో ఊహించుకుంటే అది బోర్లించిన త్రికోణాకృతిలో ఉంటుంది. క్రింద వెడల్పుగా, పైన బిందు స్థానం ఉంటుంది. ప్రపంచంలోని ఏ మతానికి చెందిన గుడులైనా, గోపురాలైనా, ప్రార్థనా మందిరాలైనా, చివరకు పురాతన కట్టడాలను పరిశీలించినా, గర్భగుడి మొదలైన వాటి పై భాగం గోపురం రూపంలోనే నిర్మాణం చేస్తారు. ఆఖరికి ఇళ్లలో ఏర్పాటు చేసుకొనే పూజామందిరాలపై భాగం కూడా గోపురంలాగానే ఉంటుంది. ఆ గోపుర భాగం క్రింద ఎంతో పవిత్రమైన ముఖ్యమైన భాగంగా భావించవచ్చు. నూతన శాస్త్ర జ్ఞానం ప్రకారం కూడా ఒక పిరమిడ్ ఆకారంలోనే ఉంటుంది కనుక పిరమిడ్ లోపల ధ్యానం చేయటం వలన ఎంతో ప్రశాంతత లభిస్తుందని కనుగొన్నారు. ఈ విషయాన్ని పూర్వపు ఋషులు భావితరాలకు తెలియజెయ్యాలనే కాబోలు లేదా పుట్టలోపలి భాగం గర్భగుడితో సమానమైనది కనుక అక్కడ తపస్సు చేయటం వలన సాక్షాత్తూ దైవసాన్నిధ్యంలో కూర్చొని తపమాచరించిన అద్భుత ఫలితం దక్కుతుందని కావచ్చు. గుడిలో, గర్భగుడిలో కూర్చొని యోగం, తపం ఆచరించటం వలన, తపోభంగం కలుగవచ్చు. కాని పుట్ట లోపల కూర్చొని చేయటం వలన మనసు ఏకాగ్రంగా నిలుస్తుంది.

ఎవరివల్లా ఎలాంటి తపోభంగం కాదు. అదీకాక రాత్రీ పగలూ అన్నీ ఒకే విధంగా ఉంటాయి. అట్లాగే పుట్టపై భాగంలో కూర్చొని తపమాచరించటం. పుట్టను శ్రీచక్రమేరువుతో పోల్చుకుంటే పుట్టపై భాగం బిందు స్థానం అవుతుంది. ఈ బిందు స్థానంలోనే అమ్మవారు కొలువై ఉంటారని చెప్తారు. అనగా పుట్టపై భాగంలో కూర్చొని తపమాచరించటం, శ్రీచక్రమేరువు యొక్క బిందు స్థానంలో కూర్చొని తపమాచరించటం అనే భావన కావచ్చు. ఏది ఏమయినా పూర్వపు ఋషులు ఆచరించే యోగాల వెనుక ఎంతో శాస్త్ర విజ్ఞానం ఉన్నట్లుగా భావన కలుగుతున్నది.

అలాగే భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు వ్రాసే ప్రతి శ్లోకంలోని అక్షరం వెనుక ఎంతో భావం ఉన్నట్లుగా గోచరిస్తున్నది. ఆ భావాలను వెలికి తీయటం, రాతిలో దాగి ఉన్న అమ్మవారి రూపాన్ని, జాగ్రత్తగా చెక్కుకుంటూ వెళ్లి ఆ తల్లిని లోకానికి చూపించటం అంతటి కష్టంగా నాకు అన్పిస్తున్నది.

ఇంత కష్టపడి పుట్టలోపల, పుట్టలపై భాగంలో కూర్చొని (32) సంవత్సరాల పాటు తపస్సు చేయటం వలన ప్రాప్తించే పుణ్యం కన్నా ఎక్కువైన పుణ్యఫలితాన్ని శ్రీకాళీమాత, తనను భక్తితో సేవించే వారికి (32) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

కొంతమంది తమ కోరికలు నెరవేర్చుకోవటానికి ప్రత్యేకమైన పూజలను చేస్తుంటారు. అందుకు ముందుగా, ఏ ఏ దేవతలను ఉపాసన లేదా పూజలు చేయటం వలన త్వరితంగా కోరికలు నెరవేరుతాయో, ఆయా దేవతలకు ఎలాంటి నైవేద్యాలను సమర్పించాలి, ఏ సమయాల్లో ఆ దేవతలు ప్రసన్నంగా ఉంటారు. తిథుల ప్రకారం, రోజుల ప్రకారం, వారాల ప్రకారం, రాత్రి వేళల్లోనా, పగటి కాలంలోనా, అమావాస్య రోజునా, పౌర్ణమి రోజునా అంటూ వివరాలను సేకరిస్తూ వాటి ప్రకారం చేస్తుంటారు. ముఖ్యంగా తెలిసిన వాళ్లు చెప్పేదేమంటే, అమావాస్య, పౌర్ణమి దినాలలో దేవతలు ఎక్కువ ప్రసన్నంగా ఉంటారు కనుక ఆ రోజుల్లో చేసే ఉపాసనా విధానాలు ఎక్కువ శుభ ఫలితాలను, త్వరితంగా పొందవచ్చని భావిస్తారు. నిజమే కావచ్చు. ఈ పూజలు, ఒక్కో ప్రాంతంలో ఒకో విధంగా ఉంటాయి. కొన్ని ప్రాంతాలలో అమావాస్యకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. అమావాస్య నుంచి చంద్రుడు దినదినాభివృద్ధి చెందుతాడు కనుక తాము ఆచరించే పూజలు కూడా ఫలించి, అవి అభివృద్ధి పథంలో ఉంటాయని కాబోలు. మరి కొన్ని ప్రాంతాలలో

పౌర్ణమికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటానికి కారణం నిండు వెలుగులో ప్రారంభించే పుణ్యకార్యాలు నిండైన శుభఫలితాలను ప్రసాదిస్తాయని వారి భావన అయి ఉంటుంది. ఏది ఏమయినా అమావాస్య, పౌర్ణమి దినాలలో ఆచరించే పుణ్యకార్యాల వలన లభించే పుణ్యఫలం కన్నా అత్యధికమైన మొత్తంలో శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులకు వరంగా ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

అదే విధంగా మరికొంతమంది మరింత ఎక్కువ ఉత్తమ ఫలితాల కోసం గ్రహణ సమయాన్ని ఎంచుకొంటారు. సూర్యగ్రహణం, చంద్రగ్రహణం సమయాల్లో చేసే తపస్సులు, జపాలు, హోమాలు, మామూలు సమయాలలో చేసే వాటి కంటే ఎన్నో రెట్లు ఎక్కువ శుభఫలితాలను ఇస్తాయి. ముఖ్యంగా గ్రహణ సమయంలో జప, తపాదులు త్వరగా సిద్ధిస్తాయి. అందుచేతనే కాబోలు కొంతమంది ఉపాసనాపరులు ముఖ్యంగా గ్రహణ సమయాలను ఎంచుకొని పూజలు చేస్తుంటారు. ఆ సమయాలలో చేసే దానాలు కూడా ఎన్నో రెట్లు పుణ్యఫలాలను సంప్రాప్తింప చేస్తాయని, కొంతమంది గ్రహణ సమయాలను అందుకోసం ఎంచుకొంటారు. హిందూ మనోభావాల ప్రకారం గ్రహణం అనే సరికి, ఆ సమయంలో బయటకు రాకూడదని, మంచిది కాదని, దుష్టశక్తులు వాతావరణంలో ఎక్కువగా ప్రవేశిస్తాయని పసిపిల్లలు, గర్భిణులైన వారిని బయటకు వెళ్లకుండా నిరోధిస్తారు. ఎవరూ ఏమీ తినరు, ఆ సమయంలో ఏమి తిన్నా అవి శరీరంపై విషప్రభావం చూపుతాయి. ప్రపంచంలో ఒకరికి కీడు చేసే విషయం, మరొకరి పాలిట వరంగా మారటం అనేది సాధారణమైన విషయమే కావచ్చు. వరంగా మారే విషయాలను మనం లెక్కలోకి తీసుకొని, సూర్యగ్రహణ, చంద్రగ్రహణ సమయాలలో ఆచరించే తపస్సులు, దానాలు అనేక పుణ్యప్రదమైన కార్యక్రమాల వలన లభించే ఎన్నో రెట్లు పుణ్యఫలం, శుభఫలితాల కన్నా ఇంకా ఎన్నెన్నో రెట్లు అధికమైన అద్భుత శుభ ఫలితాలను ఆతల్లి శ్రీ కాళీమాత తమ భక్తులకు అతిసులభంగా ప్రసాదిస్తుంది. యుగాలు నాలుగు. కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం మరియు కలియుగం. ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క ధర్మం ఉన్నత స్థాయిలో ఉంటుంది. చివరకు కలియుగం వచ్చేసరికి ధర్మం కుంటినడక నడుస్తుందని చెప్తారు. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన అయినట్లుగానే జనం పెరిగే కొద్దీ ఆచరణ అదే స్థాయిలో తగ్గుతుందేమో. సరే.. అసలు విషయానికి వస్తే ప్రతి యుగంలోనూ ఒక అవతార పురుషుడు జన్మించి ధర్మాన్ని కాపాడే

ప్రయత్నంలో దుష్టులను శిక్షించి, మంచివారిని రక్షించటం, మరలా ఆ అవతారం సమాప్తం కావటం వస్తూ ఉంది. కృతయుగం నుంచీ కలియుగం వరకూ వచ్చిన అవతారాలూ అలాంటివే. ఈ అవతార మూర్తులైన శ్రీనరసింహస్వామి, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన వారిని ఆదర్శంగా తీసుకొని వారు ఏర్పరచిన ధర్మమార్గాలలోనే పయనించాలని అందువలన ఎంతో శుభం, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని భావించి, వారికి గుడులను, గోపురాలను ఏర్పాటు చేసుకొని ఆరాధిస్తూ వస్తున్నారు. అందువలన ప్రజలు జీవిత గమ్యాలు చేరుకోవటం సుఖప్రదంగా ఎలాంటి ఒడిదుడుకులూ లేకుండా సాగుతుందని నమ్మకం. అందువలన అవతార పురుషులైన వారిని ఎన్నో విధాలుగా అర్చించటం, పూజించటం, నామస్మరణలు, భజనలు, సంకీర్తనలు, ఎవరికి ఏది వీలుగా ఉంటే ఆ విధంగా కొలవటం పరిపాటి. అన్ని యుగాలలోనూ ఈ భక్తి ఇలాగే ఉండి ఉండవచ్చు. రాత్రి తరువాత పగలు, వారం తరువాత మళ్లీ అదే వారంతో రోజుప్రారంభం కావటం, సంవత్సరం తరువాత మళ్లీ అవే మాసాలతో సంవత్సరం ప్రారంభం కావటం వలెనే, నాలుగు యుగాలైన తరువాత మళ్లీ అవే యుగాలు ప్రారంభమౌతాయని, అప్పుడు కూడా యుగానికొక్క అవతార పురుషుడు వస్తాడని, ప్రజలచేత పూజలందుకొంటాడని నమ్ముతారు. ఈ విధంగా అవతార మూర్తులను అన్ని విధాలుగా సేవించి, పూజించటం వలన లభించే పుణ్యఫలం కన్నా అత్యధికమైన పుణ్యఫలాన్ని శ్రీకాళీమాత, తనను ఆర్తిగా సేవించిన ఆర్తులైన పరమ భక్తులకు అక్షయంగా ప్రసాదిస్తుందని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో ఎంతో అద్భుతంగా వివరించారు.

**శ్లో॥ అష్టవింశతివర్ష ఆమ్రవృక్ష ప్రచ్ఛాయా శాఖాగ్రధ్యానయోగాధిక ఫలప్రదాత్రి!**
**త్రింశద్వర్ష తాల నారికేళ వటపత్రాసనాత్త యోగాధిక ఫలప్రదే! శ్రీకాళి!**
**ద్వి ఘటికా ధ్యానేనైవ ఏకాదశ వర్షాదిత్యోపాసనాధిక ఫలప్రదాత్రి! కాళి!**
**ఏకదర్శనేనైవ దశవర్ష యోగ కరణానేక రూప సందర్శనాధిక ఫలప్రదే!9**

తా॥ ఆమ్ర వృక్షం అంటే మామిడి చెట్టు. ఈ మామిడిచెట్టు అత్యంత శుభప్రదమైనది. ఎలాంటి శుభకార్యాలకైనా ముందుగా మామిడి ఆకులతో తోరణాలు కట్టవలసిందే, ఆ కార్యక్రమం శోభస్కరంగా ఉండదు. పెళ్లిళ్లకు, పేరంటాలకు

దేనికయినా సరే మామిడి తోరణాలు ఇల్లంతా అలంకరించగానే ఒక విధమయిన మంచి కళ వస్తుంది. ఇవి లేకుండా ఏ శుభ కార్యక్రమం ప్రారంభం కాదు. పాత రోజుల్లో ప్రతి ఇంటి పెరట్లోనూ మామిడి చెట్టును పెంచేవారు. అందువలన ఆ ప్రాంతంలో ఎలాంటి దుష్టపీడలు ఉన్నా అవి నశిస్తాయని విశ్వసించే వారు. ఆధునిక వైజ్ఞానికులు కూడా, మామిడి ఆకులు స్వచ్ఛమైన ప్రాణవాయువుని విడుదల చేస్తాయని వెల్లడించారు. పైగా మామిడి చెట్టులోని అన్ని భాగాలూ ఔషధ గుణాలు కలిగి ఉన్నాయని ఆయుర్వేద వైద్యులు చెపుతారు. అదే విధంగా మామిడిచెట్టు అద్భుతమైన ఫలాలను ఇస్తుంది. కొంతమందయితే మామిడి పండు రుచిని ఆస్వాదిస్తూ ఇది నిజంగా అమృత ఫలం అంటూ మెచ్చుకుంటారు. ఈ చెట్లు ఎక్కువ సూర్యశక్తిని పీల్చుకొని ఫలాలను ప్రసాదిస్తాయి. అనగా పగలు ఎక్కువ సమయం సూర్యుడు కన్పించే కాలంలోనే ఈ చెట్లు పుష్పించి, ఫలిస్తాయి. శీతాకాలంలో పగలు పొద్దు తక్కువ సమయం ఉంటుంది. సూర్యునిలో తీక్షణత కూడా చాలా తక్కువగా ఉంటుంది. అదే, శీతాకాలం వెళ్లిపోతూ వేసవికాలం ప్రవేశించే రోజుల్లో పగలు పొద్దు, రాత్రిపొద్దు సమానంగా పైగా సూర్యుని తీక్షణత కొంచెం పెరుగుతుంది. అనగా ఫిబ్రవరి, మార్చి నెలలు. ఈ కాలం మామిడికి అనుకూలమైనది. ఈ కాలంలో వచ్చే సూర్యశక్తిని నిండుగా పీల్చుకొని, ఆ నిండైన శక్తిని ఫలాల రూపంలో మానవాళికి ప్రసాదిస్తుంది. ఇది ప్రకృతి ధర్మం కావచ్చు. కాని ఈ చెట్టు నీడలో విశ్రమించిన వారికి అంతులేని ప్రశాంతత లభిస్తుంది. దానికి కారణం మామిడి చెట్టులోని అద్భుత శక్తి, దాని పరిసర ప్రాంతాలకు వ్యాపించి విస్తరించి ఉండటమేనని పెద్దలు చెపుతారు. ఈ చెట్టు వద్దకు వెళ్లిన వారికి, దీని నీడలో కొంచెం సేపు కూర్చొని వెళ్లాలి, అని అన్పిస్తుంది. ఇది దేవతా సంబంధమైన వృక్షమని చెప్పుకోవచ్చు. మహాకవియైన కాళిదాసు తాను వ్రాసిన ప్రబంధాలలో ఒకచోట ఈ మామిడి చెట్టు గురించి, వాటి పండ్ల రసరమ్యత గురించి శ్లాఘించారు. సాక్షాత్తూ 'అంబికా' మాత ఈ మామిడి చెట్టు క్రింద కూర్చొని ఉన్నట్లుగా కొన్నిచోట్ల చిత్తరువులు ఉన్నాయి. ఇంతటి మహిమాన్వితమైన శక్తి కలిగి ఉండుట వల్లనే పూర్వం ఋషులు కొందరు ఈ చెట్టు క్రింద, చెట్టు పై భాగంలో కొమ్మల మధ్యన ఆసీనులై తపమాచరించి ఉండవచ్చు. ఈ విధంగా మామిడి చెట్టు దట్టమైన నీడలో ఇంకా ఆ చెట్టుపైన కూర్చొని (28) సంవత్సరాల పాటు చేసే తపస్సు, ధ్యానయోగాల వలన లభించే

అద్భుత శక్తులకంటే ఎన్నో రెట్లు అధికమైన ఫలితాన్ని (28) రోజులలోనే శ్రీకాళీమాత, తనను సంపూర్ణంగా విశ్వసించి పూజించే వారికి ఇస్తుంది. ఈ మామిడిచెట్టు పూత అద్భుత సుగంధాలను వెదజల్లుతుందని అంటారు శ్రీగురుదేవులు.

పూర్వ కాలంలో మంత్ర తంత్ర శక్తులను సంపాదించటానికి ఎన్నెన్నో ప్రయోగాలను చేసేవారట, దాని కోసం రకరకాల ఉపకరణాలను సిద్ధం చేసుకొనే వారట. ఇవన్నీ ప్రకృతి ప్రసాదించినవే. కాని ఏది దేనికి ఉపయోగపడుతుంది అని తెలుసుకోవటమే శాస్త్రం. ఈ ప్రయోగాల కోసం ముఖ్యంగా తాటి, కొబ్బరి, మర్రి చెట్ల ఆకులను ఉపయోగించే వారట. ముందుగా ఒక్కొక్క చెట్టు యొక్క ఆకులను గురించి తెలుసుకుందాం. తాడిచెట్లు కేవలం విశాల మైదాన ప్రాంతాలలోను, గట్లమీద మాత్రమే కన్పిస్తుంటాయి. ఇంటి పెరళ్లలో అస్సలు పెంచరు. దానికి కారణం తాటి మట్టల కిరువైపులా రంపపు పళ్లవలె అంచులు ఉంటాయి. అవి అత్యంత ప్రమాదకరం, అలాగే తాటిపండు కూడా పెద్దదిగా, గుండ్రంగా, లావుగా ఉంటుంది. అది నెత్తిమీద పడినా ప్రమాదమే. ఈ కారణల చేత కావచ్చు ఈ చెట్లను ఎవ్వరూ ఇళ్ల వద్ద పెంచరు. ఎవరికీ ఆసక్తి ఉండదు. కాని వీటి ఆకులు చాల వెడల్పుగా ఉండి, మనిషి ఆసనం వేసుకొని కూర్చోవటానికి సరిపడిన దానికంటే కూడా పెద్దవిగా ఉంటాయి. ఈ ఆకుల్లో అద్భుతమైన మర్మాలు ఉన్నాయి. ఎలాగంటే వేసవి కాలంలో చల్లని వాతావరణాన్ని కల్పిస్తాయి. చలికాలంలో వెచ్చని అనుభూతిని కలిగిస్తాయి. పూర్వకాలం నుంచి ఈ కాలం వరకూ కూడా మనిషికి నీడ నిస్తున్నది ఈ చెట్ల ఆకులే. ఇంటి పై కప్పులు వీటితోనే వేస్తే ఆ ఇంట్లో ఉండే వారికి ఎంతో ప్రశాంతత కలుగుతుంది. వివాహ కార్యక్రమాలకు తాటి ఆకు పందిళ్లు వేయనిదే శుభప్రదం కాదని చెప్తారు. అందువలన పందిళ్లను తాటి ఆకులతోనే వేసి వివాహ శుభకార్యాలను ప్రారంభించటం ఆచారంగా వస్తున్నది. అట్లాగే గ్రామాలలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు వేసే తాటాకు  చలువ పందిళ్ల క్రింద కూర్చొని పురాణ శ్రవణాన్ని ఆలకించటంతరతరాలుగా వస్తున్న సంప్రదాయం. తాటి ఆకులు ఎలాంటి వాతావరణానికైనా నిలబడి ఉంటాయి. పాడైపోవు. అందువల్లనే కాబోలు పూర్వపు కవులు తాము రచించే గ్రంథాలను తాటి ఆకులపైనే లిఖించి భద్రపరచే వారని తెలుస్తున్నది. తాటి ఆకులో ఔషధ గుణాలు అత్యధికంగా ఉన్నట్లు చెప్తారు. ఇప్పటికి కూడా చాలా చోట్ల గ్రామాలలో, ఆడపిల్ల ప్రథమ రసజ్వల అయినప్పుడు పచ్చి

తాటి ఆకులపైనే కొన్ని రోజులు కూర్చోపెడతారు. ఆ సమయంలో వారిలో ఏర్పడే శారీరకమైన మార్పులను, వెలువడే చెడును ఈ ఆకులు అదుపులో ఉంచుతాయని, విష ప్రభావాలను పీల్చి వేసుకొని ఆడపిల్లకు శుభాన్ని చేకూర్చుతాయని నమ్ముతారు. తరువాత ఆ ఆకులను ఎవరి కంట పడకుండా తగులబెడతారట. ఇదీ ఒక విధమైన శుద్ధి కార్యక్రమమే. తాటి ఆకులలో ఉండే మహత్తరమైన శక్తి అమ్మవారికి మాత్రమే తెలుసేమో! అందుకే ఆతల్లి తాటి ఆకులతో తయారైన చాపలపై కూర్చొని ఎంతో మంది జపాలు తపస్సులు చేస్తుంటారు. అలాగే కొబ్బరి చెట్టును భూలోక కల్పవృక్షం అంటారు. ఈ చెట్టులో ప్రతిభాగం ఉపయోగకరమైనదే. శుభకార్యాలకు అత్యంత శ్రేష్ఠమైనవి కొబ్బరి ఆకులు. కొబ్బరికాయ లేనిదే ఎలాంటి పూజలు కూడా జరుగవు. కొబ్బరి ఆకుల చాపలపై ఆసీనులై కొన్ని ప్రత్యేకమైన పూజలు, జపాలు చేయటం వలన కోరికలు త్వరగా ఫలిస్తాయట. అదే విధంగా మర్రి ఆకులతో తయారుచేసిన చాపపై కూర్చొని జపాలు, యోగాలు చేయటం వలన అత్యధికమైన పుణ్యఫలం కలుగుతుందని చెప్తారు. ఈ విధంగా (30) సంవత్సరాల పాటు తాటి ఆకుల ఆసనం, కొబ్బరి ఆకుల చాప, మరియు మర్రి ఆకులతో తయారుచేసిన ఆసనాల మీద కూర్చొని యోగాలను ఆచరించటం వలన లభించే అత్యధికమైన పుణ్యఫలితం కన్నా ఎక్కువైన అనంతమైన మహా పుణ్యఫలితాలను శ్రీకాళీమాత తమ భక్తులకు (30) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

పురాణకాలం నుంచీ హిందూ ధర్మంలో సూర్యోపాసన అనేది కన్పిస్తున్నది. భూమ్మీద నివసించే సకల జీవరాశులకూ, చెట్లకూ, చేమలకూ ఆరోగ్యప్రదాత సూర్యుడు. సూర్యునిలోని వేడి జీవులపై పడటం వల్లనే వాటి శరీర నిర్మాణం, అందలి జీవనక్రియలు సాధ్యమౌతున్నాయి. అందరికీ ప్రతిరోజూ కన్పించే దేవుడు సూర్యుడే. కంటికి శక్తినిచ్చి ప్రపంచాన్ని చూడగలిగే అవకాశాన్ని కల్పించింది సూర్యభగవానుడే. కళ్లు ఉన్నా, దృష్టిలోపం లేకపోయినా, మన కంటి ఎదురుగా ఉన్న వస్తువునే మనం చీకట్లో చూడలేము కదా! అదే సూర్యకాంతిలో, సుదూర ప్రాంతంలో ఉన్న చెట్లను, అందాలను, కొండలను, ఆకాశంలో మేఘాలను అన్నింటినీ చూడగలము. అందుచేతనే మనపూర్వీకులు, ఉదయం లేవగానే సూర్యనమస్కారం చేయాలని చెప్పేవారు. అందువలన మనకు అవసరమైన ఆరోగ్యాన్ని సూర్యుడు మనకు ప్రసాదిస్తాడని విశ్వాసం. ఇది విశ్వాసం మాత్రమే కాదు, నిజం కూడా.

ఎవరికి నచ్చిన దేవుణ్ణి వాళ్లు పూజించినట్లుగా కొంతమంది సూర్యోపాసన చేస్తారు. అందువలన అధికమైన శక్తులు సంప్రాప్తిస్తాయని అంటుంటారు. అలా (11) సంవత్సరాల పాటు నిత్యం సూర్యోపాసన చేయటం వలన వచ్చే ఫలితంకన్నా ఇంకా ఎక్కువైన శుభఫలితాలను, శ్రీకాళీమాత, తమ భక్తులై తనను ఆశ్రయించి, నిష్కల్మష మనసుతో పూజించిన వారికి (2) ఘడియలలోనే ఇచ్చేస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

యోగాన్ని ఆచరించటం ప్రారంభించిన వారికి మనసు ఒకపట్టాన నిలువదు, ఏకాగ్రత కుదరదు. ఏకాగ్రత కుదిరి, మనసు అంతర నేత్రం మీద లగ్నమైన స్థితిలో వారికి అనేకమైన దివ్య అనుభూతులు కలుగుతూ ఉంటాయి. తాము ఇదివరకు చూడని కొత్త కొత్త వింతైన ప్రదేశాలు, దేవతా మూర్తులు, దివ్యపురుషులు మొదలైన వారు కన్పిస్తూ ఉంటారట. వారితో సంభాషిస్తూ ఉన్నందువలన యోగమాచరించే వారికి ఎంతో జ్ఞానం, ఎన్నో దేవరహస్యాలు మొదలైనవి తెలుస్తూ ఉంటాయని సిద్ధులైన మహాపురుషులు చెపుతూ ఉంటారు. (10) సంవత్సరాల పాటు నిత్యం యోగం చేస్తూ, సమాధి స్థితిలో అనేక అద్భుతమైన దివ్యరూపాలను సందర్శించి నందువలన వచ్చే ఫలితంకన్నా అధికమైన ఫలితాన్ని, ఆతల్లి శ్రీకాళీమాత అమ్మవారు, తనను ఒకే ఒక్కసారి దర్శించుకున్న భక్తునికి ప్రసాదిస్తుందని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో, వారు వాస్తవ రూపంలో దర్శించిన అనుభవాలను తెలియచేశారు.

**శ్లో॥ అర్ధదినార్చనే నైవ నవవర్ష సోమమంత్రో పాసన ధ్యానాధిక ఫలప్రదాత్రి!**
**ఏకదీప స్థాపనే నైవ అష్టోత్తర శతదిన అఖండ దీపస్థాపనాధిక ఫలప్రదే!**
**త్రయస్త్రింశత్ కోటిదేవతాప్రత్యక్షదర్శనఫలం త్వద్రూపదర్శన మాత్రేణ ప్రదే!**
**అక్షయానందానుభవకారణాధ్యాత్మిక గృహనివాస భాగ్యప్రదాయిని! శ్రీకాళి!10**

తా॥ చందమామ రావే... జాబిల్లి రావే... అంటూ పసిపిల్లలకు తల్లులు గోరుముద్దలు తినిపిస్తూ పాడుతూ ఉండటం చాలామందికి తెలిసే ఉంటుంది. పిల్లలు మారాం చేస్తున్నా ఏడుస్తున్నా ఇదే పాటను పాడుతుంటారు. ఆ పాటలో ఏముందో లేక చంద్రునిలో ఏముందో గాని, వెంటనే పిల్లలు మారాం చేయటం మానివేసి బుద్ధిగా అన్నం తినేస్తారు. ఇదంతా నిజంగా చంద్రునిలోనే ఉన్నది.

చంద్రుడు మనః కారకుడు, తనను చూసిన వారికి వెంటనే ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ప్రసాదిస్తాడు. నిండు పున్నమి జాబిల్లిని దర్శిస్తుంటే, వయసుతో నిమిత్తం లేకుండా, ఎంతటి కఠినమైన హృదయం కలిగిన వారికైనా కొన్ని క్షణాలు మనసు కదులుతుంది, కరుగుతుంది, కఠినత్వం మరుగున పడి, తీయనైన దివ్య భావనల అమృతసారంలో స్థిరవాసం చేస్తుంది.

జగన్మాత చేతిలో రెండు పాత్రలుంటాయని, అందులోని ఒక పాత్రను సూర్యపాత్ర యని, రెండో పాత్రను చంద్రపాత్రయని అంటారట. సూర్య పాత్రలో (మధువు) ఉంటుందని, చంద్ర పాత్రలో అమృతం ఉంటుందని చెప్తారు. అందువల్లనే చంద్రుడు 'సోముడు' అనే పేరుతో కూడా పిలువబడుతుంటాడు. ఈ చంద్రునిలో షోడశ (16) కళలు ఉంటాయి. ఈ కళలన్నీ సోమపాత్రలో అనగా అమృత పాత్రలో హాయిగా తిరుగాడుతూ ఉంటాయట. ఆ కళలు ఏమంటే 1) అమృతకళ 2) మదనకళ 3) భూసకళ 4) పుష్టి కళ 5) తుష్టి కళ 6) రతికళ 7) ధృతికళ 8) శశినీకళ 9) చంద్రకాకళ 10) కాంతి కళ 11) జ్యోత్స్నా కళ 12) శ్రీకళ 13) ప్రీతి కళ 14) అంగద కళ 15) పూర్ణ కళ 16) పూర్ణామృత కళ. ఇవన్నీ ఓషధుల రసంతో కూడి ఉంటాయట. అందువల్లనే నేమో పౌర్ణమి చంద్రుని దర్శిస్తూ ఉంటే, మానవులు చంద్రునిలోని షోడశ కళల (16 కళలు) కారణంగా, వారిలో అంతర్గతంగా ఉండే సహజమైన భావజాలాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుంటారు. కవులకు కవితా భావనలు దివ్యానుభూతులు గోచరిస్తాయి. గాయకులకు మధుర సంగీత ఆలాపనలు వినిపిస్తాయి. ఇలా అనేక రకాలుగా కలుగుతూ ఉంటాయి. మానవుల కవసరమైన అన్ని కళలనూ (శుభాలను) తనలో కలిగి ఉన్నాడు కనుకనే పూర్వ కాలం నుంచీ కూడా చంద్రుని ఆరాధన, చంద్రోపాసనలను  మన పూర్వీకులు ఆచరించినట్లుగా తెలుస్తున్నది. పౌర్ణమి రోజుల్లో రాత్రివేళ ఆరుబైట చేసే సాధనలు మానవుల సహస్రారశక్తిని వృద్ధి చేసి యోగశక్తిని పెంపొందిస్తూ మానసిక స్థైర్యాన్ని రాత్రివేళ పెంచుతూ నిర్మలత్వాన్ని ప్రసాదించి మహనీయులుగా మహర్షులుగా చేసి వారిని తరింపచేస్తాయి ఈ చంద్రుని కళలు పరిపుష్టంగా, నిండుగా ఉంటాయి కనుక ఆ రోజుల్లో ఎక్కువగా పూజలు ఉపాసనలు చేయటం వలన ఎక్కువ ఫలితాలు, తక్కువ సమయంలో లభిస్తాయని తెలుస్తుంది. చంద్రుని పదహారు (16) కళలలోని సంపూర్ణ అమృత తత్త్వాన్ని పొందటం కోసం, స్వయంగా కాంతిని ప్రకాశింప చేయగలిగిన

తారలు, మరియు ఇరువది ఏడు (27) నక్షత్రాలు, నిరంతరం చంద్రుణ్ణి ఆరాధిస్తుంటాయి, పూజిస్తుంటాయి, ధ్యానిస్తుంటాయి. చంద్రుడు, తనను ఆరాధించే అందరికీ తనలోని తేజస్సును, పటుత్వాన్ని, కళలను ప్రసాదిస్తూ, తాను మాత్రం నిరంతరం ఆ జగన్మాత శ్రీకాళీమాతను ధ్యానిస్తూ ఉంటాడనేది విశేషం. ఎందుకంటే చంద్రునిలోని శక్తి, కాంతి మొదలైనవి పౌర్ణమి తరువాత క్షీణిస్తూ వస్తాయి. వాటిని మరలా పూరించుకోవడానికి చంద్రుడు జగన్మాత శ్రీకాళీమాతను అను నిత్యం ధ్యానించటం వలన, ఆ తల్లి మరలా పౌర్ణమి నాటికి, చంద్రునికి, పూర్ణత్వాన్ని కల్గిస్తూ ఉంటుంది అని భావించవచ్చు. అదే విధంగా మానవులలో చంద్రోపాసన చేసేవారు, చంద్ర కిరణాలు శిరస్సుపై పడినప్పుడు వారి శరీరాలకు మంచి జరుగుతుంది. పైన చెప్పిన ఫలితాలు ప్రాప్తిస్తాయి. అలాగే సద్గురువైన వారిని కూడా పూర్ణ చంద్రునితో పోల్చవచ్చు. వారు కూడా, వారి వాక్కుల ద్వారా, జ్ఞానతేజస్సు ద్వారా, మనసుల్లోని కల్మషాలను పారద్రోలగలిగే శక్తి కలిగి ఉంటారు. తొమ్మిది (9) సంవత్సరాల పాటు మంత్రయుక్తంగా పూర్ణ చంద్రోపాసన చేసే వారికి, ఆ చంద్రుడు ఎంతో ఘనమైన ఫలితాలను ప్రసాదిస్తాడు. కాని తొమ్మిది (9) సంవత్సరాలలో ఉపాసకులు పొందగలిగే శుభఫలితాల కన్నా ఎక్కువగా ఆ తల్లి శ్రీకాళీమాతను పూజించిన వారికి, అధికమైన శుభఫలితాలను ఒక అరపూటలోనే అనగా రెండు (2) జాములలోనే, అంటే ఆరు (6) గంటల సమయంలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

అఖండ దీపారాధన చేయటం వలన, అమోఘమైన శుభఫలితాలు వస్తాయని అంటారు. సాధారణంగా రోజువారీ కార్యక్రమాలు ప్రారంభించటానికి ముందుగానే, ఇంట్లో, సూర్యోదయానికి ముందుగానే దీపారాధన చేసుకొని దేవుడికి దణ్ణం పెట్టుకోవటం చాలామందికి అలవాటు. అలాగే ప్రతి శుభకార్యాన్ని ప్రారంభించటానికి, ఆ శుభకార్యం ఎలాంటి అవాంతరాలూ లేకుండా జరగడానికి, ప్రారంభంలో శాస్త్రోక్తంగా ఒక పెద్ద మూకుడులాంటి పాత్రలో నూనె, నెయ్యి పోసి, తలపెట్టిన శుభకార్యం ఎన్ని రోజులు జరుగుతుందో దాన్ని బట్టి 'వత్తి' పరిమాణాన్ని సరిచూసి ఆ నూనెలో లేదా నెయ్యిలో ముంచి ఆ వత్తిని ప్రజ్వలింప చేస్తారు. దాన్ని అఖండ దీపంగా పూజలు చేస్తారు. ఆ అఖండ దీపం వెలుగుతున్నంత సేపూ, దానిలో నుంచి వెలువడే కాంతిశక్తి ఆ ఇంటికి శుభాలను చేకూర్చుతుందని భావిస్తారు.

కొన్ని దేవాలయాలలో ఈ అఖండ దీపాలు సంవత్సరాల తరబడి వెలుగుతూనే ఉంటాయని, అలాంటి దీపదర్శనం వలన కష్టాలు తొలగిపోతాయని, పాపాలు నశించి తీరుతాయని విశ్వసిస్తారు. అఖండ దీపారాధనకున్న శక్తి తెలిసిన వారు, ఆ దీప స్థాపన గావించి దాని సమీపంలోనే పూజలు, వ్రతాలు చేస్తూ దీక్షలను చేపడతారు. అలా అఖండ దీపారాధనను (108) రోజుల పాటు నిర్విరామంగా వెలిగే దీపాన్ని చేయటం వలన లభించే పుణ్యఫలం కంటే అత్యధికమైన పుణ్యఫలాన్ని, శ్రీకాళీమాత, తన ఆలయంలో ఒకే (1) ఒక్క దీపాన్ని వెలిగించినంత మాత్రం చేతనే దేవి భక్తులకు ప్రసాదిస్తుందట. సాధారణంగా భక్తులైన వారి ఆలోచనలన్నీ ఒకే విధంగా ఉండక పోవచ్చు. ప్రతివారూ దేవుణ్ణి లేదా ఒక దేవతను పూజించటానికి వెనుక ఏదో ఒక కారణం ఉంటుంది. ఆ కారణం స్వార్ధం కాకపోవచ్చు. అవసరమై ఉండవచ్చు. పుణ్యం కోసం పూజించేవారు లక్ష జనాభా భక్తులలో ఒకరు ఉండవచ్చు, మోక్షం కోరి దైవారాధన చేసేవారు కూడా అంతే. మిగతా వారెవరైనా ధనం కోసం, ఆస్తుల సమీకరణ కోసం, కుటుంబ వృద్ధి కోసం, సమాజంలో పేరు ప్రఖ్యాతుల కోసం ఇలా... ఎవరి అవసరాన్ని బట్టి వాళ్లు పూజలు చేస్తుంటారు. ఏ దేవతలైతే తక్కువ సమయంలో శీఘ్ర ఫలితాలను ప్రసాదిస్తారో చూసి వారి చెంతకు చేరతారు. మరికొంతమంది భక్తులైతే వారంలో రోజుకొక దేవుణ్ణో, దేవతనో పూజిస్తూ పేరుపేరునా వారికి దండాలు పెడుతుంటారు. ఇలా అందరి దేవతల పూజలూ ఆచరిస్తూ శుభఫలితాలను ఆశిస్తుంటారు. వారు పూజలు చేసే మనసులను బట్టి ఫలితాలుంటాయని వేరే చెప్పక్కరలేదు. ఇలా కాక మరికొందరికి వారు చేసే పూజా ఫలితాలను బట్టి దేవతలు ప్రత్యక్షమై వారి దివ్య దర్శనాలను కలిగిస్తారు. శుభకరమైన ఫలితాలను అందిస్తారు. కాని, అలాకాక (33) కోట్లమంది దేవతలందరూ ఒక్కసారిగా ప్రత్యక్షమైతే పొందే ఆనందానుభూతులు, శుభపరంపరల కన్నా అత్యధికమైన పుణ్యఫలితాన్ని, దివ్యానుభూతులను, ఒకే ఒక్కమారు దేవి తన దర్శన భాగ్యంచేత శ్రీకాళీమాత అమ్మవారు భక్తులకు ప్రసాదిస్తూ వారి జన్మలకే సార్థక్యతను కలిగిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

కంటికి కనుపించని విద్యయే ఆధ్యాత్మిక విద్య. లౌకికంగా కనిపించే భౌతికమైన ధనం ఖర్చు చేస్తే క్షీణించిపోయే గుణం ఉండవచ్చు. కాని ఆధ్యాత్మిక విద్యకు ఎప్పటికీ తరిగిపోని వన్నె ఉంటుంది. ఆధ్యాత్మిక విద్యలు నేర్చిన వారి ముఖంలో దివ్యతేజస్సు

ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ధనవంతుల ముఖంలో కన్పించే తేజస్సు, ధనం పోతున్న కొద్దీ క్షీణించి, ముఖం కళ తప్పుతుంది, కాని ఆధ్యాత్మికతలో కళ తప్పటం అనేది లేదు. ఆధ్యాత్మిక విషయాలలో ముందుకు వెళ్లే కొద్దీ ఎన్నెన్నో దివ్యానుభూతులు పొందగలుగుతూ ఉంటారు. అలాంటి సమయాలలో వారి ఆనందం పరవళ్లు తొక్కుతూ ఉంటుంది. శ్రీకాళీమాత అమ్మవారు, వారి భక్తులకు, అక్షయమైన ఆనందం పుట్టటానికి ప్రేరణ కలిగిస్తారు. ఆధ్యాత్మిక విద్య అనేది ఒక అక్షయనిధి లాంటిది. అంతులేని ఆనందం పుట్టటానికి కారణమైన ఆధ్యాత్మిక విద్య అనే నిధుల గృహంలో ఎల్లప్పుడూ ఉండే అద్భుతమైన భాగ్యాన్ని ఆ తల్లి శ్రీకాళీమాత, వారి భక్తులకు అత్యంత సులువుగా ప్రసాదిస్తుంది. ఒక బీదవానికో లేదా మధ్యతరగతి వాడికో అంతులేని సంపద నిచ్చి, దీంతో హాయిగా బ్రతుకు అని పంపించి వేస్తే వాడికి భయం పట్టుకుంటుంది. ఖర్చు చేసుకుంటూ వెళితే చివరకు ఏమీ మిగలదనుకుంటూ బాధ పడుతూ బ్రతుకుతుంటాడు. కాని అమ్మవారైన శ్రీకాళీమాత ప్రసాదించే ఆధ్యాత్మిక ధనవంతులు ఎప్పటికీ దిగులు చెందరు. అది నేర్చిన కొలదీ పెరుగుతూనే ఉంటుంది కాని తరగదు. కనుక ఇంతటి మహాభాగ్యాలను ప్రసాదించే శ్రీకాళీమాతను, భక్తులైనవారు, అందరూ ఆతల్లిని ఆరాధించి శుభఫలితాలను పొందగలరని పై శ్లోకంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు శ్రీకాళీమాత ఆరాధనను గురించి వాస్తవాలను తెలియ చేస్తున్నారు.

**శ్లో॥ చతుర్దినార్చనేనైవ నిత్య నిరాహార చాతుర్మాస్య దీక్షాధిక ఫలప్రదే! కాళి!**
**సప్త దినార్చనేనైవ షడ్వర్ష సమస్త దేవతా స్తోత్ర పఠనాధిక ఫలప్రదే!**
**పవిత్రోత్తమ స్త్రీపురుషదివ్య సిద్ధాత్మసమాధి సందర్శనాధిక ఫలప్రదాత్రి!**
**ధరణీ పాపపుణ్యఫలసుఖదుఃఖానుభవకారణ పునర్భవ నిర్మూలన కారిణి!11**

తా॥ చాతుర్మాస్య దీక్ష అనగా పూర్తిగా నాలుగు (4) నెలలు కాలం చేపట్టే దీక్ష. తెలుగు మాసాల పేర్లలో నాల్గవది ఆషాఢ మాసం. ఈ మాసంలోని (11)వ రోజు నాడు అనగా ఏకాదశి రోజున సూర్యుడు కర్కాటక రాశిలో ప్రవేశించి దక్షిణానికి తన గమనాన్ని మార్చుకుంటాడు. ఇది శుక్లపక్షం. ఈ ఏకాదశిని శయన ఏకాదశి అంటారు. అనగా శ్రీమహావిష్ణువు పాలసముద్రంలోని శేషపాన్పుపై పవళించి యోగ నిద్రకు ఉపక్రమించే సమయం. ఈ ఏకాదశినే ప్రథమ ఏకాదశి లేక తొలి ఏకాదశి

యని, పద్మ ఏకాదశి, దేవశయన ఏకాదశి అని వేర్వేరు ప్రాంతాలలో వారి ఆచార వ్యవహారాలను బట్టి పిలుస్తుంటారు. ఈ తొలి ఏకాదశి రోజు విష్ణు భక్తులకే కాక అందరికీ పర్వదినమే. ఈ రోజు రాత్రంతా లక్ష్మీదేవిని, విష్ణువును వివిధ రకాలుగా అలంకరించి పూజిస్తూ, భజనలు చేస్తూ, కీర్తిస్తూ మేలుకొని ఉంటారు. ఈ రోజు రాత్రి పూర్తిగా ఉపవాసం ఉండి, ఈ రోజు నుంచి వచ్చే నాల్గు నెలల కాలం వరకూ అనగా ప్రబోధ ఏకాదశి వరకూ ఎవరు ఏ విధమైన కార్యాచరణలు చేపట్టాలో, వాటిని నిర్దిష్టంగా తమ సంకల్పంలో చెప్పుకుంటూ స్వామివారి ముందు దీక్షను చేపడతారు. ఒక నమ్మకం ఏమిటంటే, విష్ణువు తొలి ఏకాదశి రోజున శయనించి మరలా ప్రబోధ ఏకాదశినాడు నిద్ర మేలుకొంటారని విశ్వాసం. ఈ ప్రబోధ ఏకాదశి కార్తీక మాసంలో (11)వ రోజు వస్తుంది. ఈ నాలుగు నెలలూ, చాతుర్మాస్య దీక్షను పూనిన వారు కొన్ని నియమాలకు లోబడి దీక్షను కొనసాగిస్తారు. ఉల్లిపాయలు, ఇంకా ఎన్నో ఉద్వేగ పదార్థాలను పూర్తిగా విసర్జిస్తారు. వీటి వలన ఆరోగ్య భంగం కలిగి మానసిక అలజడి కలుగుతుంది. అందువలన దీక్షా భంగం కలుగవచ్చు. మౌన వ్రతాన్ని పాటిస్తూ, ఆహారం తినాలనుకుంటే మృధు స్వభావం కలిగిన దాన్ని ఒకపూట మాత్రమే తింటారు. నిరాహార దీక్ష అంటే ఏమీ తినకుండా కఠినమైన నియమ పాలనము, పవిత్రమైన నదులలో స్నానమాచరించటం, వీటన్నింటినీ మించి తరతరాలుగా వస్తున్న ఆచారాలను, సనాతన సంప్రదాయాలను ఆచరించి చూపించటం, వాటి పరిరక్షణ మొదలైన వాటిని ఎన్నింటినో ఈ చాతుర్మాస్య దీక్షలో భాగంగా అనుసరిస్తుంటారు. ఈ నాల్గు నెలల కాలం వీరు ఆచరించే కార్యక్రమాలన్నీ విష్ణువుకు ప్రీతి కలిగించటానికే అని అర్థం చేసుకోవచ్చు. ఈ దీక్షను ఆచరించే నాలుగు (4) నెలల కాలం అనగా ఆషాఢ మాసంలోని తొలి ఏకాదశి నుంచి కార్తీక మాసంలో వచ్చే మొదటి ఏకాదశి (మతత్రయ ఏకాదశి, బోధనైకాదశి) వరకూ ప్రతి ఏకాదశి రోజూ పూర్తిగా ఉపవాస దీక్షను చేస్తారు. ఈ నాలుగు (4) నెలలూ పూర్తిగా వర్షాకాలం. ఈ సమయంలో వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయి. వర్షాలకు పలురకాలైన క్రిమికీటకాదులు పుట్టుకొస్తాయి. త్రాగునీరు కలుషితంగా మారుతుంది, వీచే గాలిలో తేమశాతం ఎక్కువ ఉంటుంది గనుక, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, ఉదరకోశ సంబంధిత వ్యాధులు, జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశాలుంటాయి. ఇదే సమయంలో ఆచరించే చాతుర్మాస్య దీక్షలలోని

గూఢార్థం వీటి నుంచి, వీటి బారిన పడకుండా కూడా ఉండవచ్చు. హిందువులు ఏర్పరచుకొన్న పండుగలన్నింటి వెనుక ఆరోగ్య రక్షణ తద్వారా సమాజ శ్రేయస్సు దాగి ఉంటుంది. ప్రతి సంవత్సరం పాటించే ఈ చాతుర్మాస్య దీక్షల వలన, చేసిన వారికి ఉన్నతమైన ఫలితాలు కలుగుతాయనటంలో సందేహం లేదు. ఈ విధంగా నాలుగు (4) నెలలపాటు ఏమీ తీసుకోకుండా, నిరాహారులై చాతుర్మాస్య దీక్షను చేసినందువలన వచ్చే ప్రయోజనాన్ని, ఆ తల్లి శ్రీకాళీమాత తమ భక్తులకు అంతకు మించిన అద్భుత ప్రయోజనాలను శుభ ఫలితాలను (4) రోజుల్లోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

ఈ లోకంలో తెలివైన వారు తమ పనులు పూర్తి చేసుకోవటం కోసం, ఆ పనులు ఎవరి వలన నిరాటంకంగా అవుతాయో తెలుసుకొని, వారిని మెల్లగా పొగడటం ప్రారంభిస్తారు. నువ్వు అంతటి వాడివి, ఇంతటి వాడివి, నీవు తప్పితే ఈ పని ఎవరివల్లా కాదు, నీ దెబ్బకు తిరుగే లేదు, అంటూ సందర్భానుసారంగా ఎదుటి వారిని పొగుడుతుంటారు. దాంతో కాదు, అనుకున్న పని సానుకూలంగా అవుతుంది. ఒక విధంగా ఆలోచిస్తే ఇది ఒకరి తెలివీ కాదు, ఎదుటివారు మోసపోవటం అసలే కాదు. ఒక నిర్దిష్టమైన పనిని చేయగల సత్తా ఎదుటి వారిలో ఉన్నప్పుడు, నిద్రాణంగా ఉన్న ఆ శక్తిని తట్టి మేల్కొపడానికి, ఉత్తేజపరచటానికి చేసే ప్రయత్నమే ఇలాంటి పొగడ్తలు ఉంటాయి. పొగడ్తలకు, మెచ్చుకోలు మాటలకు లొంగని మానవులుండరేమో. దేవతలు కూడా పొగడ్తలకు మినహాయింపేమీ కాదు. దేవుణ్ణి, దేవతలను స్తోత్రాలు చేసి, వారి కిష్టమైన నైవేద్యాలను సమర్పించి తమ కోరికలను స్తోత్రాల రూపంలో దేవతలకు నివేదిస్తారు. లోకంలో ఉన్న దేవతలందరికీ విడివిడిగా, ప్రతి ఒక్కరికీ, పేరు పేరునా ఎన్నెన్నో స్తోత్రాలు, స్తోత్రరాజాలు ఉన్నాయి. ఎవరి అవసరాలను బట్టి, ఆకాంక్షలను బట్టి వారు దేవతలను స్తోత్రాలు చేస్తుంటారు. వాటినే పారాయణం చేస్తుంటారు. స్తోత్రాలలో మిళితమై ఉండే కొన్ని మంత్రాక్షరాల పారాయణం వలన శరీరానికి ఎంతో తేజస్సు కార్యసిద్ధులు కలుగుతాయి. నిరంతరం, సమస్త దేవతలకూ సంబంధించిన స్తోత్రాలను పారాయణం చేయటం వలన కలిగే ఫలితం మహా అద్భుతంగా ఉంటుంది. ఈ ఫలితాలు, ఆచరించే వారికి మాత్రమే తెలుస్తాయి. వీటికి సాక్ష్యాలు, ఋజువులు ఏమీ ఉండవు. ఆత్మ ఒక్కటే వీటికి సాక్షిగా నిలుస్తుంది. ఇలాంటి స్తోత్రాల పారాయణాన్ని ఆరు (6) సంవత్సరాల

పాటు చేయటం వలన సంప్రాప్తమయ్యే అత్యద్భుత ఫలితాల కన్నా ఇంకా ఎన్నో మహా అద్భుత ఫలితాలను, శ్రీకాళీమాత కేవలం ఒక్కవారం రోజులలోనే అనగా (7) రోజులలోనే తమను ఆరాధించే వారికి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

తరతరాల నుంచి, యుగయుగాల నుంచి ఈ భూమిమీద ఎంతోమంది పవిత్రమైన ఉత్తమమైన సిద్ధయోగులు, మహా తపస్వినులైన యోగినులు, పరమపూజ్యులై ఆరాధింపబడుతూ వస్తున్నారు. వారు లోకశ్రేయస్సును వాంఛించి, ఎన్నెన్నో కఠినాతికఠినమైన యోగ ప్రక్రియలను అనుసరిస్తూ సాధనలు చేసి, మహా సంకల్పాలను నిజం చేసుకున్నారు. అలాంటి వారు ఈ ఆధునిక కాలంలో కూడా లేకపోలేదు. సిద్ధ సాధకులు పూర్తిగా విచ్చుకున్న పరిమళ పుష్పం లాంటి వారు. చెట్టు అదే, మొగ్గ అదే, పువ్వు కూడా అదే. కాని, మొగ్గ తొడిగేది తొలి దశ. అప్పటికి అది సాధారణ మొగ్గే. సువాసన ఉండదు, పూరేకులు లోపల ముడుచుకొని ఉంటాయి. ఆ తరువాత మొగ్గ విచ్చుకుంటూ ఒక్కొక్క రేకూ కొంచెం కొంచెం కన్పిస్తూ ఉంటుంది. అప్పటికే, అరవిచ్చిన పూవు అందరినీ ఆకర్షించటం ప్రారంభిస్తుంది. పూర్తిగా విచ్చుకుంటే ఇంకా ఎంత అందంగా ఉంటుందోనని, ఆ మొగ్గను జాగ్రత్తగా గమనిస్తూ ఉంటారు. అప్పటికి కూడా ఎలాంటి పరిమళం రాదు. కాని ఒక్కోసారి పూర్తిగా విచ్చుకున్న తరువాత దానిలో అప్పటివరకూ దాగి ఉన్న పరిమళ శక్తి ఆ పరిసరాలకు విస్తరిస్తుంది. సాధకుల ప్రారంభ దశలు కూడా అలాగే ఉంటాయి. సాధన తీవ్రతరం అయ్యేకొద్దీ వారిలో దివ్యశక్తులు ప్రవేశించి, అందరినీ వారి వద్దకు చేర్చటం ప్రారంభిస్తాయి. వారి తేజస్సును చూడాలని కొందరు, వారు చేస్తున్న లీలలను, మాహాత్మ్యాలను దర్శించాలని మరికొందరు, వారిని పూజించుకొని కష్టాలను రూపుమాపుకోవటానికి, సమస్యలను తీర్చుకోవటానికి అంటూ భక్తజనులు రావటం ప్రారంభిస్తారు. పువ్వులో పరిమళం వలె, వారి శక్తి అందరినీ ఆకర్షిస్తుంది. సిద్ధయోగులు, యోగినులు ఉన్నంత కాలం వారి భజనలు, కార్యక్రమాలు చేయటం, వారు గతించిన తరువాత వారికి అతిగొప్పగా గుడులు, గోపురాలు, సమాధులు కట్టించి వారి పేరుమీద ఆధ్యాత్మిక సేవలు ప్రవచనాలు చేస్తుంటారు. ఇలాంటి వారి సమాధులు, గుడులు, బృందావనాలు మొదలైన వాటిని దర్శించుకోవటం వలన, వారు బ్రతికి ఉన్నప్పుడు ఎలాంటి జీవితాన్ని గడిపారు, ఎలాంటి సేవలను సమాజానికి అందించారు. వారు ఏర్పరచిన నియమాలు

మానవాళిపై ఎలాంటి శుభ పరిణామాలను కలిగించాయి, లాంటి అనేక విషయాలను తెలుసుకునే అవకాశం లభిస్తుంది. ఒక్కొక్క సిద్ధుని లేక వారి గుడులను, సమాధులను దర్శించుకోవటం వలన, ఆ సిద్ధుల ప్రభావానికి లోనై, దర్శించిన వారి మానసిక ప్రవృత్తిలో శుభపరిణామాలు తప్పక చోటు చేసుకుంటాయి. ఎక్కడెక్కడో తిరుగుతూ సిద్ధపురుషుల, సిద్ధ యోగినుల సమాధులను, గుడులను సందర్శించటం వెనుక అంతరార్థం అదే. ఇలా లోకమంతా తిరుగుతూ వారి వారి సమాధులను దర్శిస్తూ ఉండటం వలన లభించే శుభపరిణామాల కన్నా అధికమైన శుభ పరిణామాలను శ్రీకాళీమాత అమ్మవారు తనను ఒక్కసారి దర్శించి, నమస్కరించినంతనే ప్రసాదించేస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

ఈ లోకంలో పుట్టిన మరియు పుట్టబోయే ప్రతివారికీ, వారి పూర్వజన్మలలోని పాపపుణ్యాల సంకలనంతో మానవజన్మ సంప్రాప్తిస్తుంది. పాప పుణ్యాలన్నీ మానవ శరీరంతోపాటే ఉండి వారిని అనుసరిస్తూ, నీడలా వెంటాడుతుంటాయి. శరీరం వీటిని అనుభవించటానికి మాత్రమే, మాధ్యమమై ఉంటుంది. కష్టాల యొక్క బాధలూ, సుఖాల యొక్క సంతోషాలూ రెండూ, శరీరం మరియూ దాంతో కూడియున్న మనసు అనుభవిస్తూ ఉంటాయి. తీవ్రమైన బాధ మాత్రమే, మనసు యొక్క పొరల అంతరాళాలలోనికి వెళ్ళుతుంది. భరించలేని బాధ కలిగినప్పుడు మాత్రమే మానవులు రోదిస్తూ, ఏకాగ్ర చిత్తంతో "ఎందుకమ్మా నాకు ఇన్ని బాధలు" అనుకుంటారు. సంతోషంతో ఉన్నప్పుడు, ఆ సంతోషం తాకిడి అమ్మకు చేరదు. బాధలో ఉండి మనసులో కొలువై ఉండే (ప్రతివారి మనసులోనూ ఆ జగన్మాత కొలువై ఉంటుంది) ఆ తల్లిని 'అమ్మా ఏమిటి నాకీ బాధ' అని రోదించగానే ఆ తల్లి వెనువెంటనే వారికి ఉపశమనం కలిగిస్తుంది. ఆ దుఃఖాన్ని నీరులాగా కరిగించి వేసి, వారి కళ్ల వెంట బయటకు వెళ్లేటట్లు చేస్తుంది. క్షణాలలో అంతటి తీవ్రమైన బాధ కూడా కన్నీళ్లతో కరిగిపోతుంది. అంటే ఆర్తితో ఆ తల్లిని తలచుకొన్నా, ప్రార్థించినా, వేడుకొన్నా వెంటనే, స్పందించి ఆదుకొంటుంది. పూర్వజన్మ పుణ్యఫలితంగా ఇప్పుడు అనుభవిస్తున్న సుఖాలు కరిగిపోతాయి, పొంచి ఉన్న కష్టాలు మొదలౌతాయి. అందుచేత సుఖాలైనా, సంతోషాలైనా ఆ తల్లి శ్రీ జగన్మాత ప్రసాదించినవే కనుక ఆ తల్లిని ఎన్నటికీ మరువకూడదు. కష్టాలు, సుఖాలు అని బేధం లేకుండా ప్రతివారూ ప్రతినిత్యం ఆతల్లి శ్రీకాళీమాతను మనసులో స్మరించుకుంటూ ఉండటం వలన,

పూర్వజన్మల పాపపుణ్యాల ఫలితాలను అనుభవించటం కోసం మరలా మానవజన్మ ఎత్తకుండా చేస్తుంది శ్రీకాళీమాత, అంటూ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురు మహరాజ్ గారు పైశ్లోకంలో మానవ జన్మను గురించి, పాపపుణ్యాల విశ్లేషణను చక్కగా పొందుపరిచారు.

**శ్లో॥ అత్యద్భుతాసన పాణిపల్లవానేక ముద్రాచరణాధిక ఫలారోగ్యానంద ప్రదే!**
**నిత్యదుఃఖ కారణానేక కర్మరహిత పరమోత్కృష్టాద్భుత మహాస్థితి ప్రదాత్రి!**
**ఆజన్మాంతానాయాసావిఘ్నకృతాక్షయ యోగాధిక ఫలం దర్శనే నైవ ప్రదాయిని!**
**పంచయామార్చనే నైవ సకలధ్యానాతీతాద్భుత స్థితి ముముక్షుత్వ మహాసిద్ధిప్రదే! 12**

తా॥ సకల లోకాలకూ కన్నతల్లియైన జగజ్జనని శ్రీకాళీమాత ఈ భూమ్మీద ప్రాణులను సృష్టి చేసి, ముఖ్యంగా మానవులు నిండు నూరేళ్లు (పూర్వం ఇంకా ఎక్కువ కాలం ఆయుః ప్రమాణం ఉండి ఉండవచ్చు) పూర్తి ఆరోగ్యంగా జీవించటానికి అనువుగా ఉండే దేహాలను సృష్టి చేసినట్లు చెప్పుకోవచ్చు. నిరంతరం శరీరం ఆరోగ్యంగా నిలబడి ఉండటానికి అవసరమైన పరిజ్ఞానాన్ని కూడా వేదాలలో ఉపనిషత్తులలో పొందుపరిచారు అమ్మవారు. ఎలాగంటే ఒక కంపెనీ వారు ఒక వస్తువును తయారుచేసి మార్కెట్లోనికి విడుదల చేసేటప్పుడే, ఆ వస్తువును ఏ విధంగా వాడుకుంటే సాంకేతిక సమస్యలు ఉండవో తెలియజేసే చిన్న పుస్తకాన్ని కూడా ఆ వస్తువుతో పాటు ఇస్తారు. ఒకవేళ సరిగా వాడుకోవటం చేత కాక సమస్యలు తలెత్తితే, ఎలాంటి సమస్యకు ఎలాంటి మరమ్మత్తు చేసుకోవాలో ఆ పుస్తకంలోనే తెలియజేస్తారు. ఇలాంటి పద్ధతులు సృష్టిలోని విషయాల ఆధారంగానే మానవులు రూపొందించుకున్నారు. మానవ శరీర నిర్మాణం అత్యంత క్లిష్టమైనది. బిడ్డ, తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే, అనేక జాగ్రత్తలను తీసుకుంటుంటారు. తల్లి కాబోయే స్త్రీలు ఎలా నడుచుకోవాలి, ఏమి తినాలి, ఏమి మాట్లాడకూడదు, ఏమి చూడకూడదు, ఏ ఏ సమయాలలో బయటకు వెళ్లకూడదు అనే గొప్ప గొప్ప విషయాలు ఆచారపరంగా సంప్రదాయపరంగా తరతరాలుగా, అందరి ఆస్తిలాగా వస్తున్నాయి. అలాగే ఒకవేళ ఆహార పానాదులలో ఏదయినా లోపం జరిగి ఆ స్త్రీకి చెడు జరిగే సూచనలు కన్పిస్తే అందుకు తగిన విషయజ్ఞానం తెలిసినవారు దాదాపు ప్రతి ఇంట్లోనూ ఉంటారు. ఈ జ్ఞానమంతా వేదాల, ఉపనిషత్తుల సారాంశమే. అలాగే

బిడ్డలు పుట్టిన దగ్గర నుంచీ పెరిగి పెద్దవారై సమాజంలో ఒకరుగా బ్రతికేటప్పుడు కూడా తమ శరీర ఆరోగ్యాలను కాపాడుకోవటానికి నియమాలను, నిష్ఠలనూ కూడా వేదవేదాంగాల నుంచి విజ్ఞానాన్ని సేకరించి, ఆ విధానాలను ఆచరించటం వలన ఎప్పటికైనా సంపూర్ణమైన ఆరోగ్యం ఉంటుంది. కొన్ని అతిముఖ్యమైన, రోజువారీగా చేయవలసిన వ్యాయామాలను, శరీర భంగిమలను మన పూర్వికులు చేస్తూ వస్తున్నారు. శరీరంలోని బాహ్య అంతర్భాగాలలోని ముఖ్యమైన అవయవాలను ఉత్తేజపరచడానికి దేహాన్ని ఒక క్రమపద్ధతిలో వంచి, దాంతో పాటు చేతులను, చేతివ్రేళ్లను కూడా కొంతసేపు కదలకుండా ఉంచుతారు. ఆ సమయంలో ఊపిరిని ఎలా తీయాలి ఎలా బయటకు వదలాలి, ఎంతసేపు నియంత్రించాలి అనే విషయాలు గురుముఖంగా తెలుసుకోవాలి. ఇలా చేసే విధానాన్ని యోగాసనాలు అంటారు. ఈ సమయంలో శరీర అవయవాలకు ఎలాంటి తీవ్రమైన ఒత్తిడి తగులకుండా, అవి చెడిపోకుండా తగిన విధానాన్ని అనుసరిస్తారు. మానవ శరీరం పంచభూతాలైన గాలి, నీరు, అగ్ని, భూమి, ఆకాశంల యొక్క సమ్మేళనంగా చెపుతారు. మానవ దేహంలో వీటి నిష్పత్తి సరిగా ఉంచుకోవటానికే రెండు చేతుల వేళ్లను, ఒకదానితో వేరొక వేలును అనుసంధానం చేస్తూ ముద్రల రూపంలో కలిపి యోగం, ధ్యానం, ప్రాణాయామం మొదలైనవి ఆచరిస్తుంటారు. ఇలా చేయటం వలన శరీరం, ఎల్లప్పుడూ పూర్తి ఆరోగ్యంగాను, మనసు ఉల్లాసంగాను, ఎలాంటి వాతావరణాన్నయినా తట్టుకొని నిలబడగలిగే రోగనిరోధకంగాను ఉంటుంది. పూర్వ కాలంలో ఋషులు, యోగులు, సాధారణ మానవులు కూడా ఎలాంటి రోగాల బారిన పడేవారు కాదట. (ఒక ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపకల్పన చేసేటప్పుడు లేదా ఒక రాజు తన రాజ్యంలో ఒక విధానాన్ని అమలు చేస్తున్నప్పుడు అందరూ పాటించవలసిందే, లేకపోతే దండన తప్పదు. కాని ఆ చట్టం తయారుచేసేటప్పుడే, ఆ చట్టానికి ఎవరెవరు అతీతులో తెలియజేస్తారు. వారు ఆచట్టాన్ని పాటించకపోయినా పర్వాలేదు. రాజుగారికి ఒక నమస్కారం పెడితే చాలు. అన్నీ సర్దుకుంటాయి) అలాగే ఆతల్లి జగన్మాత శ్రీకాళీమాత మానవ సృష్టి చేసి, ఆ దేహం రోగాల బారిన పడకుండా పూర్తి ఆరోగ్యంగా ఉండటానికి పై విధంగా ఎన్నో నియమాలను, ఆచరణకు సాధ్యమయ్యే విధంగా రూపొందించారు. అవి పాటించని వారికి, వారి దేహం సరిగా సహకరించక రోగాల బారిన పడుతుంది. సంపూర్ణ ఆరోగ్యం కోసం

చేసే ఎన్నో ప్రయత్నాలు వేసే యోగాసనాలు, ధ్యానముద్రలు మొదలైన వాటి వలన లభించే ఆరోగ్యం కన్నా మిన్న యైన గొప్పదైన ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఆతల్లి శ్రీకాళీమాతను మనసులో నిలుపుకొని ధ్యానించినంతనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

తృప్తిలేని మానవ జీవితంలో అను నిత్యం బాధలను, దుఃఖాలనూ అనుభవిస్తూ ఉండవలసిందే. దుఃఖం, శోకం బాధలు అన్నీ పూర్వజన్మ ఫలితంగా వచ్చేవే అయినా, దాని మూలకారణం మనసు నుంచే ఉద్భవిస్తుంది. ఆ మనసు, ఆ వ్యక్తి యొక్క (చెప్పు చేతల్లో) అధీనంలో ఉంటుంది. ఒక గుఱ్ఱాన్ని తాడుతో కట్టి గుంజకు బంధించి ఉంచితే, మన ప్రమేయం లేకుండా అది ఎక్కడికీ తప్పించుకొని వెళ్లలేదు. తప్పించుకుందామని ప్రయత్నం చేస్తుంది, గింజుకుంటుంది, రంకెలు వేస్తుంది (గుర్రం సకిలిస్తుంది. కోపంలో వేసే కేకల్ని రంకెలు అంటారు) కొంచెం సేపు అలా చేసినా దాని బంధ విముక్తి కాకపోతే, ఎందుకు వచ్చిన శ్రమలే, ఎలాగూ ఈ బంధం సడలేది కాదు, తప్పించుకొనే వీలు లేదు అనుకుంటూ కదలక మెదలక ఉండిపోతుంది. కాని దానంతట అది బంధాన్ని వదిలించుకోగలిగి, పారిపోయే స్థితి వస్తే ఆ కోపంలో అన్నింటినీ ధ్వంసం చేసుకుంటూ, అడ్డం వచ్చిన వారిని గాయపరుస్తూ విచ్చలవిడిగా రెచ్చిపోతుంది. తరువాత దాన్ని అందరూ కలసి ఏదో విధంగా పట్టుకొని కట్టివేసి, దాని ఒంట్లో శక్తి తగ్గేవరకూ (మదం) హింసిస్తూనే ఉంటారు. అలాగే దుఃఖ కారణమయ్యే మనసులోని చెడు ఆలోచనలను, ఆ మనసులోనే బయటకు రాకుండా ఆపుకోగలగటం చేయగలిగితే, పూర్వజన్మ కర్మల వలన నిర్దిష్ట సమయాలలో ఏర్పడే బాధలను, దుఃఖాలను తగ్గించుకోవచ్చు అని భావించాలి. దీన్నే విజ్ఞత అని అనుకోవచ్చుని స్వీయ అభిప్రాయం. విజ్ఞతను పాటించటం అంత సులువేమీ కాదు. పూర్వకాలంలో చిన్నప్పటి నుంచీ పెద్ద, చిన్న, అభిమానం, గౌరవం లాంటి విషయాలను తల్లిదండ్రులు, గురువులు ప్రతి ఇంట్లోనూ, ప్రతి విద్యాలయంలోను, గురుకులాలలోనూ బోధించి వాటిని ఆచరణలో అనుసరింప జేసేవారు. అందువలన పెద్దలు కన్పిస్తే లేచి నిలబడి నమస్కరించే వారు. అందువలన పెద్దలకు ఆనందం కలిగేది, పిల్లలకు ఆశీర్వాదం లభించేది. అలా కాక పెద్దరికాన్ని, నువ్వు ఎవరి కంటే పెద్ద, మా నాన్నకంటే వయసులో పెద్దా, హోదాలో పెద్దా, డబ్బులో పెద్దా అంటూ నీకు నేను ఎందుకు నమస్కారం

పెట్టాలి, నువ్వే నాకు నమస్కారం పెట్టు అంటూ విచక్షణ లేని తర్కంలోనికి దిగటం వలన మనం ఎదుటి వారి వేదనకు కారకులం అవుతాము. ఆ వేదన తుదకు మనల్ని కూడా కాల్చివేయవచ్చు. బుద్ధి చంచలమైనది కావటమే అనర్థాలకు కారణం. ఆ బుద్ధిని, మనసును ఆధ్యాత్మికత అనే గుంజకు అనుసంధానం చేసి ఉంచుకోవాలి. మనసును నిరంతరం ఆ జగన్మాత శ్రీకాళీమాత మీద నిలిపి ఉంచితే ఎలాంటి పని చేస్తున్నా, ఆ తల్లి నన్ను గమనిస్తూనే ఉన్నది అనే భావన కలుగుతుంది. ఎలాంటి చెడుమాట కూడా నోటి నుంచి వెలువడకుండా ఆ తల్లి తగిన జ్ఞానాన్ని విచక్షణను పాటించటం అలవరుస్తుంది. అత్యంత దుఃఖ సమయాలలో కూడా దుఃఖాన్ని అదుపు చేసుకోగల అత్యంత ఉన్నతమైన అద్భుతమైన మంచి విజ్ఞాన స్థితిని, ఆతల్లి తనను నమ్మినవారికి, సాధకులకు ప్రదానం చేస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

కొంతమంది తమ జీవితాలను, ఉన్నతమైన ప్రమాణాలతో తీర్చిదిద్దుకోవాలని భావిస్తారు. జీవితం అనగా ఒక సాగరం లాంటిది కనుక, దానిలో ప్రయాణం చేస్తూ ఆవలి ఒడ్డుకు చేరటానికి సులువైన విధానాలను రూపొందించుకున్నట్లుగానే, జీవితంలో కూడా ఎలాంటి కష్టనష్టాలు లేకుండా అనాయాసంగా, జీవించి ఉన్నంత కాలం హాయిగా బ్రతకాలని భావిస్తారు. ఏ పని తలపెట్టినా, అందులో ఎక్కువ కష్టానికి తావు లేకుండా, ఎలాంటి విఘ్నాలు కలుగకుండా, సులువైన విధానాల ద్వారా ఆ పనులు విజయవంతం కావటానికి ఆ పనులను వారు ఒక దీక్షగా, యోగంగా భావించి, అందులో అక్షయమైన శుభ పరంపరలను అందుకోవాలని ఆకాంక్షిస్తారు. ఖచ్చితమైన ప్రమాణాలతో, చేస్తున్న పనిమీద, ఆచరిస్తున్న కార్యక్రమం మీద, పూర్తిగా మనసును కేంద్రీకరించి, ఆ పని పూర్తయ్యే వరకూ మనసును, దృష్టిని, ఏకాగ్ర చిత్తంతో నిలబెట్టటమే ఒక మహాయోగం. అందువలన అద్భుతమైన మంచి ఫలితాలు లభిస్తాయి. కాని జీవించి ఉన్నంతవరకూ ఆయాసం లేకుండా, ఆటంకాలు రాకుండా నిరంతరం యోగం చేస్తే వచ్చే ఫలితాల కన్నా అధికమైన శుభఫలితాలను ఆ తల్లి శ్రీకాళీమాత, తనను ఒక్కసారి దర్శించుకుంటేనే, వారికి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

జీవితం నీటిబుడగ లాంటిదని, దాని జీవితకాలం ఎంత ఉంటుందో ఎవరికీ తెలియదని దేవుడిచ్చిన ఆయుః ప్రమాణంలోనే జీవితాన్ని మంచి మార్గంవైపు మళ్లించాలని చాలామంది అనుకుంటారు. అందుకోసం అలాంటివారు లౌకికమైన

జీవితానికి దూరంగా ఉంటూ తమ దృష్టిని ఆధ్యాత్మిక మార్గంవైపు మళ్లిస్తారు. అందుకోసం ధ్యానాలు, యోగాలు చేస్తూ సమాధి స్థితిలోనికి వెళ్లాలని భావిస్తారు. ఈ స్థితులను దాటిన మునులు, ఋషులు, యోగులు మోక్షస్థితి కోసం ముముక్షువులై సాధన చేస్తుంటారు. మోక్షాన్ని కాంక్షించేవారు ఆ స్థితికి రావటం అత్యంత కఠినమైనది. ఈ విధంగా ధ్యానాతీతమైన స్థితిలోనికి వచ్చే సిద్ధులు, యోగులు, మునులు, ఋషులు ముముక్షువులనబడే మహాసిద్ధులౌతారు. ఎవరైనా ఇంతటి స్థితి సాధించాలంటే కొన్ని దశాబ్దాల కాలం పట్టవచ్చు. కాని జగజ్జనని యైన శ్రీకాళీమాత అమ్మవారు ముముక్షత్వ సిద్ధిని మించిన మహాసిద్ధిని, తురీయ స్థితిలోని ఆఖరి మెట్టుపై కూర్చోపెట్టగల మహా మహా సిద్ధిని (5) జాములలోనే అంటే (15) గంటలలోనే తనను మనోనేత్రంలో దర్శిస్తూ యోగం, ధ్యానం చేసిన వారికి కానుకగా ప్రసాదిస్తుంది. అనటంలో ఎలాంటి సందేహం లేదు, అలా చేయగలవారికి ఫలితం పైన చెప్పిన విధంగానే ఆతల్లి శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది అంటూ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో, ఆతల్లి యొక్క ఘనతను చాటి చెపుతున్నారు.

**శ్లో॥ పంచదశ వర్షానుష్ఠిత శ్వాసాగ్ర ధ్యాస దృష్ట్యధిక ఫల నిర్వికల్ప స్థితిప్రదే!**
**ఏకయామార్చనేన దశవర్ష చిన్ముద్రాసన ధ్యాన షట్చక్ర భేదనాధిక ఫలప్రదే!**
**బహువిధాక్షయానుభూతిప్రదానకారణాత్మ సాక్షాత్కారాధిక సుసిద్ధి ప్రదాత్రి!**
**ఆత్మదర్శనోన్నతాద్భుత స్థితి పత్నీసమేత త్రిమూర్తి ప్రత్యక్షదర్శన ప్రాప్తిప్రదే! 13**

తా॥ పదిహేను సంవత్సరాల కాలం పాటు శ్వాసపై ధ్యాస నిలిపి ధ్యానం చేయటం వలన లభించే సిద్ధికన్నా ఎక్కువగా సమాధి స్థితిని, నిర్వికల్ప స్థితిని, పదిహేను (15) రోజులలోనే ఆ తల్లి శ్రీకాళీమాత తనను నిష్ఠగా ధ్యానం చేసేవారికి ప్రసాదిస్తుంది. మానవ జీవితానికి 'శ్వాస' అనేది లేకపోతే బ్రతుకు లేనట్లే. ప్రతిజీవి, ఈ అనంత విశ్వంలోని ప్రాణవాయువును శరీరంలోనికి ముక్కు రంధ్రాల ద్వారా పీల్చుకుంటుంది. దీన్నే ఊపిరిగా చెప్పుకోవచ్చు. అన్ని జీవులకూ, జీవించటానికి ఆధారభూతమైనది గాలి మాత్రమే. జీవులు గాలిని పీల్చుకొనే విధానాన్ని శ్వాసించటం అనవచ్చు. అదే గాలి ముక్కుల ద్వారా శ్వాసావయవాలకు చేరితే దాన్ని ఊపిరిగా చెపుతారు. జీవులు తినే ఆహారం శరీరంలో చలనశక్తిగా మారటానికి కారణం,

శరీరంలోనికి పీల్చిన గాలి ఆ శక్తిని శరీరంలోని అణువణువులోనికీ సరఫరా కావటానికి సహాయపడుతుంది. మానవులలో పలువిధాలైన రుగ్మతలు, వ్యాధులు రావటానికి కారణం, శరీర భాగాలలోనికి ప్రాణశక్తి (గాలి) సరఫరా సరిగా జరుగక పోవటమేనని వైద్యులు చెపుతారు. అందుచేతనే శరీరంలోని అణువణువుకూ ప్రాణవాయువును చేరవేసే వ్యవస్థలోని ప్రధాన భాగమైన, రెండు శ్వాసావయవాలను అనగా ఊపిరితిత్తులను ఎల్లప్పుడూ ఆరోగ్యకరంగా ఉంచుకోవాలని చెపుతారు. ఈ ఊపిరితిత్తులనేవి 'స్థితిస్థాపక' శక్తి, అనగా సాగుతూ ముడుచుకునే విధంగా శక్తి కలిగి ఉంటాయి. ఒక బూరను నిండుగా ఊదితే దానిలో చాలా గాలి పడుతుంది. బూర నిండుగా చూడముచ్చటగా ఉంటుంది. అందులో కొంచెం గాలి తగ్గిస్తే, దాని ఆకారం కోల్పోతుంది. అలాగే ఊపిరితిత్తులు కూడా నిండుగా గాలి పీల్చుకుంటే, అది లోపల ప్రాణవాయువుగా మారి శరీరానికి నిండైన శక్తినిస్తుంది. అలా కాక ఊపిరితిత్తులకు గాలి పీల్చుకునే శక్తి లోపిస్తే, శరీరానికి అందవలసిన ప్రాణశక్తి సరిగా లభించనందున ప్రాణులలో, మానవులలో చైతన్యశక్తి తగ్గిపోతుంది. అందుచేతనే మన పూర్వీకులు, ఎలాంటి శాస్త్రపరిజ్ఞానం అభివృద్ధి చెందని రోజులలో కూడా, ఈ శ్వాస యొక్క ప్రాముఖ్యతను గుర్తించారు. శ్వాసను తీసుకునే విధానం, విడిచే విధానం, దాన్ని ఎలా నియంత్రిస్తే మానవ జీవితాలకు ఎక్కువ ఉపకారిగా ఉంటుందనే విషయాలను వివరాలను మానవాళికి, వారు ఆచరించి చూపించి అందించారు. ఈ ప్రక్రియలను యోగప్రక్రియలని అంటున్నారు. ఈ యోగ ప్రక్రియలోనే మరలా ప్రాణాయామం అనే విధానాన్ని, సంపూర్ణ ఆరోగ్యరక్షణ కోసం సాధన చేస్తున్నారు. చేసేది ఏ పని అయినా దానిపైన పూర్తి శ్రద్ధ. ఆ పని పూర్తయ్యే వరకూ రెండో ధ్యాస ఉండకూడదని చెప్తారు. రెండు ఆలోచనలతో ఒక పనిని ప్రారంభిస్తే ఏ పనీ పూర్తికాదు, పైగా పని చెడిపోతుంది. అలాగే ఈ ప్రాణాయామం ఆచరించేటప్పుడు కూడా, పీల్చే గాలి, వదిలే గాలి ఒక నిర్ణీతమైన వేగం ఉండేటట్లు క్రమబద్ధీకరించాలి. అలా క్రమబద్ధీకరించాలంటే, మనసంతా, ధ్యాసంతా శ్వాసపైనే ఉంచాలి. లేకపోతే ఆశించిన ఉత్తమ ఫలితాలు రాకపోగా విపత్తులు సంభవించే ప్రమాదం కూడా ఉంటుంది. శ్వాసపై ధ్యాసను నిలబెట్టి చేసే ప్రాణాయామం వలన శరీరం రోగరహితం అవుతుంది, మనసు ప్రశాంతతను పొందుతుంది, దేహం శక్తిమంతమై ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉంటుంది. ఈ విధంగా శ్వాసపై ధ్యాసను

నిలిపి, అను నిత్యం దీన్నొక దీక్షగా స్వీకరించి పదిహేను (15) సంవత్సరాలపాటు ఈ యోగాన్ని ఆచరించటం వలన మానవులకు చేకూరే శుభ ఫలితాలను మించిన అత్యధికంగా సమాధి స్థితులను, నిర్వికల్ప సిద్ధులను, శ్రీకాళీమాత, తమ భక్తులైన వారికి, తమను అత్యంత నిష్టతో ఆరాధించిన వారికి కేవలం పదిహేను (15) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

మానవ మేధస్సుకు అంతు చిక్కని రహస్యాలు, శాస్త్రవిజ్ఞానాలూ అంటూ ఏమి ఉండవేమో. ఎందుకంటే, తాము ఎక్కడికీ కదలకుండా కూర్చున్న చోటునుంచే, ఎవరి సహాయం లేకుండా, ఎలాంటి సాధన సంపత్తీ ఉపయోగించకుండా, ఎంతటి మహోన్నతమైన, కఠినతరమైన కార్యక్రమాన్నయినా విజయవంతంగా సాధించగలిగిన శక్తి మానవ శరీర అంతర్భాగంలోనే ఉన్నది కనుక. ఆ శక్తి ఎక్కడ ఉంది, దాన్ని ఎలా బయటకు రాబట్టి దేహంలో నిక్షిప్తం చేసుకోవాలి అనేదే 'జ్ఞానం'. దీనికి మాతృకేంద్రం 'మనసు'. ఈ మనసు సాక్షాత్తు జగన్మాతకు ప్రతిరూపంగా చెప్పుకోవచ్చు. ఎలాగంటే, జగన్మాతయైన శ్రీకాళీమాత, ఈ జగత్తులోని ప్రతి అణువులోనూ ఉంటుంది. సర్వత్రా వ్యాపించి ఉంటుంది. మనసు ప్రయాణం చేయలేని దూరం లేదు, ప్రవేశించలేని మార్గం, ప్రాంతం ఉండదు. తన ఆలోచనా మాత్రం చేతనే, మనసు సూర్యలోకం లోనికి ప్రవేశించగలదు, వెంటనే చంద్రలోకం లోనికి ప్రవేశించగలదు, ఇంకా ఎక్కడికైనా వెళ్లగలదు. తలచిన ప్రతిచోటకూ, ఏ భావంతో మనసు వెళ్లినా, శుభాశుభాలు భావాలకు అనుగుణంగానే ఉంటాయి. ఉదాహరణకు మన మనసు వేజెండ్ల కాళీ అమ్మవారిమీదకు లగ్నం అయితే శుభం కలుగుతుంది, లేదా చెడు కార్యకలాపాల వైపుకు మనసును మళ్లిస్తే మంచి జరగదు. కనుక ఆ జగన్మాత, మనస్సుకు అనుసంధానకర్తగా ఉంటుందని చెప్పుకోవచ్చు. మనసును తనమీదకు లగ్నం చేసినా సరే, వేరే చెడువైపు లగ్నం చేసినా సరే మనసు చెప్పినట్లే చేస్తుంది ఆతల్లి. మానవులు తనకోసం గుడులూ, గోపురాలూ, ఖండాంతరాలూ, ఖగోళ సముదాయాలూ తిరగలేరనో, లేక తిరిగే అవసరం రాకూడదనో, ప్రతి మానవునిలోనూ మేధస్సు స్థానంలో, మనసు అనే అత్యంత శక్తిమంతమైన, నిరాకార రూపమైన, శక్తిరూపంగా ప్రతిక్షిప్తమై ఉన్నారు. అందువల్లే నేమో పెద్దలు, దేహమే ఒక దేవాలయం అన్నారు. కనుక ప్రతి దేవాలయంలోనూ అమ్మవారు గాని స్వామివారు గాని గర్భాలయంలోనే ఉంటారు. వారి దర్శనం

కావాలంటే ఎవరైనా నడుచుకుంటూ వెళ్లాల్సిందే. అలాగే మానవ దేహంలో కొలువై ఉండే అమ్మవారిని దర్శించుకోవాలన్నా అదే పద్ధతి. అందుకోసం మానవులు ఆచరించే ముఖ్యమైన ప్రక్రియ 'చిన్ముద్ర' అనగా చిత్+ముద్ర = అని చెప్పుకోవచ్చు. మనసును అమ్మవారిలో లయం చేయటానికి అవసరమైన ధ్యానముద్ర. పద్మాసనం వేసుకొని రెండు చేతులకు ఉండే రెండు చూపుడు వేళ్లను, రెండు బొటనవ్రేళ్లకు తాకించి, అలాగే ఉంచి చేతులను చాపి మోకాళ్లపై ఉంచుకొని మనసును భ్రూమధ్యంలో కేంద్రీకరించి సాధన చెయ్యాలి. శక్తి ఎల్లప్పుడూ కదులుతూనే ఉంటుంది. ఈ చిన్ముద్రాసనంలోనే కూర్చొని సాధకులు తమ మనసును మూలాధార చక్రంపై కేంద్రీకరిస్తారు. సృష్టికి మూలం ఆ కేంద్రమే, మానవుల మనుగడకు ఆధారం కూడా ఆ ప్రాంతమే. మానవ శరీరంలో, వెన్నుపూసను ఆధారం చేసుకుంటూ ఏడు చక్రాలుంటాయని శాస్త్రం. అవి మూలాధారంలో ప్రారంభించి సహస్రారంతో అంతమౌతాయి. మనసును కేంద్రీకృతం చేస్తూ మూలాధార చక్రం నుంచి ప్రారంభించి, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రాలను స్పృశిస్తూ సహస్రారాన్ని చేరటమే షట్చక్ర భేదనగా చెప్పుకోవచ్చు. ఆ స్థానమే ఆత్మను పరమాత్మలో ఐక్యం చేసేది, మనోసిద్ధులను సాకారం చేయగల జగన్మాత నివాసం. దేవాలయంలోని గర్భగుడిలోని తల్లి పీఠస్థానం. మనసులోని ఆ తల్లిని దర్శించటానికి ఎంతో కఠిన సాధన చెయ్యాలి. ఎన్నో సంవత్సరాల కాలం పట్టవచ్చు. కాని జగన్మాతయైన శ్రీకాళీమాతను ఆరాధించే వారు, చిన్ముద్రాసనాలు వేయక పోయినా, షట్చక్ర భేదన యోగప్రక్రియ ఆచరించక పోయినా, ఆ తల్లి, తమ భక్తులు తమకు చేసే పూజలకూ, జప తపాదులకూ మిక్కిలిగా సంతోషించి పది (10) సంవత్సరాలపాటు చిన్ముద్రాసనం వేసుకొని ఆత్మను పరమాత్మలో లీనం చేస్తూ ధ్యానమాచరించటం వలన మరియు షట్చక్ర యోగసాధన చేయటం వలన సమకూరే శుభఫలితాలను మించిన శుభఫలితాలను ఒక జాముకాలంలోనే అంటే (3) గంటల వ్యవధిలోనే ప్రసాదిస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు అంటారు శ్రీగురుదేవులు.

మనిషి పుట్టిన దగ్గర నుంచీ ఆఖరిక్షణం వరకూ జీవుని ఆత్మ మానవ శరీరంలోనే ఉంటుంది. దేహంలో ఊపిరి ఉన్నంత వరకూ, జీవాత్మ తన కార్యకలాపాలను సాగిస్తూనే ఉంటుంది. నిర్దిష్టమైన రూపం ఏమీ లేనిది. తమలోని

ఆత్మను సాక్షాత్కారం చేసుకోవాలని, అది ఎలా ఉంటుందో చూసి తరించాలని చాలామంది అనుకుంటారు. అది అంత సులువైనది ఏమీ కాదు. అందుకోసం గురుముఖంగా యోగసాధన చేసి సమాధి స్థితిని పొందగలగాలని చెప్తారు. ఈ క్రమంలో సాధకులకు ఎన్నెన్నో అద్భుతమైన, చెరిగిపోని దివ్య అనుభూతులను పొందుతుంటారు. ఇలాంటి అనుభూతులను పొందగలగటానికి కారణం ఆత్మసాక్షాత్కారం కోసం తపించటమే. కాని శ్రీకాళీమాతను అను నిత్యం పూజించే వారికి ఆ తల్లి, ఆత్మసాక్షాత్కారం కోసం యోగం ఆచరించే క్రమంలో వారు పొందే దివ్యానుభూతులను మించిన అద్భుతమైన అనుభూతులను, ఆత్మసాక్షాత్కార సిద్ధిని అతిసులువుగా సంప్రాప్తింప చేస్తుంది.

ఆత్మను సాక్షాత్కరింప జేసుకోవటం ఎన్నో జన్మల గొప్ప పుణ్యఫలితం అని చెప్పుకోవచ్చు. దీని కోసం తీవ్రమైన యోగసాధన చేయవలసిన పనికూడా ఒక్కోసారి ఉండదు. సద్గురువు తన దివ్యశక్తి ద్వారా కూడా తమ శిష్యులకు వారి వారి ఆత్మలను సాక్షాత్కరింప చేయగలరు. ఇది నిజం, నా విషయంలోనే జరిగింది. సాధకుడు తనకు ఆత్మసాక్షాత్కారం కాగానే, ఇదే తాను చేరవలసిన గమ్యం అనుకొని సంబరపడిపోయి అంతటితో సాధనను ఆపివేయకూడదు. ఎందుకంటే తనను తాను అద్దంలో చూసుకున్నాడంతే. ఇప్పుడు సాధనను తీవ్రతరం చెయ్యాలి అంటారు శ్రీగురుదేవులు. ఎలాగంటే అద్భుతమైన అనుభూతుల దర్శనాన్ని దాటి దివ్యపురుషుల, దేవతల రూపాలను దర్శించగలగాలి. అదే సాధనకు పరాకాష్ఠ. అసలైన సిద్ధి అప్పుడు కలుగుతుంది. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వారు సతీసమేతంగా అనగా బ్రహ్మ సరస్వతి, లక్ష్మీ విష్ణువు, పార్వతీ పరమేశ్వరులు సాక్షాత్కరించే అత్యద్భుతమైన, అఖండమైన, ఎవరూ సాధించటానికి సాహసించని మహాసిద్ధి లభిస్తుంది. ఇలాంటి సిద్ధులను ప్రసాదించగలిగేది, సిద్ధులు పొందటానికి ప్రేరేపణ కలిగించేది ఆ జగన్మాత, కాలచక్ర స్వరూపిణియైన శ్రీకాళీమాత మాత్రమే అంటూ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, అత్యద్భుతమైన పరమాత్మ శక్తి అనబడే జీవాత్మ సాక్షాత్కారాన్ని అందుకు అవసరమైన, సిద్ధులను ప్రసాదించ గలిగేది శ్రీకాళీమాత అమ్మవారు మాత్రమే అనే, అనుభవపూర్వక సత్యాన్ని పై శ్లోకంలో అద్భుతంగా ఆవిష్కరించారు.

శ్లో॥ షట్ దినార్చనే నైవ షష్టివర్ష విష్ణు శివ సహస్రనామపారాయణఫలప్రదే!
పంచదినార్చనే నైవ వింశతివర్షభగవత్ప్రీతి గానాలాపనాధిక ఫలదాత్రి!
త్రిదినార్చనే నైవ షట్ షష్టికోటిహనుమాన్ చాలీసాధ్యయనాధిక ఫలప్రదే!
ద్విపక్షార్చనే నైవ సప్తసహస్ర జ్ఞానయజ్ఞ కృతాధికాఖండ విజ్ఞాన ప్రదాత్రి!14

తా॥ ప్రతి మతంలోనూ దేవుడు ఉన్నాడని విశ్వసిస్తారు. మానవజన్మ ఎత్తిన తరువాత, జీవితంలో ఒక్కసారయినా దైవాన్ని తలుచుకోకుండా ఉండనివారు ఎవరూ ఉండరేమో. హిందూ మతాన్ని విశ్వసించే వారు శివుణ్ణి, విష్ణువును స్మరించని వారుకూడా ఉండకపోవచ్చు. ఏదో ఒక మానవాతీతమైన శక్తి ఈ ప్రపంచాన్ని నడిపిస్తుందని, ఆ శక్తి పేరే శివుడని, విష్ణువు అని రకరకాల పేర్లు పెట్టుకొని కొలుచుకుంటుంటారు, పిలుచుకుంటుంటారు. వీరి నామాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ ఉండటం వలన మనుషుల్లో దుష్ప్రవర్తనాభావాలు తొలగిపోతాయి. కంటికి కనిపించిన ప్రతిదాన్నీ దైవస్వరూపంగా భావించాలనే సదుద్దేశంతోనే, పూర్వకాలం నుంచీ ఆ అలవాటు మానవుల్లో వేళ్లూనుకుపోయింది. అందుచేతనే తమ సంతానానికి దేవుళ్ల పేర్లు పెట్టుకోవటం ఆచారంగా వస్తూ ఉంది. తమ సంతానాన్ని శివయ్యా అనో కృష్ణయ్యా అనో పిలుచుకోవటంవలన దైవస్మరణ చేసినట్లుగా కూడా ఉంటుంది. అందుచేత వారికి జీవితాంతం దైవ నామస్మరణ చేసే భాగ్యం కలుగుతుందని చెప్పవచ్చు. దైవానికి ఒకే పేరు లేదు. కొన్ని వందల వేల నామాలున్నాయి. దైవం అన్ని నామాలు కలిగి ఉండటం సహజమే. ఎలాగంటే ఉదాహరణకు ఒక దేశాన్ని పరిపాలించే రాజు, రాజసభలో ఒక విధమైన వస్త్రధారణలో ఉంటాడు, అందులో రాజఠీవిదర్పం, అధికార గర్వం, ఇవన్నీ నిండుగా ఉంటాయి. అలాగే వేటకు బయల్దేరి క్రూరమృగాలను తరిమికొట్టే సందర్భంలో వేషధారణ వేరే విధంగా ఉంటుంది. పట్టుదల, క్రౌర్యం, వెంటాడి వేటాడాలనే ఉత్సాహం కన్పిస్తాయి. అదే యుద్ధానికి బయలుదేరిన రాజు వేషధారణ అత్యంత భయానకంగా ఉంటుంది. కరుణ కారుణ్యం అనేవి కన్పించవు. శత్రువును నిర్జించి దేశాన్ని, దేశప్రజలను కాపాడటమే ధ్యేయంగా ముందుకు సాగుతాడు. ఉన్నది ఒక్కడే రాజు, కాని అవసరాన్ని బట్టి సందర్భాన్ని బట్టి, వేషధారణ మారుతుంది, సంకల్పం మారుతుంది, ఆచరణ మారుతుంది. వాటిల్లో విజయాలు సాధించిన తరువాత, కదన సింహయ్య, వేటమార్తాండయ్య, దీనబంధు అంటూ రకరకాల పేర్లను అసలు పేరుకు తోడుగా

కలిపి చదువుతూ తమ అభిమానాన్ని చాటుకుంటారు. అలాగే ఇళ్లలో కూడా పిల్లలను ముద్దు చేసేటప్పుడు ఒక రకంగాను, చంటి, చిన్ని, బుజ్జి అంటూ రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. ఒకే మనిషిని సమయం, సందర్భాన్ని బట్టి ఇన్ని పేర్లతో పిలువగలుగు తున్నప్పుడు, సాక్షాత్తూ లోకపాలకులైన విష్ణువునకు, శివునకు అన్ని వందల వేల నామాలు ఉండటం అతిసహజం. అందుచేతనే మానవులు తమకు అనువైన నామాన్ని పూజిస్తూ, స్మరిస్తూ ఆ దేవుని రూపానికి వివిధ రకాలైన ఉపచారాలను ఆచరిస్తుంటారు. అలా చేయటం వలన వారికి మానసిక స్థైర్యం పెరుగుతుంది. నన్ను కాపాడటానికి దేవుడు ఉన్నాడు అనే ధైర్యం వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతుంది. వాటినే శుభఫలితాలు అనవచ్చునేమో. శివుని ఆలయానికో, విష్ణువు ఆలయానికో వెళ్లి పూజలు చేయించుకునేటప్పుడు, అక్కడ, అర్చకులు, స్వామివారి సహస్ర నామాలు చదివి అర్చనలు చేస్తుంటారు. ఆ సందర్భంలో స్వామివారికుండే నామాలన్నింటినీ వినే అదృష్టం కలుగుతుంది. ఆ ఒక్కొక్క నామానికి ఒక్కో విధమైన అద్భుతశక్తి ఉంటుంది. ఒక్క నామాన్ని స్మరిస్తేనే అంతటి శక్తి మనకు సంప్రాప్తిస్తే, వేయి నామాలను అనగా సహస్ర నామాలను పారాయణం చేయటం వలన అద్భుతశక్తి, పుణ్యం లభిస్తుంది. విష్ణువు యొక్క, శివుని యొక్క సహస్రనామ పారాయణాలను నిరంతరం, ప్రతిరోజూ అరవై (60) సంవత్సరాల పాటు చేయటం వలన లభించే శుభఫలితాలు, పుణ్యఫలితాలు ఎంత అద్భుతంగా ఉంటాయో ఎవరూ చెప్పనలవి కాదు. అవి పొందిన వారికి మాత్రమే తెలుస్తాయి. కాని, ఇంతటి శుభఫలితాలు, పుణ్యఫలితాల కంటే అత్యధికమైన గొప్ప శుభ ఫలితాలను శ్రీకాళీమాత తమ భక్తులైన వారికి, ఆరు (6) రోజులలోనే తనను అర్చించినంత మాత్రం చేతనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

గమ్యాన్ని చేరటానికి వివిధ రకాలైన మార్గాలు ఉన్నట్లే, భగవంతుని ఆరాధించే విధానాలు కూడా పలువిధాలుగా ఉంటాయి. ఎవరి అనుకూలతలను, సానుకూల్యతలను బట్టి వారు, అర్చన, ప్రార్థన, భజన, సంకీర్తన, జపము, ధ్యానయోగాల వంటి పలువిధాలైన పద్ధతులలో దైవాన్ని కొలుస్తూ ఉంటారు. ఇది శాస్త్ర సమ్మతమే. ఎందుకంటే ఎవరి ప్రయత్నమైనా గమ్యం ఒక్కటే, దైవసాన్నిధ్యం చేరటం కొంతమంది ఒక్కరే ఇంట్లో ఓ మూల కూర్చొని, ప్రశాంతంగా ఉంటుందని ఎవరికీ కన్పించకుండా జపమో ధ్యానమో చేస్తుంటారు, మరోచోట ఇంటిల్లిపాదీ

కూర్చొని పూజలు నిర్వహిస్తుంటారు. మరికొంతమంది ఒకచోట చేరి భగవన్నామాన్ని స్మరించుకుంటూ భజనలు చేస్తుంటారు, పాటలు పాడుతుంటారు. ఇలా భజనలు చేసుకుంటూ, సామూహికంగా భగవంతుని నామాలను పాటల రూపంలో పాడటం వలన, చేసేవారికి మనసు ఉల్లాసభరితం అవుతుంది. వారి శరీరంలోని భాగాలన్నీ ఒకే సమయంలో, ఒక నిర్ణీతమైన శ్రుతిలో కదులుతూ ఉండటం వలన, శారీరక శక్తి ఇనుమడిస్తుంది, మంచి ఆరోగ్యం లభిస్తుంది, అందరితో సత్సంబంధాలు నెలకొంటాయి. సామూహికమైన ఉత్సాహం వలన కొన్ని మంచి కార్యక్రమాలు ఆచరించే ఆలోచనలు ఉద్భవిస్తాయి. అందువలన సమాజహితం చేకూరుతుంది. ఇవన్నీ, భగవంతుని ప్రీతి చెందించి, తద్వారా తాము అనుకున్న కోరికలను, భగవంతుని ద్వారా పొందటానికి చేసేవే. భగవంతుని ఆకాంక్ష కూడా లోకంలో శాంతి సౌభాగ్యాలను నెలకొల్పటమే అని భావించవచ్చు. మనం భగవంతుని పేరుతో చేసే సేవా కార్యక్రమాల వలన, ప్రజలకు సుఖశాంతులు లభిస్తుంటే, మన సేవలు మన్నించి భగవంతుడు మనకిచ్చే ప్రతిఫలం, 'అందరి సుఖశాంతులు'గానే భావించాలి. ఈ విధంగా ఇరవై (20) సంవత్సరాలపాటు, నిత్యం దేవుని ప్రీతికోసం చేసే భజనలు, పాటలు, ఆలాపనల వలన లభించే శుభఫలితాల కన్నా అత్యధికమైన అద్భుతమైన శుభకరమైన ఫలితాలను కేవలం ఐదు (5) రోజులలోనే, తన్ను గురించి భజనలు చేస్తూ గానాలాపనలు చేసే తమ భక్తులకు శ్రీకాళీమాత అమ్మవారు ప్రసాదిస్తుంది. ఇది నిస్సందేహం అంటారు శ్రీగురుదేవులు.

హనుమంతుడు, రామాయణంలో శ్రీరామునికి నమ్మిన బంటు. మహాబల వంతుడు, సాక్షాత్తూ రుద్రుని అంశతో జన్మించాడని అంటారు. హనుమంతుడు అంటే భక్తికి, శక్తికి, మానవత్వానికి మరియు క్రమశిక్షణకు మారు పేరుగా నిలుస్తాడు. బాల్యం నుంచే ఈయన అనేక ఘనకార్యాలను చేశాడని పురాణ కథనాలు ఉన్నాయి. బాల్యంలో ఉదయిస్తున్న సూర్యుణ్ణి చూసి పండు అని భ్రమించి మింగబోయాడట. సూర్యుని వేడిమి తట్టుకోలేక నోరు కాలిపోయి మూతి ఆకారం అలా వచ్చిందని చెప్తారు. ఒక సందర్భంలో ఇంద్రుడు ఆంజనేయుని తన వజ్రాయుధంతో కొట్టగా, ఆంజనేయుని దౌడ దెబ్బ తిని క్రింద పడిపోయాడు. అది గమనించిన ఆంజనేయుని తండ్రియైన వాయుదేవుడు, తన బిడ్డకు అపకారం జరిగిందని భావించి అలిగి కూర్చుండగా లోకాలన్నీ గాలి స్థంభించి పోయి దేవతలతో సహా అందరూ విలవిల్లాడి

పోసాగారు. యముడు, కుబేరుడు మొదలైనదిక్పాలకులు వాయుదేవుని వద్దకు వచ్చి ప్రార్థించి, ఆంజనేయునికి వరాలను ప్రసాదించారు. దౌడకు దెబ్బ తగిలింది కనుక అప్పటి నుంచీ ఆంజనేయుడు హనుమంతుడయ్యాడు. దేవతలిచ్చిన వరప్రభావం చేత హనుమంతుడు అమితమైన బలవంతుడయ్యాడు. అవసరానికి అనుకూలంగా తన శరీరాన్ని చీమ పరిమాణం నుంచి ఆకాశమే హద్దుగా పెంచుకో గల శక్తి ఆయనకున్నది. బ్రహ్మాస్త్రం సైతం హనుమంతుని ఏమీ చేయజాలదని బ్రహ్మ వరమిచ్చాడు. వాయువుతో సమానమైన వేగంతో ఆకాశంలో ప్రయాణం చేయగలడు. ఆయనను నిర్జించగలవారు ఎవ్వరూ లేరు. ఆయన చిరంజీవిగా వరాలు పొందాడు. కాని చిన్నతనంలో ఋషులు ఆయనకు వరంలాంటి శాపాన్నిచ్చారు. అదేమంటే తన శక్తి తాను తెలుసుకోలేడు. ఎవరైనా తన శక్తిని గురించి చెపితే, తనలోని శక్తిని గుర్తించి కార్యోన్ముఖుడు అవుతాడు. ఎల్లప్పుడూ శ్రీరామ నామ జపంలోనే ఉంటాడు. శ్రీరామునికి ఎంతటి వీరభక్తుడంటే, తనను పూజించే వారి కన్నా, శ్రీరాముని పూజ చేసేవారికే ఎక్కువ సేవలు చేస్తాడని చెప్తారు. అంటే తనలో ఏమీలేదు, అంతా శ్రీరామచంద్రునిలోనే ఉన్నది అని ఆయన భావం కావచ్చు. హనుమంతుని లీలలను రామాయణంలో ఆయన చేసిన ఘనకార్యాలనూ భక్తులు హనుమాన్ చాలీసా రూపంలో పారాయణలు చేస్తుంటారు. ఆయన శక్తి ఎంతటిదో చాలీసా రూపంలో స్మరిస్తూ, ప్రార్థిస్తుంటారు. అందువలన హనుమంతుడు తనను, చాలీసా (చాలీసా అనగా (40) ముఖ్యఘట్టాలు) రూపంలో స్తుతించిన వారికి అంతులేని సంపదలు, మంచి బుద్ధి, నిర్భయత్వం మొదలైన వానినిస్తాడు. మరియు గ్రహపీడలు, బాధలు దరికి రాకుండా చేస్తాడని నమ్ముతారు. అరువది ఆరు కోట్ల (66 కోట్ల)సార్లు హనుమాన్ చాలీసాను పారాయణం చేయటం వలన సంప్రాప్తించే పైన చెప్పిన శుభఫలితాలను మించి అత్యధికమైన అమేయమైన శుభఫలితాల పరంపరను శ్రీకాళీమాత అమ్మవారు, మూడే మూడు (3) రోజులలో తమ భక్తులైన వారికి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

లోకంలో జ్ఞానాన్ని విస్తృతంగా అందరికీ అందించాలనే దృక్పథంతో చాలామంది పండితులు, యోగులు, ఋషులు పీఠాధిపతులు ఎవరైనా వివిధ పద్ధతులను అవలంబిస్తుంటారు. జ్ఞానం అంటే అధ్యాత్మిక జ్ఞానం కావచ్చు, వేదవేదాంగాల గురించి ప్రస్తావనలు కావచ్చు, అవి మానవ జీవితాలను మంచి

మార్గం వైపు ప్రభావితులనుగా చేయటానికి, ముఖ్యంగా ప్రవచనాల రూపంలో కార్యక్రమాలను రూపొందిస్తుంటారు. ఒక్కొక్క ప్రాంతంలో కొన్ని రోజులపాటు సప్తాహాలను నిర్వహిస్తుంటారు. అందువలన ఎక్కువమంది ప్రజలు ఆ ప్రవచనాలను వినటానికి అవకాశం కలుగుతుంది. ఇలాంటి కార్యక్రమాల వలన ప్రజలలో చైతన్యం కలుగుతుంది, భక్తి భావం వృద్ధి అవుతుంది. అందరిలోనూ సమభావం వెల్లివిరుస్తుంది. ఇలాంటి కార్యక్రమాలను ఒక యజ్ఞంలాగా నిర్వహించటం వలన వీటిని జ్ఞానయజ్ఞాలు అని చెప్పుకోవచ్చు. ఈ జ్ఞాన యజ్ఞాలవలన ఎన్నో శుభాలు కలుగుతాయి. ఏడువేల (7 వేలు) జ్ఞాన యజ్ఞాలను నిర్వహించటం వలన సంప్రాప్తమయ్యే శుభఫలితాల కన్నా అత్యధికమైన శుభఫలితాలను, ఎక్కువ జ్ఞానాన్ని, ఎక్కువ తెలివిని, విజ్ఞతను కేవలం రెండు (2) పక్షాల కాలంలోనే అనగా ఒక్క (1) నెలలోనే శ్రీకాళీమాత అమ్మవారు తన గురించి ప్రవచించే భక్తులకు, తనను అమితంగా ఆరాధించే వారికి ప్రసాదిస్తారని పై శ్లోకంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు అద్భుతంగా, శ్రీకాళీమాత అమ్మవారి యొక్క ఘనతను తెలియచేశారు.

**శ్లో॥ సాధకోత్తమజనాభీష్ట సిద్ధికారణ ధ్యానయోగకాలాక్షయ శక్తిప్రదాత్రి! శ్రీకాళి!**
**అల్పబుధ్యనాలోచన హింసానేకదుర్ వాంఛా నిర్మూలనాధ్యాత్మిక జ్ఞానాయుధ ప్రదే!**
**సర్వభూతహితాక్షయవాత్సల్యాభివృద్ధి కారణానేక దివ్యాలోచన ప్రదే ! కాళి!**
**ఆచంద్రార్కాధ్యాత్మిక మార్గాంతరాద్భుత ప్రత్యక్షానేకాక్షయనూతనానుభవప్రదే!15**

తా॥ యోగసాధన చేసే ప్రతివారూ ఏదో ఒక కాంక్షను మనసుల్లో ఉంచుకొని దాన్ని పొందటం కోసం సాధన చేస్తుంటారు. దీన్నే సంకల్పం అంటారు. లోకంలో కొన్ని వ్యవహారాలు గాని, పనులు గాని, ఆర్థిక బలం, అంగబలం ఉన్నప్పటికీ సానుకూలం కావు. ఏదో అడ్డం పడుతున్నట్లుగా అన్పిస్తుంది గాని అదేదో తెలియదు. అలాంటి సమయాల్లో మానవాతీత శక్తులను, అవి తెలిసిన వ్యక్తులను ఆశ్రయిస్తుంటారు. మానవాతీత శక్తుల తోడ్పాటుతో పనులు అవుతాయా లేదా అనేది వేరే విషయం. కర్మభూమి, వేదభూమి అయిన హిందూ దేశంలో అనాదిగా వస్తున్నది గురుపరంపర. ఒక సద్గురువుగా గౌరవం పొందాలంటే అన్ని శాస్త్రాలనూ కూలంకషంగా ఆకళింపు చేసుకుని ఉండాలి, ఎలాంటి సమస్యలనైనా తీర్చగలిగే

నేర్పు కావాలి. మహోన్నతమైన విద్య, వేదవేదాంగాల పఠనం, శాస్త్ర పరిజ్ఞానం, లౌకిక ప్రపంచం పైన అవగాహన ఇవన్నీ అవసరమౌతాయి. అప్పుడే సద్గురు స్థానానికి కావలసిన అర్హతలు పొందగలుగుతారు. కాని, మహాత్ములై, కారణ జన్ములైన కొందరు పై అర్హతలను ఏమీ సాధించకుండానే ప్రఖ్యాతి చెందిన సద్గురు స్థానాలలో వెలుగొందుతున్నారు. అందుకు కారణం యోగసాధన. కోరికలతో చేసే యోగసాధన కొంతవరకు మాత్రమే ఫలితాలనిస్తుంది. ధనం కావాలని, వివాహం కావాలని, ఉన్నత విద్యలు చదవాలని, ఉద్యోగాలు రావాలని ఏ కోరికను ఆశించి యోగమాచరిస్తే ఆ ఫలితమే దక్కే అవకాశం ఉంటుంది. దేవుడి కోసమైనా, దేవత కోసమైనా తపస్సు చేస్తే, వారు ప్రత్యక్షమై 'తథాస్తు' అంటారు. అనగా భక్తుడు అడిగే ఆ ఒక్క కోరికే తీరుతుంది. గాల్లో ప్రయాణించాలనుకుంటే అదే జరుగుతుంది గాని నీటిమీద నడవలేరు. అలాగన్న మాట. ఆ విధంగా కాకుండా, మనసులో ఏ కోరికలూ లేకుండా, దృష్టిని అంతర నేత్రంపై నిలిపి, తమ ఆరాధ్య దేవతను దర్శిస్తూ చేసే యోగం ఎంతో అద్భుతమైనది. మోక్షం కోసం, పునర్జన్మ రాహిత్యం కోసం, లోకంలో శాంతి సౌఖ్యాలు అభివృద్ధి చెందటం వంటి వాటికోసం చేసే యోగసాధనలు ఉత్తమమైనవి. ఇలాంటి యోగసాధకులకు శ్రీకాళీమాత అమ్మవారు అమోఘమైన శక్తిని, అత్యుత్తమ ఫలితాలను ప్రసాదిస్తారు. సాధకులు యోగాన్ని ప్రారంభించినప్పుడు కొంచెం సేపయినా స్థిమితంగా కూర్చోవటం కష్టం అవుతుంది. ఏకాగ్రత కుదరదు. ఆసనం వేసుకొని కూర్చుంటే ఎక్కువ సేపు అదే స్థితిలో కూర్చోవటానికి ఇబ్బందిగా ఉంటుంది. కాళ్లు చేతులు, నడుం అన్నీ నొప్పి పెడుతుంటాయి. యోగం అంటే ఇన్ని కష్టాలు, ఇబ్బందులు ఉన్నాయా, నేను ఇలా ఐతే యోగానికి పనికి వస్తానో లేనో అంటూ మనసులో పరిపరివిధాలుగా ఆలోచిస్తుంటారు. ఇలాంటి స్థితిలో శ్రీకాళీమాత అమ్మవారు వారికి తగిన శక్తిని ఏకాగ్రతను కల్పిస్తారు. యోగం ప్రారంభించటానికి వెలుసుబాటు కలిగిన తరువాత వారు ఏ విధంగా ముందుకు వెళ్లాలి ఏమిటి అనే విషయాలను ఆ తల్లే పర్యవేక్షిస్తుంది. యోగం చేసేవారు ఒక్కోసారి రోజుల తరబడి అదే స్థితిలో ఉండిపోతారు. కాని వారికి ఆకలి, దప్పిక అనేవి ఏమీ తెలియకుండా ఉండే శక్తిని శ్రీకాళీమాత అమ్మవారే ప్రసాదిస్తారు. ఎలాంటి అడ్డంకులూ రాకుండా సాధకులకు ఉత్తమమైన యోగమార్గాన్ని సూచిస్తుంది ఆ తల్లి. సాధకుల మనసుల్లో ఏ కోరికలూ లేవు కనుక, వారికి ఏ క్షణాన ఏది

అవసరమవుతుందో గమనిస్తూ అన్నీ ఆతల్లే తీరుస్తుంది. అంటే ఆ తల్లిని ఏది కోరితే అదే ఇస్తుంది, ఏమీ కోరక ఆతల్లిని ఆశ్రయిస్తే సమస్తమూ ప్రసాదిస్తుందనేది దీని భావం. అత్యుత్తములైన సాధకులు మాత్రమే ఉత్తమమైన కోరికలతో యోగసాధనలో అత్యున్నత శిఖరాలకు వెళ్లగలుగుతారు. అందుకు శ్రీకాళీమాత అమ్మవారు, అలాంటి వారికి ధ్యానం, యోగం చేసే కాలంలో అక్షయమైన, అద్భుతమైన శక్తులను ప్రసాదిస్తారు.

మానవుల బుద్ధులు ఒకే విధంగా ఉండవు. కొందరు మంచి బుద్ధులను అలవాటు చేసుకుంటారు. మరి కొంతమంది చెడును ఆశ్రయించి జీవిస్తుంటారు. ఈ లక్షణాలు ఒక్కసారిగా మనిషిలో ప్రవేశించేయి కావు. బాల్యం నుంచీ మనిషి ఎదుగుదలతో పాటు అవి కూడా వృద్ధి చెందుతూ ఉంటాయి. ముఖ్యంగా బాల్యంలో తల్లిదండ్రుల ఆలోచనా విధానాలకు అనుగుణంగా పిల్లల బుద్ధులు రూపుదిద్దుకొంటాయి. పెరిగే కొద్దీ పరిసరాల ప్రభావం, తోటి పిల్లల స్నేహప్రభావం, వారి ప్రవర్తన లాంటి ఎన్నో విషయాలు, బుద్ధి వికాసానికి తోడ్పడతాయి. కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలకు సరైన మంచి పద్ధతులు నేర్పకపోయినా, ఆ పిల్లలు పెరిగి పెద్దవారయిన తరువాత మంచి నడవడికతో గుణవంతులు కావచ్చు, అలాగే బాల్యం నుంచీ మంచి ప్రవర్తన, నడవడిక, సద్బుద్ధులను నేర్పుతూ పిల్లలను పెద్ద చేసినా, ఆ పిల్లలు, ఆ తరువాత దుర్మార్గంగా ప్రవర్తించే అవకాశం లేదని ఎవరూ చెప్పలేరు. సమాజంలో ఎలాంటి గుర్తింపు, ఏ మాత్రం పేరు ప్రఖ్యాతలు లేకుండా, ఫలానా వాళ్లు ఈ ఊర్లోనే ఉంటారు అనే విషయం కూడా ఎవరికీ తెలియని వారి బిడ్డలు కూడా ఒక్కోసారి అతి ఉన్నతమైన స్థానాలను పొందగలుగుతారు. అందుకు కారణం వారిపైన ఎవరి ప్రభావాలూ పడక పోవటమే. ఇందుకు విరుద్ధంగా అన్నీ ఉండి, గొప్ప ఖ్యాతి సంపాదించి ఉన్నత స్థితులలో ఉన్న వారి పిల్లల్లో కూడా కొందరు ఎందుకూ కొరగాక అసాంఘిక కార్యక్రమాలకు లోనైనప్పుడు, అందరూ ఛీ కొట్టటం మనం చూస్తూనే ఉంటాము. తమను తాము ఏ విధంగా ఉన్నతంగా ఆలోచించుకుంటారో అలాగే ఇతరులను గూర్చి కూడా అలాగే ఆలోచించగలిగే బుద్ధిని అలవరుచుకోవాలి. కొంతమంది ఆలోచనా విధానాలు సరిగా లేక, అన్నీ ఉన్నా ఇతరులను హింసిస్తూ ఉంటారు. అందుకు కారణం సరదా కావచ్చు. డబ్బు కోసం కావచ్చు, తాత్కాలిక మానసిక ఆనందం కావచ్చు. ఇలాంటి వారు దుష్ట

ఆలోచనలతో అరాచకాలను చేస్తూ ఏమయినా సాధించవచ్చు అని భావిస్తారు, తమ తుచ్ఛమైన కోరికలను తీర్చుకోవటం కోసం ఎలాంటి దుర్మార్గాలకయినా వెనుకాడరు. పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకలతో గాని పోవు అంటారు. దుర్మార్గులను మార్చి సన్మార్గులుగా చేయటానికి, హింసా ప్రవృత్తిలో బ్రతికే వారిని అహింసావాదులుగా మార్చటానికి లోకంలో ఎలాంటి మందులూ లేకపోవచ్చు. కాని, ఇలాంటి వారికి ఆధ్యాత్మిక మార్గమే శరణ్యం. ఇలాంటి, అల్పబుద్ధులు కలిగి, హింసా మార్గాలను ఎంచుకొని, దుర్ వ్యసనాలకు వశులై బాధ్యతా రహితంగా జీవితాలను గడిపేవారు, శ్రీకాళీమాత అమ్మవారి చెంతకు చేరి ఆ తల్లిని నిత్యం పూజిస్తూ, నిరంతరం మనసులో ఆ తల్లి రూపాన్ని దర్శించుకుంటూ ఉండే వారిలోని దుర్గుణాలన్నింటినీ పారద్రోలి, వారికి నిజమైన ఆధ్యాత్మిక జ్ఞానమనే ఆయుధాన్ని ప్రదానం చేస్తుంది, ఆ తల్లి శ్రీకాళీమాత.

భూగోళం పైన నివసించే ప్రాణులన్నింటిలోనికీ మానవులు తెలివైన వారు. అందుకు కారణం వారికి పంచేంద్రియ జ్ఞానం ఉన్నది. తరతమ బేధాలను గుర్తించగలుగుతారు. మానవుడు స్వేచ్ఛాజీవి కాకపోయినా, మిగతా ప్రాణులైన జలచరాలు, పక్షులూ, గ్రామాలలో తిరిగే వీధి జంతువులన్నీ స్వేచ్ఛగా బ్రతుకుతుంటాయి. మానవుల హింసాప్రవృత్తి వీటి దగ్గర నుంచే ప్రారంభం అవుతుంది. వాకిట్లోకి కుక్క వచ్చిందని దాన్ని కర్రతో బాదుతాం, ఇంట్లోకి పిల్లి దూరి పాలు తాగిందని దాన్ని వెంటాడి కొడతాం. వాకిట్లోనికి కుక్క రాకుండా చేసుకోలేకపోవటం మనదే తప్పు, ఇంట్లోకి పిల్లి రాకుండా తలుపు వేసుకోక పోవటం మనదే తప్పు. తప్పు మనదైనా కోపం వాటిమీద, శిక్ష కూడా వాటికే. ఆకాశంలో పక్షి ఎగురుతుంటే, సరదాగా ఉండేలు బద్దతో కొడతాం. ఆ దెబ్బతో అది విలవిల్లాడుతూ క్రింద పడిపోతుంది. ఇదే మనకు తెలియని మనలో ఉండే క్రూరత్వపు కోణం. అలా కాక కొంచెం శాంతంగా ఆలోచించి ఇంటి ఆవరణలోనికి వచ్చిన పక్షులకో, జంతువులకో కొంచెం ఆహారం పెట్టగలిగితే, అవి దొంగతనంగా ఇంట్లోకి ప్రవేశించే పరిస్థితి రాదు పైగా వాటికి ఆహారం పెట్టిన పుణ్యఫలితం దక్కుతుంది. అవి మనల్ని ఎప్పటికైనా విశ్వాసంతోనే గమనిస్తుంటాయి. జంతు ప్రేమంటే ఇదే. ఈ విషయాలు అనుభవంలో ఉన్న వారికి, అలా జంతువులతో, పక్షులతో సాన్నిహిత్యంగా ఉండటం ఎంతో ఆనందాన్ని సంతోషాన్ని కలిగిస్తుంది. అసలు

ప్రేమ అనేదే ఆనందానికి సంకేతం. మానవ సంబంధాలలో ప్రేమ కోరికలను కలిగి ఉండవచ్చునేమో గాని, పశుపక్ష్యాదులందు ప్రేమ కలిగి ఉండటం ఎంతో గొప్ప విషయం. అలాకాక లోకంలోని సకల ప్రాణుల యందు అలౌకికమైన ప్రేమ వాత్సల్యం సమాన భావం కలిగి ఉన్నవారు దైవస్వరూపులుగా కీర్తింపబడతారు. శ్రీకాళీమాత అమ్మవారిని పూజించే వారికి ఆ తల్లి, సర్వప్రాణుల యందూ ప్రేమను, వాత్సల్యాన్ని కురిపించగల అద్భుతమైన మంచి ఆలోచనలను కలిగిస్తారు.

శ్రీకాళీమాతను నిత్యం పూజించి, అర్చించే వారికి, వారు జీవించినంత కాలం మరియు మరణించిన తరువాత కూడా సూర్యచంద్రులు ఉన్నంత కాలం, ఆధ్యాత్మిక మార్గంలోని అద్భుతమైన, విచిత్రమైన, అనుభూతులను అనుభవాలను ప్రసాదిస్తారు ఆ తల్లి శ్రీకాళీమాత. ఆధ్యాత్మిక మార్గంలో పయనించే వారికి నిత్యం ఎన్నో విధాలైన దివ్యానుభూతులు కలుగుతూ ఉంటాయి. కొన్ని కన్పించని అనుభూతులైతే, మరికొన్ని ప్రత్యక్షానుభూతులు. సాధకుల సాధనా పటిమను బట్టి ఆ అనుభూతులు అక్షయంగా వస్తూనే ఉంటాయి. గొప్ప సాధన, తపస్సు చేసిన వారైతే వారు పరమపదించిన తరువాత కూడా, వారికి ఏర్పాటు చేసిన గుడులనో సమాధులనో దర్శించుకున్న వారికి కూడా మంచి దివ్యానుభూతులు కలుగుతూ ఉంటాయి. ఈ విధంగా వారి పేరును చిరస్థాయిగా చేయగల శక్తి శ్రీకాళీమాత అమ్మవారికి మాత్రమే ఉన్నదని శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో తెలియ చేస్తున్నారు.

**శ్లో॥ మహితశ్రేష్ఠ మూలమంత్రాభిషేకానేక యంత్రార్చన ఫలాధికాభీష్టసిద్ధి ప్రదాత్రి!**
**నిత్యసత్యభాషణ ప్రబోధదీక్షాచరణ పుణ్యజనానుగ్రహరూపిణి! శ్రీకాళి!**
**దివ్యధర్మాచరణ సంరక్షణోత్తమ పూజ్య జనసంభాషణానుభవాధిక యుక్తిప్రదే!**
**దైవ సమాన శిశుజనమైత్రి క్రీడాసంభాషణానంద మహాభాగ్యప్రదాత్రి! కాళి!16**

తా॥ మానవులు కోరుకున్నవి, కోరుకున్న విధంగా పొందటానికి, ఈ లోకంలో అనువైన మార్గాలు అనేకం ఉన్నాయి. కోరికలు అనేవి మానవులకు సహజమైనవే, అయినప్పటికీ, అవి ఇతరులకు ఇబ్బందికరమైనవి, హాని కలిగించేవి కాక పరులకు సహాయకారిగా, లోకకల్యాణార్థం చేసే ఆలోచనలు, అలా చెయ్యాలనే కోరికలు, అలాంటి వారి జీవితాలను ఉన్నతమైన స్థానాలకు తీసుకొని వెళతాయి. లోకానికి

మంచిని చేకూర్చే కార్యక్రమాలను చేపట్టాలంటే, అవి కేవలం ఒకరిద్దరి వ్యక్తుల వల్ల సాధ్యం కాక పోవచ్చు. ఒక్కొక్కసారి అందరూ కలసి సమిష్టిగా ప్రారంభించినా అవి శుభకరమైన ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. అందుకు కారణం, వారు, చేపట్టిన కార్యక్రమాలను సరైన రీతిలో ముందుకు తీసుకు పోగలిగే మార్గదర్శి లేకపోవటం అయి ఉండాలి, లేదా ఆ కార్యక్రమం చేయతలపెట్టిన వారిలో సంకల్ప బలం, సరైనదీక్ష లేకపోవటం కారణం అయి ఉండవచ్చు. ఇలాంటి లోపాలు జరుగకుండా, దైవబలాన్ని నమ్ముకొని, దైవానికి ప్రీతికరమైన కార్యాచరణలను చేస్తూ, సంకల్ప బలాన్ని వృద్ధి చేసుకొని, తద్వారా ఆశించిన శుభఫలితాలను పొందవచ్చని కొందరు నమ్ముతారు. ఇలాంటి వాటిని అనగా దైవబలం తోడయితే అన్నింటిలోనూ విజయం సాధించవచ్చు ఇంకా గాఢంగా నమ్మేవారు, వారి ప్రయత్నంలో ఇంకా కొంచెం ముందుకు వెళ్లి తాంత్రిక విద్యలను ఆశ్రయిస్తారు. తాంత్రిక విద్యలంటే ప్రమాదకరమైనవి, క్షుద్రమైనవి అని భావించనక్కరలేదు. ఈ విద్యలు ఒక పదునైన కత్తి లాంటివి. కత్తి మనదే అయినా, దాన్ని ఉపయోగించటంలో పొరపాట్లు జరిగితే, మన శరీరాన్నికూడా గాయం చేస్తుంది. ఈ విద్యలతో సర్వదేవతలనూ 'యంత్ర' ముఖంగా పూజిస్తుంటారు. వేదశాస్త్రానుసారం, ఒక్కో దేవతకు ప్రత్యేకమైన మూలమంత్రం ఉంటుంది. మంత్రం అంటే, కొన్ని విశిష్టమైన శబ్దాలను కలగలిపి ఒకే అక్షర స్థానం నుంచి పలికించడాన్ని మంత్రబీజం అనియు, ఇలాంటి మంత్ర బీజాలను కొన్నింటిని కలిపి బీజమంత్రం అని చెప్పుకోవచ్చు. ప్రతి మూలమంత్రంలో ఆయా దేవతల యొక్క విశిష్ట గుణాలు దాగి ఉంటాయి. అందుచేత, తమ కార్యక్రమాలు నిర్విఘ్నంగా, విజయవంతంగా పూర్తి కావటానికి ఏ దేవత సహకారం అవసరం ఉంటుందో తెలుసుకొని, ఆ దేవత యొక్క మూలమంత్రంలోని బీజాక్షరాలను, బంగారు రేకుపై గాని, వెండి లేదా రాగి రేకులపై లిఖింపచేసి, వాటిని శాస్త్రీయంగా శుద్ధి చేసి ఆ దేవతను ఆ యంత్రంలో ప్రాణప్రతిష్ఠ చేస్తారు. అప్పుడు ఆ యంత్రంలో ఉన్న దేవతను, ఆ తల్లి యొక్క మూలమంత్రంతో పూజలు అభిషేకాలు చేస్తుంటారు. ఇందువలన కోరుకున్న ఫలితాలు లభిస్తాయని చెపుతారు. ఈ లోకంలో అత్యంత విశిష్టమైన, గొప్ప గొప్ప మూలమంత్రాలు ఎన్నో ఉన్నట్లుగా తెలుస్తున్నది. అద్భుతమైన కార్యములను సాధించాలంటే, మహత్తరమైన, లోకోత్తరమైన మూలమంత్రాలతో యంత్రాలు స్థాపన చేసి వాటికి పూజలు, అభిషేకాలు, అర్చనలు

చేయాలని చెపుతారు. అప్పుడే లోకకల్యాణం సాధ్యమవుతుందని, అలా చేసే వారి కోరికలు కూడా సంపూర్ణంగా తీరుతాయని విశ్వాసం. అందుకోసమే, ప్రజలందరూ సుఖ సంతోషాలతో కలకాలం జీవించాలని కాబోలు, హిందువులలో దేవుడి విగ్రహాలను, దేవతల విగ్రహాలనూ ప్రతిష్ఠాపన చేసేటప్పుడు, దేవాలయం గర్భగుడులలో దేవతా విగ్రహం క్రింద భూమిలో యంత్ర స్థాపన చేస్తారు. ఆ యంత్రం పైకి కన్పించక పోయినా, ప్రతిష్ఠించిన దేవుణ్ణో, దేవతనో పూజించటం వలన, స్థాపన చేసిన బీజాక్షర సహిత యంత్రం యొక్క శక్తి ఆరాధించిన వారిపై ప్రభావితమై వారికి కోరికలను తీరుస్తుంది. కొన్నిచోట్ల యంత్రాలు 'శ్రీచక్రం' రూపంలో అందరికీ కనిపించే విధంగా ప్రతిష్ఠింపబడి, పూజలు అందుకుంటూ ఉంటాయి. ఇవన్నీ లోకహితం కోసం, శాంతి సౌభాగ్యాల కోసం ప్రజలచే (భక్తులచే) స్థాపన చేయబడిన యంత్ర రాజములే. అనగా యంత్రములు కూడా దైవస్వరూపాలే అని భావించవచ్చు. ఇలాంటి అత్యంత శ్రేష్ఠమైన యంత్రాలను, వాటి మూలమంత్ర సహితంగా చేసే అభిషేకాలు, పూజలు, కుంకుమార్చనలు మొదలగు వాటివలన లభించే శుభఫలం, పుణ్యఫలం కన్నా అధికమైన మేలైన శుభఫలితాలను, పుణ్యఫలితాలను శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులకు ప్రసాదిస్తారు. ఉదాహరణకు, ఒక (1) సంవత్సర కాలంపాటు ఒక యంత్రానికి బీజమంత్రంతో పూజలు, అర్చనలు చేసినందువలన వచ్చే ఫలితం, శ్రీకాళీమాత అమ్మవారు తనను ఒక (1) రాత్రి పూజించినంత మాత్రం చేతనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

ఈ విశ్వంలో పుణ్యాత్ములైన మహానుభావులు ఎంతోమంది ఉంటారు. ధనధాన్యాలు, సమాజంలో ఉన్నత హోదాలు కలిగి ఉండటం అనే విషయాలు, మహాత్ములు, పుణ్యాత్ములు కావటానికి కారణాలు కావు. మానవుడై పుట్టిన తరువాత బ్రతకడానికి డబ్బు అవసరమే. అది సంపాదించటానికి ఎన్నో మార్గాలున్నాయి. కొంతమంది నీతి వాక్యాలను వల్లిస్తూ, తాము సత్యవ్రతులమనే భావన ఇతరులలో కల్పిస్తూ, ఎదుటివారి విశ్వాసాన్ని అడ్డు పెట్టుకొని అక్రమ మార్గంలో సంపాదన సాగిస్తుంటారు. నిజం నిప్పులాంటిదని, అది ఎన్నటికీ దాగదని పెద్దలు చెపుతుంటారు. అలాంటి వారి గుట్టు ఎప్పటికైనా బట్టబయలై ఆ 'నిప్పు' వారిని కాల్చి వేస్తుందని, లోకంలో జరిగే ఎన్నో సంఘటనలు ఋజువు చేస్తున్నాయి. మరికొంతమంది నిజంగానే సత్యవ్రతులై ఎల్లప్పుడూ నిజాన్నే నిజాయితీగా మాట్లాడుతూ ఉంటారు.

వారి మాటలలోనూ చేతలలోనూ 'సత్యమే' కన్పిస్తుంది. వారి సంపాదనా, ఆలోచనా, కార్యాచరణలన్నీ సత్యానికి నిలువెత్తు రూపాలుగా ఉంటాయి. అలాంటి వారికి కావాలన్నా అసత్యపు మాటలు రావు. నిత్యమూ సత్యమైన సంభాషణలనే చేస్తుంటారు. అవసరమైతే ఎదుటి వారికి సత్య సంభాషణల యొక్క ఔన్నత్యాన్ని తెలియచేస్తారు. సత్యం పలికే వారు ఎలాంటి చీకూ చింతా లేకుండా హాయిగా బ్రతకగలుగుతారు. కాని అసత్య సంభాషణలు చేస్తూ నిత్యం అబద్ధాలతో బ్రతికే వారు ప్రతిక్షణం భయపడుతూ బ్రతకవలసి వస్తుంది. ఎందుకంటే అబద్ధాలు ఎక్కడ బయట పడతాయోనని ఆలోచిస్తూ మనశ్శాంతిని కోల్పోతారు. సత్యసంభాషణలు చేస్తూ, సత్యం గురించి ఎల్లప్పుడూ అందరకూ బోధిస్తూ అది ఒక దీక్షగా జీవితాలను సాగించే వారికి ఎంతో గౌరవం లభిస్తుంది. ఎన్నో శుభాలు చేకూరుతాయి. కాని అంతకు మించిన గౌరవాలను, అద్భుతమైన శుభఫలితాలనూ శ్రీకాళీమాత అమ్మవారు తమను ఆశ్రయించిన భక్తులకు ప్రసాదిస్తారు. సత్యసంభాషణలను చేసే నిబద్ధతనూ ఆ తల్లే ప్రసాదిస్తుంది, అందుకు తగినంత ఎక్కువగా ప్రతిఫలాన్నీ శుభాలనూ, గౌరవాలనూ ఆ తల్లే ప్రసాదిస్తుంది.

ఉత్తములైన వారితో నిత్యమూ సంభాషించటం వలన ఎన్నో మంచి విషయాలు తెలుస్తుంటాయి. లోకంలో ఎన్ని అవినీతులు పెరిగినా, అధర్మం, అన్యాయం పెరిగిపోయినా చివరకు ధర్మమే నిలుస్తుంది, గెలుస్తుంది అనే విషయం పురాణకాలం నుంచీ ఇప్పటి వరకూ ఋజువవుతూనే వస్తుంది. ఇందుకు రామాయణ, మహాభారత కథలు, కావ్యాలే నిదర్శనం. అలాంటి కథల కనుగుణంగా, అలాంటి ఆదర్శాలకు నిదర్శనంగా ఎంతోమంది ఇప్పటికీ శ్రేష్ఠమైన ధర్మాలను ఆచరిస్తూ వస్తున్నారు. వారు ఒక్కరే ఆచరించటం వలన ఉపయోగం లేదు కనుక, అందరికీ ధర్మం యొక్క విశిష్టతను తెలియచేస్తూ, లోకంలో ధర్మాన్ని ఎలా నిలబెట్టాలో దాన్ని అందరి మనసుల లోనికీ ఎలా తీసుకు వెళ్లాలో, ధర్మాన్ని ఎలా సంరక్షించాలో అని తపన పడుతుంటారు. అలాంటి ధర్మాత్ములైన, ధర్మసంరక్షకులైన, పూజ్యులైన వారితో సంభాషణలు చేస్తూ, వారి సహచర్యం చేయటం వలన ఎన్నెన్నో కొత్త విషయాలు తెలుస్తుంటాయి. జ్ఞానం లభిస్తుంది, జీవితానుభవాలు తెలుస్తాయి. తెలివితేటలు అధికమౌతాయి. వారితో గడిపే కాలమంతా సంభాషించే సమయమంతా పుణ్యప్రదంగా, శుభదాయకంగా ఉంటుంది. కాని, అంతకు అధికమైన అనుభవం శక్తియుక్తులు, శుభఫలితాలు

శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులైన వారికి ఎల్లప్పుడు ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

చిన్న పిల్లలను పసిపిల్లలను దైవంతో సమానంగా పోలుస్తారు. ఎందుకంటే వారిలో ఆలోచనా జ్ఞానం ఏర్పడదు కనుక, వారి ప్రతిమాటా ప్రతి చేష్టా దైవ సంబంధితంగా భావిస్తారు. వారి ముద్దు, ముద్దు మాటలు, కాళ్లూ చేతులు ఆడించటం, ఆ నవ్వులూ ఎలాంటి వారినైనా కట్టి పడేస్తాయి. ఎంతసేపు చూసినా, పసిపిల్లల హావభావాలకు అంతులేని సంతోషం, ఆనందం కలుగుతుంది. ఆ సమయంలో వీరు కూడా మంత్రముగ్ధులైనట్లు, పసిపిల్లల వలెనే ప్రవర్తిస్తూ, పరిసరాలను మంచి మాటలను ముద్దముద్దగా పలుకుతూ వారిని ఆడిస్తుంటారు, పలకరిస్తుంటారు. లోకపాలకులైనా ఆ క్షణాలలో అలాగే ప్రవర్తిస్తారు. ఇందులో తేడా ఏమీ ఉండదు. అలా పెద్దవాళ్లు ఏదో లోకంలో లీనమై పోయి పిల్లలతో గడిపే సందర్భాలలో వారిలోని ఆనందానుభూతి చెప్పనలవి కాదు. అదే విధంగా దైవసన్నిధిలో పాలకుడు నుంచి బీదవాడు వరకూ పొందే ఆనందానుభూతి కూడా ఒకే విధంగా ఉంటుంది. తెలియని ఆనందంలో శరీరం పులకరించి పోతుంది. అందువల్లనే పసిపాపలను దైవ సమానులుగా పోల్చి ఉండవచ్చు. ఇలాంటి మహా అద్భుతమైన ఆనందానుభూతులను శ్రీకాళీమాత అమ్మవారు, వారి భక్తులకు ఎక్కువగా ప్రసాదిస్తారని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో తెలియ జేస్తున్నారు.

**శ్లో॥ నిత్యచిత్త భావోద్వేగ నియంత్రణౌషధ సమాన దివ్యమంత్ర ప్రబోధిని! శ్రీకాళి!**
**దురాచారాచరణ దుర్జన సాంగత్యాభిలాషాసుర దుర్బుద్ధి నిర్మూలనకారిణి!**
**బహువిధ పతనకారణబాహ్య సౌందర్యాతీతాంతఃకరణశుద్ధ్యానందప్రదాత్రి!**
**పూర్వసప్తజన్మాచరిత సంపూర్ణ కార్యదృశ్య సందర్శనామిత భాగ్యప్రదే! కాళి! 17**

తా॥ మానవుల మనసుల్లో ఎల్లప్పుడూ కదలాడే భావాలకు అనుగుణంగానే వారి జీవితాలు రూపుదిద్దుకొంటాయి. దైనందిన కార్యక్రమాలు చేసేటప్పుడు మనసులోని భావాల యొక్క విశిష్టత ఎంతగానో ఉంటుంది. వీధిలోనికి వెళ్లి ఎలాంటి భావప్రకటన చేయకుండా నిల్చొని దిక్కులు చూస్తుంటే, చూసే వారికి అతను పిచ్చివాడో లేక దొంగతనాలకు వచ్చి అనువైన చోటు కోసం వెదుకుతున్నాడోనని

అనుమానం వస్తుంది. భావప్రకటన మనిషి యొక్క ప్రత్యేకతను, ఆరోగ్యస్థితిని తెలియచేస్తుందని చెప్పుకోవచ్చు. ఆరోగ్యస్థితి అనగా శారీరక, మానసిక సమతుల్యమైన పరిస్థితి. కొంతమంది శారీరకంగా ఆరోగ్యంగా ఎంతో దృఢంగా ఉంటారు. వారికి ఎలాంటి రోగబాధలు ఉండవు. కాని మాట్లాడటం మొదలయ్యే సరికి, తనను పలకరించిన వారి మీద కోపం, ఎదురు ప్రశ్న వేసినందుకు ఉద్రేకం, బాగున్నారా అని అడిగినందుకుకోపంతో ఊగిపోతూ ఎదుటి వారిని కొట్టినంత పని చేస్తారు. కోపోద్రేకాలను ఆపుకోలేక వారు వెళ్లిపోయిన తరువాత కూడా చాలాసేపు వారిని భయంకరంగా తూనలాడుతుంటారు. అంటే ఎదుటివారు మంచి మాటలు మాట్లాడినా వీరికి వ్యతిరేకంగానే అర్థమవుతాయేమో. బాగున్నారా అంటే... ఏం. రోగం వచ్చి మంచాన పడ్డట్టు ఎవరైనా చెప్పారా.. కంటికి కన్పించటం లేదా ఎలా ఉన్నానో... నాకు రోగం వస్తే చూడాలని ఉందా అంటూ అర్థం పర్థం లేని మాటలు మాట్లాడుతూ వివాదాలను పెంచుతారు. అలాకాక దేవుడి దయవల్ల బాగానే ఉన్నానండీ.. అంటే ఇద్దరికీ ఎంతో హాయిగా ఉంటుంది. దానికి కారణం, తనలోని భావాల వలన కలిగే కోపాలను, ఉద్రేకాలను తామే స్వయంగా నియంత్రించుకో గలిగిన శక్తి వారిలో ఉండదు. ఎవరైనా, ఏమండీ మీకు చాలా కోపం, అందుకే మీతో మాట్లాడాలంటే భయంగా ఉంటుంది అని అంటే, అవునండీ నాకు తెల్సు, నా కోపం నన్ను అందరికీ దూరంగా పెడుతుంది, దాన్ని ఆపుకోలేక పోతున్నాను, మందులు కూడా వాడుతున్నాను గాని ప్రయోజనం కన్పించటం లేదు అంటూ వాపోతుంటారు. ఇలాంటి సంఘటనలు తరచూ అందరికీ అనుభవమే కావచ్చు. ఇటువంటి భావోద్వేగాలకు మనసే కారణం ఎవరినో ఏదో అనేయటం, తిట్టేయటం, ఇతరుల గురించి నలుగురిలో ఆవేశపూరితంగా చెడుగా మాట్లాడటం వలన వారికి తాత్కాలికమైన, మనసులో రేగే కల్లోలం తగ్గిపోయి శాంతించవచ్చు. అవతలి వారికి నిప్పు పెట్టడానికి మనం వెలిగించిన అగ్గిపుల్ల ఆ తరువాత మనం ఆర్పివేసినా, అది పెట్టిన నిప్పు ఆరిపోదు. చివరకు నిప్పు పెట్టిన వారిని కూడా దహించవచ్చు. తన కోపమే తన శత్రువు అన్నట్లుగా, భావోద్వేగాలను నియంత్రించుకోలేక పోతే, చివరకు వారికే ముప్పు వాటిల్లే అవకాశం ఉంటుంది. ఇంద్రియాలను నిగ్రహించుకోగలిగితే, మనసు మంచి, చెడు అనే విచక్షణను పాటిస్తుంది. విచక్షణ లేని మనసు కల్లోలంగా ఉండే సముద్రంలో పడవ లాంటిది. అలల తాకిడికి

మనసు అనే పడవ స్థిమితంగా నిలబడక గంతులేస్తూ ఉంటుంది. అలాంటి స్థితిలో పడవ సరంగు 'లంగరు'ను ఇసుకలో దింపి నావను నియంత్రిస్తాడు. అలాగే తరచూ భావోద్వేగాలతో సతమతమయ్యే మనసును కూడా శ్రీకాళీమాత అమ్మవారిమీదకు మళ్లించాలి. అంతకు మించి ఎలాంటి, మందులూ, ఔషధాలూ మానవులలోని భావోద్వేగాలను అదుపులో పెట్టగలిగే సమర్థత కలిగి ఉండకపోవచ్చు. శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులైన వారికి, వారిలోని కోపాలను, ఉద్రేకాలను భావాలలోని ఉద్వేగాలను సమతుల్యంగా, సమర్థవంతంగా నియంత్రించుకోగల దివ్య ఔషధ సమానమైన, మంత్రాన్ని ప్రబోధిస్తుంది. ఆ మంత్ర పఠనం వలన వారు ఎప్పటికీ, తమలోని భావోద్వేగాలను అదుపులో పెట్టుకోగలుగుతారు అంటారు శ్రీగురుదేవులు.

దేవతలు, రాక్షసులు అనేవారు మానవులలో కూడా ఉంటారు. దేవలోకంలోని దేవతల వలె, రాక్షస లోకంలోని రాక్షసులవలె, మానవులలో ఉండే వారిని దేవతలుగా, రాక్షసులుగా గుర్తించటం వీలుకాదు. మానవుల ప్రవృత్తిని బట్టి వేషధారణ కన్పించదు. అత్యంత కిరాతకుడు కూడా చక్కగా తెల్లని, మెరిసిపోయే వస్త్రధారణలో అందరిమధ్యా తిరుగుతూ, తమలోని రాక్షసుణ్ణి బయటకు కన్పించకుండా జాగ్రత్త పడతారు. వీరికి ఎల్లప్పుడూ సమాజంలో చెడ్డపనులు చేయటం అంటేనే ఉత్సాహం చూపిస్తారు. వీరి మాటలవలన, చేష్టల వలన ఎప్పుడూ ఎవరో ఒకరిని బాధిస్తూ ఉంటారు. అలా చేయటం డబ్బు సంపాదన కోసం కావచ్చు, తమ స్వార్థపూరితమైన పనుల కోసం లేదా సరదా కోసం కావచ్చు. అదేమంటే.. మేమంతే, అంటారు. ఇలాంటి వారు సమాజానికి అభివృద్ధి నిరోధకులుగా ప్రతిపనికీ అడ్డు పడుతుంటారు. వీరు ఇలా చేయటమే కాక, ఇలాంటి లక్షణాలు ఉన్న వారితోనే స్నేహాన్ని చేస్తుంటారు. ఒక కాకి కాకుల గుంపులోనే చేరుతుంది. ఒక కోకిల కోయిలల గుంపుతోనే స్నేహం కడుతుంది అన్నట్లుగా, రాక్షస గుణాలు ఉన్నవారు సహజంగా రాక్షస సమూహంతోనే జతకడతారు. అప్పుడే వారి అందరి దుష్ట లక్షణాలు ఏకమై హింసాత్మక చర్యలు చేయటానికి అనువుగా ఉంటుంది. ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలను చేస్తూ వాటిని కార్యాచరణలో పెట్టాలని తహతహలాడుతుంటారు. వీటినే వీరు కోరుకుంటుంటారు. ప్రతి అంశాన్ని, విషయాన్ని దుర్బుద్ధితోనే చేస్తుంటారు. ఈ విధమైన వ్యక్తులు మనస్సాక్షి అనేది లేక, క్రూరాతిక్రూరంగా ప్రవర్తిస్తుంటారు. దయ, జాలి అనే పదాలు వీరికి తెలియవు. మార్పు చెందే గుణం, పశ్చాత్తాపం అనే విషయాలు వీరి జీవితాలలో

కన్పించవు. అసాధ్యం అనేది మానవులలో కన్పిస్తుందేమో గాని, అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగిన శక్తి రూపిణి శ్రీకాళీమాత అమ్మవారికి వర్తించదు. ఎంతటి కఠినాత్ముడైనా, దుష్టజనులతో స్నేహాన్ని అభిలషిస్తూ, రాక్షసుల వలె ప్రవృత్తిని అలవరచుకున్న వారయినా శ్రీకాళీమాత అమ్మవారి పాదాల చెంత చేరి ఒక్కసారి నమస్కరిస్తే, ఆ తల్లి వారిని పరమ సద్గుణ సంపన్నులుగా చేసి వారిలోని దుర్గుణాలన్నింటినీ నిర్మూలిస్తుంది.

మానవులు పతనం చెందటానికి ముఖ్యమైనవి అతితెలివి, అతివిశ్వాసం, అతిబలం, అతిలోక సౌందర్యం లాంటివి కారణాలు కావచ్చు. ఏదయినా అవసరానికి మించి ఉండటం వలన మానవునికి గర్వం, అహంకారం మొదలైనవి ప్రాప్తిస్తాయని చెప్పుకోవచ్చు. నా అందానికి తిరుగు లేదు, నా బలానికి సాటి ఎవరూ రారు, తెలివిలో, జ్ఞానంలో నన్ను ఓడించగలవారు ఇంతవరకూ లేరు, ఇలాంటి ఆలోచనల వలన గర్వం, అహంకారం మొదలైన సూచనలు కన్పిస్తాయి. అందం విషయానికి వస్తే అది శాశ్వతమైనది కాదు. వయసు పెరిగే కొద్దీ శారీరక మార్పులు జరుగుతూ శారీరక అందంలో కూడా మార్పులు వస్తాయి. పరువపు చాయలు ఉన్నంత కాలమే, శారీరక బిగువు సరిగా ఉండి అందంగా ఉన్నట్లు తెలుస్తుంది. బాహ్య సౌందర్యం అశాశ్వతమైనది, సంవత్సరంలో వచ్చే ఋతువుల వలెనే, అందం కూడా కొంత కాలం ఉండి కనుమరుగై పోతుంది. అందం ఉన్నప్పుడు ఆకర్షింపబడటం అనేది ప్రకృతి సహజం. ఆడవారు కావచ్చు మగవారు కావచ్చు ఎంతటి సౌందర్యరాశులైనా, ఆ రాశి కరిగిపోక తప్పదు. దేన్ని చూసుకొని ఎగిరెగిరి పడతారో అది పోయిన తరువాత బాధలకు గురౌతారు. ఆ బాధలు వారి పతనానికి దారి తీయవచ్చు. అందువలన ఎన్నటికీ కరిగిపోని సౌందర్య రాశులను (ధనరాశుల వలె) సొంతం చేసుకోవాలి. అదే మానసిక సౌందర్యం. అలాంటి సౌందర్యం జీవితకాలం ఉంటుంది, జీవితం తరువాత కూడా ప్రజల మనసులో మెదులుతూ ఉంటుంది. ఒక అద్భుతమైన పాటనో, సంగీతాన్నో, ప్రవచనాన్నో అద్భుతమైన చిత్రాన్నో, శిల్పాన్నో, మరేదైనా కళాకృతినో దర్శించినపుడు, వాటిని రూపుదిద్దిన వారి గురించి తెలుసుకోము, లేదా ఎవరోగాని, చాలా బాగా ఉన్నవి అంటారు. ఆ కవో, రచయితో, చిత్రకారుడో, కళాకారుడో వారి గురించి తెలియక పోయినా వీక్షకులు, వారిని, ఆరాధనా భావంతోనే చూస్తారు. నిజంగా అలాంటి కళాకారులు, కురూపులుగా కన్పించినా ప్రేక్షకులువారిని

ఆదరిస్తారు. ఇదే దేహ సౌందర్యానికి అతీతంగా కన్పించే సౌందర్యం. ఒకరిలో ఉండే ఈ ఆత్మ సౌందర్యాన్ని ఇతరులు గుర్తించగలిగినప్పుడు, ఆ అందం ఇనుమడిస్తుంది. అందరిచేతా ఆకర్షింపబడుతుంది. ఇది శాశ్వతమైనది, చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఇది బాహ్య సౌందర్యానికి అతీతమైన, అంతః కరణ శుద్ధి ద్వారానే లభిస్తుంది. సాధన వలన కొన్ని మాత్రమే సమకూరుతాయి. కాని శ్రీకాళీమాతను నిష్ఠగా అర్చించి పూజించే వారికి, ఆతల్లి, అంతఃకరణ శుద్ధి వలన కలిగే అద్భుతమైన ఆనందానుభూతులను ప్రసాదిస్తుంది.

మానవజన్మ, గతజన్మల పాపపుణ్యాల సమాహారంగా పెద్దలు చెపుతారు. పుట్టిన దగ్గర నుంచీ ఈ క్షణం వరకూ ఏమి జరిగిందో ఎవరికి వారికి మాత్రమే తెలుస్తుంది. కాని ఎదుటి వారికి మనకు తెలియదు. అది అసాధ్యం. కొన్ని ప్రత్యేకమైన సాధన, ఉపాసనా పద్ధతుల ద్వారా సృష్టి రహస్యాలను, కాలచక్ర మర్మాలను తెలుసుకోవచ్చునని అనుభవజ్ఞులైన వారు చెపుతుంటారు. కాలచక్రంలో ప్రతిజీవి యొక్క పూర్వపు జన్మల విశేషాలు, వర్తమాన జన్మల యొక్క వివరాలు అన్నీ నిక్షిప్తమై ఉంటాయట. అనగా ఒక ఉద్యోగస్తుడు. ఇప్పుడు చేస్తున్న కార్యాలయానికి ముందు ఏ ఏ ఊర్లలో ఎంతకాలం ఉన్నాడు, ఆ ప్రదేశాలలో అతని ఉద్యోగానికి సంబంధించిన వివరాలేమిటి, అనే విషయాలన్నీ వారి ప్రధాన కార్యాలయాల్లో వివరంగా వ్రాసి ఉన్నట్లుగా అనుకోవచ్చు. ఆ వివరాలు ఆ ఉద్యోగస్తునికి తప్ప మిగతా ఉద్యోగులకు తెలిసే అవకాశం ఉండదు. తెలుసుకోవాలంటే వారి పద్ధతుల ననుసరించి ముందుకు వెళ్లాలి. అదే విధంగా కాలచక్రంలోని మర్మాలు తెలుసుకోవటానికి కాలానికి అధిదేవత మరియు కాలచక్ర స్వరూపిణియైన శ్రీకాళీమాత అమ్మవారిని, కఠోరమైన ఉపాసనా విధానాల వలన, ఆ తల్లిని సంతృప్తి చెందిస్తే, ఆమె సంతసించి కాలచక్ర రహస్యాలను, అవసరమైనంత వరకూ తెలుసుకోగల దివ్యశక్తిని భక్తులకు ప్రసాదిస్తుంది. అప్పుడు గతించిన 7 (ఏడు) జన్మలలోని ఆ వ్యక్తుల యొక్క వివరాలను దృశ్య రూపంలో, కంటికి కన్పించే విధంగా దర్శించగలిగే అద్భుత భాగ్యాన్ని శ్రీకాళీమాత అమ్మవారు ప్రసాదిస్తారని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు, తమ అనుభవ పూర్వకమైన విషయాలను పై శ్లోకంలో వివరించారు.

శ్లో॥ భూతవర్తమాన కాలఋషివరాచార్యాచరితానేక దృశ్యదర్శన ప్రాప్తిపదే !
పూర్వకాల దేవతాచరిత లోకకల్యాణ బృహత్కార్య దర్శన ప్రబోధశక్తి ప్రదే!
బాహ్యాడంబరరానేకవేషభూషణాతీతాంతరాత్మానంద కారణాధ్యాత్మ విద్యాప్రదే!
పంచవింశతివర్ష లౌకిక విద్యాభ్యాసాధిక పరిపూర్ణాధ్యాత్మిక శక్తి ప్రదాత్రి ! 18

తా॥ పురాణాలు, ఇతిహాసాలు, రామాయణ, మహాభారతం వంటి మహాకావ్యాలు. వేల, లక్షల సంవత్సరాల క్రితం జరిగాయని, అవి అభూత కల్పనలు కావని విశ్వాసం. వాటిని మహాజ్ఞానులు, మహా ఋషులైన వారు రచించి, పరంపరానుగతంగా మానవజాతికి అందే ఏర్పాటు కావించారు. వాటిని మరచి పోకుండా, ఆ కాలంలో జరిగిన వాటిని కొన్ని ఘట్టాల రూపంలో నాటకాలు గాను, హరికథలు, బుర్రకథలు వివిధ రకాల జానపదుల పద్ధతుల ననుసరించి ప్రదర్శనలను చేస్తూ, చదువుకున్న వారికి, చదువు రాని వారికీ కూడా అర్థమయ్యే రీతిలో ఈ నాటికి కూడా అందిస్తూ వస్తున్నారు. ఆ రోజులలోని నిజమైన పాత్రలను అనుసరిస్తూ, ఆ కాలాన్ని బట్టి, ఆ ధర్మాలను జారవిడువకుండా, వాళ్లు ఏ విధంగా ప్రవర్తించి ఉంటారు మొదలైన వేషభాషలను, పూర్వకాలాలకు, యుగాలకు అనుగుణమైన రీతిలో అలంకరణలను అనుకరిస్తూ, అప్పటి వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా వేషధారణలను రూపొందించి ప్రదర్శించటం వలన జనహృదయాలలో ఇప్పటివరకూ అవి నిలిచిపోయాయి. ఈ ప్రయత్నాల వెనుక ఎందరో మహానుభావులు, ఋషులు, యోగులు మొదలైన వారి మహాసంకల్పాలు ఉన్నాయి. వాల్మీకి రామాయణాన్ని వ్రాసినా, వ్యాసుడు భారతాన్ని (18) పర్వాలుగా రూపొందించినా అవన్నీ జరిగిన వాటినే వ్రాశారని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఎందుకంటే ఈ రోజుల్లో కూడా కొంతమంది గొప్ప వాళ్లు తమ ఆత్మకథలను వేరే వారితో వ్రాయిస్తుంటారు లేక వారే రాసుకుంటుంటారు. వారి జీవితంలో జరిగిన ప్రతి సంఘటనను, తాము ఎవరెవరితో ఎలాంటి విషయాలను చర్చించుకున్నది, ఎదుటి వారి మనస్తత్వాలు, తమని ఎవరు మోసం చేసింది, తాము ఎవరివల్ల గొప్పవారిమయ్యాము, లాంటి ప్రతి సూక్ష్మమైన విషయాలను కూడా వ్రాస్తుంటారు. మన కళ్లముందే ఎన్నో ఆత్మకథలు, రచనలు చూస్తున్నాం. భారత, రామాయణాలను మిగిలిన పురాణాలు, ఇతిహాసాలు, భగవద్గీత మొదలైనవన్నీ జరిగినవే వ్రాశారు.

అనేక వేల, లక్షల సంవత్సరాల నుంచీ ఇవన్నీ వస్తున్నాయి. కాలానుగుణంగా, ప్రతి కాలంలోనూ ఎందరో మేధావులు, ఋషులు, యోగులు మొదలైన వారు, కొంత వారి భావ తీవ్రతకు అనుగుణంగా చిన్న చిన్న మార్పులు చేస్తూ వచ్చినప్పటికీ అసలు మూలరూపం ఒక్కటే. ఇప్పటికి కూడా, రామాయణంలో ఫలానాచోట ఈ విధంగా జరిగి ఉంటుంది, భారతంలో ఫలానా సందర్భంలో ఇలా జరిగి ఉండకపోతే బాగుండేది, అనే మీమాంసలకు లోనవుతూ ఉంటారు. మహాతప స్సంపన్నులైన ఋషులు, యోగులు, మరికొందరు మహాఉపాసకులైన వారు, ఇలాంటి మీమాంసలకు లోనైనప్పుడు, వారికి అసలు వాస్తవం ఏమిటో తెలుసుకోవాలనే జిజ్ఞాస కలుగుతుంది. కాని ఎలా తెలుస్తుంది, ఎవరు చెపుతారు, జరిగిన వాటన్నింటినీ యథాతథంగా నమోదు చేసిన వారు ఎవరుంటారు, లక్షల సంవత్సరాల నాటి లేదా వేల సంవత్సరాల నాటి గ్రంథాలు ఎక్కడ లభ్యమవుతాయి, ఎక్కడా లభించక పోవచ్చు. ఒక కుటుంబంలో పదిమంది (లేదా ఇద్దరు) పిల్లలుంటే, ప్రతి పిల్లవాడికీ, ఎవరి గురించిన వివరాలు వారికే తెలుస్తాయి. మిగతా తొమ్మిది (9) మంది అన్నదమ్ములు లేక అక్కచెల్లెళ్ల వివరాలు తెలియక పోవచ్చు. కాని, వారందరికీ జన్మనిచ్చిన, కన్నతల్లికి మాత్రం ఆ పిల్లలందరి గురించీ ప్రతి చిన్న విషయం తెలుస్తుంది. అదే విధంగా ఈ విశ్వం సృష్టి జరిగిన దగ్గర నుంచీ ఇప్పటి వరకూ జరిగి పోయిన లక్షల కోట్ల సంవత్సరాల కాలంలో ఏ జీవి, ఏ క్షణంలో, ఏ ప్రాంతంలో ఏమి చేసింది, ఏ విధంగా ఉన్నది అనే ప్రతి చిన్న వివరం కూడా కాలచక్రంలో పొందుపరచబడి ఉంటుందని, వర్తమాన కాలంలో ఏమి జరుగబోతోందనే విషయాలు కూడా ఆ 'కాలచక్రం'లో సవివరంగా పొందుపరచబడి ఉంటాయని తెలుస్తున్నది. మనకు కనిపించని కాలచక్రంలోనికి వెళ్లి, అవసరమైన, భూత వర్తమాన వివరాలను తెలుసుకోవాలంటే, కాలానికి అధిదేవత, కాలచక్ర స్వరూపిణియైన శ్రీకాళీమాత అమ్మవారిని ప్రార్థించాలి. సాధారణ ప్రార్థన చాలదు, అసాధారణమైన సాధన పద్ధతులను అవలంబిస్తూ, దేహాన్ని గడ్డిపోచగా భావించి, అత్యంత కఠోరమైన తపస్సు చేస్తూ శ్రీకాళీమాత అమ్మవారిని యోగం ద్వారా ప్రత్యక్షంగా దర్శించగలిగే స్థితిని పొందగలిగిన సిద్ధ సాధకులకు కాలచక్రంలో దాగి ఉన్న, అవసరమైన వివరాలను, అనగా వాల్మీకి ఏ విధంగా రామాయణాన్ని వ్రాశాడు, వ్యాసుడు భారతాన్ని వ్రాసిన విధానం ఎలా ఉన్నది, ఇంకా ఇతరులైన ఋషులు ఎలాంటి పుణ్యకార్యాలను

ఆచరించారు వంటి విషయాలను దృశ్యరూపంలో దర్శించగలిగే శక్తిని, ప్రాప్తాన్ని కలిగిస్తుంది శ్రీకాళీమాత తద్వారా ఆ సిద్ధ సాధకులు, తాము దృశ్య రూపంలో దర్శించిన వివరాలను విషయాలను లోకానికి తెలియచేసే ప్రయత్నం చేస్తారు.

పూర్వపు కాలాలలో అనగా గతయుగాలలో ప్రతివారూ ఎవరో ఒక దేవతను గాని దేవుణ్ణి గాని పూజించేవారట, ఆరాధించే ఆచారం ఉన్నదట. వారు రాక్షసులైనా, నగరవాసులైనా, గిరివాసులైనా, ఆటవికులైనా ఎవర్నో ఒక దైవాన్ని ఆశ్రయించి బ్రతికే వారట. వేరే దేవుళ్లంటే వాళ్లకు ఇష్టమున్నా లేకపోయినా, తాము నమ్మిన దైవాన్ని మాత్రం ఎంతో నిష్ఠతో కొలిచే వారని తెలుస్తున్నది. ఇలాంటి విషయాలను తెలుసుకోవాలన్నా అందుకు 'తపశ్శక్తి' ఎంతో అవసరం. ఆ కాలంలో దేవతలు, లోకకల్యాణం కోసం, ప్రజలలో శాంతి సౌఖ్యాలను నింపటం కోసం, వారు ఏమేమి క్రతువులు, హోమాలు మొదలైన అద్భుత కార్యాలను చేశారో, ఎలా చేశారో, అలా చేసేటప్పుడు ఏమేమి విధానాలను ఆచరించారో, అందుకు అవసరమైన దేవతలను ఏ విధంగా ఆవాహన చేసేవారో, ఎలాంటి నియమ నిష్ఠలను పాటించే వారో మొదలైన ప్రతి చిన్న, ముఖ్యమైన విషయాలను, ప్రత్యక్షంగా ఆనాటి నిజరూపాలను, ఘట్టాలను దృశ్య రూపంలో దర్శించి తెలుసుకోగల అతి మహత్తరమైన దివ్యశక్తిని శ్రీకాళీమాత అమ్మవారే వరంగా ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

ఈ మధ్య కాలంలో, ఆధునిక యుగంలో కొంతమంది వ్యక్తులు, తాము అందరికీ ప్రత్యేకమైన రీతిలో కనిపించాలని, అందరి దృష్టి తమపైనే ఉండాలని, అందరూ తమను గొప్పగా ఆదరించాలని భావిస్తూ, అతి త్వరగా ప్రజల మధ్యకు వెళ్లడానికి, కొన్ని ప్రత్యేకమైన వేషధారణలను వేసుకొంటూ కన్పిస్తున్నారు. సాధారణంగా మహాజ్ఞానులు, ఉద్దండ పండితులు, కారణ జన్ములు లేదా తాముఅన్నింటినీ విడిచిపెట్టిన సర్వసంగ పరిత్యాగులమని ప్రజలకు అర్థం కావడానికి కొన్ని నియమితమైన వస్త్రాలను ధరిస్తారు. వారిని చూడగానే ముఖవర్చస్సు, దేహకాంతి అసాధారణంగా ఉంటుంది. అందువలన వారికి సమాజంలో ఉన్నతమైన గౌరవ మర్యాదలు లభిస్తాయి. అలాంటి వారిని దైవాంశ సంభూతులుగా భావిస్తారు. ఒంటి నిండా కాషాయాలు ధరించి, మెడనిండా రుద్రాక్ష మాలలు ధరించినా,

అలాంటి వారికి సరైన పాండిత్యం, జ్ఞానం లేనప్పుడు సంతోషం, ఆనందం కలగదు. ఎంతసేపూ బాహ్యంగా కనిపించే వేషాలకు, ఆడంబరాలకూ ప్రాముఖ్యతను ఈయటం వలన అసలు వాస్తవం మరుగున పడే అవకాశం ఉంటుంది. అలాకాక మానసికమైన భావనలో స్వచ్ఛతకు, ఆధ్యాత్మిక భావనలకు స్థానం కల్పించినప్పుడు, అదే గొప్ప అలంకారం, అదే గొప్ప వేషధారణ అవుతుంది అని గ్రహించాలి. అలాంటి నిర్మల హృదయులైన వారి ఆనందం ఎంతో బాగుంటుంది. ఆ విధంగా బయటకు కనిపించే అనేకమైన ఆడంబరాలతో కూడిన వేషభాషలకు అతీతమైన, ఆత్మానందానికి కారణమైన ఆధ్యాత్మిక విద్యలను శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులకు ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

జీవితానికి అవసరమయ్యే విద్యలను అభ్యసించాలంటే దాదాపు (25) (ఇరువది ఐదు) సంవత్సరాలు పడుతుంది. అప్పుడే జీవితంలో స్థిరపడటానికి, ఉద్యోగ సంపాదనలకు అర్హతలు లభిస్తాయి. అంతకాలం ఎందుకు పడుతుందంటే, ఒక్కసారిగా నిచ్చెన పై నుండే చివరి మెట్టుకు ఎవరూ ఎక్కలేరు. క్రింద నుంచి ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పైకి వెళుతుంటే అనుభవం వస్తూ ఉంటుంది చివరి మెట్టుకు వెళ్లే సరికి పూర్తి అనుభవాన్ని సంతరించుకుంటారు. లౌకికమైన విద్యలకు కూడా విధానం అదే. నీటిలో దిగగానే ఎవ్వరికీ ఈదటం రాదు. సాధన చేస్తేనే వస్తుంది. శ్రద్ధ, పట్టుదలను అనుసరించి ఎక్కువ, తక్కువ సమయాలు పడతాయి. అలాగే విద్యలు పూర్తిగా నేర్వడానికి కూడా నిర్ణయించబడిన కాలం (25) (ఇరువది ఐదు) సంవత్సరాలు. అంతకు ముందుగా సాధించటం కొంచెం కష్టమే. కాని, (25) (ఇరువది ఐదు) సంవత్సరాల కాలంలో లౌకికమైన విద్యలను నేర్చుకోవటం వలన వచ్చే తెలివి, జ్ఞానాన్ని మించిన అమితమైన తెలివితేటలను, జ్ఞానశక్తిని, శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులైన వారికి, కొద్ది రోజుల వ్యవధిలోనే, ఎలాంటి చదువూ లేకపోయినా సంపూర్ణమైన ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదిస్తారని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురు మహరాజ్ గారు పై శ్లోకంలో వివరించారు. అందుకు సాక్షాత్తూ శ్రీ గురుదేవులే ఉదాహరణగా నిలుస్తారు. శ్రీగురుదేవులు పెద్దగా చదవక పోయినా, శ్రీకాళీమాత అమ్మవారి కృప వలన మహజ్ఞానులు, మహాపండితులైనారు. లేకపోతే వందల కొద్దీ శ్లోకాలనూ సంస్కృతంలో ఎలా వ్రాయగలుగుతారు.

**శ్లో॥ ద్విదినార్చనేనైవ కోటిలింగ క్షేత్రాష్టవర్ష ధ్యానాచరణాధిక శక్తి ప్రదాత్రి !**
**షణ్మాసార్చనేనైవ త్రిశత సహస్ర తిరుమల క్షేత్రయాత్రాధిక ఫలప్రదాత్రి !**
**నవగ్రహాష్టదిక్పాలజప పూజాగ్ని హోత్ర నిర్వహణాధిక ఫలప్రదాయిని! వరకాళి!**
**చతుర్యుగ సంప్రాప్తానేక జన్మజన్మాంతరాక్షయ పుణ్యాభివృద్ధికారిణి! శ్రీకాళి!19**

తా॥ దేహంలో ప్రాణం ఉన్నంతవరకూ అది 'శివం' అవుతుందట. ప్రాణం పోయిన తరువాత శరీరాన్ని ఏమంటారో అందరికీ తెలుసు. శివుని నామాన్ని వినని వారు, ఉచ్చరించని వారు లోకంలో ఎవరూ ఉండరేమో. చివరకు చదువు రానివారు, అజ్ఞానులు కూడా శివాలయానికి వెళ్లగానే 'ఓం నమఃశివాయ' అంటారు. అనగా, అంత లోతుగా శివనామం ప్రజల మనసుల్లో నిలిచిపోయింది. శివపంచాక్షరి నామాన్ని, మంత్రాన్ని మించిన మంత్రం మరేదీ ఉండదని, కొంతమంది చెపుతారు, శివారాధన వలన సకల సౌఖ్యాలు, భోగాలు సమకూరుతాయని మరికొందరి విశ్వాసం. శివలింగ దర్శనం చేసుకొని, మారేడు పత్రాలతో అభిషేకాలు, పూజలు చేయటం వలన వారి సకల పాపాలు నశిస్తాయని భక్తుల విశ్వాసం, అందుచేత చాలామంది, శివునికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజున ఎక్కువగా అభిషేకాలు, పూజలు చేస్తుంటారు. అందునా ప్రతిరోజూ ప్రదోషకాల సమయంలో (అనగా సూర్యాస్తమయానికి ముందు (30) నిమిషాలు – సూర్యాస్తమయం తరువాత (30) నిమిషాలు, ప్రదోషకాలంగా నిర్ణయించి శివుడు పార్వతీ సమేతుడై భూలోకంలోని అన్ని శివాలయాలలో దర్శనమిస్తాడని, ఆ సమయంలో అభిషేకాలు చేస్తే ఇంకా ఎక్కువ శుభఫలితాలు వస్తాయని భావిస్తారు. భూలోకంలోని అన్ని శివాలయాలలోనూ శివుడు లింగరూపంలోనే కన్పిస్తాడు. ఒకటి రెండు చోట్ల మార్పుగా కన్పిస్తే కన్పించవచ్చు. శివుని ప్రమేయం లేకుండా లోకంలో, ఏ జీవి తమ దైనందిన కార్యక్రమాలు కూడా చేసుకొనజాలవు అని చెప్తారు. జీవుల ప్రతికదలికకూ శివుని అనుమతి ఉండాలట. అందువల్లనే కాబోలు 'శివుని ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు' అని పెద్దలు చెపుతారు. అనగా మానవుడు నిమిత్తమాత్రుడు. దేహం మాత్రం కదలాడే కీలుబొమ్మలాంటిది. మన వెనుక నిలుచొన్న వారిని మనం చూడలేము. అలాగే వెనుక నుండి మనల్ని, మన జీవితాలను నడిపించే దేవుణ్ణి కూడా దర్శించలేము. మన వెనుక నిల్చొన్న వారిని చూడాలంటే తలవెనక్కి త్రిప్పి ఎలా

చూడాలో, జీవులను ముందుకు నడిపించే దైవాన్ని దర్శించుకోవాలన్నా, దృష్టిని వెనక్కు మళ్లించాలి. మానవులకు ఉండేది లౌకికమైన ఎదురుచూపే. ఎదురుగా ఉన్నది మాత్రమే కన్పిస్తుంది. దృష్టిని వెనక్కు మళ్లించటమంటే, మానవులలో అంతర్గతంగా ఉండే అంతరనేత్రాన్ని ప్రేరేపించటం. ఓం నమశ్శివాయ, ఓం నమశ్శివాయ అంటూ రోజూ ఉదయం కాసేపు. సాయంత్రం కొంచెం సేపు శివుణ్ణి ప్రార్థించటం వలన అంతరనేత్రం అసలు ఎక్కడుందో కూడా అంతుపట్టదు. గురువు ద్వారా తెలుసుకొని సాధన చెయ్యాలి. అలా చేసే సాధన శివక్షేత్రంలో, శివలింగానికి సమీపంలో ధ్యానం చేయటం అనేది శుభపరంపరలను ప్రసాదిస్తుందనేది ఎక్కువమంది విశ్వసిస్తారు. ఎందుకంటే లింగప్రతిష్ట జరిగిన ప్రదేశంలో ఎంతో దివ్యశక్తి ఉంటుంది, పవిత్రత లభిస్తుంది. దానికి కారణం ఆ ప్రదేశంలో రోజూ నిరంతరం పూజలూ, అభిషేకాలూ, మంత్రోచ్చారణలూ, హోమాలూ మొదలైనవి జరుగుతూ ఉంటాయి కనుక, ఆ ప్రదేశమంతా దైవశక్తి పరిభ్రమిస్తూ ఉంటుంది. ఎలాంటి కోరికలతో శివలింగ ప్రతిష్ఠ జరిగిన ప్రదేశంలో ధ్యానం ఆచరించినా కోరికలు త్వరగా తీరుతాయి. ఒక్క శివలింగం కాక, కోటి శివలింగాలను ప్రతిష్ఠ చేసిన ప్రదేశంలో (8) (ఎనిమిది) సంవత్సరాలపాటు ధ్యానాన్ని ఆచరించటం వలన వచ్చే శుభఫలితాలకన్నా ఎక్కువైన శుభఫలితాలను శ్రీకాళీమాత అమ్మవారు తమను పూజించే భక్తులకు (2) (రెండు) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

శివుణ్ణి ఆరాధించిన విధంగానే విష్ణువుని కూడా ఆరాధిస్తారు. తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి శ్రీ మహావిష్ణు స్వరూపమే. ఆయనే కలియుగ దైవం. శ్రీ వేంకటేశ్వర స్వామిని, తిరుమల వెళ్లి దర్శిస్తే జన్మ సార్థకం అవుతుందని అందరు భావిస్తారు. శ్రీస్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని ఒక్క క్షణం దర్శించుకున్నా చాలు, కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తులు నమ్ముతారు. కొంతమంది తమ తలనీలాలు సమర్పించుకుంటామని, మరికొందరు జోగి అడుగుతూ వచ్చి దర్శనం చేసుకుంటామని, మరికొందరు నిలువు దోపిడీలు సమర్పించుకుంటామని, మరి కొందరైతే కాలినడకన తిరుమల వచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటామని, ఎన్నో విధాలైన మొక్కులు మొక్కుతారు. తమ కోరికలు ఫలించిన తరువాత వారు మొక్కిన విధంగానే వాటిని చెల్లించుకుంటూ ఉంటారు. మొక్కులు తీర్చుకొనే విధానం ఎన్ని

విధాలుగా ఉన్నా అందులోని అంతరార్థం మాత్రం, మేము చేసిన తప్పులు ముడుపులు అనగా మొత్తం మూటకట్టి నీకు సమర్పిస్తున్నాం. వాటిని స్వీకరించి మాకు మంచిని ప్రసాదించు స్వామీ... అని మాత్రమే మొక్కులు సమర్పించే వారికి ఈ విషయం తెలిసినా తెలియకపోయినా నిజం మాత్రం అదే. శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించిన వారికి, ఆ స్వామి ఏదో ఒక రూపంలో శుభఫలితాలను ప్రసాదిస్తాడు. అందుకేనేమో ఆ స్వామిని దర్శించిన మరుక్షణం, మళ్లీ దర్శనానికి రావాలి అనే భావన భక్తులలో కలుగుతుంది. అందువల్లనే ఒకసారి తిరుమలలో శ్రీస్వామివారిని దర్శించిన వారు, మరల, మరల దర్శించుకుంటూ ఉంటారు. అయినా తనివితీరక అలా వస్తూనే ఉంటారు. కలియుగంలో శ్రీవేంకటేశ్వర స్వామిని మించిన దైవం లేదని ప్రతీతి. భక్తులు నిరంతరం ఆ స్వామివారి దర్శనం కోసం ఆరాటపడుతుంటారు. అందువల్లనే కావచ్చు. శ్రీస్వామివారి దర్శనం కోసం ఎంతసేపు నిలబడినా, ఇంకా ఎంత సేపటికి వారి దర్శన భాగ్యం కలుగుతుందో, ఆ క్షణం ఎప్పుడు వస్తుందోనంటూ ఆత్రుతగా ఎదురు చూసేవారికి, శ్రీస్వామివారి దర్శనభాగ్యం కలుగగానే అయ్యో అప్పుడే అయిపోయిందా, మళ్లీ ఎప్పుడు వస్తామో ఏమో అన్నట్లుగా ఉంటుంది. దర్శనం చేసుకున్న దానికంటే మళ్లీ వచ్చి దర్శనం చేసుకునే విషయం గురించి దిగులు ఉంటుంది. ఆ దిగులే భక్తికి తార్కాణం, శ్రీస్వామివారి శుభదృష్టి వారిపైన ప్రసరించిందనటానికి శుభసూచకంగా భావించవచ్చు. తిరుమల క్షేత్రానికి యాత్ర అంటే ఒక్క శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనమే కాదు. ఆ కొండపైన ఎన్నో పుణ్యతీర్థాలున్నాయి. వాటన్నింటినీ దర్శించుకుంటూ ఆ తీర్థాల యొక్క, పవిత్ర స్థలాల యొక్క పురాణ విశేషాలను కూడా తెలుసుకుంటే అధికమైన పుణ్యఫలితం లభిస్తుంది. తిరుమల క్షేత్రం అంటే సాక్షాత్తూ, శ్రీమహావిష్ణువు నివసించే వైకుంఠమే అని భావించాలి. వైకుంఠ దర్శనం మానవ మాత్రులకు సాధ్యం కాదు. అందుకే తిరుమల క్షేత్ర దర్శం సాక్షాత్తూ వైకుంఠ దర్శనంతో సమానమని పెద్దలు చెపుతారు. కలియుగ వైకుంఠమైన తిరుమలక్షేత్ర దర్శనం ఎన్ని సార్లు చేస్తే అంత ఎక్కువ పుణ్యఫలం లభిస్తుంది. మూడు (3) లక్షల సార్లు తిరుమల క్షేత్ర యాత్రలు చేసినందు వలన వారికి సంప్రాప్తించే పుణ్యఫలం కన్నా ఇంకా అధికమైన పుణ్యఫలితాన్ని శ్రీకాళీమాత అమ్మవారు తమ భక్తులైన వారికి కేవలం 6 (ఆరు) నెలల కాలంలోనే ప్రసాదిస్తారని తెలియజేస్తున్నారు శ్రీగురుదేవులు.

ఈ రోజుల్లో ఎక్కువగా వినవస్తున్న మాట, కాలం కలిసి రాలేదు, కాలం కలిసి రాలేదు. కాలం ఎవరితో కలసి రావాలి, ఎక్కడికి రావాలి, అనే విషయాలు తెలుసుకునే ముందు కాలం మూలరూపం తెలుసుకోవాలి. కాలం చక్రస్వరూపమని, దాని కేంద్ర స్థానం స్థిరంగా ఉండి మిగిలిన చక్రభాగమంతా తిరుగుతూ ఉంటుందని, ఆ కేంద్ర స్థానంలో కాలచక్ర స్వరూపమైన శ్రీకాళీమాత అమ్మవారు ఉంటారని, అక్కడి నుంచే కాలచక్ర విశేషాలను పర్యవేక్షిస్తుంటారని తెలుస్తున్నది. బండిలో ప్రయాణం చేసేటప్పుడు, రెండు చక్రాలూ ఒకే గమనంతో, వేగంతో కదులుతూ ఉంటే ఆ ప్రయాణం చక్కగా హాయిగా ఉంటుంది. అలా కాక రెండు చక్రాలూ వేర్వేరు దిశలలో కదులుతున్నా లేదా ఆ రెంటిలో ఒకటి అసలు కదలక బిగుసుకు పోయినా ఆ ప్రయాణం బాధాకరంగానే ఉంటుంది. రెండు చక్రాలూ సరైన రీతిలో కదలటానికి అవసరమైన చర్యలను ప్రారంభిస్తాము. అలాగే కాలచక్ర దోషాల వలన కుటుంబాలలో ఏర్పడే కలతలకూ, కలహాలకూ, బాధలకూ మూలకారణం గ్రహదోషాలే కారణమని భావించి వాటికి తగిన పరిహారాలు చేయటం ప్రారంభిస్తారు. వాటిలో నవగ్రహ దోష పరిహార శాంతి హోమాలని, అష్టదిక్పాలకులకు జపాలు, పూజలు, అగ్నిహోత్రాలంటూ పలువిధాలైన పూజా ప్రక్రియలను అవలంబిస్తారు. చేసేవారి సంకల్ప బలం వలన మరియు చేయించే వారి మంత్రానుష్టాన పటిమ వలన కొన్ని శుభఫలితాలు కలుగవచ్చు. నవగ్రహాలకు పూజలు చేశాం, హోమాలు చేశాం, పంతులుగారు చాలా బాగా చేశారు కనుక ఇంక మనకేమీ పర్వాలేదు అనే మానసిక భావన వలన ప్రశాంతత కూడా కలగవచ్చు. ఈ విధంగా నవగ్రహాలకు, అష్టదిక్పాలకులకూ పూజలు, అగ్నిహోత్రాలు చేసినందు వలన వచ్చే శుభఫలితాల కన్నా ఎక్కువైన శుభఫలితాలనూ, ప్రశాంతతనూ, శాంతినీ, సౌఖ్యాన్నీ మరియు అధికమైన కాలచక్ర అనుకూలతనూ కాళీమాత అమ్మవారు, సాక్షాత్తూ కాలస్వరూపిణి, కాలాధి దేవతయైన ఆ తల్లి తమ భక్తులైన వారికి, ఎలాంటి నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక హోమాలూ చేయకుండానే ప్రసాదిస్తారనేది నిజం అంటున్నారు శ్రీగురుదేవులు.

యుగాలు నాలుగు (4) కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం మరియు కలియుగం. ఏ యుగంలోనైనా మానవుడు ధార్మికజీవి. అనగా జీవితం ధర్మానికి ముడిపెట్టబడి ఉంటుంది. దానికి బద్ధుడై జీవించాలి. యుగాన్ని బట్టి ధర్మం

మారవచ్చు. ఒకే ముడిని ఎంతో కాలంగా వేసి ఉండటంవలన కాలానుగుణంగా ఆ ముడి సడలి పోవచ్చు. అలాగే కృతయుగంలో ధర్మం నాలుగు పాదాలతో నిండుగా ఉంటే కలియుగం వచ్చేసరికి, ధర్మం యొక్క ముడిలేక ధర్మబద్ధత సడలిపోయి ఒకే పాదం మీద నిలబడే పరిస్థితి ఏర్పడింది. దానికి కారణం ధర్మబంధాన్ని విప్పుకొని, ధర్మం ఆవల ఏముందో చూడాలనే ప్రయత్నమే. ధర్మం ఆవల అధర్మమే ఉంటుంది గాని మరేదీ ఉండదు. అది తెలుసుకునే లోపునే అధర్మ కార్యాలవలన చేస్తున్న పాపాలను మూట కట్టుకోవలసి వస్తుంది. కాని ప్రతియుగంలోనూ ధర్మబద్ధులై, ధర్మానికి కట్టుబడి, ధార్మికంగా జీవించే వారు కూడా ఉంటారు. ఆ తల్లి శ్రీకాళీమాతను పూజించేవారికి, అన్ని యుగాలలోనూ సంప్రాప్తించే అన్ని జన్మలకూ అక్షయమైన పుణ్యాన్ని అభివృద్ధి చేస్తుంది, శ్రీకాళీమాత అమ్మవారు అంటూ పై శ్లోకంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు ఎంతో గొప్పగా తెలియ చేస్తున్నారు.

**శ్లో॥ వేదోపనిషన్మహాపురాణాదిక సద్గ్రంథ పఠన ప్రవచనాధిక ఫలప్రదే !**
**రామాయణ మహాకావ్యపఠన సందేశ ప్రబోధనాధిక పుణ్యఫలప్రదాయిని!**
**భారత భాగవత గీతా శ్రవణ పఠనాచరణాదిక పుణ్యఫలదాత్రి ! కాళి !**
**మహాదివ్యాద్భుత దశసహస్రావధానక్రతు శక్తియుక్తి ప్రదాయిని ! శ్రీకాళి! 20**

తా॥ మానవకోటి జీవన గమనానికి మూలమైనవి వేదాలు, ఉపనిషత్తులు. ఈ వేదములు విశ్వంలోని ప్రతివ్యక్తీ చదువదగినవి. ఇవి నాలుగు (4). వీటిని చతుర్వేదములంటారు. అవి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము మరియు అధర్వణ వేదములు. ఈ వేదములు భారతదేశములోనే ఉద్భవించాయి. అంతే గాని ఇవి ఒకరి కులానికో మతానికో సంబంధించినవి కావు. మానవుల మనుగడకు సంబంధించిన ప్రతి చిన్నవిషయం కూడా ఈ వేదాలలో వివరించబడి ఉన్నది. మొట్టమొదట వేదములన్నియు ఒకే గ్రంథముగా ఉండేవట. ఆ తరువాత వ్యాసమహర్షి వేదాన్ని సులభతరం చేయటానికి నాలుగు భాగాలుగా విభజించారు. ఋగ్వేదము పూర్తిగా ఋత్విక్కులకు సంబంధించిన విషయ జ్ఞానంతో నిండి ఉంటుంది. సకల మంత్రములు, వాటి పఠనము, ఆచరణ, యజ్ఞనిర్వహణ, పూజాక్రతు విధానాలు, దైవకార్యాచరణలు మొదలైన, బ్రాహ్మణోత్తములు ఆచరింపవలసిన మరియు ప్రజలతో

వారు ఆచరింప చేయవలసిన దైవిక, అపరకర్మల విషయాలు అన్నీ కూలంకషంగా వివరించబడి ఉంటుంది. ఋగ్వేదములోని సూచనల అనుసారవే మంత్రభాగయుక్తమైన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలుస్తున్నది. అదే విధముగా యజుర్వేదములో దేవునికి సమర్పించే ప్రసాదములు, అవి ఎలా చేయాలి, ఎలా నివేదన చేయాలి వంటి విషయాలు, సామవేదంలో సంగీతము, పాటలు మొదలగు విషయాలు అధర్వణ వేదములో మోక్షసాధన ఆదిగా గల విషయాలు పొందుపరచబడి ఉన్నట్లు తెలుస్తున్నది. సముద్రంలో ఉండేది 'నీరు' అనే ఒక్క పదార్థమే అయినా, దాని అంతు, దరి తేల్చటం ఎవరితరం అవుతుంది. అలాగే వేదాలు కూడా మహావిజ్ఞాన సముద్రాలే. నాలుగు వేదాలనూ నాలుగు మహాసముద్రాలతో పోల్చుకుంటే, అందులో నుంచి ఎవరైనా సరే తీసుకోగలిగిన జ్ఞానం ఒక గరిటెడు మాత్రమే. ఆ గరిటెడు జ్ఞానమే విశ్వమంతా వ్యాప్తి చెంది, సమాజం సరైన దిశలో వెళ్లటానికి ఉపయోగపడుతుంది. ఆ నాలుగు వేదాలలోని సారాన్ని కొన్ని ఉపభాగాలుగా విభజించారు. అవే ఉపనిషత్తులు. మన పురాణ కాలాలలోనే కొంతమంది యక్షులు, గంధర్వులు మొదలైన వారు గాలిలో పక్షిలాగా విహరించగలిగే విమానాలను రూపొందించారు. ఒక్క క్షణకాలంలోనే లోకాలన్నింటినీ భస్మీపటలం చేయగలిగిన బ్రహ్మాస్త్రం, నారాయణాస్త్రం మొదలైన అతిభయంకరమైన శక్తి గలిగిన అస్త్రాలను సృష్టించారు. నీటిని గడ్డ కట్టించగలిగిన, కొండలను కరిగించి నీటిప్రవాహంలా చేయగలిగిన, మండువేసవిలో కూడా వర్షఋతువును ఆహ్వానించగలిగే, కదిలే ప్రకృతిని స్థాణువులా చేయగలిగిన సంగీతరసరాగాలను మానవులు సాధించగలిగారంటే అందుకు కారణం వీటికి సంబంధించిన ప్రతి విషయం వేద అంతర్గతమై ఉండటమే కారణం. అంతెందుకు లోకంలో మనం అనుభవిస్తున్న ప్రతి అవసరానికీ మూల వివరణ వేదాలు, ఉపనిషత్తులలో ఉన్నదనటం అతిశయోక్తి కాదు. అందులోని సారాంశాన్ని సరిగా వెలికి తీయగలిగిన సామర్థ్యం లేనివారు, ఆ ... వేదాలలో ఏముంది... ఏమీలేదు.. ఇంతేగా అంటారు. ఒక సాధారణ పౌరుణ్ణి పిలిచి సముద్రపు నీటిలో ఏమి ఉంటుందంటే, ఉప్పు ఉంటుందంటారు. అతనికి అంతకు మించి తెలియదు. కొంచెం తెలివైన వాడు ఆ నీటితోపాటు ఖనిజాలు, లవణాలు మొదలైనవి లభిస్తాయని చెప్తాడు. అలాగే ఇంకా కొంచెం జ్ఞానవంతుణ్ణి అడిగితే, సముద్రపు నీటిలోని ఖనిజాలు, లవణాలు ఏ విధంగా

ఉంటాయి, అవి ఎందుకు ఉపయోగపడతాయి, మానవుడు వాటిని వేరుచేసి ఉప్పు, సముద్రపు నీటిని మంచినీరుగా ఏ విధంగా తయారుచేసుకోవచ్చు అనే విషయాలను తెలియచేస్తాడు. అదే విధంగా వేదాల, ఉపనిషత్తుల సారాంశాన్ని సరైన రీతిలో బహిర్గతం చేయగలిగిన సామర్థ్యం లోపించటం వల్లనే ఆధునిక కాలమైన ఈ రోజుల్లో వాటికి ఆదరణ లోపించింది. అలాకాక వేదాలు, ఉపనిషత్తులు, మహాపురాణాలు మొదలైన మంచి మంచి గ్రంథాలను పఠిస్తూ వాటిని సంపూర్ణంగా అర్థం చేసుకొని, మరలా వాటి వివరాలను, విలువలను పదిమందికి ప్రవచన రూపంలో తెలియచేయటంవలన వాటి ప్రాచుర్యాన్ని పెంచిన వారవుతారు. అందువలన ఎంతో కీర్తి ప్రతిష్ఠలు కూడా లభిస్తాయి. కాని అంతకు మించిన ఎన్నో రెట్ల కీర్తి ప్రతిష్ఠలను పుణ్య శుభ ఫలితాలను శ్రీకాళీమాత అమ్మవారిని ఆరాధిస్తున్న తమ భక్తులైన, తమకు నిరంతరం సేవ చేస్తున్న వారికి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

రామాయణాన్ని వాల్మీకి మహర్షి వ్రాశారు. ఈ రామాయణం మొత్తం ఇరవై నాలుగు (24) వేల శ్లోకాలలో వ్రాయబడింది. దీన్ని మొత్తం ఆరు కాండలుగా విభజించారు. 'కాండ' అనగా భాగము అనుకోవచ్చు. అవి బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ మరియు యుద్ధకాండలు. రామాయణ మహాకావ్యాన్ని ఒకసారి ఆలోకనం చేస్తే శ్రీరామచంద్రుడు ధర్మాన్ని ఆచరించటానికి, ధర్మాన్ని కాపాడటానికి, చివరకు ధర్మానిదే అంతిమ విజయం అని లోకానికి తెలియజెప్పడానికి ఎన్నో బాధలను అనుభవించాడని తెలుస్తుంది. ఎన్నెన్నో కఠోరమైన పరీక్షలకు ఎదురు నిలిచాడు, ధర్మాన్ని నిలబెట్టడానికి చివరకు ధర్మపత్నినే త్యాగం చేయవలసినంత కఠిన పరీక్షను ఎదుర్కొన్నాడు. కాని ధర్మాన్ని మాత్రం వీడలేదు. కృతయుగం అంతమయ్యే సరికి, అప్పటికి నాలుగు కాళ్లతో ఉన్న ధర్మదేవత, త్రేతాయుగారంభానికి ఒక కాలు కోల్పోయి, మూడు కాళ్లతోనే మిగిలిందట. కోల్పోయిన ఒక పాదం అధర్మం పక్షాన నిలిచి రావణునిలో ప్రవేశించింది. అందువల్లనే మహాజ్ఞాని, మహాపండితుడు, సాక్షాత్తూ బ్రహ్మతో సమానమైన మేధస్సు గలిగినవాడు, కేవలం 'పరస్త్రీ వ్యామోహం' అనే ఒకే ఒక్క కారణంచేత రామాయణ కథంతా నడవటానికి కారకుడయ్యాడు. రామాయణ

మహాకావ్యంలోని కథా సన్నివేశాలు నవరసాలతో నిండియున్న అమృతభాండము లాంటివి. ఆ కథల పారాయణం, పఠనం చేస్తున్నప్పుడు అనుభవించే భౌతికమైన ఉద్వేగాలకన్నా, ఆ సన్నివేశంలోని కథలో అంతర్లీనంగా ఉండే సందేశం ఎంతో విపులంగా, వివరంగా, ధర్మబద్ధమైనదిగా ఉంటుంది. అది గ్రహించగలిగిన వారు విజ్ఞానులు, ఆ సందేశాలను దేశసంచారం చేస్తూ తమ ప్రబోధాల ద్వారా ప్రజలకు చేరువయ్యేటట్లు చేయగలిగిన వారు పుణ్యాత్ములు. అందుకోసం తమ జీవితాలను అంకితం చేసేవారు మహాపుణ్యాత్ములు. రామాయణ మహాకావ్యాన్ని చదివినా, విన్నా ఎంతో పుణ్యం లభిస్తుందని చెపుతారు. కాని, రామాయణ మహాకావ్యాన్ని చదివినా అందులోని సందేశాలను ప్రభోదాత్మకంగా పదుగురకు వినిపించినా వచ్చే పుణ్యఫలం కంటే అత్యధికమైన పుణ్యఫలితాలను శ్రీకాళీమాత తమను అమితంగా ఆరాధించే భక్తులైన వారికి అతిశీఘ్రంగా ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

అదే విధంగా మహాభారతం, భాగవతం, భగవద్గీత మొదలైన గ్రంథాలలో కూడా మానవ సమాజానికి అవసరమైన విజ్ఞానం ఎంతోఉన్నది. త్రేతాయుగం ముగిసిపోయి ద్వాపరయుగం వచ్చేసరికి ధర్మదేవతకు రెండు కాళ్లే మిగిలాయట. సగం ధర్మం నశించింది. కక్షలు, కుతంత్రాలు ప్రారంభమయ్యాయి. ఇది తప్పు, అధర్మం. ఇలా చేయకూడదు అని చెప్పగలిగిన మహామహులు ఉన్నప్పటికీ, మంచి మాటలువినని మూర్ఖమతులు కూడా తయారయ్యారు. పతివ్రతలైన స్త్రీలను అపహరించి చెఱబట్టటం రామాయణ కథలో ప్రారంభమైనా, ఆ దౌర్భాగ్యం, త్రేతాయుగం నుంచి ద్వాపరయుగం, అనగా మహాభారతం జరిగే నాటికి, పెరిగి పెద్దదై వేయి తలలుగా విస్తరించింది. దాని పర్యవసానమే ద్రౌపదీదేవి వస్త్రాపహరణం. ఈ నూతన సమాజంలో నడుస్తున్నది కూడా అలనాటి మహాభారత కథలలోని రాజకీయ కుతంత్రాలే. కాని, మహాభారతాన్ని చదివి నేర్చుకొనవలసినది కుట్రలు, కుతంత్రాలు ఎన్ని విధాలుగా రూపాంతరం చెందుతాయో, అలాంటి వారి బారిన పడకుండా ఏ విధంగా మసలుకోవాలనే విషయ పరిజ్ఞానాన్ని సంపాదించుకోవాలి. ఎందుకంటే అధర్మం పెచ్చుమీరినప్పుడు, అలాంటి వారిని తుదముట్టించి ధర్మప్రతిష్ఠాపనను చేయటానికి, దైవం, ఏదో ఒక అవతారాన్నిదాల్చి ధర్మపరులను

రక్షించటానికి సర్వసన్నద్ధంగా ఉంటాడనేది వాస్తవం. భాగవతం, భగవద్గీత గ్రంథాలుకూడా, స్థూలంగా చెప్పాలంటే మానవులు ఎలా ఉండాలి, ఎలా ఉండకూడదు అనే విషయలనే, కథల రూపంలో తెలియచేస్తాయి. ఈ సద్గ్రంథాలను ఎవరైనా ప్రవచనాల రూపంలో చెపుతుంటే వినినా, వాటిని చదివి అందులోని మంచి విషయాలను ఆచరణలో పెట్టటం వలన జీవితంలో సుఖశాంతులు, శుభఫలితాలు కలుగుతాయి, పుణ్యం ప్రాప్తిస్తుంది. కాని, మహాభారతం, భాగవతం, భగవద్గీతలను వినటం, చదవటం, వాటిని పాటించటం వలన ప్రాప్తించే పుణ్యఫలం కన్నా మిన్నయైన సుఖశాంతులను, అద్భుత శుభఫలితాలను, అత్యంత ఎక్కువ పుణ్యాన్ని శ్రీకాళీమాత తమ భక్తులైన వారికి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

అవధాన ప్రక్రియ అనేది మహాద్భుతమైన విద్య. ఒక విద్వాంసునిలో ఉన్న విజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శన అని చెప్పుకోవచ్చు. పూర్వకాలంలో సంస్కృత భాషలో ఈఅవధానాలు నిర్వహించేవారు. ఈ ఆధునిక యుగంలో తెలుగుకవులు కూడా కొందరు అవధాన ప్రక్రియను చేస్తున్నారు. ప్రతి విషయానికీ సంబంధించిన జ్ఞానం, మేధాసంపత్తి, ధారణశక్తి, అప్పటికప్పుడు దేన్ని గురించయినా ఆశువుగా చెప్పగలిగిన నేర్పు, చురుకుదనం వీరికుంటుంది. ఈ అవధానాలలో శతావధానం, సహస్రావధానం అంటూ ప్రశ్నలడిగే వారి సంఖ్యను బట్టి రకరకాల పేర్లు ఉంటాయి. ఇది ఒక అసాధారణమైన విద్య. కత్తిమీద 'సాము' లాంటిదని చెపుతారు. 8 (ఎనిమిది) మంది ప్రశ్నలు వేసేవారు (పృచ్ఛకులు) ఉంటే అష్టావధానమని, వంద మంది (100) పృచ్ఛకులుంటే శతావధానమని, వేయి (1000) మంది పృచ్ఛకులుంటే సహస్రావధానమని శ్రీకాళీమాత అమ్మవారిని నిత్యం పూజిస్తూ, ఆరాధిస్తూ, త్రికరణ శుద్ధిగా, సంకల్పం చేసి అర్థిస్తే, అష్టావధానం కాదు, శతావధానం కాదు, సహస్రావధానం కాదు, ఏకంగా మహాదివ్యమైన అద్భుతమైన పదివేలమంది (10,000) పృచ్ఛకులను సభలో కూర్చోబెట్టి దశసహస్రావధాన క్రతువులు సమర్థంగా నిర్వహించగలిగే శక్తిని, అద్భుత యుక్తిని 'ఆశువు'గా ప్రసాదిస్తారని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో తెలియ చేస్తున్నారు.

శ్లో॥ దివ్యలింగాగ్రోపరి మహాద్భుతాసన యోగకరణామృతాకర్షణరూపిణి ! కాళి !
శివలింగాద్యంతపరిపూర్ణావగతాక్షయసాక్ష్యాద్వైతామృతాదిశక్తే ! వరకాళి!
బ్రహ్మాజ్ఞానోద్భవాక్షయోత్పత్తి కారణామృతాక్షర స్తోత్రపారాయణశక్తి ప్రదాత్రి!
త్వదీయ హృదయాలయ ప్రవేశార్థాతాజన్మాంతర సుస్థిర నివాస భాగ్యప్రదే! 21

తా॥ ఈ విశ్వమంతా శివతత్త్వమే అని చెపుతారు, సర్వత్రా వ్యాపించి ఉన్న వాడు శివుడే అని చెపుతారు. కదలక స్థిరంగా ఉండేది శివతత్త్వమైతే, కదులుతూ నిత్యచైతన్యాన్నికలిగించేది శక్తిరూపమని పెద్దలు చెపుతారు. అనగా దేనికయినా కదలిక రావాలంటే శక్తి తప్పనిసరిగా అవసరం ఉంటుంది. చెట్లు కదలాలన్నా, అవి కదులుతూ ధ్వనులు చేయాలన్నా, కాయ పండి చెట్టు నుంచి విడివడి నేలపైన పడాలన్నా ప్రతి కదలికకూ శక్తి ఎంతో కీలకమైనది. లోకంలో కదలిక అనేది లేకపోతే జీవుల మనుగడ సాధ్యం కాదు. ఆ కదలికలకు మూలం శ్రీఆది పరాశక్తి శ్రీకాళీమాత శక్తి లేకపోతే లోకమంతా శూన్యమే. శూన్యంలో ఎలాంటి జీవికూడా మనుగడ సాగించజాలదు. మనుషులలో ఎవరు గొప్ప, ఎవరు గొప్ప అనే వివాదాలు ఎప్పుడూ తలెత్తుతూనే ఉంటాయి. ఇద్దరి గొప్పవారి మధ్య పోటీ నడుస్తున్నప్పుడు, వారిద్దరిలో ఒకరే గొప్ప అని నిర్ణయించే సమయానికి వీళ్లిద్దరినీ మించిన మొనగాడు మూడవవాడు రంగప్రవేశం చేస్తాడు. ఆట మంచి రసకందాయంలో పడుతుంది. అదే విధంగా దేవతలలో కూడా కొంతమంది అప్పుడప్పుడు గర్వంతో విర్రవీగి చివరకు గర్వభంగం కలిగిన సందర్భాలు ఉన్నాయి. ఒకసారి శ్రీమహావిష్ణువు. బ్రహ్మల మధ్యన ఎవరు గొప్ప అనే ఆధిపత్యపు పోరు ప్రారంభమైనది. ఇద్దరిలో ఎవరు గొప్ప వారో తేల్చుకోవాలంటే శివలింగం యొక్క ఆది అంతాలు కనుగొని ఎవరు ముందు తిరిగి వస్తే వారే గొప్ప అనే ఒప్పందం కుదిరి, శ్రీమహావిష్ణువు వరాహరూపం దాల్చి భూగర్భంలోనికి బయలుదేరాడట. ఎందుకంటే శివలింగం మూలభాగం పాతాళంలో ఉన్నది. అలాగే బ్రహ్మ హంసవాహనమెక్కి ఆకాశం వైపు బయలు దేరాడట. వీళ్లిద్దరూ ఎంత ప్రయత్నించినా శివలింగం క్రింది భాగం మరియు పై భాగాల అంచులను చేరలేకపోతున్నారు. అందుకు కారణం శివలింగం ఆకాశం అంచులు దాటి, ఖగోళ లోకం ప్రవేశించి ఆపైన నక్షత్ర లోకాలను దాటి అపరిమితంగా పెరిగి పోసాగిందట. ఆ శివలింగం పెరుగుదల ధాటికి వీరు భయపడి దాని మొదలు చివర కనుగొనలేక ఓటమి పాలయ్యారు. అలా పెరిగిపోతున్న

శివలింగం ఒకానొక స్థితిలో పెరగటం ఆగిపోయిందట. శివుడు కన్నులు తెరిచి చూసేసరికి ఆ తల్లి జగన్మాత శ్రీకాళీమాత అమ్మవారి పాదదర్శనం అయ్యిందట. శివుడు ఆ తల్లికి నమస్కరించి చూశాడట. ఆ తల్లి కన్పించటం లేదు. ఆ తల్లి పాదమే లోకమంతా వ్యాపించి ఉండి కన్పిస్తుందట. అసలు జరిగింది ఏమిటంటే జగన్మాతయైన శ్రీకాళీమాత అమ్మవారు, తమ కుడికాలుపైన ఎడమకాలును వేసుకొన్న స్థితిలో ఆసీనులై కూర్చొని ఉన్నారు. ఆ తల్లి కుడికాలు పాదం, పాతాళం అడుగు భాగంలో మోపబడి ఉంది. కూర్చొని మడత వేసుకొన్న ఎడమకాలి పాదం అంతరిక్షం చివరి భాగంలో ఉన్నది. అపరిమితంగా పెరిగిపోయిన శివలింగం, ఆ తల్లియొక్క, పాతాళంలో ఉన్న కుడిపాదం దగ్గర నుంచి, మడత వేసి కూర్చున్న ఎడమ పాదం అంతరిక్షం వరకూ ఉన్నది. అనగా ఆ తల్లి మోకాలికి సమానమైన ఎత్తులో పెరిగి ఉన్నది. ఆ తల్లి రెండు పాదాల మధ్యనే ఈ విశ్వమంతా వ్యాపించి ఉంటే, ఆమె మిగిలిన దేహభాగం ఎంతటి విశ్వాంతరాళను వ్యాపించి ఉంటుందో ఎవరూ, ఎన్నటికీ ఊహించలేరు.

దైవతత్త్వాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. అర్థం చేసుకోవటానికి ఎవరైనా ప్రయత్నాలు మాత్రమే చేయగలరు. బిడ్డలు ఎంత ఎదిగినా, తల్లి స్థాయికి మించి ఎదగలేరు. బిడ్డల గొప్పదనాన్ని తల్లి తెలుసుకోగలదు గాని, తల్లి గొప్పదనాన్ని బిడ్డలు తెలుసుకోజాలరు. అందుచేతన త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఆది అంతాలు లేని ఆ తల్లి జగన్మాత యొక్క ఉనికిలోని కొంత భాగాన్ని కూడా కనుగొనలేకపోయారనేది స్పష్టంగా తెలుస్తున్నది. కాని ఆ తల్లి శ్రీకాళీమాత అమ్మవారికి మాత్రం శివలింగం యొక్క ఆది అంతాలు ఎక్కడ ఉన్నాయో పూర్తిగా తెలుసు. కాని ఆ తల్లి మాత్రం తనకేమీ తెలియనట్లుగా, అన్నింటికీ సాక్షిగా మాత్రమే నిలిచే అమృతమూర్తి శ్రీకాళీమాత.

జ్ఞానం అంటే లౌకిక జ్ఞానమని, బ్రహ్మజ్ఞానమంటే అలౌకిక జ్ఞానమని చెప్పుకోవచ్చు. బ్రహ్మజ్ఞానానికి ప్రమాణికత ఏమీ లేదు. మామూలు చదువులైతే ప్రతి సంవత్సరం పూర్తవగానే, తదుపరి తరగతి లోనికి ప్రవేశించవచ్చు. ఈ చదువులు ఒక కొలబద్ధ ప్రకారం సాగుతాయి. బ్రహ్మజ్ఞానమంటే సాక్షాత్తూ త్రిమూర్తుల సరసన చేర్చగల జ్ఞానం. ధర్మాన్ని అక్షరాలా పాటించేవారు, న్యాయానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచేవారు, ఇంద్రియ జ్ఞానం కలిగి పంచేంద్రియాలనూ అదుపులో ఉంచుకోగలిగిన

సమర్థత. లోకంలోని జీవులన్నింటినీ ఒకే విధమైన ప్రేమతో ఆదరించే దయా, గుణం మెండుగా గలిగిన మహనీయులు బ్రహ్మజ్ఞానం పొందగలిగే అర్హతలు కలిగి ఉండవచ్చు. పైన చెప్పిన విశేషాలన్నీ సామాన్యులు సమకూర్చుకోవాలంటే జీవిత కాలం సరిపోకపోవచ్చు. పూర్వకాలంలో ఋషులు, మునులు, యోగులు కొన్ని వందల, వేల సంవత్సరాల పాటు తపస్సు చేస్తూ వారి శరీరం చిక్కి శల్యమైన పరిస్థితులలో బ్రహ్మజ్ఞానులుగా మారేవారని తెలుస్తున్నది. అలా కాక, జగజ్జనని శ్రీకాళీమాత అమ్మవారి వరానుగ్రహం వలన కూడా బ్రహ్మజ్ఞానప్రాప్తి కలుగుతుంది. బ్రహ్మజ్ఞానం పుట్టుకకు కారణమైన, అది మరలా ఉత్పత్తి కావటానికి కారణమైన అమృతాక్షర స్తోత్ర పారాయణకు అవసరమైన శక్తిని ఆ తల్లి శ్రీకాళీమాత అమ్మవారు ప్రసాదిస్తారు. ఆ తల్లి అనుగ్రహం వలన, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమమరాజ్ గారు సంస్కృతంలో రచించిన 108 (నూట ఎనిమిది) అద్భుత శ్లోకాలను నిత్య పారాయణం చేయువారికి ఆ తల్లి సకల సంపదలను, శుభాలనూ అక్షయంగా ప్రసాదిస్తుంది. ఈ అమృతాక్షరాద్భుత స్తోత్ర రత్నమాలిక బ్రహ్మజ్ఞానం సంపాదించడానికి సాక్షాత్తూ మార్గదర్శి అవుతుంది.

శ్రీకాళీమాత అమ్మవారిని భక్తులు తమ హృదయంలో నిలుపుకొని ధ్యానిస్తారు, పూజిస్తారు. అందువలన ఆ భక్తులు, తలచిన మరుక్షణమే ఆ తల్లి వచ్చి శుభాలను ప్రసాదిస్తుంది. ఆ విధంగా భక్తులు తమ మనసులనే మందిరాలుగా చేసి ఆ తల్లిని అందులో ప్రతిష్ఠించుకొని నిత్యం ఆరాధించటం ఒక్క రోజులో సాధ్యపడే విషయం కాదు. నిరంతరం వారి మనసు ఆ తల్లిమీదే కేంద్రీకరింపబడి ఉంటే, ఆ తల్లి వారి మనసుల్లో స్థిరనివాసం ఏర్పరచుకుంటుంది. అలా కాక, ఆ తల్లి మనసులోనే ఆ భక్తులు శాశ్వతంగా నిలిచిపోయే అర్హతను, భాగ్యాన్ని పొందటమనేది అత్యంత కఠినమైనది. అసాధారణమైనది. అలాంటి అరుదైన అదృష్టాన్ని, భాగ్యాన్ని పొందగలిగే వారు ఈ లోకంలో పది కోట్ల మందిలో ఒకరిద్దరు ఉంటారేమో. అలాంటి ప్రాప్తిని శ్రీకాళీమాత అమ్మవారు, తమను నిజాయితీగా ఆరాధించే వారికి, పూజించే వారికి అతిసులభంగా ప్రసాదిస్తుందని, అలాంటి భక్తులను ఆ తల్లి తమ హృదయ స్థానంలో నిలుపుకొంటుందని భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో తెలియ చేస్తున్నారు.

**శ్లో॥ సహస్రకోటి వాణీశాలయ నిర్మాణ ప్రతిష్ఠారాధనాధిక సుఫలప్రదే ! కాళి!**
**లక్షకోటి లక్ష్మీశాలయ నిర్మాణప్రతిష్ఠారాధనాధిక సుఫలప్రదాత్రి ! కాళి!**
**కోటికోటి పార్వతీశాలయ నిర్మాణప్రతిష్ఠాభిషేకార్చనాధిక సుఫలప్రదే !**
**సకల దేవతాలయ నిర్మాణ విగ్రహప్రతిష్ఠార్చనాధిక సుఫలప్రదాయిని! 22**

తా॥ వేయికోట్ల బ్రహ్మదేవుని ఆలయాలను నిర్మించి, అందులో శ్రీ సరస్వతీ బ్రహ్మదేవుల విగ్రహాలను ప్రతిష్ఠించి, నిత్యం వారికి ఇష్టమైన అభిషేకాలు చేస్తూ తెల్ల కలువలతో పూజలు చేయటంవలన ఎంతో కొంత పుణ్యం లభిస్తుంది. ఒక ఆలయాన్ని నిర్మించి అందులో బ్రహ్మ సరస్వతీ విగ్రహాలను ప్రతిష్ఠ చేయటానికి ఒక జీవితకాలం సరిపోతుంది. ఐనా, వేయికోట్ల బ్రహ్మదేవుని ఆలయాలను కట్టించి, అందులో శ్రీ సరస్వతీ బ్రహ్మదేవుల విగ్రహాలను ప్రతిష్ఠించి, ఆరాధిస్తే వచ్చే పుణ్యఫలితంకన్నా, శ్రీకాళీమాతను మనసారా నమ్మి పూజిస్తే అంతకు మించిన అధిక ఫలాన్ని, ఆ తల్లియైన శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

అలాగే లక్షకోట్ల విష్ణుమూర్తి ఆలయాలను నిర్మించి, అందులో శ్రీలక్ష్మీదేవి విష్ణుమూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి, ప్రతినిత్యం ఎంతో చక్కగా వారికి అభిషేకాలు చేస్తూ అలంకరిస్తూ, వారికి ప్రీతికరమైన నైవేద్యాలను అర్పిస్తూ, లక్షల కోట్ల తులసీ దళాలతో పూజలు చేస్తే వచ్చే ఫలితంకన్నా శ్రీకాళీమాతను, అత్యంత విశ్వాసంతో ఆరాధించటంవలన, ఆ తల్లి తన భక్తులకు ప్రసాదించే ఫలితం ఎంతో ఎక్కువగా ఉంటుంది.

అదే విధంగా కోటి కోట్ల శివాలయాలను కట్టించి, అందులో శ్రీ పార్వతీదేవి మరియు శివలింగాల ప్రతిష్ఠలు చేసి, ప్రతిరోజూ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో రుద్రాభిషేకాలు, అర్చనలు, అలాగే వారికి ప్రీతిపాత్రమైన, బిల్వపత్రాలతోను, శివలింగం పూలతోను, పూజిస్తూ, నిష్ఠగా పూజలు చేయటం వలన ఉత్తమ ఫలితాలు లభిస్తాయి. కాని, అంతకు మించిన అద్భుత శుభఫలితాలను శ్రీకాళీమాత, తనను సేవించే భక్తులకు ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

భక్తి కొలదీ అనేకమంది దేవుళ్లకు, దేవతలకు ఆలయాలను నిర్మించి రామాలయాలు, కృష్ణాలయాలు, ఇంకా ఎంతోమంది దేవుళ్లకు దేవతలకు ఆలయాలను నిర్మించి అందులో అనేకమంది దేవతా మూర్తులను ప్రతిష్ఠించి ఆరాధించటం వలన వచ్చే ఫలితంకన్నా ఇంకా, ఇంకా, ఎన్నో ఎన్నెన్నో మంచి శుభఫలితాలను అత్యంత శీఘ్రంగా శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ నవశతకూపతటాక విద్యా వైద్యాలయ నిర్మాణఫలాదిక సుఫలప్రదాత్రి ! కాళి !**
**అష్టయామార్చనేనైవ గోకోటి విద్యాభూ వస్త్రదానాదిక పుణ్యఫలప్రదే !**
**ద్వాదశదినార్చనేనైవ నవవర్ష రత్నస్వర్ణ నిత్యాన్న దానాదిక సుఫలప్రదే!**
**ఏకపక్ష త్రికరణశుద్ధ్యర్చనమాత్ర సకలదానాదిక మహోఫలప్రదాత్రి ! 23**

తా॥ పుణ్యం సంపాదించటం కోసం ఎంతోమంది ఎన్నో రకాల మార్గాలను ఎంచుకొంటారు. కొందరు తొమ్మిది వందల బావులు తొమ్మిది వందల చెరువులు తవ్విస్తారు వాటిలోని నీరు ఎంతోమందికి దాహాన్ని తీరుస్తుంది. దాహం తీరిన తరువాత వారు తృప్తిచెంది, ఆ బావి తవ్వించిన వారిని మనసారా దీవించటం వలన కొంత పుణ్యం లభిస్తుందని భావిస్తారు. మరికొందరు చెఱువులు తవ్వించటం వలన, ఆ నీరు వ్యవసాయానికి, పశువులకు, పక్షులకు మరెన్నో జంతువులకు దాహం తీర్చుకోవటానికి, అవసరమైనప్పుడు వాటిని శుద్ధి చేసుకొని త్రాగునీటిగా వాడుకోడానికి, ఉపయోగ పడటంవలన, తవ్వించిన వారికి కొంతైనా పుణ్యం వస్తుందని వారి భావన. విద్యాలయాలు కట్టించటం వలన, ఎక్కువ మందికి విద్య లభించి, విజ్ఞానాన్ని సంపాదించి, వారు భవిష్యత్తులో ఉద్యోగ వ్యాపారాలు చేసుకొని జీవించటానికి ఉపకరిస్తాయి. అలాగే, వైద్యాలయాలు రోగులకు సేవ చేయటంవలన కొంత పుణ్యం లభిస్తుంది. కాని, తొమ్మిది వందల బావులు, తొమ్మిది వందల చెఱువులు తవ్వించటంవలన వచ్చే పుణ్యఫలం కన్నా, తొమ్మిది వందల విద్యాలయాలనూ, తొమ్మిది వందల వైద్యశాలలనూ (ఆసుపత్రులను) నిర్మించి నందువలన వచ్చే పుణ్యఫలంకన్నా ఇంకా ఎక్కువ శుభఫలితాలను, శ్రీకాళీమాత ఆరాధన ద్వారా, ఆ తల్లి ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

కోటి గోవులను దానం చేయటం ఎంతో ప్రశస్తమైనది; ఎంతో పుణ్యప్రదమని పురాణాల ద్వారా తెలుస్తున్నది. విద్యాదానం కూడా అంతే పుణ్యాన్ని ప్రసాదిస్తుందని తెలుస్తున్నది. భూమిని దానం చేయటంవలన, వారి వంశం, తరతరాలు తరిస్తాయని చెప్తారు. అలాగే పేదవారికి వస్త్రదానం చేయటం వలన ఇంకా శ్రేష్ఠమైన ఫలితాలు లభిస్తాయి అని అంటారు. అయితే ఈ దానాలన్నింటితోనూ వచ్చే పుణ్యంకన్నా అధికమైన పుణ్యఫలితాలను (24) గంటలలోనే శ్రీకాళీమాత, వారి భక్తులకు ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

పూర్వకాలంలో చక్రవర్తులు రాజులు తమ వైభవాలను లోకానికి చాటి చెప్పాలని, వారి ధనాగారాల్లోని, వజ్రాలను, రత్నాలను, బంగారు ఆభరణాలను,

ఇంకా ఎన్నో విలువైన వస్తువులను, ప్రజలకు దానం చేస్తూ ఉండేవారు, అలాగే ఏదో ఒక శుభసందర్భాన్ని పురస్కరించుకొని నిత్యాన్నదానాలను చేస్తూ ఉండేవారు. అలాంటి దానాలను తొమ్మిది సంవత్సరాల పాటు నిత్యదానం చేసినందు వలన వచ్చే ఫలితం కన్నా అధిక ఫలితాన్ని అందజేస్తుంది శ్రీకాళీమాత. అందువలన వారి కీర్తి మరింత పెరిగేది, వారికి పుణ్యం లభించేది, ప్రజలలో వారికి పలుకుబడి పెరిగేది. అన్నదానాలు నేటికీ అనేకచోట్ల జరుగుతూనే ఉన్నాయి. అయితే ఈ దానాలవలన వచ్చే ఫలితంకన్నా ఎన్నో రెట్లు ఎక్కువ శుభఫలితాలను మనోహరమూర్తి అయిన శ్రీకాళీమాత (12) రోజులలోనే ప్రసాదిస్తుంది అంటారు శ్రీగురుదేవులు.

లోకంలో ఎన్నో రకాల దానాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అందుచేత, ఒక దాన్ని మించి మరొక దానం ఎన్నోరెట్లు పుణ్యాన్ని ప్రసాదిస్తుందని ఎవరికి తోచినది వారు, తాహతుకు అనుగుణంగా కొందరు, శాస్త్రాలను పరిశీలించి, వాటిలో చెప్పిన విధంగా మరికొందరు, పలువిధాలుగా దానాలు చేస్తుంటారు. లోకంలో ఎన్ని దానాలు అందుబాటులో ఉన్నా, వాటివలన ఎంతటి పుణ్యఫలం సమకూరినా, శ్రీకాళీమాత తమ భక్తులకు వీటన్నింటిని మించిన, అత్యధికమైన పుణ్యఫలాలను దానంగా ప్రసాదిస్తుంది. అందువల్లనే పరమాద్భుతమైన తల్లి సర్వదానగుణమూర్తి శ్రీకాళీమాత అని అంటారు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. ఎప్పుడూ ఏమంటుంటారంటే మానవులు, తెలుసుకోవలసిన గొప్ప రహస్యం ఏమిటంటే, శ్రీకాళీమాతను దర్శించుకోవటం, అమ్మను స్తుతించి పూజించటం. అమ్మవారి ఆలయ నిర్మాణ నిమిత్తం, అమ్మవారికి అనేక శుభకార్యాలు జరిపించేటప్పుడు ఎవరికి వారు పిలువకుండానే వెళ్ళి తమవంతు సేవలు, సహాయం చేసి అమ్మవారి ఆలయంలో నిదురించే వారిని, ఆతల్లి అన్నివిధాలా అనుగ్రహించి ఆశీర్వదిస్తుంది, అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ సహస్ర లక్ష కోటి సాలగ్రామ ప్రతిష్ఠాభిషేకార్చనాధిక సుఫలప్రదాయిని!**
**కృతత్రేతా ద్వాపరకలి చతుర్యుగార్చితాదిమూర్తే ! వరకాళి! సర్వయుగేశ్వరి!**
**కలియుగాంతపునః సత్యయుగ సంస్థాపనాదిమూర్తే ! శ్రీఆదిశక్తే ! అమృతేశ్వరి!**
**అనుగృహీత వేజెండ్ల వేంకట కాళీకృష్ణ పూజితే దేవి ! శ్రీమద్గురు వరకాళి! 24**

తా॥ వేయి లక్షల కోట్ల సాలగ్రామ శిలలను ప్రతిష్ఠించి, అనేక విధాలుగా అభిషేకాలు చేస్తూ, వివిధ రకాలుగా అర్చించి, పూజించినందువలన వచ్చే మంచి

ఫలితాలకన్నా ఇంకా గొప్ప శుభఫలితాలను శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, లోకంలో ఎన్నో గుడులు కట్టించి, అందులోని దేవుళ్లకు దేవతలకు అభిషేకాలు, పూజలు చేసినా, బడులూ, ఆసుపత్రులూ కట్టించి సేవలు చేసినా, సువర్ణ దానాలు, వస్త్రదానాలు, అన్నదానాలు, భూదానాలు, గోదానాలు, విద్యాదానాలు మొదలైనవి ఎన్ని చేసినా వచ్చే ఫలితంకన్నా, ఒక్కసారి మనసారా శ్రీకాళీమాతను పూజిస్తే, వాటన్నింటికన్నా మించిన పుణ్యఫలితాలను, ఆ తల్లి తన భక్తులకు ప్రసాదిస్తుంది. ఈ వాక్కులు సాక్షాత్తూ ఆ తల్లి, శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారితో పలికించిన అమృతపు వాక్కులు.

శ్రీరామావతారానికి పూర్వయుగమైన కృతయుగంలోనూ, శ్రీరామావతార యుగమైన త్రేతాయుగంలోను, శ్రీకృష్ణుడు అవతరించిన ద్వాపర యుగంలోను, కల్కి భగవానుడు అవతరించబోయే ఈ కలియుగంలోనూ, మొత్తం నాలుగు యుగాలలో కూడా, ఆ కాలం నుంచి ఈ కాలంవరకూ జరిగిన ఎన్నో వందల వేల లక్షల కోట్ల సంవత్సరాల నుండి, అందరిచేతా ఆరాధించబడుతున్న అనంతపరాశక్తి అయిన ఆద్యంతమూర్తి, అన్ని యుగాలకూ అధినాయకురాలు శ్రీకాళీమాత, ఈ కలియుగానంతరం మరలా తిరిగి సత్యయుగాన్ని సంస్థాపన చేసే ఆదిమూర్తి శ్రీకాళీమాతయే శ్రీభువనేశ్వరీదేవి. అంటూ ఫలితాన్ని ముచ్చటగా మూడు శ్లోకాలలో రచించారు.

శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు ఈ విధంగా స్తుతిస్తున్నారు. అమ్మా ! శ్రీకాళీమాతా ! వేజెండ్లపురములో జన్మించి శ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ పేరుతో పిలువబడుతున్న నన్ను, అనుగ్రహించి, నాకు సద్గురుమూర్తి వై, నాచేత పూజలందుకొంటున్న దేవీ ! శ్రీమద్గురు వరకాళీమాతా! కలకాలం నీ సేవాభాగ్యాన్ని ఇలాగే కలిగించు అంటూ భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారి చేత అమ్మవారైన శ్రీకాళీమాత పలికించి వ్రాయించిన అమృతపు వాక్కులివి. అన్నింటిని అప్పటికప్పుడే ఇవ్వగలిగిన తల్లి ఆదిపరాశక్తి శ్రీకాళీమాతయే అని తెలుసుకున్నవారే అమిత భాగ్యవంతులు.

**శ్లో॥ అమృతాక్షర ఫలశ్రుతి చతుర్వింశతి మహాదివ్యశ్లోకరచనాశక్తిప్రదాత్రి !**
**అష్టాశీతిషట్ శత ద్విసహస్రాక్షర ఫలశ్రుతి రచనాద్భుతశక్తి ప్రదాత్రి !**
**ఏకపంచ శతదశ సహస్రాక్షర అష్టోత్తరశత శ్లోక రచనాశక్తి యుక్తి ప్రదే !**
**వేజెండ్ల వేంకట కాళీకృష్ణేన మయాస్పష్టామృతరచనా సృష్టికారిణి! శ్రీకాళి!**

తా॥ వేజెండ్ల, శ్రీవిశ్వమాత ఆదిపరాశక్తి పీఠాధీశులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు పై శ్లోకంలో ఈ విధంగా తెలియజేస్తున్నారు. వేజెండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళీమాత అమ్మవారిని ఆరాధించటంవలన, పూజించటం వలన, ధ్యానించటం వలన, ఆ తల్లి స్తోత్రాలను పఠనం చేయటం వలన, గానం చేయటం వలన, నామస్మరణ చేయటం వలన, అభిషేకాదులు నిర్వహించటం వలన ఎలాంటి అద్భుత ఫలితాలు వస్తాయో, పుణ్యఫలాలు లభిస్తాయో, జీవితాలు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ఎంతటి శుభకరంగా సాగిపోతాయో, అనే విషయాలను, శ్రీగురుదేవులు (24) ఇరువది నాలుగు శ్లోకాల ద్వారా 'ఫలశ్రుతి'ని రచన చేయటానికి అవసరమైన మేధస్సంపత్తిని, శక్తిని తమకు ప్రసాదించినట్లు తెలియ చేస్తున్నారు. ఈ (24) ఇరువది నాలుగు శ్లోకాలు కూడా మహాదివ్యమైన శ్లోకాలుగా చెప్పుకోవచ్చు. ఒక్కొక్క శ్లోకానికి 4 (నాలుగు) పంక్తులను సమకూర్చినట్లు శ్రీగురుదేవులు తెలియజేస్తున్నారు. అలాగే (24) ఇరువది నాలుగు శ్లోకాలలోనూ, మరల ఒక్కొక్క శ్లోకంలో 4 (నాలుగు) పాదాలతోను కలిపి మొత్తం (2,688) (రెండు వేల ఆరు వందల ఎనభై ఎనిమిది) అక్షరాలుగా ఫలశృతి మొత్తం సృష్టి చేయబడిందని, అందుకోసం తగిన ఆలోచనా శక్తిని తమకు శ్రీకాళీమాత అమ్మవారు నిరంతరం ప్రసాదించారని శ్రీగురుదేవులు తెలియజేస్తున్నారు. అదే విధంగా 'అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలిక అనే అద్భుత గ్రంథాన్ని (108) (నూట ఎనిమిది) శ్లోకాలతో, మరల ఒక్కొక్క శ్లోకంలోనూ నాలుగు (4) పాదాలు ఉండేటట్లుగా, శ్రీకాళీమాత తమ చేత వ్రాయించారని, మరలా ఈ (108) నూట ఎనిమిది శ్లోకాలలోని మొత్తం అక్షరాల సంఖ్య (10,501) (పదివేల ఐదు వందల ఒకటి) అని తెలియజేస్తున్నారు శ్రీగురుదేవులు. వేజెండ్ల వేంకట కాళీ కృష్ణ అనబడే నా చేత ఆ తల్లి శ్రీకాళీమాత ఎంతో అద్భుతమైన, అమృత సమానమైన అక్షరాలతో కూడిన శ్లోకరచన చేయించిన అమృతమూర్తి శ్రీకాళీమాత, అంటూ శ్రీకాళీమాత వైభవాన్ని అనుగ్రహ శక్తిని కొనియాడుతున్నారు శ్రీగురుదేవులు పై శ్లోకంలో.

అమృతాక్షరాద్భుతానంద స్తోత్ర రత్నమాలికలోని 108 (నూట ఎనిమిది) శ్లోకాలు గాని, అలాగే ఫలశ్రుతిలోని (24) ఇరువది నాలుగు శ్లోకాలు గాని, శ్రీగురుదేవుల అనుభవసారం నుంచి వెలువడినవే. ఆ అనుభవాలు ప్రతివారి జీవితానికీ అన్వయం చేసుకొని శుభఫలితాలను, ఆ తల్లి శ్రీకాళీమాత అమ్మవారి అనుగ్రహాన్ని పుష్కలంగా పొందవచ్చునేది శ్రీగురుదేవుల ప్రబోధం.

# 43. (18) పదునెనిమిది సంవత్సరాల నిత్యాగ్ని హోత్ర విశిష్టత

(తాత్పర్యములతో)

**24-10-1993**

శ్లో॥ శ్రీముఖనామ సంవత్సర ఆశ్వయుజ శుక్ల దశమీ భానువాసరే !
ధనిష్ఠా నక్షత్ర మిధునలగ్న రాత్రౌ నిత్యాగ్నిహోత్ర ప్రారంభకారిణి !
వృద్ధబాలానేకరూపధారిణి ! భక్తజనాతిథ్య స్వీకారానుగ్రహమూర్తే !
అష్టాదశవత్సర నిత్యాగ్నిహోత్రావిఘ్ననిర్వహణశక్తిప్రదే ! కాళి ! 1

తా॥ శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, తాము మొట్టమొదటిసారిగా నిత్యాగ్నిహోత్రాన్ని ఎప్పుడు ప్రారంభించింది, ఆ సమయం యొక్క విశిష్టత, అలాగే నిత్యాగ్నిహోత్ర సమయంలోనూ ఆ తరువాత, ఇప్పటివరకూ ఆ తల్లి శ్రీవరకాళీమాత, ఏ విధంగా దర్శనమిచ్చి అనుగ్రహించిందీ తెలియజేస్తున్నారు. అది శ్రీముఖనామ సంవత్సరం, ఆశ్వీయుజమాసము, పందొమ్మిది వందల తొంభై మూడవ సంవత్సరం, విజయదశమి, దేవీనవరాత్రుల పర్వదినాలలో చివరిరోజు దసరా ఆదివారము, ధనిష్ఠానక్షత్రం, మిధున లగ్నంలో, అత్యంత శుభము అనుకూలమైన రాత్రి సమయం 9 గంటల 9 నిముషాలకు శ్రీగురుదేవులు నిత్యయజ్ఞాన్ని ప్రజ్వలింపచేసి ప్రారంభించారు. యజ్ఞానికి అవసరమయ్యే ఆవునెయ్యి, నైవేద్యం, గారెలు మొదలైన ప్రసాదాలు, రావి మేడి, జువ్వి వంటి చెట్లనుంచి సేకరించిన ఎండు సమిధలు నిండుగా సమకూర్చుకొని యజ్ఞం ప్రారంభించారు. శ్రీకాళీమాత యజ్ఞం జరుగుతున్నప్పుడు ఆ తల్లి, జగన్మాత ఏదో ఒక రూపంలో వచ్చి కన్పించేది. కొన్ని సమయాలలో స్ఫురద్రూపియైన, వయసు మళ్లిన స్త్రీమూర్తి వలె, నుదుటన కొట్టవచ్చేటట్లు కన్పించే ఎర్రని పెద్దకుంకుమ బొట్టు పెట్టుకొని నడుచుకుంటూ గుడిప్రాంగణంలోనికి వస్తున్నప్పుడు, ఆమె కాలి పట్టీల నుంచి వెల్వడే సన్నని చిరుగజ్జెల ధ్వని, చూడగానే ఏదో తెలియని భక్తిభావంతో కన్పించే రూపురేఖలతో ఎవరో పెద్ద ముత్తయిదువు వచ్చిన విధంగా వస్తూ ఏమీ మాట్లాడకుండా సైగల ద్వారానే, ఆ తల్లి అన్నీ తెలియజేసేది, మరికొన్నిసార్లు చిన్న బాలల రూపంలోనూ, మరికొన్ని సందర్భాలలో గుడికి అమ్మవారి దర్శనానికి వచ్చిన

భక్తురాలవలె అతిసుందర రూపంతోనూ, ఒక్కొక్కసారి వికారంగా ఉండే రూపాలతోనూ యజ్ఞం చేసేటప్పుడు భక్తులవద్దకు వచ్చి నిలుచునేది. ఏ రూపంలో వచ్చినా ముఖంలో దివ్యతేజస్సు ప్రస్ఫుటంగా కన్పించేది. అలా వచ్చి నిలుచున్నది శ్రీకాళీమాతయేనని శ్రీగురుదేవులు గ్రహించి మిగతా భక్తులతో ఆ తల్లికి ఫలాలు, పసుపు కుంకుమలను ఇప్పిస్తే, భక్తుల దగ్గరనుంచి వాటిని తీసుకొని వెళుతూ అదృశ్యమయ్యేది నిత్యయజ్ఞం ప్రారంభించిన శుభదినం నుంచి, ఈ రోజువరకు, గడచిన (18) పద్దెనిమిది సంవత్సరాలలో చాలాసార్లు ఇలా జరుగుతూ ఉండేది. ఇలా జరగడానికి గల కారణం ఏమిటని అడిగిన నా సందేహానికి, శ్రీగురుదేవులు ఇలా చెప్పారు. నిజభక్తుల వద్దకు ఆ తల్లే స్వయంగా వచ్చి వారు సమర్పించే ప్రసాదాలను తన స్వహస్తాలతో ఆనందంగా స్వీకరిస్తుంది. తద్వారా వారి పాపకర్మలు త్వరితగతిని నశిస్తాయి ఎన్నో శుభాలు చేకూరతాయి అని చెప్పారు. నిజంగా ఇది ఎంతో అద్భుతం. సర్వజగత్తునూ పాలించే జగన్మాత, శ్రీకాళీమాత సామాన్యభక్తులు సమర్పించే, అతిస్వల్పమైన నైవేద్యాలను, స్వీకరించడానికి స్వయంగా తరలివచ్చి, వాటిని భక్తుల నుంచి అందుకునే సమయంలో, ఆ తల్లి చేతి స్పర్శ తగిలిన భక్తుల జన్మలు ధన్యమౌతాయి. ఆలయంలో మూలవిరాట్టు పాదస్పర్శకే పులకించి పోయే, నాబోటి సాధారణ భక్తునికి, ఆ తల్లే స్వయంగా వచ్చి తన బంగారు చేతుల స్పర్శను భక్తులకు అనుగ్రహించిందంటే, అలాంటి స్పర్శానుభూతి ఎన్ని జన్మలెత్తైనా పొందాలనిపిస్తుంది.

అలా ఆ తల్లి శ్రీకాళీమాత ఏదో ఒక మానవరూపంలో వచ్చి భక్తులను అనుగ్రహిస్తూ, ప్రతిరోజూ వచ్చే ఆటంకాలను తొలగిస్తూ, యజ్ఞాలను నిర్విఘ్నంగా కొనసాగించే శక్తిని ప్రసాదిస్తున్నది ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాతయే అన్నారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ విశిష్ట పదార్థానేక వృక్ష సమిధ యజ్ఞనిర్వహణాద్భుత శక్తిప్రదే !**
**సంపూర్ణ సత్ఫలిత ప్రత్యక్ష సందర్శనాదృష్ట భాగ్యప్రదాయిని ! కాళి !**
**భూతభవిష్యద్వర్తమానకాల ధర్మమర్మ ప్రబోధనాచార్యమూర్తే ! దేవి !**
**సుసంకల్పసిద్ధి సంవృద్ధికారిణి ! శ్రీకాళి ! స్థితప్రజ్ఞత్వ ప్రదాయిని ! 2**

తా॥ యజ్ఞాలలో వాడే అవన ద్రవ్యాలలో శ్రీకాళీమాతకు అత్యంత ప్రీతిపాత్రమైన పదార్థాలు – పాయసము, కట్టెపొంగలి, తోడుపెట్టిన పెరుగు అన్నము,

గారెలు, పూర్ణాలు ఇంకా ఎన్నో ఇతర మంచి వంటకాలు, పదార్థాలు, అలాగే రావి, జువ్వి, మేడి, మఱ్ఱి, మామిడిజమ్మి వంటి ప్రత్యేకమైన కట్టెలతో యజ్ఞాలను చేస్తారు. ఈ కట్టెలు సేకరించడానికి శ్రీగురుదేవులు ఒక్కోసారి శిష్యబృందంతో వెళ్లి వాటిని స్వయంగా బండ్లలో ఎక్కించి గుడిలో దించడానికి స్వయంగా పూనుకునేవారు. యజ్ఞాలకు సంబంధించిన ప్రతివిషయాన్నీ తామే స్వయంగా చూస్తుంటారు. ఇలా వివిధ రకాల చెట్లనుంచి వచ్చిన కట్టెలను ఉపయోగించటం వలన ఎన్నో విచిత్రమైన శక్తులను ప్రసాదించేది శ్రీకాళీమాత యజ్ఞాలకు అవసరమైన వస్తువులను, పదార్థాలను ఆ తల్లి అవలీలగా ఎవరో ఒకరి ద్వారా ఏర్పాటు కావించేది. తన భక్తులు సంపూర్ణమైన ఫలితాలను అనుభవాలను పొంది, అనేక లీలలను స్వయంగా చూసే అదృష్టాన్ని కలుగజేస్తూ తన భక్తులకు పూర్వకాలంలో జరిగినవి, రాబోయే కాలంలో జరుగబోయేవి ప్రస్తుత కాలంలో జరుగుచున్నవి, అలాగే కాలధర్మము యొక్క మర్మాలను తెలియచేసే సద్గురుమూర్తి శ్రీకాళీమాత. మంచి కోరికలను పెంచుతూ, ఆ కోరికలను తీరుస్తూ, భక్తుల మనసులు స్థిరంగా ఉండే బుద్ధిని ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. అంటూ పై శ్లోకంలో తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**25-9-1995**

**శ్లో॥ శ్రీయువనామ సంవత్సర ఆశ్వయుజ శుక్ల ప్రతిపత్ సోమవాసరే !**
**హస్తానక్షత్ర తులాలగ్న సుముహూర్త మాలాధారణ ప్రబోధిని ! కాళి !**
**నవదిన త్రికాల శిరస్స్నాన నియమనిష్ఠాచార భక్తజనప్రియే !**
**సదా మంత్రజప త్రికాల నామగాన యజ్ఞ కుంకుమార్చనానంద మూర్తే! 3**

తా॥ ఈ శ్లోకంలో శ్రీ గురుదేవులు, శ్రీకాళీమాత ఆలయంలో భవానీ దీక్షలను భక్తులకు ఇవ్వడం ఎప్పటినుంచీ ప్రారంభమైనది, దీక్షాకాలంలో 'భవానీ'లు ఆచరించే నియమాలు, పూజావిధానం, దీక్షలు చేయటం వలన భక్తులకు కలుగుతున్న లాభాలు మొదలైనవన్నీ వివరంగా వ్రాశారు. మొట్టమొదటిసారిగా 25-9-1995 శ్రీ యువనామ సంవత్సరం, ఆశ్వీయుజమాసం, శుక్లపాద్యమీ, సోమవారం, ఉదయం హస్తానక్షత్ర తులాలగ్నంలో, శ్రీకాళీమాత భక్తులైన కొందరికి 'భవానీ'మాల దీక్షాధారణ జరిగినది. శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు వారికి దీక్షాధారణ కావించారు. ఆ సమయంలో శ్రీగురుదేవులు వారికి, దీక్షను

ఎలా చేయాలి, ఆ సమయంలో ఏమి భుజించాలి, పూజాకార్యక్రమాలు ఎలా చేపట్టాలి అనే విషయాలను వివరించి చెప్పారు. వారి సూచనల మేరకు దీక్షలు తీసుకొన్న భక్తులు తెల్లవారుజామునే నిద్రలేచి, కాలకృత్యాలు ముగించుకొని, చన్నీటితో తలారస్నానమాచరిస్తారు. అలాగే రెండోపూట, మూడోపూట కూడా తలస్నానాలు చేసి, అన్నివేళలా, శ్రీకాళీమాత మంత్రజపము, నామగానము, యజ్ఞము, కుంకుమార్చనలు చేస్తూ ఎంతో నిష్ఠగా పవిత్రభావంతో ఆచరిస్తారు. తొమ్మిదిరోజులూ కూడా క్రమం తప్పకుండా, దీక్షలను కొనసాగిస్తారు. ఈ విధంగా చేస్తున్న భక్తులంటే చాలా ఇష్టపడుతూ ఆనందించే తల్లి శ్రీకాళీమాత. ఈ దీక్షలవలన భక్తులు ఒక క్రమబద్ధమైన మంచి అలవాట్లకు, అలవాటు పడతారు. అందువలన వారి శరీర ఆరోగ్య పరిస్థితిలో మంచి మార్పు వస్తుంది. దీక్ష అనే ఆచార నియమం ఉండటం వలన వారు, ఇంతకు ముందు తెలిసో తెలియకో అనుసరిస్తున్న కొన్ని దురలవాట్లను, దురాచారాలను, దుఃఖాలను, అనేకమైన సమస్యలను, సంతాన, ఆరోగ్య, ఆర్థికపరమైన సమస్యలు, ఇంకా ఎన్నో సమస్యలు పోగొట్టి వారిని దీక్షాకాలంలో రక్షిస్తూ, శుభఫలితాలను ప్రసాదించి వారు ఆనందంగా ఉండేటట్లు చేస్తున్న తల్లి శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**శ్లో॥ శ్రీయుగాది గురుపూర్ణిమా శ్రీకృష్ణజన్మాష్టమీ ఆశ్వయుజ విజయదశమీ!**
**పర్వదినకాల విశేషాభిషేకార్చనాద్భుత శక్తిప్రదాత్రి ! శ్రీకాళి !**
**అష్టాదశ ద్వాదశ నవకుండాగ్నిహోత్ర నిర్వహణాది శక్తిప్రదాత్రి ! కాళి!**
**శతసహస్రాధిక జనాన్నదానమహాయోగ్యతాద్భుతశక్తి ప్రదాత్రి ! 4**

తా॥ వేజెండ్లపుర శ్రీకాళీమాత ఆలయంలో ప్రతి సంవత్సరం వివిధ పండుగలైన ఉగాది, గురుపూర్ణిమ, శ్రీకృష్ణజన్మాష్టమి, దసరా మొదలైన పర్వదినాలలో జరిగే విశేష పూజా కార్యక్రమాలను గూర్చి శ్రీగురుదేవులు తెలియజేస్తున్నారు. చైత్రమాసంలో వచ్చే ఉగాది పర్వదినాన్ని ఎంతో వేడుకగా శ్రీగురుదేవులు ఆచరిస్తారు. ఆ రోజు తెల్లవారుజామునుంచే సందడి ప్రారంభమవుతుంది. శ్రీకాళీమాత అమ్మవారికి, మరియు సంతాన బాలవేంకటేశ్వరస్వామి వారికి అభిషేకాలు పూర్తిచేసి రకరకాలైన పుష్పాలతో అలంకరించి, నైవేద్యాలు సమర్పించి శ్రీచక్రానికి పంచామృతాలతో అభిషేకం చేసి కుంకుమార్చనలు జరుపుతారు. యజ్ఞకార్యక్రమాలు

నిర్వహిస్తారు. ఇవన్నీ ఒక క్రమపద్ధతిలో శ్రీగురుదేవులు నిర్వహిస్తారు. ఉగాది పచ్చడిని సంప్రదాయబద్ధంగా తయారుచేసి భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పంచుతారు. ఈ లోగా మరికొందరు భక్తులు, జరుగబోయే ఉభయదేవేరులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవానికి వేదికను తయారుచేస్తూ, దానికి అద్భుతమైన పుష్పాలంకరణలు, వివిధ రకాలైన సుగంధ పుష్పాలను ఉపయోగించి అలంకరిస్తారు. వాటికి అదనంగా శాస్త్రీయత ఉట్టిపడే విధంగా అరటిచెట్లను వాటి గెలలతో సహా అలంకరించటంవలన కల్యాణశోభ ఆ ప్రాంగణంలో వెల్లివిరుస్తుంది. శ్రీ సంతాన బాలవేంకటేశ్వరస్వామి వారి విగ్రహప్రతిష్ఠ 18-3-1999, గురువారం ఉగాది రోజున జరిగింది. ఆ తరువాత ప్రతిసంవత్సరం విధిగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, జరిపే కార్యక్రమాలకు తోడుగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం ఒక ముఖ్య ఆకర్షణగా నిలుస్తున్నది. ఈ మహోత్సవానికి ఎంతోమంది దంపతులు వచ్చి పూజలు నిర్వహిస్తారు. అశేష భక్తజనం కన్నులపండుగగా జరిగే ఈ కల్యాణ ఉత్సవం చూసి తరించి, చివరలో శ్రీగురుదేవులు ఏర్పాటుచేసే భోజన కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని విజయవంతం చేస్తారు. తదుపరి పండుగ ఆషాఢమాసంలో వచ్చే వ్యాసపూర్ణిమ, దీనికి మరోపేరు గురుపూర్ణిమ. ఈ రోజు ప్రత్యేకంగా భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తమ గురువు, జగన్మాతయైన శ్రీకాళీమాతను ప్రత్యేక శ్రద్ధతో అలంకరణ చేసి విశేషమైన నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహిస్తారు. శ్రీకాళీమాత యజ్ఞం చేస్తారు. అదే రోజు సాయంత్రం శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారిని వారి శిష్యులు, భక్తులు కలసి, ముందుగానే చక్కగా ముస్తాబు చేసి అలంకరించిన సింహాసనంపై కూర్చుండబెట్టి, వారికి అభిషేకాలు చేస్తారు. పంచామృతాలతో అభిషేకాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ రోజు వారు చెప్పే ప్రవచనాలను అందరూ కూర్చొని శ్రద్ధగా ఆలకిస్తుంటారు. అలాంటప్పుడు ఒక్కోసారి శ్రీ గురుదేవులు అకస్మాత్తుగా 'యోగం'లోకి వెళ్లిపోయేవారు. కదలరు, మెదలరు ఎంత పిలిచినా పలకరు. ముఖంలో గంభీరత, అద్భుతమైన వెలుగు కన్పించేది విషయాన్ని గమనించిన భక్తులు, శ్రీగురుదేవులు మరలా ఆ 'యోగం'నుంచి మామూలు స్థితికి వచ్చేవరకూ భజనలూ, పాటలతో శ్రీకాళీమాతను స్తోత్రం చేస్తూ,

అలాగే శ్రీగురుదేవులను కీర్తిస్తూ గడిపేవారు. నిజంగా ఆ దృశ్యాలను దర్శించగలిగిన వారి జన్మలు ధన్యమవుతాయి.

అదే విధంగా శ్రీకృష్ణజన్మాష్టమి శ్రావణ మాసంలో వస్తుంది. ఈ మాసం అమ్మవారిని సేవించడానికి ఎంతో అనుకూలమైనది. శ్రీకృష్ణజన్మాష్టమి రోజే శ్రీకాళీమాత అమ్మవారిని ప్రతిష్ఠించిన పర్వదినం, ఆ రోజే భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారి జన్మదినం. కనుక ఆ రోజు భక్తులకు అసలైన పండుగ రోజే. ఆ రోజు సూర్యోదయ కాలం ముందు నుంచే అమ్మవారికి ప్రత్యేకమైన యజ్ఞాలు జరుగుతాయి. భక్తులు ఆ రోజు ఉదయం నుంచే గుడికి రావటం ప్రారంభిస్తారు. వారు, వారి మనోభీష్టాల మేరకు, మొక్కుల మేరకు, నైవేద్యాలను అమ్మవారికి సమర్పించుకుంటారు. వారి పిల్లాపాపలను కూడా వారు చేసే పూజా కార్యక్రమాలలో పాల్గొనేటట్లు చేస్తారు. అందువలన వారికి చిన్నతనం నుంచే దైవభక్తి ఏర్పడి, మంచి నడవడిక కల్గిన పౌరులుగా ఎదుగుతారు. మధ్యాహ్న సమయానికి వేజెండ్ల పరిసర గ్రామాలనుంచి చిన్న చిన్న పిల్లలు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో అమ్మవారి గుడికి చేరుకుంటారు. వారు కోలాటాలు చేస్తూ నృత్యం చేస్తూ, ఆడుతూ పాడుతూ ఉంటే, శ్రీకృష్ణుడు గోపికలతో క్రీడించిన ఘట్టాలు గుర్తుకు రాకమానవు. రాత్రివరకూ జరిగే ఈ వేడుకలను శ్రీగురుదేవులతోపాటు అక్కడున్న వారంతా ఎంతో ఆసక్తిగా తిలకిస్తారు. శ్రీకృష్ణజన్మాష్టమి రోజున జరిగే విశేషమైన సంప్రదాయక్రీడ, ఉట్టికొట్టడం. ఈ కార్యక్రమంలో దాదాపు అక్కడికి వచ్చిన వారందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడాస్ఫూర్తిని చాటుకుంటారు. గ్రామస్థులు ఎడ్లబండ్లపై ప్రభలను కట్టుకొని రావడం కూడా జరుగుతుంది. భక్తులకు ఇది మరపురాని వేడుకగా శ్రీగురుదేవులు నిర్వహించడం అందరకూ ఎంతో ఆనందదాయకం.

అదే విధంగా ఆశ్వీయుజమాసంలో వచ్చే విజయదశమి (దసరా) దేవీ నవరాత్రులు కూడా ఎంతో వైభవంగా జరుగుతాయి. ఆ తొమ్మిది రోజులూ ఎంతోమంది భక్తులు భవానీదీక్షలను గురుస్వామి ద్వారా స్వీకరిస్తారు. మూడుపూటలా శ్రీకాళీమాతకు కుంకుమార్చనలు మంత్రయుక్తంగా చేస్తారు. విజయదశమి పర్వదినం రోజు, శ్రీగురుదేవులు, భవానీదీక్షలు తీసుకున్న భక్తుల సంఖ్యలను బట్టి తొమ్మిది,

పన్నెండు, పద్దెనిమిది హోమకుండాలను ప్రజ్వలింపచేసి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. జపదశాంశహోమం, తద్దశాంశతర్పణం తద్దశాంశ దానం అని అంటారు పెద్దలు దానికి అనుగుణంగానే 6-10-2011 వరకు జరిగిన అన్ని కార్యక్రమాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో సుమారుగా ఒక (100000) లక్షమందికి పైగా జనులకు అన్నదానాన్ని చేసే అదృష్టాన్ని దానికి కావలసిన శక్తిని ప్రసాదించిన తల్లి ఆదిపరాశక్తి శ్రీకాళీమాత అంటారు శ్రీగురుదేవులు.

**7-10-1999**

**శ్లో॥ శ్రీప్రమాదినామ సంవత్సర భాద్రపద బహుళ చతుర్దశీ బృహస్పతివాసరే!**
**ఉత్తరానక్షత్ర వృషభలగ్న రాత్రౌ శ్రీకాళీ హోమప్రారంభ ప్రబోధిని !**
**షడ్వర్షామాపూర్వ చతుర్దశ్యగ్ని హోత్ర నిర్వహణశక్తి ప్రదాత్రి !**
**షడ్వర్ష పూర్ణిమా పూర్వచతుర్దశ్యగ్నిహోత్ర నిర్వహణశక్తిప్రదాయిని ! 5**

తా॥ శ్రీకాళీమాత ప్రబోధాన్ని అనుసరించి, శ్రీగురుదేవులు కొన్ని ప్రత్యేకమైన కార్యక్రమాలను కొంతకాలంపాటు ఆచరిస్తారు. ఇదంతా భక్తులశ్రేయస్సు, జనహితం కోసమే నిర్వహిస్తుంటారు శ్రీగురుదేవులు. అలాంటివే ఈ క్రింద వివరించిన యజ్ఞకార్యక్రమాలు కూడా 07-10-1999 శ్రీప్రమాదినామ సంవత్సరం, భాద్రపద మాసం, బహుళ చతుర్దశి, గురువారం, ఉత్తరానక్షత్రం, వృషభ లగ్నంలో, రాత్రి ప్రథమార్థంలో శ్రీకాళీమాత హోమాన్ని ప్రారంభించమని ఆ తల్లి, శ్రీగురుదేవులతో చెప్పినట్లు వారి మాటల్లో తెలుస్తుంది. ఆ తల్లి ప్రబోధాన్ననుసరించి, శ్రీగురుదేవులు విశ్వశాంతిని కోరుకుంటూ, ఉపద్రవాలు, ప్రళయాలు రాకూడదని సంకల్పిస్తూ ప్రతిపూర్ణిమ ముందురోజు రాత్రి చతుర్దశి హోమము క్రమం తప్పకుండా ఆరు సంవత్సరములు, అలాగే ప్రతి అమావాస్య ముందురోజు రాత్రి చతుర్దశి హోమము ఆరు సంవత్సరాలపాటు నిర్విఘ్నంగా కొనసాగించారు. పూర్ణిమ ముందురోజు చతుర్దశి రాత్రి, అలాగే అమావాస్య ముందురోజు చతుర్దశి రాత్రి, శ్రీగురుదేవులు తమ భక్తులతో కలసి శ్రీకాళీమాత బీజమంత్రాన్ని, తెల్లవార్లూ జపిస్తూ, ఉదయం నాలుగు గంటల సమయం నుంచి హోమాన్ని ప్రారంభించి, ప్రత్యేకమైన పదార్థాలను

అందులో ఉపయోగిస్తూ, శ్రీకాళీమాత సహస్రనామ స్తోత్ర మూలమంత్ర సంపుటిని జపిస్తూ ఉదయం ఎనిమిది గంటలవరకూ యజ్ఞం చేసేవారు. ఇలా ప్రతినెలా పూర్ణిమ, అమావాస్య ముందురోజు రాత్రి చతుర్దశి కాలంలో పన్నెండు సంవత్సరాలు నిరంతరాయంగా, విశ్వశాంతికై, శ్రీకాళీమాత, శ్రీగాయత్రీమాత, శ్రీలలితామాత, శ్రీ భువనేశ్వరీ మాతల హోమాలను, నిర్వహించే శక్తిని భక్తులకు ప్రసాదించింది శ్రీకాళీమాత.

1999వ సంవ్సతరంలోనే ఒక సంఘటన జరిగింది. దాని పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ఆ సంవత్సరంలో ఒక విషయాన్ని గురించి ప్రపంచమంతా ఎన్నో కథనాలతో, కొంతమంది ఆధునిక శాస్త్రప్రకారం, కొంతమంది వేరే దేశాలలోని ప్రామాణికమైన కాలజ్ఞాన గ్రంథాల ప్రకారం, మరికొంత మంది మన శాస్త్రగ్రంథాలను పరిశీలించి, గణించి వాటి లెక్కల ప్రకారం, సిద్ధాంతాల ననుసరించి, గ్రహస్థితుల ననుసరించి కొందరు ముక్తకంఠంతో చెప్పింది ఒక్కటే. ఆ విషయం గురించి పత్రికలలో, ప్రసారమాధ్యమాలలో చర్చకు రాని రోజు లేదు. అదే 1999లో కలియుగాంతం అనే విషయం. దీన్నిగురించి విన్న ప్రతివారూ ఎంతో భయానికి లోనయ్యారు. 1999 తరువాత భూమ్మీద ఏ ప్రాణి జీవించి ఉండదు అన్న విషయం తెలుసుకున్న వారు కొందరు వైరాగ్యానికి లోనైనట్లు కన్పించింది. ఎందుకంటే ఆ విషయం ప్రపంచ వ్యాప్తంగా ప్రచారమై ఉన్నది. అదే చెబుతుంది. ఆధునిక విజ్ఞాన శాస్త్రం, సిద్ధాంతులు, కాలజ్ఞానులు కొందరు పండితులు ఒకేమాట చెప్పేసరికి ప్రపంచంలో, ప్రజలలో ఒక విధమైన నైరాశ్యభావాలు కల్గినాయి.

ఈ విషయమై శ్రీగురుదేవుల భావాలు ఎలా ఉన్నాయో తెల్సుకోవాలని, ఎప్పటి మాదిరిగానే ఒక రోజు నేను వెళ్లి అడిగాను, గురుదేవా ఈ సంవత్సరం కలియుగాంతం అని ప్రతిచోట చర్చించుకుంటున్నారు అని ఆ తరువాత ఏమి అనాలో తెలియక శ్రీగురుదేవుల ముఖంలోకి చూస్తూ ఉండిపోయాను. దానికి శ్రీగురుదేవులు ఒక్కక్షణం కన్నులు మూసుకొని, వెంటనే తెరిచి చిరునవ్వు నవ్వారు. శ్రీగురుదేవులు ఏమి చెబుతారోనని నాకు ఆందోళనగా ఉన్నది. శ్రీగురుదేవులు వెంటనే లేచి తెల్లసున్నం ముక్క తీసుకొని గబగబా గుడి ప్రహరీ గోడ వెలుపల నిల్చొని గోడపై ఏదో రాస్తున్నారు. శ్రీగురుదేవుల ప్రవర్తన నాకు అర్థం కాక ఆందోళన

ఎక్కువై వారిని అనుసరించాను. వారు దేవాలయ ప్రహరీగోడపై రాసిన విషయాన్ని చూసి నా మనసు శాంతించింది. '1999వ సంవత్సరంలో కలియుగాంతం లేదు' అని వ్రాశారు. ఆ మరుసటి రోజు స్తంభాలపై శ్రీకాళీమాత దేవాలయ ప్రహరీగోడలపై ఈ విషయాన్నే చిత్రకారులతో ప్రముఖంగా వ్రాయించారు.

అలా వ్రాయించిన కొన్ని రోజులకు ఈ విషయం వాడవాడలా ప్రాకింది. ఒకరోజు నేను శ్రీగురుదేవుల చెంతనే ఉన్నాను. కొంతమంది శ్రీగురుదేవుల వద్దకు వచ్చి వారిని పరిచయం చేసుకున్నారు. వారిలో పేరుగాంచిన సిద్ధాంతులు, పండితులు, గణితశాస్త్రజ్ఞులు ఉన్నట్లుగా నేను గమనించాను. సాధారణంగా శ్రీగురుదేవుల వద్దకు, వారి దర్శనార్థం ఎందరో వచ్చి వెళుతుంటారు. అలాంటి సందర్భమే ఇదికూడా అని భావించి నేను శ్రీగురుదేవుల వంకకు చూశాను. ఎవరైనా అతిథులు శ్రీగురుదేవుల దర్శనార్థం వస్తే వారికి సేదదీరటానికి మంచినీళ్లు గాని, మజ్జిగగాని ఇవ్వటం శ్రీగురుదేవుల సంప్రదాయం, అలాంటి దాని కోసమే నేను శ్రీగురుదేవుల వంక చూశాను. వారు నా వంక చూసి, చిరునవ్వుతోనే, జరుగబోయేది చూడు అన్నట్లు భావాన్ని వ్యక్తీకరించారు. నేను నిశ్శబ్దంగా కూర్చొని చూస్తున్నాను. ఇంతలో ఒకరు శ్రీగురుదేవుల నుద్దేశించి ఏమండీ. లోకంలోని గొప్ప గొప్ప పండితులూ, శాస్త్రవేత్తలంతా 1999లో కలియుగం అంతమై పోతుందని ఘోషిస్తుంటే, మీరు మాత్రం కలియుగాంతం లేదు, అని మీ గోడలమీద వ్రాయించారు అన్నారు. దానికి సమాధానంగా శ్రీగురుదేవులు ఎంతో సౌమ్యంగా నవ్వుతూ, మీరు ఎలాంటి ఆధారాలతో 1999లో కలియుగాంతం జరుగుతుందని అంటున్నారు? అని అన్నారు. అనుకోని ప్రశ్నకు ఆయన కొంచెం తడబడి, సర్దుకొని ఏవో కాగితాలు తీసి, కొంచెంసేపు గణించి, లెక్కలు కట్టి చూపిస్తూ, ఇదిగో ఈ లెక్కల ప్రకారం, ఈ సంవత్సరాంతంలో కలియుగం అంతమై పోతుంది అన్నాడు. చర్చ ఆసక్తికరంగా సాగుతున్నది. వారు చర్చించేది అసాధారణమైన విషయం. అందులో వారు శ్రీగురుదేవులనే శాస్త్రవిషయాలపై చర్చకు దింపారు. అతను అలా అంటూనే, మీరు దేన్ని ఆధారం చేసుకొని కలియుగాంతం లేదని చెపుతున్నారు, అని ప్రశ్నించాడు. దానికి శ్రీగురుదేవులు – మీ లెక్కలతో, శాస్త్రాలతో నాకు పనిలేదు, నేను యోగదృష్టి ద్వారా పరిశీలించి ఈ విషయాన్ని లోకానికి తెలియజేశాను, మీరుకూడా అంతటి సత్తా ఉన్నవారైతే, శాస్త్రాలను లోతుగా, కూలంకషంగా అభ్యసించండి, అన్ని

విషయాలు ఖచ్చితంగా మీరే తెలుసుకోగలుగుతారు అంటూ నవ్వుతూ చెప్పారు, శ్రీగురుదేవులు, తాను యోగదృష్టి ద్వారా పరిశీలించాను, మీరు శాస్త్రాలను ఇంకా లోతుగా అధ్యయనం చెయ్యండి అనే సరికి వారి నోటివెంట ఎలాంటి మాటలు రాలేదు. ఇంతలో వారికి ఏమయిందో తెలియదు. కూర్చున్న చాపవంక చూస్తూ బట్టలను దులుపుకుంటున్నారు. అది చూసి శ్రీగురుదేవులు నవ్వుతూ... ఏమిటి ఎఱ్ఱచీమలు కుట్టుతున్నాయా వెఱ్ఱిగంతులు వేస్తున్నారు. నేనుకూడా మీరు కూర్చున్న చాపపైనే కదా ! కూర్చున్నాను, మరి, ఏవి నన్ను కుట్టవే అయినా చిన్న చీమలు కుడితేనే బాధతో గంతులేస్తున్నారు. మీరు అసత్యప్రచారాలు చెయ్యటంవలన ప్రజలు భయపడరూ అంటూ నవ్వేసరికి, వచ్చినవారు నమస్కరించి వెళ్లిపోయారు. శ్రీగురుదేవుల ఉద్దేశం వారిని గాని వారు చదివిన శాస్త్రాలను గాని తక్కువ చేయాలని కాదు. శాస్త్రాలనూ, గ్రంథాలనూ, పెద్దలనూ ఎల్లప్పుడూ గౌరవిస్తారు శ్రీ గురుదేవులు. కాని శాస్త్రాలలో కూడా లేనివి, ఏ గ్రంథాలలో కూడా గ్రంథస్థం కానివి, ప్రపంచంలో తెలియని రహస్యాలు ఎన్నో ఉంటాయి. అవి వారికి తెలియనంత మాత్రాన దేన్నయినా, ఉన్నదీ... లేదూ ... అని చెప్పజాలరు. శ్రీకాళీమాతకు తెలియని రహస్యం ఏ లోకంలోనూ, ఎక్కడా ఉండదు. ఆ తల్లి కాలచక్రస్వరూపిణి. ఎప్పుడు, ఎక్కడ ఏమి జరుగుబోతోందో ఆ తల్లికి మాత్రమే తెలుసు. కాని ఆ తల్లిని ఆరాధించే భక్తులకు, ఇలాంటి సృష్టి రహస్యాలను ఆ తల్లి ముందుగానే తెలియజేస్తుంది. అందువల్లనే శ్రీగురుదేవులు పండితులు 'ఔను' అని చెప్పిన విషయాన్ని, తమ యోగదృష్టి ద్వారా గ్రహించి 'కాదు' అని తేల్చి చెప్పారు. అదే శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారి ఘనత.

**26-9-2011**

**శ్లో॥ శ్రీఖరనామ సంవత్సర భాద్రపద బహుళ చతుర్దశీ సోమవాసరే !**
**పూర్వఫల్గుణీ నక్షత్ర కన్యాలగ్న ప్రాతఃకాల పూర్ణాహుతి ముహూర్త నిర్ణయమూర్తే!**
**యజ్ఞనిర్వహణ కాలానేక విఘ్నాదృశ్యకారిణి ! భక్తజన సంరక్షిణి !**
**ద్వాదశవత్సర చతుర్దశ్యగ్ని సంపూర్ణ నిర్వహణ శక్తిప్రదాయిని ! 6**

తా॥ పన్నెండు సంవత్సరాల పాటు ప్రత్యేకంగా నిర్వహిస్తూ వస్తున్న విశేష యజ్ఞమైన పూర్ణిమ ముందురోజు రాత్రి చతుర్దశీ యజ్ఞము అలాగే అమావాస్య ముందురోజు రాత్రి చతుర్దశీ యజ్ఞము, కలిపి మొత్తం పన్నెండు సంవత్సరాలు నిర్విఘ్నంగా, నిరాటంకంగా సాగడానికి ఆ తల్లి శ్రీకాళీమాత ఎంతో తోడ్పడింది. 26-9-2011 శ్రీ ఖరనామ సంవత్సరము, భాద్రపద మాసము, బహుళ చతుర్దశి సోమవారము, పూర్వఫల్గుణీ నక్షత్రం, కన్యాలగ్నం ఉదయకాలంలో చతుర్దశి యజ్ఞానికి పూర్ణాహుతి ముహూర్తాన్ని శ్రీకాళీమాత నిర్ణయించారు. ఇంతకాలం యజ్ఞం చేస్తున్న సమయంలో కలిగే అనేక ఆటంకాలను తొలగిస్తూ, భక్తజనులను సంరక్షిస్తూ పన్నెండు సంవత్సరాలపాటు యజ్ఞాన్ని పరిపూర్ణంగా నిర్వహించే శక్తిని ప్రసాదించింది ఆ తల్లి, శ్రీకాళీమాత. యజ్ఞం జరుగుతున్న సమయాలలో ఆ తల్లి ఎన్నో అద్భుతమైన మహిమలను చూపించింది. వాటిని తిలకించిన భక్తులు ఆశ్చర్యంతో మైమరచి పోయేవారు. ఆనంద సాగరంలో పయనింపచేసి భక్తుల మనోరథాలను సొంతం చేసుకున్న పరమపావనమూర్తి శ్రీకాళీమాత. అంటారు శ్రీగురుదేవులు.

**6-10-2011**

**శ్లో॥ శ్రీఖరనామ సంవత్సర ఆశ్వయుజ శుక్ల దశమీ బృహస్పతివాసరే !**
**శ్రవణానక్షత్ర మకరలగ్న విజయ ముహూర్త నిర్ణయమూర్తే ! కాళి !**
**విజయదశమీ పర్వదిన నిత్యాగ్ని హోత్ర పూర్ణాహుతి ప్రదానాది మూర్తే!**
**సప్త పంచాశత్ పంచశతోత్తర షట్ సహస్ర దినకాలానుగ్రహసంచారిణి!**
**6557 రోజులు 7**

తా॥ శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు తాము నిత్యాగ్ని హోత్రాన్ని ప్రారంభించిన దగ్గర నుంచీ ఎంత కాలంపాటు నిత్యయజ్ఞాన్ని నిర్వహించిందీ, దానికోసం వారు ఏ విధమైన కార్యాచరణ చేశారనే విషయాలను ఈ శ్లోకంలో తెలియజేస్తున్నారు. 06-10-2011 శ్రీ ఖరనామ సంవత్సరము, ఆశ్వీయుజ మాసము విజయదశమి (దసరా) శుభదినం, గురువారం మధ్యాహ్నం, శ్రవణా నక్షత్రము, మకరలగ్నమందు మంచి విజయ ముహూర్తాన్ని పూర్ణాహుతిగా నిర్ణయించారు శ్రీకాళీమాత. ప్రతి సంవత్సరం విజయదశమి దేవీ నవరాత్రులు నిర్వహించిన విధంగానే, భక్తులకు గురుస్వామి భవానీదీక్షల నిచ్చి

ఉత్సవాలను శ్రీగురుదేవుల చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ఆ తొమ్మిది రోజులు దీక్షాబద్ధులైన స్త్రీ, పురుష భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో, నిష్టతో శ్రీకాళీమాతను ఆరాధిస్తారు. మూడుపూటలా మడిబట్టలతో అమ్మవారికి కుంకుమ పూజలు మంత్రయుతంగా చేస్తారు. శ్రీకాళీమాత మంత్రజపంతో గుడిప్రాంగణం మార్మోగుతూ, భక్తి భావనను ఇనుమడింపచేస్తుంది. ఒక్క పూట మాత్రమే స్వల్ప ఆహారాన్ని తీసుకుంటూ విజయదశమి రోజున ఉదయాన్నే శ్రీకాళీమాత గర్భాలయంలోనికి మంగళవాయిద్యాలతో వెళ్లి దీపపు కుంది నుంచి శ్రేష్ఠమైన కర్పూరాన్ని వెలిగించుకొని దానితో యజ్ఞకుండాలను ప్రజ్వలింపజేస్తారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు, ఆ సమయంలో దీక్షాపరులకు మార్గదర్శకులుగా ఉంటారు. యజ్ఞాలలో సమర్పించే పదార్థాలన్నీ శ్రీకాళీమాతకు ప్రీతిపాత్రమైనవే. గారెలు, పాయసాలు, పులిహోర, చక్రపొంగలి, పెరుగన్నాలు, అలాగే తీపి పదార్థాలు వివిధ రకాలైన పండ్లు, ఆవునెయ్యి మొదలైన ఎన్నో రకాల పదార్థాలు ఉంటాయి. అందులోనికి సమిధలుగా రావి, మేడి, జువ్వి, మఱ్ఱి, మామిడి మొదలైన శ్రేష్ఠమైన కట్టెలను వాడతారు. వీటిని అన్నింటినీ ఎక్కువ శాతం శ్రీగురుదేవులు, భక్తుల సౌకర్యం కోసం, వారి నుంచి ఎలాంటి డబ్బు వసూలు చేయకూడదనే సదుద్దేశ్యంతో ఏర్పాటు కావిస్తారు. యజ్ఞకార్యక్రమాలు ముగిసిన తదుపరి దీక్షలో నున్న భవానీలు శ్రీకాళీమాత ఆలయానికి విచ్చేసి నూట ఎనిమిది సార్లు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. ఇందులో వారితోపాటు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, చిన్నపిల్లలు, వృద్ధులు అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. ప్రదక్షిణలు చేస్తున్నంతసేపూ శ్రీకాళీమాత నామస్మరణ జరుగుతూనే ఉంటుంది. ఇలా నూట ఎనిమిదిసార్లు ప్రదక్షిణలు చెయ్యలేనివారు, అనగా వృద్ధులు మొదలైనవారు, గుడి ప్రాంగణంలో శ్రీకాళీమాతకు ఎదురుగా ఉండే త్రికోణాకృతి గల్గిన అగ్ని బాగా ప్రజ్వలిస్తున్న యజ్ఞకుండం చుట్టూ ప్రదక్షిణలు చేసినా, 108సార్లు గుడిప్రదక్షిణలు చేసిన పుణ్యఫలితం లభిస్తుందని తెలుస్తున్నది. ఇదంతా 'అమ్మవారు' చూస్తుంటారనేది భక్తుల నమ్మకమే కాదు. నిజమే. ఒక్కోసారి ప్రదక్షిణలు చేసేటప్పుడు, ఎండ వేడిమివలన ఎంతో ఇబ్బంది కల్గుతుంది. కాని శ్రీకాళీమాత వారికి ఆ సమయంలో తన శక్తిని ప్రసాదిస్తుంది. అందువలన వారు, తాము మండుటెండలో ప్రదక్షిణలు

చేస్తున్నామనే భావన లేక, పండు వెన్నెలలో హాయిగా తిరుగుతున్నట్లుగా వారు అనుభూతి పొందుతున్నట్లు, వారి ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని బట్టి చూసేవారికి అర్థమవుతుంది. ఇంతటి మహిమాన్వితమైన ప్రదక్షిణలు పూర్తి కావించుకొని మరొక కఠోరమైన నియమాన్ని ఆచరిస్తారు భవానీ దీక్షాపరులు. అదేమిటంటే ఇరుముడులను దించకుండా తలపైనే ఉంచుకొని గుడి వెలుపలి ప్రాంగణం నుంచి మోకాళ్ల పై నడుచుకుంటూ, శ్రీకాళీమాత గర్భాలయ ముఖమండపానికున్న మెట్లను మోకాళ్లతోనే ఎక్కుతూ అమ్మవారి వద్దకు వచ్చి, అప్పటివరకూ తాము చేపట్టిన దీక్షను విరమిస్తున్నట్లుగా, తమను చల్లగా కాపాడమని మనసులోనే ఆ తల్లి, శ్రీకాళీమాతను ప్రార్థించి వేడుకుంటారు. ఆ తల్లి దీవెనలు అందుకున్న తరువాత వెలుపలికి వచ్చిన తరువాత ఇరుముడులను అగ్నికుండంలో పూర్ణాహుతినిస్తారు. ఆ తరువాత గురుస్వామి ఆధ్వర్యంలో దీక్షలను విరమిస్తారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వేడుకలు ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉంటాయి. ఈ కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులందరికీ మరియు గ్రామప్రజలకు, శ్రీగురుదేవులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆచారంగా వస్తున్నది. ఇంతటి మహత్తర కార్యక్రమాలను, శ్రీకాళీమాత ఆశీస్సులతో నిర్వహిస్తున్న శ్రీ గురుదేవులు, పైన తెలిపిన 6-10-2011వ తేదీన విజయ ముహూర్తంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తిచేసి, అప్పటివరకూ యజ్ఞములు, నిత్యాగ్నిహోత్రం జరిగిన రోజులు మొత్తం 6,557 ఆరువేల ఐదు వందల యాభై ఏడు రోజులు. ఇన్ని రోజులూ కూడా ప్రతిరోజూ శ్రీకాళీమాత కాలాన్ని అనుకూలింపచేస్తూ అడుగడుగునా అనుగ్రహించారు. ఈ కాలంలో యజ్ఞాలు జరిగేటప్పుడు ఎన్నో విధాలైన రూపాలతో దర్శనమిస్తూ తన మాహాత్మ్యాలను ప్రదర్శించి భక్తులను కరుణించిన శ్రీకాళీమాతకు భక్తులందరూ ఋణపడి ఉండవలసిందే. అని నాకు అనిపిస్తున్నది.

**శ్లో॥ శ్రీగురు ఆనందనిలయ స్థలవటవృక్షాగ్ర వహ్నిరూప సందర్శిని !**
**కరవీరారుణోత్పల కదంబ దాడిమీ మధుపుష్ప హోమప్రియే ! కాళి !**
**మధుక్షీర ఘృతారుణ దధిగుడాన్న మిళిత కదళీ ఫల హోమప్రియే !**
**సకలైశ్వర్యాభివృద్ధికారిణి ! కాళి ! సచ్చిదానంద యోగప్రదాయిని ! 8**

తా॥ శ్రీగురు ఆనందనిలయం పూర్వం ఇది ఒక రమణీయమైన నందనవనం ఇందులో ఎన్నో రకాల పూలచెట్లు, కదంబము, మట్టి మొదలగు వృక్షరాజములు, ఒక మూలగా శ్రీ వేంకటేశ్వరస్వామి వారి యజ్ఞశాల దీనిలో కూర్చొని యజ్ఞం చేస్తుంటే ఋషులకాలం గుర్తుకు వస్తుంది. పూర్తిగా రెల్లుగడ్డితో నిర్మితమై పర్ణశాలను జ్ఞప్తికి తెస్తుంది. ఈ వనంలో పూసిన పూలు నిత్యం శ్రీకాళీమాత అమ్మవారికి, శ్రీ సంతాన బాలవేంకటేశ్వరస్వామి వారికి అలంకరణ కోసం, పూజలకోసం, శ్రీగురుదేవులు స్వయంగా కోసి, వినియోగిస్తారు. తూర్పుదిక్కు నున్న కదంబవృక్షం క్రింద ఆసీనులై శ్రీగురుదేవులు, అక్కడినుంచి గర్భగుడిలోని శ్రీకాళీమాత అమ్మవారిని దర్శిస్తూ ధ్యానమాచరిస్తుంటారు. ఆ కదంబవృక్షం ఎంతో చల్లదనాన్ని హాయిని ఇస్తుంది. శ్రీకాళీమాత కదంబవనంలో నివసిస్తుందని ప్రతీతి. అలాగే శ్రీగురు ఆనంద నిలయంలో పడమటి దిక్కున, శ్రీగురుదేవుల సమాధి నిర్మించబోయే స్థలం వెనుక మట్టిచెట్టు ఉన్నది. ప్రత్యేక సందర్భాలలో శ్రీగురుదేవులు దానిక్రింద కూర్చొని ధ్యానమాచరిస్తారు. ఆ స్థలానికి, ఆ మట్టిచెట్టుకు ఎంతో పవిత్రత ఉన్నది. ఎందుకంటే శ్రీకాళీమాత. ఆ మట్టిచెట్టుపైనే అగ్నిరూపంలో శ్రీగురుదేవులకు సాక్షాత్కరించారు. ఆ మర్రిచెట్టు ప్రక్కన రావిజువ్వి మేడిచెట్లు మూడు చెట్లు ఒకేచోట కన్పిస్తాయి ఆ తల్లి ఎఱ్ఱగన్నేరు, కడియము, దానిమ్మ, విప్పపూలతో హోమం చేస్తే ఎంతో ఇష్టపడి వరాలను త్వరగా ఇస్తుంది. అలాగే తేనె, పాలు, నెయ్యి, పెరుగు బెల్లంతో చేసిన అన్నములో, ముగ్గిన అరటిపళ్లను కలిపి, ఎర్రగా చేసి హోమం చేస్తే ఇంకా ఎక్కువగా సంతోషిస్తుంది. అలా సంతోషించే తల్లి భక్తులకు కోరినవన్నీ అనేక ఐశ్వర్యాలను ఇస్తూ వాటిని అనేక విధాలుగా అభివృద్ధి చేస్తూ భక్తులకు నిరంతరము, శాశ్వతమైన ఆనందాన్నిచ్చే యోగాన్ని ఆ తల్లి శ్రీకాళీమాత ప్రసాదిస్తుంది. అంటారు శ్రీగురుదేవులు.

# 44. శ్రీ వేజెండ్లపురవాసిని శ్రీవరకాళీ అష్టకమ్

(తాత్పర్యములతో)

1. ఓం సద్గురుస్వరూపే సర్వాధారే సర్వవిఘ్నహంత్రి
సకలశుభప్రదాత్రి సురవరప్రపూజితే
విశ్వవంద్యే విశ్వమోహిని విజ్ఞానప్రదాయిని
కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥

తా॥ శ్రీవరకాళీమాత, ఏ ఆకారమూ స్థిరంగా లేని, నిరాకార రూపిణియై ఎల్లప్పుడూ, నిరంతరం, భక్తజనులను ఉద్ధరించటానికి కంకణబద్ధురాలై, ఆ తల్లి తనయొక్క సాకారరూపాన్ని, ఎల్లవేళలా భక్తులకు, దర్శింపచేయాలనే శుభ సంకల్పంతో, శ్రీ వేజెండ్ల పురములో, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి, గురుమూర్తి యై, ఒక సద్గురువు వలె, భక్త జన హృదయాలలో నిలిచి ఉన్నది. సృష్టిలోని సమస్త లోకాలకూ ఆ తల్లి, జగన్మాతే ఆధారం. మనసారా నమ్మి, ఆ తల్లి దరిచేరిన వారికి, ఆ దేవి, సకల సంకటాలను తొలగించి వేస్తూ, వారికి సకల శుభాలనూ అనుగ్రహిస్తూ, భక్తులకు, అలాగే ఆ తల్లి శరణు జొచ్చిన వారికి, తగు విధమైన సహాయ సహకారాలను, గురురూపంగా, అనగా శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారి ద్వారా, ఆ తల్లే ప్రసాదిస్తున్నది, ఆ తల్లి శ్రీవరకాళీ మాతయే. దేవతలలో గొప్పవారైన మరియు సర్వాధికులైన వారిచేత, అలాగే, ఈ లోకంలో శ్రేష్ఠులైన వారిచేత, మంచి వారి పూజలందుకుంటూ, ఆ తల్లి, తన భక్తులు శిరసువంచి, చేతులు జోడించి చేసే వందనాలను అందుకొనే మహాతల్లి శ్రీకాళీమాతయే. సకల లోకాలలోనూ, ఆ తల్లి యొక్క అద్భుతమైన రూపలావణ్యాన్ని దర్శించి, మనసులు కరిగి, శ్రీకాళీమాత దరిచేరి, సర్వసుఖాలనూ, భోగాలను పొందాలని కోరుకొంటారు. అలాంటి ఋషులు, మునులు, యోగులు, సద్గురులు, ఆచార్యవర్యులైన, మంచి శ్రేష్ఠులైన భక్తజనులకు సద్గురువై, జ్ఞానాన్ని, మంచి విజ్ఞానాన్ని నిరంతరం అందిస్తూ కలిప్రభావంచేత జనించే అన్ని దోషాలనూ, ఆ తల్లి తన భక్తులకు పోగొట్టి కల్కి భగవానుని చేత భావికాలంలో పూజింపబడేది, ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాతయే నని అంటున్నారు శ్రీగురుదేవులు.

**2. వాణీశప్రపూజితే వరదానందప్రదాయిని**
**కమలావరార్చితే కాళి కారుణ్య స్వరూపిణి !**
**కపర్దిసంసేవితే హే కాలచక్రప్రపాలిని**
**కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥**

తా॥ సకల లోకాలకూ తల్లియైనది, శ్రీవరకాళీమాత లోకంలోని అన్ని ప్రాణులకూ, వాటి జీవితకాలాన్ని నిర్ణయిస్తూ బ్రహ్మదేవుడు, వాటి తలరాతలను రాస్తుంటాడు. అలాంటి బ్రహ్మదేవుడు కూడా, నిరంతరం, ఆ తల్లిని పూజిస్తూ, ఆరాధించటంవలన, బ్రహ్మదేవునికి అలాంటి శక్తిని ఆ తల్లే ప్రసాదించింది. ఆ దేవి శక్తిలేనిదే బ్రహ్మదేవుడు ముందుకు సాగలేడు. శక్తిహీనుడై పోతాడు. అందువలన బ్రహ్మదేవుని చేత పూజింపబడుతూ, ఆయనకు మంచిశక్తిని, మంచి వరాలనూ ప్రసాదించే ఆనంద స్వరూపిణి, ఆ తల్లి శ్రీకాళీమాతయే. లోకాలను పాలించుటకు, ఆ తల్లిచే నియమితుడైన శ్రీమహావిష్ణువు ఎల్లప్పుడూ ఆ తల్లినే పూజిస్తుంటాడు. అందువలన దేవి ఆయనకు అపారమైన పాలనా మరియు నియంత్రణ శక్తులను అద్భుతంగా ప్రసాదించినది, కరుణాస్వరూపిణియైన, ఆ తల్లి, శ్రీకాళీమాతయే. శ్రీవరకాళీమాత, జీవుల కాలపరిమితి ముగిసిన మరుక్షణమే, ఆ తల్లి వాటిని లయం చేస్తూ, ప్రకృతిధర్మాన్ని కాపాడుతున్న మహాశివునిచేత నిర్విరామంగా పూజలందుకుంటూ కాలచక్రాన్ని పరిపాలిస్తూ రాబోయే కాలంలో, ఆ తల్లి, కల్కిభగవానుని చేత పూజింపబడుతూ, కలియొక్క ప్రభావం, తన భక్తులపై పడకుండా ఎల్లవేళలా, రక్షిస్తూ కాపాడుతూ ఉంటుంది. ఆ తల్లే శ్రీవరకాళీమాత అంటున్నారు శ్రీగురుదేవులు.

**3. అనంతస్వరూపిణి ! దేవి ! అఖిలాండనాయికే**
**నవ్యదివ్యమూర్తే నుతకీర్తే నవగ్రహార్చితే**
**వీరశూలిని విశ్వమాతః విజయప్రదాయిని**
**కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥**

తా॥ సకల లోకాలకూ తల్లియైన శ్రీవరకాళీమాత, తన భక్తుల, ఆశ్రితుల కోరికలకు అనుగుణంగా, సందర్భానికి అవసరమైన, లెక్కించవీలు లేనన్ని అద్భుత రూపాలను ధరిస్తుంది. ఆ తల్లి, వారిని ఆయా రూపాలలో ఆదరించి అనుగ్రహిస్తుంది. సమస్త లోకాలలోని జీవరాశులను ఏకకాలంలో, అనుగ్రహించగలిగే శక్తి కల్గిన

మరియు పాలించ సమర్ధత గల్గిన ఏకైక శక్తి మరియు అన్ని లోకాలకూ అధినేత్రి శ్రీకాళీమాతయే. ఎల్లప్పుడూ నూతనమైన, దివ్యత్వముతో వెలుగొందే రూపాన్ని ధరించి, అందరిచేతా, ప్రశంసించబడుతూ, కీర్తించబడుతూ, అన్ని లోకాలలోనూ నిలిచి ఉండే, సత్యమైన స్వరూపం కల్గినది, ఆ తల్లియైన శ్రీవరకాళీమాతయే. ఆ తల్లి, నవగ్రహాలచేత, నిత్యం పూజింపబడే నిర్మలమూర్తి. నవగ్రహాలు నిరంతరం స్థిరమైన కక్ష్యలో పరిభ్రమిస్తూ, వాటివలన ఏర్పడే మంచి, చెడు ఫలితాలను, జీవరాశులపై ప్రసరించడానికి, ఆ తల్లి మూలశక్తే కారణం. లేనియెడల అవి వాటి నిర్ణీత గమనాన్ని సాగించలేవు. శ్రీకాళీమాత, తనచేత ధరించే 'శూలం' సర్వశ్రేష్ఠమైనది, విశిష్ట మైనది మరియు ఆ తల్లి యొక్క శూరత్వానికి ప్రతీకగా, ఆలంబనగా నిలుస్తుంది. విశ్వమాతయైన శ్రీవరకాళీమాత, తన భక్తులకు విజయ పరంపరలను, అలవోకగా, అప్పటికప్పుడే ప్రసాదిస్తూ, వారి విజయాలకు అడ్డుగా నిలిచి ఉండే కలిదోషాలను సమూలంగా తొలగిస్తుంది. కల్కి భగవానుడు, రాబోయే కాలంలో శ్రీవరకాళీమాతను సదా పూజిస్తూ ఉంటాడని తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**4. బ్రహ్మాండజనని దేవి భవబంధనివారిణి**
**శ్రీకృష్ణస్వరూపే మాతః శివానందప్రదాయిని**
**వేజెండ్లపురవాసిని సంవేదాంతస్వరూపిణి**
**కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥**

తా॥ శ్రీవరకాళీమాత, ఈ విశ్వంలో ఉన్న బ్రహ్మాండలోకాలన్నింటికి తల్లియై, వాటి ఆలనా పాలనలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నది. అన్ని క్లేశాలకు, అనగా బాధలకు మూలకారణమైన, ఈ మానవ జన్మను అంటే, మళ్లీ పుట్టుక రాకుండా చేయగలిగినది, ఆ తల్లి శ్రీకాళీమాతయే. ఇప్పుడు ఈ జన్మకు క్షేమాన్ని కలిగించే శ్రీకృష్ణ స్వరూపిణి, అనగా నీలిమేఘంలాంటి శరీరచ్ఛాయ కలిగి, సకల శుభాలను, ఆనందాలను దానంగా ఇచ్చే భద్రస్వరూపిణి శ్రీవరకాళీమాతయే. నీలివర్ణం అత్యంతశక్తికి ప్రతిరూపం, అనంతమైన జీవశక్తికి ఆధారమైన ప్రాణశక్తికి మూలాధారం. చీకటి కణాలను చీల్చుకొని, అందుండి వెలువడే మహత్తరశక్తి, నీలివర్ణంలో ఉంది, పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, ఆకాశం, శూన్యంలోని వాతావరణాన్ని నిర్మలపరచి, జీవుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. శ్రీవరకాళీమాతను

నమ్మిన భక్తులకు, ఆ తల్లి వారికి అన్నింటా శుభాలను ప్రసాదిస్తూ, శుభస్వరూపిణియై, శ్రీ వేజెండ్ల పురములో కొలువై భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారికి, అపారమైన విద్య, విజ్ఞానంతో కూడిన, యోగసిద్ధులను, మంత్రసిద్ధులను ప్రసాదించిన వేదాంత స్వరూపిణియై, కలిదోషాలను పూర్తిగా ధ్వంసం చేయగలిగిన ఏకైకశక్తి శ్రీవరకాళీమాత. కలియుగంలో రాబోయే కల్కిభగవానుని చేత పూజలందుకొనే కాలస్వరూపిణియైన కరుణామూర్తి, శ్రీవరకాళీమాతయేనని, పై శ్లోకంలో, శ్రీగురుదేవులు తెలియచేస్తున్నారు.

**5. దశాయుధధరే శ్రీకాళి దారిద్ర్యవిధ్వంసిని**
**శత్రుసంహారమూర్తే శాశ్వతానందప్రదాయిని**
**మాయామోహవినాశిని మహామోక్షప్రదాయిని**
**కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥**

తా॥ శ్రీవరకాళీమాత, వివిధ రకాలైన మరియు, అత్యంతశక్తి సామర్థ్యాలు కలిగిన, పది ఆయుధాలను, పది చేతులలోనూ ధరించి, సందర్భానికి, మరియు అవసరానికి అనుగుణమైన ఆయుధాన్ని ప్రయోగిస్తూ దుష్టసంహారాన్ని చేస్తూ ఉంటుంది. అదే విధంగా తన భక్తుల దారిద్ర్యాన్ని పోగొట్టి వారిని చాలా గొప్ప శక్తిమంతులు, స్థితిమంతులుగా చేసి, వారికి సకల ఐశ్వర్యాలను ప్రసాదించే కరుణా స్వరూపిణి, ఆనందమూర్తి శ్రీకాళీమాత. ఆ తల్లి, మానవులకు అతిప్రమాదకరమైన, శత్రువులైన, కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అంతర్గత శత్రువులను నిర్దాక్షిణ్యంగా అణచివేసి, తన భక్తు లైన వారికి, శాంతిని చేకూర్చే బలస్వరూపిణి శ్రీకాళీమాతయే. ఆ తల్లిని సేవించేవారికి శాశ్వతమైన వెలుగును, పుణ్యాన్ని, ఆనందాన్ని, కీర్తిని ప్రసాదిస్తూ, శ్రేష్ఠమైన సాధుజనులను, మంచివారిని ఎల్లవేళలా రక్షిస్తూ ఉంటుంది శ్రీకాళీమాత. ఆ దేవి, తన భక్తులు, ఎలాంటి మాయలకూ లోనుకాకుండా, మోహావేశాలకు గురికాకుండా, అలాంటి మాయలను, మోహాలను నశింపజేసి, మహాగొప్ప మోక్షాన్ని ప్రసాదించే కలిదోషనివారిణి శ్రీకాళీమాత రాబోయే కల్కి భగవానునిచేత పూజింపబడే తల్లి, శ్రీవరకాళీమాతయేనని తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**6. సకలలోకార్చితే శ్రీకాళి సత్యస్వరూపిణి**
**అతులితబలమూర్తే ఆర్తజనసంరక్షిణి**
**అద్భుతరూపవిరాజితే అంతరిక్షసందర్శిని**
**కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥**

తా॥ శ్రీకాళీమాత, సకల లోకాలలోనూ, సర్వప్రాణికోటిచేత నిత్యపూజ లందుకొనే నిజమైన దేవత. ఆ తల్లి అద్భుతమైన శక్తి సామర్థ్యాలు, అమిత బల పరాక్రమము కలిగినది. ఆ తల్లిని సేవించే వారికి, వారి సంకల్పానుసారం శక్తిని, యుక్తిని, బలాన్ని మరింత ప్రసాదిస్తుంది శ్రీకాళీమాత. కష్టాలలో ఉన్న వారిని, ఎంతో సంతోషంగా ఆదరించి, ఆ తల్లి, వారిని తన దరిచేర్చుకునే ఆనందస్వరూపిణి శ్రీకాళీమాత. శ్రీవరకాళీమాత, తన భక్తులను కరుణించాలనే శుభసంకల్పం గలదియై, ఆకాశంలో అత్యంతసుందరంగా, అద్భుతమైన కాంతులు వెదజల్లుతూ, తన భక్తజనులకు, తన దివ్య దర్శనభాగ్యం కలిగించే అమృతస్వరూపిణి. అన్ని లోకాల లోనూ ఆ తల్లే నిండి ఉన్నది. తన భక్తుల అభీష్టం మేరకు, అవసరమైన రూపాన్ని ధరించి, తనను నమ్మిన వారికి, మనోల్లాసాన్ని కల్గించి, వారి మనోవేదనలను దూరం చేస్తుంది శ్రీవరకాళీమాత. రాబోయే కలిభగవానుని చేత పూజింపబడుతూ, భక్తులపై కలిప్రభావం వలన, ఎలాంటి దోషాలూ పడకుండా చల్లగా కాపాడే తల్లి శ్రీవరకాళీమాతయే నని అంటున్నారు శ్రీగురుదేవులు.

**7. బహిర్యాగార్చితే దేవి బ్రహ్మవిద్యాప్రదాయిని**
**కుసుమార్చనసంప్రీతే కులీనత్వప్రదాయిని**
**వహ్నియాగప్రీతే శ్రీవరకవిత్వప్రదాయిని**
**కలిదోషనివారిణి కాళి కల్కిప్రపూజితే ॥**

తా॥ సకల లోకాలకూ తల్లియైన శ్రీవరకాళీమాత, ప్రతినిత్యం, లోకంలో భౌతికమైన, బాహ్య యాగాలతో అర్చించబడుతూ ఉంటుంది. ఈ యాగాలలో ఉపయోగించే వివిధ రకాలైన అవనద్రవ్యాలు, అగ్నిలో కాల్చబడటంచేత వాటినుంచి వెలువడే పొగ వాతావరణంలో వ్యాపించి, అందులోని వ్యాధికారకాలైన సూక్ష్మక్రిములను నిర్మూలించి, ఆరోగ్యకరమైన ప్రాణవాయువును, ప్రాణులకు లభించేలా ఉపయోగపడుతుంది. అదే విధంగా, ఆ పొగ మేఘాల రూపంలో, వర్షాలను కురిపిస్తూ పంటలను సస్యశ్యామలం చేస్తుంది. అందువల్లనే ప్రకృతిలో

వాటి వాటి ధర్మాలు సజావుగా సాగుతున్నాయి. ఆ విధంగా కరువుకాటకాలు ఏర్పడకుండా యాగాలు తోడ్పడుతున్నాయి. ఉత్తమమైన విద్యలను ప్రసాదించే సద్గురు స్వరూపిణి శ్రీవరకాళీమాతయే. ఆ తల్లిని మంచి, సుగంధభరితమైన పూలతో అలంకరించి పూజించే వారి యెడల, శ్రీకాళీమాత దయ కలిగి, సంతోషించి, వారికి శుభాలను చేకూర్చే పుణ్యస్వరూపిణి. ఆ తల్లిని, పరిపూర్ణమైన విశ్వాసంతో నమ్మి కొలిచే వారిని, మరలా ఉత్తమ వంశాలలో, అనగా పూర్వయుగాలలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు జన్మించిన విధంగా అనుగ్రహించే ఉజ్జ్వలమూర్తి శ్రీవరకాళీమాత. అగ్ని స్వరూపంగా ఉండే యాగాలు చేయటంవలన ఆ దేవి, అత్యంత సంతృప్తి చెంది, వారికి ఉన్నతమైన మరియు శ్రేష్ఠమైన కవితాశక్తిని ప్రసాదించి, కలిదోషాలను హరించివేస్తూ, రాబోయే కల్కిభగవానుని చేత పూజించబడే తల్లి శ్రీవరకాళీమాతయేనని అంటున్నారు శ్రీగురుదేవులు.

**8. అంతర్యాగసంతుష్టే దేవి అద్వైతస్వరూపిణి**
**అపరాజితమూర్తే కాళి అమృతస్వరూపిణి**
**సకలవిధార్చనప్రీతే సద్గురుస్వరూపిణి**
**ప్రసీద ప్రసీద మాం దేవి శ్రీవరప్రదాయిని ॥**

తా॥ భక్తులు నిశ్చలంగా ఒక చోట కూర్చొని అంతర్ముఖులై తదేక దీక్షతో మనసులో శ్రీవరకాళీమాతను ఆరాధిస్తూ చేసే అంతర యాగాలతో, ఆ తల్లి అత్యంత సంతుష్టురాలై ఆనందించే ఏకైక మాతృమూర్తి శ్రీవరకాళీమాత. ఆ తల్లి, ఎవ్వరిచేతా జయించడానికి సాధ్యంకాని వీరమూర్తి, అందువల్లనే ఆ దేవి భక్తులకు మాత్రమే వశమౌతుంది. అమృత స్వరూపిణియైన శ్రీకాళీమాత, తన భక్తులు చేసే ఏ విధమైన అర్చనలతోనైనా సంతసించి, అర్చించే వారికి అప్పటికప్పుడే వరాలను ప్రసాదిస్తుంది. భక్తులు ఎవరికి చేతనైన రీతిలో వారు పూజావిధానాన్ని అవలంబించి, ఆ తల్లిని సేవించినా, వెంటనే తగు రీతిలో స్పందించే సద్గురు స్వరూపిణి శ్రీకాళీమాత. భక్తులకు వరాలను, తగిన శక్తిని ప్రసాదించటంలో శ్రీవరకాళీమాత ముందు శ్రేణిలో ఉంటుంది. తన భక్తులను ఎల్లవేళలా కాపాడుతూ, వారి మొరలను ఆలకిస్తూ, అన్ని సంకటాలనుంచి వారిని విముక్తులను చేయగల మహత్తరశక్తి, లోకమాతయైన శ్రీకాళీమాతకే ఉన్నదని సంపూర్ణ విశ్వాసంతో ప్రార్థిస్తూ, అన్నింటికీ శ్రీవరకాళీ మాతయే దిక్కు అంటూ, పై శ్లోకంలో శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్‌గారు, శ్రీవరకాళీమాతను వేడుకొంటున్నారు.

# 45. ఆరాధనకు అదృష్టం - శ్రీవరకాళీమాత అనుగ్రహం

ఈ కలియుగంలో మానవులు ఎంతో అదృష్టవంతులు. లక్ష్యసాధన కోసం ఒక్కొక్కరు ఒక్కొక్క మార్గాన్ని నిర్దేశించుకొని, వాటి సాధన కోసం, ఆ మార్గాలలో పయనిస్తూ తమ తమ గమ్యాలను చేరుకోవటానికి ప్రయత్నిస్తుంటారు. ఆ ప్రయత్నాలలో భాగంగానే, దానధర్మాలు చేస్తూ కొందరు, ఇతరులకు, సాటివారికి తోడ్పడుతూ, పరసేవా భావంతో ఎన్నో మంచి పనులు చేస్తూ కొందరు, దైవాన్ని ఆరాధిస్తూ మంచి కార్యక్రమాలను చేస్తూ, ఆనందమయ జీవితాన్ని, అంటే దైవసేవలో గడిపేవారు మరికొందరు ఉంటారు. ఏ మార్గంలో నడిచేవారు, ఆ మార్గంలో అనేక దివ్యానుభూతులను పొందుతూ ఎంతో సంతృప్తి పొందుతూ, చేస్తున్న సేవలకు తగిన ఫలితం పొందటం వలన ఎంతో ఆనందిస్తారు. అలాంటి భాగ్యవంతులు మన వేజెండ్ల గ్రామంలో కన్పిస్తున్న పుణ్యదంపతులు శ్రీగురుదేవులు మరియు వారి ధర్మపత్ని. శ్రీగురుదేవుల ధర్మపత్నికి, ఆదిపరాశక్తి శ్రీకాళీమాత పలుసందర్భాలలో అనేక దివ్యరూపాలతో దర్శనమిచ్చి వారి జన్మను ధన్యం చేశారు. గురుపత్ని, ఎంతో నిష్ఠాగరిష్ఠురాలు, తెల్లవారుజామున నిద్ర లేచింది మొదట, స్నానాదులు ముగించుకొని, అమ్మవారికి అలంకరణలు, ఉదయకాలపూజలు, అభిషేకాలు, నైవేద్యాలు, ఆ సమయాలలో దేవాలయానికి విచ్చేసే భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యాన్ని కల్పించడం మొదలైనవన్నీ ఆమె స్వయంగా చేస్తారు. దేవాలయానికి ఎప్పుడు వెళ్లినా, ఆమె, అమ్మవారికి ఏదో ఒక సేవ చేస్తూ కన్పిస్తుంటారు. ఒక్కోసారి నాకు అన్పిస్తుంది, గృహిణిగా వీరు సేవలు చేయటానికి సమయం కుదురుతుందాయని. అలాంటి భక్తి తత్పరురాలు శ్రీగురుపత్ని. అందువల్లనే కాబోలు శ్రీగురుపత్ని సేవలకు సంతసించి, ఆ తల్లి శ్రీకాళీమాత, ఆమెకు, అనేకసార్లు వేర్వేరు రూపాలతో దర్శనమిచ్చి, తాను భక్తుల సేవకు మాత్రమే కట్టుబడి ఉంటాననే మాటను ఋజువు చేసిన సత్యవాక్కుల తల్లి శ్రీకాళీమాత. శ్రీగురుపత్నికి, అమ్మవారు శ్రీకాళీమాత కల్పించిన అదృష్టం ఈ విధంగా ఉన్నది.

## శ్రీగురుపత్నికి ఆదిపరాశక్తి శ్రీకాళీమాత ప్రథమ దర్శనం

ఆ రోజు గురుపూర్ణిమ. ఆషాఢమాసంలో వచ్చే అత్యంత శుభప్రదమైన రోజు 16-7-2000 సంవత్సరం. స్వస్తిశ్రీ విక్రమనామ సంవత్సరం ఆషాఢ గురుపూర్ణిమ, ఆదివారం, ఉదయం సూర్యోదయం ముందు కాలంలో, పూర్వాషాఢ

నక్షత్రం, మిధున లగ్నంలో శ్రీకాళీమాత అమ్మవారు, ఐదు ముఖాలు కలిగిన శ్రీ గాయత్రీమాతగా, తమకు దర్శనమిచ్చినట్లుగా శ్రీగురుపత్ని తెలియచేస్తున్నారు. అద్భుతమైన వెలుగులతో ప్రకాశిస్తూ కన్పించిన శ్రీగాయత్రీమాత, తమకు ఎంతో ఆనందానుభూతులను కలుగచేసినట్లుగా శ్రీగురుపత్ని తెలియచేస్తున్నారు. వారికి శ్రీమాత దర్శనమిచ్చిన సమయంలోని తిథులను మొదలైన వాటిని శ్రీగురుదేవులు వ్రాసి భద్రపరచారు. దైవసాక్షాత్కారం సాధారణ విషయం కాదు. అందులోనూ అమ్మవారి దర్శనం అతిదుర్లభం అంటారు. అలాంటి శ్రీకాళీమాత అమ్మవారు, పంచముఖ గాయత్రీమాతగా, శ్రీగురుపత్నికి దర్శనమీయటం అత్యంత అద్భుతమైన విషయం. అలాగే మరో సందర్భంలో శ్రీగురుపత్నికి శ్రీకాళీమాత అమ్మవారు, అంతరిక్షంలో శ్రీకాళీమాత పదిచేతులు కలిగిన స్వరూపంతో దర్శనమిచ్చినట్లు శ్రీగురుపత్ని ఈ క్రింది విధంగా తెలుపుతున్నారు.

## అంతరిక్షంలో అమ్మ శ్రీ కాళీ స్వరూప దర్శన భాగ్యం

ది. 31-8-2002 సంవత్సరం, స్వస్తిశ్రీ చిత్రభాను నామ సంవత్సరం శ్రావణ బహుళ అష్టమీ (శ్రీకృష్ణ జన్మాష్టమి) శనివారం ఉదయం సుమారుగా ఐదు గంటల సమయం, రోహిణీ నక్షత్ర సింహలగ్నంలో శ్రీకాళీమాత అమ్మవారు, దేవాలయానికి ఎదురుగా నున్న శ్రీ గురు ఆనంద నిలయంపైన అంతరిక్షంలో శ్రీకాళీమాత కనిపించారని గురుపత్ని చెప్పారు.

## గురుపత్నికి శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనభాగ్యం

ది. 30-12-2006 స్వస్తిశ్రీ వ్యయనామ సంవత్సరం, పుష్యమాసం, ముక్కోటి ఏకాదశి శనివారం ఉదయం సుమారుగా 4-36 నిముషాల సమయం భరణి నక్షత్రం, వృశ్చిక లగ్నంలో శ్రీ సంతాన బాల వేంకటేశ్వర స్వామివారి విగ్రహమూర్తి ఉన్నచోట, శ్రీ వేంకటేశ్వర స్వామివారు మనుజరూపంతో తెల్లని, బంగారు వర్ణం అంచులుగలిగిన మేలిమి వస్త్రాలు ధరించి, నుదుటిపై తిరునామంతో తమకు కన్పించినట్లుగా, మరల కొన్ని క్షణాల తరువాత విగ్రహరూపంగా మారిపోయినట్లు శ్రీగురుపత్ని తెలియచేస్తున్నారు.

# శ్రీకాళీమాత భ్రుకుటిలో శ్రీగురుదేవులు కనుపించుట

అదే విధంగా మరొకరోజున భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు అమ్మవారి గర్భాలయంలో యోగనిష్ఠలో కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో శ్రీగురుపత్నిగారు వచ్చి అమ్మవారికి పూజాసామగ్రితో అలంకరణలు చేసి, చీరను మార్చి, అన్నీ సరిచూసి అంతరాలయం లోనికి వచ్చి, అలంకరణలు ఎలా వున్నాయోనని ఒకసారి అమ్మవారివైపు అలా చూశారు. అలా చూసిన శ్రీగురుపత్ని గారికి ఆశ్చర్యం, అద్భుతం కలిగించే విధంగా, అమ్మవారు చాలా పెద్దరూపంగా కన్పించసాగారు. ఏదో ఒక అలౌకిక స్థితిలో ఉన్నట్లుగా అమ్మవారివైపు చూస్తున్న శ్రీగురుపత్ని గారికి, అమ్మవారి నుదిటి భాగంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు కన్పించసాగారు. ఒక్క క్షణం కన్పించిన దృశ్యం నుంచి తేరుకొన్న గురుపత్ని, భయపడినట్లు గాభరాగా, అక్కడే ఉండి యోగమాచరిస్తున్న శ్రీగురుదేవులను, ఎంత పిలిచినా, వారు పలుకలేదు, కనులు తెరువలేదు. ఇంతలో 'అమ్మవారు' మామూలు స్థితిలో కన్పించారు. ఇది జరిగిన కొద్దినిమిషాల తరువాత శ్రీగురుదేవులు యోగం నుంచి లేచారు. వెంటనే గురుపత్ని, శ్రీగురుదేవులకు జరిగినదంతా వివరించగా నవ్వుతూ "అమ్మవారి లీలలు అలాగే ఉంటాయిలే" అన్నారు. అంటూ ఆ రోజు జరిగిన 'అమ్మవారి అద్భుత దర్శనం' విశేషాలను, శ్రీగురుపత్ని తెలియచేశారు. ఈ అదృష్టం ఎప్పుడు కలిగిందంటే, ది. 6-4-2007 స్వస్తిశ్రీ సర్వజిత్ నామ సంవత్సరం చైత్ర బహుళ చవితి, శుక్రవారం సాయంత్రం, సుమారుగా 7 గంటల 40 నిముషాలకు అనూరాధా నక్షత్రం, తులాలగ్నంలో. శ్రీకాళీమాత నుదిటి భాగంలో, శ్రీగురు కాళీకృష్ణుల వారు, తమకు కన్పించినట్లుగా శ్రీగురుపత్ని ఎంతో ఆనందంతో తెలియచేస్తున్నారు. శ్రీగురుపత్ని ఈ విషయం చెప్పిన తరువాత నాలో ఒక సందేహం మెదిలి, శ్రీగురుదేవులను అడుగగా అప్పుడు వారు ఇచ్చిన సమాధానం ఇలా ఉన్నది. నేను యోగంలో ఉండి, అమ్మవారిని భ్రూమధ్యంలో నిలిపి చూస్తూ ధ్యానిస్తున్నాను. అందువలన ఆమెకు నేను, అమ్మవారి నుదిటి భాగంలో కన్పించి ఉండవచ్చు. అని అన్నారు శ్రీగురుదేవులు. ఏది ఏమైనా శ్రీకాళీమాత సంకల్పం మరియు శ్రీగురుదేవుల సంకల్పం లేనిదే ఇలాంటి అద్భుతాలు జరగవు. అంతా 'ఆ తల్లిదయ' అంటూ గురుపత్ని, అమ్మవారికి మరొక్కసారి నమస్కరించారు.

# శ్రీకాళీమాత అమ్మవారు
# శ్రీ వేంకటేశ్వరస్వామి వారి రూపంతో కనిపించుట

దీ. 15-12-2009 స్వస్తిశ్రీ విరోధినామ సంవత్సరం మార్గశిర బహుళ చతుర్దశి, మంగళవారం ఉదయం సుమారుగా 7 గంటల 2 నిమిషాలకు అనూరాధా నక్షత్రం ధనుర్లగ్నంలో శ్రీకాళీమాత అమ్మవారి గర్భగుడిలో, 'అన్ని రూపాలు నావే' అన్నట్లుగా, శ్రీగురుపత్ని గారికి, శ్రీ వేంకటేశ్వరస్వామి రూపంతో దర్శనమిచ్చినట్లుగా వారు తెలియచేస్తున్నారు. ఇవన్నీ వింటుంటే చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే ఇదంతా నిజమేనా అని అన్పిస్తుంది. కాని అనుభవంలో చూసిన వారికే నిజమని తెలుస్తుంది. ఇవన్నీ మానసిక అనుభూతులు కాదు, ప్రత్యక్ష నిదర్శనాలు. ఎందువల్లనంటే శ్రీగురుపత్నిగారు, వారి జీవితాన్ని అమ్మవారికే అంకితం చేశారు. ప్రతినిత్యం రెండుపూటలా ప్రత్యేక పాత్రలో మహానైవేద్యాన్ని తయారుచేసి, అమ్మవారికి ఎంతో భక్తి శ్రద్ధలతో నివేదిస్తూ, అమ్మవారికి అలంకరణలూ, అభిషేకాలు చేస్తూ, యజ్ఞాన్ని కూడా చేస్తారు. అదే విధంగా శ్రీగాయత్రీమాత, శ్రీ లలితాంబికా మాత, శ్రీ భువనేశ్వరీ మాతలకు మరియు శ్రీ సంతాన బాల వేంకటేశ్వరస్వామి వారికి, ఎన్నో పూజలు, యజ్ఞాలు, భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ వారితో కలసి చేసిన అదృష్టవంతురాలు శ్రీగురుపత్ని. వారు చేసే సేవలకు పూజలకు, పైన చెప్పబడిన దివ్యదర్శనాలే సాక్ష్యాలు. ఎందుకంటే శ్రీగురుపత్ని అమ్మవారికి అంత సేవకురాలు కనుకనే అంతటి మహాభాగ్యం దక్కిందని నేను భావిస్తున్నాను. శ్రీగురుపత్నిగారు ఉదయం సాయంత్రం కూడా, అమ్మవారికి మహానైవేద్యాలను, తయారుచేసి అమ్మవార్లకు స్వామివారికి నివేదన పూర్తి చేసిన తరువాత మాత్రమే, ఇంట్లోకి కావలసిన వంట పదార్థాలు తయారుచేస్తారని అమ్మగారు చెప్పగా నేను విన్నాను.

# 46. జన్మచరితార్ధం

## శ్రీ గురుదేవుల జననీ జనకులకు జగజ్జనని శ్రీవరకాళీమాత దర్శనభాగ్యం

అనంతమైన ఈ కాలచక్రంలో, యుగయుగాలలోను, ఎందరో తల్లిదండ్రులు, తమ వంశాభివృద్ధి జరగటానికి, పుత్రసంతానం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఆ ప్రయత్నాలలో భాగంగా ఎన్నో ప్రార్ధనలు, పూజలు, వ్రతాలు, నోములు చేస్తూ పుణ్యతీర్థాలను సేవిస్తూ, ఎన్నెన్నో పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, యజ్ఞయాగాదులను, క్రతువులను చేయిస్తూ, అవి చాలవన్నట్లు, దానధర్మాలను విరివిగా చేస్తూ, మంచి మంచి కార్యాలను చేపడుతూ వారు కన్న కలలు, సఫలం అవ్వాలని, అవుతాయని భావిస్తుంటారు. అయితే కొందరి కోరికలు ప్రస్తుత జన్మలోనే నెరవేరతాయి. కాని మరికొందరి విషయంలో, ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆ జన్మలో నెరవేరకపోయినా, మరుసటి జన్మలో అంటే రాబోయే జన్మలలో నెరవేరవచ్చు. మొత్తంమీద వారు అనుకున్న కోరికలు అన్ని తీరకపోయినా, కొన్ని కోరికలైనా ఎప్పుడో ఒకప్పుడు తీరవచ్చు. కాని కోరికలు చాలా ఉంటాయి. అందులో ప్రధానమైన కోరిక పూర్వకాలం నుంచి వస్తున్నది, పుత్రకాంక్ష. పిల్లలు పుడితే వంశం అభివృద్ధి చెందుతుందని, వారు పెరిగి పెద్దవారై తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరుస్తారని, వృద్ధాప్యంలో వారికి సహాయపడుతూ, ఆసరాగా ఉంటూ, లోకంలో ఎందరికో ఎన్నో విధాలుగా ఉపయోగపడుతూ సేవలు చేస్తారని, పరోపకార బుద్ధితో మంచి పనులను చేపడుతూ, సత్ప్రవర్తన కలిగి, ఎన్నో విజయాలను సాధించి తల్లిదండ్రులకు, జన్మభూమికి మంచి కీర్తిని తెస్తారని ఆశిస్తారు. కొందరు పిల్లలు, పెద్దవారైన తరువాత అలాగే చేస్తుంటారు. కాని తల్లిదండ్రులకు, వారి సంతానం ఇచ్చే బహుమతులు ఎన్ని ఉన్నా, వారి కోరికలు ఎన్ని తీర్చినా, తల్లిదండ్రులను తరింపచేయాలంటే వారివల్ల కాకపోవచ్చు. కాని ఆ సంతానంలో ఎక్కడో, కారణజన్ములుంటారు. అలాంటి వారు మాత్రమే, తల్లిదండ్రులను తరింపచేసి కన్నవారి ఋణం తీర్చుకుంటారు. అలాంటి దివ్యపురుషులలో ఒకరు శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. వారు ఏమంటున్నారో మీరే చూడండి. శ్రీగురుదేవులు,

వారు ఎప్పుడూ, తమ అనుభవంలో చూసినవి, చేసినవి మాత్రమే ఇతరులకు తెలియచేస్తారు. శ్రీగురుదేవులు చెప్పేవన్నీ సత్యవాక్కులే నని నా అనుభవం. ఈ క్రింది పద్య రూపంగా ఇలా తెలియచేస్తున్నారు శ్రీగురుదేవులు.

**నాకు జన్మనిచ్చిన నరశ్రేష్ఠులైనట్టి**
**పరమపావనియైన నాతల్లి పార్వతమ్మ**
**అధికప్రియమైన నా తండ్రి అయితమరాజు**
**అమ్మకాళిని దర్శించిన అదృష్టవంతులు**

... అంటూ ఈ లోకానికి తెలియచేశారు. భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గార్కి జన్మనిచ్చిన వారి తల్లిదండ్రులు నరులలో ఉత్తమమైన వారని, వారు పుణ్యాత్ములని, ఎంతో అదృష్టవంతులని, వారు తిరుమల శ్రీ వేంకటేశుని మాత్రమే ఆరాధిస్తూ ఉండేవారని తెలియచేస్తున్నారు. అలాగే శ్రీ గురుదేవుల మాతృమూర్తి గారు, ప్రతిరోజు తెల్లవారుజామున మూడుగంటల నుంచే, గోవింద నామస్మరణ చేస్తూ ఉండేవారని, సాయంత్ర సమయాలలో కూడా గోవింద నామాన్ని సాధ్యమైనంత ఎక్కువసేపు చేస్తూ ఉండేవారని, వారి తల్లిదండ్రుల దైవసేవ గురించి శ్రీగురుదేవులు వెల్లడిస్తున్నారు. అలాంటి శ్రేష్ఠులైన తల్లిదండ్రులకు 'దేవీ' సాక్షాత్కారాన్ని కలిగించాలని శ్రీగురుదేవులు తలంచారు. అలాంటి సమయంలో శ్రీగురుదేవులు తమ తండ్రిగారి మరణం ఆసన్నమైనదని తమ యోగశక్తి ద్వారా గ్రహించి, తమకు 'ఆ తల్లి' శ్రీకాళీమాత ప్రసాదించిన అమోఘమైన యోగశక్తి ద్వారా తమ తండ్రిగారి మరణాన్ని ఆపి, తమ తల్లిగారి సౌభాగ్యాన్ని కాపాడటం కోసమని, శ్రీగురుదేవులు భూగర్భ సమాధిలో ఉన్న శేషపాన్పుపై పవళించి, ఆ రాత్రికి శ్రీ ఆదిపరాశక్తి అయిన శ్రీకాళీమాత ప్రత్యక్ష దర్శన భాగ్యాన్ని శ్రీగురుదేవుల తల్లిదండ్రులకు కల్పించి, వారిని ధన్యులను చేసి, కన్న తల్లిదండ్రుల ఋణం తీర్చుకున్నారు శ్రీ గురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్ గారు. తల్లిదండ్రులకు వారి బిడ్డలు నిలువెత్తు బంగారాన్ని గాని, ధనరాశులను గాని లేదా ఈ ప్రపంచాన్నే జయించి పెట్టి వారికి కానుకగా ఇవ్వగలరేమో కాని దైవ సాక్షాత్కారాన్ని మాత్రంకల్పించలేకపోవచ్చు.

ఇంతటి అసాధ్యమైన విషయాన్ని శ్రీగురుదేవులు సుసాధ్యం చేసి, వారి తల్లిదండ్రులకు ఆదిపరాశక్తి శ్రీకాళీమాత అమ్మవారి సాక్షాత్కార భాగ్యాన్ని కల్పించి, వారి జన్మలను చరితార్ధం చేసిన మహాశక్తి సంపన్నులు శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారు.

## అదృష్టవంతులకే అమ్మకాళీ శ్రీ గురుదర్శన ప్రాప్తి

శ్రీగురుదేవులైన భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ గారి వద్దకు చేరాలన్నా, వారు చెప్పే అమృత వాక్కులను వినాలన్నా, వారి కవిత్వాలను అర్థం చేసుకోవాలన్నా, వారి అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తేనే ఎవరైనా వారి వద్దకు వెళ్లగలుగుతారు. అప్పటికీ వారు చెప్పే దివ్య వాక్యాలను వినే అదృష్టం కలుగకపోవచ్చు. ఒకవేళ వినే అదృష్టం లభించినా, వారి రచనలను అర్థం చేసుకోవటం అంత సులభం కాదు. శ్రీగురుదేవుల దృష్టిలో నిలిచే భాగ్యాన్ని పొందిన సుజనులకు మాత్రమే అన్నివేళలా వారి ఆశీస్సులు అందుకునే అదృష్టం లభిస్తుంది. నేను 1997 నుండి శ్రీగురుసేవలో ఉన్నాను ఇప్పటికి ఇరవై సంవత్సరాల అనుభవంతో, శ్రీవరకాళీమాత, మరియు భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహారాజ్ వారి దివ్య ఆశీస్సులతో తెలియచేస్తున్న భక్తపరమాణువు, వుడతా ప్రభాకరరావు...

# 47. శ్రీవేజెండ్లపుర శ్రీ వరకాళీ గాయత్రీ లలితా భువనేశ్వరీ మాతల స్తవమ్

**1. ఓం క్రీం శివోపరిస్థిరమూర్తే శ్రీమద్గురువరకాళి**
**కమలాసనస్థిరమూర్తే గాయత్రిదేవి వేదమాతః**
**శివాసనాదిశక్తిస్వరూపే శ్రీలలితాంబికే దేవి**
**సకలబ్రహ్మాండోపరిస్థిరమూర్తే శ్రీ భువనేశ్వరి**
**నమ స్తే నమ స్తే నమ స్తే నమ స్తే నమో నమః.**

తా॥ క్రీంకార స్వరూపిణివై శివునిపై స్థిరంగా నిల్చిన శుభకరమైన వరకాళీ ! కమలాసనం మీద స్థిరంగా ఉన్న వేదమాతవైన గాయత్రీదేవీ ! మేలును చేకూర్చే ఆసనంమీద ఉన్న శక్తి స్వరూపిణివైన శ్రీ లలితాంబికా దేవీ ! సకల బ్రహ్మాండాలపైన స్థిరంగా కొలువు దీరిన శ్రీ భువనేశ్వరీమాతా ! నీకు నమస్కారాలు.

**2. హే విశ్వార్చితాః విమలమూర్త్యః వేజెండ్ల పురవాసిన్యః**
**శ్రీవేంకట కాళీకృష్ణ హృదయ కమలవాసిన్యః**
**శ్రీవరకాళీ గాయత్రీ లలితా శ్రీభువనేశ్వర్యః**
**ప్రసీద ప్రసీద ప్రసీద పరాశక్తయః శ్రీమూర్తయః**

తా॥ మిక్కిలి శక్తి గలిగి శుభాన్ని చేకూర్చే ప్రసన్నమైన ముఖాలతో వెలుగొందే శ్రీవరకాళీ, గాయత్రి, లలిత, భువనేశ్వరీ మాతలారా ! వేజెండ్లపురంలో నివసిస్తూ సమస్త లోకాలచేత పూజించబడే స్వచ్ఛ మూర్తులారా! ప్రసన్నులు కండు.

శ్రీ వేంకట కాళీ కృష్ణుల హృదయం అనే తామర పుష్పంపై నివసిస్తున్న దేవీ మూర్తులారా ! ప్రసన్నులు కండు. ప్రసన్నులు కండు. ప్రసన్నులు కండు.

# 48. శ్రీవేజెండ్లపుర శ్రీచక్రపీఠస్థ శ్రీవిశ్వమాతల స్తుతి

**1. ఓం శ్రీకల్యాణైకగుణపరంపరాః సుమధురాః కారుణ్యాభిరామాః**
**పరా పశ్యంతీ ప్రియవైఖర్యః శివకర్యః శ్రీశక్తిస్వరూపిణ్యః**
**లలితా బ్రహ్మవిద్యాదిస్వరూపాః మనోహర్యః మహాభాగ్యప్రదాయకాః**
**శ్రీచక్రనివాసిన్యః వేజెండ్లపురవాసిన్యః మహాదేవ్యః**
**శ్రీ వరకాళీ గాయత్రీ లలితా భువనేశ్వర్యః మాం పాం త్వాదిపరాశక్తయః**

తా॥ అనేక శుభాలను నిరంతరం ప్రసాదిస్తూ మంచి గుణాల సమూహంతో మిక్కిలి మధురంగా ఉండి దయా స్వభావంతో ప్రకాశించే మాతలారా ! శ్రేష్ఠమార్గాల్ని దర్శిస్తూ ప్రియమైన పద్ధతిలో వెలుగొందుతున్న శుభమూర్తులారా ! శ్రీ శక్తి స్వరూపిణులారా! లలిత బ్రహ్మవిద్య మొదలైన విద్యలకు నిలయమైన దేవీమూర్తులారా! మనోహర స్వరూపిణులారా ! అత్యధిక భాగ్యాల్ని ప్రసాదించే తల్లులారా ! వేజెండ్ల పురంలో నివసిస్తూ శ్రీచక్రపీఠం మీద స్థిరనివాసం ఏర్పాటు చేసుకొన్న మహాదేవతా స్వరూపలారా ! శ్రీవరకాళీ, గాయత్రీ, లలితా భువనేశ్వరీ మాతలారా ! పరాశక్తి స్వరూపలారా ! నన్ను రక్షింతురుగాక.

**2. ఓం పరాంబికే ప్రకృతిస్వరూపే శ్రీవరకాళి కైవల్యప్రదాయిని**
**అష్టోత్తరశతకూపజలప్రతిష్ఠితే ప్రసన్నవదనస్వరూపిణి**
**సకలవిద్యాప్రదాయిని వేదమాతః గాయత్రీదేవి విరాడ్రూపే**
**జగజ్జనని విమలమూర్తే శ్రీలలితే జీవన్ముక్తిప్రదాయిని**

తా॥ ప్రకృతి స్వరూపిణివై విశిష్ట శక్తి సంపన్నురాలవై మోక్షాన్ని ప్రసాదించే శ్రీవరకాళీ ! నూట ఎనిమిది బావుల నీళ్లచేత అభిషిక్తవై ప్రతిష్ఠించబడిన ప్రసన్న ముఖంతో కూడిన తల్లీ ! శ్రీవరకాళీ ! విరాట్ స్వరూపిణివై సకల విద్యల్ని ప్రసాదించే వేదమాతవైన గాయత్రీ ! జీవన్ముక్తిని ప్రసాదించే విమల స్వరూపిణివైన జగన్మాత శ్రీలలితా దేవీ !

**3\. సృష్టిస్థితిలయకారిణి సురవరప్రదాయిని శ్రీ భువనేశ్వరి**
**మా ముద్ధర ప్రేమ దయా క్షమా కరుణారసామృతసాగరమూర్తయః**
**అక్షయామృతరూపాః శ్రీవరకాళీ గాయత్రీ లలితాభువనేశ్వర్యః**
**పాహి మాం పాహి మాం పాహి మాం వేజండ్లపురవాసిన్యః నమ స్సర్వాభ్యః**

తా॥ సృష్టి, స్థితి, లయ కారిణివై దేవతలకు వరాల్ని ప్రసాదించే శ్రీ భువనేశ్వరీ మాతా ! ప్రేమ, దయ, క్షమ, కరుణా రస సముద్రులైన మాతలారా ! నన్ను ఉద్ధరించండి. వేజెండ్లలో నివసించే శాశ్వతమైన అమృత స్వరూపిణులైన శ్రీవరకాళీ, గాయత్రి, లలిత, భువనేశ్వరీ మాతలారా ! నన్ను రక్షించండి. రక్షించండి. రక్షించండి. మీ అందరికీ నమస్సులు.

**4\. ఓం శ్రీవరకాళీ గాయత్రీ లలితాంబికా శ్రీభువనేశ్వర్యః**
**శ్రీ పరాశక్తయః మహాదేవ్యః శ్రీ వేజెండ్లపురవాసిన్యః**
**శ్రీవరప్రదాత్ర్యః శ్రీమూర్తయః శీఘ్రాతిశీఘ్రం మాం పాన్తు**
**శ్రీవిశ్వమాతరః విమలార్యాః శ్రీవిజయం కురుత మే సదా**

# 49. పుష్కల ఫలం

సీ॥ వేలజన్మల నుండి వెన్నంటి వచ్చెడు
సంచితకర్మలసాక్షిగాను
పుట్టుకతోడనే పుట్టి వచ్చుచునుండు
తలపైన కేశముల్ తనరుచుండ
ఇలవేల్పుల కొసగ ఇహలోక మందునన్
కుత్సిత కర్మముల్ కూలునెపుడు
వర్తమాన శుభముల్ వర్ధిల్లుచుండగా
అక్షయమౌ శాంతి అమరునెపుడు

తే॥ ఇష్ట దైవమ్ము దర్శన మిచ్చినపుడు
పూజ్యభావముల్ పుట్టును పుష్కలముగ
అట్టి భక్తాగ్రగణ్యుల కవని నెపుడు
పుణ్యతీర్థయాత్ర ఫలముల్ పూర్ణమగును

తా॥ ఎన్నో వేల జన్మలనుండి మానవునికి పుట్టుకతోనే వెంట వచ్చేటటు వంటి కర్మలను సంచిత కర్మలంటారు. మానవులు జీవించినంత కాలం వారితోనే ఉంటూ వారి వారి జీవితాలను ప్రభావితం చేస్తుంటాయి. వీటికి సాక్షిగా అన్నట్లుగా, మానవులకు పుట్టుకతోనే తలపైన పుట్టి వచ్చే వెంట్రుకలను ఇలవేల్పులకు మొక్కుల రూపంలో సమర్పించినపుడు, వారితోపాటు వచ్చిన చెడు కర్మలన్నీ తొలగిపోతాయి. తత్ఫలితంగా వర్తమాన కాలంలో అనగా ఈ జన్మలో మిగిలిన కాలమంతా వారికి శుభఫలితాలు లభిస్తూ ఉంటాయి. వారిని అశాంతి దరి చేరదు, నిరంతరం అక్షయమైన సుఖశాంతులు లభిస్తాయి.

ఎవరికైనా వారి ఇష్టదైవం దర్శనం ఇచ్చినపుడు వారిలో పూజ్యభావాలు పుట్టి అవి వృద్ధి పొందుతూ ఉంటాయి. అలాంటి భక్తులలో అగ్ర స్థానంలో ఉన్న వారికి, ఈ విశాల విశ్వంలో ఎల్లప్పుడూ తీర్థయాత్రా ఫలితములు సంపూర్ణంగా లభిస్తూ ఉంటాయని పై పద్యంలో భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీ కృష్ణ గురు మహరాజ్ గారు తెలియ చేస్తున్నారు.

# 50. శ్రీ దివ్య నామస్మరణలు

ఓం వరకాళి శ్రీవరకాళి వేజెండ్లవాసిని జయవరకాళి

ఓం గాయత్రి శ్రీగాయత్రి వేజెండ్లవాసిని జయగాయత్రి

ఓం లలితాంబిక శ్రీలలితాంబిక వేజెండ్లవాసిని జయలలితాంబిక

ఓం భువనేశ్వరి శ్రీభువనేశ్వరి వేజెండ్లవాసిని జయభువనేశ్వరి

ఓం వేంకటేశా వేజెండ్లవాసా సంతానబాలజయవేంకటేశా !

ఓం క్రీం శ్రీ వరకాళీమాత్రే నమః
ఓం భూ ర్భువః స్వః శ్రీ గాయత్రీమాత్రే నమః
ఓం శ్రీం శ్రీలలితాంబికామాత్రే నమః
ఓం హ్రీం శ్రీభువనేశ్వరీమాత్రే నమః
ఓం క్లీం శ్రీ సంతానబాలవేంకటేశాయ నమః

వాణీ బ్రహ్మ నమో నమో
లక్ష్మి విష్ణు నమో నమో
పార్వతి శంకర నమో నమో
పాహి మాం దేవి నమో నమో
పాహి మాం కాళీ నమో నమో

హరే బ్రహ్మ హరే విష్ణు
బ్రహ్మ విష్ణు శివా హరే

శ్రీ నారసింహ జయరామకృష్ణా
జయ జయ జయ జయ శ్రీ వేంకటేశా

**సర్వం శ్రీమద్గురువర కాళీమయమ్**

# 51. అమ్మ వరకాళీ సూక్తులు

1. వేజెండ్ల పురమునకు చేరుకోండి - వేదనలను బాపుకోండి.
2. కాళికాదేవిని ప్రార్థించండి - కలిప్రభావాన్ని అధిగమించండి.
3. నవచైతన్యకాళిని స్మరించండి - నరఘోషలను తొలగించుకోండి.
4. అక్షయకాళిని అర్చించండి - అభివృద్ధిని సాధించండి.
5. అమ్మ కాళిని స్తుతియించండి - అభీష్టములను తీర్చుకోండి.
6. అవతారమర్మాలు తెలుసుకోండి - అగణిత శుభములు అందుకోండి.
7. ఆదిపరాశక్తిని ఆరాధించండి - అన్ని విజయాలను పొందండి.
8. అమృతకాళిని తలుచుకోండి - అతులిత కీర్తిని పెంచుకోండి.
9. ఇలవేల్పుగా కాళీమాతను కొలవండి - ఇహపర సుఖాలు అనుభవించండి.
10. ఆద్యంతమూర్తిని సేవించండి - ఆనందంతో జీవించండి.
11. అనంతరూపాలు తెలుసుకోండి - అమరత్వంతో వెలగండి.
12. కాళీమాతను పూజించండి - కైవల్యపదమును చేరుకోండి.

సర్వం శ్రీమద్గురు వరకాళీమయమ్

భగవాన్ శ్రీశ్రీశ్రీ వేంకట కాళీకృష్ణ గురుమహరాజ్